# పుస్తకం ఓ నేస్తం

వ్యాసాలు

పద్మవల్లి





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 120

# కౌముదిలో 2014 జనవరి నుంచి 2015 జూన్ వరకూ ప్రచురితమైన వ్యాసాల సంపుటి

## *విషయసూచిక*


| *పుస్తకం పేరు* | *రచయిత(త్రి)* | *పేజీ* |
|---|---|---|
| The Mouse Proof Kitchen(చెదిరిన స్వప్నాల క్షతగాత్ర గానం) | Saira Shah | 3 |
| The Housekeeper And The Professor(ఓ మతిమరుపు ప్రొఫెసర్ ప్రేమ కథ) | Yoko Ogawa | 12 |
| The Five People You Meet In The Heaven(స్వర్గంలో పాఠాలు) | Mitch Albom | 19 |
| Snow Flower And The Secret Fan(ప్రియ సఖి) | Lisa See | 28 |
| The Boy In Striped Pyjamas(రహస్య స్నేహితుడు) | John Boyne | 41 |
| The Forgotten Daughter | Renitta D'Silva | 49 |
| When The Emperor Was Divine(గూడు చెదిరిన గువ్వలు) | Julie Otsuka | 57 |
| Tuesdays With Morrie(జీవించడం నేర్పిన గురువు) | Mitch Albom | 65 |
| The Book Thief(మృత్యువుని మోహపరచిన  పిల్ల) | Markus Zusak | 73 |
| The Sense Of An Ending(దగాకోరు జ్ఞాపకాల గారడీ) | Julian Barnes | 83 |
| The Buddha In The Attic | Julie Otsuka | 92 |
| The Time Keeper | Mitch Albom | 105 |
| The Assembler Of Parts | Raoul Wientzen | 118 |
| The Boy Who Said No: An Escape to Freedom (సాహసము చేయరా  డింభకా) | Patti Sheehy | 129 |
| Calling Me Home | Julie Kibler | 141 |
| The Children Act | Ian McEwan | 159 |
| For One More Day | Mitch Albom | 174 |
| The Art Of Hearing Heartbeats | Jan-Philipp Sendker | 184 |



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# చెదిరిన స్వప్నాల క్షతగాత్ర గానం

ఒక స్నేహితురాలు తను మొదటిసారి ప్రెగ్నెంట్ గా ఉన్నప్పుడు రాత్రుళ్ళు నిద్రపట్టకపోవడంతో ఒకరోజు తన డాక్టర్ ని అడిగిందట, 'నేనెప్పుడు ప్రశాంతంగా నిద్రపోగలుగుతాను' అని. ఆవిడ నవ్వి 'నెవర్. నువ్విక ఇలాంటి అత్యాశలు వదిలేసుకుంటే నీకే మంచిది' అని చెప్తే, ఆ అమ్మాయి నాతో చెప్పుకుని భోరుమంది. నేను ఆ విషయంలో అప్పటికి ఓ ఐదేళ్ల సీనియారిటీతో సంపాదించిన అనుభవంతో 'అవునమ్మా ఏడవకు. అది నిజమే మరి ' అని తనని ఓదార్చాల్సివచ్చింది. ఓ ప్రాణిని మనం స్వయంగా ఈలోకంలోకి తెచ్చాక, వద్దనుకున్నా కూడా ప్రతీ క్షణం వాళ్ళ గురించి ఆందోళన, ఆరాటం మాత్రం తప్పించుకోలేము. మనం పెద్దయి మనకు పిల్లలు పుట్టినా కూడా, మన తల్లిదండ్రులకు మన పట్లా, మన పిల్లల పట్లా తీరని ఆరాటం. మనకూ అదే కథ పునరావృతం. అంతులేని భ్రమణచక్రం అది.




మనిషి జీవితంలో అతి పెద్ద మలుపు పేరెంట్ కావడం, తను ఇంకొకరికి గార్డియన్ కావడం. అమితమైన సంతోషానికి తోడుగా, నిద్రలేని రాత్రుళ్ళ నీ, అంతులేని బాధ్యతనీ, విరామం ఎరుగని ఆందోళననీ ఏ కాంట్రాక్టు రాసుకోకుండానే, ఏ షరతులూ పెట్టకుండానే గిఫ్ట్ హేంపర్ గా అందిస్తుంది పేరెంట్-హుడ్. పిల్లల చిన్నప్పుడు ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు గడిపినా, వాళ్ళ సేవల్లో పగటికీ రాత్రికీ తేడా తెలీకపోయినా, వాళ్ళు తప్ప మనకంటూ వేరే ప్రపంచమూ మిగలకపోయినా కూడా వాళ్ళ బోసినవ్వులూ, చిట్టి చిట్టి చేష్టలూ, మనల్ని గుర్తుపట్టి సంతోషంతో చేసే కేరింతలూ చూసి, పడిన ఇబ్బందులన్నీ ఉఫ్ మని వూదేసినట్టే ఎగిరిపోతాయి. 'ఈ అవస్థలన్నీ కొన్నాళ్ళే, పిల్లలు పెద్దయి వాళ్ళ పనులు చేసుకోగలిగి, వాళ్ళు ఆరోగ్యంతో మంచి వ్యక్తిత్వంతో ఎదుగుతూ ఉంటే అది చూసి మనం మురిసిపోవచ్చు' అన్న ఆలోచనా, ఆశా మనకి

ఆ దశని సులభంగా దాటేసే శక్తిని ఇస్తాయి. ఆ ఆశ, భరోసా పోయిననాడు...??? ఆ చెదిరిన కలల క్షతగాత్ర గానమే సైరా షా తన జీవితంలోని సంఘటనల ఆధారంగా వ్రాసిన The Mouse-proof Kitchen.

**"I lost the privilege of belonging to the 'Mothers of Healthy Kids Club', complaining that 'kids are sleeping late in the nights, kids cold kept them awake last night, kids not getting good grades.' " – A Mother of a little kid with malicious brain tumor, in the book "If I get to Five"**

Anna (ఏనా) Tobias (here after I call him Tobi) భార్యా భర్తలు. ఒకరంటే ఒకరికి విపరీతమైన ప్రేమ. ఏనా లండన్లో ఒక పెద్ద రెస్టారంట్లో షెఫ్. మంచి ప్లానింగ్, అవగాహనా ఉన్న మనిషి. టోబీని కలిసిన మొదటి క్షణంలోనే ఆమెకు తెలుసు, అతనితోనే తన జీవితం అని. టోబీ ఒక వర్ధమాన సంగీతదర్శకుడు. చిన్న చిన్న సినిమాలకూ టీవీ డాక్యుమెంటరీలకు సంగీతం కూరుస్తూ, కెరీర్ లో ఒక బ్రేక్ కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. జీవితం సాఫీగా ఏ ఒడిదుడుకులూలేకుండా, ఎక్కువ కష్టపడాల్సిన అవసరం లేకుండా సాగిపోవాలనే మనస్తత్వం అతనిది. ఏనాకు తను ఎప్పుడో కాలేజ్ రోజుల్లో ఫ్రాన్స్ విజిట్ చేసినపుడు అక్కడ ఎంతో నచ్చడంతో, ఎప్పటికైనా అక్కడే స్థిరపడాలని కోరిక. ప్రస్తుతం ఏనా గర్భవతి. పుట్టబోయే అమ్మాయికి ఫ్రేయా (meaning: Nordic goddess of love and birth) అని పేరు కూడా ఎంచుకుంది. డెలివరీ అయ్యాక లండన్ లో ఉన్న ఫ్లాట్ అమ్మేసి, ఫ్రాన్స్ వెళ్ళిపోయి ఫ్రెంచ్ కంట్రీ సైడ్ లో అందమైన తోటతో ఉన్న ఇల్లు కొనుక్కుని, నగరజీవితానికి కి దూరంగా ఆధునిక ప్రపంచపు వెర్రిపోకడలూ వికారాలూ సోకని ప్రశాంతంగా వాతావరణంలో కూతురుని పెంచుకోవాలన్నది వాళ్ళ కోరిక. అక్కడ ఏనా తను ట్రైనింగ్ పొందిన కుకింగ్ స్కూల్ లోనే షెఫ్ గా చేరాలని, టోబీ కూడా అక్కడ నుండే తన కొత్త మ్యూజిక్ ప్రాజెక్ట్స్ చేసుకుంటూ మంచి మ్యుజీషియన్గా ఎదగాలనీ ఆలోచన. దానికోసం ఫ్రాన్స్లో రియల్ ఎస్టేట్ ఏజెంట్తో మాట్లాడటంతో పాటు మిగిలిన అన్ని ఏర్పాటు చేసుకుంటారు.

Man proposes but god disposes అన్నట్టు, ఫ్రేయా పుట్టుకతోనే సమస్యలతో పుడుతుంది. ఒక కనుపాప సరిగా ఏర్పడక కొంచెం దృష్టిలోపం. దానికి తోడూ పుట్టిన వెంటనే ఫిట్స్. డాక్టర్ల అన్ని పరీక్షలూ చేసి ఫ్రేయా ఒక పెద్ద 'షాపింగ్ లిస్ట్ ఆఫ్ బ్రెయిన్ మాల్ ఫార్మేషన్స్' తో పుట్టిందని, మెదడు సరిగా ఏర్పడక పోవడం వలన చాలా శారీరక మానసిక అవలక్షణాలు ఉన్నాయనీ, మరికొన్ని ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు చాలా ఉన్నాయనీ చెపుతారు. అందులో కొన్ని ' చూపు నిలపలేక పోవడం, తరచుగా ఫిట్స్, ఏ రకమైన స్పందననూ అనుభవించలేకపోవడం, ఎవరినీ గుర్తించలేకపోవడం, జీవితాంతం మంచంమీదే ఉండాల్సి రావటం, ఇరవై నాలుగు గంటలూ ఒకరి మీద ఆధారపడి ఉండటం' లాంటివి. జాగ్రత్తగా చూసుకున్నా ఎంతకాలం తను జీవించగలదో కూడా డాక్టరు చెప్పలేకపోతారు, అది కొన్ని నెలలూ కావొచ్చు, కొన్ని సంవత్సరాలు కావొచ్చు.

కూతురి పరిస్థితి ఇద్దరినీ హతాశులను చేసింది. ఆనందకరమైన కుటుంబజీవితం గురించి కలలు కంటున్న ఇద్దరికీ వడగాలిలా తగిలింది ఈ వార్త. తేరుకోలేని షాక్ తో వాస్తవాన్ని జీర్ణించుకునే ప్రాసెస్లో ఎంతో దుఃఖాన్ని అనుభవిస్తారు. ఇక జీవితంలో ఏ ఎదుగుదలా ఉండబోని, తామెవరో కూడా తెలియబోని, బ్రతికినంతకాలమూ ఒకరికి బరువుగానే నిలిచే పిల్లని, ఏదో ఒకరోజు తమని

విడిచి వెళ్ళిపోయే పిల్లని తాము సాకగలిగే సహనమూ, ఆ విషాదాన్ని ఎదుర్కొనే ధైర్యమూ తమకున్నాయా అని భయపడతారు. టోబీ అయితే ఆ పాప కోసం తమ జీవితాలూ, కెరియర్ అంతా త్యాగం చెయ్యల్సొస్తుందనీ, ఆ పరిస్థితుల్లో తాము నిజంగా ఆ పిల్లని ప్రేమగా చూసుకోలేమనీ భయపడతాడు. ఆ పాపని తాము ఇంటికి తీసుకువెళ్ళకుండా ఆసుపత్రిలోనే వదిలేస్తే సోషల్ సర్వీసెస్ వాళ్ళు , అలాంటి పిల్లలకోసమే ఉన్న ఏదో ఒక హోం లో చేర్పిస్తారు అని తెలుసుకుంటారు. పాపని అక్కడే వదిలేసి మనం ఎవరికీ చెప్పకుండా ఏ బ్రెజిల్ కో వెళ్ళిపోదాం అని ఏనాని ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు. ఆసుపత్రిలో ఉన్న రెండు వారాల్లో ఏనా నెమ్మదిగా పాపతో అనుబంధం పెంచుకుంటుంది. ఒకప్రక్క పెరుగుతున్న మమకారం, ఇంకో ప్రక్క ప్రేమ పెంచుకున్నాక పాపకి ఏమన్నా అయితే తను తట్టుకోగలదా అన్న భయం ఆమెని పీడిస్తుంటాయి. మరోప్రక్క టోబీ 'నాకు పిల్లలు కావాలి కానీ, ఇలా మొత్తం నా జీవితాన్ని వాళ్ళ కోసం త్యాగం చేయించుకునే పిల్లలు నాకొద్దు. మనకి ఇంకా మంచి పిల్లలు పుడతారు. నువ్వు నాకు కావాలి. నీకెవరు కావాలో బాగా ఆలోచించుకో' అని చెపుతాడు. తనకేం చెయ్యాలో తోచని స్థితిలో ఏనా మిగిలిపోతుంది. మనుమరాలి కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఏనా తల్లి కూడా విషయం తెలిసి శోకంలో మునిగిపోతుంది. ఆ పాపని పెంచడంలో తన కూతురు నలిగిపోకూడదని ఆశ, కానీ ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలీదు ఆమెకి.

వీళ్ళు కావాలనుకున్న ప్రాంతంలో ఇళ్ళ ఖరీదు బడ్జెట్ కి మించి ఉండటంతో, పట్టణానికి దూరంగా చిన్న కొండల్లో ఉన్న, పెద్దగా అభివృద్ధి చెందని వూరిలో, కొన్ని ఎకరాల్లో పళ్ళతోటలూ, కూరగాయల మడులూ, సెలయేరు ఉన్న ఇల్లు చవకగా దొరుకుతుంది. ఆ వూరిలో అందరికీ స్వయంగా పండించుకున్న పంటలతోనే జీవనం సాగుతూ ఉంటుంది. ఆసుపత్రి దాదాపు రెండు గంటల ప్రయాణం అక్కడికి. ఆ ప్రదేశం టోబీకి బాగా నచ్చుతుంది. ఏనాకి ఆ మారుమూలకి వెళ్లడం ఇష్టం లేకపోయినా టోబీ ఒప్పిస్తాడు. ఫ్రేయా ఉన్నన్ని రోజులయినా తల్లి ప్రేమ అందివ్వాలని నిశ్చయించుకున్న ఏనా, ఫ్రేయాని కూడా తమతో తీసుకు వెళ్ళేటట్టు అయితే సరే అని ఒప్పుకుంటుంది.

ఆ ఇంటికి వెళ్లేసరికి ఇంకో షాక్ ఎదురవుతుంది ఇద్దరికీ. ఆ ఇల్లు పాడుబడి దాదాపు భూత్ బంగళాలా ఉంటుంది. పాడుబడి ఉన్న ఆ ఇల్లు ఎవరూ కొనడానికి రాకపోతే, వీరికి అతి తక్కువ ధరకు అమ్ముతారు. కొనేముందు మాట ఇచ్చినట్లుగా యజమాని ఇల్లు బాగు చేయించి ఇవ్వడు. ఎలెక్ట్రిసిటీ లేక ఇల్లంతా చల్లగా మంచులా ఉంటుంది. ఎలుకలూ, పందికొక్కులూ, నానారకాల కీటకాలూ వీరవిహారం చేస్తుంటాయి. పైకప్పు నుండీ ఎలుకలు కన్నాలు పెట్టి లోపలికి రావటంతో వర్షం నీరు కారి గచ్చులూ గోడలూ నాచు పట్టి వాసనతో, కిచెన్ అంతా ఎలుకలు చేసిన చెత్తతో కంపు కొడుతూ కాలు పెట్టడానికి కూడా వీలులేకుండా ఉంటుంది. ఇంట్లో ఏ ఒక్క పరికరమూ పనిచేసే స్థితిలో లేవు. ఇవన్నీ చూసిన ఏనాకి విపరీతమైన నిస్పృహ కలుగుతుంది. చేసేదేం లేక ఎలాగో ఆ రాత్రికి గడిపి మర్నాడు ఇల్లు శుభ్రం చేసుకోవాలని అనుకుంటారు.

ఆ ఇంటి ఆవరణలోనే ఓ చిన్న ట్రైలర్ లో ఉంటున్న లిజ్జీ అనే ఓ టీనేజ్ అమ్మాయి కనిపిస్తుంది. లిజ్జీ ఒక అమెరికన్ అమ్మాయి. చిన్నతనంలోనే తల్లి వదిలేస్తే ఫాస్టర్ హోమ్స్ లో పెరుగుతుంది. అక్కడ కూడా ఉండలేక కాలిఫోర్నియా నుంచి పారిపోయి

ఇక్కడికి చేరుకుంటుంది. ఎపుడూ ఏదో లోకంలో ఉన్నట్టు పాటలు పాడుకుంటూ ప్రకృతితో మాట్లాడుకుంటూ, ఊరివాళ్ళు పెట్టిందో, పొలాల్లో దొరికినవో తిని గడుపుతుంది. 'లిజ్జీకి కూడా ఎవరూ లేరు కదా, మనం పనిలో పెట్టుకుందాం. ఇంట్లో పనుల్లోనూ, పాపని చూసుకోవడంలోనూ నీకు సాయంగా ఉంటుందని' టోబీ అనడంతో ఏనా ఒప్పుకుంటుంది. అందరూ కలిసి ఏదో కొంచెం క్లీన్ చేసి, కన్నాలూ అవీ పూడ్చినా ఎలుకలు, పందికొక్కులు మళ్ళీ మళ్ళీ వచ్చి ఇల్లు పాడుచేస్తూనే ఉంటాయి. కిచేన్లోని గ్రోసరీలు అవీ నాశనం చెయ్యకుండా చూసుకోడానికి, ఎలుకల్ని పూర్తిగా రాకుండా చెయ్యాలనీ ఏనా చెయ్యగలిగిన ప్రయత్నాలన్నీ చేస్తూనే ఉంటుంది, కానీ ఏదీ సరిగా పనిచెయ్యవు.

రోజంతా ఏనాకు పాపతోనే సరిపోతుంది. పాపకి తల్లి దగ్గర పాలు తాగడం కూడా చేతకాదు. మెడ నిలబెట్టలేదు. చేతులు కూడా కదపలేదు. ఏనాకు పాపకు పాలు కలిపి పట్టడం, మందులు కలిపి గంట గంటకూ పట్టించడం, కక్కుకుంటే శుభ్రపరచడం ... అన్ని పనులూ ఎంతో ఓపికగా చేస్తుంది. అప్పుడప్పుడూ ఫిట్ వచ్చినపుడు మాత్రం తానేమీ చెయ్యలేని నిస్సహాయతతో, ఆ పాప బాధ చూడలేక ఏనా నరకం అనుభవిస్తుంది. ప్రతీసారీ ఈసారి గడుస్తుందా, పాప మృత్యువుని గెలవగలదా అన్న ఆరాటం ఆమెని చిత్రవధ చేస్తుంటుంది. పాపకి ఏమైనా అయితే తను తట్టుకోగలదా అన్న ఆలోచన ఆమెకు విపరీతమైన భయాన్ని కలుగచేసి, ఆమె ధైర్యాన్ని క్రుంగదీస్తుంటుంది. నెమ్మదిగా ఆ ఆలోచనల నుంచీ ఒత్తిడి నుండీ తప్పించుకోడానికి ఎక్కువ సమయం ఇల్లు ఒక దారిలోకి తెచ్చుకోడానికి, ఎలుకల బాధ తగ్గించుకోడానికి చేసే ప్రయత్నాల్లో గడుపుతూ ఉంటుంది.

టోబీ మాత్రం ఇంట్లో ఓ గదిని తన రికార్డింగ్ స్టూడియోగా మార్చుకుని మ్యూజిక్ క్రియేట్ చేసుకుంటూ, తను సంగీతం కూర్చిన సినిమా గనక విడుదలయితే తనకి మంచి పేరు వచ్చి, ఇంకా కొత్త ప్రాజెక్ట్స్ వస్తాయని ఆశగా ఎదురుచూస్తూ ఉంటాడు. పాపని కానీ, ఏనా పడుతున్న కష్టాలు గానీ తనవి కానట్టే ఉంటాడు. దానికి తోడూ లిజ్జీని అస్తమానూ దగ్గర కూర్చోపెట్టుకుని చదువు చెపుతున్నాను అంటూ, తన లాప్ టాప్ లో ఇంటర్నెట్లో చూడటం నేర్పుతూ ఉంటాడు. అంతే కాకుండా టోబీకి లిజ్జీకి మధ్య చనువు పెరుగుతున్నట్టూ ఏనా గమనిస్తుంది. టోబీ ఇచ్చిన చనువుతో లిజ్జీ ఇంటి పనుల్లో సాయం చెయ్యకుండా ఇంటర్నెట్ చూస్తూనో, జాతకాలు చూస్తాను అంటూనో, లేదా ఇపుడు బయట పొలాల్లోకి వెళ్ళి నేను ప్రకృతికి పాటలు పాడి ప్రార్ధన చెయ్యాలనో చెప్పి వెళ్ళిపోతుంటుంది. ఏనా కొంచెం పట్టుబట్టి చెప్పినా ఫలితం ఉండదు. ఏనా అన్ని పనులూ ఒక్కర్తే చేసుకోలేక అసహనంతో టోబీ మీద అరుస్తుంది కానీ తనేం పట్టించుకోకుండా తన పని చేసుకుంటూ ఉంటాడు. లిజ్జీ వలన తమకేమీ సాయం లేకపోవడంతో తనని పని మాన్పించేద్దాం అని టోబీతో అన్నా అతనది వినిపించుకోడు. దానితో ఏనాకి తనకి టోబీ కూడా దూరమయిపోతున్నాడేమో అన్న ఆలోచన బాధిస్తుంటుంది.

**"Angels come when you are least expecting them."**

ఒకరోజు కెరిం అనే యువకుడు ఏనాకు కనిపించి 'తను ఒక ఇంజనీర్ని అనీ, కొన్ని కారణాల వలన తనవాళ్ళందరికీ కొన్నాళ్ళు దూరంగా ఉండాల్సివస్తుందనీ, తనకి ఆశ్రయమిస్తే ఏ పని అయినా చేసిపెడతాను' అనడంతో ఏనా ఇంటికి తీసుకువస్తుంది.

కెరిం చాలా చురుకైన యువకుడు. ఏ పనైనా రాదు అనకుండా చెయ్యగలడు. నెమ్మదిగా, ఇంట్లో ఒక్కో గదినీ బాగు చేసి ఒక కొలిక్కి తెస్తాడు. అలాగే కిచెన్లో కేబినెట్స్లోకి ఎలుకలు వెళ్ళకుండా మెష్, తలుపులూ లాంటివి కూడా పెట్టి ఎలుకల బాధ చాలా వరకూ తగ్గిస్తాడు. అప్పుడప్పుడూ ఫ్రేయాని చూసుకోవడంలో కూడా సహాయం చేస్తుంటాడు. అలానే అక్కడ నివసించే జూలియన్ అనే హిప్పీ యువకుడు కూడా స్నేహితుడై, పెరట్లో కూరగాయలు పండించడం లోనూ, మిగిలిన అక్కడ నిత్యావసరాలను ఏర్పరచుకోడంలోనూ సహాయం చేస్తుంటాడు. అక్కడ చిన్న రెస్టారంట్ గానీ, లేదా కుకింగ్ స్కూల్ గానీ పెట్టుకోవాలని ఆలోచిస్తున్న ఏనాకి, అక్కడ దొరకే వనరుల గురించి జూలియన్ చెపుతూ ఉంటాడు.

ఇలా ఉండగా ఏనాకి ఫ్రేయాతో అనుబంధం పెరిగిపోతుంటుంది. నెమ్మదిగా ఫ్రేయా తల్లికి స్పందించడం మొదలుపెడుతుంది. కళ్ళు తిప్పి మొహంలోకి చూడటం, నవ్వితే బదులు నవ్వడం, నెమ్మదిగా చెయ్యెత్తి తాకడం లాంటి పనులు చేస్తూ ఉంటుంది. దానితో ఏనాకి కూతురు నెమ్మదిగా బాగావుతుందేమో అన్న ఆశ చిగురిస్తుంది. టోబీతో అదే విషయం చెప్తే 'పిచ్చిదానా, నువ్వు భ్రమల్లో బ్రతుకుతున్నావు. మనం అమ్మా నాన్న అని తనకి ఇపుడే కాదు ఎప్పటికీ తెలీదు. ఏదో ఒకరోజు పరిస్థితి విషమించి తనని ఎక్కడో హోమ్ లో చేర్పించడమో లేదా తను మనల్ని వదిలి పోవడమో జరుగుతుంది. తనతో ఎటాచ్మెంట్ పెంచుకోకు, బాధపడతావు' అని మందలిస్తాడు. కానీ ఎంత దూరంగా ఉందామనుకున్నా తనకి తెలీకుండానే టోబీ కూడా నెమ్మదిగా ఆ పాప మాయలో పడిపోతాడు. తన అమాయకమైన మొహం, తనని చూసి నెమ్మదిగా నవ్వే నవ్వూ టోబీని ఫ్రేయాకి దగ్గరయ్యేలా చేస్తాయి. నెమ్మదిగా తండ్రీ కూతుళ్ళ మధ్య కూడా అనుబంధం పెరుగుతూ ఉంటుంది. మొదట అసలు ఫ్రేయా మొహం చూడటానికి కూడా ఇష్టపడని టోబీ నెమ్మదిగా పాపతో కొంచెం కొంచెం సమయం గడపటం మొదలుపెడతాడు.

ఒకరోజు అనుకోకుండా ఏనా తల్లి వస్తుంది కూతురిని చూడటానికి. ఆమెకి ఏనా ఒక్కతే కూతురు. మొదటినుండే తల్లీ కూతుర్లిద్దరూ నిప్పూ ఉప్పూ చందం. ఓ ఏడాది క్రితం భర్త పోయిన దగ్గర్నుంచీ ఆమె ఒక్కర్తే ఉంటూ అస్తమానూ ఏదో ఒకదానికి సిల్లీ కంప్లయింట్స్ చేస్తూ ఏనాను విసిగిస్తూ ఉంటుంది. పాపతో కూతురు ఏ సౌకర్యాలూ లేని చోట ఏం కష్టాలు పడుతుందో అని, ఇక ఆగలేక ఏదో ఒక వంక పెట్టుకుని వస్తుంది. టోబీ నిరాసక్తత, లిజ్జీ వైఖరి ఏనాని బాధపెట్టినా, తల్లి, కెరిం, జూలియన్ ఈ ముగ్గురి సాయంతో తనకి కాస్త మోరల్ సపోర్ట్ దొరుకుతుంది.

ఇవన్నీ ఇలా ఉండగా లిజ్జీ టోబీ మీద ప్రేమ పెంచుకుంటుంది, కానీ టోబీ తనని ఒక చిన్నపిల్లగానే చూస్తున్నాడనీ కేవలం తన మీద జాలితోనే తనకి చదువు చెప్పడం కంప్యూటర్ నేర్పించడం లాంటివి చేసాడనీ అర్థమవుతుంది. దానితో తను ఎవరికీ అక్కర్లేదని మనోవ్యధ పెంచుకుని, క్రమంగా మతిభ్రమించినట్టూ ప్రవర్తిస్తుంది. ఒకరోజు ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నపుడు చూసి రక్షించి మెంటల్ హెల్త్ సపోర్ట్ వాళ్లకు తెలియచేస్తే, వాళ్ళు తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేరుస్తారు. అపుడు టోబీకి అసలు విషయం తెలిసి, తనకి తెలియకుండానే ఆ అమ్మాయికి ఆశలు రేపానని అర్థమయి సిగ్గుపడి బాధపడతాడు. ఏనా ఆసుపత్రికి వెళ్ళి చూద్దామని అన్నా తను

వెళ్ళి మళ్ళీ ఆమెకు కనించడానికి ఇష్టపడదు. ఏనా కూడా తను ఆ చిన్నపిల్ల ఒంటరితనాన్ని అర్ధం చేసుకోలేక కొన్నిసార్లు తన మీద అనవసరంగా విసుక్కున్నందుకు బాధపడుతుంది.

ఈలోగా తల్లి తనింటికి తిరిగి వెళిపోతుంది. కెరిం కూడా వెళ్ళాల్సి వచ్చి వెళ్ళిపోతాడు. ఒక అనుకోని సంఘటనవల్ల జూలియన్ కూడా ఏనాని తప్పించుకు తిరుగుతుంటాడు. ఏనా పూర్తిగా మానసికంగా ఒంటరిదైపోతుంది. ఫ్రేయాకి మొదట్లో అప్పుడప్పుడూ వచ్చే ఫిట్స్ రోజుకి మూడు నాలుగు సార్లు రావటం, క్రమంగా అవి ఎక్కువసేపు ఉండటం, పాప వాటిని తట్టుకోలేక టార్చర్ పడటం, ఇవన్నీ ఏనా మీద విపరీతమయిన మానసిక ఒత్తిడి కలిగించి తన నమ్మకాన్ని, ధైర్యాన్ని తగ్గిస్తాయి. చివరికి పాప బ్రెయిన్ ఇంకా క్షీణించడం వలన, స్వయంగా ఆహారం తీసుకోవడం, వూపిరి తీసుకోవడం కూడా చేతకాకపోవడంతో ట్యూబ్ తో ఫీడ్ చెయ్యడం, లంగ్స్ క్లీన్ చేసి వూపిరాడేలా చెయ్యడం చెయ్యాలని, అవి వీళ్ళు నేర్చుకోవాలని చెబుతారు. అప్పటికే అన్నిరకాలుగా అలసిపోయి నిరాశ, అసహనం, బాధ, దిగులు, విరక్తితోనూ ఉన్న ఏనా 'తనింక ఆశ నిరాశల ఉయ్యాలలూగలేననీ, ఇకపై జరిగేవి భరించే శక్తి తనకి లేదనీ, తను ఉన్నా లేకపోయినా పాపకేమీ తెలీదనీ' చెప్పి, టోబీని 'పద ఇక చాలు. మనం పాపని ఇక్కడ వదిలేసి వెళ్ళిపోదాం. వాళ్ళే ఏదో ఏర్పాటు చేస్తారు' అని అడుగుతుంది. ఆశ్చర్యకరంగా టోబీ ఆ పనులన్నీ తను నేర్చుకుని చేస్తానని, పాపని వదిలి రాననీ చెపుతాడు. ఆ విరక్తిలో కోపంలో ఏనా ఇద్దరినీ అక్కడే వదిలేసి అటునుండి అటే ఎయిర్ పోర్ట్ కు వెళ్ళి లండన్ వెళ్ళిపోతుంది.

ఏనా లండన్ వెళ్ళి ఏం చేసింది? ఏనాడూ సీసాతో పాలు కూడా పట్టని టోబీ పాపని చూసుకోగాలిగాడా? పాప ఏమయ్యింది? వాళ్ళు భయపడిన రోజు వచ్చిందా? లిజ్జీ ఏమయ్యింది? ఏనా టోబీ దగ్గరకి తిరిగి వచ్చిందా? ఏనా, తల్లీ ఎప్పటికయినా ఒకరినొకరు అర్ధం చేసుకున్నారా? ఇవన్నీ తెలియాలంటే పుస్తకం చదవాలి. ఇవన్నీ తెలుసుకోడం కోసమే కాకపోయినా, we should read this book to count our blessings and to thank god for showering us with them.

మనసుకు ఎన్ని రకాల భావాలను అనుభవించగలిగే శక్తి ఉందో, అన్ని రకాలూ అనుభూతి చెందగలుగుతాము పుస్తకం పూర్తి చేసేలోగా. విడవకుండా ఒక్క దాటున చదివించే శక్తి కథకూ, అంతకుమించి కథనానికీ ఉంది. ఏనా పాపతో బాండింగ్ పెంచుకోడమూ, పాప కొంచెం కొంచెం స్పందించినపుడల్లా మురిసిపోవడం, అంతలోనే ఇది ఎన్నాళ్లో అని దిగులుపడటం, ఫిట్ వచ్చి పాప వూపిరాడక నలిగిపోతున్నప్పుడల్లా ఏనా టెన్షన్తో బిగుసుకుపోవటం,... ఇలా ఎన్నో సంఘటనలు మనసుకి హత్తుకునేలా ఉంటాయి. ఒకసారి అలా ఫిట్ వచ్చినపుడు పాప తేరుకుంటుందా లేదా అన్న టెన్షన్ భరించలేక పాపను ఒంటరిగా వదిలేసి బయటకి వెళ్ళిపోయినపుడు మనకు ఆమె మనసు ఇంత పాషాణమా అనిపిస్తుంది. అంతలోనే ఆమె సంభాళించుకుని పరిగెట్టుకు వచ్చేసరికి ఆమె మీద జాలి వేస్తుంది. లిజ్జీ ఆకతాయితనాన్ని, టోబీ నిర్లక్ష్యాన్ని భరిస్తూ తనొక్కతే అన్నిటిమధ్యా సతమతమయిపోతున్నప్పుడు 'ఏనా, ఎందుకు ఇదంతా భరిస్తున్నావ్. లిజ్జీని ఒక్కటి లాగిపెట్టి కొట్టి బయటకి తోసెయ్, అదే చేత్తో టోబీని కూడా నాలుగు పీకు' అని అరవాలనిపిస్తుంది. హాస్పిటల్లో పాపనీ టోబీని వదిలేసి వెళ్ళిపోతున్నప్పుడు 'ప్లీజ్ ఏనా, ఇప్పటివరకూ ఒంటరిగా భరించినదానివి,

ఇపుడు ఓటమితో వెళ్ళిపోకు' అని అడ్డుపడి బ్రతిమాలాలని అనిపిస్తుంది. తనకి ఇంకో బిడ్డ పుడితే ఫ్రేయా మీద ప్రేమ కొంచెం దారి మార్చుకుని, తన నిష్క్రమణని తట్టుకునే శక్తి వస్తుందేమో అని ఆశపడుతుంది, కానీ ఆ ఆశ కూడా తీరక ఇంకా క్రుంగిపోతుంది. తన కష్టాలే తనకి మించినవి ఉండగా, లిజ్జీని కూడా గాలికి వదిలెయ్యకుండా పట్టించుకోవడం, ఆసుపత్రికి వెళ్ళి చూసి దైర్యం చెప్పి రావటం చూస్తే తన మీద గౌరవం కలుగుతుంది.

సమస్యలకి పరిష్కారం మన చేతిలో లేనపుడూ, వాటి నుండి పారిపోలేనపుడూ ఆ తీవ్రతని తట్టుకోడానికి ఒక్కొక్కరూ ఒక్కో మార్గం వెదుక్కుంటాము. ఏనా, టోబీ కూడా అదే పని చేస్తారు. ఒక పక్క టోబీ ప్రవర్తన, పాప గురించి వాస్తవాన్ని జీర్ణించుకునే శక్తి లేక ఎంతసేపూ ఎలుకలు కట్టడి చెయ్యడంలోనూ, పిచ్చిగా తోటలోని పళ్ళను వందల కొద్దీ సీసాల్లో కేనింగ్ చేసి దాయటంలోనూ తనని తను పోగొట్టుకుంటుంది. టోబీ కూడా ఆ బాధలోంచి ఎస్కేప్ అవ్వడానికే లిజ్జీతో సమయం గడపడం, ఏనా అడిగిన పనులు నిర్లక్ష్యం చెయ్యడం చేస్తాడు.

టోబీ మొదట తన జీవితం గురించి మాత్రమే ఆలోచించే స్వార్ధపరుడిగా కనిపించినా అంతర్లీనంగా తనలో భయం ఉంటుంది. తమ జీవితంలో నాలుగు రోజుల అతిధి అయిన పాప మీద ప్రేమ పెంచుకుంటే ఆమె ఎడబాటుని తట్టుకునే శక్తి ఉండదని బాధ. అందుకే ఏనాని 'please don't get attached to her, she will sure break our hearts one day' అని బ్రతిమాలుకుంటాడు. పాప వేపు చూసినా కూడా తనకి తెలీకుండానే ప్రేమ పెంచుకుంటానేమో అనే భయంతో తప్పించుకుని తిరుగుతుంటాడు. ఏనా పాప తోనూ, ఇంటితోనూ కష్టాలు పడుతుంటే 'నీ వల్లనే కదా తను ఏ సహాయమూ దొరకని ఈ మారుమూలకి వచ్చింది. గెట్ ఎ లైఫ్' అని కాలర్ పట్టుకుని దులపాలనిపిస్తుంది. మనం ఎంత వద్దనుకున్నా జరగాల్సింది జరిగే తీరుతుంది. ఆ పసిపాప అతన్ని కూడా మాయ చేస్తుంది. ఏనా పాపని వదిలేసి వెళ్ళిపోదాం అని అడిగినపుడు 'నేను రాలేను, నేను పాపని ప్రేమిస్తున్నాను. ఒకసారి ప్రేమ పెంచుకున్నాక తనని అలా వదిలేసి నేను రాలేను' అని ఏడుస్తాడు. అలానే తమకి ఇంకో బిడ్డ పుడితే పరిస్థితి మార్పు వస్తుందేమో అని ఏనా ఆశ పడితే 'పిచ్చిదానా, నీకు అర్ధం కావటం లేదా? ఫ్రేయా రాకముందు నుంచే తన చుట్టూ మన కలల ప్రపంచం ఏర్పరచుకున్నాం. తను మన ప్రాణం. ఇంకెవరొచ్చినా కూడా తన గురించి మన ప్రేమా, బాధా తగ్గవు' అని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. అన్నీ తెలిసే ఆ బంధాల వలయంలోంచి ఎంత తప్పించుకుపోవాలనుకుంటాడో అందులో అంతగానూ మునిగిపోతాడు.

**"A person who irritates you always is the one who loves you most, but fails to express it."**

ఏనా తల్లికి రాబోయే మనవరాలి మీద ఎంతో ప్రేమ. అందరు తల్లీ కూతుర్లలానే కీచులాడుకుంటూ, విసుక్కుంటూ ఇద్దరి మధ్యా జారిపోతున్న అనుబంధాన్ని, మనవరాలి రాకతో సరిదిద్దుకోవాలని ఆశిస్తుంది. కానీ ఫ్రేయా పరిస్థితి ఆమెకి ఒక షాక్ లాగా తగులుతుంది, ఎంతంటే పాపకి ఇవ్వడానికని తీసుకొచ్చిన కూతురి చిన్నప్పటి టెడ్డీబేర్ ని ఇవ్వకుండానే తీసుకువెళిపోయేంత. దానికితోడు కూతురూ అల్లుడూ మధ్య అనుబంధం ఈ పాప వలన ఎక్కడా పాడయిపోతుందో అని భయం. పాపని ఇంటికి తీసుకు

వెళతాను అన్నప్పుడు కూడా టోబీకి ఇష్టమే కదూ అని పదే పదే అడుగుతుంది. కూతురితో అనుబంధం గట్టిపరచుకోవాలనే ఉన్నా, ఎలానో తెలియదు. తన ప్రేమని వివరంగా బయటకి చెప్పడానికి అహంభావం అడ్డం వస్తుంది. దానితో కూతురితో మాట్లాడాలంటే ఏదో ఒక సిల్లీ సమస్యని సాకుగా చేసుకుని, దానితో ఏనాని ఇంకా విసుగెత్తిస్తూ ఉంటుంది. పాప పరిస్థితికి బాధతోనే 'పాపని మనం ట్రెయిన్ చేసుకోలేమా, ఆఖరికి పెట్స్ ని కూడా ట్రెయిన్ చేసుకోగలం కదా' అంటూ అసంబద్ధంగా మాట్లాడి అందరికీ విసుగు తెప్పిస్తుంటుంది. కానీ మొదట టోబీ గుర్తిస్తాడు, అది ఆవిడకు ఏనా పట్ల పాప పట్ల ప్రేమనీ, ఆందోళననీ వ్యక్తపరిచే మర్గం అని. తనని సానుభూతితో అర్థం చేసుకుని ఏనాకి కూడా అర్థమయ్యేలా వివరిస్తాడు.

మానసిక వ్యధననూ, ప్రేమోద్వేగాలనూ, ఆశ నిరాశల వూగిసలాటనీ అద్భుతంగా చిత్రించిన రచయిత్రి సున్నితమయిన హాస్యాన్ని కూడా అంతే అలవోకగా వ్రాసారు. ఏనా తల్లి కనిపించే ప్రతీ దృశ్యంలోనూ మనం అంతవరకూ మనల్ని స్పృశించిన ఉద్వేగాలను మర్చిపోయి హాయిగా మనసారా నవ్వుకుంటాము.

**"It doesn't have to be the writer's own experience for them to illustrate something eloquently."**

కొన్ని రచనలు చదివినపుడు వాటిలోని ఒరిజినాలిటీకి, భావాలను వివరించిన తీరుకీ ఆశ్చర్యం కలుగుతుంది. అవి రచయిత స్వంత అనుభవంనుంచే రానక్కర్లేదు అని ఎంత తెలిసినా ఏదో ఓ మూల పీకుతుంది, తనే దగ్గరుండి స్వయంగా చూసినట్టు /అనుభవించినట్టూ ఇంత సహజంగా వర్ణించడం ఎలా సాధ్యం అని. బహుశా కొన్ని క్లిష్టమయిన భావోద్వేగాలను వివరించినపుడు రచయిత ఊహాశక్తికి స్వానుభవం కూడా తోడయితే ఆ రచన వాస్తవికతకు మరింత దగ్గరగా ఉండే అవకాశం ఎక్కువేమో. ఈ పుస్తకం రచయిత్రి సైరా షా బయోగ్రాఫికాల్ నావెల్ అనొచ్చు. పుస్తకంలో మొదటి భాగం అంతా, అంటే ఫ్రేయా పుట్టుక, ఆరోగ్య సమస్యలూ, పాపను వదిలేసి వెళ్ళిపోవాలనుకోవడం, పాపతో కలిసి వసతులులేని పల్లెటూరికి వెళ్లడం మొదలైనవన్నీ ఆవిడ నిజజీవితంలోని భాగాలే. కాకపోతే మిగిలిన పాత్రలూ వాటి ప్రవర్తనా, సంఘటనలూ మాత్రం కల్పితం. తల్లిదండ్రులుగా పాప గురించిన ఆలోచనలూ, కొన్ని ప్రతిస్పందనలూ చదివే వారికి వాస్తవానికి దూరంగానూ, అసంబద్ధంగానూ అనిపిస్తాయి. కానీ నిజంగా అవి తమకు కలిగిన భావాలూ, తమ ప్రవర్తనా అని ఆవిడ నిజాయితీగా ఒప్పుకుంటారు. కాకపోతే ఆవిడ సహచరుడు మాత్రం టోబీ పాత్రకు ఏమాత్రమూ



స్ఫూర్తి కాదు అని చెపుతారు. ఆయన వంట చేయడం , పిల్లను చూసుకోవడం లాంటి పనులు చేస్తూ తనకి తీరిక కల్పిస్తే, తను 'అస్తమానూ వంటిట్లో కుస్తీలు పడుతూ, భర్తతో కూతురితో విసిగిపోతున్న స్త్రీ' గురించి కథ రాసుకుంటూ కూర్చున్నాను అని చమత్కరిస్తారు. ఆవిడ పుస్తకం గురించీ, పుస్తకం రాయడానికి దారితీసిన సంఘటనల గురించీ చెప్పిన వివరాలు Difficult Truths అనే ఇంటర్వ్యూలో చదవొచ్చు.

రచయిత్రి గురించి: ఆఫ్ఘనిస్తాన్ కుటుంబానికి చెందిన Saira Shah ఇంగ్లాండ్లో పుట్టి పెరిగిన రచయిత్రి, టీవీ న్యూస్ రిపోర్టర్, డాక్యుమెంటరీ చిత్రాల

సృష్టికర్త. ఆఫ్ఘనిస్తాన్ పై రష్యా ఆక్రమణ సమయంలో ఆమె ధైర్యంగా వార్ జోన్ మధ్య రిపోర్టర్గా పనిచేసారు. Beneath the Veil, Death in Gaza మరియు Unholy War అనే మూడు డాక్యుమెంటరీ చిత్రాలను అందించారు. ఈ చిత్రాలకు ఎమ్మీ అవార్డులూ, కరెంట్ ఎఫైర్స్ లో బ్రిటీష్ అకాడమీ టెలివిజన్ అవార్డునూ అందుకున్నారు. మొదటి రెండూ యూ ట్యూబ్ లో లభ్యం. ఆమె పురుషవేషంలో పర్యటించి తన అనుభవాలను, పరిశీలనలనూ కలిపి వ్రాసిన మొదటి పుస్తకం “The Storyteller’s Daugther” (Beneath the Veil కు ఆధారం), ఆఫ్ఘనిస్తాన్ చరిత్రనూ, సంస్కృతినీ, అక్కడి సామాజిక పరిస్థితులనూ వాస్తవికతకు దగ్గరగా చూపించిన పుస్తకంగా పేర్కొంటారు. ఆమె తండ్రి Idries Shah, తమ్ముడు Tahir Shah కూడా పేరున్న రచయితలు.






# ఓ మతిమరపు ప్రొఫెసర్ ప్రేమకథ

**"Math has proven the existence of God, because it is absolute and without contradiction; but the devil must exist as well, because we cannot prove it."**

మనిషికి మరపు ఒక వరం. మరి ఆ మరుపే మనిషికి జీవితమయిపోతే??? ఓ మతిమరపు ప్రొఫెసర్, ఆయన అవసరాలు చూడటానికి ఏర్పాటు చెయ్యబడ్డ సహాయకురాలు, ఆమె కొడుకు... వీళ్ళ ముగ్గురి అపురూపమయిన, స్వచ్ఛమయిన ప్రేమకథ ఇది.




ఓ ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహమో, బంధమో నాలుగు రోజులు నిలవాలంటే ఇద్దరివైపు నుంచీ ఎంతో అవగాహనైనా ఉండాలి లేదా బోల్డెంత శ్రద్ధ ఉండాలి. ఎదుటి వాళ్ళ ఇష్టాయిష్టాలను జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని, నువ్వు నాకెంతో ముఖ్యం అన్న ఎరుకని ప్రతీ నిమిషం కలిగిస్తూ జాగ్రత్తగా కాపాడుకుంటేనేగానీ ఆ బంధం నిలవడం కష్టం. ఆఖరికి కుటుంబసభ్యుల మధ్య కూడా ఇవన్నీ తప్పని ఆనవాయితీలుగా మారిపోయిన పరిస్థితులు. అటువంటిది అసలు తనెవరో, తమ మధ్య ముందురోజు ఏం జరిగిందో కూడా గుర్తుంచుకోలేని మనిషితో స్నేహం చెయ్యటం ఎవరికైనా ఎలా సాధ్యం? అవతలి వాళ్లకి గుర్తుండకపోవడం అనేది ఒకరకంగా మనకి లాభమే, 'చలో ఏక్ బార్ ఫిర్ సే అజనబీ బన్ జాయే హమ్ దోనోం' అని బ్రతిమాలుకోవాల్సిన అవసరం లేకుండానే మన తప్పులు మాఫీ అయిపోతాయి. కానీ అవతలి మనిషి పరిస్థితి ఏంటి? ఓ గంట క్రితం ఏం జరిగిందో గుర్తుండదు. తనకి ఎవరు ఏమవుతారో తెలీదు. తను నిన్న జరిగింది అనుకుంటున్నదీ, తనకి గుర్తున్నవీ ఎప్పుడో ఇరవయ్యేళ్ళ క్రితం జరిగినవనీ, తనకి వర్తమానమూ, భవిష్యత్తూ అనేవి లేవూ, మిగిలింది కేవలం భూతకాలం మాత్రమే అని తెలిస్తే ఆ మనిషి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది? వీటన్నిటికీ ఒక హృద్యమైన కథారూపం జపాన్ కు చెందిన రచయిత్రి Yoko Ogawa వ్రాసిన The Housekeeper and the Professor అనే పుస్తకం. ఆంగ్లానువాదం చేసినది Stephen Snyder.

కథాకాలం 1992 మార్చి లో మొదలవుతుంది. అనగా అనగా ఓ లెక్కల ప్రొఫెసర్ గారు. వయసు అరవైకి కాస్త అటూ ఇటూ. మహా మేధావి. నంబర్ థియరీలన్నీ ఈయన వేళ్ళ కొసల మీదే కొలువు తీర్చికూర్చుంటాయి. ఏ అంకె చెప్పినా దాని విశిష్టతని, అదే సాపత్యం ఉన్న అంకెలు లక్ష రేంజ్లో ఉన్నా కూడా చిటికెలో చెప్పెయ్యగలరు. అంతే కాదు ఏ లెక్కల సిద్ధాంతాన్నయినా సరే తడుముకోకుండా, బుర్ర గోక్కోకుండా వివరించగలరు. ఇంత మేధావికీ ఓ చిన్న కష్టం. దాదాపు ఇరవయ్యేళ్ళ క్రితం 1975 లో జరిగిన ప్రమాదంలో తలకి దెబ్బ తగలడంతో ప్రస్తుతం జ్ఞాపకశక్తి కేవలం ఎనభై నిమిషాలకు పరిమితమయిపోతుంది. ఏ విషయమూ ఎనభై నిమిషాలకు మించి జ్ఞాపకం ఉండదు. కాకపోతే ప్రమాదానికి జరగడానికి ముందు జరిగిన విషయాలు మాత్రం అన్నీ అలానే గుర్తున్నాయి. కొత్త విషయాలు మాత్రం మెదడులోకి వెళ్ళాలంటే, నిండిపోయిన రికార్డింగ్ టేప్ మొదటికి తిప్పినట్టు ఎనభై నిమిషాల తర్వాత మొత్తం తుడుచు పెట్టుకు పోతాయి. అందుకని ముఖ్యమయిన విషయాలు చిన్న చిన్న చీటీల మీద రాసుకుని, వేసుకున్న కోటు నిండా పిన్నులతో గుచ్చుకుని, కదులుతున్న నోటీస్ బోర్డులా ఉంటారన్నమాట. ఆ చీటీల్లో అతి ముఖ్యమయినది “నా జ్ఞాపకశక్తి కేవలం ఎనభై నిముషాలు మాత్రమే” అన్నది.

ప్రొఫెసర్ గారికి చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోతే, అన్నగారు పెంచి చదివిస్తారు. తరువాతెప్పుడో అన్నగారు కూడా చనిపోగా, దాదాపు తన వయసే ఉన్న వదిన గారు మాత్రమే అతనికి మిగిలిన బంధుజనం. అన్నగారి ఇంటి వెనక తోటలో ఓ చిన్న కాటేజ్ లో ఈయన నివాసం. ప్రొఫెసర్ ఎప్పుడూ తనలో తను గొణుక్కుంటూ, ఏదో ఆలోచించుకుంటూ, ఏవో లెక్కల పజిల్స్ పూరించుకుంటూ, వాటిని మేగజైన్స్కి పంపుకుంటూ తన రూమ్ లోనే కాలం గడుపుతుంటారు. అతనికి ఇంకే ప్రాపంచిక విషయాలూ పట్టవు. ఎవరితోనైనా మాట్లాడాలన్నా విపరీతమైన జంకు. ఎవరిని కలిసినా వాళ్ళ షూ సైజ్, లేకపోతే పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ ఇలా ఏదో ఒకటి పాస్ కోడ్ అడిగినట్టుగా అడగటం, వాళ్ళు చెప్పిన నంబర్ ప్రాముఖ్యత చెప్పి, దానితో తనకి సంబంధమున్న విషయం ఏదన్నా చెప్పటం ఒక అలవాటు. అలా అని దానితో వాళ్ళు ఆయనకి గుర్తుంటారు అనేమీ కాదు. అలా ప్రతీది తనకి తెలిసిన లెక్కలతో ముడిపెట్టుకోడం ఆయనకి ఒక సాంత్వన. ఎనభై నిమిషాల కాలం దాటితే ఎవరైనా మళ్ళీ మళ్ళీ కొత్తగా పరిచయం చేసుకోవాల్సిందే. పాస్ వర్డ్ అడిగినట్టు మళ్ళీ మళ్ళీ ఏదో ఒక ఆ గుర్తింపు కోడ్స్ అడగాల్సిందే.

పగటి సమయంలో ఆయన అవసరాలు చూడటానికి ఒక ఏజెన్సీ ద్వారా హౌస్ కీపర్ ని ఏర్పాటు చేస్తుంది వదినగారు. ఆ హౌస్ కీపర్ కాటేజ్ లోకి రాకపోకలకు తోటలోకి ఉన్న చిన్నగేట్ మాత్రమే వాడాలనీ, మెయిన్ ఇంటి చుట్టుపక్కలకి రాకూడదనీ, ఏ విషయంలోనూ ఆసక్తి చూపించకూడదనీ నియమాలు పెడుతుంది వదినగారు. ప్రొఫెసర్ గారి మతిమరుపుని, చిన్నపిల్లల కన్నా అధ్వాన్నమైన ఆయన అలవాట్లనీ భరించలేక ఏజెన్సీ నుంచి వచ్చిన ఏ ఉద్యోగినీ ఎక్కువ రోజులు అక్కడ పనిచేయ్యలేక మానేస్తుంటారు. అలా ఓ తొమ్మిదిమంది వచ్చి వెళ్ళాక ఏజెన్సీ ఓ కొత్త హౌస్ కీపర్ ని పంపిస్తుంది. కథ కోసం ఆమె పేరు అనామిక అనుకుందాం. అనామిక తన బాధ్యతలు తెలుసుకోడానికని వదినగారిని వచ్చి కలిస్తుంది. తనేం పనులు చెయ్యాలో చెప్పడంతో పాటూ, యధావిధిగా అన్ని రూల్స్ కూడా నిక్కచ్చిగా చెప్పేసి, మర్నాటి నుండీ పనిలోకి రమ్మని చెప్పింది వదినగారు.

అనామిక పెళ్లి కాకుండా టీనేజ్ లోనే తల్లి కావడంతో చదువు సాగదు. ఆమెకు పది సంవత్సరాల వయసున్న ఒక కొడుకు ఉంటాడు. ఆమె తల్లి కూడా ఆమెలాగే సింగిల్ మదర్. తల్లి జీవితాన్ని చూసి కూడా ఏమీ నేర్చుకోకుండా తను కూడా కుటుంబం, ఫ్యూచర్ అనేది లేకుండా చేసుకుందని తల్లికి కోపం. ఆ కోపంతో తల్లి కూడా దూరమయిపోవడంతో, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కొడుకుని పెంచుకుంటుంది.

అనామిక మొదటిరోజు పనిలోకి రాగానే ప్రొఫెసర్ తలుపు తీసి నువ్వెవరని అడిగారు. తను కొత్తగా నియమించబడ్డ హౌస్ కీపర్ ని అని చెపితే, 'ఓహ్ అలానా!' అని, 'నీ షూ సైజు ఎంత?' అని అడిగారు. అపుడు ఒక నోట్ తీసి దాని మీద ఓ అమ్మాయి బొమ్మ గీసుకుని, “కొత్త హౌస్ కీపర్” అని రాసుకుని ఓ పిన్నుతో కోటుకి తగిలించుకున్నారు. ఆ నోట్ ఆయనకి ఆ వ్యక్తిని తాను ఇంతకుముందు కలిసాను అనేదానికి గుర్తన్నమాట. అది మొదలు రోజూ రాగానే ఆమె ప్రవర చెప్పుకుని ఆ నోట్ చూపించడం, ఆయన తలవూపి నీ షూ సైజ్ ఎంతనో, నీ ఫోన్ నంబర్ ఏంటనో అడగటం, లోపలకి రానివ్వడం ఓ ఆనవాయితీ అయిపోయింది. ఇల్లు శుభ్రం చేసి, వంట చేసి, బట్టలు ఉతికి ఐరన్ చెయ్యడం లాంటి పనులు చేసుకుంటుంటే, ప్రొఫెసర్ గారు రూంలో మేథ్ పజిల్స్ పూర్తి చెయ్యటంలో ఉంటారు. ఆయన టేబుల్ నిండా, క్రింద నేల మీదా గుట్టలుగా రకరకాల మేథ్ మాగజైన్స్, పేపర్స్, పెన్సిల్స్, ఎరేజర్స్ చిందరగా పడేసి ఉంటాయి. ఎప్పుడూ మేథ్స్ గురించే ఆలోచిస్తూ తనలోకంలో ఉంటూ, ఎవరైనా కదిపితే కరిచినంత పనిచేస్తుంటారు. అందుకని ఆయన మధ్యాన్నం బోజనం చేసి విశ్రాంతి తీసుకునే టైంలో మాత్రమే ఆయన రూం సర్దే పనిపెట్టుకుంటుంది. లెక్కల గురించి తప్ప ఇక మిగతా విషయలేమీ ఆయనకి ఏమీ తెలియదు. చివరికి బ్రెడ్ టోస్ట్ చేసుకోవాలంటే టోస్టర్లో ఎంత సేపు పెట్టాలో, ఎలా పెట్టాలో కూడా చూపించాల్సిందే. అదే ప్రైమ్ నంబర్స్ గురించో, ఎమికబుల్ నంబర్స్ గురించో చెప్పమంటే మాత్రం అరిటిపండు వొలిచి పెట్టినంత వివరంగా, ఆసక్తిగా వివరిస్తారు. చాలా అరుదుగా కిచెన్ లోకి వచ్చి అనామిక పని చేసుకుంటూ ఉంటే మౌనంగా గమనిస్తూ కూర్చుంటారు. మరీ అరుదుగా ఎప్పుడన్నా ఓ రెండు మాటలు జరుగుతాయి వాళ్ళ మధ్య.

ఒకరోజు ప్రొఫెసర్కి మాటల సందర్భంలో అనామికకి ఒక కొడుకు ఉన్నాడనీ, తను స్కూల్ అయ్యాక ఇంటికి వెళ్ళి తల్లి వచ్చేవరకూ ఒక్కడే ఉంటాడనీ తెల్సింది. అలా చిన్నపిల్లాడు ఒక్కడే ఇంట్లో ఉండటం మంచిది కాదనీ, పిల్లలు తల్లి దగ్గరే ఉండాలనీ కోప్పడి, మర్నాటి నుండీ స్కూల్ కాగానే ఇక్కడికే నేరుగా వచ్చెయ్యమని కొడుకుతో చెప్పమని చెప్తారు. తను ఇంటి దగ్గరే ఉన్న పార్క్ లో స్నేహితులతో ఆడుకుంటూ ఉంటాడనీ, భయమేమీ లేదనీ చెప్పినా ససేమిరా వినరు. అలా పిల్లల్ని క్లైంట్స్ ఇంటికి తీసుకురావటం, తను పని చేసే ఏజెన్సీ రూల్స్ కి విరుద్ధం కనుక, ఇక తప్పక ఏజెన్సీ వాళ్ళతో విషయం చెప్పి వాళ్ళ అనుమతి తీసుకుంటుంది అనామిక. మర్నాడు స్కూల్ అవ్వగానే కొడుకు తల్లి ఇచ్చిన ఆనవాళ్ళ ప్రకారం ప్రొఫెసర్ ఇంటికి వస్తాడు. పిల్లాడిని చూడగానే ఆయనకి ఏదో అవ్యాజమైన ప్రేమ కలుగుతుంది. తన తల ఆప్యాయంగా నిమిరి, తన తల ఫ్లాట్ గా ఉండటంతో తనకి స్క్వేర్ రూట్ గుర్తోస్తుందని చెప్పి, రూట్ అని ముద్దు పేరు పెట్టారు. వెంటనే మర్చిపోకుండా అనామిక వివరాలు రాసుకున్న చీటీమీదే పక్కగా ఒక చిన్నపిల్లాడి బొమ్మ గీసుకుని, క్రింద రూట్ అని రాసుకున్నారు. అది వాళ్ళిద్దరి మధ్య నిర్వచించలేని అనుబంధానికి నాంది.

రోజూ రూట్ రాగానే ప్రొఫెసర్ తను చేస్తున్న పనులన్నీ వదిలేసి తన రూమ్ లోంచి బయటకి వచ్చి, రూట్ కిచెన్లో టేబిల్ దగ్గర కూర్చుని హోమ్ వర్క్ చేసుకుంటుంటే పక్కనే కూర్చుని అవసరమైతే హెల్ప్ చెయ్యడం మొదలుపెడతారు. రోజూ ఇక్కడ పని ముగించుకుని ఇంటికి వెళ్ళి అపుడు వండి డిన్నర్ పెడితే పిల్లాడికి ఆలస్యమయిపోతుంది కాబట్టి పిల్లాడినీ, మళ్ళీ వేరుగా వండటం అనవసరమైన పని కాబట్టి అనామికనీ ఇక్కడే తనతో పాటే భోజనం చెయ్యమని ఒప్పిస్తారు. ఏజెన్సీ తన జీతం నుండి ఖర్చులు మినహాయించుకొనే ఒప్పందం మీద అనామిక అందుకు ఒప్పుకుంటుంది. రోజూ రూట్ హోం వర్క్ చేసుకోవటం అయిన తర్వాత ముగ్గురూ కలిసి భోజనం చెయ్యటం, తర్వాత మిగిలినవి శుభ్రం చేసి సర్ది అపుడు ఇంటికి బయలుదేరటం జరుగుతుంటుంది. తను ఒంటరిగా భోజనం చేసేటప్పుడు చిన్నపిల్లల్లా చుట్టూ క్రింద పోసుకుని, మూతినిండా అంటించుకొని, చప్పుడు చేస్తూ తినే ప్రొఫెసర్, రూట్ పక్కనున్నప్పుడు మాత్రం తనకి తెలీకుండానే శుభ్రంగా, పద్ధతిగా తింటూ ఎంతో బాధ్యతగా ప్రవర్తించడం అనామికని ఆశ్చర్యపరుస్తుంది.

ఇక హోం వర్క్ సమయంలో అయితే చెప్పనక్కర్లేదు. రూట్ కి లెక్కలు హెల్ప్ చేసినపుడు, లెక్కకి ఆయన ఆన్సర్ చెప్పెయ్యటం కన్నా, అది తనంతట తను కనుక్కోవడానికి ప్రోత్సహిస్తుంటారు. సరైన జవాబు కనుక్కునే ప్రయత్నంలో ఒక్కోసారి మనకి ముందు తెలియని ఎన్నో కొత్త సమస్యలకి జవాబులు దొరుకుతాయని చెప్తారు. ప్రొఫెసర్ రూట్ మీద చూపించే ఆప్యాయతా, శ్రద్ధ చూసి అనామికకి ఎంతో ఆనందం కలుగుతుంది. తండ్రి మొహం కూడా తెలీని కొడుక్కి తండ్రి ప్రేమ లాంటి ప్రేమ దొరికిందని సంతోషపడుతుంది. రూట్ కి రేడియోలో వచ్చే బేస్ బాల్ గేమ్ కామెంటరీ వినడం అంటే చాలా ఇష్టం. అప్పుడప్పుడూ పార్క్లో వినేవాడు. ప్రొఫెసర్ ఇంట్లో పనిచెయ్యని పాత రేడియో ఒకటి ఉంది. ఒకరోజు రూట్ ఒక కష్టమయిన లెక్కకి ఆన్సర్ తను కనుక్కుంటే రేడియోని బాగుచెయ్యించాలని అడుగుతాడు. కష్టపడి దానికోసం ఆ లెక్కని సాధిస్తాడు. ఇక రోజూ హోమ్ వర్క్ అయిపోగానే ఇద్దరూ కలిసి రేడియో పెట్టుకుని వినడం మొదలుపెడతారు. దానితో కథలో కొత్త చిక్కులు వస్తాయి. ప్రొఫెసర్ గారికి తెలిసిన ఆటగాళ్ళందరూ 1975ప్రాంతం వాళ్ళు. ఇపుడేమో వాళ్ళందరూ రిటైర్ అయిపోయి టీములో కొత్తవాళ్ళు ఉన్నారు. ఆయనకి తనకేం జరిగిందో గుర్తులేకపోయినా, తనలో ఏదో తేడా ఉందని మాత్రం తెలుసు. అందుకని అలా తన వర్తమానం అంతా తన గతమే అని లీలగా తెలుస్తున్న సమయంలో తనలో తనే ముడుచుకుపోతారు. రూట్ కి ప్రొఫెసర్ మెమొరీ ప్రాబ్లం కొంచెం తెలుసు. తను అందరిలా నార్మల్ కాదు అని అనిపించినా క్షణంలో ప్రొఫెసర్ బాధపడతారనీ తెలుసు. అది ఆ చిన్ని మనసుకి ఇష్టంలేదు. అందుకని ఆయన తన ఫేవరేట్ ఆటగాడు ఫీల్డ్ లోకి రావటం లేదేం అని ఆలోచిస్తుంటే, ఒకసారి ముందే అవుట్ అయి వెళ్ళిపోయాడనీ, ఒకసారి కాలికి దెబ్బతగిలిందని ఆడలేదనీ, ఒకసారి అపుడే ఆడి వెళ్ళిపోయాడు మీరు వినలేదనో చెప్పి అప్పటికి నెట్టుకొస్తుంటాడు.

ఇలా ఉండగా ఒకరోజు తల్లీ కొడుకులిద్దరూ వూర్లో జరుగుతున్న బేస్ బాల్ ఆట చూడటానికి వెళ్ళాలని అనుకుని, ప్రొఫెసర్ని కూడా తమతో రమ్మని అడుగుతారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత జనసమూహంలోకి వెళ్ళిన ప్రొఫెసర్ మొదట బిడియంతో ఉన్నా తర్వాత ఆటనీ, జనాన్నీ, రూట్ తో కలిసి ఆట చూడటాన్నీ బాగా ఆనందిస్తారు. ఆట ముగిసిన తర్వాత రాత్రి పది

గంటలప్పుడు ప్రొఫెసర్ని ఇంట్లో దింపి వెళ్ళడానికి వస్తారు. అలవాటులేని అలసటా, తెలియని ఉద్విగ్నతా కలిసి ప్రొఫెసర్కి ఒళ్ళు తెలియకుండా జ్వరం వచ్చి దాదాపు స్పృహలేని స్థితిలో ఉండటంతో, రాత్రప్పుడు ఎవరూ లేకుండా ఆయనని అలా ఒంటరిగా వదిలి వెళ్ళడానికి మనసొప్పక అనామిక ఆ రాత్రికి కొడుకుతో సహా అక్కడే ఉండటానికి నిశ్చయించుకుని, ఆయన బాగోగులు చూసుకుంటుంది. అలా వొళ్ళు తెలియని స్థితిలో మూడు రోజులు గడిపిన ప్రొఫెసర్, నాలుగోరోజుకి కొంచెం తేరుకుంటారు. నాలుగో రోజున అనామికని వెంటనే ఏజెన్సీ ఆఫీసుకు రమ్మని పిలుపొచ్చింది. ఆఫీసుకి వెళ్ళిన అనామికతో మేనేజర్ "నువ్వు నాలుగు రోజుల క్రితం ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి గడిపావు కదా" అని అడిగి, ఆమెకు ఏమీ చెప్పే అవకాశం ఇవ్వకుండా "ముందు అనుకున్న నిబంధనలకు విరుద్ధంగా క్లైయింట్ ఇంట్లో గడపటం రూల్స్ ని అతిక్రమించడమే అనీ, ప్రొఫెసర్ గారి వదిన గారు కంప్లయింట్ చెయ్యడం వలన ఆ క్షణంనుంచే ప్రొఫెసర్ ఇంట్లో ఉద్యోగం ముగిసిందనీ" చెప్పి మర్నాటి నుండీ వేరే క్లయింట్ దగ్గర పనికి వెళ్ళమని నిష్కర్షగా చెప్తాడు. ఇక వేరే చేసేదేమీ లేక బాధపడుతూనే అనామిక వెళ్ళిపోతుంది. రోజూలా మళ్ళీ ప్రొఫెసర్ ని చూడటం కుదరక పోవటంతో రూట్ కూడా చాలా దిగులుగా ఉంటాడు.

ఒకరోజు అనామిక క్లయింట్ ఇంట్లో పని చేసుకుంటూ ఉండగా, వెంటనే తనని ప్రొఫెసర్ ఇంటికి వెళ్ళమని ఏజెన్సీ నుండి ఫోన్ వస్తుంది. కంగారు పడుతూ వెళ్ళేసరికి అక్కడ హాల్లో కొడుకూ, ప్రొఫెసర్, వదిన గారూ కనిపిస్తారు. ఏమయిందో అని భయపడుతున్న అనామికతో వదినగారు "అక్కడ తన ఉద్యోగం ముగిసాక ఇంకా ప్రొఫెసర్ తో ఏదో దురుద్దేశ్యంతోనే వాళ్ళు పరిచయం కొనసాగిస్తున్నారనీ, ప్రొఫెసర్ దగ్గర ఆస్థి ఏమీలేదు కాబట్టి ఆశలు వదులుకోమనీ" కఠినంగా మాట్లాడుతుంది. రూట్ తను స్కూల్ లైబ్రరీ నుంచి కథల పుస్తకం తెచ్చుకున్నాననీ, దాన్ని ప్రొఫెసర్తో కలిసి చదువుకోవాలని అక్కడికి తల్లికి తెలీకుండానే వచ్చాననీ చెప్పినా దాన్ని వినిపించుకోకుండా ఇద్దరినీ నిందిస్తుంది. అప్పటివరకూ మౌనంగా కూర్చున్న ప్రొఫెసర్ విసురుగా లేచి "ఆ పిల్లాడిని అలా వదిలేయ్", అని ఒక కాగితం మీద ఒక ఈక్వేషన్ (యూలర్ ఫార్ములా, వివరణ కోసం చివరన నోట్ చూడండి) రాసి వదినగారి ముందు పెట్టేసి లోపలికి వెళ్ళిపోతారు. అది చూసిన వదినగారు ఏదో అర్ధమయినదానిలా ఇక మాటలు రాక ఉండిపోతుంది. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత మళ్ళీ ప్రొఫెసర్ ఇంట్లో పనికి వెళ్ళమని ఏజెన్సీ నుంచి అనామికకి కబురు వస్తుంది. దానితో మళ్ళీ ప్రొఫెసర్ని రోజూ చూడొచ్చు అని రూట్ కూడా ఎంతో సంతోషిస్తాడు. మళ్ళీ ముగ్గురి స్నేహం యధావిధిగా సాగుతుంది. రోజులు అలా గడుస్తుండగా ప్రొఫెసర్ జ్ఞాపకశక్తి ఎనభై నిమిషాల నుండి నెమ్మదిగా ఇంకా తక్కువ సమయానికి పడిపోవడం గమనించి అనామిక ఆందోళన పడుతూ ఉంటుంది.

త్వరలో రూట్ పుట్టినరోజు రాబోతుందని తెలిసి అది తన ఇంట్లో సెలెబ్రేట్ చెయ్యాలని చెప్తారు ప్రొఫెసర్. కొన్ని నెలలపాటు కష్టపడి కనుక్కొన్న ఒక ప్రూఫ్ కి ప్రొఫెసర్కి మొదటి బహుమతి రావటంతో, ఆ సందర్భంగా ఆయనకి తెలీకుండా సెలెబ్రేట్ చెయ్యాలని తల్లీ కొడుకులిద్దరూ అనుకుంటారు. ఆయనకి ఏం బహుమతిగా ఇవ్వాలా అని అలోచించి, ఆయనకీ ఎంతో ఇష్టమయిన బేస్ బాల్ ఆటగాడి బొమ్మున్న స్పెషల్ ఎడిషన్ కార్డ్ ఇవ్వాలని అనుకుంటారు. దానికోసం ఎంతో కష్టపడి, ఎన్నో షాపులు తిరిగి చివరికి

సంపాదిస్తారు. ప్రొఫెసర్ కూడా రూట్ కోసం ఒక మంచి లెదర్ బేస్బాల్ గ్లవ్ బహుమతిగా ఇస్తారు. రూట్ ఇచ్చిన బేస్బాల్ కార్డ్ ని తాడుకి కట్టి మెళ్ళో వేసుకుంటారు. ప్రొఫెసర్ జ్ఞాపకశక్తి అప్పటికే బాగా క్షీణించి, కనీసం రెండు నిముషాలు కూడా గుర్తుండకుండా పోవడంతో వదినగారు ఆయన్ని ఒక లాంగ్ టర్మ్ కేర్ ఫెసిలిటీలో చేర్చి, తను కూడా ఆయనకు తోడుగా అక్కడే ఉండిపోతుంది.

జ్ఞాపకాలకూ, శారీరక వైఫల్యాలకూ అతీతంగా వారి అనుబంధం చిరకాలం కొనసాగింది. ప్రతీ వీకెండ్ తల్లీ కొడుకులిద్దరూ ప్రొఫెసర్ని చూడడానికి వెళ్లి అతనితో సాయంత్రం వరకూ సమయం గడిపివస్తుంటారు. వాళ్ళిద్దరూ ఎవరో కూడా ప్రొఫెసర్కి ఏమాత్రమూ గుర్తు లేదు, కానీ ప్రతీసారీ రూట్ ని చూడగానే ఆయనలో ఏదో అనిర్వచనీయమైన ఆప్యాయత పొంగుతుంది. చూడగానే ఆప్యాయంగా తలనిమిరి, నీ తల స్క్వేర్ రూట్ లా ఉంది అని, హృదయానికి హత్తుకుంటారు. రూట్, ప్రొఫెసర్ లాన్లో దాగుడుమూతలు ఆడుతుంటే అనామిక, వదినగారు దూరంగా కూర్చుని వాళ్ళని గమనించడం, ఇంటినుంచి తెచ్చిన లంచ్ తిని కబుర్లు చెప్పుకుని ఆఖరు బస్ పట్టుకుని ఇంటికి తిరిగి రావటం...

మనం కథ దగ్గర ఇక్కడితో ఆగిపోదాం. ఆ తర్వాత ఏమయ్యిందో ఎవరికి కావాలి? రూట్ పెద్దవాడయ్యి లెక్కల టీచర్ అయ్యాడు. ప్రొఫెసర్ ఇచ్చిన గ్లోవ్ ఇప్పటికీ ఎంతో అపురూపంగా దాచుకున్నాడు. ఆయన రూట్ ని హృదయానికి హత్తుకున్నప్పుడల్లా, ఇద్దరి మనసుల్లోని ప్రేమను తనూ అందుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు, రెండు హృదయాలనూ తాకుతూ రూట్ ఇచ్చిన కార్డ్ ప్రొఫెసర్ మెళ్ళో ఇంకా వేళ్ళాడుతూనే ఉంది. అంతకన్నా మనం తెలుసుకోవాల్సింది మాత్రం ఇంకేం ఉంది? ఎవరన్నారు, మనుషుల మధ్య బంధాలు సాగాలంటే రక్తసంబంధాలూ, ఇచ్చి పుచ్చుకోడాలూ, పరస్పర అవసరాలూ తప్పవని?

కథ పూర్తయ్యేసరికి మనసుని ఒక చెప్పలేని అనుభూతి కమ్మేస్తుంది. అది దిగులూ, విచారమూ, సంతోషమూ, నిర్లిప్తత అంటూ విడదీసి చెప్పగలిగేదేదీ కాదు. బహుశా అన్నీ కలగలిసిన మిశ్రమ అనుభూతులు మేళవించిన స్థబ్దత. కొంచెం సేపు కళ్ళు మూసుకుని పుస్తకాన్ని అలానే గుండెల మీద పెట్టుకుని మౌనంగా ఉండిపోవాలనిపిస్తుంది.

*** Euler's Formula explianed. $e^{\pi i} + 1 = 0$

*"**i**" is the square root of -1, an imaginary number that never shows itself. **Pi**, whose value is 3.14159...a number that continues to the end of the universe. The value of "**e**" is 2.7182818284....an irrational number. Both Pi and e go on and on forever. Euler theroy states a natural relationship between apparently unrelated numbers.*

*From an infinite universe, **pi** and **e** come together with **i**. None of them are connected, but if a human adds just one thing, the whole world is transformed. The contradiction is resolved to zero.*

*What at first appears complicated becomes nothing.*

*Euler theory is used to show how completely unrelated, different kind of people are brought together to create a beautiful relationship. Though at first the relationship might seem complicated or unlikely, but in fact it is quite natural.*

ఈ పుస్తకాన్ని రచయిత్రి 2003లో రాయగా, 2009లో ఇంగ్లీష్ భాషలోనికి అనువాదం చేసారు. దీనికి జపనీస్ బెస్ట్ సెల్లర్స్ అవార్డుతో పాటూ, మరి కొన్ని అవార్డులు కూడా లభించాయి. చాలా బుక్ రీడింగ్ క్లబ్స్, సర్కిల్స్ లో ప్రముఖంగా చదవబడిన పుస్తకం ఇది. Stephen Snyder అనువాదం ఎంతో సరళంగా, చక్కని శృతిలో కూర్చబడిన పాటలా సాగిపోతుంది. ఎంతో సరళమైన పదాలతో, వాక్యాడంబరం లేని కథనం. కథలో భాగంగా అల్లబడ్డ ఎన్నో లెక్కల ముచ్చట్లు, లెక్కలు తెలిసిన వాళ్ళకే కాకుండా తెలీని వాళ్లకు కూడా ఆసక్తిని కలిగించేలా ఉంటాయి. అవి ఎక్కడా కావాలని ఇరికించబడినట్టు కాకుండా ఎంతో సహజంగా కథనంలో ఇమిడిపోయాయి. కథలో ఏ పాత్రకీ పేర్లుండవు, ఒక్క బేస్ బాల్ ఆటగాళ్లకి తప్ప. అలా పేర్లు లేకపోవడంతో ఈకథని ఏ ప్రాంతం వాళ్ళకి అన్వయించుకున్నా అంతే సహజంగా ఉంటుంది. ప్రధాన పాత్రలకి మనం నారాయణరావు, సుజాత లాంటి పేర్లు గనక పెట్టుకుని, బేస్ బాల్ ఆటని క్రికెట్ అని మారిస్తే అచ్చుతెలుగు కథలా ఉంటుంది.

ప్రొఫెసర్ పాత్రకు ఇన్స్పిరేషన్ Paul Erdos అనే హంగేరికి చెందిన మేథ్ మెటీషియన్, అతని జీవితచరిత్ర "The Man Who Loved Only Numbers" అని అంటారు. దీన్ని "The Professor and His Beloved Equation" అనే పేరుతో (పుస్తకం అసలు పేరుకి అర్థం కూడా ఇదే) జపనీస్ భాషలో సినిమాగా తీసారు. దాని ట్రైలర్ ఇక్కడ చూడవచ్చు. ఈ పుస్తకం చాలామందికి 50 First Dates అనే సినిమాని గుర్తుకు తెచ్చిందని కూడా చెపుతారు.



**రచయిత్రి గురించి:** Yoko Ogawa జపనీస్ భాషలో దాదాపు ఇరవైకి పైగా నవలలూ కథాసంకలనాలూ, ఒక మేథ్ మెటీషియన్తో కలిసి "An Introduction to the World's Most Elegant Mathematics" అనే పుస్తకాన్ని వ్రాసారు. ఆవిడ రచనలు ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మన్, గ్రీక్, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించబడ్డాయి. చాలా రచనలకు గానూ జపాన్లోని ప్రముఖమైన లిటరరీ అవార్డ్స్ అందుకున్నారు. ప్రముఖ జపనీస్ రచయిత Haruki Murakami ప్రభావం ఈమె రచనల మీద ఉందనేది ఒక అభిప్రాయం. ఈమె రచనల్లో Diving Pool అనేది బాగా పేరొందిన నవల (మూడు పెద్ద కథల సంకలనం).

(source of the pictures: Internet)



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# స్వర్గంలో పాఠాలు

**The Five People You Meet in Heaven**

చిన్నప్పుడు పిల్లలనందరినీ వెన్నెల్లో మంచమేసి కూర్చోపెట్టి అన్నాలు తినిపిస్తూ, అమ్మమ్మో నాయనమ్మో రాజకుమారుల కథలూ మాయలమరాఠీ కథలూ చెప్తే, వాటి కోసమే సెలవుల కోసమూ, ఎంత తొందరగా రాత్రి అయిపోయి, వాళ్ళ పనులు పూర్తయి కథలు చెప్పే సమయం కోసమూ ఆత్రంగా ఎదురుచూసేవాళ్ళం. ఆ కథల్లో రాజకుమారుడు చేసిన సాహసాల స్ఫూర్తితో, కలల్లో యుద్ధాలు చేసి పక్కన పడుకున్నవాళ్ళ డొక్కల్లో కత్తి దూసేది ఒకరైతే, ఆ మాంత్రికులు కల్లోకివచ్చి పక్కలు తడిపేది ఒకరు. అయినా డొక్కలో తన్నించుకున్నవాళ్ళూ, పక్కలు తడిపిన వాళ్ళూ కూడా మర్నాటికి ఇంకో కథకోసం సిద్ధం. ఆ కథలకీ, కథనానికీ ఉన్న శక్తి అటువంటిది మరి. కాస్త సృజనాత్మకత ఉన్నవాళ్లయితే కథకీ, కలలో జరిగినవాటికీ కొంచెం రంగులద్ది సావాసగాళ్ళకి తమ వీరగాథలు వినిపించేస్తారు. అదే సృజనాత్మకత ఇంకొంచెం పొంగిపొరలితే ఇదుగో ఇలా Mitch Albom లా మనల్ని నిజమేనేమో అని భ్రమింపచేసేంత యుక్తిగా రసవత్తరమైన కథలు అల్లేస్తారు.

Mitch చిన్నప్పుడు థాంక్స్ గివింగ్ సెలవులకి బంధువులందరూ కలిసినపుడు పెద్దవాళ్ళు పిల్లలకి ఎన్నో కథలు చెప్పేవారట, జరిగినవి కొన్నీ, కల్పితాలు కొన్నీనూ. వాటిలో ఒక అంకుల్ చెప్పిన కథ Mitch మైండ్లో బాగా ముద్రపడిపోయింది. ఆయనకు ఒకసారి జబ్బు చేసి ఆసుపత్రిలో ఉన్నప్పుడు, ఓ రాత్రివేళ చనిపోయిన బంధువులు కొందరు ఆయన మంచం చుట్టూ చేరి, వాళ్ళందరూ ఆయనకోసం ఎదురు చూస్తున్నామనీ, వచ్చెయ్యమని పిలిచారట. అపుడు ఆయన వాళ్ళను 'నేనిప్పుడే రాను పొండి' అని కసిరి పంపేసాను అని చెప్పేవారు. ఆయన కలిసినపుడల్లా పిల్లలు ఈ కథని మరీ మరీ అడిగి చెప్పించుకునేవారట. ఆ కథ గురించి ఆలోచించినపుడల్లా Mitch కి 'అసలు జీవితం అంటే ఏంటి? చావు తర్వాత జీవితం ఉంటుందా? స్వర్గం అనేది నిజంగా కథల్లో వర్ణించినట్టూ సకల సౌఖ్యాలకూ సంతోషాలకూ కేంద్రంగా ఉంటుందా? ఒకవేళ వేరేలా ఉంటే అది ఎలా ఉంటుంది? ఈ లోకంలో మనకి తెలిసినవాళ్ళు మళ్ళీ అక్కడ కలుస్తారా?' లాంటి ఊహలన్నీ వచ్చేవిట. కథలల్లటంలో నేర్పరైన Mitch ఆ కథ ఆధారంగా,

స్వర్గాన్ని వేదికగా చేసుకుని తన ఊహలకు మెరుగులు పెట్టి, ఆ అంకుల్ నే ముఖ్యపాత్రగా చేసి The Five People You Meet in Heaven అనే పుస్తకాన్ని వ్రాసేసారు.

మనిషి ఈలోకంలో బ్రతికినన్నాళ్ళూ తనకి దొరికినవాటికన్నా పొందలేకపోయిన వాటికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, ఏదో ఒక అసంతృప్తితోనే జీవితాన్ని గడుపుతాడు. ఆ అసంతృప్తుల వెల్లువలో తనకు దొరికిన దాన్ని కూడా ఆస్వాదించలేకపోతున్నాననే ఎరుక మనలో చాలామందికి ఉండదు. ఇలా నాకే ఎందుకు జరిగింది అనో, అలా ఎందుకు జరగలేదు అనో జవాబు దొరకని ప్రశ్నలు. ఆశ నిరాశలు, రాగద్వేషాలు ... వీటన్నిటి వూగిసలాటలోనే జీవితం గడిచిపోతుంది. అదృష్టమో దురదృష్టమో చావు ఇక్కడి జీవితానికి ఓ ముగింపు పలుకుతుంది. అన్ని వేదనలూ ఇక్కడితో అంతమయిపోతాయనీ, జీవుడికి విముక్తి దొరుకుతుందనీ నమ్ముతాము. అయితే మరణం తర్వాత కూడా మనిషి (ఆత్మ??) ఆ రాగద్వేషాలనూ, అసంతృప్తులను, సందేహాలనూ మోసుకు తిరుగుతూ ఉంటే???? ఏ కరుణాహృదయులో ఆ చిక్కుముడులు విడదీసి, మన జీవితాన్ని మనకి గోచరించని కొత్త కోణంలో ఆవిష్కరించి, ఆ అసంతృప్తి నుండి విముక్తి కలిగిస్తే ఎంత బావుంటుంది కదూ? కానీ ఎవరా బాధ్యత తీసుకునేది? ఆ బాధ్యత సరిగా నిర్వర్తించాలంటే వారికి మన జీవితం గురించి తెలియాలి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో మన జీవితాలు ఎక్కడో ఒకచోట కనెక్ట్ అయి ఉండాలి కూడానూ. అదుగో ఆ ఊహ, ఓ ఐదుగురు మనని మరణానంతరం కలిసి మన గురించి మనకి తెలీని విషయాలు చెప్పి, మన జీవితం వ్యర్థం కాదనీ, మనకి తెలీకుండానే మన జీవితం మరి కొందరి జీవితాలను స్పృశిస్తుందనీ చెపితే, మనకి కొన్ని క్రొత్త పాఠాలు నేర్పితే ... జీవితమే సఫలమూ...




కథలో ముఖ్యపాత్ర ఎడ్డీ, కథ ప్రారంభ సమయానికి ఎనభై మూడేళ్ళ వృద్ధుడు. ఎడ్డీ తండ్రి రూబీ పీయర్ అనే ఒక ఎమ్యూజ్మెంట్ పార్క్లో మైంటెనెన్స్ ఉద్యోగి. ఆయన జీవితమంతా అక్కడే పని చేస్తారు. వాళ్ళ నివాసమూ అక్కడే ఉన్న ఉద్యోగుల క్వార్టర్స్ లోనే. అదే పార్క్లో పుట్టి పెరిగి పెద్దయిన ఎడ్డీకి అక్కడ జీవితమంటే విసుగూ, అయిష్టమూనూ. అక్కడ నుండి బయటకి పోయి వేరే ఇంకేదైనా గుర్తింపు ఉండే పని చేసుకోవాలని కోరిక. యుక్తవయసు వచ్చాక సైన్యంలో చేరతాడు కానీ ఫిలిప్పైన్స్తో వార్ లో కాలు దెబ్బ తగిలి ప్రాణాలతో బయటపడతాడు. ఆ గాయం కుంటికాలుని, యుద్ధం పీడకలలనీ మిగిల్చాయి. మొదటినుంచీ తండ్రి యాంత్రికత్వం, తాగుడు అలవాటు, పిల్లల పట్ల ప్రేమ చూపించకపోవడం, కఠినంగా శిక్షించడం లాంటివి తండ్రి పట్ల అయిష్టాన్ని, కోపాన్ని పెంచుతాయి. యుద్ధం నుంచి తిరిగి వచ్చాక తను ఎంతో ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని, వేరే ఉద్యోగం చేసుకుంటూ ఉంటాడు. కానీ అకస్మాత్తుగా తండ్రి మరణించడంతో తల్లికి తోడుగా ఉంటూ, అదే పార్క్లో తండ్రి చేసిన మెయింటెనన్స్ ఉద్యోగమే చెయ్యడం తప్పలేదు. దానితో జీవితం తనకి నచ్చిన విధంగా గడపలేకపోయాననీ, తప్పించుకుపోవాలని చూసిన చోటే చిక్కుకుపోయాననీ, తన జీవితానికో లక్ష్యం లేదనీ అసహనం, కోపం. 'ఎడ్డీ మెయింటెనన్స్' గా తప్ప అతనికి వేరే గుర్తింపు లేదు. అతను వైర్ పైప్ క్లీనర్ తో చేసే బొమ్మలకోసం పార్క్ కు వచ్చిన చిన్న పిల్లలు అతని చుట్టూ తిరుగుతుంటారు. తను ఎంతో ప్రేమించిన భార్య కూడా మధ్య వయసులోనే మరణించడం, పిల్లలు లేకపోవడం, ఏ కోరికలూ తీరకపోవడంతో జీవితం అంతా

యాంత్రికంగానూ, అసంతృప్తితోనూ గడిచింది. ఇలా ఉండగా తన ఎనభయ్ మూడో పుట్టినరోజు నాడు, ఒక జెయింట్ వీల్ ప్రమాదం నుండి ఒక చిన్నపాపను రక్షించబోతూ మరణిస్తాడు. విరిగిపడబోతున్న జెయింట్ వీల్ ఆ పాప మీద పడకుండా, పాప చేతులు పట్టుకుని బయటకి లాగబోతుండగా అది అతని మీద పడి స్పృహ తప్పుతుంది. చనిపోయే ముందు ఒకే ఒక ఆలోచన అతనికి ‘ఆ పాపను తను రక్షించగలిగానా లేదా’ అని. ఇదీ సూక్ష్మంగా ఈ లోకంలో ఎడ్డీ కథ.

మరణం తర్వాత కళ్ళు తెరిచిన ఎడ్డీ తను ఇంకా ఆ ఎమ్యూజ్మెంట్ పార్క్లోనే ఉన్నానని తెలుసుకుంటాడు. కాకపోతే అది క్రొత్తగా, తన చిన్నప్పుడు ఉన్నట్టు రంగులతో కళకళలాడుతూ ఉంటుంది. తను కూడా చిన్నపిల్లాడిలా ఉత్సాహంగానూ, మనసంతా నిర్మలంగానూ ఉండటం గమనిస్తాడు. నేనెక్కడ ఉన్నానూ అనుకుంటుండగా, ఒళ్లంతా నీలం రంగులో ఉన్న ఒక మనిషి (బ్లూ మేన్) వచ్చి పలకరిస్తాడు. ఎడ్డీ తనని గుర్తుపడతాడు. తను ఎడ్డీ చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడు ఆ పార్క్లో ఒక అట్రాక్షన్ గా ఉండేవాడు. చిన్నప్పుడు ఏదో మందు వికటించి అతని ఒళ్ళంతా నీలంగా మారిపోతుంది. ఎడ్డీకి తన చిన్నప్పుడే బ్లూ మేన్ చనిపోతే, తన పుట్టిన రోజు వేడుక మానేసి, అతని అంత్యక్రియలకి వెళ్ళడానికి ఇష్టపడక, తల్లి దగ్గర మారాం చెయ్యడం గుర్తువస్తుంది.

‘నేనెక్కడున్నాను? నువ్వెలా వచ్చావు ఇక్కడికి?’ అన్న ఎడ్డీ ప్రశ్నలకి ‘ఇది స్వర్గం. కాకపోతే ఇది నా స్వర్గం. నీస్వర్గం వేరే ఉంది. నువ్వు చనిపోయి వచ్చే సమయం కోసమే నేను ఇక్కడ వెయిట్ చేస్తున్నాను. నీకు కొన్ని తెలియచెయ్యాల్సిన బాధ్యత నాకు ఉంది. ప్రతి మనిషీ మరణించాక ఓ ఐదుగురిని కలుసుకుని తన జీవితం గురించి కొన్ని సత్యాలూ, కొన్ని పాఠాలూ నేర్చుకుంటాడు. నీ ఐదుగురిలో నేను మొదటివాడిని.’ అని చెపుతాడు బ్లూ మేన్. ఎడ్డీ ‘చనిపోయాక కూడా ఇంకా నేను తెలుసుకోవాల్సినదేముంది? అందులోనూ నాగురించి నాకు తెలీనివా!!’ అని ఆశ్చర్యపోతాడు.

*"Why do people gather when others die ?It is because the human spirit knows, deep down, that all lives intersect. That death doesn't just take someone, it misses someone else, and in the small distance between being taken and being missed lives are changed."*

*“There are no random acts. We are all connected. You can no more separate one life from another than you can separate a breeze from the wind.”*

‘నువ్వు నాకు చెప్పాల్సినదేమిటి? అసలు నాగురించి నీకేం తెలుసనీ’ అని అడుగుతాడు ఎడ్డీ. దానికి ‘నువ్వు చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడు నీవల్లనే జరిగిన ఓ ప్రమాదంలో నిన్ను తప్పించబోయి నేను మరణించాను’ అని చెప్పి ఇంకా ‘ ఆ సంఘటనలో నేను మరణిస్తే నువ్వు బ్రతికావు. అలాగే ఇంకెక్కడో నాకు సంబంధించినవీ జరిగే ఉంటాయి. జీవితాలలో యాదృచ్ఛికం అనేది ఏమీ లేదు. అన్ని సంఘటనలూ ఏదో కారణంతో ఎక్కడో ఓ చోట ముడిపడే ఉంటాయి. ఒకటి పొందడంలో వేరొకటి పోతుంది. ఆ పొందటం పోగొట్టుకోవడాల మధ్య క్షణకాలంలో జీవితాలు మారిపోతాయి. అది సృష్టి ధర్మం.’ అని చెపుతాడు. బ్లూ మేన్ ‘సరే ఇక నాపని

అయిపోయింది నేను వెళ్ళాలి, నీకు తర్వాత కనిపించాల్సిన వాళ్ళు కలుస్తారు నిన్ను' అని చెపుతాడు. 'నాకు ఒక్క దానికి జవాబు చెప్పు. ఇంతకీ నేనా పాపని రక్షించాగలిగానా లేదా? లేకపోతే నా బ్రతుకు లానే, నా చావు కూడా వ్యర్థమేనా?' అని ఎడ్డీ అడిగిన ప్రశ్నకి 'దానికి 'సమాధానం చెప్పాల్సింది నేను కాదు. అయినా ఏ బ్రతుకూ ఎపుడూ వ్యర్థం కాదు' అని నవ్వి మాయమయిపోతాడు.

ఎడ్డీ మరణానికి కారణమయిన ప్రమాదానికి కూడా ఓ టీనేజ్ అబ్బాయి కారణం. ఏక్సిడెంట్ జరగటానికి కొన్ని నెలల ముందు, నిక్కీ అనే అబ్బాయి స్నేహితులతో కలిసి పార్క్ కి వస్తాడు. మొత్తం కీ చైన్ పట్టుకు తిరగటానికి ఇబ్బందిగా అనిపించి, కారు తాళాన్ని మాత్రం బయటకు తీసి జాకెట్ జేబులో పెట్టుకుని, ఆ జాకెట్ ని నడుముకు కట్టుకున్నాడు. పైకీ క్రిందకీ తిరిగే రైడ్స్ ఎక్కినపుడు, ఆ తాళం బయటకు పడి, ఆ రైడ్ యొక్క కార్ట్స్ ని తిప్పే కేబుల్ కీ పుల్లీ కీ మధ్య సందులో ఇరుక్కుని, నెమ్మదిగా రాపిడికి ఆ స్టీల్ కేబుల్స్ ను కొయ్యటం మొదలుపెట్టింది. చివరికి ఆ ఏక్సిడెంట్ జరిగిన రోజున మొత్తం కేబుల్ తెగి, అక్కడ నుండి ఆ కార్ట్స్ అన్నీ తెగి కింద పడి, చివరికి ఎడ్డీని బలి తీసుకున్నాయి.

బ్లూమేన్ మాయం అవగానే ఎడ్డీ చుట్టూ ఉన్న వాతావరణం మారిపోయి, యుద్ధవాతావరణంతో నిండిన ఒక అడవి కనిపిస్తుంది. అక్కడ ఒక వ్యక్తిని చూస్తాడు. అది తను టీనేజర్గా ఉన్నప్పుడు యుద్ధానికి వెళ్ళినపుడు తిరిగిన అడవి అనీ, ఆయన తన కేప్టెన్ అనీ గుర్తిస్తాడు. వాళ్ళు యుద్ధపు రోజుల్లో ఫిలిప్పైన్స్ లో బందీలుగా ఉన్నప్పుడు, ఓ రోజు శత్రుసైనికులు పైనుండి బాంబులతో దాడి చేస్తుండగా, సమయం చూసి తప్పించుకుని పారిపోతూ శత్రుశిబిరంలో ఉన్న ఆయిల్ టేంక్స్ తగులబెడతారు. అలా చేస్తున్నప్పుడు అక్కడ చుట్టూ ఉన్న గుడిసెలకు నిప్పు అంటుకుని మంటలు రేగుతాయి. ఒక గుడిసెలో మంటల్లో చిక్కుకుని ఎవరో ఉన్నారని అనిపించి, అది తన ప్రాణాలకి ప్రమాదమని వారించినా వినకుండా వాళ్ళని రక్షించాలని ఎడ్డీ వెనుకకు పరుగెడతాడు. ఎడ్డీని ఆపడానికి వేరే మార్గం లేక కేప్టెన్ తుపాకితో అతని కాలు గాయపరచి, వెళ్ళకుండా చేసి అక్కడి నుంచి తీసుకు వచ్చేస్తారు. ఆ యుద్ధమూ, బందీలుగా ఉన్నప్పటి భయంకర సంఘటనలూ, బాంబు దాడీ, మంటలూ అతనిని పీడకలల్లో రూపంలో వెంటాడాయి.

*" Sacrifice is a part of life. It's supposed to be. It's not something to regret. It's something to aspire to. Sometimes when you sacrifice something precious, you're not really losing it. You're just passing it on to someone else."*

శత్రుశిబిరం నుండి తప్పించుకునే సమయంలో తన టీమ్ ని సురక్షితంగా బయటకు చేర్చే ప్రయత్నంలో కేప్టెన్ చనిపోతాడు. ప్రమాదవశాత్తూ కాలు దెబ్బతిందనే తప్ప మిగిలిన విషయాలేమీ ఎడ్డీకి తెలియవు. ఆ కాలు కుంటిదవడంతోనే మిలటరీ నుండి బయటకు వచ్చేయాల్సి వచ్చిందనీ, వేరే ఉద్యోగాలకూ అది అనర్హతగా నిలిచిందనీ, తన కలలన్నీ దెబ్బతిన్నాయనీ అతనికి కోపం, అసహనం. అలానే తల్లికి తోడుగా అక్కడే ఉండిపోవటం వలన తను కావాలనుకున్న జీవితాన్ని త్యాగం చేయాల్సింది వచ్చింది అనే ఆలోచన కూడా బాధిస్తుంటుంది. అపుడు కెప్టన్ చెపుతాడు 'మనిద్దరమూ త్యాగాలు చేసాము. త్యాగాలనేవి అందరూ ఎప్పుడో

ఒకప్పుడు చేస్తారు. కాకపోతే నువ్వు త్యాగం చేసాను అనుకుంటున్న వాటి పట్ల నీకు బాధ ఉంది. అది చిన్నదయినా పెద్దదయినా సరే దానిగురించి ఆలోచించి వేదన పడటంవలన ప్రయోజనం లేదు. మనం కొన్ని వదులుకోవటం వల్ల వేరేవాళ్ళకి కొన్నిటికి అవకాశం ఇస్తున్నాము అంతే. మన త్యాగం ఇతరులకి స్ఫూర్తి కలిగించాలి. ఈ జీవితానికి ప్రయోజనం అదే' అని. కెప్టెన్ చనిపోయేనాటికి ఆతని వయసు ముప్పయ్యేళ్ళేననీ, అయినా అతనికి అది ఏమాత్రమూ దుఃఖాన్ని కలిగించలేదనీ ఎడ్డీకి అర్ధమవుతుంది. తను జీవితమంతా జరిగిన వాటి గురించే పరితపిస్తూ ఎలా గడిపాడో గుర్తొచ్చి సిగ్గుపడతాడు. తను వేచి ఉన్న పని అయిపోయిందని చెప్పి కెప్టెన్, అతను ఎప్పుడూ ఆశపడిన, యుద్ధఛాయలు లేని ప్రశాంత వాతావరణంలోకి మాయమయిపోతాడు.

తరువాత ఎడ్డీ చుట్టూ ఉన్న అడవి మాయమయి మంచుకొండల్లో ఒక రెస్టారంట్ కనిపిస్తుంది. లోపలికి వెళ్ళి చూస్తే ఒకచోట కూర్చుని ఆలోచిస్తూ అతని తండ్రి కనిపిస్తాడు. తండ్రిని చూడగానే ఎడ్డీకి లోపల ఏళ్ళుగా అణిగిన ద్వేషం అంతా బయటకి వస్తుంది. తండ్రి కఠిన ప్రవర్తనా, పిల్లలని చిన్న చిన్న విషయాలకూ చావబాదడం, ప్రేమరాహిత్యం గుర్తుకువస్తాయి. తన కాలు కుంటిదయి, ఆ నిస్పృహలో ఉన్నప్పుడు, ఆ యుద్ధపు రాత్రి పీడకలలా వెంటాడుతూ ఉంటే రోజులు నిస్పృహలో గడిపేస్తున్నప్పుడు, తండ్రి ఎడ్డీని ఖాళీగా ఉండకుండా పార్క్లో ఏదో ఒక పని చెయ్యమని బలవంతపెడతాడు. ఇద్దరి మధ్యా వాదనలూ మనస్పర్ధలూ పెరిగి, ఎడ్డీ ఇంట్లోంచి బయటకు పోయి పని చేసుకుంటూ, దాదాపు తండ్రి చనిపోయేవరకూ ఆయనతో మాట్లాడడు. తండ్రి పోయిన తరువాత తల్లిని చూసుకోవడానికి తిరిగి ఆ పార్క్ కే తిరిగివచ్చి, తండ్రి చేసిన ఉద్యోగమే చేస్తూ జీవితమంతా అక్కడే గడపాల్సి వస్తుంది. తను పారిపోవాలనుకున్న జీవితంలోనే తను చిక్కుకు పోవడానికి ఆయనే బాధ్యుడని, తండ్రి అంటే విపరీతమయిన ద్వేషం, అసహ్యమూనూ.

*"Holding anger is a poison. It eats you from inside. We think that by hating someone we hurt them, but hatred is a curved blade and the harm we do to others, we also do to ourselves".*

రెస్టారంట్ లో తండ్రిని చూసి ఎడ్డీ వెనుతిరిగి బయటకి వెళ్ళిపోతున్నప్పుడు ఒక వృద్ధురాలు వచ్చి ఆగమని, నేనే నువ్వు కలవాల్సిన మూడో వ్యక్తిని అని చెపుతుంది. ఆమె పేరు రూబీ, రూబీ పీయర్ మొదటి ఓనర్. తన కథ కూడా చెప్పి, నీ తండ్రి గురించి నాకు తెలిసినవీ, నీకు తెలీని విషయాలు చెప్పాలి. 'నీ తండ్రి ఎలా చనిపోయాడో నీకు తెలీదు. మామూలుగానే ఒళ్ళు తెలీకుండా తాగి రాత్రంతా చలిలో ఉండి జబ్బు పడి చనిపోయాడు అనుకుంటున్నావు కదా. కాదు, ఎపుడో ఏళ్ళ క్రితం తనకి చేసిన మేలుకి కృతజ్ఞతగా, తనకి అపకారం చెయ్యబోయాడని తెలిసి కూడా ఒక స్నేహితుడిని రక్షించడానికి సముద్రంలో దూకి చలిలో తడిసి న్యుమోనియా తెచ్చుకున్నాడు. కృతజ్ఞత చెల్లించుకోవడం కోసం ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చావు దగ్గర పడినపుడు మాత్రం అన్నాళ్ళూ మీ అందరి పట్లా తన ప్రవర్తనకి పశ్చాత్తాపపడి, మీ పేర్లు కలవరిస్తూనే పోయాడు', అని చెపుతుంది. 'ద్వేషంతో ఎదుటి వాళ్ళను శిక్షిస్తున్నాను అనుకుంటాము, కానీ ద్వేషం అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. అది మనల్ని కూడా అంతే తీవ్రంగా గాయపరుస్తుంది."

అని చెప్పి 'నీ తండ్రి నీ పట్ల కఠినంగా ఉండి ఉండొచ్చు, కానీ నువ్వు కూడా ఆయన్ని అంతే విసిగించి ఉంటావు. నువ్వు నీ తండ్రిపై మనసులో ద్వేషం పెట్టుకున్నావు.  దానితో బ్రతికినన్నాళ్ళు అశాంతితోనే గడిపావు. ఇప్పుడు కూడా అది నిన్ను వదలటంలేదు. ఆయన్ని క్షమించు. క్షమతో నీ మనసు బరువు దించుకో. ఆయన బాధనీ తగ్గించు. అక్కడ జీవితం ముగిసాక ఇక్కడ కూడా ఆ బరువు మోయాల్సిన అవసరం లేదు' అని చెపుతుంది.

*"No one is born with anger. And when we die, the soul is freed of it. But now, here, in order to move on, you must understand why you felt what you did, and why you no longer need to feel it."*

తండ్రి వ్యక్తిత్వంలోని ఇంకో కోణం గురించి తెలుసుకున్న ఎడ్డీకి తండ్రిని అపార్థం చేసుకున్నందుకు విపరీతంగా దుఃఖం వస్తుంది. తన మనసులోని ద్వేషం తొలగిపోయి తండ్రి చేతులు పట్టుకుని క్షమించమని ఏడుస్తాడు. ఇద్దరినీ చూస్తూ రూబీ వెళ్ళిపోతుంది.  అలా చూస్తూ ఉండగానే అన్నీ మాయమయిపోయి ఎడ్డీ ఎదురుగా ఒక అందమయిన చిన్న ఇటాలియన్ విలేజ్ కనిపిస్తుంది. లోపలి వెళ్ళి చూస్తే అక్కడ చాలా జంటలు అపుడే పెళ్లి చేసుకుని సంతోషంగా ఆడుతూ పాడుతూ కనిపిస్తారు. తనక్కడికి ఎందుకు వచ్చానా, తను కలిసే నాలుగో వ్యక్తీ ఎవరా అని ఎడ్డీ ఆలోచిస్తుండగానే ఎక్కడినుంచో మార్గరెట్ వచ్చి అతని చెయ్యి పట్టుకుంటుంది.

*Life has to end, but love doesn't. A lost love is still love. Love goes on in the memories we cherish.*

మార్గరెట్ ఎడ్డీ భార్య. తనని చూసిన మొదటి  క్షణంలోనే ఎడ్డీ గాఢమైన ప్రేమలో పడిపోయాడు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అంతులేని ప్రేమ. వారి జీవితంలో ఒకే లోటు పిల్లలు లేకపోవటం. దత్తత చేసుకోవాలనుకున్నా అనేక కారణాల వల్ల కుదరదు. ఆమెకు 45 ఏళ్ళు ఉన్నప్పుడు కేన్సర్తో చనిపోతుంది. ఆమె పోయిన తరువాత ఎడ్డీ పూర్తిగా ఒంటరివాడై పోతాడు. ఆమెను గుర్తుకు తెచ్చుకుంటూ, వాళ్ళ జీవితంలో జరిగిన సంఘటనలకి విచారిస్తూ ఉంటాడు. మార్గరెట్ ఎడ్డీకి అక్కడ అందరినీ చూపించి 'చూసావా ఎక్కడ చూసినా ప్రేమ వెల్లివిరుస్తోందో!?' అని చెపుతుంది. దానికి ఎడ్డీ 'నువ్వు వెళ్ళిపోయాక నేను మాత్రం నా ప్రేమని కోల్పోయాను' అని దిగాలుగా అంటాడు. మార్గరెట్  'నాకు తెలుసు, నిన్నుఒంటరిని చేసి తొందరగా వెళ్లిపోయానని నామీద కూడా కోపం తెచ్చుకున్నావు కదూ' అని నవ్వుతుంది. ఇంకా  'జీవితానికి అంతం ఉంది కానీ  ప్రేమకి కాదు. నిజమైన ప్రేమ ఎక్కడికీ పోదు. దాని రూపాలు మార్చుకుంటుంది అంతే.  ప్రేమించిన వాళ్ళు దూరం అయితే మనం వాళ్ళని చూడలేము, స్పర్శించలేము. కానీ ఆ ప్రేమ తరంగాలని అనుభవించకుండా ఉండటం అసాధ్యం.  జ్ఞాపకాలు మనిషికి తోడవుతాయి. ఆ జ్ఞాపకాలని శ్వాసిస్తూ ప్రేమని అనుభవిస్తాము. నన్ను చూడు అక్కడనుండి ఇక్కడికి కూడా నీ ప్రేమ నాకు తెలియలేదూ.' అని చెపుతుంది. ఇద్దరూ కొంత సేపు కబుర్లు చెప్పుకున్న తరువాత, 'నాకిక్కడ నుండి వెళ్ళాలని లేదు. నేను ఇక్కడే నీతో ఉండిపోతాను' అని ఎడ్డీ అంటుండగానే మార్గరెట్ మాయమయిపోతుంది. ఎడ్డీ నిస్సత్తువగా కళ్ళు మూసుకుని ఉండిపోతాడు.

*" Life has a purpose. No matter what you do in life, you are here for a reason. You may not even realize what your actions have meant to others. "*

ఎడ్డీకి తిరిగి మెలకువ వచ్చేసరికి తన చుట్టూ భూమ్యాకాశాలు ఏకమైపోయినట్టు తెల్లదనం తప్ప ఇంకేమీ కనిపించదు. తను చనిపోయే ముందటి వృద్ధాప్యం స్టేజ్ చేరుకున్నానని గమనిస్తాడు. ఇంతలో ఎక్కడినుండో దూరంగా బాధతో, భయంతో కూడిన అరుపులూ, కేకలూ వినిపిస్తుంటాయి. అవి తనని జీవితమంతా పీడకలల్లో వెంటాడిన యుద్ధపురోజుల నాటివని గుర్తించి భయంతో వణికిపోతాడు. నెమ్మదిగా ఆ శబ్దాలు మాయమై ఎక్కడినుంచో గలగలా పారుతున్న నది చప్పుడు, కేరింతలూ వినిపిస్తాయి. నెమ్మదిగా వెళ్ళి చూడగా అక్కడ ఒక నదిలో వేలకొద్దీ చిన్న పిల్లలు ఒకరి మీద ఒకరు నీరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. దూరంగా ఒక పెద్ద రాయి మీద నుంచుని జాజిపువ్వులా సున్నితంగా, అమాయకమైన చిరునవ్వుతో ఒక ఐదారేళ్ళ ఏషియన్ అమ్మాయి కనిపిస్తుంది. ఎడ్డీని చూసి దగ్గరకు రమ్మన్నట్టూ చేతులతో సైగ చేసి పిలుస్తుంది. తన పేరు టేలా అని చెప్పి, అమాయకంగా కొన్ని చిన్న చిన్న మాటలు మాట్లాడి, ఎడ్డీ జేబులో ఉన్న పైప్ క్లీనర్స్ చూపించి వాటితో బొమ్మ చేసిమ్మని అడిగి తీసుకుంటుంది. ఆ బొమ్మతో ఆడుతూ ఉన్నట్టుండి 'నువ్వు నన్ను చంపేసావు. నువ్వు నన్ను మంటల్లో కాల్చి చంపేసావు' అంటుంది. ఎడ్డీ తృళ్లిపడి 'నేనా!!!' అని ఏదో గుర్తొచ్చి తీవ్రమైన షాక్ తో 'నువ్వు ఫిలిప్పైన్స్లో ... నువ్వేనా??.. ఆ మంటల్లో గుడిసెలో నేను చూసిన నీడ నువ్వేనా?' అని వణికిపోతాడు. టేలా 'తను వచ్చేవరకూ సైనికుల కంట పడకుండా గుడిసెలో సేఫ్ గా దాగుండమని మా అమ్మ చెప్పింది. కానీ అక్కడా సేఫ్టీ లేదు' అని చెపుతుంది. అప్పటివరకూ అందంగా కనిపించిన టేలా, కాలిపోయిననాటి భయంకరరూపంతో కనిపిస్తుంది. అన్నాళ్ళూ తనని పీడకలల్లో వెంటాడిన అనుమానం ఇపుడు నిజమై ఎదురుగా నిలబడటాన్ని తట్టుకోలేకపోతాడు ఎడ్డీ. చెప్పలేని బాధతో వణికిపోతూ 'అయ్యో, నేను నిన్ను చంపేసాను. నన్ను క్షమించు' అని విలపిస్తాడు. ఏడ్చి ఏడ్చి సోలిపోయిన ఎడ్డీని టేలా తట్టి పిలిచి తనకి స్నానం చేయించమని అడుగుతుంది. నదిలో చిన్న రాయితో ఆపాప వొళ్ళు రుద్ది స్నానం చేయిస్తుండగా, ఆమె శరీరంలో ఒక్కో భాగం హీల్ అవుతూ తిరిగి మొదటి రూపం వచ్చేస్తుంది. నువ్వు కలవాల్సిన ఐదో వ్యక్తిని నేనే అని చెప్పి ఎడ్డీ తో సంభాషణ కొనసాగిస్తుంది. 'ఎందుకు నువ్వు ఎపుడూ బాధతోనే ఉన్నావు?' అని అడుగుతుంది. ఎడ్డీ 'నేను నా జీవితంలో చెయ్యాలనుకున్నవేవీ చెయ్యలేకపోయాను. నేను ఏమీ కాకుండా, నాకంటూ ఏ గుర్తింపూ లేకుండానే జీవితమంతా గడిపేసాను. నేను ఉండాల్సినది అక్కడ కాదనీ, చెయ్యాల్సినది ఆ పని కాదనీ నాకెప్పుడూ అనిపిస్తుండేది.' అన్నాడు. 'నువ్వుండాల్సింది అక్కడే. నువ్వు ఆ రైడ్స్ ఫిక్స్ చేస్తూ అన్నీ సరిగా ఉన్నాయో చూస్తూ, ఎందరో పిల్లలకి ప్రమాదం లేకుండా చేసావు. పిల్లల కోసం పైప్ క్లీనర్స్ తో చక్కని బొమ్మలు చేస్తూ పిల్లలని సంతోష పెట్టావు. అందుకే అదే నువ్వుండాల్సిన సరైన చోటు.' అని ఆయన షర్ట్ మీద ఉన్న ఎడ్డీ - మెయింటెనెన్స్ అన్న పేరు మీద తడుముతూ, 'ఎడ్డీ – మెయింటెనెన్స్' అని ఇదే నీ అసలు ఐడెంటిటీ అన్నట్టు మధురంగా నవ్వుతుంది.

ఎడ్డీ తను చనిపోయినప్పటి నుండీ సమాధానం కోసం ఎదురు చూస్తున్న ప్రశ్నను అడుగుతాడు 'నేనా పాపని రక్షించానా? తన కాళ్ళు పట్టుకుని బయటకు లాగాడానికి ప్రయత్నించాను, లాగగలిగానా?' అని. టేలా 'నువ్వు లాగలేదు. తోసావు. నువ్వు ఆ పాప

కాళ్ళు పట్టుకుని వెనక్కి తోసావు. ఫెర్రిస్ వీల్ పడిపోయింది, కానీ ఆ పాప రక్షించబడింది.’ అని చెపుతుంది. ‘అదేంటి నేను చేతులు పట్టుకుని లాగానే, నాకు ఆ చేతుల స్పర్శ బాగా గుర్తుంది ‘ అంటే, చిన్నగా నవ్వి తన చేతులు ఎడ్డీ చేతుల్లో పెట్టి పట్టుకుని ‘నేను నీ చేతులు పట్టుకుని స్వర్గానికి నిన్ను క్షేమంగా తీసుకొచ్చాను’ అని చెపుతుంది. ఎడ్డీ ఆ స్పర్శ గుర్తుపడతాడు.

ఉన్నట్టుండి శక్తి మొత్తం కోల్పోయి ఎడ్డీ ఆ నది ప్రవాహంలో పడిపోతాడు. ఇక అక్కడ కూడా తన టైం అయిపోయిందని అర్థం అవుతుంది. ఆ నదిలో ఆయన శరీరం, రక్త మాంసాలతో సహా కరిగిపోయి, దానితో పాటుగా జీవితాంతం సతాయించిన బాధలూ, కోపాలూ, వాటి తాలూకు గాయాలూ, చేదు జ్ఞాపకాలు అన్నీ తుడిచి పెట్టుకుపోయి మనసు అతి తేలికగా మారిపోతుంది. అపుడు ఎడ్డీకి ఒక ఎమ్యూజ్మెంట్ పార్క్ కనిపిస్తుంది. దానినిండా ఆనందోత్సాహాలతో తుళ్ళుతున్న తల్లిదండ్రులూ, పిల్లలూ వేలకొద్దీ ఉన్నారు. వాళ్ళందరూ తను ఆ పార్కో్ల తన ఉద్యోగ ధర్మంగా చేసిన పనుల వలనే, అంత నిర్భయంగా భరోసాతో అక్కడ ఉండగలుగుతున్నారని అర్థమవుతుంది. అది అతనికి అంతులేని ఆనందాన్ని కలగచేస్తుంది. తను అన్నాళ్ళూ బాధపడినట్టూ తన జీవితం వ్యర్థం కాలేదని సంతోషిస్తాడు. అదే తన స్వర్గమని అతనికి అర్థం అవుతుంది. అక్కడ తనకోసం ఎదురు చూస్తున్న మార్గరెట్ ని  కలుసుకుంటాడు.

ప్రతీ మనిషీ తమ జీవితాన్ని సంపూర్ణంగా గడిపి మరణించాక, వారికి జీవితం పట్ల ఉన్న సందేహాలను తీర్చి, వారి జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్ని వివరించడానికి స్వర్గంలో ఓ ఐదుగురు వేచి చూస్తూ ఉంటారని అని చెపుతూ రచయిత కథ ముగిస్తారు. అలానే చివరికి అందరూ చేరే స్వర్గం ఒకేలా ఉండదు అనీ, మనం జీవితం గడిపిన విధం, మన ఆలోచనలూ కోరికల బట్టి మనకి దొరికే  స్వర్గం ఉంటుందనీ సూచిస్తారు.  కథ పూర్తయిన తరువాత మనం ఒక్కసారి మన జీవితాన్ని, మన ప్రవర్తననీ పునరాలోకనం చేసుకుంటూ, మనకోసం వేచివున్న ఆ ఐదుగురూ ఎవరయ్యుంటారా అని ఆలోచించకుండా ఉండలేము. అలానే ఎడ్డీ ఎవరికోసం వేచి ఉండాల్సి వస్తుందో ఊహించడం కూడా కష్టం కాదు.

పుస్తకం గురించి సూక్ష్మంగా కేవలం రెండు వాక్యాల్లో చెప్పాలీ అంటే, బ్లూ మేన్ చేత అనిపించిన రెండు వాక్యాలు సరిపోతాయి. “*In heaven, there is no judgment, but rather an opportunity to examine our lives-who we touched, the choices we made, and the consequences of those choices.*”



ఎడ్డీ పాత్రకు స్ఫూర్తి రచయిత అంకుల్ Eddie Beitchman. ఆయన కూడా కథలోని ఎడ్డీ లానే వార్ వెటరన్, జీవితంలో ఏమీ సాధించలేకపోయానని అసంతృప్తి తోనే జీవితాన్నిగడిపిన మనిషి, ఎనభయ్ మూడేళ్ళ వయసులో మరణించిన వ్యక్తి. ఆయన చిన్నప్పుడు తనకి చెప్పిన కథని ఆధారం చేసుకుని ఈ పుస్తకం రాసి ఆయనకే అంకితమిచ్చారు. అంకుల్ ఎడ్డీ గురించి ఇక్కడ చదవచ్చు. ఈ పుస్తకం 35 భాషల్లోకి

అనువదించబడి, 12 మిలియన్లకు పైగా కాపీలు అమ్ముడుపోయింది. ఇదే పేరుతో Jon Voight, Jeff Daniels మొదలైనవారితో లఘుచిత్రం కూడా నిర్మించారు. పుస్తకానికి దీటుగా అంతే ఆసక్తికరంగా తీయబడ్డ కొద్ది సినిమాల్లో ఇది ఒకటి.

రచయిత గురించి తను చాలా రెటెరిక్ అనీ, ప్రీచీ అనీ, తన రెలిజియస్ బిలీఫ్స్ అన్నీ పాఠకుల మీద రుద్దాలని చూస్తాడనీ లాంటి అభియోగాలు కొన్ని ఉన్నాయి. వృత్తి పరంగా తను స్పోర్ట్స్ జర్నలిస్ట్ కావడం వలన తన రచనల్లో ఆ డ్రైనెస్ కనిపిస్తుందనేది కొద్దిమంది అభిప్రాయం. ఆయనకి అభిమానులూ ఎక్కువగానే ఉన్నారు. ఈ పుస్తకం నేను చదివిన ఇతని మొదటి పుస్తకం. తరువాత అతను వ్రాసిన దాదాపు అన్ని పుస్తకాలూ చదివాను. Mitch చాలా చక్కటి కథకుడు అనేది నా అభిప్రాయం. సరళమైన వచనం, చిన్న చిన్న వాక్యాల్లో ఎంతో భావాన్ని నింపగలిగే ప్రజ్ఞ, తక్కువ ఆసక్తి కలిగించే సంఘటనలు కూడా వదలకుండా చదివివించే కథనం (ఉదా: For one more day) అతని సొంతం. ప్రతీ కథలోనూ దేవుడూ, స్వర్గం అనే కాన్సెప్ట్ నీ , జీవితం, ప్రేమ, బంధాలు అనే కాన్సెప్ట్స్ వాడుకున్నట్టుగానే వాడతారు. అరుదుగా కొన్ని బైబిల్ వాక్యాలు వాడుకున్నా, అవి ప్రత్యేకంగా ఒక రెలిజియన్ కి ఉద్దేశించినవిగా అనిపించకపోవడం, కథనంలో చక్కగా ఒదిగిపోవడం నాకు నచ్చిన విషయం. నావరకూ అది ఏ మాత్రమూ అభ్యంతరకరంగా అనిపించలేదు. ప్రతీ కథలోనూ అంతర్లీనంగా ఆయన తెలియచేసే 'No soul remembered is ever truly gone.' అనే సందేశం నాకు చాలా నచ్చుతుంది. ఆయన రచనల్లో అంతర్లీనంగా కొంచెం తాత్విక ధోరణి కూడా కనిపిస్తుంది. కానీ అది మానవసంబంధాల పట్ల విముఖతను పెంచే దిశలో కాకుండా, వాటి ప్రాముఖ్యతనీ, అవసరాన్నీ బలబరిచే విధంగా ఉండటం గమనించాల్సిన విషయం.



రచయిత గురించి: Mitch Albom వృత్తిపరంగా ఫ్రీలాన్స్ స్పోర్ట్స్ జర్నలిస్ట్. ప్రవృత్తి రచన, స్క్రీన్ ప్లే రచన, రేడియో & టీవీ ప్రోగ్రామ్స్ ప్రసారాలు, పాటలు వ్రాసి సంగీతం కూర్చడం, అన్నిటినీ మించి సంఘసేవ. ఆయన మొదటి రచన 'Tuesdays with Morrie' అనే మెమోయిర్ (స్మృతి సంస్మరణ) చాలా పేరు పొందిన రచన. ఆయన వ్రాసిన ఫిక్షన్ నవలలు కూడా దాదాపు నలభై భాషల్లోకి అనువదించబడి మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి. వాటిలో Five People you meet in Heaven, For One more day, The Time Keeper అనేవి ముఖ్యమైనవి. కొద్ది నెలల క్రితమే విడుదలయిన ఆయన క్రొత్త పుస్తకం First Phone Call from Heaven కూడా అభిమానుల అంచనాను నిలబెట్టుకుంది. కొన్ని సేవాసంస్థలు ద్వారా ఛారిటీ పనులు కూడా విరివిగా చేస్తున్నారు. ఆ వివరాలు ఆయన వెబ్ సైట్లో చూడవచ్చు.

(Pictures Source: Internet)



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# ప్రియసఖి

Snow Flower and the Secret Fan by Lisa See

ఆడపిల్ల పుట్టినింట కూడా ఎప్పుడూ ‘ఆడ’పిల్ల గానే పెరుగుతుంది. మెట్టినిల్లు ఎంత సౌకర్యంగా ఉన్నా, పరాయితనపు పరదా ఒకటి కనిపించని మేలిముసుగులా జీరాడుతూనే ఉంటుంది. అదేగనక ఏమాత్రమూ అనుకూలత లేని చోటైతే చెప్పనే అక్కర్లేదు. ఒకసారి గడప దాటాక పుట్టిల్లూ పరాయిదే. వెతలు చెప్పుకోవాలంటే ఏవో రకరకాల భావాలు అడ్డుపడుతూనే ఉంటాయి. ‘ఆడా’ కాక ‘ఈడా’ కాక, కష్టసుఖాలు చెప్పుకుని సేదదీరడానికి తోడులేక ,ఒంటరితనంతో అల్లాడిపోయే మనసులెన్నో. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుంటానేమో అక్క చెల్లెళ్ళను ఒకే కుటుంబంలోని అన్నదమ్ములకు చెయ్యటం, కుండమార్పిళ్ళూ చేసేవారనుకుంటాను. జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొని నిలదొక్కుకుంటున్నపుడు కాస్త ధైర్యం, విషాదంతో క్రుంగిపోయినపుడు కొంచెం ఆశనీ, సంతోషంతో మనసు పరవళ్ళు తొక్కేటప్పుడు కాసిని ఆనందభాష్పాలనూ పంచుకోగలిగే తోడుంటే కొండంత ఆసరా.




Lisa See వ్రాసిన Snow Flower and the Secret Fan, బాల్యం నుంచీ కలిసి పెరిగి, కలిసి కలలు కని, జీవితాంతం విడిపోమనీ, కష్టసుఖాల్లోనూ ఆనందవిషాదాల్లోనూ ఎల్లప్పుడూ ఒకరికొకరు తోడుగా ఉంటామనీ ప్రమాణాలు చేసుకున్న ఇద్దరు స్నేహితురాళ్ళ కథ. చిన్న అపార్థంతో స్నేహాన్ని దూరం చేసుకున్న ఓ మూర్ఖురాలి కథ. వేరొకరి తొందరిపాటుతనానికీ మూర్ఖత్వానికీ బలయి కడవరకూ వేదన అనుభవించిన ఒక అమాయకురాలి కథ. చైనా లోని ఒక ప్రాంతపు పురాతన సంప్రదాయాలూ, ఆచార వ్యవహారాలూ కలగలిపి ఇద్దరు స్త్రీల మధ్య ఓ అరుదైన స్నేహబంధాన్ని చిత్రించిన కథ.

లిలీ అనే ఆమె తన డెబ్బయవ ఏట జరిగిన కథని గుర్తుకు చేసుకున్నట్టుగా మొదలవుతుంది. తన స్నేహితురాలికి సంబంధించిన వస్తువులన్నీ ముందుపెట్టుకుని చూసుకుంటూ,

జరిగినవాటిని పశ్చాతాపంతో తలుచుకుంటూ ఉంటుంది.

కథా కాలం పందొమ్మిదో శతాబ్దం మొదలు. చైనా లోని హూనాన్ ప్రాంతం. కథ లోకి వెళ్ళే ముందు అక్కడి కొన్ని ముఖ్యమైన ఆచారాలు తెలుసుకుంటే కథలో వాటి ప్రాముఖ్యత అర్థం అవుతుంది. కుటుంబంలో ఇంటి పెద్ద, తన తరువాత పెద్దకొడుకులది అధికారం. ఇంటి నిర్వహణకి అత్తగారు, తరువాత ఇంటి పెద్దకోడలు హక్కుదార్లు. ఇంటికి సంబంధించిన నిర్ణయాలన్నీ వీళ్ళవే. మిగిలిన అందరూ వీళ్ళు చెప్పినట్టే వినాల్సిందే. మగవారు పొలం పనులు, బయట పనులు చూసుకుంటే, ఆడవారు ఇంటిపనులు చూసుకుని , మిగిలిన ఖాళీ సమయంలో వారికి ప్రత్యేకంగా కేటాయించిన గదిలో (ఇది ఎక్కువగా పై అంతస్తులో ఉంటుంది. అక్కడికి ఎదిగిన మగపిల్లలకూ, మగవారికీ ప్రవేశం ఉండదు) కుట్లూ అల్లికలూ చేసుకుంటూ కాలం గడుపుతారు. వారికి గడపదాటి బయటకి వెళ్ళే అవసరం సాధారణంగా ఉండదు. ఆడపిల్లలు కూడా ఆరేళ్ళు దాటాక ఇళ్ళు దాటి బయటకు వెళ్లరు. ఇంట్లోని ఆడవారితో కలిసి ఇంటి పనులూ, కుట్లూ అల్లికలూ నేర్చుకుంటూ, సంప్రదాయాలూ ఆచారాలూ తెలుసుకుంటూ, ఆడవారికి మాత్రమే తెలిసిన NuShu అనే ఒక రహస్యమయిన భాషను వ్రాయడం చదవం నేర్చుకుంటూ కాలం గడుపుతారు. పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళాక కష్టసుఖాలు తల్లికో, అక్క చెల్లెళ్ళకో, స్నేహితురాళ్ళకో చెప్పుకోవాలంటే, ఎవరికీ తెలీకుండా ఈ భాషలోనే ఉత్తరాలు వ్రాసుకునేవారట.

ఆడపిల్లలకు చిన్నప్పుడే ఫుట్ బైండింగ్ అని చేస్తారు. వారి శరీరం ఇంకా ఎదుగుతూ లేతగా ఉన్న సమయంలోనే, పాదాలకు గుడ్డలతో గట్టిగా బిగించి కట్లు కడతారు. దానివల్ల రక్తప్రసరణ ఆగిపోయి, ఒరిపిడికి చర్మం ఒరుసుకు పోయి పుండు పడిపోతుంది. రోజూ ఆ కట్టు విప్పి వేడి నీళ్ళతో కడిగి, ఇన్ఫెక్షన్ రాకుండా మూలికలతో చేసిన మందు రాసి మళ్ళీ కట్టు కట్టేస్తారు. కొన్నాళ్ళకు ఆ కట్టు ఒత్తిడికి లేత ఎముకలు విరిగిపోతాయి. అపుడు ఆ ఎముకలను పైకి తోసి ఇంకా పాదం మడిచి కడతారు. దానితో పాదాలు చిన్నగా, పొడుగు పెరక్కుండా కలువ మొగ్గల్లా (Lily feet ) ఉంటాయన్నమాట. ఇదంతా కొన్ని నెలలు ఒక్కోసారి సంవత్సరాల ప్రహసనం. ప్రసవవేదనకు మించిన నొప్పితో కూడినదట ఇది. ఒక్కోసారి ఇన్ఫెక్షన్ వచ్చి ప్రాణాలుకూడా పోతాయిట. సరిగా చెయ్యకపోతే వికటించి వంకర పాదాలు మిగిలిపోతాయి. అమ్మాయి పాదాలు ఎంత చిన్నవిగా ఉంటే ఆ అమ్మాయి పెళ్ళికి అంత అర్హురాలు అని వారి నమ్ముతారు. అంత నొప్పినీ తట్టుకుని పాదాలు అందంగా చేసుకున్న అమ్మాయికి, ఎక్కువ మంది కొడుకులని కనే సహనమూ ఓర్పూ ఉంటుందని నమ్మకమట. మనకి అమ్మాయిలని పెళ్ళికి ముందు వంటా వార్పూ నేర్చుకోకపోతే, తల్లి పెంపకం అలాంటిది అంటారే, అలా కలువ పాదాలు లేని పిల్లల ద్వారా తల్లి చేతకానితనం కనిపిస్తుందన్నమాట. అందమైన చిన్న పాదాలున్న అమ్మాయిలను ఆస్తి లేకపోయినా, ఏరి కోరి ఇంటికి పెద్ద కోడళ్ళుగా చేసుకుంటారు. పెద్ద పాదాలున్న వాళ్ళు పేదింటి కోడళ్ళు గానో, లేదా చిన్న కోడళ్ళు గానూ, పెళ్ళి కాకుండానూ మిగిలిపోతారు.

ఆడపిల్లలకి చిన్నతనంలోనే మధ్యవర్తుల ద్వారా పెళ్లి మాటలు మాట్లాడుకుని సంబంధం కుదుర్చుకుంటారు. అమ్మాయిలకు పదిహేను లేదా పదహారేళ్ళు వచ్చాక పెళ్ళి చేస్తారు. పెళ్ళి అయిన తరువాత కూడా అమ్మాయిలు అత్తవారింటికి కేవలం

చుట్టపు చూపుగా మాత్రమే వెళ్ళి కొన్ని రోజులు ఉండి వస్తూ ఉంటారు. మొదటి సంతానం కలిగాక మాత్రమే పూర్తిగా పుట్టిల్లి వదిలి మెట్టింటికి వెళ్లడం. అపుడు కూడా వారికి కలిగిన సంతానం మీద ఆధారపడే ఆ ఇంటిలో వారి స్థానం ఉంటుంది. స్త్రీకి కొడుకులని కనడమే తప్ప వేరే ప్రయోజనం లేదు అనేది వారి నమ్మకం. ఎంత మంది కొడుకులని కంటే అంత విలువ. కొడుకులు లేని స్త్రీ పరిస్థితి పనిమనిషి కన్నా అధ్వాన్నం. అత్తగారికీ, కొడుకులని కన్న మిగిలిన కోడళ్ళకూ చాకిరీ చేస్తూ బ్రతకాల్సిందే. ఒకవేళ స్త్రీ వయసులో ఉండగానే భర్త చనిపోతే వేరే కుటుంబానికి చిన్న కోడలుగా తనని అమ్మేస్తారు. (అంటే అక్కడ అందరికీ సేవ చేస్తూ, మగవారి వారి కోరికలు తీరుస్తూ గడపాలన్నమాట .)

ఇంకో ముఖ్యమయిన ఆచారం... కథకు అతి ముఖ్యమైనదీ...ఒక్కొక్క దశలోనూ స్త్రీలు అదే దశలో ఉన్న అదే వూరిలోని ఆడవారితో కలిసి చిన్న బృందాలని ఏర్పాటు చేసుకుంటారు. స్వోర్న సిస్టర్స్ (sworn sisters / laoTangs) అంటారు. పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలు కొందరు కలిసి ఒక బృందంగా ఏర్పడతారు. వీరు చిన్నప్పటి నుంచీ కలిసి కుట్లూ అల్లికలూ నేర్చుకోవడం, కట్నంగా తీసుకెళ్ళాల్సిన వస్త్రాలూ, కానుకలూ కలిసి చేసుకోవడం, ఒక్కొక్కరి పెళ్ళి అవుతున్నప్పుడు మిగిలినవారు దగ్గరుండి ఆ వేడుకలు జరిపించడం, అత్తవారింటికి వీడ్కోలు గీతాలు పాడుతూ సాగనంపడం చేస్తారు. ఆ బృందంలో అందరికీ పెళ్ళి అయిపోగానే, దాని అవసరం తీరిపోతుంది. వాళ్ళు వేరే వేరే వూళ్ళకు పెళ్ళయి వెళ్ళడంతో, వాళ్ళు మళ్ళీ ఎప్పుడూ కలిసే అవకాశం దాదాపు ఉండదు. అమ్మాయికి పెళ్ళి అయ్యాక అత్తగారి వూరిలో ఉన్న బృందంలో కలిసి, అందరూ ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు. భర్తను కోల్పోయిన స్త్రీలు, ఇతర ఒంటరి స్త్రీలతో కలుస్తారు. వారందరూ చనిపోయేవరకూ ఒకటిగా ఉంటారు. వీటన్నిటికీ భిన్నమయినది ఇంకో బంధం ఉంది. అది laotong లేదా old sames అనేది. ఒకే సంవత్సరం, ఒకే నెల, ఒకే రోజు పుట్టి, చైనీస్ కేలండర్ ప్రకారం జాతకంలో మొత్తం ఎనిమిది లక్షణాలూ కలిసిన ఇద్దరూ అమ్మాయిలను (వేరే ఊరివారయినా సరే) Loatongs గా కలుపుతారు. ఇద్దరూ గుడికి కలిసి వెళ్ళి, ఆ దేవత ముందు 'జీవితాంతం ఇద్దరూ ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుగా ఉంటామనీ, ఎన్ని కష్టాలు వచ్చినా ఆ బంధం తెగిపోనివ్వమనీ' ప్రమాణం చేసి, కాంట్రాక్ట్ రాసుకుంటారు. ఎవరైనా సరే ఆ బంధాన్ని గౌరవించాల్సిందే. వారు కలవడానికి అత్తింటివారు కూడా అడ్డు చెప్పటానికి ఉండదు. Loatong బంధాన్ని పెళ్ళి కన్నా కూడా పవిత్రమైన బంధంగా భావిస్తారు.

కథ 1820 -30 మధ్యలో మొదలవుతుంది. Puwei, Tongkou చైనా లోని రెండు చిన్న గ్రామాలు. ఊరిలో దాదాపు అందరూ భూస్వాముల దగ్గర భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండించుకుని బ్రతుకుతుంటారు. Puwei లో ఒక చిన్న రైతు కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములున్నారు. ఇద్దరూ చక్కగా పొలం పనులు చూసుకుంటూ, తమ్ముడు అన్నగారి మాట దాటకుండా ఉంటాడు. పెద్దాయనకు ఒక కొడుకు (వయసు 14), ముగ్గురు కూతుర్లూ (వయసు 9, 5, 4), ఆఖరున మళ్ళీ ఇంకో కొడుకు, పసి వాడు. మొత్తం ఐదుగురు పిల్లలు. మధ్యలో అమ్మాయి లిలీ, కథలో ఒక ముఖ్య పాత్ర. చిన్నాయనకు ఒక్కతే కూతురు. ఆమె పేరు బ్యూటిఫుల్ మూన్, లిలీ కన్నా కొన్నినెలలు మాత్రమే చిన్నది. చిన్నాన్న పిన్నీ ఇద్దరూ ఆనందంగా జీవితం గడిపే జంట. ఇద్దరూ పిల్లల్ని ఆప్యాయంగా చూసుకుంటారు.

లిలీకి ఆరేళ్ళు ఉండగా, తనకీ, పిన్ని కూతురికీ ఫుట్ బైండింగ్ కోసమని మంచి ముహూర్తం చూడమని జ్యోతిష్కుడిని అడుగుతారు. అతను లిలీ జాతకం చూసి, ఈ అమ్మాయిది అద్భుతమైన జాతకం, మహారాణీ యోగం అని చెప్పి, మధ్యవర్తిని తీసుకుని మళ్ళీ వస్తాను అని చెపుతాడు. మరునాడు వారి ఇంటికి ప్రక్క వూరు Tangkou నుండి ఒక మధ్యవర్తి 'మేడం వాంగ్' వస్తుంది. లిలీ మొహంలో చాలా శుభలక్షణాలున్నాయనీ,, పాదాలు కూడా జాగ్రత్తగా బైండ్ చేస్తే అద్భుతమైన అందమైన పాదాలుగా తయారవుతాయనీ, అది శుభమనీ చెప్పి, ఆమెకి Tangkou లోని సంపన్నకుటుంబానికి కోడలిగా వెళ్ళగలిగే అవకాశం వస్తుందనీ, దానితో చిన్నాన్న కూతురు బ్యూటిఫుల్ మూన్ కి కూడా అదే వూర్లో మంచి సంబంధం కుదిరి, అక్క చెల్లెళ్ళు ఇద్దరూ ఒకే వూర్లో దగ్గరగా ఉండటానికి చాలా అవకాశాలు ఉన్నాయనీ చెపుతుంది. లిలీకి సంబంధం చూసే బాధ్యత తనకి వదిలిపెట్టమని చెపుతుంది. లిలీకి, తన చెల్లెలికీ, బ్యూటిఫుల్ మూన్ కీ మంచి ముహూర్తం చూసి ఒకేసారి ఫుట్ బైండింగ్ మొదలుపెడతారు. మధ్య మధ్య మేడమ్ వాంగ్ వచ్చి లిలీ పాదాలు ఎలా చిన్నగా వస్తున్నాయో చూసి వెళుతూ ఉంటుంది. ఆ క్రమంలో లిలీ చెల్లెలికి కాళ్ళకు ఇన్ఫెక్షన్ వచ్చి చనిపోతుంది. మిగిలిన ఇద్దరూ కష్టపడి ఆ బాధను తట్టుకుంటారు. తరువాత కొన్ని నెలలు గడుస్తాయి.

లిలీకి ఏడేళ్ళ వయసున్నప్పుడు మేడమ్ వాంగ్ వచ్చి, Tangkou లోని భూస్వాములైన Lu కుటుంబానికి పెద్దకోడలిగా లిలీకి సంబంధం కుదిరే అవకాశం ఉందనీ, అదే వూళ్ళో ఒక సాంప్రదాయ, సంపన్నుల కుటుంబంలో స్నో ఫ్లవర్ అనే అమ్మాయి ఉందనీ, తనకీ లిలీకి laotongs కావటానికి అవసరమైన ఎనిమిది లక్షణాలూ కలిసాయనీ ఆమె చెపుతుంది. ఆ laotong సంబంధం వలన లిలీ విలువ పెరిగి పెళ్ళి కుదరటం ఇంకా సులభమవుతుందని చెపుతుంది. మొదట సందేహించినా, అంత మంచి కుటుంబంతో సంబంధం వలన తమ కుటుంబానికి గౌరవం పెరిగి, ఇద్దరూ ఆడపిల్లల బ్రతుకులూ బావుంటాయని ఆలోచించి లిలీ తల్లిదండ్రులు ఒప్పుకుంటారు. మంచిరోజు చూసి ఇద్దరూ పిల్లలనీ గుడికి తీసుకువెళ్ళి కాంట్రాక్ట్ రాయిస్తాను అని చెప్పి లిలీకి స్నో ఫ్లవర్ పంపిన సందేశాన్ని ఇస్తుంది. సిల్క్ తో చేసిన ఒక విసనకర్ర మీద మొదటి మడతమీద ' మీ ఇంటిలో మర్యాదా మన్ననా తెలిసిన ఒక చక్కని అమ్మాయి ఉందని తెలిసింది. మనిద్దరం ఒకేరోజు పుట్టాము. మనిద్దరం జీవితాంతం స్నేహితులుగా ఉందామా?' అని ఎంతో పొందికగా Nu Shu లో వ్రాసి, చిన్న పువ్వులు అందంగా కుట్టి ఉన్నాయి. అప్పటికి పిల్లలకి ఎవరికీ పూర్తిగా ఆ భాష చదవటం రాదు. లిలీ తన పిన్ని సహాయంతో అది చదివి, తిరిగి దాని మీద 'నేను నీకన్నా తక్కువ అంతస్తుకి చెందిన దాన్ని. అయినా మనిద్దరినీ ఆ దేవుడే కలుపుతున్నాడు అని నమ్ముతున్నాను. మనం ఎప్పటికీ ఒకరికొకరుగా కలిసి ఉందాం.' అని జవాబు వ్రాసి పంపిస్తుంది.

ఒక మంచి రోజున మేడమ్ వాంగ్, స్నో ఫ్లవర్ని తీసుకుని తన పల్లకీలో వచ్చి లిలీని కూడా ఎక్కించుకుని, పక్క వూరిలో గుడికి తీసుకు వెళుతుంది. ముట్టుకుంటే మాసిపోతుందేమో అనిపించే బంగారు రంగుతో, పాలబుగ్గలతో అందంగా చలాకీగా ఉన్న స్నో ఫ్లవర్ని చూసి లిలీకి ఎంతో ఇష్టం కలిగింది. స్నో ఫ్లవర్ ప్రతీ కదలికలోనూ, ప్రతీ మాటలోనూ, కాంటాక్ట్ రాసుకోవటానికి అందమయిన పేపర్ మంచి అర్థమున్న వాక్యాలూ ఎన్నుకోవటంలోనూ ఆమె చూపిన అభిరుచి, ఆమె పుట్టి పెరిగిన సంస్కారవంతమయిన కుటుంబ నేపథ్య ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అయినా కూడా లిలీని చిన్నబుచ్చుకుండా, ఎంతో ప్రేమగా ప్రవర్తిస్తుంది. అక్కడనుండి ఇద్దరూ

ఆ సిల్క్ ఫేన్ మీద ఉత్తరాలు రాసుకుంటూ ఉంటారు. అప్పుడప్పుడూ స్నో ఫ్లవర్ లిలీ ఇంటికి వచ్చి కొన్నిరోజులు గడిపి వెళుతుంటుంది. అపుడంతా ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ క్విల్ట్స్ అల్లుకుంటూ, కలిసి ఇంటి పనులు నేర్చుకుంటూ ఉంటారు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎపుడూ స్నో ఫ్లవర్ తమ ఇంటికి రావటమే కానీ, లిలీని ఎప్పుడూ వాళ్ళు రమ్మని పిలవరేం అని అడిగిన లిలీ తల్లిని, 'వారిది సంపన్నకుటుంబం. అక్కడ లిలీ ఇమడలేదు. స్నో ఫ్లవర్ని ఇక్కడికి పంపడానికి ఒప్పుకున్నారు సంతోషించు. ఈ సంబంధం వలన లాభం మీకే గానీ వారికి కాదు' అని చెప్పి మేడం వాంగ్ మాట్లాడకుండా చేస్తుంది.

అలా సంవత్సరాలు గడుస్తున్నాయి. స్నో ఫ్లవర్ రాకపోకలు సాగుతూనే ఉన్నాయి. లిలీ ఇంట్లో అందరికీ తనంటే ఎంతో ఇష్టం. తను కూడా అంతే మర్యాదగానూ, ఆప్యాయంగానూ ఉండేది అందరితో. లిలీకి అయితే చెప్పనక్కర్లేదు. అంత మంచి సంస్కారం, ప్రవర్తనా, తనంటే విపరీతమయిన ప్రేమా ఉన్న స్నో ఫ్లవర్ తో అనుబంధం చాలా ప్రత్యేకమయినది, ఆమె తనకొక్కదానికే స్నేహితురాలు అని తలుచుకోవటమే చాలా గర్వంగా ఉంటుంది. లిలీ అక్కకు పెళ్ళయి వెళ్ళిపోయింది. అన్నకు కూడా పెళ్ళయింది. లిలీకి Lu ఫేమిలీ లోని పెద్ద కొడుకుతో పెళ్ళి కుదిరింది. వాళ్ళు వధువుకూ కుటుంబానికీ పంపాల్సిన కానుకలు పంపారు. వాటితో తనకి బట్టలూ బొంతలూ, భర్తకూ బంధువులకూ కానుకలో తయారు చేసుకుంటోంది. స్నో ఫ్లవర్ వచ్చినపుడల్లా లిలీకి కాబోయే అత్తవారి కుటుంబం గురించి కబుర్లు చెపుతూనే ఉంది. పదునాలుగేళ్ళ వయసులో ఉన్నప్పుడు బ్యూటిఫుల్ మూన్ విషపు తేనెటీగ కాటుకు గురయి చనిపోయింది. అప్పటి నుంచీ చిన్నాన్న పిన్నీ చైతన్యం కోల్పోయి యాంత్రికంగా బ్రతుకుతూ ఉంటారు. లిలీకి పదహారేళ్ళు వచ్చాక పెళ్ళి అవుతుంది. లిలీకి తన పెళ్ళి అనేదాని కన్నా, తను ఆ వూరు వెళ్ళినపుడు స్నో ఫ్లవర్ ఇంటికి వెళ్ళి, తన ఇంట్లో అందరినీ చూడొచ్చు అని ఎక్కువ ఉత్సాహం కలుగుతుంది.

పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిన లిలీకి, అక్కడ జరిగే ముఖ్యమయిన వేడుకలో తన Laotong గా ప్రత్యేక హోదాలో రావాల్సిన స్నో ఫ్లవర్, అదే వూర్లో ఉండి కూడా రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇంకో నెల రోజుల్లో స్నో ఫ్లవర్ పెళ్ళి జరగాల్సి ఉంది. మూడురోజుల వేడుకల తర్వాత పుట్టింటికి తిరిగి వెళ్ళేటప్పుడు పల్లకీని స్నో ఫ్లవర్ ఇంటికి తీసుకెళ్ళమని చెపుతుంది. స్నో ఫ్లవర్ ఇల్లు ఒక పెద్ద భవంతి. ఇల్లు కొంచెం పాతబడినప్పటికీ దానికున్న కిటికీలూ అద్దాలూ చాలా కళాత్మకంగా ఉండి, ఆ ఇంటి ఒకప్పటి వైభవాన్ని తెలియచేస్తుంటాయి. లోపలికి వెళ్ళి చూస్తే ఇల్లంతా ఖాళీగా, చీకటిగా, అదోరకమైన కంపు కొడుతూ, పరిసరాలన్నీ చీదరగా దరిద్రంతో నిండి ఉన్నాయి. ఆశ్చర్యంతో చూస్తున్న లిలీకి, అతుకుల బట్టలు వేసుకుని ఉన్న స్నో ఫ్లవర్, ఆమె తల్లి కనిపిస్తారు. లిలీని మేడ మీదకి తీసుకువెళ్ళి కూర్చోబెట్టి స్నో ఫ్లవర్ తన కథ చెపుతుంది. స్నో ఫ్లవర్ ముత్తాత చక్రవర్తి ఆస్థానంలో పేరుపొందిన విద్వాంసుడు. ఒకపుడు సిరి సంపదలతో ఉండేవారు. స్నో ఫ్లవర్ తల్లి కూడా మంచి కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. స్నో ఫ్లవర్ నాన్న హయాం లోకి వచ్చేసరికి, ఆయన గొప్పలకు పోయి స్వంత చెల్లెళ్ళు, సవతి చెల్లెళ్ళు కలిపి మొత్తం తొమ్మిదిమందికి ఘనంగా పెళ్ళి చెయ్యడం కోసం ఉన్న పొలాలు అమ్మి, ఇంకా అప్పులు చేసీ ఆస్థి మొత్తం అవగొట్టాడు. తరువాత మత్తుమందుకి అలవాటై, ఇంట్లో ఉన్న ఖరీదయిన సామనులన్నీ అమ్మేసి, అందంగా ఉండే స్నో ఫ్లవర్ని కూడా ఎవరికో అమ్మేయ్యాలని చూసాడు. మేడం వాంగ్ స్నో ఫ్లవర్ తల్లికి సోదరి.

ఆమె ఈ ఇంటి విషయాలు తెలుసుకుని, కలుగచేసుకుని స్నో ఫ్లవర్ అక్కకి ఒక సంబంధం చూసి పెళ్లి చేసి పంపేసి, అన్నలని ఎక్కడో పొలాల్లో పనికి కుదిర్చింది. చిన్నదైన స్నో ఫ్లవర్ ని కూడా కాస్త మంచి ఇంట్లో పెళ్లి చేయాలని ఆలోచించింది. ఈలోగా లిలీ గురించి తెలిసి ఆమెతో బంధం కుదిరిస్తే, దాని ద్వారా స్నోఫ్లవర్ కి మంచి జరగొచ్చు అని తలిచి ఆప్లాన్ వేసింది. స్నో ఫ్లవర్ ఈ విషయాలన్నీ లిలీ దగ్గర దాచినందుకు సిగ్గుతో, అపరాధభావంతో బాధపడుతుంది. తనకి ఆ సంగతులు ఎందుకు చెప్పలేదూ అని లిలీ అడిగితే, 'మీ ఇంట్లో పెద్ద వాళ్ళందరికీ తెలుసు. నన్ను ఎవరూ చెప్పనివ్వలేదు. తెలిసినపుడే తెలుస్తుందని ఆపేసారు' అని చెపుతుంది. తనకి నిజం చెప్పకుండా మోసం చేసినందుకు మేడం వాంగ్ మీదా, తన ఇంట్లో వాళ్ళ మీదా విపరీతమైన కోపం వస్తుంది, కానీ విచిత్రంగా స్నో ఫ్లవర్ మీదా కోపం రాదు సరి కదా, ఇంకా ఎక్కువ ప్రేమ కలుగుతుంది. తన కొత్త పరపతి ఉపయోగించి ఏర్పాట్లు చేసి, దగ్గరుండి స్నో ఫ్లవర్ పెళ్లి వేడుకగా జరిపించి, అపుడు తన పుట్టింటికి వెళుతుంది.

ఇంటికి వెళ్ళిన లిలీకి ఇంట్లో అందరి మీదా, ముఖ్యంగా తల్లి మీద విపరీతమయిన కోపం, తనని ఇన్నేళ్ళు మోసం చేసారని. ఎవరితోనూ మాట్లాడకుండా నిరసన చూపిస్తుంది. 'మీరందరూ నన్నెందుకు మోసం చేసారు, ఎప్పటికైనా నాకు నిజం తెలీదనుకున్నారా?' అని తల్లిని నిలదీస్తుంది. తల్లి తామందరూ స్నో ఫ్లవర్ మీద ఇష్టంతోనూ అభిమానంతోనూ చెప్పలేదనీ, అయినా ఇపుడు స్నో ఫ్లవర్ విషయంలో నిజమేదయినా లిలీ అభిమానం ఎందుకు మారాలనీ అడుగుతుంది. పైగా మీ మంచి కోసమే ఇవన్నీ చేసాము, నువ్వూ నీ కజినూ మంచి సంబంధాలు చేసుకుంటే పరిస్థితి బావుంటుందని అని చెపుతుంది. తను గొప్పింటి కోడలయితే తన ద్వారా ఈ ఇంటి పరిస్థితులు చక్కబడతాయనే స్వార్ధం తల్లిది అని అపార్ధం చేసుకుని, 'నాకు చేతనయినంత సహాయం చేస్తాను, కానీ నిన్ను మాత్రం క్షమించను' అని చెపుతుంది. లిలీ దురుసుతనానికి మూర్ఖత్వానికి బాధపడి తల్లి కూడా లిలీని కోపంతో తిట్టి వెళ్ళిపోతుంది. అది మొదలు తల్లీ కూతుర్ల మధ్య సంబంధం తెగిపోయి నామమాత్రంగానే ఉండిపోతుంది.

స్నో ఫ్లవర్ భర్తది కసాయి వృత్తి. మనుషులూ ఇంటి పరిసరాలూ కూడా చాలా అపరిశుభ్రంగా ఉంటాయి. అత్తగారు గయ్యాళి. కోడలిని నానా పాట్లు పెట్టి సాధిస్తూ ఉంటుంది ఎపుడూ. భర్తకు ఆమె అంటే కొంచెం ఇష్టం ఉన్నా, దేనికి కోపం వచ్చినా భార్యని బాదుతూ ఉంటాడు. స్నో ఫ్లవర్ మౌనంగా ఓపికగా అన్నీ భరిస్తూ, ఇంటెడు చాకిరీ చేస్తూ కష్టపడుతూ ఉంటుంది. పెళ్లి చేసుకుని పుట్టింటి కష్టాల నుండి దూరం కావాలనుకుంటుంది కానీ ఆ ఆశ తీరదు. స్నో ఫ్లవర్ పెళ్లి అవగానే ఆమె తల్లిదండ్రులు ఇల్లు కూడా అప్పుల వాళ్ళకి వదిలేసి ఊరిడిచి కట్టుబట్టలతో ఎక్కడికో పోతారు. లిలీకి, స్నో ఫ్లవర్ కీ మొదట సంతానంగా మగపిల్లలు పుడతారు. ఇద్దరూ పిల్లలతో అత్తవారింటికి కాపురానికి వచ్చేస్తారు. లిలీ అత్తగారు స్నో ఫ్లవర్ కుటుంబ వాతావరణం చూసి, ఆమెతో ఇక స్నేహం తమ అంతస్తుకి తగినది కాదనీ, అక్కడితో ఆపేసి ఇక కలుసుకోవద్దనీ చెపుతుంది. కానీ లిలీ ఇంట్లోని పదేళ్ళ దాసీ పిల్ల సహాయంతో ఇద్దరూ ఉత్తరాలు రాసుకుంటూ ఉంటారు. ఇద్దరి జీవితాల్లోని ముఖ్యమైన సంఘటనలన్నీ ఇద్దరూ సిల్క్ ఫేన్ మీద రాసుకుంటారు. ప్రతీ ఏడాది పండగలకు లిలీ పుట్టింటికి వెళ్ళినపుడు, స్నో ఫ్లవర్ కూడా అక్కడకు వెళ్లడం, ఇద్దరూ సంతోషంగా కొన్ని రోజులు గడపటం, తమ కాపురాల గురించి చెప్పుకోడం చేస్తుంటారు.

ఒక పదేళ్ళ కాలం గడిచింది. ఈ సమయంలో లిలీకి వరుసగా ముగ్గురు కొడుకులూ, ఒక కూతురూ కలుగుతారు. స్నో ఫ్లవర్ కి ముగ్గురు ఆడపిల్లలు పురిటిలోనే పోగా ఇద్దరు కొడుకులు, ఒక కూతురూ మిగులుతారు. ఆమె కష్టాలు, అత్తగారి ఆరళ్ళు రోజు రోజుకీ పెరుగుతూనే ఉంటాయి. చైనాలో ఎంపరర్ పోయిన తరువాత కరవుకాలం వస్తుంది. అపుడు భూస్వాములు శిస్తులు పెంచితే, అవి కట్టలేక వాటిని వ్యతిరేకిస్తూ రెబెలియన టీమ్స్ తయారవుతాయి. ఆదాయం లేక Lu ఫేమిలీ ఆస్తులన్నీ కరిగిపోతాయి. భర్త దూరవ్యాపారానికి వెళతాడు. మొత్తం జిల్లాలో అంతా టైఫాయిడ్ వ్యాధి వచ్చి వూరిలో చాలామంది చనిపోతారు. లిలీ తల్లి, తండ్రి , అత్తగారూ, మావగారూ, ఒక మరిది కుటుంబం మొత్తం ఆ వ్యాధితోనే చనిపోతారు. చాలా నెలలు ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా ఉంటారు. నెమ్మదిగా తేరుకునే సరికి లిలీ భర్త తిరిగి వస్తాడు. లిలీ భర్త Master Lu, లిలీ Lady Lu (జమీందారు, జమీందారిణి) అవుతారు. ఊరంతా వారిని గౌరవిస్తుంటుంది.

స్నో ఫ్లవర్ లిలీకి ఒక ఉత్తరం పంపుతుంది. 'టైఫాయిడ్ నుండి తాము క్షేమంగానే బయట పడ్డామనీ, మీరెలా ఉన్నారనీ అడుగుతూ, ఒక్కసారి మా ఇంటికి రాకూడదూ, మనం కలిసి గడిపి ఎంతో కాలమయ్యింది' అని అడుగుతుంది. స్నో ఫ్లవర్ ఇంటికి వెళ్ళాలనుకుంటే భర్త అడ్డు చెపుతాడు, అక్కడ ఆమెకు రక్షణ ఉండదనీనూ, పిల్లలు చిన్నవాళ్ళు కాబట్టి ఇంట్లోనే ఉండమనీ ఏవేవో అభ్యంతరాలు చెప్పినా ఎలాగో ఒప్పించి ఓ మూడు రోజులకనీ వెళుతుంది. లిలీని చూసి స్నో ఫ్లవర్ ఎంతో సంతోషిస్తుంది. లిలీ కూడా ఆమెనీ పిల్లలనీ చూసి సంతోషించినా ఆ ఇంటినీ, వాతావరణాన్ని, స్నో ఫ్లవర్ భర్త వృత్తినీ మొరటుదనాన్ని, అత్త గయ్యాళితనాన్ని విపరీతంగా ఏవగించుకుంటుంది. తన జీవితం మెరుగుపడుతుంటే, స్నో ఫ్లవర్ జీవితం ఇంకా అలా తక్కువ స్థితిలోకి జారిపోయినందుకు జాలి పడుతుంది. స్నో ఫ్లవర్ కి మాత్రం తను ఎంత వోపికగా పనిచేసుకుంటూ అందరికీ సేవలు చేస్తున్నా వారి అభిమానం లేనందుకు, పోయిన బిడ్డల గురించీ తప్ప ఇక వేరే బాధలేమీ ఉండవు. ఆ సమయంలో ఒకపక్క వూర్ల మీద రెబెలియన్స్ దాడిచేసి తగలబెడుతుంటారు, ఇంకో పక్క వారిని అణచడానికి సైన్యం కూడా వస్తోందనీ తెలుస్తుంది. ఒక రెండు రోజులు గడిచిన తర్వాత ఆ వూరుమీదకి కూడా రేబెలియన్స్ వచ్చి ఇళ్ళు తగలబెడుతుండటంతో అందరూ వూరోదిలి దూరంగా ఉన్న కొండల్లోకి పారిపోతారు. లిలీ తన భర్త తనకోసం వెదుకుతుంటాడని, తన ఊరు వెళ్ళిపోవాలని అనుకుంటుంది. కానీ దానికి సమయంలేదనీ, రెబెలియన్స్ వెళ్ళిపోగానే ఓ రెండురోజుల్లో మళ్ళీ వెనక్కి వచ్చేస్తాం అని కంగారు పెట్టడంతో స్నో ఫ్లవర్ కుటుంబంతో కలిసి కొండల్లోకి కట్టుబట్టలతో వెళ్ళాల్సి వస్తుంది. రెండురోజులు అనుకున్నది దాదాపు మూడునెలలు అక్కడే కొండల్లో ఉండిపోవాల్సి వస్తుంది. స్నో ఫ్లవర్ భర్త లిలీని తమ అతిథి అనీనూ, క్షేమంగా తీసుకెళ్ళి అప్పచెపితే ఆమె భర్త తనకి మంచి బహుమతి ఇస్తాడన్న ఆశతోనూ దొరికినంతలోనే ఆహారం ఇచ్చి బాగా చూస్తాడు. ఆ సమయంలో చలికీ ఆకలికీ తట్టుకోలేక అనేకమందితో పాటు స్నో ఫ్లవర్ చిన్నకొడుకు, ఐదేళ్ళవాడు కూడా చనిపోతాడు. చిన్నకొడుకంటే స్నో ఫ్లవర్ భర్తకి ప్రాణం. ఆ బాధలో పిచ్చెత్తినట్టయి కొడుకు శవాన్ని ఎక్కడికో తీసుకుపోయి, ఒంటరిగా తిరిగొచ్చిన అతనిని, కొడుకుని ఎక్కడ పూడ్చాడు అని అడిగిన స్నో ఫ్లవర్ ని గొడ్డుని బాదినట్టు బాదటంతో ఆమెకి గర్భస్రావం అవుతుంది. ఇన్ని విషాదాలు భరించలేని స్నో ఫ్లవర్ విరక్తిలో తన బాధలన్నీ లిలీతో చెప్పుకుంటుంది.

తనతో ఎప్పుడూ నిజాలు చెప్పలేదేమని కోప్పడి, laotong మధ్య రహస్యాలు ఉండకూడదు అని చెప్పి, తనతో ఎప్పుడూ నిజాలు చెప్పమని బలవంతపెడుతుంది.

అందరూ ఊర్లోకి తిరిగి వచ్చిన తరువాత లిలీ భర్త వచ్చి, స్నో ఫ్లవర్ భర్తకి కృతజ్ఞతలు చెప్పి అతనికి కానుకలిచ్చి, ఆమెని ఇంటికి తీసుకెళ్తాడు. ఆమెను జాగ్రత్తగా చూసుకున్నాడని తెలిసి వారి మీద అప్పటివరకూ ఉన్న అభ్యంతరాలన్నీ పోయి సదభిప్రాయం కలుగుతుంది. స్నో ఫ్లవర్ కొడుకుతో బాటూ ఆ వూర్లో మిగిలిన పిల్లలకి చదువు చెప్పించడానికి లిలీ ఒక టీచర్ని ఏర్పాటు చేస్తుంది. ఇద్దరూ కలుస్తున్నప్పుడల్లా ఆర్ధికంగా కూడా సహాయం చేస్తూనే ఉన్నారు. లిలీ స్నో ఫ్లవర్ ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళి ఉండటానికి కూడా ఎవరూ ఇక అభ్యంతరం చెప్పరు. ఇద్దరి కూతుర్లకూ laotongs కావడానికి అవసరమైనవేవీ కలవకపోయినాసరే, ఇద్దరికీ బంధం కలపాలనుకుంటారు. స్నో ఫ్లవర్ చిన్నకొడుకు పోవటం, పెద్దకొడుకు అర్భకుడు కావటం, ఇక కొడుకులు పుట్టకపోవటంతో అత్తగారి పెట్టే కష్టాలు, భర్త నిర్లక్ష్యం ఇంకా ఎక్కువయిపోతాయి. తను లిలీ దగ్గరికి వచ్చినపుడల్లా ఈ బాధలు, పోయిన పిల్లల గురించీ చెప్పుకుని బాధపడుతుంది. లిలీ ఆమె బాధకి ఎలా స్పందించాలో తెలీక, 'చనిపోయిన పిల్లలకి ఆయువు అంతే ఉందనీ, వారి గురించి బాధపడకుండా ఇంకా కొడుకులని కనడానికి ప్రయత్నం చెయ్యమంటుంది. 'తమ అమ్మలు, నానమ్మలు నూరిపోసినట్టు భర్తని సుఖపెట్టి కొడుకులను కని, భర్త అత్తగారి మెప్పు పొందొచ్చు కదా. ఆమాత్రం ఎందుకు అర్ధం చేసుకోవటం లేదు తను' అని విసుగు కూడా వస్తుంది. ఇంట్లోవాళ్ళను సంతోష పెట్టాలంటే ఒక స్త్రీగా ఏమేం చెయ్యాలో, ఎలా నడుచుకోవాలో స్నో ఫ్లవర్ అలానే చేస్తాను అని మాట ఇచ్చేవరకు బోధిస్తూనే ఉంటుంది. లిలీ కన్నా ఆమె భర్తకి స్నో ఫ్లవర్ వేదన, ఆమె చెప్పకపోయినా ఇంట్లో పరిస్థితులు బాగా అర్ధం అవుతాయి. లిలీకి సూచిస్తాడు కూడానూ, నువ్వు తనని సరిగా అర్ధం చేసుకోకుండా నువ్వుకూడా తనని బాధపెడుతున్నావేమో అనిపిస్తుంది అని. భర్త తనని అతి తరచుగా కొడుతున్న విషయం స్నో ఫ్లవర్ తనకు చెప్పకుండా దాచినందుకు కోపం వస్తుంది. స్నో ఫ్లవర్ తో భర్తని వదిలి వచ్చేసి తన ఇంట్లో ఉండమంటే, ఆమె పిల్లల్ని వదిలి రాలేనని చెపుతుంది.

ఒకరోజు స్నో ఫ్లవర్ 'లిలీ, మనం కలిసినపుడల్లా నా కష్టాలతో నిన్ను విసిగిస్తున్నాను. ఇక వాటిని వినే బాధ నీకుండదులే. నా కష్టాలు చెప్పుకున్నా నా మీద జాలి పడకుండా వినడానికి మా వూర్లో కొందరు స్వోర్న సిస్టర్స్ ఉన్నారు. నాగురించి నీకు నిజం తెలిసినరోజు నుండీ చూస్తున్నాను, మనం కలిసినప్పుడల్లా నీకళ్ళలో నామీద జాలి. అది కూడా నేను భరించలేను. నాకు నీ స్నేహమూ ప్రేమ మాత్రమే కావాలి. కాబట్టి నన్ను ఓదార్చడానికి జాలితో కాకుండా, ఇష్టంగా ప్రేమతో నాకు ఉత్తరాలు వ్రాయి. ఎదురుచూస్తుంటాను.' అని సిల్క్ ఫేన్ మీద ఒక ఉత్తరం రాసి పంపిస్తుంది. అది చూడగానే లిలీకి విపరీతమయిన కోపం, బాధా కలుగుతాయి. ' తను తన భర్తని ప్రేమించిన దాని కన్నా ఎక్కువగా ఆమెని ప్రేమిస్తే, తన నుంచి కొన్ని విషయాలు రహస్యంగా ఉంచడమే కాకుండా, ఇపుడు తనని వదిలేసి మిగతా వారి స్నేహం కూడా కలుపుకుంటుంది. అది తన స్నేహానికీ తమ బంధానికి ఆమె చేస్తున్న మోసం' అని స్నో ఫ్లవర్ మీద అసహ్యం పెంచుకుంటుంది. ఆమె జ్ఞాపకాలని పూర్తిగా తుడిచెయ్యాలని స్నో ఫ్లవర్ అన్నేళ్లుగా వ్రాసిన ఉత్తరాలూ, పంపిన కానుకలూ అన్నీ తగలబెట్టేస్తుంది. జరిగినవి మర్చిపోవాలని ఎంత ప్రయత్నించినా మోసపోయానన్న బాధా

కోపమూ మాత్రం లిలీని వేధిస్తూ ఉంటాయి. ఇవేవీ తెలియని స్నో ఫ్లవర్ 'తమ కూతుర్లను కాంట్రాక్ట్ వ్రాసుకోవడానికి గుడికి ఎపుడు తీసుకువెళ్దాం' అనీ 'ఎందుకు నువ్వు ఉత్తరాలు వ్రాయటం లేదు. నిన్ను చూసి చాలా రోజులయ్యింది. ఒకసారి రా' అంటూ అప్పుడప్పుడూ వ్రాసిన ఉత్తరాలను లిలీ చింపి పడేస్తుంది. పిల్లల laotong బంధం గురించి మధ్యవర్తిగా వచ్చిన మేడమ్ వాంగ్ తో, తన కూతురికి తమకన్నా తక్కువవాళ్ళతో బంధుత్వం కలపటం తనకి ఇష్టం లేదని కఠినంగా చెప్పి పంపేస్తుంది.

కొన్ని నెలలు గడచిన తరువాత లిలీ వూర్లోని ఒక అమ్మాయి పెళ్ళి వేడుకలో లిలీ, స్నో ఫ్లవర్ ఎదురు పడతారు. అక్కడ వేడుకలో పాడే పాటల రూపంలో స్నో ఫ్లవర్ లిలీని ఉద్దేశించి 'ఏ జన్మలోని పాపం చేసుకున్నానో, నాకు జీవితంలో ఎపుడూ దురదృష్టం వెంటాడుతూనే ఉంది. కానీ నాకున్న ఒకే ఒక్క ఆశా, ఆనందమూ నువ్వే. నువ్వు నాకు అది కూడా లేకుండా చేసావు. నా బాధలు చెప్పుకుంటే వినడానికి నీకు సహనం లేకపోయింది. నీ కూతురితో స్నేహం తిరస్కరించి నా కూతురి బ్రతుకైనా బాగుపడే అవకాశం లేకుండా చేసావు. నేనేం పాపం చేసాను? లోకంలో కష్టాలూ దీనులు లేకుండా సుఖాలే ఉండాలంటే ఎలా కుదురుతుంది? దాదాపు ముప్పయ్యేళ్ళు మనం ప్రాణస్నేహితులుగా ఉన్నాము. ఇపుడు నువ్వు చేసింది న్యాయమేనా' అని ఏడుస్తూ ప్రశ్నిస్తుంది. వూరిలో అందరి ముందూ తనని దోషిగా నిలబెట్టడం భరించలేని లిలీ 'నన్ను అనే ముందు నువ్వు చేసినది గుర్తు తెచ్చుకో. మన మధ్య ఇంకో వ్యక్తి ఉండకూడదని కదా ఒప్పందం. నా భర్త నాకు సవతిని తీసుకొచ్చినా భరించగలనేమో కానీ, నువ్వు మన మధ్య వేరేవాళ్ళని తీసుకురావటం నేను కలలో కూడా ఊహించలేదు. మనం చేసుకున్న ప్రమాణాలని నువ్వే గౌరవించలేదు.' అని జవాబు చెపుతుంది. అంతటి ఆగకుండా అక్కసుతో ఆమె పేదరికం గురించీ, భర్త వృత్తి గురించీ, ఆమె మొదటినుంచీ అబద్ధాలతోనే అందరినీ మోసం చేస్తుందనీ, తనకొచ్చిన చేతిపనులు గానీ, రహస్య భాష గానీ తన వూరిలోని స్త్రీలకి నేర్పించకుండా ఏడుస్తూ కాలం గడుపుతుందనీ, ఇంకా ఏవేవో నొప్పించే విషయాలు మాట్లాడుతుంది. ఒకవైపు తను మాట్లాడుతున్నది సవ్యం కాదు అని తెలుస్తూనే ఉన్నా, ఆమె లోని బాధ ఆక్రోశం ఆమెని విచక్షణ కోల్పోయేలా చేస్తాయి. లిలీ మాటలకి హతాసురాలైన స్నో ఫ్లవర్ విషాదం నిండిన గొంతుతో మృదువుగా 'నీతో ఎప్పుడూ నిజమే చెప్పమన్నావు. కానీ నేను నిజాలు చెప్పినపుడు నువ్వు అర్థం చేసుకోలేదు. నేను చెప్పినవీ చేసినవీ నీకు నచ్చలేదు. నా ఇరుగు పొరుగు స్త్రీలు నా కష్టాలు విని నన్ను విమర్శించరు, అవమానించరు. నా మీద జాలి పడరు. వారికి నచ్చినట్టు నేనుండాలని కాకుండా, నేనెలా ఉన్నానో అలానే ఇష్టపడేవారు, నాబాధలు వినేవారు కావాలి నాకు. అది నాకు వారి దగ్గర దొరికింది.' అని చెప్పి, నెమ్మదిగా ఆ ప్రదేశం విడిచి వెళిపోతుంది. అప్పటి నుండి నుంచి ఇంకెప్పుడూ లిలీకి స్నో ఫ్లవర్ నుంచి ఇంకే కబురూ రాలేదు, ఎప్పుడూ ఇద్దరూ ఎదురు పడలేదు.

కాలం ఎనిమిది సంవత్సరాలు ముందుకు గడిచింది. లిలీ వయసు 41 సంవత్సరాలు. తన పిల్లలకు పెళ్ళిళ్ళు అయ్యి మనవలు పుట్టారు. మనసుకి తగిలిన గాయం తీవ్రత నెమ్మదిగా తగ్గుతున్నా, ఇంకా పూర్తిగా పోలేదు. స్నో ఫ్లవర్ ని మర్చిపోడానికి శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంది. ఒకరోజు స్నో ఫ్లవర్ కూతురు లిలీ ఇంటికి వచ్చి, 'తల్లి చావు బ్రతుకుల్లో ఉందనీ, లిలీని కలవరిస్తోందనీ' చెప్పి ఒక్కసారి వచ్చి తల్లిని చూసివెళ్ళమని ప్రాధేయపడుతుంది. వారితో తనకి ఏ సంబంధమూ లేదని తిప్పి

పంపించాలని అనుకుంటుంది లిలీ, కానీ Lady Lu గా తన ప్రవర్తన అమర్యాదకరం అని తలిచి సరే వస్తాను వెళ్ళమని చెపుతుంది. మరునాడు స్నో ఫ్లవర్ ఇంటికి వెళ్లేసరికి ఆమె భర్త వాకిట్లోనే ఎదురుపడి బాధతో ' భార్య ఇన్నాళ్ళూ తననీ తల్లినీ సంతోషపెట్టడానికి చేసినవేవీ గుర్తించక అమానుషంగా ప్రవర్తించాననీ, తనకి ఇపుడే అది అర్ధమవుతుందనీ' చెపుతాడు. లోపలికి వెళ్లేసరికి మంచం మీద స్నో ఫ్లవర్ పొట్టలో ట్యూమర్ తో బాధపడుతూ, గుర్తు పట్టలేని స్థితిలో ఎముకల పోగులా ఉంటుంది. ఆమెకు సేవలు చేస్తూముగ్గురు స్త్రీలు కనిపిస్తారు. ఓహో వారే కాబోలు తను కొత్తగా చేరిన స్నేహితురాళ్ళు అనుకుంటుంది. స్నో ఫ్లవర్ ని ఆ స్థితిలో చూడగానే ఉన్న కోపమంతా కరిగి పోతుంది. చిన్ననాడు ఆప్యాయంగా స్నేహహస్తం చాచిన నెచ్చెలి గుర్తుకొచ్చింది. తన చెయ్యి పట్టుకోగానే స్నో ఫ్లవర్ ' వచ్చావా, నీకోసమే ఎదురు చూస్తున్నాను. నువ్వొస్తావని నాకు తెలుసు' అని 'జరిగిన వాటికి నన్ను క్షమించు. కానీ నన్ను నమ్ము. నేను నీ స్నేహాన్ని ఎప్పుడూ కాదనుకోలేదు. నువ్వే నా ప్రాణ స్నేహితురాలివి.' అని చెపుతుంది. తనకి స్నో ఫ్లవర్ మీద ఇంకా ప్రేమ ఉండ బట్టే జరిగిన దానికి తనకి ఇంకా బాధ కలుగుతుందని లిలీకి అర్ధమవుతుంది.

స్నో ఫ్లవర్ ని జాగ్రత్తగా చూసుకోవాలని నిర్ణయించుకుని అక్కడే ఉండి తనకి రాత్రీపగలు సేవలు చేస్తూ, ప్రేమగా చూసుకుంటుంది. తన ఊరి నుంచి మంచి వైద్యుడిని కూడా పిలిపిస్తుంది, కానీ అతను లాభం లేదని చెబుతాడు. ఒకరోజు లిలీ ఇంట్లో చిన్నపుటి నుంచి ఉన్న దాసీ ఒక బుట్ట తీసుకొచ్చి ఇస్తుంది. అందులో ఇద్దరూ ఉత్తరాలు రాసుకున్న సిల్క్ ఫేన్, స్నో ఫ్లవర్ లిలీకి రాసిన కొన్ని ఉత్తరాలూ, పంపిన కానుకలూ ఉంటాయి. దాసీ చెపుతుంది 'ఆరోజు కోపంలో అన్నీ తగలబెడుతున్నప్పుడు, అది నువ్వు అప్పటి కోపంలో చేస్తున్నావే కానీ మనస్ఫూర్తిగా కాదు అని నాకు తెలుసు. అందుకే నాకు కనిపించినవన్నీ నీకు తెలీకుండా దాచిపెట్టాను. నన్ను క్షమించు.' అని చెపుతుంది. లిలీకి ఆమె పట్ల మనసు కృతజ్ఞతతో నిండిపోతుంది. అతికొద్ది రోజుల్లోనే స్నో ఫ్లవర్ చనిపోతుంది. పోయేముందు లిలీని తన పిల్లలకి గార్దియన్గా ఉండమని ఒకేఒక్క కోరిక కోరుతుంది. ఆమెను సమాధి చేసినపుడు, ఆచారం ప్రకారం స్నో ఫ్లవర్ కి లిలీ రాసిన ఉత్తరాలూ, కానుకలూ వెదికి వాటిని కాలుస్తారు. అవి ఆమెకు పైలోకంలో తోడుగా ఉంటాయని వారి నమ్మకం.

స్నో ఫ్లవర్ ని సమాధి చేసి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత, స్నో ఫ్లవర్ స్నేహితురాళ్ళ మాటల్లో వారు ఆమెకి స్వోర్న సిస్టర్స్ కాదనీ, కేవలం పొరుగు స్నేహితులు మాత్రమే అనీ లిలీకి తెలుస్తుంది. లిలీ ఆశ్చర్యపోయి 'అదేంటి, ఫేన్ లో ఉత్తరం రాసి పంపించింది కదా అంటే', ఏం రాసిందో సరిగా చూడు అని ఆ ఫేన్ తీసి చూపిస్తారు. ' అందులో 'నీకు నా బాధలు చెప్పి ఇక విసిగించను. దానికోసం ఒక 'ముగ్గురు స్వోర్న సిస్టర్స్' దొరికారు' అని రాసింది కానీ, తను కూడా వాళ్ళలో ఒకరిగా చేరిందని రాయలేదు కదా.' అని అడిగి 'ఆమె కష్టాలు మేము ఓపికగా విన్నాము. దానికి ప్రతిగా ఆమె మాకు రహస్య భాషను నేర్పింది. అంతవరకే మా సంబంధం' అని చెపుతారు. అంతే కాకుండా 'నువ్వు మాత్రం ఏం చేసావు? ఆమె బిడ్డలను కోల్పోయిన ప్రతీసారీ, ఆమె వేదన అర్ధం చేసుకోకుండా, ఎక్కువమంది కొడుకులని కనడమే స్త్రీ జన్మకి సాఫల్యం అని నూరిపోసి అందుకోసం ప్రయత్నించమని బలవంతం చేసావు. బిడ్డని కోల్పోయిన తల్లికి అది ఏం స్వాంతన ఇస్తుందో నువ్వే ఆలోచించు? అయినా కేవలం నిన్ను సంతోషపెట్టడం

కోసమే నువ్వు చెప్పిన పనులన్నీ చేసింది. ప్రతీ విషయంలోనూ నువ్వు చెప్పినట్టుగానే నడుచుకుంది. అయినా నువ్వది అర్ధం చేసుకోలేకపోయావు. ఆమె మాత్రం నీగురించి ఎప్పుడూ ఒక్క మాట కూడా చెడుగా మాట్లాడలేదు. నిన్ను నిన్నుగానే, నీ లోపాలతో సహా ప్రేమించింది మొదటి నుండీ చివరవరకూ. నువ్వు మాత్రం ఆమెకు దుఖాన్నే మిగిల్చావు. నువ్వూ మగవాళ్ళలా ఆమె విలువని, ఎంతమంది కొడుకులను కంటే అంత, అన్న దృష్టి తోనే చూసావు. ఆమె ఇంట్లో వాళ్ళ కన్నా నువ్వే విధంగా మెరుగు?' అని లిలీని నిలదీస్తారు. లిలీకి ఒక్కసారిగా కాళ్ళ క్రింద భూమి పగిలి కూరుకుపోతున్నట్టు షాక్ కలిగింది. తన అపార్ధం వలన, మూర్ఖత్వం మొండితనం మూలాన ఒకరిని అన్నేళ్ళు ఎంత దుఖానికి గురిచేసిందో తలుచుకుంటే ఆమె మీద ఆమెకి అసహ్యం, సిగ్గూ కలిగాయి. తను చేసింది క్షమించరాని నేరం అని అనుకుంది.

తన ఇంటికి తిరిగి వెళ్ళిన లిలీకి జీవితం మీద ఆసక్తి కోల్పోయి, నిర్లిప్తంగా మిగిలిపోయింది. తల్లిగా భార్యగా తనకున్న బాధ్యతలనూ, స్నో ఫ్లవర్ పిల్లల బాధ్యతనూ తీర్చాలనుకుంది. దగ్గరుండి స్నో ఫ్లవర్ కూతురు పెళ్లి జరిపించింది. కానీ తల్లి జీవితాన్ని చూసి పెళ్లి అంటే భయపడ్డ ఆ అమ్మాయి, పెళ్లి రోజురాత్రి ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. భర్తతో మాట్లాడి స్నో ఫ్లవర్ కొడుకుకి తమ పొలాల శిస్తు వసూలు చేసే ఉద్యోగాన్ని ఇప్పించి, కసాయి వృత్తిని వదిలి మంచి గౌరవమైన జీవితాన్ని గడిపే ఏర్పాట్లు చేసింది. ఆ అబ్బాయికి ఒక కొడుకూ ఒక కూతురూ కలుగుతారు. లిలీ పిల్లలకూ పెళ్ళిళ్ళు అయి, మనవలు పుట్టారు. తన పెద్ద మనవడికీ, స్నో ఫ్లవర్ మనవరాలికీ మేడం వాంగ్ ని మధ్యవర్తిగా ఉంచి పెళ్లి కుదిర్చింది. ఆ అమ్మాయికి దగ్గరుండి ఫుట్ బైండింగ్ చేసి, Nu Shu భాషనీ నేర్పింది. ఆ పిల్లలూ పెద్దయి, వాళ్లకి పెళ్ళయి లిలీకి మునిమనవలు కూడా పుట్టారు. భర్త మరణించి కూడా చాలాకాలం అయ్యింది. ఇపుడు లిలీకి డెబ్బయి ఏళ్ళు దాటాయి. స్నో ఫ్లవర్ తనకి రాసిన ఉత్తరాలనూ, సిల్క్ ఫేన్ నూ తను మరణించాక, తనకన్నా ముందే అక్కడికి చేరేలా తనని సమాధి చెయ్యకముందే కాల్చెయ్యమని మనుమడి భార్యను కోరింది. వాటిని ముందు పెట్టుకుని జ్ఞాపకాల్లో కొట్టుకుపోతూ, జీవితంలో తన మూర్ఖత్వం వాళ్ళ ఎంత మందిని బాధపెట్టిందో తలచుకుని పశ్చాత్తాపపడుతూ, కాలం తీరి తన ప్రియసఖిని కలిసేరోజు కోసం ఎదురు చూస్తుంది.

లిలీని తలుచుకుంటే అనూప్ జలోటా పాడిన ఒక గజల్ లోని 'దిల్ భరా ఆతా హై తో ఫిర్ దిల్ కో దుఖాఃతే హై క్యోం' (హృదయాన్ని ప్రేమతో నింపాలని వచ్చినదానివి, హృదయానికి గాయం చేసి పోతావెందుకూ?) అన్న ఒక వాక్యం గుర్తొస్తుంది నాకు ఎపుడూ. అవును. ఎందుకూ??? ఓ మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలీకుండానే మనలో చాలామంది చేసేదీ అదే.

పరిచయాన్ని ఎంత విపులంగా వ్రాసినా ఈకథకి న్యాయం జరగదు. దాదాపు రెండొందల పేజీలున్న పుస్తకంలో ( చాలా చిన్న ప్రింట్) ఆనాటి సామాజిక ఆచారాల గురించి ఎన్నో ఆసక్తిమైన వివరాలు కథకి బలాన్ని కలుగజేస్తూ, ఎన్నో సందర్భాల్లో ఎంతో సున్నితంగా సహజంగా చిత్రించిన మనోసంఘర్షణలు, ప్రతీ చిన్న పాత్రనూ చాలా జాగ్రత్తగా కొంత విశిష్టత అద్ది చిత్రించిన తీరు వాటికి న్యాయం చేసేలా చెప్పాలంటే మొత్తం పుస్తకం ఇక్కడ కాపీ చెయ్యటం తప్ప వేరే దారి లేదు. లిలీ అమ్మ, పిన్ని, చిన్న తోటికోడలు ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేకమైన కథ...ఒక్కోటీ మనసుల్ని మెలితిప్పే కథ.



రచయిత్రి లీసా సీ ముత్తాతలు వందేళ్ళ క్రిందట అమెరికాకి వచ్చి లాస్ ఏంజెలెస్ లోని చైనా టౌన్ ఏర్పరుచుకున్న చైనా దేశస్తులు. లీసా తాతగారు చైనీస్, నాన్నమ్మ అమెరికన్. చిన్నప్పుడు సెలవుల్లో ఆమె ఎక్కువగా చైనా టౌన్ లోనే గడిపి, తాతమ్మలు, ఇతర బంధువుల ద్వారా చైనాలోని సంప్రదాయాలు, స్త్రీల జీవితం గురించి కథలు కథలుగా వినడంతో వాటి గురించి ఇంకా వివరంగా తెల్సుకోవాలని అనిపించిందట. పెద్దయి తను రచయిత్రిగా మారాక Nu Shu గురించి విని, ఆసక్తి తో రీసెర్చి చేసి, చైనాలోని అతి ప్రాచీన ప్రాంతాలకు వెళ్ళి ఆ భాష గురించి తెల్సుకున్నారు. కేవలం ఆ భాష మాత్రమే తెలిసిన (కమ్యూనికేషన్ కోసం ఇంకే ఇతర భాషలూ తెలియని) ఆఖరు స్త్రీ, తొంభై ఏళ్ళ వృద్ధురాలిని కలిసి ఫుట్ బైండింగ్ గురించీ, వారి ఆచారాలు వేడుకల గురించీ ఎన్నో విషయాలు స్వయంగా తెలుసుకున్నారట.

ఇపుడు ఈ ఇరవైఒకటో శతాబ్దంలో లిలీ స్నో ఫ్లవర్ కథ ఎందుకూ అంటే, అది వాళ్ళదే కాదు, ఇది స్త్రీల కథ, మనందరి కథ అంటారు. ఆమె మాటల్లోనే “Snow Flower and the Secret Fan is a story about friendship and what it means to be a woman. Yes, our lives are completely different from those lived by the Nu Shu writers, but inside we are the same. We want people to hear our thoughts appreciate our creativity, and feel empathy for our emotions. As daughters we all have experienced complicated relationships with our mothers, As mothers, we have all felt deep terror when one of our children got sick. As women, we have all at one time or another wondered about the true and everlasting mystery of the men in our lives. These are universals, as is the fear women during times of political upheaval that occurs in what could still be called the outside world of men – whether many years ago or today for women in Iraq, Afghanistan, the Sudan or right here in Us. On the surface, we as Americans women are independent, free and mobile, but at our cores we still long for love, friendship, happiness, tranquility and to be heard. “



ఈ పుస్తకాన్ని 2005 లో వ్రాసారు. దీన్ని 39 దేశాల్లో అనువాదం చెయ్యటానికి హక్కులు తీసుకున్నారు. న్యూయార్క్ బెస్ట్ సెల్లర్ అవార్డు తో పాటు చాలా అవార్డులు పొందిన పుస్తకం. ఇదే పేరుతో దీన్ని 2011 లో సినిమాగా కూడా తీసారు, కానీ కథని ప్రస్తుతకాలంలో ఇద్దరు స్నేహితురాళ్ళ కథకి అనుసంధానం చేసి, వాళ్ళు లిలీ ఉత్తరాలు, సిల్క్ ఫేన్ చూస్తూ వాళ్ళ కథని తెలుసుకుంటున్నట్టు మార్చారు. అతి పేలవమయిన చిత్రరూపం. పుస్తకం ఇచ్చిన అనుభూతిలో

నాలుగోవంతు కూడా సినిమా మిగల్చలేకపోయింది.

రచయిత్రి గురించి: Lisa See వృత్తి రీత్యా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. తను పుట్టుక ప్రకారం పూర్తిగా చైనీస్ కాకపోయినా, తన మనసు మాత్రం పూర్తిగా చైనీస్ అని గర్వంగా చెప్పుకుంటారు. ఆమె ముత్తాత అమెరికాలో నిలదొక్కుకోడానికి అడ్డంకులు ఎదుర్కొని లాస్ ఏంజెల్స్ లోని చైనా టౌన్ కి గాడ్-ఫాదర్ అని పేర్కొనే స్థితికి చేరిన ప్రయాణం గురించిన వ్రాసిన మొదటి పుస్తకం (బయోగ్రఫీ) On Gold Mountain: The One Hundred Year Odyssey of My Chinese-American Family చాలా ప్రాముఖ్యాన్ని పొందింది. ఆవిడ వ్రాసిన పుస్తకాల్లో ఎక్కువ శాతం చైనీస్ సంస్కృతి, అక్కడి జీవితాన్ని ఆధారం చేసుకుని ఉంటాయి. వాటిలో చాలా వరకూ బెస్ట్ సెల్లర్స్ గా ప్రసిద్ధి పొందినవే. Organization of Chinese American Women సంస్థ 2001లో National Woman of the Year అవార్డ్ తో గౌరవించింది.

కొన్ని ఆసక్తికరమైన వ్యాసాలు / విషయాలు:
ఈ పుస్తకం గురించి తల్లీ కూతుర్ల ఆసక్తి కరమైన ముచ్చట్లు ఇక్కడ చదవండి.
http://www.lisasee.com/snowflower/conversation-with-lisa-see-and-carolyn-see/

Painful Memories for China's Foot binding Survivors
http://www.npr.org/templates/story/story.php?storyId=**8966942**&sc=emaf

Footbinding Pictureshttp://www.lisasee.com/images/footbinding/footbinding.htm



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# రహస్య స్నేహితుడు

**The Boy in Striped Pajamas**

బాల్యం ... అమాయకమైనదీ, అందమైనదీనూ. పెద్దవాళ్లకుండే కల్మషాలూ, మాత్సర్యాలూ అంటని దేవలోకపు వనంలో తిరిగాడే బంగారు ప్రాయం. ఎంత పెద్దవారమయినా బ్రతుకు మొదట్లో తిన్న అమ్మ చేతి పాలబువ్వ ముద్దల నుంచీ, మొదటి నేస్తం వరకూ అపురూపంగా ఆప్యాయంగా కలవరించే మధురానుభూతులు మిగిల్చే వసంతకాలం. అందుకే 'ఉందో లేదో పుణ్యం, నా బాల్యం నాకిచ్చేయ్' అనీ 'ఏ దౌలత్ భీ లేలో, ఏ షరారత్ భీ లేలో, ముఝుకో లౌటాదో బచపన్ కా సావన్' అనీ ప్రాధేయపడ్డారంటే ఆశ్చర్యం లేదు. అయితే ఎంత బేఫికర్ జీవితమయినా, పిల్లలకీ వాళ్ళకి తగిన కష్టాలు వాళ్ళకి ఉంటాయి. జీవితంలోని ఏ మార్పునయినా, దాని అవసరాన్ని అర్థం చేసుకుని దాని ప్రభావాన్ని స్వీకరించడానికి మనల్ని మనం సిద్ధం చేసుకున్నా కూడా ఒకోసారి చెదిరిపోతుంటాము. పిల్లలలోనూ ఆ మార్పులు కనిపించని ఆందోళన కలిగిస్తాయి. పెద్దాళ్ళు వారి ఆందోళనని ఏమాత్రమూ పట్టించుకోకుండా, ఏ విషయం అడిగినా 'చిన్నపిల్లలు మీకెందుకు?' అని దాటేస్తాము. ఒక్కోసారి పిల్లలు కదా, వారికి అవసరం లేదు అని కొన్ని విషయాలు చెప్పకుండా దాయటం వలన జరిగే నష్టాలే ఎక్కువ ఉంటాయి. వద్దన్న విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పిల్లలని వూహించని పరిస్థితుల్లోకి తోస్తాయి.

తండ్రి ఉద్యోగ రీత్యా ఉన్న వూరినీ ఫ్రెండ్స్ వదిలేసి, చుట్టుపక్కల పిల్లలు లేని చోటికి వెళ్ళి, అక్కడేమీ తోచక, పెద్దవాళ్ళు వద్దన్న చోటికి వారికి తెలియకుండా వెళ్ళి ఓ రహస్య స్నేహితుడిని సంపాదించుకున్న ఓ పిల్లాడు చివరికి ఏ పరిస్థితుల్లో చిక్కుకున్నాడు? ఆ స్నేహితుడెవరు? ఆ ఫ్రెండ్షిప్ ఎవరికీ తెలీకుండా ఎన్నాళ్ళు, ఎలా సాగింది అనేది, హోలోకాస్ట్ రోజులు ఆధారంగా చేసుకుని John Boyne వ్రాసిన కథ The Boy in Striped Pajamas.




కథాకాలం 1943. కథాస్థలం జర్మనీలోని బెర్లిన్. బ్రూనో చీకూ చింతా లేని తొమ్మిదేళ్ళ పిల్లాడు. అమ్మా, నాన్న, అక్క గ్రెటెల్ తో కలిసి బెర్లిన్లో ఉంటాడు. నాన్న హిట్లర్ సైన్యంలో ఆఫీసర్. బ్రూనోకి ముగ్గురు బెస్ట్ ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్ళతో కలిసి సెలవుల్లో ఏం ఎడ్వంచర్స్ చెయ్యాలో ప్లాన్ చేసుకుంటూ సంతోషంగా గడిపేస్తూ ఉంటాడు. గ్రెటెల్ వయసు పన్నెండేళ్ళు . తనకేమో బ్రూనోని చూస్తే చిన్నపిల్లాడని అలుసు. బ్రూనోకేమో అక్క ఒక 'హోప్ లెస్ కేస్' అని గొప్ప నమ్మకం. ఒకరోజు హిట్లర్ బ్రూనో ఇంటికి డిన్నర్ కి వచ్చి, అమ్మా నాన్నలతో కబుర్లు చెప్పి వెళ్ళాడు. ఆ తర్వాత నాన్నకి హిట్లర్ ఒక పెద్ద బాధ్యత అప్పచెప్పి ప్రమోషన్ ఇచ్చారనీ, నాన్నని ఇకనుంచీ అందరూ 'కమాండంట్' అని పిలవాలనీ తెల్సింది. ఇలా ఉండగా ఒకరోజు బ్రూనో స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో పనిమనిషి మరియా బ్రూనో రూంలోని బట్టలూ ఆటవస్తువులూ పెట్టెల్లో సర్దుతూ కనిపించింది. ఏం జరుగుతోందని అడిగిన బ్రూనోతో తల్లి 'నాన్నగారికి కొత్తగా వచ్చిన ప్రమోషన్ వలన మనందరం వేరే వూరికి మారుతున్నాం, అందుకని సామానులు సర్దుతున్నాం' అని చెపుతుంది. బ్రూనోకి ఆ సంగతి చాలా బాధ కలిగించింది. తన స్నేహితులని వదిలేసి ఎలా వెళ్లాలని తెగ బాధపడిపోయాడు. ఉద్యోగానికి నాన్న ఒక్కరే వెళ్ళొచ్చు కదా, మనం ఇక్కడే ఉండొచ్చు అని అడిగాడు. కానీ అమ్మ 'అవన్నీ జరిగేవి కాద'ని చెప్పి, వెళ్ళి సామాన్లు సర్దటంలో మరియాకి హెల్ప్ చెయ్యమని పంపేసింది. చేసేదేంలేక అయిష్టంగానే వెళ్ళిపోయాడు. ఓ రెండు రోజుల్లో మొత్తం బ్రూనో కుటుంబం, ముగ్గురు పనివాళ్ళు కలిసి క్రొత్తవూరు చేరుకున్నారు.

క్రొత్తవూరిలో తనుండాల్సిన ఇల్లు చూడగానే బ్రూనోకి విపరీతమయిన దుఃఖం వచ్చింది. బెర్లిన్లో ఇల్లు ఐదు అంతస్తులతో ఉండి, చక్కగా వూరి మధ్యలో ఉండేది. చుట్టూ బోలెడు ఇళ్ళూ ఆడుకోడానికి పిల్లలూ ఉండేవారు. ఈ క్రొత్త ఇల్లేమో ఎక్కడో వూరి చివర ఉండి, చుట్టూ కనుచూపు మేరలో ఒక్క ఇల్లు గానీ, దుకాణం గానీ ఏమీ లేదు. పైగా అది మూడు అంతస్తులు మాత్రమే ఉండి చిన్నగా కూడా ఉంది. ఇవి చూడగానే అసలు ఇక్కడ తనెలా ఉండాలి అని బోలెడు దిగులేసింది బ్రూనోకి. అంత మంచి ఇంటి నుండి, వూరి నుండి ఇలా ఎవరూ లేని చోటికి, చిన్న ఇంట్లోకి పంపించారంటే నాన్నేదో తప్పు చేసి ఉంటారని నమ్మకం కలిగింది బ్రూనోకి. ధైర్యం చేసి నాన్న ఆఫీసులోకి వెళ్ళి అడిగాడు కూడాను ఆ సంగతి. పైగా 'మీరేదైనా తప్పు చేస్తే హిట్లర్ కి చెప్పి తప్పు ఒప్పుకుని క్షమాపణ అడగండి. ఆయన క్షమించి మనల్ని మళ్ళీ వెనక్కి పంపేస్తారు' అని నాన్నకి సలహా కూడా ఇచ్చాడు. ఆయన నవ్వి 'నామీద నమ్మకంతో నాకు చాలా ముఖ్యమైన బాధ్యత ఇచ్చారు హిట్లర్. అది పూర్తయేవరకు మనం కొన్నాళ్ళు ఇక్కడే ఉండాలి. నువ్వు నెమ్మదిగా ఇక్కడ అలవాటు పడితే మంచిది' అని చెప్పారు. అక్కతోనూ, పనివాళ్ళతోనూ తనకి అక్కడ నచ్చలేదని గోడు చెప్పుకుంటే, వాళ్ళు తమకి కూడా నచ్చలేదనీ అయినా చెయ్యగలిగిందేమీ లేదనీ తేల్చేసారు. బ్రూనో ఇక చేసేదేమీ లేక వూరుకున్నాడు, కానీ ఎలా అయినా తిరిగి బెర్లిన్ వెళ్ళిపోతే బావుండును అని ఆశ మాత్రం పోలేదు.

నాన్నకి క్రొత్త యూనిఫారం వచ్చిందనీ, దాన్నిండా ఎన్నో రకాల మెడల్స్ తగిలించి ఉన్నాయనీ, ఇపుడు అందరూ నాన్నని 'కమాండంట్' అని పిలుస్తున్నారనీ బ్రూనో గమనించాడు. ఇంటి ముందు రకరకాల వాహనాల్లో చాలామంది సైనికులు నాన్న ఆర్డర్స్ కోసం వేచిఉండి, సీరియస్ గా వాళ్ళపనులు వాళ్ళు చేసుకుంటున్నారు. ఎపుడూ నాన్న ఆఫీసురూంలో ఎవరో ఒకరితో మీటింగుల్లోనే ఉంటున్నారు. బ్రూనోకి కొత్త ఇంట్లో ఏమీ తోచడం లేదు. పిచ్చేక్కేటట్టుగా ఉంది. ఆడుకోడానికి ఎవరూ లేరు. స్కూల్ లేదు. అక్క తనతో ఆడదు. ఎప్పుడూ తన రూంలో బొమ్మలతో ఆడుకుంటూ ఉంటుంది. బ్రూనోని తన గదిలోకి కూడా రానివ్వదు. ఏమీ తోచక బ్రూనో గది కిటికీలోంచి బయటకు చూస్తే ఇంటికి దూరంగా ఒక పెద్ద వైర్ ఫెన్స్, దాని వెనుక దూరంగా చిన్న చిన్న గుడిసెలు, వాటివెనుక పెద్ద బిల్డింగులూ ఉన్నాయని గమనించాడు. ఆ గుడిసెల బయట వందల కొద్దీ మనుషులు గుంపులు గుంపులుగా కూడి కొందరు ఏవేవో పనులు చేస్తూ ఉంటే, వాళ్ళని కొందరు సైనికులు వాళ్ళమీద అజమాయిషీ చెయ్యటం చూసాడు. వాళ్ళంతా ఒకేలాంటి చారల పైజామా, చొక్కా వేసుకుని చారల టోపీ పెట్టుకున్నారనీ, కొందరు విచారంగా ఉంటే, కొందరు తలకి కట్లు కట్టుకుని ఉన్నారనీ, వాళ్ళలో పిల్లలు కూడా ఉన్నారనీ గమనించాడు. వాళ్ళందరూ విచారంగానూ, మురికిగా ఎన్నో నెలల నుంచీ స్నానం చెయ్యనట్టుగా కనిపించారు. అక్కని పిలిచి చూపించాడు. అదొక కేంప్ లా ఉంది అనుకున్నారు కానీ వాళ్ళెవరో, అక్కడెందుకు ఉన్నారో, ఏం చేస్తున్నారో ఇద్దరికీ అర్థం కాలేదు. ఒకరోజు నాన్నని అడిగాడు వాళ్లెవరు అని. ఆయన 'వాళ్ళు మనలాంటి మనుషులు కాదులే. వాళ్ళ గురించి నీకనవసరం' అనేసారు. ఆ ఫెన్స్ వైపు గానీ, బెర్లిన్లో చేసినట్టు ఇల్లు దాటి షికార్లు చెయ్యడం గానీ ఇక్కడ చెయ్యొద్దని గట్టిగా చెప్పారు. అయినా బ్రూనోకి రోజూ వాళ్ళని కిటికీలోంచి చూస్తూ ఉండటం ఒక అలవాటయింది.

నాన్న దగ్గరి పనిచేసే సైనికుల్లో టీనేజ్లో ఉన్న లెఫ్టినెంట్ కర్ట్ ఒకడు. ఎప్పుడూ సీరియస్ గా ఉండి, ఇంట్లో అన్ని చోట్లా చాలా చనువుగా తిరుగుతూ ఉంటాడు. గట్టిగ్గా అరుస్తుందని కుక్కపిల్లని కాల్చి చంపిన క్రూరుడు. అతన్ని మొదటిసారి చూసినపుడే బ్రూనోకి నచ్చలేదు. బ్రూనోకి అతనంటే ఏదో తెలీని భయం. అతన్ని తప్పించుకుని తిరుగుతూ ఉంటాడు. గ్రెటెల్ మాత్రం అతనితో చనువుగా కబుర్లు చెపుతూ, అతను వేసే పిచ్చి జోకులకి పగలబడి నవ్వటం బ్రూనోకి ఏమాత్రమూ నచ్చదు. వంటఇంట్లో కూరలు తరగటంలోనూ, వడ్డనలోనూ సహాయం చెయ్యటానికి వచ్చే పావెల్ అనే వృద్ధుడితో కర్ట్ అమర్యాదగా ప్రవర్తించడం బ్రూనోకి నచ్చదు. ఒకసారి భోజనాల సమయంలో జరిగిన చిన్న పొరపాటుకి పావెల్ని క్రూరంగా హింసించడం ఇంట్లో ఎవరికీ నచ్చదు.

అక్కా తమ్ముళ్ళు ఇద్దరికీ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పడానికి ఒక టీచర్ని కుదిర్చారు. రోజూ చదువు పూర్తయ్యాక బ్రూనో ఇంటి ముందున్న తోటలోకి వెళ్ళి ఆడుకోవటమో లేదా తన గది కిటికీలోంచి దూరంగా కేంప్ లో ఉన్న మనుషుల్ని గమనించడమో చేస్తుంటాడు. అలా రోజూ ఒక్కడే గడపటం విసుగొచ్చి ఒకరోజు చుట్టుపక్కల ఏముందో తిరిగి చూడాలనుకున్నాడు. అమ్మా నాన్నా ఇంటి వెనుక తోటలోకి గానీ, ఫెన్స్ దరిదాపులకు కానీ వెళ్లొద్దని ఎన్నోసార్లు చెప్పారు. అయినా కూడా అటేముందో చూడాలని కుతూహలంతో ఇంటివెనుక తోటలోనుంచి బయటపడి ఫెన్స్ దగ్గరికి వెళ్ళాడు. అక్కడ ఆ గుడిసేల్లోకనిపించే మనుషులెవరన్నా కలుస్తారేమో అని చూసాడు కానీ ఎవరూ కనిపించలేదు. ఆ ఫెన్స్ రెండువైపులా మైళ్ళ దూరం వరకూ ఉంది. అలా ఫెన్స్ వెంబడే నడుస్తూ, కనుచూపు

మేరలో తన ఇల్లు గానీ ఆ గుడిసెలు గానీ కనిపించనంత దూరం వెళ్ళాడు. అయినా ఎవరూ కనిపించక వెనక్కి వెళ్ళిపోదామని అనుకుంటుండగా దూరంగా ఎవరో ఉన్నట్టు కనిపించింది. దగ్గరికి వెళ్ళి చూస్తే దాదాపు తన ఈడు ఉన్న పిల్లాడు దిగులుగా కూర్చుని ఉన్నాడు. ఆ పిల్లాడు కూడా చారల పైజామా చొక్క వేసుకుని, చారల టోపీ పెట్టుకుని ఉన్నాడు. తల గుండు చెయ్యబడి ఉంది. బ్రూనో వెళ్ళి తనతో మాటలు కలిపాడు. ఆ పిల్లాడు తన పేరు ష్మోల్ అని, తనది పోలండ్ అనీ, తననీ తండ్రినీ, అన్ననీ సైనికులు తీసుకొచ్చి ఆ కేంప్ లో పెట్టి, తమ చేత కష్టమైన పనులు చెయ్యిస్తున్నారనీ, వాళ్ళు చూడకుండా కొంతసేపు దూరంగా ఇలా వచ్చానని చెప్పాడు. మాటల్లో ఇద్దరి పుట్టినరోజులూ ఒక రోజే అని తెలుసుకున్నారు. తనకు ఆకలిగా ఉందని, బ్రూనో దగ్గర తినడానికేమైనా ఉందా అని అడిగాడు ష్మోల్. అప్పుడేమీ లేదని మరునాడు తీసుకోస్తాననీ చెప్పాడు బ్రూనో. సైనికులు గమనించేలోగా తను వెళ్ళిపోవాలని ష్మోల్ వెళ్ళిపోయాడు. వెళ్లేముందు ఇద్దరూ మరునాడు అక్కడ కలవాలని అనుకున్నారు.

ఆరోజు నుంచీ రోజూ చదువు పూర్తవగానే, ఎవరూ చూడకుండా వంటగది లోంచి ఫుడ్ తీసుకుని జేబులో దాచుకుని, ఇంటి వెనుక నుండి ఫెన్స్ దగ్గరికి వెళ్ళిపోవటం అలవాటయింది బ్రూనోకి. ఫెన్స్ దగ్గర ఇద్దరూ కలుసుకుని, బ్రూనో తెచ్చిన ఫుడ్ తింటూ కబుర్లు చెప్పుకోడం చేసేవారు. బ్రూనో బెర్లిన్లో తన ఇల్లూ, ఫ్రెండ్స్ గురించి చెపితే, ష్మోల్ కేంప్ లో సైనికుల గురించీ, వాళ్ళు పెట్టే కష్టాల గురించీ చెప్పేవాడు. బ్రూనో ష్మోల్ తో 'నీకేం చక్కగా నీకు బోలెడంత మంది ఫ్రెండ్స్ ఉన్నారు ఆడుకోవడానికి. నాకెవరూ లేరు' అంటే, ష్మోల్ 'నీకు తెలీదు. అక్కడ ఏమీ బావుండదు. మేము అసలు ఆటలు ఆడుకోము. సైనికులకి మేమంటే అసలు ఇష్టం ఉండదు.' అని చెప్పేవాడు. సైనికులు అప్పుడప్పుడూ తమలో కొంతమందిని ఎక్కడో పనిచేయడానికేమో తీసుకెళ్తారనీ, వాళ్ళని మళ్ళీ తామెప్పుడూ చూడలేదనీ కూడా చెప్పాడు. బ్రూనో ఇంట్లో ఎవరితోనైనా తన కొత్త ఫ్రెండ్ గురించి చెప్పాలనుకున్నాడు కానీ, వాళ్ళు తనని కలవకుండా ఆపేస్తారేమో అని కొంత, ష్మోల్ తనకి మాత్రమే రహస్య స్నేహితుడిగా ఉండటం గర్వంగా అనిపించి కొంతా చెప్పకుండా ఆగిపోయాడు. అలా నెలలు గడుస్తున్నాయి. ఇద్దరూ కొత్త స్నేహం వలన సంతోషంగా ఉన్నారు. రాను రానూ బ్రూనోకి వెనక్కి బెర్లిన్ వెళ్ళాలన్న ఆలోచన కూడా తగ్గిపోయి, అక్కడ తన స్నేహితులని కూడా దాదాపు మర్చిపోయాడు. చాలాసార్లు బ్రూనో తను ఫెన్స్ దాటి అటువైపుకి వచ్చి మిగిలిన పిల్లల్నీ, వాళ్ళ ఇళ్లనీ చూస్తాను అని అడిగాడు కానీ, ష్మోల్ 'అవేమీ చూసేంత గొప్పవి కావనీ, చాలా అశుభ్రంగా ఉంటాయనీ, అయినా సైనికులు చూస్తే ప్రమాదమనీ' అడ్డు చెప్పేవాడు.

ఒకరోజు ఇంట్లో ఏదో పార్టీ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రూనో కిచెన్లోకి వచ్చి చూసి, అక్కడ గాజుగ్లాసులు శుభ్రం చేస్తున్న ష్మోల్ ని చూసి ఆశ్చర్యపోయాడు. నువ్వెలా వచ్చావు ఇక్కడికి అని అడిగితే, తనని పనికోసం లెఫ్టినెంట్ కర్ట్ తీసుకొచ్చాడని చెప్పాడు. అక్కడ పార్టీ కోసం టేబుల్ మీద పెట్టి ఉన్న ఆహారం వేపు ష్మోల్ ఆశగా చూడటం గమనించి, ష్మోల్ భయంగా వద్దని వారిస్తున్నా 'ఏమీ పర్వాలేదు ఇది మా ఇల్లే' అని కొంచెం తీసి ఇచ్చాడు బ్రూనో. ష్మోల్ అది ఆత్రంగా తింటుండగానే లెఫ్టినెంట్ కర్ట్ కిచెన్ లోకి వచ్చి, తింటున్నష్మోల్ ని చూసి 'దొంగతనం చేసావా?' అని కోపంతో అడిగాడు. 'లేదు, తను నా ఫ్రెండ్. ఇది నాకు తనిచ్చాడు.' అని చెప్పాడు ష్మోల్ . 'నిజమేనా? నీకు వీడు తెలుసా?' అని బ్రూనో ని గద్దించి అడిగితే, అతని క్రూరత్వం తెలిసిన బ్రూనో

భయపడిపోయాడు. తను చేస్తున్నది తప్పు అని మనసులో అనుకుంటున్నా కూడా 'ఆ అబ్బాయి ఎవరో తనకి తెలీదు, తనని ఇప్పుడే చూస్తున్నాను' అని అబద్ధం చెప్పాడు బ్రూనో. 'సరే అయితే. నువ్వెళ్ళు. వీడి సంగతి నేను చూస్తాను' అని చెప్పి బ్రూనోని ఆక్కడనుండి పంపేసాడు కర్ట్. బ్రూనోకి ష్మోల్ ని కర్ట్ ఏం చేస్తాడో అన్న భయమూ, ఆ అబ్బాయి మీద జాలీ, అలా చేసినందుకు తనమీద తనకి అయిష్టమూ, గిల్టీనెస్ కలిగాయి. చాలాసేపు విచారంగా, భయంగా కూర్చుండిపోయాడు. మరునాడు పనులవ్వగానే ఫెన్స్ దగ్గరికి పరిగెట్టాడు ష్మోల్ ని కలిసి క్షమాపణ చెప్పుకోవాలని. కానీ ఆరోజు ష్మోల్ రానేలేదు. చాలాసేపు ఎదురుచూసి నిరాశగా వెనక్కి వచ్చేసాడు. అలా మూడురోజులు ష్మోల్ కనిపించలేదు. ష్మోల్ ఇక తనని కలవడానికి రాడేమో, తన మీద కోపం వచ్చిందేమో అని దిగులు పడ్డాడు బ్రూనో. మూడోరోజున వేచి వేచి, ఇక రాడని వెళ్ళిపోడానికి బయలుదేరుతున్న సమయంలో దూరంనుంచి ష్మోల్ రావటం కనిపించింది. దగ్గరికి వచ్చిన తరువాత చూస్తే ష్మోల్ మొహం అంతా కమిలిపోయి ఉండటం చూసి బ్రూనోకి చాలా బాధ కలిగింది. ష్మోల్ చేతులు పట్టుకుని బ్రూనో 'లెఫ్టినెంట్ కర్ట్ వట్టి దుర్మార్గుడనీ, అతని భయంతోనే తను అలా అబద్ధం చెప్పాననీ, తనని క్షమించమని' అడిగాడు. ష్మోల్ నెమ్మదిగా నవ్వి పర్లేదులే అన్నాడు. ష్మోల్ తనని క్షమించినందుకు బ్రూనో సంతోషంతో వూపిరి పీల్చుకున్నాడు.

కాలం ఇంకొన్ని వారాలు గడిచింది. అప్పటికి బ్రూనో ష్మోల్ ఫ్రెండ్స్ అయి ఓ ఏడాది అయింది. ఈ మధ్యకాలంలో బ్రూనో తల్లికి, తన భర్తకి హిట్లర్ అప్పగించిన స్పెషల్ బాధ్యత ఏమిటో చూచాయగా తెలిసింది. అతను చేస్తున్న పని తనకి నచ్చలేదనీ, అది అన్యాయమనీ భర్తతో గొడవ పెట్టుకోడం మొదలయ్యింది. అమ్మా నాన్నల మధ్య గట్టిగా వాదనలు జరగటం బ్రూనో గమనించాడు. విషయమేమిటో బ్రూనోకి పూర్తిగా తెలీకపోయినా, అమ్మకి ఇక్కడ ఉండటం ఇక ఇష్టం లేదనీ, తిరిగి బెర్లిన్ వెళ్ళిపోవడానికి పట్టుపడుతోందనీ అర్ధమయింది. ఒకరోజు నాన్న పిల్లలిద్దరినీ తన ఆఫీసు రూమ్ లోకి పిలిచి మాట్లాడి 'అమ్మా, మీరు కలిసి వెనక్కి బెర్లిన్ వెళ్ళిపొండి. పిల్లలు పెరగటానికి ఇక్కడ సరైన వూరు కాదు అని అమ్మ అనుకుంటుంది. నా ఉద్యోగం వలన నేను ఇంకొన్నాళ్ళు ఇక్కడే ఉండాలి' అని చెప్పారు. బ్రూనోకి ఆ విషయం ఇదివరకటిలా సంతోషం కలిగించకపోగా, ష్మ్యోల్ ని వదిలి వెళ్ళిపోవాలన్న ఆలోచన దిగులుని కలిగించింది. ఆ కంగారులో నోరు జారాడని తనకి అర్ధమయ్యేలోగానే

'ఇక్కడ కూడా చాలామంది పిల్లలున్నారు కదా, కాకపోతే దూరంగా ఫెన్స్ కి అటువైపు ఉన్నారు' అన్నాడు.

ఒక్కసారిగా నాన్న షాక్ తిని ' ఏమన్నావ్? వాళ్ళ గురించి నీకెలా తెలుసు? అక్కడేం జరుగుతోందో నీకేం తెలుసు?' అని అడిగితే బ్రూనో సర్దుకుని

'నేను నా గది కిటికీ నుంచి వాళ్ళు బయట తిరగటం చూసాను. అంతే.' అన్నాడు.

దానితో నాన్న స్థిమిత పడి 'అంతే కదా. సరే అయితే. కానీ అమ్మ చెప్పింది నిజమే. ఇది మీకు సరయిన ప్లేస్ కాదు. ఈ వారమే బెర్లిన్ వెళ్ళిపొండి అందరూ.' అని చెప్పి పంపేశారు.

షామ్ల్ పరిచయమయ్యేంతవరకూ ఆ వూరి నుంచి ఎప్పుడు వెనక్కి వెళ్ళిపోదామా అని ఎదురు చూసిన బ్రూనోకి, ఇప్పుడు విపరీతమయిన దుఃఖం కలిగింది. చేసేదేమీ లేక మౌనంగా వెళ్ళిపోయాడు. మర్నాడు కలిసినపుడు తన స్నేహితుడికి ఈ విషయం చెప్పి వీడ్కోలు తీసుకోవాలనుకున్నాడు.

మరుసటి రోజు వాళ్ళు కలుసుకునే సమయానికి ఫెన్స్ దగ్గరికి వెళ్ళి షామ్ల్ కోసం ఎదురు చూసాడు కానీ తను రానే లేదు. వరుసగా మూడురోజులు కనిపించలేదు. ఇక రెండు రోజుల్లో తను వెళ్ళిపోతున్నాడు, స్నేహితుడికి వీడ్కోలు చెప్పకుండానే వెళ్ళాలేమో అనుకుంటుంటే నాలుగో రోజు షామ్ల్ వచ్చాడు, కానీ చాలా దిగులుగా ఉన్నాడు. ఏమయ్యిందని అడిగిన బ్రూనోతో తన తండ్రిని సైనికులు మూడురోజులక్రితం తీసుకువెళ్లారనీ, ఆయన ఇప్పటివరకు తిరిగి రాలేదనీ, ఎంత వెదికినా కనిపించనేలేదనీ చెప్పాడు. బ్రూనో ఆయన్ని వెదకడానికి తన తండ్రి సహాయం అడుగుతాను అంటే,

'వద్దు. అసలే సైనికులకి మేమంటే ఏమీ ఇష్టం లేనట్టుంది' అని అడ్డుచెప్పాడు.

బ్రూనో తను బెర్లిన్ తిరిగి వెళ్ళిపోతున్న విషయం చెప్పి, ' రేపొక్క రోజే మనం ఇక కలిసేది. నువ్వెప్పుడన్నా బెర్లిన్ రా మనం కలిసి ఆడుకోవచ్చు' అని పిలిచాడు. ఇంకా 'మనం ఏడాది నుంచీ ఇక్కడ కలుస్తున్నా, నా గది కిటికీ లోంచి చూడటం తప్ప మీ ఇల్లున్నచోటు నేనెప్పుడూ చూడనేలేదు. ఒక్కసారి నువ్వుండే చోటికి వచ్చి చూడాలనుంది' అని అడిగాడు.

నీకు అక్కడ నచ్చదు అని ఎంత చెప్పినా వినడు. చివరికి షామ్ల్ ఒప్పుకుని తను వేసుకునేలాంటి బట్టలు వేరొక జత మర్నాడు తెస్తాననీ, అలా అయితే సైనికులు గుర్తు పట్టరనీ చెప్పాడు. బ్రూనో తామిద్దరం కలిసి అప్పుడు షామ్ల్ తండ్రిని కూడా వెదకొచ్చు అని చెప్పాడు.

మర్నాడు అదే వేళకి ఇద్దరూ ఫెన్స్ దగ్గర కలుసుకున్నారు. తను వేసుకున్న బట్టలు, బూట్లు విప్పి ఫెన్స్ పక్కన వదిలేసి, షామ్ల్ తెచ్చిన చారల పైజామా వేసుకుని, చారల టోపీ పెట్టుకున్నాడు బ్రూనో. అంతకు కొన్ని రోజుల ముందే తలకి పేలు పట్టాయని గుండు కూడా చెయ్యడంతో, దాదాపు షామ్ల్ లానే ఉన్నాడు బ్రూనో. ఫెన్స్ ని కొంచెం క్రిందనుంచి పైకి ఎత్తితే బ్రూనో దూరగలిగేంత ఖాళీ వచ్చింది. అందులోంచి బ్రూనో అవతల వైపుకి పాకి వెళ్ళాడు. ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న అవకాశం రావటంతో బ్రూనో కి చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. తనుండే చోటికి తన స్నేహితుడు రాబోతుండటం, తండ్రిని వెదకటానికి సాయం చేస్తాను అనడం షామ్ల్ కి కూడా ఉత్సాహాన్ని కలిగించింది. ఇద్దరూ సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి చేతులు ఒకరు పట్టుకుని కలిసి ఆ గుడిసెల వైపు నడవటం మొదలెట్టారు.

ఆ తరువాత బ్రూనోని ఎవరూ చూడలేదు. తన కోసం సైనికులు చుట్టూపక్కల వూర్లన్నీ వెదికినా జాడ తెలీలేదు. కొన్ని రోజుల తరువాత ఒకరికి ఫెన్స్ పక్కన బ్రూనో బట్టలు బూట్లు దొరికాయి. బ్రూనో తండ్రి అక్కడికి వెళ్ళి చూసి, ఎంత అలోచించినా బ్రూనో ఏమయ్యాడో కనిపెట్టలేకపోయారు. బ్రూనో తల్లి కొడుకు కబురు ఏమన్నా తెలుస్తుందేమో అని కొన్ని నెలలు వేచి చూసి, ముందే బెర్లిన్ వెళ్ళిపోయి తనకోసం అక్కడ ఎదురు చూస్తున్నాడేమో అని అనుమానం వచ్చి బెర్లిన్ వెళ్ళిచూసినా, బ్రూనో అక్కడా లేదు.

కొన్నాళ్ళకి బ్రూనో తండ్రికి ఏం జరిగి ఉంటుందో లీలగా అనుమానం వచ్చి ఫెన్స్ దగ్గర బట్టలు దొరికిన చోటకి వెళ్ళి చూస్తే, ఫెన్స్ క్రింద చిన్న పిల్లాడు దూరగలిగేంత ఖాళీ కనిపించింది. అది చూస్తే ఆయనకీ ఏం జరిగి ఉంటుందో అర్ధమయ్యి, శక్తి కోల్పోయి ఆ ఫెన్స్ దగ్గరే కూలబడిపోయారు. ఇదీ బ్రూనో అనబడే ఓ పాలబుగ్గల పసివాడి కథ.

హోలోకాస్ట్ అనేది చరిత్రలో అతి క్రూరమైనదీ, అమానుషమైనదీనూ. (ఒక్క Auschwitz గేస్ ఛాంబర్ లోనే, ప్రపంచంలో ఇక ఎక్కడా జరగనంత ఎక్కువమంది మృత్యువు పాలయ్యారట.) ఆ సమయంలో వాటిని దగ్గర నుండి చూసిన వారికీ, వారి సంబంధీకులకీ చేదు జ్ఞాపకాలు, అనుభవాలు ఇప్పటికీ వెంటాడుతాయి. హోలోకాస్ట్ ఆధారంగా చేసుకుని చాలా జీవితానుభావాలూ, వినిపించిన కథలూ చాలా పుస్తకాలుగా వచ్చాయి. కాకపోతే వాటిన్నిటిలోనూ ఆ భయానక జ్ఞాపకాలు, అవి వదిలిన గాయాల మచ్చలు స్పష్టంగా కనిపిస్తూ మనల్ని చెప్పలేనంత విచారాన్ని, అప్పటి పరిస్థితుల పట్ల ఏహ్యతనీ కలిగిస్తాయి. అయితే ఈ పుస్తకంలో ఎక్కడా ఆ ఛాయలు ఉండవు. మొత్తం ఒక చిన్నపిల్లాడి దృక్పథంలోంచి ఓ కథ వింటున్నట్టే ఉంటుంది. చివరివరకూ కూడా విషాదఛాయలు ఎక్కడా కనిపించవు. మనకి ఒక అమానుషమైన పరిస్థితులు ఉన్న కాలం నాటి కథ చదువుతున్నామన్న స్పృహ కూడా రాదు. సైనికుల ప్రవర్తన కూడా ష్మోల్ ద్వారా అమాయకంగా సూచనగా మాత్రమే చెప్పిస్తారు రచయిత. కథ పూర్తయ్యేసరికి మాత్రం మనసులో స్థబ్దత నిండి మాటలే కాదు, ఇంకే ఆలోచన కూడా రాకుండా నిస్తేజం చేస్తుంది. మనసు ఆ ఇద్దరి పసివాళ్ళకోసం ఆక్రోశిస్తుంది. ఏం సాధించిందీ మానవజాతి అని ఛీత్కారం చెయ్యాలనిపిస్తుంది.

బ్రూనో వయసు ఉన్న పిల్లలకు, తండ్రి ఏం చేస్తున్నాడో, తన ఇంటి చుట్టుపక్కల పరిస్థితులు, జరుగుతున్న యుద్ధం విషయాలూ తెలీకుండా అంత అమాయకంగా ఉంటారా అనీ, అలా ఏడాది పాటు ఇద్దరు పిల్లలు సైనికుల కన్నుకప్పి కలవటం అనేది సాధ్యమయ్యేదేనా అనీ కొన్ని విమర్శలు ఉన్నాయి. ఈ ఎలక్ట్రానిక్ యుగంలో టీవీల పుణ్యమా అని ఎన్నో విషయాల గురించి పెద్దలు పనిగట్టుకుని చెప్పనవసరం లేకుండానే పిల్లలకు తెలిసిపోతున్నాయి. ఈమధ్యకాలంలోనే పెద్దలు కూడా పిల్లలతో వారి వయసుని బట్టీ వారికి అర్ధమయ్యే విధంలో, అవసరమయినంత మేరకు జరుగుతున్న మంచీ చెడూ వివరించి చెప్పటం, చర్చలు చెయ్యడం చేస్తున్నారేమో గానీ, మనం పిల్లలుగా ఉన్నప్పుడు మన వయసుకు అవసరం లేదు అనుకున్న వాటిని, మీకు అనవసరం అని చెప్పి వాటి నుంచి మనల్ని షీల్డ్ చేసి దాచటం చాలావరకు జరిగేది. అటువంటప్పుడు ఎప్పుడో 1943 సమయంలో బ్రూనో అమాయకత్వం, బయట జరుగుతున్న విషయాలు తెలీకపోవడం అనేది పెద్దలోపంగా కనిపించదు. అందులోనూ రచయిత ముందే చెప్పినట్టు ఇది ఒక ఫేబుల్ అంటే కల్పిత కథ. ఈ పుస్తకానికి ఎజెండా హోలోకాస్ట్ వికృత రూపాన్ని చూపించే ప్రయత్నం కాదు. పెద్దలు చేసే వికృత కార్యాలూ, నిర్ణయాలూ పిల్లల దృష్టినుండి చూస్తే ఎలా ఉంటాయీ, వాటి ప్రభావం వాళ్ళ మీద ఎలా ఉంటుందీ అనేది తెలుస్తుంది. అలానే బ్రూనో ఫెన్స్ దాటటం అనేది, మనం మనసులకి కట్టుకున్న ఫెన్స్ దాటి తోటి మనుషులతో స్నేహాన్ని పెంచుకోవాలన్న ఆశ, సూచన కూడా కావచ్చు. కొన్ని సార్లు బ్రూనో ఆలోచనలు చూస్తే మొత్తం కథనం తేలికగా ఉండటంతో, కథగా కదిలించకపోయినా ముగింపు మాత్రం చాలా రోజులు వెంటాడుతుంది.




రచయిత ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు *"Only the victims and survivors can truly comprehend the awfulness of that time and place; the rest of us live on the other side of the fence, staring through from our own comfortable place, trying in our own clumsy way to make sense of it all."* రచయిత కథని *"Of course all this happened a long time ago and nothing like that could ever happen again."* అనే ఆశావాదంతో ముగిస్తారు.

ఈ పుస్తకాన్ని 2006లో వ్రాసారు. ఐర్లాండ్ లో రెండు అవార్డ్లు, స్పెయిన్లో ఇంటర్నేషనల్ బెస్ట్ బుక్ అవార్డునూ పొందింది. దాదాపు రెండేళ్లు ఐర్లాండ్ లోనూ, స్పెయిన్లోనూ బెస్ట్ సెల్లర్ గా నిలబడింది. ఈ పుస్తకానికి వచ్చిన అవార్డులూ, నామినేట్ చేయబడిన అవార్డుల వివరాలు ఇక్కడ చూడొచ్చు. 2008 లో సినిమాగా వచ్చింది. కథకి ఎక్కువ మార్పులుచెయ్యకుండా, పుస్తకంలో ఉన్న ఇంటెన్సిటీ కోల్పోకుండా చక్కగా తీసారు. సినిమా కూడా చాలా ప్రశంసలూ, విమర్శలూ కూడా పొందింది.



**రచయిత గురించి:** John Boyne ఐర్లాండ్ కు చెందిన రచయిత. ఆయన ఎనిమిది నవలలూ, నాలుగు పిల్లల నవలలూ, దాదాపు డెబ్బయ్ కథలూ వ్రాసారు. ఆయన రచనలు 46 భాషల్లోకి అనువదించబడ్డాయి. ఐర్లాండ్ లోనూ, విదేశాల్లోనూ ఆయన రచనలు చాలా ప్రశంసలు పొంది, అవార్డులు గెలుచుకున్నాయి. ఆ వివరాలు ఆయన వెబ్ సైట్ లో చూడవచ్చు. ఆయన రచనలకు గానూ 2012 లో ఆయనకు 'Hall of Fame' గుర్తింపు గూడా లభించింది.

(Images Source: Internet)



# పుస్తకం ఓ నేస్తం

## – పద్మవల్లి



### *The Forgotten Daughter – Renita D'Silva*

మనిషికి కుటుంబం అనేది కనిపించని కోటలాంటిది. ఏ పరిస్థితుల్లోనయినా సరే అండగా ఉండే స్వంతవాళ్ళున్నారు అనే ఆలోచన గొప్ప భరోసాని కలిగిస్తుంది. మనవాళ్ళని ప్రేమిస్తాము, అలుగుతాము, సాధిస్తాము, పోట్లాడతాము, ఏడుస్తాము, తిరగబడతాము. అవన్నీ మనకి వాళ్ళమీద రక్త సంబంధంతో వచ్చిన హక్కులు అని ధీమా. అటువంటిది తనవాళ్ళు అని తను నమ్మినవారు తనకేమీ కారనీ, అసలు స్వంతవాళ్ళు తనని అక్కర్లేదు అని దూరం చేసుకున్నారని తెలిస్తే...???




నిషా లండన్ లో స్టాటిస్టికల్ ఎనలిస్ట్ గా పనిచేస్తున్న ఇండియన్ యువతి. లెక్కలే ఆమె ప్రపంచం. ఆమె తల్లిదండ్రులు లేఖా కామత్ , రవి కామత్ లు ఇద్దరూ పేరొందిన సైంటిస్ట్స్. మాటల కన్నా చేతలు గొప్పవి అని నమ్మినవారు. సెంటిమెంట్స్ అసలు లేవు. చిన్నప్పటినుంచీ నిషాకి ప్రాక్టికాలిటీనీ, చదువు విలువ, శ్రమ విలువ నేర్పుతూ వచ్చారు. ఎప్పుడూ ప్రేమని బయటకి ప్రకటించడం అనేదాని మీద వాళ్లకి నమ్మకం లేదు. ఎప్పుడూ నిషాకి we love you అని చెప్పలేదు కానీ ఆమెను ప్రేమతోనూ క్రమశిక్షణతోనూ పెంచారు. చిన్నప్పటి నుంచీ కూడా ఏడ్చి సాధించుకోవడం లాంటివి సాగనివ్వలేదు. కావాల్సినది పొందాలంటే దానికి తగిన అర్హత తెచ్చుకోవాలని చెప్పేవారు. నిషాకి కూడా వారి అలవాట్లే వచ్చి, ఎంత చిక్కు సమస్యలొచ్చినా కూడా మనసులోనే కష్టమైన లెక్కలు సాధన చేసుకుంటూ ఎమోషన్స్ కంట్రోల్ చేసుకోవడం, భావోద్వేగాలను దాచుకోవడం అలవాటైపోయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తొణకని వ్యక్తిత్వం ఆమెది.

నిషా బోయ్ ఫ్రెండ్ మేట్, ఒక కాలేజ్ లో మాథ్స్ ప్రొఫెసర్. అతనికి నిషా అంటే ప్రాణం. మేట్ తెలివైనవాడు, మంచి మనసున్నవాడు. నిషాని కలిసిన మొదటిసారే ఆమె తెలివితేటలకి ఆకర్షించబడ్డాడు. వారి స్నేహం నెమ్మదిగా ఇష్టంగా మారి, ఇద్దరూ కలిసి ఒకే అపార్ట్మెంట్లో నివసిసించేవరకూ వచ్చింది. నిషా తల్లిదండ్రులకు కూడా అతను నచ్చాడు. మేట్ పెళ్ళిచేసుకుందాం అని ఎన్నిసార్లు అడిగినా,

ఇంకా తనకి కొంత టైం కావాలని నిషా దాటవేస్తుంది. తనకి మేట్ అంటే అభిమానం, స్పెషల్ ఫీలింగ్స్ ఉన్నాయని ఆమెకు తెలుసు, కానీ అది ప్రేమేనా అని ఆమెకి అనుమానం. ప్రేమ ప్రకటించడం అలవాటు లేదేమో, ఎపుడూ love you అని అతనికి చెప్పలేదు. ఎపుడన్నా చెప్పాలని అనిపించినా కూడా, గొంతు నొక్కుకుపోయినట్టయి మాట పెగలదు. ఆమె మనస్తత్వం తెలిసిన వాడవటడం వలన మేట్ అర్థం చేసుకుని ఓపికగా ఎదురుచూస్తూ ఉంటాడు.

నిషా తల్లిదండ్రులిద్దరూ ఒక కారు ప్రమాదంలో మరణిస్తారు. నిషా ఉన్నట్టుండి ఒంటరిదయిపోయింది. వాళ్ళ అంత్యక్రియల సమయంలో కూడా దుఃఖం ముంచుకొచ్చినా ఎలాగో తమాయించుకుని అందరిముందూ ఏడవకుండా బయటపడింది. వాళ్ళ లాయరు తల్లిదండ్రులు నిషా కోసం వ్రాసిన ఒక లెటర్ ఇచ్చాడు. అందులో "నిషా, నువ్వు మా స్వంత కూతురివి కాదు." అన్న మొదటి వాక్యం చూడగానే నిషాకి ఒక్కసారిగా తన ప్రపంచం కూలిపోయిన ఫీలింగ్. కొన్ని నిమిషాలు ఏమీ అర్థం కాలేదు. వాళ్ళు జోక్ చేస్తున్నారేమో అనుకుంది ముందు, కానీ వాళ్ళ సంగతి తెలిసినదవటంతో నిజమే అని నమ్మాల్సి వచ్చింది. ఇంకా అందులో "నీకు ఈవిషయం ఈ లెటర్ ద్వారా తెలుస్తుందీ అంటే, ఇప్పటికి మేము లేము అని అర్థం. లేకపోతే మేమే నీకు ఎప్పుడో స్వయంగా చెప్పాలనుకున్నాము. నిన్ను మేము మంగళూర్ దగ్గర ధోనికట్టే లోని ఒక క్రిస్టియన్ కాన్వెంట్ నుండి తెచ్చుకున్నాము. కానీ మేమిద్దరం నిన్ను నిజంగా ప్రేమించాము." అనీనూ, కాన్వెంట్ అడ్రెస్, ఫోన్ నంబర్ మాత్రం ఉన్నాయి.

నిషాకి మెదడు షాక్ తో పనిచెయ్యడం మానేసింది. ఎన్నో ఆలోచనలు, జ్ఞాపకాలూ, ప్రశ్నలూ, వేదనలూ ఆమెని ఆక్రమించాయి. ఊహ తెలిసిన నుంచీ ఆమెకి తను కేవలం బ్రిటీష్ దేశస్తురాలు మాత్రమే అనీ, ఇండియాతో తనకేమీ సంబంధం లేదనీ గట్టి అభిప్రాయం. దానికి తగ్గట్టే ఎప్పుడూ సెలవుల కోసం కూడా వాళ్ళు ఇండియా వెళ్ళలేదు. మిగతా ఇండియన్స్ వెళ్తున్నట్టూ మనం ఎందుకు ఇండియా శెలవులకి కి వెళ్లడం లేదూ అని అడిగినదానికి, తల్లి తమకి అక్కడ ఎవరూ చుట్టాలు లేరు వెళ్ళడానికి అని చెప్పింది. కానీ సెలవుల్లో తనకి కన్నడ భాష కూడా నేర్పించారు. ఎందుకూ అని అడిగితే అది మన మాతృభాష కాబట్టి నువ్వూ నేర్చుకోవాల్సిందే అని చెప్పారు. ఇన్నాళ్ళూ తను వీళ్ళే తన స్వంత తల్లిదండ్రులు అనుకుంది. ఇపుడు అది అబద్ధం అని తేలిపోయింది. ఇన్నాళ్ళు తనకి చెప్పకుండా మోసం చేసారని కూడా అనుకుంది. తను వాళ్ళ పిల్ల కాకపోతే మరి తన తల్లిదండ్రులెవరు? వాళ్ళు తనని ఎందుకు వదిలేసారు? ఏ పరిస్థితుల్లో తనని ఇచ్చెయ్యాల్సి వచ్చింది? తనని ఎందుకు వద్దనుకున్నారు? తను కాన్వెంట్లో దొరికింది అని చెప్పారు అంటే తన అసలు వాళ్ళు తనని కాన్వెంట్లో వదిలేసారన్నమాట. అసలు ఇది నిజం అని నమ్మడానికి ఋజువు ఏమిటి అనుకుంది. ఏదీ ఋజువు లేకుండా నమ్మకూడదని ఆమెకి తల్లిదండ్రులే నేర్పించారు మరి. అపుడు ఆమెకి, తన చిన్నప్పటి ఫొటోస్ ఏమీ లేవని గుర్తొచ్చింది. తన చిన్నప్పటి ఫొటోస్ లేవేమని అడిగితే తల్లి అవన్నీ ఒక అగ్నిప్రమాదంలో కాలిపోయాయని చెప్పింది. అది నిజం కాదనీ, అవి లేకపోవడమే ఈ విషయం నిజమనడానికి ఋజువు అని అర్థమయ్యింది నిషాకి. ఐదేళ్ళ వయసున్నప్పుడు మొదటిసారి స్కూల్కి వెళ్తున్నప్పుడు తీసిన ఫోటోలు గుర్తొచ్చాయి. తనకి తెలిసినంతవరకూ అవే తన మొదటి ఫోటోలు. వాటిలో తనకి నోటికి పెద్ద గ్రహణపు మొర్రి ఉండటం గుర్తుకొచ్చింది. తరువాత దానికి ఆపరేషన్ చేసి సరిచెయ్యడంతో ఇపుడు దాని గుర్తుగా ఒక మచ్చ మాత్రం మిగిలింది.

నిషాకి మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి. తన నోటి మొర్రి వలన వికృతంగా ఉండటమే తనని కన్నవాళ్ళు వదిలించుకోడానికి కారణమా అనుకుంది. తనకి మొదటి ఫోటో ఐదేళ్ళప్పుడు ఉంది అంటే, తనని వాళ్ళు అప్పుడే తీసుకొచ్చుకుని ఉండాలి. మరి మనిషికి మెదడులో జ్ఞాపకాలు మూడేళ్ళ వయసు నుండీ ఉంటాయంటారు కదా, మరి తనకి ఎందుకని ఏమీ గుర్తు లేవు అనుకుంది. తన కన్నవాళ్ళు తనని అక్కర్లేదని వదిలించుకున్నారు అన్న వూహని ఆమె భరించలేకుండా ఉంది. పెంచుకున్నవాళ్ళు ప్రేమగా చూసుకున్న విషయాలు గుర్తుకొచ్చినా అవి ఏమాత్రం సాంత్వన ఇవ్వటం లేదు ఆమెకి. అప్పటి వరకూ తనకో కుటుంబం ఉండేది, తనకో అస్తిత్వం ఉండేది. ఇపుడు అసలు తానెవరో తన మూలాలేమిటో కూడా తెలీకుండా పోయాయి. తన ప్రపంచం మొత్తం తలక్రిందులైన భావం. తనెవరికీ అక్కర్లేదు, తనకెవరూ లేరు, తనని ఎవరూ ప్రేమించలేదు అన్న భావం ఆమెని కృంగదీసింది. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలీనట్టు అయిపోయింది. దుఃఖం కోపం అదుపు చేసుకోలేక, ఇంట్లోని సామానులు విసిరి పగలగొట్టింది. పిచ్చిగా కేకలు పెట్టింది. ఆమెలోని స్థిరత్వం, పరిణితి మాయమయ్యి, బేలగా వెక్కివెక్కి ఏడ్చింది. కొంచే తేరుకున్న తరువాత తనేనా అలా సమతుల్యత కోల్పోయిందని ఆమెకే ఆశ్చర్యం కలిగింది.

నిషాకి తనని ఎందుకు వదిలేసారు అన్నది పెద్ద వ్యధగా మారింది. 'ఒకవేళ తన అసలు తల్లికి పెళ్లి కాకుండానే తను పుట్టిందేమో, ఓ ఇరవయ్యేళ్ళ క్రితం రోజుల్లో ఇండియాలో ఆమెకు అది పెద్ద సమస్యగానే పరిణమించి ఉండాలి. బహుశా అందుకే నన్ను చర్చ్ లో వదిలేసిందేమో. నా వికృతమైన మొర్రి కారణం అయిఉండదు ' అనుకుంది. మళ్ళీ 'ఏమో రెండూ కారణాలేనేమో' అనుకుంది. ఏ ఆలోచనా ఆమెకి ఊరటనివ్వలేదు. ' నా అసలు తల్లిదండ్రులెవరు? నన్నెందుకు వదిలించుకున్నారు? అసలు నేనెవరిని?' అనే ప్రశ్నలు పదేపదే ఆమెని వేధించసాగాయి. ఆమె మనస్థైర్యాన్ని కోల్పోయింది. ఈ ప్రశ్నలకి సమాధానాలు తెలుసుకునే వరకు తనకి మనశ్శాంతి ఉండదని ఆమెకి అర్ధమయ్యింది.

అంతకు కొన్నిరోజుల క్రితం నుంచీ నిషాకి ఏదో అస్పష్టమయిన కల వచ్చేది. కలలో ఏం జరిగిందో గుర్తు ఉండదు కానీ, మెలకువ తర్వాత కూడా వదలని మల్లెల పరిమళం, యేవో పురా స్మృతులు వెంటాడుతున్న భావన. తనే రోజూ మల్లెపూలని చూడలేదు, మల్లెల సెంట్ వాసన తప్ప. ఆ కలకి అర్ధం ఏమిటా అని రీసెర్చ్ చేసింది కానీ ఏమీ తెలీలేదు. ఇపుడు హటాత్తుగా ఆ కలకి పొడిగింపు గుర్తుకు రాసాగింది ఆమెకి. చర్చ్ లో ప్రార్ధనకు కూర్చునే బెంచీల వాసన , మల్లెల అత్తరు కలిసి వ్యాపించిన కర్పూరపు పరిమళం, సన్యాసినులు మంద్రంగా పాడుతున్నప్రార్ధనా గీతాలు... నిషాకి అది నిజంగా కలలో జరిగిందా, లేక తన మెదడులో తనకి తెలీకుండానే జరుగుతున్న కల్పనలా అన్న అనుమానం కలిగింది. అసలు తను చర్చ్ లో ఎందుకుంది? తను హిందువా లేక క్రిష్టియనా అనుకుంది. తల్లితండ్రుల ఇంట్లో తన గురించి ఇంకేమన్నా వివరాలు దొరుకుతాయేమో అని వెతకటం మొదలు పెట్టింది. చివరికి ఒక ఫైల్ లో ఇండియాలోని వాళ్ళ పరిశోధన వివరాలతో పాటు, మంగుళూర్ లో ట్విన్స్ ఉన్నారని తెలిసినట్టు, వారిలో ఒక పాపకి మొర్రి ఉన్నట్టు రాసుకున్న నోట్స్ కనిపించాయి. చూడగానే అవి తన గురించే అని అర్ధమయ్యింది నిషాకి. అదే ఫైల్లో ఒకే రూపుతో ఉన్న నెలల వయసున్న కవలపిల్లల ఫోటో దొరికింది. ఇద్దరూ అచ్చం ఒకేలా ఉన్నారు అయితే, ఒక పాప మామూలుగా ఉంటే, ఇంకో పాపకి మాత్రం నోరు గ్రహణపు మొర్రి ఉంది. తనకి ఒక కవల సోదరి ఉందన్న విషయం నిషాకి సంతోషాన్ని విచారాన్ని ఏకకాలంలో కలుగచేసాయి. 'తన సోదరి కూడా తనతో పాటే చర్చ్ లో ఉండేదా? మరి తన గురించి తనకెందుకు ఏమీ గుర్తులేదు' అనుకోసాగింది. ఆ విషయాలే ఆలోచిస్తూ మగత నిద్రలోకి

జారుకుంది నిషా. ఆ మగతలో జ్ఞాపకాల అట్టడుగు పొరల్లోనుంచి కొన్ని సంఘటనలు అస్పష్టంగా గుర్తుకు రాసాగాయి. ఒక మూడు నాలుగేళ్ల చిన్నపిల్ల ఒక కాన్వెంట్ బిల్డింగ్ లోని చర్చ్ లో పరుగులు పెట్టడం... మల్లెపందిరి పక్కన కూర్చుని పూలు మాల కడుతున్న సిస్టర్ ప్రియ మెడ చుట్టూ చేతులు వేసి వూగుతూ ఆడటం... ముందున్న తోటలో ఆడుకుంటుంటే, దాని గేట్ వూచలలోంచి ఎవరో స్త్రీ తనని గమనిస్తూ, ఆ పాప ఆమెని చూసిందని తెలియగానే కనిపించకుండా పక్కకి పోయిన సంగతి, ఆమెని గుర్తు పట్టి పరుగున గేటు దగ్గరికి వెళ్ళి, ఆ వూచల్లోంచి బయటకు చూస్తూ గాట్టిగా ఏడవటం... ఆ స్త్రీ కనిపించకుండా పోతే పరుగున కాన్వెంట్ లోపలికి వెళ్ళి సిస్టర్ ప్రియ దగ్గరికి వెళ్ళి కౌగలించుకుని ఏడవటం... లీలగా గుర్తుకు రాసాగాయి. మెలకువ వచ్చిన నిషాకి కలలోని సంగతులు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆ సిస్టర్ ప్రియ ఎవరో గానీ ఆమె దగ్గర తనకు బాగా చేరిక అని అర్ధమయ్యింది. అవి కేవలం కల కాదేమో, తన చిన్నప్పటి జ్ఞాపకాలేమో అనిపించాయి. 'మరి ఆ జ్ఞాపకాల్లో తన సోదరి ఎందుకు లేదు? తనకి నేను గుర్తున్నానా? తను నన్ను ఎప్పుడన్నా మిస్ అయ్యిందా? ' అన ప్రశ్నలూ కలిగాయి. ఇపుడు అచ్చం తనలాగే ఉన్న తన సోదరిని కలుసుకోవాలన్న కోరిక బలంగా కలిగింది నిషాకి.

ఇండియా వెళ్ళి అయినా అసలు విషయాలు తన మూలాలు కనుక్కోవాలని నిషా నిశ్చయించుకుంది. లేకపోతే తనకి శాంతి ఉండదని ఆమెకు అర్ధమయింది. మేట్ కూడా ఆ విషయాలు తెలుసుకుంటేనే ఆమెకి శాంతి, లేకపోతే ఆవిషయం ఆమెని స్థిమితంగా ఉండనివ్వదు అనుకుని, దానికి ప్రోత్సహించాడు. తల్లి ఉత్తరంలో వ్రాసిన కాన్వెంట్ ఫోన్ నంబర్ కు కాల్ చేసింది నిషా. ఫోన్ ఆన్సర్ చేసిన నన్ తో ప్రియ తన విషయం చెప్పి, ఆ కాన్వెంట్ నుంచి తనని దత్తత ఇచ్చినట్టయితే ఆ వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాను అని అడిగింది. ఆమె తమ దగ్గర పాత రికార్డులేవీ లేవనీ, అయినా మరునాడు ఫోన్ చేస్తే ఈలోగా వెదికి చెప్తానని చెప్పింది. ' సిస్టర్ ప్రియ అని ఎవరన్నా అక్కడ ఉన్నారా?' అని అడిగితే ఆమె 'ఒకప్పుడు ఉండేవారు, ఇపుడు వృద్ధ్యాప్యం వలన ఆరోగ్యం పాడయి హాస్పిటల్లో దాదాపు కోమాలో ఉన్నారు.' అని చెప్పింది. అప్పట్లో కాన్వెంట్లో పని చేసిన వాళ్ళకెవరికైనా తెలుస్తుందేమో అని నిషా అంటే, అప్పటి వాళ్ళు ఎవరూ ఇపుడక్కడ లేరని, అయినా ప్రయత్నిస్తానని చెప్పింది ఆ నన్. మరునాడు కాన్వెంట్ కి ఫోన్ చేస్తే ఆ నన్ తను కొన్ని విషయాలు తెలుసుకోగాలిగాననీ, తనెలాగూ ఇండియా రావాలనుకుంటుంది కాబట్టి వచ్చిన తరువాత స్వయంగా మాట్లాడొచ్చు అని చెప్పింది. ఆ సంగతి మేట్ కి చెప్పి వెంటనే ఇండియా ప్రయాణమయింది. మేట్ తానూ తోడు వస్తానన్నాడు కానీ, నిషా తానొక్కతే వెళతానని వారించింది. అవసరమయితే తనని రమ్మని పిలుస్తాను అని చెప్పింది. అక్కడేం విషయాలు తెలిసినా, ఏం జరిగినా అప్సెట్ అవ్వొద్దనీ, తల్లినీ చెల్లినీ కలిసి కొంతకాలం గడిపి తిరిగి తనదగ్గరికి వచ్చేయ్యమనీ, ఆమె కోసం ఎదురు చూస్తుంటాననీ చెప్పి పంపాడు. ఇండియా వెళ్ళిన తరువాత అక్కడేం తెలుసుకోవాల్సి వస్తుందో అనీ, తల్లి గానీ, సోదరి గానీ తనతో ఎలా ప్రవర్తిస్తారో, అసలు మాట్లాడటా నికి ఇష్టపడతారో లేదో లాంటి సందేహాలతో నిషా ఇండియా బయలుదేరింది.

దేవి ఒక కాలేజీ స్టూడెంట్. మంగుళూరు దగ్గర ఒక చిన్న పల్లెటూరిలో తల్లి శిల్పతో కలిసి ఉంటుంది. శిల్పకి దేవి మీదే పంచప్రాణాలూనూ. కూతురు మంచి ప్రవర్తనతో వూరిలో ఎవరిచేతా వేలెత్తి చూపించుకోకూడదని ఆమె ఆశ. అచ్చమైన టీనేజ్ అమ్మాయికి ప్రతీక దేవి. సమాజం అమ్మాయిల పట్ల చూపించే వివక్షా, అబ్బాయిలకి ఉన్న ప్రత్యేక హక్కులూ, రాయతీలూ అంటే విపరీతమయిన కోపం. అబ్బాయిలు వారికిష్టమొచ్చినట్టు ప్రవర్తించవచ్చు కానీ అమ్మాయిలు మాత్రం అణిగి ఉండాలి, అమ్మాయిలు అబ్బాయిలతో

మాట్లాడకూడదు అనే భావాలు ఆమెకు చిరాకు తెప్పిస్తూ ఉంటాయి. తల్లి చూపించే ప్రేమ కూడా ఆమెకి విపరీతంగా తోస్తుంది. అస్తమానూ తల్లిని విసుక్కుంటుంది ఆ అతి ప్రేమకి. ఎప్పుడు తల్లి నుండి దూరంగా వెళ్లిపోతానా అని ఎదురుచూస్తూ ఉంటుంది. కాలేజీలోనే తను ప్రేమించిన రోహన్ ని పెళ్లి చేసుకుని అతని పై చదువుల కోసం ఇంగ్లాండ్ వెళ్ళిపోతుంది. అక్కడ తనకి ఆంక్షలు పెట్టేవారు ఎవరూ లేరని, తనకి ఇష్టం వచ్చినట్టు స్వతంత్రంగా బ్రతకొచ్చనీ సంతోషించినా, కొన్ని రోజులకే ఆ జీవితం విసుగు పుట్టింది. తల్లి మీద బెంగ మొదలయ్యింది. తల్లి ప్రేమ కొంచెం కొంచెం అర్ధం అవ్వసాగింది. అప్పటి వరకూ ఎప్పుడు దూరంగా వెళ్ళిపోతానా అని చూసిన తను ఇపుడు తల్లిని ఎపుడు చూస్తానా అని ఎదురు చూస్తోంది. ఈలోగా తను తల్లి కాబోతుందని తెలిసి ఆ సంగతి తల్లితో పంచుకోవాలని ఫోన్ చేస్తుంటే ఎన్నిసార్లు చేసినా ఆమె ఫోన్ తియ్యడం లేదు. చివరకు ప్రక్కింటి ఆవిడ తీసి, తల్లికి కొన్నిరోజులుగా ఆరోగ్యం బాగోలేదని, కోమాలోకి వెళ్ళిపోయి ఆసుపత్రిలో ఉందనీ చెప్పింది. దేవి వెంటనే బయలుదేరి ఇండియాకి వచ్చి తల్లి దగ్గరే ఉండి ఆమె స్పృహలోకి వచ్చి తనని గుర్తుపట్టేరోజుకోసం ఎదురు చూస్తోంది. ఇంట్లో తల్లి డైరీ ఒకటి దొరికేతే అది చదువుతూ తనకి తెలియని తల్లి కథ తెలుసుకుంటోంది.

శిల్ప మంగళూరు దగ్గరి ఒక పల్లెటూరులో పేదరైతు కూతురు. ఆమెకు పదమూడేళ్ళ వయసులో తల్లి ఒక డైరీ బహుమతిగా ఇచ్చింది. ఆడపిల్ల బాధ్యత పెళ్ళిచేసుకుని చక్కని పిల్లలని కనడమే అని చెప్పేది తల్లి. భర్త ప్రేమను సంపాదించుకోడానికి మార్గం రుచికరంగా వండి పెట్టడమే అని చెప్పి శిల్పకు చక్కగా వంటలు నేర్పించేది తల్లి. ఆ వంటలను డైరీలో వ్రాసుకుని, వాటితో పాటు రోజూ జరిగిన ముఖ్య విషయాలని , తన ఆలోచనల్ని కూడా అందులో వ్రాసుకునేది శిల్ప. కొన్నాళ్ళకి ప్రక్క వూరి నుంచి మనోజ్ అనే రైతు యువకుడు పెళ్లిచూపులకోసం వచ్చి , శిల్పని ఇష్టపడి కట్నం లేకుండానే పెళ్లి చేసుకున్నాడు . మనోజ్ శిల్పని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. ఎన్నేళ్ళు గడిచినా వాళ్ళకి పిల్లలు కలగలేదు. ఇలవేల్పు గణపతికి మొక్కుకున్నా కూడా ఫలితం లేకపోయింది. ఆవూరి చివర చెట్ల క్రింద దేవి అనే ఒకామె ఇహపరాలు పట్టించుకోకుండా ఉండేది. అందరూ ఆమెని పిచ్చిది అనేవారు. శిల్పకు మాత్రం ఆమెకు మహిమలు తెలుసని నమ్మకం కలిగింది. ఆమెతో స్నేహంగా ఉండేది. ఒకరోజు ఆమెతో పిల్లలు కావాలని అడిగితే, 'నీకు పిల్లలు పుడతారు కానీ నువ్వు దానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది . అది నీకు ఇష్టమేనా' అని అడిగింది ఆమె. ఏమయినా పర్లేదు నాకు పిల్లలు కావాలి అని అడిగింది శిల్ప. సరే అయితే, వెళ్ళి గణపతికి పూజ చేసుకో అని చెప్పి పంపింది. కొన్నాళ్ళకు శిల్ప గర్భవతి అయింది. మనోజ్ ఆమెని ఎంతో ప్రేమగా జాగ్రత్తగా చూసుకోసాగాడు. శిల్పకు నెలలు నిండుతుండగా భార్యాభర్తలిద్దరూ పొలం నుంచి వస్తూ ఒకరోజు భయంకరమైన తుఫానులో జరిగిన ప్రమాదంలో మనోజ్ మరణించాడు. చావుబ్రతుకుల్లో కొట్టాడుతూ తనదగ్గరే ఉండమని శిల్పని అడుగుతున్నా, పొట్టలో పిల్లలను రక్షించుకోవాలని భర్తను అక్కడే వదిలేసి డాక్టరు దగ్గరకు పరిగెడుతుంది. మరణించే ముందు మనోజ్ నిస్సహాయపు చూపు ఆమెని వెంటాడుతూ బాధకు గురి చేస్తూ ఉంది.

శిల్పకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఒక పాప చక్కగా చందమామలా ఉంటే, రెండో పాపకి నోటి దగ్గర గ్రహణం మొర్రితో వికృతంగా ఉండేది. ఒకరికి దేవి అనీ , ఇంకొకరికి నిషా అని పేర్లు పెట్టింది శిల్ప. నిషాని చూసి వూరిలో అందరూ ఏదో శాపం తగిలిందనీ, ఆపాపని ఏవో దుష్టగ్రహాలు ఆవహించాయనీ శిల్ప మొహం మీదే అంటున్నా శిల్ప వాళ్ళని పట్టించుకోలేదు. అందరూ దేవిని ఎత్తుకుని ముద్దాడేవారు గానీ, నిషా వైపు చూసే వారు కాదు. దేవి ఆ పిల్లలిద్దరూ శిల్ప దగ్గర కొంత కాలమే ఉంటారనీ, ఒకరిని తను వదులుకోవాలనీ చెప్పింది. పిల్లల కోసం భర్తని పోగొట్టుకున్నాను కదా అని అడిగితే, 'ఇంకా ఆ బదులు తీరలేదు' అని చెప్పింది. ఇద్దరిలో ఎవరు అని అడిగితే

జవాబు చెప్పకుండా, ఉన్నన్నాళ్ళూ వాళ్ళతో చక్కగా గడుపు అని చెప్పింది దేవి. శిల్ప ఇద్దరినీ చక్కగా చూసుకోసాగింది. దగ్గర స్నేహితులు కూడా నిషాని ఉన్నట్టే గుర్తించనట్టూ ప్రవర్తిస్తుండడంతో శిల్ప నిషాని తనే జాగ్రత్తగా, ప్రేమగా చూసుకొనేది. అందరి చేతా నిర్లక్ష్యం చెయ్యబడ్డదని నిషా అంటే ప్రత్యేకమైన ప్రేమ శిల్పకి. పిల్లలకు రెండున్నరేళ్ళు ఉన్న టైంలో విపరీతమయిన జ్వరం వచ్చి ఎన్ని రోజులయినా తగ్గక స్పృహ కోల్పోయారు. ఆసుపత్రిలో చేర్చినా ఫలితం కనిపించలేదు. తనకి దేవి మాత్రమే దిక్కని తలిచి ఆమె కాళ్ళ మీద పడి ప్రార్థించింది శిల్ప. దేవి 'నువ్వు ఒకరిని వదలాల్సిన సమయం ఇదే. వెంటనే ఆ పని చెయ్యి. లేకపోతే నీకు ఇద్దరూ దక్కరు.' అని చెప్పింది. చేసేది లేక ఏం చెయ్యాలని అడిగితే 'దోనేకట్టి దగ్గర సేక్రెడ్ హార్ట్ కాన్వెంట్లో వదిలిపెట్టు, మళ్ళీ ఇంకెప్పుడూ వెనక్కి తీసుకురాకు. అలా చేస్తే నీకు సర్వనాశనమే మిగులుతుంది ' అని చెప్పింది. ఎవరిని వదులుకోవాలి అని అడిగితే, అది నువ్వే నిర్ణయించుకో అని చెప్పింది దేవి. శిల్పకి అలోచించగా నిషాని వదలటమే మంచిది అనిపించింది. తన దగ్గరుంటే చుట్టుపక్కల వాళ్ళ నిరాదరణ తప్ప ఆ పాపకి దక్కేది ఏమీ ఉండదనీ, పేదరికంతో ఆ వైకల్యాన్ని బాగు చేయించే శక్తి కూడా తనకి లేదు కాబట్టి అక్కడయితే ఏదో ఒకటి చేసే అవకాశం ఉందని ఆమెకి అనిపించింది. గుండె రాయి చేసుకుని నిషాని తీసుకు వెళ్ళి, దేవి చెప్పిన కాన్వెంట్లో ఒక సిస్టర్ చేతుల్లో వదిలి వచ్చింది. కొంతసేపటికే ఆశ్చర్యకరంగా దేవి చెప్పినట్టు చిన్నదేవికి జ్వరం తగ్గి బాగుపడింది. అక్కడ కాన్వెంట్లో ఎంతకీ జ్వరం తగ్గక ప్రమాద స్థితిలో ఉన్న నిషాని చివరి ఆశగా, చర్చ్ లో జీసస్ దగ్గర పెట్టి ప్రార్థించగానే నిముషాల్లో బాగుపడింది. ఆవిషయం అందరికీ తెలిసి నిషాని మిరకిల్ చైల్డ్ అని అనుకోవడం మొదలుపెట్టారు. ఆ విషయం వూరంతా తెల్సింది.

శిల్ప ఎన్నోసార్లు కాన్వెంట్ దగ్గరికి వెళ్ళి నిషాని దూరం నుంచే చూసి ఏడుస్తూ తిరిగి వచ్చేది. నిషా ఆమెని గమనించి దగ్గరకు వచ్చేలోగా కనిపించకుండా మాయమయేది. కొన్నాళ్ళకి కాన్వెంట్ నుండి ఒకామె వచ్చి ' ఇంగ్లాండ్ నుండి వచ్చిన ఇద్దరు సైంటిస్టులు నిషా గురించి విని, వాళ్ళు చేస్తున్న పరిశోధనలో భాగంగా ఆపాపని చూడడానికి వచ్చారు. కానీ ఆ పాపని చూడగానే వాళ్ళకి ఆమె మీద ప్రేమ కలిగి ఆమెని దత్తత తీసుకోవాలని అనుకుంటున్నారు. పాపని ఇంగ్లాండ్ తీసుకువెళ్ళి చక్కగా పెంచుకుంటారు. మొర్రి కూడా బాగుచేయిస్తారట. నీకిష్టమయితే పాపని దత్తత ఇవ్వాలని అనుకుంటున్నాము. వాళ్ళ దగ్గర పాపకి మంచి భవిష్యత్తు ఉంటుంది అలోచించుకోమని ' చెప్పింది. శిల్ప నిషా భవిష్యత్తు గురించి అలోచించి, ఇక తనకెప్పుడూ ఆమెని మళ్ళీ చూసే అవకాశం ఉండదు అని తెలిసి కూడా ఒప్పుకుని, దత్తత పేపర్స్ సంతకం చేసి ఇచ్చింది. అపప్టి నుండీ నిషా మీది ప్రేమని కూడా దేవి మీదే చూపించడం మొదలుపెట్టింది. ఇక్కడి వరకూ తల్లి డైరీ చదివిన దేవి, తనకో కవల సోదరి ఉందని తెలిసి ఆశ్చర్యపోయింది. వెంటనే ఆమెని చూడాలని అనిపించింది. వివరాలేమన్నా దొరుకుతాయేమో అని ఇల్లంతా వెదికింది కానీ ఏమీ దొరకలేదు. తను ఇంగ్లాండ్ తిరిగి వెళ్ళాక నిషా గురించి వెదకాలని అనుకుంది. తల్లి డైరీ నిషాకి కానుకగా ఇవ్వాలనీ, దానితో ఆమె మీద తల్లికి ఎంత ప్రేమో తెలుస్తుందని అనుకుంది.

ఇండియా వచ్చిన నిషా ఎలాగో కష్టపడి కాన్వెంట్ అడ్రస్ కనుక్కుని వెళ్ళింది. లోపలి వెళ్ళి చూసేసరికి ఆ పరిసరాలు ఆమెకు ఎప్పుడో తనకి తెలిసినట్టు, అక్కడ కొన్ని సంఘటనలు గుర్తుకురావటం మొదలయ్యింది. ఫోన్లో మాట్లాడిన నన్ తనకు అంతకు ముందు అక్కడ ఉండి వెళ్ళిన ఇంకో సిస్టర్ ద్వారా తెలిసిన నిషా కథ చెప్పింది. నిషాని ఆసుపత్రిలో ఉన్న సిస్టర్ ప్రియ దగ్గరకు తీసుకు వెళితే, అప్పటివరకూ ఎవరినీ గుర్తుపట్టని స్థితిలో ఉన్న ఆమె చిత్రంగా నిషాని గుర్తు పట్టి, 'ఆమె ఒక మిరకిల్ చైల్డ్ అనీ, ఆమెని అందరూ చాలా ఇష్టపడేవారనీ , ఆమె ఇంగ్లండ్ వెళ్ళిపోయాక అందరూ తలుచుకునే వారనీ' చెప్పి, అంతకు ముందు ఆమె తల్లి తరచూ చూడడానికి

వచ్చేదనీ చెప్పింది. అపుడు నిషాకి ఆ కలలో గేటు దగ్గర కనిపించిన ఆమె తన తల్లి అని అర్ధమయింది. తనని చూడాడానికి వచ్చేదంటే తనంటే ప్రేమ ఉందన్నమాట, కావాలని వదిలించుకోలేదు అని సంతృప్తి కలిగింది. సిస్టర్ ప్రియ నిషా తల్లి పేరు శిల్ప అనీ, పక్కనే ఉన్న సోంపేట అనే వూర్లో ఉంటుందనీ చెప్పింది. నిషా మళ్ళీ వస్తానని చెప్పి సెలవు తీసుకుని తల్లినీ, సోదరినీ కలవాలని బయలుదేరింది.

ఇది కేవలం నిషా కథ మాత్రమే కాదు. ముగ్గురు స్త్రీల కథ. నిషా తన మూలాలు వెదుక్కున్న అన్వేషణ , దేవి లాంటి వాళ్ళు దాదాపు ప్రతీ ఇంటిలోనూ కనిపిస్తారు. ఆ వయసులో ఉన్నప్పుడు జాగ్రత్తతో అమ్మలు పెట్టే ఆంక్షలూ, చూపించే ప్రేమా అసహజంగాను, అసహనంగానూ ఉండటం అతి సహజం. వాటి నుంచి ఎపుడు పారిపోదామా అని చూసేవాళ్ళు చాలా మందే ఉంటారు. శిల్ప ఒక విధి వంచిత. ఆమె మాటల్లో చెప్పాలంటే 'దేవుడిని తనకి భర్త పిల్లలు కావాలని అడిగింది. అన్నీ ఇచ్చాడు కానీ అన్నీ ఒక్కసారే కాకుండా ఒకదాని తరువాత ఒకటి ఇచ్చాడు.' ఎంతో ఎదురు చూసిన పిల్లల కోసం భర్తని పోగొట్టుకుంది. ఆ గిల్ట్ ఫీలింగ్ ఆమెని చివరి వరకూ వెంటాడింది. పిల్లలని చూసైనా ఆ బాధ తగ్గించుకోవాలనుకుంది, కానీ ఆ ఆశ కూడా పూర్తిగా తీరలేదు. ఒకరిని దూరం చేసుకోవాల్సి వచ్చింది. ఇద్దరి మీదా ప్రేమని ఒకరి మీదే చూపించి తృప్తి పడాలనుకుంది, కానీ ఆ అతి ప్రేమని అర్ధం చేసుకోలేని కూతురు దూరంగా పారిపోయింది. శిల్ప లాంటి వాళ్ళూ చాలా మందే ఉంటారు. రచయిత్రి ముగ్గురి మనస్తత్వాలనీ ఎంతో చక్కగా, వైవిధ్యంగా తీర్చి దిద్దారు. కథలో అక్కడక్కడా కొన్ని ప్రదేశాలు, వాతావరణం, తిండి వర్ణనలు కొంచెం ఎక్కువగా ఉన్నాయనిపించినా మరీ విసిగించవు. దాటేసి చదవటానికి ఇబ్బంది ఉండదు.

ముఖ్యంగా చెప్పుకోవాల్సిన పాత్ర చిత్రణ మేట్. పాత్ర నిడివి తక్కువే అయినా, కనిపించే ప్రతీ సీన్లోనూ తన ముద్ర వెయ్యకుండా ఉండదు. ఎదుటివారికి తన మీద ఉన్నది ప్రేమో కాదో వాళ్ళకే తెలీని స్థితిలో ఉన్నప్పటికీ, అసలు అంత అన్ కండిషనల్ గా ప్రేమించడం ఎలా సాధ్యం అనిపిస్తుంది. ఎన్నోసార్లు నిషానే అనుకుంటుంది 'ఇతని నుంచి ఇంత ప్రేమ పొందటానికి నాకున్న అర్హతేంటి ' అనీ. అతని మీద నిషాకి ఫీలింగ్స్ ఉన్నాయని తెలుసు, అవి బయటకి చెప్పలేకపోవటం ఆమె బలహీనత అనీ తెలుసు. అయినా ఎప్పుడూ ఆమెని ఆ ఇష్టం స్పష్టంగా చెప్పమని బలవంతం చెయ్యడు. విసుగు పొందాడు. పైగా ఆమెకి ఎమోషనల్ సపోర్ట్ అవసరమైన ప్రతీసారి అర్ధం చేసుకుని ఆమె అడగకుండానే తోడుగా ఉంటాడు. One of very few male characters from literature make a long lasting impression.



రచయిత్రి గురించి: రెనీటా డిసిల్వా (Renita D'Silva) కర్ణాటక లోని మంగళూరుకు దగ్గరలోని చిన్న వూరికి చెందిన వారు. నివాసం ఇంగ్లాండ్లో. వృత్తి రీత్యా సాఫ్ట్ వేర్ ఇంజనీర్. పిల్లలు పుట్టిన తరువాత ఉద్యోగం నుంచి విరామం తీసుకున్నారట. ఆమెకు చినప్పటి నుంచీ చదవటం వ్రాయటం అంటే ఇష్టమట. బుక్ షాప్ ఓనర్ గానో, లైబ్రేరియన్ గానో ఉండటం తన డ్రీం జాబ్ అని చెపుతారు. పిల్లలు స్కూల్ కి వెళ్లడం మొదలుపెట్టాక నెమ్మదిగా పత్రికలకి కథలు వ్రాయడం మొదలు పెట్టారు. 2013 లో తన మొదటి నవల Mansoon memories ప్రచురణ జరిగింది. ఇది తన రెండవ నవల ఫిబ్రవరి 2014 లో ప్రచురణ జరిగింది. తన చుట్టూ కనబడే వ్యక్తులూ, ఇళ్ళల్లో జరిగే సంఘటనలే తన కథలకి ప్రేరణ అంటారు.

ఆమె ఇంటర్వ్యూ ఇక్కడ chai-pe-Bulaiya మరియు ఇక్కడ బుక్ రిలీజ్ చదవొచ్చు.

(Pictures Source: internet)



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# గూడు చెదిరిన గువ్వలు




పుట్టిన గడ్డనీ అయినవారినీ వదులుకుని ఎక్కడో స్వర్గం ఉందని వెదుక్కుంటూ ఆశతో మనది కాని చోటకి వలస వెళతాం. క్రొత్తచోట మనకంటూ ఒక స్థిరత్వాన్ని తెచ్చుకునే ప్రయత్నంలో కష్టపడతాం. పదిలంగా గూడు కట్టుకుంటాం. ఉన్నానంటూ తొంగిచూసే బెంగల్ని వెనక్కి తోసేసి, క్రొత్త స్నేహాలు చేస్తాం. అక్కడే కైవల్యం అన్నట్టు మమకారం పెంచుకుంటాం. మనది కాని సంస్కృతినీ, పద్ధతుల్నీ గౌరవిస్తాం, మనవి చేసుకుంటాం. గుండెకి హత్తుకుంటాం. ప్రవాహంలో కలిసిపోవాలని తాపత్రయపడతాం. ఉందో లేదో తెలీని అస్తిత్వాన్ని నిలబెట్టుకోడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తాం.

జీవితం నేర్పుగా కూర్చిన పాటలా సాగిపోతుండగా ఎక్కడో ఒక అపశ్రుతి దొర్లుతుంది. అంతే, మనిషిని మనిషిగా కాక కులాలకు, ప్రాంతాలకు, మతాలకు, జాతులకు, దేశాలకు ప్రతినిధిగా చూడబడటం మొదలవుతుంది. మనిషి అస్తిత్వం కోల్పోయి సర్వనామంగా మారిపోతాడు. అప్పటివరకూ ఆ మనిషితో ఉన్న వ్యక్తిగత బంధాలన్నీ మాయమయిపోతాయి. శత్రువు అన్న టేగ్ తగిలించబడుతుంది. తను ఎంతవరకూ బాధ్యుడు, ఏం జరుగుతోంది, జరుగుతున్నదానిలో తన పాత్రేమిటి తెలుసుకునేలోగానే ఊహించలేని అనర్థాలు జరిగిపోతాయి. క్రొత్తగా తగిలించబడ్డ శత్రువు అనే గుర్తింపు కాళ్ళక్రింద నేలను కదిల్చి, ఉంది ఉంది అని భుజం చరుచుకుంటున్న అస్తిత్వాన్ని పాతాళంలో పాతిపెడుతుంది. అప్పటి వరకూ మనిషి సాధించిన ఘనకార్యాలూ, సంపాదించుకున్న సౌహార్ధబంధాలూ అక్కరకి రావు. ఎంత గొప్పవాడయినా, ఎంత మంచి వాడయినా శత్రువు శత్రువే. మంచీ చెడ్డా, న్యాయం అన్యాయం, దయా స్నేహం లాంటివన్నీ ద్వేషం ముందు ఓడిపోవాల్సిందే. 9/11 తరువాత పరిణామాలయినా, చాలా చోట్ల ప్రాంతీయ ద్వేషాల పేరుతో జరిగే మారణహోమాలయినా మనిషిని మనిషిగా గాక శత్రుకూటమిగా పరిగణించడం వల్లనే.

రెండవ ప్రపంచయుద్ధకాలం. పెరల్ హార్బర్ మీద జపాన్ దాడి తరువాత, అమెరికాలో స్థిరపడిన జపాన్ సంతతి మొత్తం అమెరికన్ల చేత శత్రువుగా ముద్రవేయించుకుంది. ఆ క్రొత్త గుర్తింపుతో ఎన్నో జీవితాలు చెదరిపోయాయి. గూఢచర్యం, దేశద్రోహం

ఆపాదించబడ్డాయి. ఎందరో చెయ్యని నేరానికి మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఒక జాతికి చెందినవారు మొత్తం అనుమానం, ద్వేషం, అవమానాలను ఎదుర్కున్న పరిస్థితుల్లో ఒక చిన్న కుటుంబం మీద అది ఏ పరిణామాలు తీసుకొచ్చింది, సాఫీగా సాగిపోతున్న వాళ్ళ జీవితాలు ఏ మలుపులు తిరిగాయి, వాటికి వాళ్ళు చెల్లించిన మూల్యం ఎంత అనేది Julie Otsuka వ్రాసిన 'When The Emperor Was Divine' అనే పుస్తకం కథ.

కాలిఫోర్నియాలోని బెర్కిలీ ప్రాంతంలో సముద్రపు ఒడ్డున ఓ అందమైన ఇల్లు. అందులో జపాన్ నుండి వచ్చి అమెరికాలో స్థిరపడిన ఓ చిన్న కుటుంబం. అమ్మా, నాన్న, పదేళ్ళ అమ్మాయి, ఏడేళ్ళ అబ్బాయి. చింతలులేని చక్కనైన కుటుంబం. తండ్రికి మంచి ఉద్యోగం. అతను ఆరోగ్యంగా ఆకర్షణీయంగా ఉండేవాడు. మృదుస్వభావి. పనివాళ్ళతోనైనా ఎపుడూ గట్టిగానూ, అమర్యాదకరంగానూ మాట్లాడి ఎరుగడు. భార్యాపిల్లలంటే అమిత ప్రేమ. దేనికీ భార్యని ఇబ్బంది పెట్టేవాడు కాదు. ఆమె మనసు గ్రహించి ప్రవర్తించేవాడు. సెలవురోజుల్లో పిల్లలకి బ్రేక్ఫాస్ట్ చేసిపెట్టి, వాళ్లతో కబుర్లు చెపుతూ, కలిసి న్యూస్ పేపర్ చదువుతూ, కథలు చదివి వినిపిస్తూ, ఆటలాడుతూ, నవ్విస్తూ గడిపేవాడు. అతను ఎంత పనిలో ఉన్నా ఎప్పుడూ దేనికీ విసుక్కునేవాడు కాదు. తల్లికి ఇల్లు తనకి నచ్చినట్టు అమర్చుకోడం, మొక్కలు పెంచుకోవడం, కుటుంబానికి రుచిగా వండి పెట్టుకోవడంలో తృప్తి. ఏ లోటూ లేకుండా ఆనందంతో సౌకర్యవంతమయన జీవితం గడుపుతూ ఉంటారు.

డిసెంబర్ 7, 1942, పెరల్ హార్బర్ మీద జపాన్ బాంబు దాడి చేసిన రోజు. ఆ రాత్రి అందరూ పడుకోడానికి సిద్ధమవుతున్న సమయంలో తలుపు చప్పుడయ్యింది. ఆ సమయంలో వచ్చినదెవరా అని తండ్రి తలుపు తీసి చూస్తే బయట ముగ్గురు FBI ఆఫీసర్లు ఉన్నారు. ఇంటిముందు ఒక లైట్లు వెలుగుతున్న పోలీసు కారు ఉంది. 'మీ భర్తని కొన్ని ప్రశ్నలు అడగాలి' అని తల్లితో చెప్పి, మీరు ఉన్నవారు ఉన్నట్టుగా మాతో రావాలని అతనికి బట్టలు మార్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా, ఇంట్లో వేసుకున్న నైట్ రోబ్, చెప్పులతోనే తీసుకుపోయారు. చుట్టుపక్కల ఇళ్ళవారు కిటికీల్లోనుండి తండ్రిని ఆ వేషంలో చూడటం అబ్బాయిని చాలా బాధపెట్టింది. అయ్యో నాన్నని షూస్ అయినా వేసుకోనిస్తే బావుండేదే అని బాధపడ్డాడు. మరుసటి ఉదయం అబ్బాయికి బాత్ రూమ్ లో తండ్రి తలవెంట్రుకలు కనిపిస్తే వాటిని ఒక కవర్లో పెట్టి తన మంచం పరుపు క్రింద దాచాడు. అవి అక్కడ క్షేమంగా ఉన్నంతకాలం తండ్రి క్షేమంగా ఉంటాడని అతని నమ్మకం. అమ్మాయి తండ్రి ఆఖరుసారి ఎక్కడ కూర్చున్నాడు, ఏం చేసాడు అని గుర్తుకు తెచ్చుకుంటూ ఇల్లంతా తిరిగింది.

ఇంటికి ఫోన్ కనెక్షన్ తీసేసారు. బేంక్ అకౌంట్స్ కూడా ఫ్రీజ్ చేసి, డబ్బు తీసుకోడానికి లేకుండా చేసారు. ఏ సమయంలోనైనా తండ్రి తిరిగొస్తాడని వీళ్ళు ఎదురు చూడసాగారు. తల్లి రోజూ భోజన సమయంలో నలుగురికీ ప్లేట్స్ పెడుతూనే ఉంది. నాలుగు రోజుల తర్వాత తండ్రి నుండి ఉత్తరం వచ్చింది. 'తనతో పాటు చాలామందిని పెరల్ హార్బర్ మీద దాడికి సంబంధించి, అమెరికాలో ఉన్న జపనీయులు గూఢచర్యంతో, జపాన్ చక్రవర్తికి (Emperor Hirohito) సాయపడ్డారన్న అనుమానంతో అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్నారు. తమని ప్రస్తుతం శాన్ ఫ్రాన్సిస్కో లోని ఇమ్మిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్ లో ఉంచారు. కొంతమందిని దేశద్రోహం నేరం మీద ఇక్కడ నుండే జపాన్ తిరిగి పంపేశారు. తన కేస్ ఎప్పుడు విచారణకు వస్తుందో, ఇక్కడ ఇంకా ఎన్నాళ్ళు ఉండాలో తెలీదు. ఒకసారి వచ్చి నన్ను చూసి వెళ్ళు' అని వ్రాసాడు. వెంటనే తల్లి అతనివి కొన్ని బట్టలూ, అవసరమయిన కొన్ని వస్తువులూ తీసుకుని వెళ్ళింది. అక్కడనుండి తిరిగి వచ్చాక కొడుకు తల్లిని 'నాన్న ఇంకా ఆ స్లిప్పర్స్, నైట్ డ్రెస్ వేసుకునే ఉన్నారా' అని అడిగితే అవునని చెప్పింది. మరుసటి రోజు ఆమె తమకి జపాన్ లో తమ ఫేమిలీ నుండి వచ్చిన ఉత్తరాలన్నీ పెరట్లో తగలపెట్టేసింది. ఇరవయ్యేళ్ళ క్రితం అమెరికా వస్తూ తనతో తెచ్చుకున్న సాంప్రదాయ దుస్తులు, ఫేమిలీ ఫోటోలు, జపనీస్ సంగీతం రికార్డులతో సహా జపనీస్ సంస్కృతిని తెలియచేసే వస్తువులేవీ ఇంట్లోలేకుండా

తీసేసింది. పిల్లలకి స్కూల్లో లంచ్ ఎప్పటిలా అన్నం కాకుండా సాండ్విచ్ ఇవ్వటం, ఎవరన్నా అడిగితే తాము చైనీస్ అని చెప్పమనీ, ఎవరన్నా జపనీస్ ఎదురైతే తమ సాంప్రదాయ పద్ధతిలో కాకుండా, అమెరికన్ పద్ధతిలో హేండ్ షేక్ చేసి పలకరించమని జాగ్రత్తలు చెప్పింది.

అమెరికన్ ప్రజల్లో జపనీస్ అంటే ద్వేషం మొదలయ్యింది. అకస్మాత్తుగా జపనీస్ వారందరూ తమకి శత్రువుల్లా కనిపించడం మొదలుపెట్టారు. వారిని దేశద్రోహుల్లా చూడటం, ఒంటరిగా దొరికితే దాడి చెయ్యటం, వారి ఇళ్ళ మీద దాడి చేసి నష్టపరచడంలాంటి పనులు కూడా చెయ్యసాగారు. ఈ సంఘటన తరువాత చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు, రోజూ చక్కగా పలకరించే షాపుల వాళ్ళు కూడా వీళ్ళతో స్నేహంగా ఉండటం తగ్గించారు. వీరితో చనువుగా ఉంటే తమమీదకేం వస్తుందో అని వీరిని చూసీ చూడనట్టు ఉండటం మొదలుపెట్టారు. జపనీస్ మీద అమెరికన్ ప్రజల దాడి నుండి రక్షించడానికి పోలీసులు పహారా కాయాల్సి వచ్చింది. రాత్రి ఎనిమిది తరువాత బయటకు రావద్దనీ, గుంపులుగా ఒక చోట కూడొద్దనీ, దూరప్రయాణం చెయ్యొద్దనీ జపనీస్ వాళ్లకు రూల్స్ పెట్టారు. అయినా కూడా దాడులు జరుగుతూనే ఉన్నాయి. కోపంతో ఉన్న ప్రజల బారి నుండి వీళ్ళ రక్షణ కోసం, యుద్ధం ముగిసే వరకూ దూరంగా మిలిటరీ కేంప్లో ఉంచాలని అమెరికన్ ప్రభుత్వం నిర్ణయించింది. నగరంలో అన్నిచోట్లా నోటీసులు వెలిసాయి. 'జపాన్ జాతీయులంతా వెంటనే కావల్సిన వస్తువులు సర్దుకుని వూరు విడిచి సురక్షిత ప్రాంతానికి వెళ్ళడానికి రెండు రోజుల్లో రెడీ కావాలి. సైనికులు తోడుండి వూరు దాటిస్తారు. యుద్ధం ముగిసాక మళ్ళీ తిరిగి రావచ్చు' అనేది వాటి సారాంశం. బయటకు పనిమీద వెళ్ళిన తల్లి ఆ నోటీస్ చూసి, వెంటనే ఇంటికి వచ్చి తమతో తీసుకు వెళ్ళడానికి కావాల్సిన బట్టలూ, కొన్ని వస్తువులూ పెట్టెల్లో సర్దింది. ఇంట్లోని విలువైన సామానులు అట్టపెట్టెల్లో భద్రంగా సర్ది మేడమీద ఒక మూలగదిలో పెట్టి తాళం వేసింది. వెండి సామానులు కొడుకు సాయంతో పెరట్లో ఉన్న పెద్ద లాఫింగ్ బుద్ధా విగ్రహం క్రింద గొయ్యి తీసి దాచిపెట్టింది. మరుసటి రోజు ఉదయమే ప్రయాణం. పిల్లలు నిదురపోయిన తరువాత ఇల్లంతా ఆప్యాయంగా, దిగులుగా చూసుకుంది.

మరుసటి రోజు ఉదయాన్నే తల్లీ పిల్లలూ వాళ్ళ పెట్టెలు తీసుకుని బస్ దగ్గరికి వెళ్లారు. అక్కడ వీరిలాగే చాలామంది ఉన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, బస్లో శాన్ ఫ్రాన్సిస్కో లో సైనికుల రక్షణ ఉన్న ప్రదేశానికి తీసుకు వెళ్లారు. కొన్ని నెలలు అక్కడున్న తరువాత అందరినీ యూటా రాష్ట్రంలోని సాల్ట్ లేక్ ఎడారిలో ఉన్న కేంప్ కు తరలించారు. అక్కడ టార్-పేపర్తో (దళసరి అట్టలాంటి పేపర్) కట్టిన కాలనీ, వాటి చుట్టూ వైర్ ఫెన్స్, చెక్కతో కట్టిన ఎత్తైన కట్టడాల్లో పహారా కాస్తూ సైనికులు ఉన్నారు. చుట్టూ తెల్లటి ఇసుక తప్ప ఒక్క గడ్డిపోచ గానీ, నీటి చెలమ కానీ లేవు. కాలనీలో ఒక్కొక్క ఫేమిలీకీ ఒక చిన్న గది ఉండటానికి ఇచ్చారు. గదిలో మనిషికో ఇనుప మంచం, రెండేసి దుప్పట్లు, ఒక చిన్న స్టవ్ మాత్రమే ఉన్నాయి. దగ్గరలో ఉన్న సైనికుల మెస్ లో అందరికీ వేళకు పరిమితంగా భోజనం పెడతారు. గంట కొట్టగానే భోజనానికి అందరూ వెళ్ళి లైనులో నిలబడాలి. అక్కడ వేలకొద్దీ మనుషులు, జపాన్ జాతికి చెందినవారు ఉన్నారు. వారిలో కొందరు ఇక్కడికి రాకముందు మంచి ఉద్యోగాలూ, వ్యాపారాలు ఉన్నవారు. ఇక్కడ మెస్ లో వంటా, క్లీనింగ్ పనులూ, లాండ్రీ రూములోనూ, మిగిలిన చోట రకరకాల పనులు చేస్తున్నారు.

తల్లి పిల్లలకు ఫెన్స్ ముట్టుకోవద్దనీ, సైనికులతోమాట్లాడొద్దనీ, ఎంపరర్ పేరు బయటకు అనొద్దనీ జాగ్రత్తలు చెప్పింది. రోజంతా అబ్బాయి అక్కడున్న తన ఈడు పిల్లలతో కలిసి ఆటలు ఆడటమో, లేదా ఎడారి ఇసుకలో గవ్వలూ అవీ ఏరుకుంటూ తిరిగేవాడు. బాగా ఎండగా ఉన్నప్పుడు గదిలోనే అక్కా, తమ్ముళ్ళు ఆడుకోవడం, తండ్రి గురించి కబుర్లు చెప్పుకోడమూ చేస్తుండేవారు. ఇంటిదగ్గర నుంచి తెచ్చుకున్న రేడియోలో యుద్ధ వార్తలు వింటూ, ఇంకా యుద్ధం ఎన్నాళ్ళుంటుందో, తామింకా ఇక్కడ

ఎన్నాళ్ళు ఉండాలో అంచనా వేసుకుంటూ, యుద్ధం ముగిసిందన్న కబురుకోసం ఎదురు చూస్తున్నారు అందరూ. ఇద్దరూ ఇంటి దగ్గరున్న తమ స్నేహితులకి ఉత్తరాలు వ్రాసారు కానీ ఎవరి దగ్గర నుండీ జవాబు రాలేదు. 'వీళ్ళకి ఉత్తరాలు వ్రాసిన వాళ్ళని శత్రువుకి సహాయం చేస్తున్నారని అరెస్ట్ చేస్తారు' అని పోస్ట్ మాన్ భయపెట్టాడని తరువాతెప్పుడో తెల్సింది.

పిల్లలు తండ్రిని బాగా గుర్తుకు చేసుకునేవారు. తండ్రితో గడిపిన సందర్భాలూ, తండ్రి ప్రవర్తనా గుర్తుకు తెచ్చుకుంటూ, మళ్ళీ అందరూ కలిసి సంతోషంగా బ్రతికే రోజుకోసం కలలు కంటూ ఉండేవారు. తండ్రి దగ్గర నుంచి తరచుగా ఉత్తరాలు వస్తుండేవి. తాము ప్రస్తుతం న్యూ మెక్సికోలో ఉన్నామనీ, అక్కడ వాతావరణం బాగుందనీ, తను రోజూ వ్యాయామం చేస్తున్నాననీ, పిల్లలని జాగ్రత్తగా ఉండి తల్లికి సాయం చేస్తూ ఉండమని, ఇలా రకరకాలుగా వివరాలతో ఉత్తరం వ్రాసేవాడు. అవన్నీ కూడా సెన్సార్ చెయ్యబడి వస్తూ ఉండేవి. కొన్నిసార్లు నల్లటి సిరాతో కొన్ని లైన్లు కొట్టేసి ఉండేవి. అక్కడ తండ్రి ఏం రాసేడో కూడా తెలిసేది కాదు. అబ్బాయి గదిలో కూర్చుని తండ్రితో జరిగిన సంభాషణలు గుర్తుకు తెచ్చుకునేవాడు. ఎంత ప్రయత్నించినా అతనికి తండ్రిని ఆఖరు రోజు FBI ఆఫీసర్లు తీసుకెళ్తున్నప్పటి రూపమే తప్ప, ఇక వేరేగా గుర్తుకు వచ్చేదే కాదు. తండ్రి తమని సెలవుల్లో ఎక్కడెక్కడికి తీసుకువెళతానన్నదీ, అక్కడ ఏమేం చూడాలని కబుర్లు చెప్పుకున్నదీ గుర్తుకు తెచ్చుకునేవాడు. రాత్రులు పడుకునేటపుడు కూడా, 'ఇపుడు నాన్నేం చేస్తున్నాడో, పడుకున్నాడేమో' అనుకుంటూ ఉండేవాడు. మధ్యరాత్రి కలత నిద్రలో లేచి ఏడుస్తుంటే అక్క దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పేది. నిద్ర పట్టనపుడు అమ్మ పెంచుకున్న మొక్కలెలా ఉన్నాయో అనీ, తండ్రి వెంట్రుకల కవర్ ఇంకా పెట్టిన చోటే ఉందా లేదా అనీ, వెండి సామానులు దాచినపుడు కన్నీళ్ళతో తడిసిన తల్లి మొహాన్ని గుర్తుకు తెచ్చుకునీ ఆలోచిస్తూ ఉండేవాడు.

నెలలు గడుస్తున్నాయి. ప్రతీరోజూ ఒకేలా తేడాలేకుండా గడుస్తోంది. యుద్ధం ఎంతకీ అవడం లేదు. యుద్ధవార్తల మీదకూడా ఆసక్తి పోయింది. నిరాసక్తమయిన జీవితం ముగ్గురులోనూ మార్పులు తెచ్చింది. అమ్మాయి నెమ్మదిగా మిగతా వారితో స్నేహం చేసుకుంది. రాత్రులు తల్లి పడుకున్న తరువాత నెమ్మదిగా తలుపు తీసుకుని స్నేహితులతో ఫెన్స్ దాటి వెళ్ళి షికార్లు చేసి ఏ తెల్లవారుఝామునో తిరిగి వచ్చి పడుకునేది. భోజనానికి కూడా తల్లితో, తమ్ముడితో కలిసి వెళ్ళేది కాదు. నెమ్మదిగా సిగరెట్లు తాగడం అలవాటు అయ్యింది. అబ్బాయి అన్నీ మౌనంగా గమనిస్తూ ఉండేవాడు. బయటనుంచి వచ్చి తమ్ముడితో తను విన్న గాసిప్స్, ఇంకా బయటి విశేషాలు చెపుతూ ఉండేది. ఇద్దరూ కలిసి ఇంటిదగ్గర తమ ఫ్రెండ్స్ అంతా ఎలా ఉన్నారో, ఏం చేస్తున్నారో అనుకుంటూ ఉండేవారు. ఇంటిదగ్గర చుట్టుపక్కల వాళ్ళంతా తామెక్కడికి వెళ్ళామో తెలీక కంగారు పడి ఉంటారనీ, తాము తిరిగి వెళ్ళగానే అందరూ బహుమతులతో వచ్చి సంతోషాన్ని తెలియచేస్తారనీ, ఇన్నాళ్ళూ మిస్ అయినదానికి బదులుగా పిలిచిన అన్ని పార్టీలకూ కాదనకుండా వెళ్ళాలనీ కబుర్లు చెప్పుకునేవారు.

తల్లి రోజులో ఎక్కువ సేపు మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండేది. ఒళ్ళో సగం వ్రాసిన ఉత్తరమో, తెరిచినా పుస్తకమో పెట్టుకుని ఎటో చూస్తూ ఈలోకంలో లేనట్టే ఉండేది. కొన్నిరోజులకి ఆమెకు తిండి మీద కూడా ఆసక్తి పోయింది. అబ్బాయి మెస్ కి వెళ్ళినపుడు తల్లికి కూడా కొంచెం తీసుకొచ్చి తినమని బలవంతంగా తినిపించేవాడు. ఒకప్పుడు చక్కగా తయారయి ఆహ్లాదంగా ఉండే ఆమె నిరాసక్తంగా తయారయింది. ఒక్కోసారి కొడుకుతో భర్త గురించిన కబుర్లు చెప్పేది. వాళ్ళు తీసుకెళ్ళిన రాత్రి పడుకున్నపుడు ఆయన 'దాహంగా ఉంది ఒక గ్లాసు నీళ్లిమ్మని' అడిగాడు. ఆమె ఇపుడు తను అలిసి పోయాననీ, తననే క్రిందకి వెళ్ళి తీసుకోమని చెప్పింది. ఆయన అలానే పడుకున్నాడు. ఈలోగా వాళ్ళొచ్చి తీసుకెళ్ళిపోయారు. ఆమెకు ఎపుడూ భర్త నీళ్ళ కోసం వెతుక్కుంటున్నట్టు కలలు వచ్చేవి. నీళ్ళడిగితే ఇచ్చాను కాదు అని దిగులుగా అనుకుంటే నీకు తెలీదు కదా అని ఆరిందాలా సముదాయించేవాడు కొడుకు. రాను రాను రోజంతా మంచం మీద కళ్ళుమూసుకుని పడుకుని ఉంటుంది. కనీసం ఒక్కసారి మళ్ళీ తన ఇంటి కిటికీ లోంచి సముద్రాన్ని చూడాలన్నది ఆమె ఆశ.

ఎడారి కావటం వలన వాతావరణమూ విపరీతంగానే ఉండేది. వేసవి కాలంలో విపరీతమైన ఎండలు. వేడెక్కిన పొడి గాలీ, సున్నం లాంటి తెల్లటి ధూళీ, వేడెక్కిన ఇసుకా రేగి గదుల్లోకీ, బట్టల్లోకి, ముక్కులోకి కూడా దూరి బాధపెడుతుండేది. దానితో అందరికీ ముక్కులో నుండి రక్తం కారడం, దగ్గూ మొదలైనవి వచ్చేవి. శీతాకాలంలో విపరీతమయిన చలీ, మంచు కురిసి నానా బాధలూ పడ్డారు. ఉన్న దుప్పట్లతో చలి ఆగేది కాదు. చలిమంట వేసుకోడానికి సరిపోయే బొగ్గు దొరికేది కాదు. ఎడారి గాలులూ ఇసుక రాపిడికి ఒళ్ళు మొద్దుబారి, పచ్చటి శరీరాలు నల్లబడి, కాళ్ళు పగిలి పుండ్లు లేచాయి.

కేంపులో రోజూ రకరకాల వదంతులు వినిపించేవి. అందరినీ జపాన్ పంపేస్తారనీ, వారి సిటిజెన్షిప్ వెనక్కి తీసుకుంటారని, సముద్రం మధ్యకు తీసుకెళ్ళి షూట్ చేసి పడేస్తారనీ, ఇలా నానారకాల వార్తలు వినిపించేవి. పంటల కాలంలో ప్రక్క రాష్ట్రాల నుండి రైతులు వచ్చి కొందరిని కూలీలుగా తీసుకెళ్ళారు. కానీ వాళ్ళకు అన్నిచోట్లా తీవ్ర నిరసన ఎదురవడంతో చాలామంది వెంటనే తిరిగి వచ్చారు. హోటల్స్ లోకి గానీ, సినిమా హాల్లోకి గానీ, షాపుల్లోకి గానీ వీర్ని రానివ్వలేదు. కొంతమందయితే వీరి మొహం మీద ఉమ్మి అవమానించి పంపించారు. అన్ని చోట్లా 'No Japs Aloowed' అన్న బోర్డులే కనిపించాయి. అవమానంతో తిరిగివచ్చిన వారు, ఫెన్స్ కి ఇవతలే తమకి బ్రతుకు కాస్త గౌరవంగా ఉందని అనుకున్నారు.

ఇలా మూడేళ్లకు పైగా గడిచాయి. మొత్తానికి యుద్ధం ముగిసింది. అందరినీ మళ్ళీ ఎవరి వూళ్ళకు వాళ్ళను దిగబెట్టారు. పంపే ముందు సైనికులు ఒక మీటింగ్ పెట్టి, అందరికీ మారిన పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 'బయట కేవలం ఎవరితోనైనా ఇంగ్లీష్ లోనే మాట్లాడండి. గుంపులుగా ఎక్కువ మంది కలిసి కనిపించవద్దు. ఎవరన్నా హేళనగా కానీ, కోపంగా కానీ ఏమన్నా అన్నా, వినపించనట్టు ప్రవర్తించండి. తిరిగి జవాబు చెప్పి సమస్యలు తెచ్చుకోవద్దు' లాంటి సలహాలు ఇచ్చి, కుటుంబానికో పాతిక డాలర్లు ఖర్చులకు ఇచ్చి పంపించారు. ఇన్నాళ్ళూ దేనికోసమయితే ఎదురుచూసారో ఆ సమయం వచ్చింది. ఇక కష్టకాలం అయిపోయింది. తమ జీవితాలు ఎక్కడ ఆగాయో అక్కడ నుండి మొదలెట్టాలని అనుకున్నారు.

ఎంతో ఉత్సాహంతో ఇంటికి చేరుకున్నవారికి, ఇల్లు బయట నుంచే పాడుబడి కనిపించింది. లాన్లో అందంగా పెంచుకున్న మొక్కలేవీ లేవు. లాన్ అంతా పగిలిన సీసాలతో నిండి ఉంది. తాళం తీసి లోపలికి వెళితే లోపల ఇంకా దారుణంగా ఉంది. ఇంట్లో అప్పటి వరకూ చాలామందే ఉండి వెళ్ళినట్టు ఉంది పరిస్థితి. వీరు వూరు వదిలి వెళ్ళే ముందు 'ఇంటి బాగోగులు చూసి ఎవరికైనా అద్దెకిచ్చి తమకి చెక్ పంపిస్తాను' అని కుదురుకున్న మనిషి ఏమయ్యాడో తెలీదు. ఒక్క చెక్కూ తమకి అందలేదు. ఇంట్లో కిటికీలు పగల గొట్టి, కర్టెన్లు చింపి పోగులు పెట్టి, గోడల మీద చెత్త రాతలు వ్రాసి, వాటి పెయింట్ ఊడిపోతూ ఉన్నాయి. ఇంట్లోని ఫర్నిచర్ తో సహా , భద్రంగా దాచుకున్న విలువైన సామానులు అన్నీ తీసుకుపోయి, మిగిలిన సామానులు ఇష్టం వచ్చినట్టు పగలగొట్టిపోయారు. నేలంతా పగిలిన గ్లాస్ బాటిల్స్, తిని వదిలేసిన డబ్బాలతోనూ నిండి అసహ్యంగా ఉంది. అయినా కూడా వాళ్ళకి ఇవేమీ బాధ అనిపించలేదు. ఉండటానికి తమకో ఇల్లుంది అది చాలు అనుకున్నారు. తిరిగి వచ్చిన చాలామందికి ఉండటానికి చోటులేక చర్చిలలోనూ, హాస్టల్లోనూ ఉంటున్నారు, కాబట్టి తాము అదృష్టవంతులు అనుకున్నారు. పిల్లలు ఇల్లంతా పరుగులు పెట్టి తమ గదులన్నీ తిరిగి ఆప్యాయంగా చూసుకున్నారు. నెమ్మదిగా ఇంటిని బాగు చేసుకుందాం అని ధైర్యం చెప్పింది తల్లి. ఆ రాత్రికి ఒక రూం శుభ్రం చేసుకుని అందరూ అక్కడే పడుకున్నారు.

ఆ కేంప్ నుంచి ఇంటికి తిరిగి వస్తే మళ్ళీ తమ మామూలు జీవితం తమకి దొరుకుతుంది అని ఆశపడ్డారు కానీ వాస్తవానికి పరిస్థితులు వేరేగా ఉన్నాయి. చెయ్యని తప్పుకి శిక్ష వాళ్ళని వెంటాడసాగింది. అమెరికన్ ప్రజలకు జపనీస్-అమెరికన్ల మీద ఇంకా ద్వేషం తగ్గలేదు. వారిని ఇంకా శత్రువులుగానే చూస్తున్నారు. తిరిగివచ్చిన వాళ్ళ ఇంటికి వెళ్ళి 'ఇంకా ఇక్కడ ఎన్ని రోజులుండాలనుకుంటున్నారు', 'మీకిక్కడ ఉద్యోగాలు లేవు, వెళ్ళిపోడం మీకే మంచిది' , 'మాకు మీగురించి వేరే ప్లాన్స్ ఉన్నాయి' లాంటి బెదిరింపులు చేస్తున్నారు. అలానే

కొందరిని ఇంట్లో ఉండగానే ఇంటితో సహా తగలబెట్టారనీ, కొన్ని చోట్ల షూటింగ్స్ జరుగుతున్నాయనీ కూడా విన్నారు. ఒక రాత్రి ఎవరో రాయి విసిరి కిటికీ అద్దం పగలగొట్టారు. ఇంట్లో మనుషులు ఉన్నట్టు తెలియకుండా చీకటిలో లైట్లు వెయ్యకుండా, మేడమీద ఇంటి వెనుకవైపుకు ఉన్న గదిలో పడుకోవడం మొదలుపెట్టారు. తల్లి నెమ్మదిగా ఇల్లంతా ఒక్కోటిగా శుభ్రం చేసి, పగిలిన కిటికీలను రేకులతో మూసి ఇంటిని ఓ కొలిక్కి తెచ్చింది. తిరిగి ఇంటికి స్వతంత్రులుగా వచ్చారన్నమాటే గానీ, ఎవరో తమని గమనిస్తున్నారేమో అని, తమ మీద ఎవరన్నా ఫిర్యాదు చేస్తారేమో అన్న భయమూ, అనుమానం ఆమెని పీడిస్తూనే ఉన్నాయి. బయట ఎవరైనా కనిపించినా ముభావంగా ఉండేది. తండ్రి నుండి తనని కూడా కొన్నిరోజుల్లో విడుదల చేస్తారని ఉత్తరం వచ్చింది.

ఇంటి చుట్టుప్రక్కల వాళ్ళు తాము వూరి విడిచి వెళుతున్నప్పుడు తమ ఇంటి కిటికీల్లోంచి చూసారు గానీ, ఒక్కరూ వీడ్కోలు చెప్పడానికి గానీ, ఎక్కడికి వెళ్తున్నారు అని అడగటానికి కూడా బయటకు రాలేదు. తమకి వారు తెలియదు అన్నట్టు ఉండిపోయారు. ఇపుడు తిరిగి వచ్చిన తరువాత కూడా రోడ్డు మీద ఎదురైతే వీరెవరో తమకి తెలీనట్టూ తప్పుకుపోయేవారు కొందరయితే, అసలు ఏమీ జరగనట్టూ వీళ్ళని రోజూ చూస్తున్నట్టూ 'నైస్ డే' అని తల తిప్పుకు వెళ్ళిపోయేవారు కొందరు. పిల్లలు తాము తిరిగి స్కూల్లో జాయిన్ అయారు. టీచర్లు వీళ్ళతో మంచిగానే ప్రవర్తించారు. తోటి పిల్లలు కూడా క్లాస్లో ఉన్నంతసేపూ మర్యాదగానే ఉండేవారు కానీ, లంచ్ టైంలో ఎవరూ వీళ్ళ దగ్గర కూర్చోలేదు. అంతకు ముందు బెస్ట్ ఫ్రెండ్స్ అయినవాళ్లు కూడా ఒక్కరూ దగ్గరకొచ్చి పలకరించలేదు. క్లాసుల్లో నోటీస్ చెయ్యబడకుండా ఉండటానికి వెనుక బెంచీల్లో మౌనంగా కూర్చొని తమ పనులు చేసుకుని, స్కూల్ అయిపోగానే తలవంచుకుని ఇంటికి వెళ్ళేవారు. స్కూల్లో ఒక్కోసారి వెనుకనుంచి గుసగుసలూ, హేళనగా మాటలూ వినిపించేవి, అయినా తాము విననట్టూ మౌనంగా వెళ్లిపోవడం నేర్చుకున్నారు. రోడ్డు మీద జనాలు అనుమానపు చూపులు వెంటాడేవి. నువ్వు జపనీస్ వాడివా, చైనీస్ వాడివా అని అడిగేవారు కొందరు. వీరంతా ఇపుడు స్వతంత్రులే కానీ, ఎప్పటికీ అనుమానితులే. శత్రువులే.

యుద్ధం ముగిసి చుట్టుపక్కల ఉన్న మగవారంతా ఒక్కక్కరే ఇళ్లకు తిరిగిరాసాగారు. యుద్ధం నుంచి క్షేమంగా వచ్చిన వాళ్ళు కొందరయితే, శత్రువుల చేత చిక్కి చిత్ర హింసలు అనుభవించి కొందరూ, కాళ్ళూచేతులూ పోగొట్టుకుని వచ్చినవారు కొందరు. కొందరయితే ఏమయ్యారో ఆచూకీ కూడాలేదు. రేడియోల్లోనూ, పేపర్ల లోనూ తిరిగి వచ్చిన వారితో, వారు శత్రువుల చేతిలో జపాన్ టార్చర్ కేంద్రాల్లో ఎన్ని చిత్ర హింసలు అనుభవించారో ఇంటర్యూలు రాసాగాయి. అవన్నీ వింటున్న వీళ్ళకు తమ తండ్రిని కట్టుబట్టలతో అరెస్ట్ చేసి తీసుకువెళ్ళిన దృశ్యం గుర్తుకు వచ్చేది. తామేదో తప్పు చేసినట్టు గిల్టీగా అనిపించేది. తమని తాము అద్దంలో చూసుకుంటే శత్రువుని చూసినట్టు అనిపించేది.

తల్లి కుటుంబం గడవడానికి ఉద్యోగం కోసం ప్రయత్నించింది, కానీ ఎక్కడా ఫలితం కనిపించలేదు. ఉద్యోగ ప్రకటన చూసి వెళ్ళిన ప్రతీ చోటా ఆ ఉద్యోగం అప్పుడే ఎవరికో ఇచ్చేసామనో, జపనీస్కి ఉద్యోగం ఇస్తే తమ మిగతా ఉద్యోగులు ఇబ్బంది పడతారానో, కష్టమర్లు ఇష్టపడరనో జవాబులు వచ్చేవి. ఒక తెలిసిన షాపులో ఉద్యోగానికి పోతే అందరికీ కనిపించేలా కాకుండా, ఎవరికీ కనిపించకుండా ఉండేలా వెనుక చీకటి గదిలో లెక్కలు రాసే ఉద్యోగం ఇస్తామంటే, 'నేనెవరో నాకే గుర్తు వచ్చి, నేనే నొచ్చుకుంటానేమో' అని ఆత్మాభిమానంతో తిరస్కరించింది. చివరకి కొందరు ధనవంతుల ఇళ్ళల్లో క్లీనింగ్ పని చెయ్యడానికి కుదురుకుంది. మిగిలిన సమయంలో కొందరి ఇళ్ళ నుండి బట్టలు తీసుకొచ్చి ఉతికి ఇస్త్రీ చేసే పని కూడా మొదలుపెట్టింది. వచ్చిన డబ్బులతో నెమ్మదిగా పిల్లలకూ ఇంట్లోకి అవసరమయిన సామాను కూర్చడం మొదలుపెట్టింది. గౌరవంగా పనిచేసుకునే అవకాశం దొరికినందుకు ఆమెకు సంతోషంగానే ఉంది.

ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. తండ్రి ఫలానా రోజున వస్తున్నానని టెలిగ్రాం ఇచ్చాడు. రైల్లోంచి దిగిన తండ్రిని చూసి పిల్లలు గుర్తుపట్టనేలేదు. వెలిసి జీర్ణావస్థకొచ్చిన సూట్ ధరించి, బట్టతల, కట్టుడు పళ్ళతో, కర్ర వూతతో నడుస్తూ, వంగిపోయి వృద్ధుడిలా ఉన్నాడు. పిల్లలని దగ్గరకు తీసుకుని దుఃఖించాడు. తండ్రి తిరిగి వచ్చాడే కానీ, మునుపటి మనిషి కాదు. పిల్లలతో ఇదివరకటిలా ఆటలాడటం,

కథలు చెప్పటం, కలిసి నవ్వడం లేదు. అన్నాళ్ళూ ఏం చేసాడో, ఏం జరిగిందో ఆయనా ఎప్పుడూ మాట్లాడలేదు. పిల్లలు కూడా తండ్రిని 'వాళ్ళెందుకు తీసుకు వెళ్లారు, ఏ నేరం మీద అరెస్ట్ చేసారు, ఆయన దోషా నిర్దోషా' లాంటి విషయాలు అడగలేదు. వాళ్లకి సంబంధించినంతవరకూ తమ కుటుంబం అంతా మళ్ళీ కలిసి ఉన్నారు, అది చాలు. జరిగినవన్నీ మరిచిపోవాలనుకున్నారు. కానీ జరిగిన కాలం పీడకలలా తండ్రిని వెంటాడసాగింది. ఆయన ముందు ఉద్యోగం చేసే కంపెనీ ఎపుడో మూతపడింది. ఇపుడు క్రొత్త ఉద్యోగం రావాలంటే కష్టం. ఇల్లంతా తిరుగుతూ ప్రతీ వస్తువూ తడిమి తడిమి చూస్తూ ఏదో గొణుక్కుంటూ ఉంటాడు. నిద్రపోతూ కొంతసేపటికే ఉలికిపడి లేచి, పిల్లల్ని పిలిచి తడిమి చూసుకుని ఇంట్లోనే ఉన్నానని తృప్తిపడ్తాడు. దానికి తోడు ఎవరిని చూసినా వారు తమ మీద నిఘా ఏమో అని అనుమానం. ఫోన్లో మాట్లాడడు. ఏమో ఎవరు వింటున్నారో ఎవరికి తెలుసు అంటాడు. ఎవరినీ తమ ఫ్రెండ్స్ అని నమ్మకూడదు అంటాడు. ఇల్లు దాటి బయటకి వెళ్ళడానికి కూడా ఇష్టపడేవాడు కాదు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక వాళ్లకి తినడానికి చేసిపెట్టి వాళ్ళు చెప్పే కబుర్లు వినేవాడు, కానీ ఎక్కడో ఆలోచిస్తూ ఏవిషయం చెప్పినా ఒకే నిరాసక్తతో స్పందించేవాడు. వచ్చిన కొత్తలో కొన్నాళ్ళు పేపర్ చదివేవాడు, కానే కొన్నాళ్ళకు అదీ మానేసాడు. రానురానూ ఎక్కువగా తన గదిలోనే కూర్చుని ఏదో ఆలోచిస్తూ గడిపేవాడు. నిద్రలో పీడకలల్తో అరుస్తూ లేచేవాడు. మొత్తానికి నవ్వుతూ నవ్విస్తూ ప్రేమాభిమానాలతో మసలే మనిషి మాయమయిపోయాడు.

దాదాపు ఒక ఆరునెలలు గడిచేసరికి వూర్లో పరిస్థితులు నెమ్మదిగా మారసాగాయి. బయట కలిసినపుడు జనాలు మాటలు కలపడం మొదలుపెట్టారు. కొన్నాళ్ళు తమని కాదన్నట్టు తప్పించుకు తిరిగినా అలా ఎన్నాళ్ళో ఉండటం కుదరలేదు. పలకరింపుకు మర్యాదగా బదులిచ్చి తప్పుకుపోవడం మొదలు పెట్టారు. కానీ గడిచినకాలం దొంగిలించిన తమ జీవితాన్ని మాత్రం వెనక్కి తెచ్చుకోలేకపోయారు.

ఇది ఒక్క కుటుంబం కథ కాదు. అభంశుభం తెలియని వేలవేల కుటుంబాల కథ. నా కథ. మీ కథ. మనవరకూ రాని మన కథ. మనిషికి మనిషే శత్రువు. అయితే ఆ శత్రుత్వం వ్యక్తిగతమే కానక్కరలేదు. మనుషుల్ని ఎపుడైతే వ్యక్తులుగా గుర్తించడం మాని, కుల మత ప్రాంతీయాలకు ప్రతినిధిగా చూడటం మొదలుపెడతామో, అపుడే శత్రుత్వానికి వ్యక్తిగత సరిహద్దులు చెరిగిపోతాయి. మానవత్వం మరిచిపోయి, ద్వేషంతో రగిలి, అమాయక జీవితాలను నిర్దాక్షిణ్యంగా చిదిమేసి, వెనక్కి తిరిగి చూసుకుంటే సిగ్గుపడాల్సిన చరిత్రకి మనమే వ్రాతకారులవుతాం. 'ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' అన్న శ్రీశ్రీ మాటల్ని నిజమని ఇంకోసారి ఋజువు చేసే కథ. కథ కాని కథ.

కథ మొత్తం రచయిత్రి తల్లీ పిల్లల మానసిక పరిస్థితిని వివరిస్తూ ముగ్గురు వైపు నుండి చెపుతారు. చిన్న చిన్న సాధారణమయిన వాక్యాల్లో, అవసరానికి మించని నేరేషన్, సెంటిమెంట్ కూరి పాడుచెయ్యని సంఘటనలతో ఆలోచింపచేసే బలీయమైన కథనం. కథలో మనల్ని పోల్చుకుంటాం. భయపడతాం. మన అస్తిత్వం విలువెంత, మన జీవితాలకు భరోసా ఎంతని దిగులుపడతాం. కథ చదువుతూ తెలీకుండానే ఆ కుటుంబం కోసం, మనకోసం కన్నీళ్ళు పెట్టుకుంటాం. ఆఖరున మూడు పేజీలున్న చాప్టర్లో 'శత్రువు ఎక్కడో లేదు, నువ్వు రోజూ చూసే వేవేల రూపాల్లో నీ పక్కనే ఉన్నాడు' అంటూ తండ్రి వైపు నుండి వ్రాసిన ఎపిలోగ్ ఒక్కటే ఒక ఎత్తు.

రచయిత్రి ఆమె కుటుంబంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ పుస్తకాన్ని 2002 లో వ్రాసారు. ఆమె తాతగారిని జపాన్ దేశానికి స్పై గా పనిచేస్తున్నారన్న అనుమానం మీద, పెరల్ హార్బర్ దాడి జరిగిన రోజున FBI అరెస్ట్ చేసి తీసుకుపోతే, ఆమె అమ్మమ్మ, అమ్మ, మావయ్య మూడేళ్ళు యూటా లోని కేంప్లో గడిపారట. ఈ పుస్తకం ఎనిమిది భాషల్లోకి అనువదించబడి, 300,000 ప్రతులకు పైగా అమ్ముడయింది. ఇది American Library Association's Alex Award, Asian American Literary Award పొందింది. దీన్ని అమెరికాలోని అనేక కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు రీడింగ్ కోర్సుల్లో, చదవాల్సిన పుస్తకాల జాబితాలో చేర్చారు.



రచయిత్రి పరిచయం: Julie Otsuka కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన, అమెరికన్–జపనీస్ సంతతికి చెందినవారు. ఆమె ఫైన్ ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. 2002 లో 'When The Emperor Was Devine', 2011 లో 'Buddha in The Attic' అనే రెండు నవలలు వ్రాసారు. ఆమె రెండవ నవల వివిధ సాహిత్య సంఘాల నుండి గుర్తింపును అవార్డులను పొందింది. ఆమె కొన్ని పత్రికలకు కథలు, వ్యాసాలు కూడా వ్రాసారు. ఆమె రచనల గురించి మరిన్ని వివరాలు ఆమె వెబ్సైట్ లో చూడవచ్చు.

(Pictures Source: internet)






# జీవించడం నేర్పిన గురువు




జీవితంలో ఒక్కో దశలో మనకి ఎందరో కలుస్తారు. కొంతమందితో అవ్యక్తమయిన అనుబంధం పెంచుకుంటాం. స్నేహితులు, బంధువులు, గురువులు లేదా ఏ బస్ స్టాప్ లోనో రోజూ కలిసే పరిచయస్తులో ఎవరైనా కావొచ్చు. కొంతకాలం పాటూ వాళ్ళు మనకి జీవితంలో అతి ముఖ్యమయిన భాగంగా మారిపోతారు. మనం వేసే ప్రతీ అడుగులోనూ వారి ప్రభావం ఎంతోకొంత ఉంటుంది. వాళ్ళు మనతో లేని జీవితం అనేది వూహించడానికే కష్టంగా ఉండే క్షణాలూ ఉంటాయి. కానీ కాలం ఓ మాయల మరాఠీ. అది చేసే ఇంద్రజాలంలో అపురూపమని మురిసిపోయినవెన్నో కొన్నాళ్ళకి మసిపూసినట్టు మరుగున పడిపోతాయి. ఎప్పుడో జీవితంలో మరికొన్ని దశలు దాటేసాకా, హఠాత్తుగా ఏ పిలుపూ లేకుండానే ఆ జ్ఞాపకాలు మళ్ళీ మనసుని తడుముతాయి. ఒకప్పుడు మనకెంతో ముఖ్యం అనుకున్నవాళ్ళని అలా ఎలా మర్చిపోయామా అని మనమే ఆశ్చర్యపోతాం. ఆ స్నేహాన్ని కొనసాగించలేకపోయిందుకు సిగ్గుపడతాం. బ్రతుకు బరువు అని సర్ది చెప్పుకుంటాం. ఆ జ్ఞాపకాల ఒడిలో కొత్త చైతన్యాన్ని నింపుకోడానికి ప్రయత్నిస్తాం. మనిషి జీవితంలో ఇవన్నీ అతి సాధారణ పరిణామాలు. కొంతమంది ప్రభావం కదిలిపోయే మేఘాల్లా ఆ దశ దాటగానే మరలిపోతే, కొంతమంది ఉనికి మనం తాత్కాలికంగా మర్చిపోయినా ఏదో ఒకరకంగా ఎప్పుడూ మనవెంటే ఉంటుంది. వారి జ్ఞాపకాలు, ఆ అనుభూతుల పరిమళాలు వాసెన కట్టిన మొగలిపొత్తులా ఏ అవ్యక్త క్షణాల్లోనో మనసుని పలకరించి పులకరింప చేస్తాయి. వారినుంచి నేర్చుకున్న విలువైన పాఠాలు జీవితాంతం తోడుగా ఉండటమే కాకుండా, పరిధులు విస్తరించి చుట్టూ ఉన్నవారి జీవితాలను కూడా స్పృశిస్తాయి.

మృత్యుముఖంలో ఉన్న ఓ టీచర్, జీవించడం మర్చిపోయి కేవలం బ్రతుకు మాత్రమే సాగిస్తున్న తన ప్రియశిష్యుడికి, జీవించడం ఎలానో నేర్పిన పాఠాలు 'Tuesdays with Morrie' – 'an old man, a young man and life's greatest lesson' అనే టేగ్ లైన్ తో అక్షరబద్ధం చెయ్యబడ్డ ఓ మెమోయిర్ (స్మృతి సంస్మరణ).

మిచ్ (Mitch Albom) 1979 లో కాలేజ్ నుండి గ్రాడ్యుయేట్ అయాడు. పియానిస్ట్ గా పేరు తెచ్చుకోవాలనేది అతని ఆశ. అయితే బయట ప్రపంచంలో పరిస్థితులు తను కాలేజ్ లో ఉండగా వూహించినంతగా రంగుల లోకంలా లేదు. తరువాత కొన్నేళ్ళు పాటలు వ్రాయడం, మ్యూజిక్ బేండ్ లో పనిచెయ్యడం లాంటివి చాలా చేసాడు కానీ ఏదీ కలిసి రాలేదు. సంతృప్తినీ ఇవ్వలేదు. ఊర్లు మారాడు. అదే సమయంలో మిచ్ కి బాగా ఇష్టమయిన అంకుల్ ఒకాయన చిన్నవయసులోనే కేన్సర్తో పోయారు. చనిపోయేముందు ఆయన చిన్నవాళ్ళయిన తనపిల్లల గురించి పడిన బెంగ మిచ్ మీద విపరీతమైన ప్రభావాన్ని చూపించింది. కాలం తన చేతిలోంచి ఇసుకలా జారిపోతుందని, దాన్ని తన చేతుల్లోకి తీసోకపోతే తన అంకుల్ లానే ఏమీ సాధించకుండానే పోతానని అతనికి అనిపించింది. మళ్ళీ కాలేజీలో చేరి జర్నలిజంలో మాస్టర్స్ డిగ్రీ చేసాడు. డెట్రాయిట్లో స్థిరపడి ఒక ప్రముఖ పత్రికలో స్పోర్ట్స్ న్యూస్ రిపోర్టర్గా పనిచేస్తూ, వివిధ మేగజైన్స్ కి స్పోర్ట్స్ కాలమ్స్ వ్రాయడం, స్పోర్ట్స్ బుక్స్ వ్రాయడం, ప్రముఖ ఆటగాళ్ల ఇంటర్వ్యూలు, రేడియో షోస్, టీవీ షోస్ ...వీటితో వూపిరి పీల్చుకోడానికి తీరికలేనంత బిజీ అయిపోయాడు. తను ఎన్నడూ ఊహించనంత డబ్బు సంపాదించాడు. ఎన్నో వైభోగాలు అమర్చుకున్నాడు. ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఎందుకో అతనికి తను కూడా తన అంకుల్ లాగే వయసు మించకుండానే పోతానని బాగా నమ్మకం. అది జరిగేలోగానే వీలయినంతగా ఆనందంగా జీవితాన్ని అనుభవించాలనీ, ఏదేదో సాధించాలనీ అతని ఆశ. దానికోసం ప్రతీ క్షణం శ్రమించాడు. పిల్లలు కావాలనుకున్నా, కుటుంబ జీవితాన్ని మొదలెట్టడానికి కూడా తీరికలేనంత బిజీ అయిపోయాడు. అంతర్జాతీయ స్పోర్ట్స్ జర్నలిస్టా ఎదిగాడు. ఆ పరిణామంలో స్నేహితులందరినీ మర్చిపోయాడు. సన్నిహిత మిత్రులతో కూడా కాంటాక్ట్స్ తగ్గిపోయాయి. ఎవరెక్కడున్నారో కూడా తెలీకుండా పోయింది.

బ్రతుకు వెంట పరుగుల్లో మనం జీవించడం మర్చిపోయిన క్షణాలు ఉంటాయి. ఒక్కసారి ఆగి వెనక్కి చూసుకుని సాధించామనుకుని మురిసిపోతున్న వాటిని బేరీజు వేసుకుని, 'ఇదేనా నేను సాధించింది? ఇది మాత్రమేనా? ఇదేనా నాకు నిజంగా కావాల్సింది? నేనేం కోల్పోతున్నాను?' అని నిజాయితీగా ప్రశ్నించుకుంటే దొరికే సమాధానం మనలో చాలామందికి సంతృప్తిని కలిగించదు. అయితే అలా ఆగి మనల్ని మనం చెక్ చేసుకునే అవకాశం, ఆలోచనా కూడా మనంతట మనకి రావట. మనలో ఆ తృష్ణని రేకెత్తించే వాళ్ళెవరో రావాలి... మిచ్ జీవితంలోకి మోరీ వచ్చినట్టు.

మోరీ (Morrie Schwartz) బోస్టన్ కు దగ్గరలో ఉన్న Brandeis University లో సోషియాలజీ ప్రొఫెసర్. బ్రతకడానికీ జీవించడానికీ తేడా ఉందని తెలిసిన వ్యక్తి. ఎపుడూ నవ్వుతూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, అందరితో అభిమానంగా ఉండేవారు. డాన్స్ చెయ్యడం అంటే అతనికి చాలా ఇష్టం. వీకెండ్ పార్టీల్లో అలుపెరగకుండా డాన్స్ చేసే అతనిని చూస్తే అందరికీ ఆశ్చర్యంగానూ ఉత్సాహంగానూ ఉండేది. చిన్న పెద్దా అందరూ ఆయనతో కాలం గడపడానికి ఎంతో ఇష్టపడేవారు. చదువు అంటే కేవలం పుస్తకాలలోని విషయాలే కాదు, మానవ సంబంధాలూ, అనుబంధాలూ గురించి ముఖ్యంగా తెలుసుకోవాల్సిన అవసరం చాలా ఉందని నమ్మిన మనిషి. విద్యార్థులతో కలిసి రకరకాల గ్రూప్ ఏక్టివిటీస్ చేయిస్తూ సోషియాలజీలో వివిధ అంశాలు ప్రాక్టికల్గా బోధించేవారు. తోటి మనిషి మీద, ప్రేమ నమ్మకం ముఖ్యమయిన విషయాలనీ, మనల్ని ప్రేమించే వాళ్ళు లేనినాడు మనమంతా రెక్కలు తెగిన పక్షులం అనీ అనేవారు. "The culture we have does not make people feel good about themselves. And you have to be strong enough to say if the culture doesn't work, don't buy it." అన్నది ఆయన సిద్ధాంతం. దానికి తగ్గట్టే ఆయన ప్రపంచాన్ని ఆయన నిర్మించుకున్నారు. ఫ్రెండ్స్, కొలీగ్స్ తో కలిసి టైం స్పెండ్ చెయ్యటం, వారి సమస్యలు విని సలహాలివ్వడం, రకరకాల విషయాల మీద డిస్కషన్ గ్రూప్స్ నడపడం, పేదవారికి సహాయపడే కార్యక్రమాలు నిర్వహించడంలాంటివి చేసేవారు.

మిచ్ కాలేజీలో ఉన్న ప్రతీ సెమిస్టర్ లోనూ ఆయన బోధించిన క్లాస్ తీసుకున్నాడు. ప్రతీ రోజూ క్లాస్ అయిన తరువాత ఆయనతో కలిసి అనేక విషయాల మీద డిస్కషన్ చేసే వాడు. మిచ్ ఆయన్ను కోచ్ అని పిలిచేవాడు. అది ఆయనకెంతో ఇష్టంగా ఉండేది. ఇద్దరూ మంచి స్నేహితుల్లా గడిపేవారు. తన తండ్రితో కన్నా మోరీతో చనువుగా అన్ని విషయాలూ చర్చించేవాడు. ఆయన కూడా ఓపికగా అన్నీ చర్చించి అతనిని గైడ్ చేసేవారు. గ్రాడ్యుయేషన్ రోజున మిచ్ తల్లిదండ్రులతో ఆయన తన స్టూడెంట్ గురించి ఎంతో గర్వంగా చెప్పుకున్నారు. ప్రియశిష్యుడు వెళ్ళిపోతున్నాడన్న బాధతో ఆయన కళ్ళల్లో నీళ్ళు. 'అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూ ఉంటావు కదూ' అని ఆప్యాయంగా కౌగలించుకుని సాగనంపారు. మిచ్ కూడా తప్పకుండా అని ప్రామిస్ చేసాడు, అయితే దాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. బ్రతుకు పరుగుల్లో అందరి జ్ఞాపకాలూ వెనక్కి తోసి పరుగు పందెంలో బిజీ అయిపోయాడు. అయితే తన పరుగు ఆపి తను బ్రతుకుతున్నానా, జీవిస్తున్నానా అని చెక్ చేసుకొనే అవకాశం అతనికి మోరీ రూపంలో వచ్చింది. ఒకరోజు ఏదో పనిచేస్తూ అసంకల్పితంగా టీవీ చానెల్స్ తిప్పుతూ ఉంటే ఒక ఛానెల్లో మోరీ ఫోటో, 'అతని గొప్పతనం మీరు కొద్ది సేపట్లో తెలుసుకుంటారు' అని ఏంకర్ వాఖ్యానం అతడి దృష్టిని ఆకర్షించింది.

మోరీ ఎపుడూ ఆరోగ్యంగానే ఉండేవారు. అయితే ఆయనకి అరవయ్యేళ్ళ వయసులో ఆస్థమా మొదలయ్యింది. 1994 లో నెమ్మదిగా నడక తడబడటం మొదలుపెట్టి, నడుస్తూ నడుస్తూ పట్టుతప్పి పడిపోవడం మొదలయ్యింది. అందరూ పెద్దవయసు కదా అనుకున్నారు, కానీ తనలో ఏదో తేడా ఉందని మోరీకి తెలుస్తోంది. డాక్టర్లు నానారకాల పరీక్షలు చేసి ఆయనకు Amyotrophic Lateral Sclerosis (ALS) అనే చాలా అరుదైన వ్యాధి వచ్చిందని తేల్చారు. అది మనిషి నరాలను కరిగించి, కండరాలను బలహీనం చేస్తుందట. నెమ్మదిగా కాళ్ళ నుండీ మొదలై శరీరం పైవరకూ ప్రాకి, స్వయంగా నిలబడటానికే కాదు, కనీసం వూపిరి తీసుకోడానికి కూడా చేతకాని మైనపు ముద్దని చేసి వదులుతుందట. డాక్టర్లు అతనికి ఓ రెండేళ్ళ సమయం మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. మోరీకి తన ప్రపంచం తిరగబడిన ఫీలింగ్. ఆ వార్తని జీర్ణించుకోవడానికి కొంచెం సమయం పట్టింది. మోరీ ముందు రెండు ప్రశ్నలు. ఇప్పుడు తనేం చెయ్యాలి? వచ్చిన రోగం దాచుకుని, కుమిలిపోతూ మిగిలిన కాస్త సమయం వృధా చెయ్యాలా? లేక ఉన్న కాస్త జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలా? మోరీ రెండోదే ఎంచుకున్నారు. తన మిగిలిన జీవితాన్ని ఆనందంగా సంపూర్తిగా గడపాలనుకున్నారు. తనకి ఓపిక ఉన్నంతవరకూ కాలేజీలో క్లాసులు బోధించారు.

కొన్నాళ్ళకి డ్రైవింగ్, నడక, స్విమ్మింగ్ ఒక్కోటీ స్వయంగా చేసుకోగలిగిన పనులన్నీ ఆగిపోయాయి. శరీరం కదలలేక వీల్ చైర్ కి అంకితం అయిపోయింది. మజిల్స్ బిగుసుకుపోయి శరీరం కదలటం కూడా కష్టం అయిపోయింది. నర్స్ లు ఇంటికి వచ్చి మజిల్స్ ఎక్సర్సైజ్ చేయిస్తున్నారు. బాత్రూంకి వెళ్ళాలన్నా ఎవరో ఒకరు లేపి తీసుకువెళ్ళాలి. నలుగురు నర్సులు అతనికి సాయం చెయ్యడానికి నియమించబడ్డారు. మిత్రులు, కొలీగ్స్, బంధువులు ఎందరో వచ్చి మోరీని కలిసి మాట్లాడి వెళ్ళేవారు. వాళ్ళని ఒకటే కోరిక కోరారు మోరీ. 'తన మీద జాలి చూపించొద్దనీ, ఎప్పటిలాగే తనతో సమస్యలు చర్చించమనీ, తనని వచ్చి చూడటమో, ఫోన్లో మాట్లాడటమో చేస్తుండమని' అడిగారు. రాను రానూ అతనిని చూడటానికి వచ్చే విజిటర్స్ సంఖ్య పెరిగిపోయింది. అందరికీ విచిత్రం, తొందరలో చనిపోతానని తెలిసిన మనిషి దాన్ని ఎలా ఎదుర్కొంటున్నాడా అని. ఆయన చావు గురించి డిస్కషన్ గ్రూప్స్ నడిపేవారు. చావు అంటే అంతం కాదనీ, అవగాహనలేక మనిషి చావంటే ఎంత భయపడతాడో లాంటి విషయాల మీద చర్చించేవారు.

ఒకరోజు మోరీ తన కొలీగ్ చనిపోతే అతని ఫ్యునరల్ కి వెళ్ళి వచ్చారు. అక్కడ చనిపోయిన మనిషి గురించి ఎందరో ఎంతో ప్రేమగా ఎన్నో సంగతులు గుర్తుకు తెచ్చుకుని స్మరించుకోడం చూసి, 'అవి వినడానికి ఆ మనిషి ఇపుడు లేడే. ఏం ఉపయోగం' అని అతనికి ఎంతో దుఃఖం వచ్చింది. దానితో అతనికో ఆలోచన వచ్చి బ్రతికుండగానే తన ఫ్యునరల్ చెయ్యమని తన ఫేమిలీని అడిగారు.

బంధుమిత్రులెందరో ఎన్నో ఆప్యాయమైన విషయాలు మాట్లాడి, ఎన్నో మంచి మంచి సంగతులు గుర్తు చేసుకున్నారు. వారందరితోబాటు ఆయన కూడా నవ్వారు, ఏడ్చారు. సాధారణంగా మనం మనకు బాగా కావాల్సిన వాళ్లకు కూడా వాళ్ళ మీద మన ఇష్టాన్ని, అభిప్రాయాన్ని చెప్పకుండా సమయం మించేవరకూ ఆగుతాం. కానీ ఆయన వారి గురించి చెప్పాలనుకున్న మంచి విషయాలన్నీ చెప్పి వాళ్ళ ఆనందాన్ని తానూ అనుభవించారు.

కొన్ని నెలలకు మనిషి మొత్తంగా మంచానికి అంకితం అయిపోయారు. వీల్ చైర్ లోంచి బెడ్ మీదకి మార్చాలంటే మనుషులు బస్తా ఎత్తినట్టు ఎత్తి పెట్టాల్సిందే. అయినా కూడా ఆయన డిప్రెషన్ దగ్గరికి రానివ్వలేదు. ఆలోచనొచ్చినప్పుడల్లా కాగితాల మీద వ్రాయటం మొదలుపెట్టారు. "గతాన్ని మర్చిపోకు. వదిలెయ్యకు. గతాన్ని గతంగా అంగీకరించు.' , 'నీకు సాధ్యాసాధ్యాలు అర్ధం చేసుకో.', 'ముందు నిన్ను నువ్వు క్షమించుకోవడం నేర్చుకుంటే, ఇతరులని క్షమించగలవు.' లాంటి చిన్న చిన్న సూత్రాలు కొన్ని వ్రాసారు. అవి చూసిన అతని ఫ్రెండ్ ఒకాయన, ఒక పత్రిక రిపోర్టర్కి పంపితే అతను వాటితో కలిపి మోరీ మీద 'A professor's Final Course: His Own Death' అని ఒక చిన్న పరిచయవ్యాసం వ్రాసారు. అది ABC Nightline ప్రొడ్యూసర్స్ దృష్టిని ఆకర్షించింది. ఆ ప్రోగ్రాం నిర్వహించే ఫేమస్ రిపోర్టర్ Ted Koppel మోరీ ఇంటికి వచ్చి అతని కథని, సందేశాన్ని తమ ప్రోగ్రామ్లో ప్రసారం చేస్తామని అడిగారు. అలా మోరీ విషయం మేసాచూసెట్స్ దాటి టీవీలకి ఎక్కింది.

ఆ ప్రోగ్రాం చూసిన మిచ్ కి, మోరీతో తన అనుబంధం, టచ్ లో ఉంటానని తను చేసిన వాగ్దానం గుర్తుకు వచ్చాయి. దాన్ని నిలబెట్టుకోనందుకు సిగ్గుపడ్డాడు. అతనికి అప్పుడప్పుడూ 'మానవత్వంతో హార్దిక సంబంధాలతో జీవించడం ఎలానో' నేర్పిన మోరీ గుర్తుకు వచ్చినా ఆర్ధిక లక్ష్యాల పరుగులో అవన్నీ గతజన్మ జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. వెంటనే మోరీని చూడాలని డిట్రాయిట్ నుండి బయలుదేరాడు.

మిచ్ ని చూడగానే మోరీ ఎంతో ఆనందంతో దగ్గరికి పిలిచి కౌగలించుకున్నారు. ఎన్నో ఏళ్ళ నుండీ కలవని వ్యక్తితో మాట్లాడుతున్నట్టు కాకుండా, ఏదో కొన్నాళ్ళు వూరెళ్ళి వచ్చిన స్నేహితుడితో మాట్లాడినట్టు కుశల ప్రశ్నలు అడిగారు. 'ఏం చేస్తున్నావు? నీ చుట్టూ ఉన్న సమాజానికి నువ్వేమన్నా చేస్తున్నావా? మనిషిగా బ్రతుకటానికి ప్రయత్నిస్తున్నావు కదూ?' లాంటి ప్రశ్నలు, తన మిగిలిన స్నేహితులేం చేస్తున్నారో అనీ అడిగారు. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఆయనకి ప్రతీ ఒక్కరూ పేరుతొ సహా గుర్తే. వాళ్ళెక్కడున్నారో కూడా తనకి తెలీదని చెప్పడాని మిచ్ సిగ్గుపడ్డాడు. డబ్బు, పదవుల వెనక తన పరుగులు గుర్తొచ్చి తల దించుకున్నాడు. 'నీకు తెలుసా నేను తొందరలో చనిపోబోతున్నాను' అని అడిగి వివరాలు చెప్పారు. 'చనిపోతున్నందుకు తనకేం బెంగ లేదనీ, కానీ నెమ్మదిగా తను శారీరక ప్రాధమిక అవసరాలకి కూడా వేరే వాళ్ళ మీద ఆధారపడాల్సి వస్తుందనీ, అదే తనని ఎక్కువ బాధిస్తుందని' చెప్పారు. మిచ్ తిరిగి వెళ్లబోయే ముందు ఆయన 'మళ్ళీ వచ్చి నన్ను చూస్తావు కదూ' అని అడిగితే వస్తానని మాట ఇచ్చాడు.

మోరీ దగ్గర నుంచి తిరిగి వచ్చాక, ఏ పని చేస్తున్నా, ఎంత బిజీగా ఉన్నా, మిచ్ కి మోరీ పదే పదే గుర్తు రాసాగారు. తను గడుపుతున్న జీవితం, తన చుట్టూ ఉన్న సమాజం ఎంత అసంబద్ధంగా నడుస్తున్నాయో అర్ధమయ్యింది. 'ఈ సమాజం మనల్ని అవకాశాల వెంట పరుగులు తీయిస్తుంది. ఎంత పొందినా మనల్ని సంతృప్తి చెందనివ్వదు' అన్న మోరీ మాటల్లో నిజం అర్ధం కాసాగింది. నెమ్మదిగా తన జీవితాన్ని దారిలో పెట్టుకోవాలని నిశ్చయించుకున్నాడు. విదేశాల్లో చేస్తున్న అసైన్మెంట్ ఆపేసి తిరిగి డెట్రాయిట్ తిరిగి వచ్చేసాడు. కానీ అక్కడ తను పని చేసే న్యూస్ పేపర్ యూనియన్ గొడవలతో స్ట్రైక్ లో ఉండటంతో కొన్ని రోజులు ఖాళీ దొరికింది. మోరీ కి ఫోన్ చేసి మాట్లాడి, ఆపై వచ్చే మంగళవారం కలవాలని అనుకున్నారు.

అలా మొదలైన మంగళవారం మీటింగ్స్ పదమూడు వారాలు సాగింది. ప్రతీ మంగళవారం ఉదయాన్నే మిచ్ డెట్రాయిట్ నుండి ఫ్లైట్ లో బోస్టన్ వెళ్ళేవాడు. సాయంత్రం వరకూ మోరీతో గడిపే వాడు. ఆయన కూడా మిచ్ కోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవారు. తిరిగి సాయంత్రం డెట్రాయిట్ వెళ్ళిపోయేవాడు. ఆ పదమూడు వారాల్లోనూ మోరీ ఆరోగ్య పరిస్థితి ఎంత క్షీణించిందో అన్నదానికి మిచ్ ప్రత్యక్ష సాక్షి అయినట్టే, ఆయన వ్యక్తిత్వపు విశ్వరూపానికీ తనే సాక్షి. ప్రతీవారం ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. ప్రేమ, కుటుంబం, సంఘం, భయం, చావు, క్షమ, భావోద్వేగాలు, పశ్చాత్తాపాలు లాంటి విషయాల మీద ఎన్నో విషయాలు మాట్లాడుకునే వారు. లోకంలో జరుగుతున్న అమానుష విషయాల పట్ల ఆయన బాధపడేవారు. బ్రతకటం వేరు జీవించడం వేరు అని చెప్పేవారు. ఆయన మాట్లాడితే మిచ్ వింటూ ఉండేవాడు. మొదటివారం గడిచాక అతనికి, ఆయన మాటలు మళ్ళీ మళ్ళీ వినడానికి తమ దగ్గర అట్టే టైం లేదని అనిపించింది. దానితో ఆయన మాటలు రికార్డ్ చేసి జ్ఞాపకంగా దాచుకోవాలనుకుని టేప్ రికార్డర్ లో రికార్డ్ చేసాడు. ఆయనతో గడిపిన సమయం, ఆయన మాటలు మిచ్ దృక్పధాన్ని మార్చాయి. తన జీవితాన్ని పూర్తిగా సంతృప్తికరంగా మార్చుకోవడానికి ఎంతో సహాయం చేసాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ మోరీ పరిస్థితి విషమం కాసాగింది. ఆహారంగా ద్రవ పదార్థాలు తీసుకోడం కూడా గొంతులోని కండరాలు సహకరించకపోవడంతో కష్టమయిపోయేది. వూపిరి తీసుకోడం కష్టమయ్యి ఆక్సిజన్ ట్యూబ్ సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ఆస్థమా దగ్గు ఎక్కువయి, వూపిరితిత్తుల్లోకి కఫం వచ్చి మాట్లాడనివ్వకుండా చేసేవి. ఆఖరికి జారిన కళ్ళద్దాలు సరిచేసుకోడానికి కూడా వేళ్ళు సహకరించేవి కాదు. మాట్లాడుతుండగా దగ్గు వచ్చి చాలాసేపు ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. అయినాకూడా మాట్లాడటం ఆపలేదు. మనుషులతో సమయం గడపటానికే ఇష్టపడేవారు. అయినా ఆయన ఏరోజూ అధైర్యాన్ని గానీ, దుఃఖాన్ని గానీ దగ్గరికి రానివ్వలేదు. ఎవరినీ తనకు పనుల్లో సహాయం అడగడానికి సిగ్గుపడలేదు. మీ పరిస్థితికి మీకు బాధ కలగదా అని అడిగినదానికి, 'ఉదయం లేవగానే నా పరిస్థితి గుర్తొచ్చి బాధ కలుగుతుంది. ఏడుస్తాను. అదీ ఒక రెండు నిముషాలు మాత్రమే. వెంటనే ఇంకా నేను ఆనందంగా నావాళ్ళతో గడపగలిగే సమయం ఉన్నందుకు సంతోషిస్తాను. అంతకన్నా దాని గురించి ఎక్కువ బాధపడను.' అని చెప్పారు. ఆయనకి తనని ప్రేమించే భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారు తమ ఉద్యోగాలు వదిలి సమయం ఆయనతో గడిపడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఆయన వద్దని వారించి, వీలయినప్పుడల్లా తనతో సమయం గడపమని కోరారు. వాళ్ళు తన కోసం ఉన్నారన్న ధైర్యమే ఆయనకి ఎనలేని ఆస్తి.

తనని సమాధి చెయ్యటానికి ఒక చెరువు గట్టుమీద చెట్టు క్రింద ప్రశాంతమైన చోటు ఎంచుకున్నారు. 'తరువాత కూడా నువ్వు నాతో మాట్లాడటానికి వస్తావు కదూ' అని అడిగితే మిచ్ 'మీరు మాట్లాడే మాటలు వినబడనపుడు నావల్ల కాదు' అన్నాడు. 'అపుడు నువ్వు మాట్లాడితే నేను వింటాను.' అని అన్నారు.

పద్నాలుగో మంగళవారానికి ఆయన పరిస్థితి చాలా క్షీణించింది. నీరసంతో రోజంతా పడుకునే ఉండేవారు. మనుషులతో గడపడానికి ఇష్టపడే మనిషి, అన్ని అపాయింట్మెంట్స్ కేన్సిల్ చేసుకున్నారు. మిచ్ ని ఆఖరుసారి హత్తుకుని, అతని చెయ్యి తన గుండెల మీద పెట్టుకుని కన్నీళ్ళు కార్చారు. మిచ్ కూడా ఆయన్ని హత్తుకుని మొదటిసారి కన్నీళ్ళు కార్చాడు. మళ్ళీ వచ్చే వారం వస్తానని చెప్పి వచ్చేసాడు.

ఆ శనివారం నవంబర్ 4, 1995 న మోరీ తనకి కావల్సిన వాళ్లందరూ ఇంట్లో ఉండగా ప్రశాంతంగా నిద్రలో మరణించారు. ఆయన ఫ్యునరల్ అతి ముఖ్యమైన బంధుమిత్రులతో జరిగింది. సమాధి దగ్గర మిచ్ ఆయన చెప్పినట్టుగా మౌనంగా ఆయనతో సంభాషించడానికి ప్రయత్నిస్తే అది ఎంతో సహజంగా అనిపించిందట. అతను ఆశ్చర్యపోయి చూసుకుంటే అది మంగళవారం కావటంతో అందులో ఆశ్చర్యం ఏమీ లేదని అనిపించింది అతనికి. ఇద్దరి విషయంలోనూ మంగళవారం అనుకోకుండా కలిసి వచ్చిందంటాడు మిచ్. కాలేజీలో కూడా ఎక్కువగా ఆయన క్లాసులు, ఆయనతో కలిసి డిస్కషన్ రోజులు చాలా వరకూ మంగళవారాలే ఉండేవట. మంగళవారం మా

ఇద్దరిదీ అంటాడు అతను. మిచ్ రచనల్లో కనిపించే భావాల వెనుక, చేస్తున్న సామాజిక కార్యక్రమాల వెనుక మోరీ ప్రభావం చాలా ఉందని అర్థమవుతుంది.

ప్రతీ వారం ఇద్దరి మధ్యా జరుగుతున్న సంభాషణ / చర్చ పుస్తకంగా తీసుకురావాలన్నది మోరీ ఆలోచనేనట. ఆ ఆలోచన మిచ్ బయట పెట్టగానే చాలామంది పబ్లిషర్స్ దాన్ని ప్రచురించడానికి ముందుకు వచ్చారట. పుస్తకానికి పేరు కూడా ఇద్దరి ఆలోచన్లనుంచీ పుట్టినదే. కాకపోతే పుస్తకంగా వచ్చినపుడు చూడటానికి మోరీ లేరు.

ఈ పుస్తకాన్ని మొదట 1997లో ప్రచురించారు. 2000 సంవత్సరంలో New York Times Non-Fiction Bestsellers అవార్డ్ పొందింది. ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్ కాపీలు అమ్ముడయి , 50 ప్రచురణలు వచ్చాయిట. అతి ప్రభావవంతమైన మెమోయిర్ గా గుర్తింపు పొందింది ఈపుస్తకం. దీని ఆధారంగా 1999లో Jack Lemmon, Hank Azaria ముఖ్యపాత్రధారులుగా లఘుచిత్రం నిర్మించారు. ఈ చిత్రానికి 2000 లో best TV film, best lead actor, best supporting actor అవార్డులు లభించాయి.



ఇద్దరి సంభాషణల వివరాలూ, అందులోని మోరీ బోధించిన విషయాలు, ఆయన ఆలోచనలూ ఈ పరిచయ వ్యాసం పరిధిలో వ్రాయటం వీలుకాని పని. అందుకని కొన్ని సందర్భాల్లో ఆయన ఆలోచనలూ, కొన్ని ముఖ్యమైన ఆలోచింపచేసే మాటలు పరిచయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. (ఇంకా వివరాలకు చివర రిసోర్స్ లిస్టు చూడండి.)

Nightline వాళ్ళు మొత్తం మూడు సార్లు ఆయన ఇంటర్వ్యూ ప్రసారం చేసారు. (మొదటిసారి ఆర్భాటంగా, ప్రముఖ రిపోర్టర్ని అన్న గర్వంతో వచ్చిన Ted Koppel, ఆయన వ్యక్తిత్వానికి ప్రభావితుడై చివరికి ఆయన్ని 'మై ఫ్రెండ్' అని ఇష్టంగా సంబోధించే స్థితికి వచ్చాడు.) చివరి ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు మోరీ. *"I know when to say good bye. For me living means I can be responsive to the other person. It means I can show my emotions and my feelings. Talk to them. Feel with them. When that is gone, Morrie is gone."*

"మీరు పోయిన తరువాత అందరూ మిమ్మల్ని మర్చిపోతారన్న భయముందా మీకు?' అని అడిగినదానికి మోరీ జవాబు *"I don't think I will be. I've got so many people who have been involved with me in close, intimate ways. And love is how you stay alive, even after you are gone."*

ఒక చిన్న సంఘటనతో తను దూరం చేసుకున్న స్నేహితుని గురించి మాట్లాడుతూ, అతను పోయేక కానీ తనెంత పొరపాటు చేసారో తెలీలేదని బాధపడుతూ ఇలా చెప్పారు. *"It's not just other people we need to forgive. We also need to forgive ourselves. For all the things we didn't do. All the things we should have done. You can't get stuck on the regrets of what should have happened."*

కొందరితో మనం ఎన్ని గంటలు మాట్లాడినా తనివి తీరదు. కొందరితో మాట్లాడటానికి ఒక్క వాక్యమూ పెగిలి రాదు. అతి అరుదుగా కొందరితో ఏమీ మాట్లాడనవసరం లేకుండానే ఎన్నో విషయాలు పంచుకోవచ్చు. మోరీ బెస్ట్ ఫ్రెండ్ వృద్ధాప్యం వలన వినికిడి శక్తి కోల్పోయాడని తెలిసి Ted Koppel ఇంటర్వ్యూలో 'ఆయనకు వినబడదు. మీరు గట్టిగా మాట్లాడలేరు. మరి మీ ఇద్దరూ ముందు ముందు ఎలా సంభాషించుకుంటారు' అని అడిగినదానికి *"We will hold hands and there'll be a lot of love passing between us. Ted, we've had thirty-five years of friendship. You don't need speech or hearing to feel that."* అని మోరీ చెప్పిన సమాధానం నాకెంతో ఇష్టమయినది.

*"Sometimes you cannot believe what you see, you have to believe what you feel. And if you are ever going to have other people trust you, you must feel that you can trust them, too—even when you're in the dark. Even when you're falling."*

*"People act as if death is contagious. It's not contagious. Death is as natural as life. It's part of the deal we made."*

*"As long as we can love each other, and remember the feeling of love we had, we can die without ever really going away. All the love you created is still there. All the memories are still there. You live on—in the hearts of everyone you have touched and nurtured while you were here. Death ends a life, not a relationship."*

*"There is no formula to relationships. They have to be negotiated in loving ways, with room for both parties, what they want and what they need, what they can do and what their life is like. Love is when you are as concerned about someone else's situation as you are about your own."*

*"The way you get meaning into your life is to devote yourself to loving others, devote yourself to your community around you, and devote yourself to creating something that gives you purpose and meaning."*

*"Everyone knows they're going to die, but nobody believes it. If we did, we would do things differently. But there's a better approach. To know you're going to die, and to be prepared for it at any time. That's better. That way you can actually be more involved in your life while you're living."*



*" people so hungry for love that they were accepting substitutes. They were embracing material things and expecting a sort of hug back. But it never works. You can't substitute material things for love or for gentleness or for tenderness or for a sense of comradeship. I can tell you, as I'm sitting here dying, when you most need it, neither money nor power will give you the feeling you're looking for, no matter how much of them you have."*

*"జీవించడం ఎలానో తెలిసినవాడికి, ఎలా మరణించాలో కూడా తెలుస్తుంది" – మోరీ*

**Interesting Resources:**

- ఈ సినిమా యూ ట్యూబ్ లో చూడవచ్చు.
- ఈ పుస్తకం మొత్తం, రచయిత స్వయంగా చదివిన ఆడియో బుక్ రూపంలో ఇక్కడ లభ్యం.
- రచయిత వెబ్సైట్ లో మోరీ, మిచ్ ల అనుబంధం గురించి, ఫొటోలతో సహా ఇక్కడ చదవొచ్చు. ఇదే పేజీలో క్రింద మిచ్ మోరీల సంభాషణల ఒరిజినల్ రికార్డింగ్స్ కొన్ని భాగాలు వినొచ్చు.
- మిచ్ ని ఆయన రచనల గురించీ, మోరీ గురించీ ఒక స్కూల్ పిల్లాడు అడిగిన ప్రశ్నలూ, వాటికి మిచ్ సమాధానాలు చదవాలనుకుంటే ఇక్కడ చూడండి.



**రచయిత గురించి:** Mitch Albom వృత్తిపరంగా ఫ్రీలాన్స్ స్పోర్ట్స్ జర్నలిస్ట్. ప్రవృత్తి రచన. స్క్రీన్ ప్లే రచన, రేడియో & టీవీ ప్రోగ్రామ్స్ ప్రసారాలు, పాటలు వ్రాసి సంగీతం కూర్చడం, అన్నిటినీ మించి సంఘసేవ. 'Tuesdays with Morrie' స్పోర్ట్స్ కి సంబంధించని ఆయన మొదటి రచన. ఆయన వ్రాసిన ఫిక్షన్ నవలలు కూడా దాదాపు నలభై భాషల్లోకి అనువదించబడి మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి. వాటిలో Five People you meet in Heaven, For One more day, The Time Keeper అనేవి ముఖ్యమైనవి. కొన్ని సేవాసంస్థలు ద్వారా ఛారిటీ పనులు కూడా విరివిగా చేస్తున్నారు. ఆ వివరాలు ఆయన వెబ్ సైట్లో చూడవచ్చు

(Pictures Source: internet)



# పుస్తకం ఓ నేస్తం
## – పద్మవల్లి



# మృత్యువుని మోహపరచిన పిల్ల
# The Book Thief

*"I do not carry a sickle or a scythe. I only wear a hooded black robe when it's cold. And I don't have those skull-like facial features you seem to enjoy pinning on me from a distance. You want to know what I truly look like? I'll help you out. Find yourself a mirror while I continue." - Death*

(నేను కొడవలీ కత్తీ చేత్తో పట్టుకుని తిరగను. మీరు వూహించుకున్నట్టు నల్లటి ముసుగేసుకుని, పుర్రె ముఖంతో భయంకరంగా ఉండను. మీకు నేను నిజంగా ఎలా ఉంటానో తెలుసుకోవాలని ఉందా? ముందు ఓ అద్దం తెచ్చుకోండి, నేనెలా ఉంటానో మీకు చూపిస్తాను. – మృత్యువు) మనకి మనం సృష్టించుకుంటున్న విధ్వసాన్ని ఇంత అందంగా చెప్పటం నేనైతే ఇప్పటివరకూ చూడలేదు.




మృత్యువు ..బహుశా ఈ ఒక్కటే ఎవరినైనా, ఎంతో కొంత భయపెట్టగలిగేది. మృత్యువు పేరు వినగానే అసంకల్పితంగా ఉలిక్కిపడతాం. తప్పించుకోవడం మన తరం కాదని తెలిసినా దూరం పారిపోవాలని విశ్వప్రయత్నాలు చేస్తాం. ఆఖరికి బ్రతుకు దుర్భరమైన వాళ్ళు కూడా మృత్యువు అంటే భయపడతారు. ఎక్కడికి వెళ్ళినా మృత్యువు మనల్ని వెంటాడటం వదలదు అని వింటాం. కానీ మృత్యువు ఏమంటుందో తెలుసా! మనుషులే మృత్యువు వెంటపడతారట. 'యుగాలుగా నా పని చేసి చేసి నాకు విసుగొస్తోంది. కొన్నాళ్ళు సెలవు తీసుకుందామంటే నాపని చేసేవాళ్ళెవరూ లేరు. ఈ పని చెయ్యడం నాకు ఎంత వేదనో మీకేం తెలుసు? నేనంటే మీకు భయమని మీకో భ్రమ, కానీ మిమ్మల్ని చూస్తేనే నాకు ఎంతో భయం తెలుసా! " అంటోంది

ఓ పాతికేళ్ళ క్రితం, మహాభారత్ టీవీ సీరియల్లో 'మై సమయ్ హూ, మై కభీ రుక్తా నహీ' అని కాలపురుషుడి గంభీర స్వరం వినిపిస్తుంటే, భయమో భక్తో, పులకరింతో జలదరింపో

తెలియని ప్రకంపన సన్నగా వెన్నులో పాకేది. కాలం దృష్టి నుండి కథ చెప్పటం అదే మొదలు నాకు తెలిసినంతవరకూ. కేవలం ఎపిసోడ్ చివర్లో మళ్ళీ వచ్చే దానికోసమే ఆ భాగం ఎప్పుడయిపోతుందా అని ఎదురుచూసేదాన్ని. ఇన్నేళ్ళ తరువాత ఇపుడు మృత్యువు చెప్పిన కథ విన్నాను. 'మీ అందరి కథలూ నాకు తెలుసు. ప్రతీ క్షణం మీవెంటే నీడలా ఉండి అన్నీ గమనిస్తూనే ఉంటాను.' అంటున్న మృత్యువు, 'యుగయుగాలుగా నేనెందరి కథలో చూసాను కానీ, ఆ పిల్ల కథ లాంటి కథ ఇంకెప్పుడూ నేను చూడలేదు' అంటూ తనని మోహపరిచిన ఒక చిన్నపిల్ల గురించి చెప్పిన కథే Markus Zusak వ్రాసిన The Book Thief.

మృత్యువు తన కోటు జేబులోనుండి ఓ నల్లని డైరీ లాంటి పుస్తకం చూపించి, 'ఇది ఆ అమ్మాయి వ్రాసుకున్న తన కథ. ఇది నేను తీసుకున్నానని తనకి తెలీదు. ఆమె కథ మీకు చెపుతాను వినండి', అని లీసెల్ కథ చెప్పడం మొదలుపెట్టింది. తను చెప్పబోయే కథాకాలం 1939 నుండి 1943 వరకు, రెండో ప్రపంచ యుద్ధకాలం. జర్మనీలో హిట్లర్ నాజీ సైన్యం అరాచకం సాగుతున్న రోజులు. అపుడు లీసెల్ కు తొమ్మిదేళ్ళు.

లీసెల్ (Liesel Meminger) తొమ్మిదేళ్ళ అమ్మాయి. ఆమె పుట్టిన తరువాత తండ్రిని చూడలేదు. అతను కమ్యూనిస్ట్ అని చెప్పుకుంటుంటే వినడమే తప్ప అంటే ఏంటో కూడా ఆమెకి తెలీదు. తల్లి తరచూ అనారోగ్యంతో బాధ పడేది. దుర్భరమైన  పేదరికం. స్కూల్కి వెళ్ళి చదువుకునే అవకాశం లేకపోవడంతో, ఆమెకు అక్షరాలు కూడా రావు. వాళ్ళ పరిస్థితుల వలన లీసెల్ నీ ఆమె ఆరేళ్ళ తమ్ముడినీ మ్యూనిక్ దగ్గరలో ఒక ఫాస్టర్ పేరెంట్స్ రక్షణలో వదలడానికి తల్లి నిర్ణయించుకుంది. ఆ ఫాస్టర్ పేరెంట్స్ ధనికులు కాకపోయినా, పిల్లలకి తిండి పెట్టి స్కూల్కి పంపగలరు అని తల్లి ఆశ. పిల్లలిద్దరినీ తీసుకుని తల్లి రైల్లో బయలుదేరింది.  అది జనవరి 1939, శీతాకాలం. ఎటుచూసినా విపరీతమయిన మంచుతో అన్నీ కప్పబడి, చుట్టూ తెల్లటి మైదానాలు మాత్రమే కనిపిస్తున్నాయి. వాళ్ళు గమ్యం చేరకముందే తమ్ముడు చనిపోయాడు. రైల్ లోని గార్డులు వాళ్ళు ముగ్గురినీ  ప్రక్క స్టేషన్లో దింపేసారు. అక్కడ పిల్లాడిని సమాధి చేసి, తరువాత రైల్లో తల్లీ కూతుర్లు మ్యూనిక్ బయలుదేరారు. సమాధి తవ్వుతున్నప్పుడు ఒక వర్కర్ కోటు జేబులోనుండి నల్లని అట్టతో ఉన్న 'The Grave Diggers Handbook' అనే ఒక చిన్న పుస్తకం క్రింద పడి మంచులో కూరుకుపోయిఉంటే, ఎవరూ చూడకుండా దాన్ని లీసెల్ తీసి దాచుకుంది. అది ఆమె దొంగతనంగా తీసుకున్న మొదటి పుస్తకం.

లీసెల్ బాధ్యత తీసుకోబోతున్న ఫాస్టర్ పేరెంట్స్ హేన్స్ , రోసా (Hans & Rosa Hubermann). మ్యూనిక్ శివార్లలో, మోల్కింగ్ అనే చిన్న పల్లెటూర్లో, హిమ్మల్ అనే వీధిలో నివసిస్తుంటారు. ఆ హిమ్మల్ అనే వీధి పేదరికానికి మారుపేరు. అందరూ చిన్నచిన్న పనులు చేసుకొని జీవించేవారే. ఆ వీధిలో ఇళ్ళన్నీ ఒకదానికి ఒకటి  అంటుకొని చిన్నచిన్న డబ్బాల్లా ఉంటాయి. హేన్స్ నిర్మలంగా మెరిసే కళ్ళతో, మృదువైన మాటలతో నెమ్మదైన మనిషి. అతను మొదటి ప్రపంచయుద్ధం అపుడు సైన్యంలో పనిచేసాడు. తరువాత ఇళ్ళకు రంగులేసే పని చేస్తుంటాడు. దాని వల్ల పెద్దగా ఆదాయం ఉండేది కాదు. అతనికి ఎకార్డియన్ వాయించడమన్నా, సిగరెట్లు తాగాడమన్నా విపరీతమయిన ఇష్టం.  రోసా హేన్స్ కి పూర్తిగా వ్యతిరేకం. మాట దురుసు, కానీ మనసు నవనీతం. అయితే అది ఎప్పుడూ బయటకి కనిపించదు.  ఆమె మొహంలో ఏరకమైన భావాలూ బయటకి కనిపించవు.  తిట్టు లేకుండా ఒక వాక్యం కూడా మాట్లాడలేదు ఆమె.  ఆ ఊర్లోని ధనికుల ఇళ్ళనుండి బట్టలు ఉతికి ఇస్త్రీ చేసి ఇచ్చి, భర్తకి తోడుగా ఏదో కొంచెం సంపాదిస్తుంటుంది. అయినా కూడా వాళ్ళ అవసరాలకు అది బొటాబొటీగా సరిపోయేది. వాళ్ళకు ఒక కొడుకూ, కూతురూ ఉన్నారు, ఇద్దరూ కూడా పెద్దయి వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతుంటారు.

లీసెల్ ఆ ఇంటికి రాగానే మొదట ఎవరితోనూ మాట్లాడటానికి గానీ, ఇంట్లోకి వెళ్ళడానికి కానీ ఇష్టపడలేదు. నెమ్మదిగా హేన్స్ మృదువుగా మాట్లాడి మచ్చిక చేసుకున్నాడు. లీసెల్ ని స్కూల్లో జాయిన్ చేస్తే చదవటం వ్రాయడం రాకపోవడం వలన చిన్న క్లాసులో చేరాల్సి వచ్చింది. తనని చిన్న పదాలు కూడా చదవడం కూడా రాదని గేలి చేసి, మితిమీరి అల్లరి చేసిన ఓ ఆకతాయిని లీసెల్ చితకకొట్టడంతో

ఇక ఎవరూ ఆమెని విసిగించరు. తల్లి ఆమెని ఎందుకు వదిలేసి వెళ్ళిపోయిందనే బాధ, తమ్ముడి మరణం ఆమెని బాగా బాధించసాగాయి. ప్రతీ రాత్రి లీసెల్ పీడకలలతో భయపడి లేస్తే, హేన్స్ ఓపికగా రాత్రంతా ఆమె దగ్గరే కూర్చుని ఆమెకు మళ్ళీ నిద్ర పట్టేవరకూ పుస్తకం చదివేవాడు. హేన్స్ లీసెల్ కు  నెమ్మదిగా వ్రాయడం చదవడం నేర్పించాడు. అలా ఇద్దరి మధ్యా అనుబంధం నెమ్మదిగా బలపడింది. రోసా మాటతీరుకీ, కోపానికీ లీసెల్ మొదట భయపడినా నెమ్మదిగా అర్ధం చేసుకుంది. ఇద్దరినీ అమ్మా, నాన్నా అని పిలవడానికి అలవాటుపడింది.

రూడీ, లీసెల్ ఇంటికి ఓ నాలుగిళ్ళ దూరంలో ఉంటాడు. అతని తండ్రి ఓ చిన్న టైలరింగ్ షాప్ యజమాని. ఆరుగురు పిల్లలలో రెండవవాడు రూడీ, లీసెల్ కన్నా కొన్ని నెలలు పెద్దవాడు.  ఒలింపిక్స్ చాంపియన్ జెస్సీ ఓవెన్స్ అంటే ప్రాణం. అతనిలా ఎప్పటికన్నా తానూ అందరిచేతా గుర్తింపబడాలని పిచ్చికోరిక. మంచి చలాకీ పిల్లాడు, కొంచెం కొంటెవాడు కూడాను. ఆ వీధిలో మొదటగా తనే లీసెల్ తో పరిచయం చేసుకుని, తరువాత ఇద్దరూ మంచి స్నేహితులయారు. రోజూ సాయంత్రం వీధిలో పిల్లలందరూ కలిసి సాకర్ ఆడుతుంటారు. ఇద్దరూ ఒకరినొకరు తిట్టుకున్నా లోపల ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టమే. లీసెల్ కి  ఎపుడు ఏ చిన్న సాయం చేసినా, బదులుగా ఒక ముద్దివ్వమని అడుగుతూ ఉంటాడు. ప్రతీసారీ లీసెల్ జవాబు చెప్పకుండా తప్పించుకుని పోతుంటుంది.

రోజా తను లాండ్రీ చేసే కష్టమర్స్ ఇంటి నుంచి ఉతకాల్సిన బట్టలు తీసుకురావడం, ఉతికినవి తిరిగి ఇచ్చి డబ్బులు తీసుకురావటం లీసెల్ కి అప్పచెబుతుంది.  లీసెల్ కి తోడుగా రూడీ.. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళి ఆపనులు చేసుకొస్తూ ఉంటారు.  ఆ ఇళ్ళల్లో మేయర్ ఇల్లు కూడా ఒకటి.

అవి నాజీ పార్టీ బలపడుతున్న రోజులు. స్కూల్లో కూడా హిట్లర్ యూత్ క్లబ్ అని మొదలుపెట్టి, పిల్లలకి హిట్లర్ గురించీ, నాజీ పార్టీ  గురించి చెపుతూ, వారిని ముందు ముందు సైన్యంలోకి  పనికొచ్చేలా తర్ఫీదుచేసేవారు. హిట్లర్ పుట్టిన రోజు నాడు అందరూ పూర్లో పెరేడ్ చేసి, హిట్లర్ కి వ్యతిరేక సాహిత్యం అంతా వీధిలో గుట్టలు పోసి తగులబెట్టారు. అన్ని పుస్తకాలు తగలబడుతుంటే చూడలేకపోయిన లీసెల్ అందరూ వెళ్ళిపోయిన తరువాత, మంటల్లోంచి కొంచెం కాలిన పుస్తకాన్ని తీసి దాచుకుంది. అయితే ఎవరూ చూడలేదు అనుకుంది, కానీ దాన్ని ఇద్దరు వ్యక్తులు చూసినట్టు ఆమె తరువాత గమనించింది. ఒకరు హేన్స్. రెండో వ్యక్తి మేయర్ భార్య ఇల్సా. హేన్స్ కి లీసెల్ కి పుస్తకాలంటే ఎంత ఇష్టమో అర్ధమయ్యింది. రోజూ రాత్రుళ్ళు ఇద్దరూ కలిసి బేస్మెంట్లో కూర్చుని ఆ పుస్తకాన్ని చదువుకునేవారు.

తను పుస్తకాన్ని దొంగిలించడం ఇల్సా చూసిందని తెలిసిన దగ్గరనుంచీ, లీసెల్ బట్టలు తీసుకురావటాని వెళ్ళడానికి రకరకాల కారణాలు చెప్పి తప్పించుకోవాలని చూసింది, కానీ రోసా దగ్గర ఆ ఆటలు సాగలేదు.  ఇక తప్పక మేయర్ ఇంటికి వెళితే ఇల్సా తలుపు తీసి, లీసెల్ ని పుస్తకాలతో నిండిన పెద్ద లైబ్రరీ గదిలోకి తీసుకువెళ్ళింది. అన్ని పుస్తకాలని  చూసిన లీసెల్ ఆనందం పట్టలేక వాటిని తడిమి తడిమి చూసుకుంది. అప్పటి నుండీ బట్టలు తేవడానికి  వెళ్ళినపుడల్లా కొంచెం సేపు ఆ గదిలో కూర్చుని కాసేపు పుస్తకాలు చదువుకుని, అపుడు ఇంటికి వెళ్ళేది. ఇల్సా ఆమెని చూస్తూ అక్కడే కూర్చునేది. అక్కడ తనూ, రష్యాతో యుద్ధంలో చనిపోయిన తన కొడుకూ కూర్చుని పుస్తకాలు చదువుకునేవారని చెప్పింది. ఇల్సా ఎపుడూ కొడుకుని తలచుకుంటూ విచారంగా, అతితక్కువగా మాట్లాడుతూ  ఉండేది. కొన్నాళ్ళు ఇలా గడుస్తూ ఉండగా, యుద్ధం వలన అందరి  ఆర్ధిక పరిస్థితులూ చితికిపోవడం మొదలయ్యింది. నెమ్మదిగా ఒక్కొక్కరూ రోసాకి తమ బట్టలు ఉతికే పని ఇవ్వడం ఆపేసారు. చివరగా మేయర్ కూడా ఆపేసారు, దానితో లీసెల్ కి పుస్తకాలు చదువుకునే అవకాశం పోయింది.

తనకి చదవటం రాని రోజుల నుంచీ కూడా లీసెల్ కి పుస్తకాలతో ఎంతో ఉపసమనం దొరికేది.  తల్లీ, తమ్ముడు గుర్తొచ్చి బాధలో ఉన్నప్పుడూ, పీడకలల్లోంచి లేచి కూర్చున్నపుడూ ఎపుడు బాధ కలిగినా మొదట దొంగిలించిన పుస్తకాన్ని గుండెలకి హత్తుకుని కూర్చునేది. అది చూసిన పెంపుడు తండ్రి ఆమెకి ఆ పుస్తకాన్ని చదివి వినిపించేవాడు. నెమ్మదిగా చదవడం రాయటం నేర్చుకున్న తరువాత, చదివినవే అయినా పదే పదే చదువుకుంటూ కూర్చునేది.

మేయర్ ఇంటికి బట్టలకి వెళ్లడం ఆగిపోయిన దగ్గరనుండి ఆమెకి చదవటానికి కొత్త పుస్తకాలేమీ దొరకలేదు. తిండికే చాలీ చాలకుండా ఉన్న ఆర్థికపరిస్థితితో పుస్తకాలు కొనే అవకాశమే లేదు. దానితో అప్పుడప్పుడూ ఎవరూ చూడకుండా మేయర్ ఇంట్లోకి, ఎపుడూ తెరిచి ఉండే లైబ్రరీ రూం కిటికీ లోంచి వెళ్ళి, పుస్తకం దొంగతనం చేసి తెచ్చుకునేది. పుస్తకం ఎక్కడిదీ అని అడిగిన తండ్రికి స్కూల్లో టీచర్ ఇచ్చిందని చెప్పేది. ఆమె దొంగతనాలన్నిటికీ రూడీ తోడుగా ఉండేవాడు. ఆమెను 'పుస్తకాల దొంగ' అని వెక్కిరించేవాడు. దొంగతనానికి తోడుగా వచ్చినందుకు తనకో ముద్దిమ్మని అడిగి, లేదనిపించుకునేవాడు. ఒకరోజు ఇల్సా ఒక పుస్తకంలో 'నువ్వు పుస్తకాలు దొంగతనం చేస్తున్నావని నాకు తెలుసు. నువ్వు దొంగతనంగా కాకుండా, ఎపుడు కావాలంటే అపుడు తలుపు తట్టి లోపలికి వచ్చి చదువుకుని వెళ్ళొచ్చు.' అని చీటీ వ్రాసి పెట్టింది. అప్పటి నుంచీ మళ్ళీ లీసెల్ ఇక పుస్తకాలు దొంగతనం చెయ్యలేదు.

ఆ కాలంలో మెజారిటీ జర్మన్లు యూదులంటే ద్వేషంతో ఉండేవారు. చాలామంది యువకులతో సహా హిట్లర్ ఉపన్యాసాలకు ఆకర్షించబడి, నాజీ పార్టీలో చేరి రష్యా పోలాండ్ లాంటి దేశాల మీదకు యుద్ధానికి వెళ్ళేవారు. యూదులు కనిపిస్తే చాలు తరిమి కొట్టడం, దాడులు చెయ్యడం చేస్తుంటే, వాళ్ళు వీలయితే దేశం వదిలి పారిపోవడమో, లేదా జర్మన్లకు కనిపించకుండా రహస్యంగా దాక్కోవడమో చేస్తూ ఉండేవారు. అయితే యూదుల మీద ద్వేషం కూడదని, వాళ్ళ మీద దాడులు అమానుషమనీ నమ్మినవారూ కొంతమంది ఉండేవారు. వారిలో హేన్స్, రూడీ తండ్రి అలెక్స్ లాంటి వాళ్ళున్నారు. వాళ్ళు నాజీ పార్టీలో చేరడానికి అంగీకరించకపోవడంతో, సాటివాళ్ళు వాళ్ళని దేశద్రోహుల లెక్కన చూసేవారు. వారికి పనులు ఇవ్వడం కూడా మానేయ్యడంతో, వాళ్ళ బిజినెస్ దెబ్బతిని ఇల్లు గడవటం ఇంకా కష్టం అయింది. అయినా కూడా స్థైర్యం కోల్పోకుండా ఉన్నారు.

కొంతమంది టీనేజ్ పిల్లలు ఆకలికి ఆగలేక, జట్టుగా దూరంగా ఉన్న తోటల్లోకి దొంగతనానికి వెళ్ళి పళ్ళు దొంగిలించి తినేవారు. రూడీ లీసెల్ కూడా వాళ్లతో కలిసి దొంగతనానికి వెళ్ళేవారు, కానీ ఇంట్లో తెలియనిచ్చేవారు కాదు. ఇద్దరూ ప్రతీ విషయంలోనూ ఒకరికొకరు తోడుగా ఉండి, ఎవరన్నా ఒకరితో గొడవకి వస్తే రెండో వారు అడ్డుపడేవారు. వాళ్ళిద్దరి మధ్యా స్నేహం నిష్కల్మషంగా పెరుగుతూనే ఉంది, అయితే అవకాశం దొరికినప్పుడల్లా కొంటె రూడీ ముద్దు కోసం అర్జీ పెట్టుకుంటూనే ఉన్నాడు.

ఒకరోజు హేన్స్ ఇంటికి ఇరవైరెండేళ్ళ వయసున్న మేక్స్ అనే ఒక యూదు యువకుడు ఆశ్రయం కోసం వచ్చాడు. మేక్స్ తండ్రి ఎరిక్, హేన్స్ ఇద్దరూ సైన్యంలో చేసినపుడు ప్రాణస్నేహితులు. హేన్స్ వాయించే ఎకార్డియన్ ఎరిక్ దే. అయితే యుద్ధంలో ఎరిక్ చనిపోయాడు. ఎరిక్ భార్యకు హేన్స్ 'ఎపుడు ఏ సహాయం కావలిసినా చేస్తానని' వాగ్దానం చేసాడు. ఇన్నేళ్ళ తరువాత చివరి ఆశగా తల్లి మేక్స్ ని రక్షణకోసం హేన్స్ దగ్గరికి పంపింది. ఒక యూదుడికి ఆశ్రయం ఇవ్వడం ప్రాణాలతో చెలగాటం అని తెలిసినా కూడా హేన్స్ , రోసా ఇద్దరూ మేక్స్ ని ఆదరించడానికే నిర్ణయించుకున్నారు. అతనిని ఎవరికీ కనిపించకుండా బేస్మెంట్లో దాచి ఉంచారు. ఎవరికీ మేక్స్ గురించి చెప్పొద్దనీ, చెపితే మొత్తం కుటుంబానికే ప్రమాదం అనీ, హేన్స్ లీసెల్ దగ్గర మాట తీసుకున్నాడు. మేక్స్ వచ్చినపుడు చాలా దీనమైన పరిస్థితిలో ఉన్నాడు. ఏళ్ళ నుంచీ సరైన తిండీ పోషణ లేక, ఒంట్లో శక్తి లేక, తన కుటుంబం ఏమయిందో తెలీక, తన పరిస్థితులకి ఏమీ చెయ్యలేని అశక్తతతో ఉండేవాడు. హిట్లర్తో యుద్ధం చేస్తున్నట్టు తనకి కలలు వస్తుండేవి. నెమ్మదిగా లీసెల్ మేక్స్ స్నేహితులయ్యారు. హేన్స్ , లీసెల్, మేక్స్ కలిసి రాత్రులు బేస్మెంట్లో పుస్తకాలు చదువుకునేవారు.

అప్పటికే ఏళ్ళ నుండీ బయటకి కనిపించకుండా బేస్మెంట్ లో దాక్కుని ఉన్న మేక్స్ కి బయట వెళ్ళాలనీ, ఎండనీ గాలినీ, వెన్నెల చల్లదనాన్ని తనివితీరా అనుభవించాలని ఉండేది. లీసెల్ ని బయట వాతావరణం ఎలా ఉందో తన మాటల్లో వర్ణించమని అడిగి చెప్పించుకునేవాడు. లీసెల్ పుట్టినరోజు బహుమతిగా మేక్స్ తన కథనే, బొమ్మల కథగా వ్రాసి పుస్తకంలాగా చేసి ఇచ్చాడు. శీతాకాలంలో బేస్మెంట్ లోని చలికి మేక్స్ జబ్బుపడి దాదాపు రెండు నెలలు కళ్ళు తెరవకుండా ఉంటే, అందరూ ఎంతో జాగ్రత్తగా సేవలు చేసారు. లీసెల్

రోజూ అతనికి పుస్తకం చదివి వినిపించేది. అతను విని లేస్తాడేమో అని ఆశగా చూసేది. చివరికి రెండు నెలలు దాటాక మేక్స్ కళ్ళు తెరిచి లోకంలో పడ్డాడు.

అప్పుడప్పుడూ శత్రువుల విమానాలు జర్మనీ మీద బాంబుదాడి చేసేవి. ఆ సమయంలో ప్రజలు సురక్షితంగా దాక్కోవటానికి అనువైన బేస్మెంట్స్ ఉన్న ఇళ్లను గుర్తించి సైనికులు ఎంపిక చేసేవారు. బాంబుదాడి జరగనుంది అని తెల్సినపుడు సైరన్ మ్రోత వినగానే అందరూ నిర్దేశించిన ఇంటికి పరిగెత్తి బేస్మెంట్ లో దాక్కునేవారు. పిల్లలూ పెద్దలూ కూడా భయంతో వణికిపోవడం, పిచ్చిగా మాట్లాడటం, ఏడవటం చేసేవారు. ఇంట్లో అందరినీ పంపించి, మేక్స్ మాత్రం ఎవరికీ కనిపించకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. మొదటిసారి అలా దాక్కునప్పుడు లీసెల్ తన భయాన్ని అణచుకోడానికి, మేక్స్ ఎలా ఉన్నాడో అన్న ఆరాటాన్ని అణచుకోడానికి, తను తెచ్చుకున్న పుస్తకాన్ని బయటకు చదవడం మొదలు పెట్టింది. నెమ్మదిగా ఒక్కొక్కరూ తమ భయాన్ని మరిచిపోయి ఆమె చదువుతున్న కథలో లీనమయి శ్రద్ధగా వినసాగారు. దాడి అయిపోయిందని మళ్ళీ సైరన్ మ్రోగే వరకు వాళ్లకు సమయం తెలీలేదు. అప్పటినుంచీ ప్రతీసారీ లీసెల్ చేత పుస్తకం చదివించుకుంటూ ఆందోళన చెందకుండా ఉండటం అందరికీ అలవాటయిపోయింది. అలా అందరికీ లీసెల్ వల్ల స్వాంతన కలుగుతోందని తెలుసుకున్న మేక్స్ ఆమె గురించి చాలా గర్వపడ్డాడు.

అప్పుడప్పుడూ సైనికులు యూదులని గుంపులుగా, మోల్కింగ్ దగ్గరలో ఉన్న కాన్సంట్రేషన్ కేంప్ కి వూరు మధ్యలో నడిపించి తీసుకెళ్ళేవారు. ఒకసారి ఒక ముదుసలి నడవలేక పడిపోవడం చూసిన హేన్స్ అతనికి ఒక రొట్టెముక్క పెట్టాడు. అది చూసిన సైనికులు యూదుడికి సాయం చెయ్యబోయినందుకు అతనిని 'యూదుల సానుభూతిపరుడు' అని క్రూరంగా కొట్టారు. అప్పటి నుంచీ వూరిలో వాళ్ళు కూడా అతనిని ద్రోహిగా చూడసాగారు. అతని మీద అనుమానంతో సైనికులు ఇంటి మీదకి సోదాకు వస్తారేమో అని అనుకున్నారు. తనక్కడ ఉండటం ఇక వారికి క్షేమం కాదని, మేక్స్ ఒకరాత్రి చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. వెళుతూ లీసెల్ కోసం, 'మాటలతో /పదాలతో' ప్రపంచాన్ని జయించిన అమ్మాయి కథని పుస్తకంగా వ్రాసి బహుమతిగా వదిలి వెళ్ళాడు.

రూడీ, లీసెల్ ఇద్దరికీ పదునాలుగేళ్ళు వచ్చాయి. రూడీ స్కూల్లో చదువులోనూ, క్రీడల్లోనూ కూడా ముందుండేవాడు. ఒకసారి పరుగుపందాల్లో మూడు గోల్డ్ మెడల్స్ సంపాదించాడు. ఆ సంగతి తెలిసి నాజీ సైనికులు అతని ఇంటికి వచ్చి, రూడీని సైన్యంలోకి ప్రత్యేక శిక్షణ కోసం పంపమని అడిగితే అతని తల్లిదండ్రులు నిరాకరించారు. ఆకోపంతో రూడీ తండ్రి అలెక్స్ ను సైన్యంలో చేరమని నోటీస్ పంపారు. అదే సమయంలో హేన్స్ ని కూడా సైన్యంలో చేరమని కబురొచ్చింది. ఇద్దరూ యుద్ధానికి వెళ్లిపోవడంతో రెండు కుటుంబాలూ విచారంలో మునిగిపోయాయి. తండ్రిని సైన్యంలోకి తీసుకు పోవడంతో, అతని షాపు మూతపడింది. దానితో కుటుంబానికి ఆధారం లేకుండా పోయింది. లీసెల్ కూడా తండ్రిని విపరీతంగా మిస్ అవసాగింది.

కొన్ని నెలలు గడిచాయి. రోజూ లీసెల్ , రోసా ఇద్దరూ హేన్స్, అలెక్స్ క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తూ రోజులు గడపసాగారు. చివరికి ఒక యుద్ధంలో గాయపడటం వలన హేన్స్ ని ఇంటికి తిరిగి పంపించారు. అలెక్స్ ఎక్కడున్నాడో కూడా తెలీదు. లీసెల్ కి అస్తమానూ మేక్స్ గుర్తుకు వస్తుండేవాడు. ఎక్కడున్నాడో ఎలా ఉన్నాడో, సైనికులకు దొరికిపోయాడేమో, అతనిని వాళ్ళేం చేసారో అని ఆలోచిస్తూ ఉండేది. తండ్రీ తానూ అతని గురించి మాట్లాడుకుంటూ  ఉండేవారు. ఊర్లోంచి యూదులను తీసుకెళ్ళినపుడల్లా రోడ్డు పక్క నుంచుని, వాళ్ళలో మేక్స్ కనిపిస్తాడేమో అని చూసేది. చివరికి ఒక రోజు కనిపించాడు. బ్రతికున్న శవాలలా ఉన్నవారిని తీసుకెళుతుండగా వారిలో కనిపించాడు. మేక్స్ అని అరుస్తూ పరుగెట్టి వెళ్ళి లీసెల్ అతని చెయ్యి పట్టుకుంది. తనని సైనికులు ఒక రెండు నెలల క్రితం పట్టుకున్నారనీ, ఏం చేస్తారో తెలీదనీ చెప్పాడు మేక్స్. తనని వదిలి ఆమెని వెళ్ళిపోమని చెప్పాడు. కానీ లీసెల్ వినకుండా అతనితో

మాట్లాడుతూ నడవసాగింది. అది చూసిన ఒక సైనికుడు ఇద్దరినీ రక్తం కారేలా కొట్టి, మేక్స్ ని ఈడ్చుకు పోయాడు. మేక్స్ వెంట పరిగెట్టబోయిన లీసెల్ ని రూడీ వెనక్కిలాగి తీసుకుపోయాడు.

తరువాత కొన్ని రోజులు లీసెల్ బయటకి రాలేదు. దిగులుగా పడుకునే ఉండేది. ఒకరోజు లీసెల్ మేయర్ ఇంటికి వెళ్ళి ఒక పుస్తకం చదవాలని తీసింది. అందులోని పదాలు చూడగానే ఆమెకు కోపం వచ్చింది. మాటల వల్లే అన్ని అనర్థాలూనూ అనుకుంది. ఆ మాటలే లేకపోతే హిట్లర్ లేడు, హిట్లర్ మాటలతోనే జనాలని ఆకర్షించి, ప్రజల్లో యూదుల పట్ల ద్వేషం పెంచి ఇందరి కష్టాలకి కారణం అయ్యాడని ఆమెకు అనిపించిది. ఆ కోపంతో ఆ పుస్తకాన్ని చించి పోగులు చేసింది. తరువాత అలా ఇల్సా పుస్తకాన్ని చింపినందుకు ఆమెకు బాధేసింది. ఇల్సాకు 'మీ పుస్తకాలు దొంగతనం చేసినా కూడా మీరు నన్ను ఎంతో స్నేహంగా చూసారు. అయినా కూడా ఈరోజు మీ పుస్తకాన్ని నేను పాడు చేసాను. మాటలంటే ఉన్న కోపంతో వొళ్ళు తెలీకుండా ఆ పని చేసాను. క్షమించండి. నాకు శిక్షగా నేనింకా ఇక్కడికి పుస్తకాలు చదవడానికి ఇక రాను.' అని ఒక ఉత్తరం వ్రాసి పెట్టి వెళ్ళిపోయింది. మూడోరోజున ఇల్సా లీసెల్ ఇంటికి వచ్చి, ఒక డైరీ లాంటి నల్లటి నోట్ పుస్తకాన్ని ఇచ్చి 'నువ్వు ఇక పుస్తకాలు చదవటానికి రాను అన్నావు. పోనీ నువ్వే ఒక పుస్తకం వ్రాస్తావేమో అని అనుకుంటున్నాను. నువ్వు బాగా వ్రాయగలవని నీ ఉత్తరం చూసి తెలిసింది.' అని చెప్పింది.

ఆరోజు రాత్రి అందరూ పోయాక ఆ పుస్తకంతో బేస్మెంట్ లోకి వెళ్ళి కూర్చుని, ఏం వ్రాయాలా అని అలోచించి, తన కథనే వ్రాయడానికి మొదలు పెట్టింది. 'పుస్తకాల దొంగ' అని పేరు పెట్టి, తనూ తమ్ముడూ తల్లితో కలిసి మ్యూనిక్ కి ప్రయాణం కావడం నుండి మొదలుపెట్టి, తను దొంగతనం చేసిన మొట్టమొదటి పుస్తకం గురించి వ్రాయటం మొదలుపెట్టింది. అలా పదిరోజులపాటు ప్రతీ రాత్రి కూర్చుని అప్పటి వరకూ జరిగిన తన కథంతా వ్రాసింది. అది పూర్తయిన తరువాత తిరిగి తను వాసినది తిరిగి చదువుకోడం మొదలుపెట్టింది. ఆ పదిరోజుల్లో చుట్టుపక్కల వూర్ల మీద బాబు దాడులు జరిగాయి. వాళ్ళుండే వీధి కొంచెంలో తప్పించుకుంది. ఆరోజు రెండో సారి దాడి జరిగింది. ఆ విషయం పసిగట్టేసరికి ప్రజలని ఎలర్ట్ చెయ్యడానికి కూడా సమయం లేదు. అందరూ నిద్రలో ఉండగా హిమ్మెల్ స్ట్రీట్ లో బాంబుల వర్షం కురిసింది. లీసెల్ ఒక్కతే బేస్మెంట్లో తను వ్రాసిన పుస్తకం చదువుకుంటూ, దాన్ని చేతుల్లో పట్టుకుని అక్కడే నిద్రపోయింది. తను తప్ప ఏ ఒక్కరూ మిగలలేదు.

కూలిన శిధిలాల్లోంచి శవాలను తీస్తున్న సైనికులకి, ఎక్కడ నుండో మూలుగు వినిపించి చూస్తే శిధిలాల్లో చిక్కుకున్న లీసెల్ కనిపించింది. బయటకు వచ్చిన లీసెల్ కు ఏం జరిగిందో అర్ధంకాలేదు. ఎటు చూసినా కూలిన శిధిలాలు తప్ప ఇంకేమీ కనిపించలేదు. తల్లిదండ్రుల కోసం అరుస్తూ పరుగెడుతున్న ఆమెను సైనికులు సముదాయించబోయారు, కానీ లాభం లేకపోయింది. లీసెల్ కు చుట్టూ సైనికులు బయటకు తీసి వరసగా పడుకోపెట్టిన శవాలు కనిపించాయి. ముందుగా రూడీ ని గుర్తు పట్టి, మీదపడి లేవమని అరుస్తూ ఏడ్చింది. చివరగా రూడీని ముద్దుపెట్టుకుంది. తల్లిదండ్రుల శవాల దగ్గర కూర్చుని వాళ్లతో పిచ్చిగా మాట్లాడింది. కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది. వాళ్ళ మీద పడి ఏడుస్తున్న లీసెల్ ను సైనికులు బలవంతంగా లేపి తీసుకెళ్ళి పోలీస్ స్టేషన్ లో అప్పచెప్పారు. ఆ విధ్వంసంలో ఒక అమ్మాయి రక్షించబడింది అని తెల్సి కొంతసేపటికి మేయర్, ఇల్సా, పోలీస్ స్టేషన్ కి వచ్చి ఆమెను తమతో ఇంటికి తీసుకెళ్ళారు.

యుద్ధం ముగిసిన తరువాత రూడీ తండ్రి కూడా తిరిగి వచ్చాడు. అతని కుటుంబం మొత్తం నాశనమయిపోయిన అతనితో కూర్చుని లీసెల్, అతను విచారంగా మాట్లాడినవన్నీ ఓదార్పుగా వినేది. తరువాత అతని టైలరింగ్ షాపులో రోజూ కొంచెం సేపు అతనికి సాయం చేస్తూ గడిపేది. కొన్ని నెలలకు మేక్స్ కూడా ఆమెని వెదుక్కుంటూ వచ్చాడు. మేక్స్ ని చూసిన ఆమె ఎంతో సంతోషించింది. తరువాత ఎన్నో ఏళ్ళ పాటు లీసెల్ సంతోషంగా జీవించింది. చనిపోయే సమయానికి ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు, మనవలూ కూడా ఉన్నారు. ఆమె ఆస్ట్రేలియా లోని సిడ్నీలో స్థిరపడి అక్కడ మరణించింది.

బాంబు దాడి తరువాత సైనికులు లీసెల్ ని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్తుండగా, తన చేతిలో ఉన్న పుస్తకం క్రింద పడింది. దానిని ఎవరూ పట్టించుకోలేదు. శిధిలాలు శుభ్రం చేస్తూ దాన్ని కూడా చెత్తలో పడేస్తే, అదుగో అప్పుడు మృత్యువు దాన్ని ఎవరూ చూడకుండా దాన్ని తీసుకుని దాచింది. అప్పటి నుండీ ఎన్నో ఏళ్ళపాటు తనతోనే ఉంచుకుని ఎక్కడికెళ్తే అక్కడికి తీసుకెళ్లేది. 'ఇదుగో, నిన్ననే లీసెల్ మరణించింది. ఆమెకు నేను ఇన్నేళ్ళూ భద్రంగా దాచిన ఆ పుస్తకాన్ని చూపిస్తే ఎంతో ఆశ్చర్యపోయింది.' అని మృత్యువు లీసెల్ కథ చెప్పడం పూర్తి చేసింది.

ప్రపంచ యుద్ధాలు, హిట్లర్ , నాజీలు, హాలోకాస్ట్... వీటిని కథాంశాలుగా చాలా పుస్తకాలే వచ్చాయి. అయితే వాటిలో నాకు తెల్సినంతవరకూ నాజీల దుర్మార్గాలు, యూదుల కష్టాలు, అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు (after math) ముఖ్య అంశాలు. అయితే ఇందులో యూదులతో పాటు, సాధారణ జర్మన్ పౌరుల జీవితాలు కూడా యుద్ధ నీడలో ఎంత నలిగి పోయాయో, కొందరి అధికార దాహానికి సమిధల్లా వీళ్ళెం పోగొట్టుకోవాల్సి వచ్చిందో హృద్యంగా చెప్పారు.

కథ విషయానికి వస్తే అది చాలా సామాన్యమైనదే. అయితే ఈ పుస్తకానికి విశిష్టతని తీసుకొచ్చిన మొదటి మూడు విషయాలు కథనం, కథనం, కథనం. మృత్యువు ప్రధాన పాత్రగా తన చేతే కథ చెప్పడానికి ఎంచుకున్న పద్ధతి కూడా చాలా బావుంది. అయితే

ఇది మొత్తం విషాదంతో నింపేది కాదు. అప్పటికపుడే నవ్విస్తుంది. కొన్నిచోట్ల గుండె మెలిపెడుతుంది. దిగులు పెడుతుంది. కొన్ని సార్లు భయపెడుతుంది. పాత్రల అందమైన మనసులని చూసి పరవశింపచేస్తుంది. సున్నితమయిన హాస్యం, అందమయిన సరళమయిన కవిత్వం లాంటి భాష, మానవత్వంతో నిండిన పాత్రల చిత్రణ మనల్ని విషాదంలో మునిగిపోకుండా కాపాడతాయి. రచయిత సెన్స్ ఆఫ్ హ్యూమర్ కి ఒక ఉదాహరణ ... హిట్లర్ వర్ణన.

*There was once a strange, small man. He decided three important details about his life:*

*1. He would part his hair from the opposite side to everyone else.*

*2. He would make himself a small, strange mustache.*

*3. He would one day rule the world.*

*...Yes, the Fuhrer decided that he would rule the world with words.*

ప్రతీ చాప్టర్ ముందూ, మధ్యమధ్యలోనూ కథలో జరగబోయే విషయాలు క్లుప్తంగా చెప్పేసినా కూడా, ఎక్కడా ఆసక్తి పోకుండా చదివిస్తుంది. ఉదాహరణకి రూడీ గురించి చెప్తున్న మొదటిసారే, 'లీసెల్ ని ముద్దు పెట్టమని అడిగినా, బ్రతికుండగా ఆమె చేత ముద్దు పెట్టించుకోలేకపోయాడు' అని చెప్పిస్తారు మృత్యువు చేత. అలాగే హేన్స్ గురించి చెపుతూ 'రెండు సార్లు నాకు ఎదురు పడి కూడా తప్పించుకున్నాడు, కానీ ఆ రోజు హిమ్మెల్ స్ట్రీట్ లో మాత్రం నాతో రాక తప్పలేదు' అని కథ మొదట్లోనే చెప్పేసినా, చివరి వరకూ ఎక్కడా తెలిసిన విషయమే కదా అనిపించదు. చాలా చోట్ల జర్మన్ పదాలు , వాక్యాలు వాడినా, వెంటనే వాటి అర్థం ఇంగ్లీష్ లో కూడా ఇవ్వడంతో పెద్దగా కష్టం అనిపించదు.

కథలో ఎన్నో పాత్రలు, నెమ్మది నెమ్మదిగా మనసులో స్థానం ఆక్రమించుకుంటాయి. చాలా కాలం గుర్తుండిపోయేవి. ఒక్కోపాత్రనీ మలచిన తీరు రచయిత నైపుణ్యానికి నిదర్శనం.

– జబ్బుపడిన మేక్స్ మెలకువలోకొచ్చిన సంగతి స్కూల్లో ఉన్న కూతురికి చెప్పాలని, ఏదో వంక పెట్టి తిట్టడానికి వెళ్ళి, రహస్యంగా ఆ విషయం చెప్పిన రోసా వెంటనే మనకీ రోసా కి హగ్ ఇచ్చి 'లవ్ యు' అని చెప్పాలనిపిస్తుంది) -- తమకే రెండు పూటల తిండికి అతి కష్టం గా ఉన్నా ఒక మాట కూడా అనకుండా మేక్స్ ని ఆదరించిన రోసా -- భర్త యుద్ధానికి వెళ్ళినపుడు అతని ఎకార్డియన్ ని కౌగలించుకుని కూర్చునే రోసా ...

– తను ఎంతో పొదుపుగా దాచుకుని అపురూపంగా తాగే సిగరెట్లు మార్పిడి చేసి, కూతురికి పుట్టినరోజు బహుమతిగా పుస్తకాలు కొనిచ్చిన హేన్స్ -- తనకి తినడానికి లేకపోయినా పేదలకి కప్పు టీ తీసుకుని, కిటికీలకు నల్ల రంగేసిన హేన్స్ (బాంబు దాడులప్పుడు టార్గెట్ గా వెలుతురు కనపడకుండా) -- ప్రాణాలకి ప్రమాదం అని తెల్సినా స్నేహితుడికి ఇచ్చిన మాట కోసం మేక్స్ కి ఆశ్రయం ఇచ్చిన రోసా, హేన్స్

– కొడుకు యుద్ధంలో గాయపడి మంచులో చిక్కుకుని చనిపోయాడని, చలిలో కూడా కిటికీ తెరచి పెట్టుకుని మంచు గాలులతో తనను తాను శిక్షించుకునే ఇల్సా

– కావాలని హిట్లర్ పుట్టిన తేదీ తప్పుగా చెప్పి, యూత్ కేంప్ లీడర్ చేత పనిష్మెంట్ అనుభవించే కొంటె రూడీ – స్నేహం కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధపడిన రూడీ

– లీసెల్ కి బహుమతి గా ఇవ్వడానికేమీ లేక, అచ్చు పుస్తకానికి తెల్లరంగేసి వాటి మీద కథ రాసి ఇచ్చిన మేక్స్ – తనకి ఆశ్రయం ఇచ్చిన వాళ్లకి కష్టం రాకూడదని తను ప్రమాదం లోకి వెళ్ళిన మేక్స్

-- మేక్స్ ని రహస్యంగా దాచిన స్నేహితుడు

ఇంతమంది విలక్షణమయిన వ్యక్తుల మధ్య లీసెల్ అసలైన కుటుంబపు విలువలూ, మానవత్వం, ప్రేమా, స్నేహం అనేవాటికి అర్థం తెల్సుకుంది. విశిష్టమయిన తండ్రి నీడలో జీవన సౌందర్యాన్ని అర్థం చేసుకుంది.

రచయితకి మాటల మీద మంచి పట్టుంది. మృత్యువు స్వగతంగా చెప్పుకునే మాటలు చదివ తీరాల్సినవి. కొన్ని వాక్యాలు ఆపి మళ్ళీ మళ్ళీ చదివిస్తాయి. గీతలో వాసుదేవుడు 'కర్త, కర్మ క్రియ అన్నీ నేనే. నువ్వు కేవలం నిమిత్తమాత్రుడివి.' అని చెప్పినట్టు 'నేను విధ్వంసాన్ని కాదు, అపకారినీ కాదు. నేను కేవలం ఫలితాన్ని మాత్రమే' అని మొరపెట్టుకుంటుంది మృత్యువు. తన పని చెయ్యడానికి కష్టమయినపుడు, ముఖ్యంగా చిన్నపిల్లలను తీసుకు వెళ్ళాల్సి వచ్చినపుడు తనకెంతో బాధ కలుగుతుందనీ, అపుడు తనకా పనెందుకు అప్పచెప్పావు అని దేవుడ్ని అడుగుతాననీ అంటుంది. హిమ్మెల్ స్ట్రీట్ మీద బాంబు దాడి గురించి చెపుతూ, హిమ్మెల్ ( స్వర్గం) అని పేరుపెట్టుకుని దాన్నే ఎవరన్నా నాశనం చేసుకుంటారా అని వాపోతుంది. మృత్యువుతో చెప్పించిన కొన్ని వాక్యాలు...

*"I do not carry a sickle or a scythe. I only wear a hooded black robe when it's cold. And I don't have those skull-like facial features you seem to enjoy pinning on me from a distance. You want to know what I truly look like? I'll help you out. Find yourself a mirror while I continue."*

*"Please believe me when I tell you that I picked up each soul that day as if it were newly born. I even kissed a few weary, poisoned cheeks. I listened to their last, gasping cries, their vanishing words. I watched their love visions and freed them from their fear."*

*"I guess humans like to watch a little destruction. Sand castles, houses of cards, that's where they begin. Their great skill is their capacity to escalate."*

“నువ్వు నాతో రావాల్సిన సమయం వచ్చినపుడు భయపడకు. నిన్ను పసిపాపలా నా చేతుల్లో ఎత్తుకుని, పువ్వును స్పృశించినంత మృదువుగా హృదయానికి హత్తుకుని నాతో తీసుకు వెళతాను.” (It suffices to say that at some point in time, I will be standing over you, as genially as possible. Your soul will be in my arms. A color will be perched on my shoulder. I will carry you gently away.) అని భరోసా ఇస్తుంటే, రవీంద్రుడు గీతాంజలిలో అన్నట్టు, ఆ సమయం వస్తే పూర్ణ జీవిత కలశంతో స్వాగతం చెప్పాలని అన్పించదూ!!!

‘కథ తెలిసిపోయినా కథనం కోసం పుస్తకాలు చదవాలి’ అనే నా నమ్మకాన్ని బలపరుచుకోడానికీ, నా వాదనని నిరూపించుకోడానికీ ఒకే ఒక్క ఆయుధాన్ని ఎంచుకోమంటే, నాకీ ఒక్క పుస్తకం చాలు. ముందు సినిమా చూసి తరువాత పుస్తకం చదివినా ఒక్క వాక్యాన్ని కూడా వదలకుండా, కొన్ని భాగాలను పదే పదే చదివించింది ఈ పుస్తకం. దానికి ఒకే ఒక్క కారణం కథనం.

రచయిత తన తల్లిదండ్రులు చెప్పిన అనుభవాలు పుస్తకంగా వ్రాయాలనుకుని, ఓ వంద పేజీల్లో వ్రాద్దామనుకుంటే ఐదొందల పేజీలు దాటిందట. కథని అమ్మాయి చెప్పినట్టు ప్రధమపురుష లోనో, రచయిత చెప్పినట్టు తృతీయ పురుష లోనో చెప్పకుండా, మృత్యువు చేత చెప్పించాలని ఎందుకనిపించిందీ అని అడిగిన దానికి రచయిత సమాధానం ‘What if death is afriad of humans? What if death is haunted by humans?’ అన్న ఆలోచన దానికి కారణం అన్నారు. హేన్స్ పాత్రకు ప్రేరణ అతని ఇద్దరు తాతల కలయిక. ఇందులో జరిగిన సంఘటనలన్నీ మార్కస్ అమ్మా , నాన్నల అనుభవాలూ, అతని నాన్నమ్మకు జరిగిన అనుభవాలూ అని చెప్పారు.

లీసెల్ ఎవరిని పెళ్లి చేసుకుంది అనేది పుస్తకం చదివిన చాలామందికి వచ్చిన అనుమానం. చివర్లో మేక్స్ వచ్చి కలవడంతో, ఇద్దరూ పెళ్లి చేసుకున్నారేమో అని కొంతమంది అనుకున్నారు. అయితే ‘లేదు, వాళ్ళిద్దరూ మంచి ఫ్రెండ్స్ గా మాత్రమే’ అని రచయిత ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అందుకేనేమో సినిమాలో మేక్స్ లీసెల్ జీవితాంతం మంచి స్నేహితులుగా ఉన్నారు అని విపులంగా చెప్పించారు.

ఈ పుస్తకం 2005 లో విడుదలయ్యి, దాదాపు 40 భాషల్లో అనువదించబడింది. అంతర్జాతీయంగా ఎన్నో అవార్డులు గెలుచుకోడమే కాకుండా, దాదాపు ఎనిమిదేళ్ళకు పైగా న్యూయార్క్ బెస్ట్ సెల్లర్స్ లిస్ట్ లో చోటు చేసుకుంది. యూకే, స్పెయిన్, ఇజ్రాయిల్, బ్రెజిల్ మొదలైన దేశాల్లో బెస్ట్ బుక్స్ లిస్టులో మొదటి ఐదు స్థానాల్లో చోటు చేసుకుంది. యంగ్ అడల్ట్ విభాగంలో పేర్కొన్నా పెద్దల్ని కూడా సమ్మోహితుల్ని చేసే పుస్తకం.




ఈపుస్తకం అదే పేరుతో నవంబర్ 2013 లో సినిమాగా విడుదలయ్యింది. పుస్తకానికి దీటుగా చిత్రీకరించిన అతి కొన్ని సినిమాల్లో ఇది ఒకటి. నటులందరూ కూడా, వీరు తప్ప వేరే ఇంకెవరూ నప్పరు అనేంత చక్కగా, సహజంగా ఉన్నారు.

రచయిత పరిచయం: Markaus Zusak ఆస్ట్రేలియా నివాసి. తల్లి జర్మన్, తండ్రి ఆస్ట్రియన్. పుస్తకాలు చదవటం, సినిమాలు చూడటం ఆయనకు బాగా ఇష్టమైన పనులు. The Book Thief, I am the Messenger ఆయన వ్రాసిన

వాటిలో బాగా పేరు పొందిన పుస్తకాలు.ఇవి కాకుండా ఇంకో మూడు పుస్తకాలను కూడా వ్రాసారు. ఆయన యంగ్-అడల్ట్ సాహిత్యం విభాగంలో అనేక అవార్డ్స్ పొందారు.



రచయితతో పుస్తకం గురించి ఒక ఇంటర్వ్యూ:

http://motherdaughterbookclub.com/**2010/02/**interview-with-markus-zusak-author-of-the-book-thief-and-i-am-the-messenger/

(Picture source: Internet)



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



# దగాకోరు జ్ఞాపకాల గారడీ

# The Sense of an Ending

*"What you end up remembering isn't always the same as what you have witnessed."*




జ్ఞాపకాలు ... మన గడచిన జీవితానికి నిదర్శనంగా మనకు మిగిలిన గుర్తులు. మనం కొనసాగించే బంధాలకు, తెంచుకునే వ్యధలకు ఆధారం. అయితే అవి ఎంతవరకూ నమ్మదగినవి? ఒక్కోసారి మనకు హఠాత్తుగా కొందరు గుర్తొస్తారు. వాళ్ళు మనకు పరిచయమన్నదే తప్పా, వాళ్ళని ఎప్పుడు ఎక్కడా ఎలా కలిసాము, వాళ్ళతో గడిపిన సంఘటనలూ లాంటి వివరాలేమీ పెద్దగా గుర్తుండవు. కొన్నిసార్లు కొందరి మీద ఏర్పడిన విముఖత ఎన్నేళ్ళయినా అలానే ఉంటుంది. కొన్నాళ్ళకి మనకు వాళ్ళంటే అయిష్టం అన్నసంగతి తప్ప, అందుకు దారితీసిన సంఘటనలు కానీ, అసలేం జరిగిందో కూడా గుర్తుకు రాదు. అప్పుడేం జరిగిందా అని మనమే ఆశ్చర్యపోతూ ఉంటాం. ఇది చాలా సాధారణమయిన విషయం. ఇదంతా ఆ సంఘటనలు, జ్ఞాపకాలూ మనమీద కలిగించిన ఫలితం తప్ప, అసలు జ్ఞాపకాలు కావు.

కాలంతో కలిసి జ్ఞాపకాలు చేసే వింతలెన్నో. నడుస్తున్న కాలం మనకు జ్ఞాపకాలని మూటగడుతుంటే, గడిచిన కాలం కొన్ని జ్ఞాపకాలను వెలిసిపోయేలా చేసి,

కొన్నిటిని మరింత చిక్కన చేస్తుంది. కొన్నిటిని మొత్తానికే మన మెదడు నుంచి మాయం చేస్తుంది. అలాగే గతజ్ఞాపకాలు/అనుభవాలు మనం ముందు ముందు సంఘటనలకు, బంధాలకు స్పందించే తీరుమీద చాలా ప్రభావం కలిగిస్తాయి.

ఎప్పుడయినా మన జీవితం గురించో, లేదా ఒక సంఘటన గురించో ఎవరికైనా చెప్పాలంటే మనకి జ్ఞాపకాలే ఆధారం. అయితే మనం ఎదుటివారికి జరిగింది జరిగినట్టూ చెపుతామా లేక మనకి అనుకూలమయినట్టు మార్చి చెప్పుకుంటామా అనేది మనం చెప్పే విషయంపై ఆధారపడి ఉంటుంది. అంటే మన హిస్టరీ, గడిచిన కథ, మనకి ఇష్టం వచ్చినట్టూ మార్చుకోవచ్చన్నమాట. దాన్ని ఖండించేవాళ్ళో, కాదని రుజువు చేసే సాక్ష్యాలో లేనంతవరకూ మనం చెప్పుకున్నదే నిజంగా చలామణీ అయిపోతుంది. మనకి ఇష్టమయిన జ్ఞాపకాలని అపురూపంగా గుర్తుచేసుకున్నట్లే, కొన్నిటిని ప్రయత్నించి మర్చిపోతాం. అంటే జ్ఞాపకాలు, హిస్టరీ పెర్ఫెక్ట్ కాదన్నమాట. మనకి అనుకూలంగా మనం మలచుకోగలవి అయినప్పుడు వాటిమీద ఆధారపడి బంధాలను ఏర్పరుచుకోవడంగానీ, జడ్జిమెంట్ చేసుకోవడం గానీ ఎంతవరకూ సబబు?

మన జ్ఞాపకాలు మనం అనుకున్నట్టూ వందశాతం నమ్మదగ్గవీ కాదనీ, అవి మనల్ని దగాచేసే అవకాశాలు ఎక్కువేననీ, నిజానికి మనకి గుర్తున్నవి అచ్చం జరిగినవి జరిగినట్టు కాదు, మనం ఏం గుర్తుపెట్టుకుంటామో, గుర్తు పెట్టుకోవాలని అనుకుంటామో అవి మాత్రమేననీ చెపుతూ, వాటి మీద ఆధారపడి మనం చెప్పుకునే కథనాలు ఎంతవరకూ నమ్మదగినవీ అనే ప్రశ్నలను రేకెత్తించే పుస్తకం Julian Barnes వ్రాసిన The Sense of an Ending.

పుస్తకం మనకు టోనీ తన కథ చెపుతూ, గడచిన విషయాలను గుర్తు చేసుకుంటూ, తన జీవితంలో గడిచిన విషయాలకూ, తనకు గుర్తున్నవాటికీ పొంతన లేకపోవడం గురించి ఆశ్చర్యపోతూసాగుతుంది. కథ మొదలయ్యే సమయానికి టోనీ (Tone Webster) అరవయ్యేళ్ళు దాటిన వ్యక్తి. రిటైర్ అయిపోయి, వృద్ధుల హోమ్ లో వాలంటీర్ గా చేస్తూ, జీవితం సాఫీగా గడిపేస్తూ ఉంటాడు. దాదాపు పన్నెండేళ్ళు కలిసి బ్రతికాక, భార్య మార్గరెట్ తానూ స్నేహపూర్వకంగా విడిపోయారు. వాళ్ళకి ఒక కూతురు. ఆమె కూడా దగ్గరలోనే తన కుటుంబంతో కలిసి ఉంటుంది. టోనీ తన వాలంటీర్ పనులతోనూ, అపుడపుడూ మనవడితోనూ కాలం గడుపుతూ ఉంటాడు. భార్యతో విడిపోయినా ఇద్దరూ అప్పుడప్పుడూ కలిసి స్నేహితుల్లా ఒకరి విషయాలు ఒకరు చర్చించుకుంటూ ఉంటారు. మొత్తానికీ ఏ చీకూ చింతా లేకుండా టోనీ రికామీ జీవితం సాఫీగా సాగిపోతోంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "I had wanted life not to bother me too much, and had succeeded."

ఇలా ఉండగా ఒకరోజు టోనీకి ఒక లాయర్ నుండి ఒక ఉత్తరం, దానితో పాటు ఒక కవరూ వచ్చాయి. 'శారా ఫోర్డ్ అనే ఆవిడ చనిపోతూ ఒక విల్లు వ్రాసిందనీ, అందులో 500 పౌండ్స్ ధనం, ఒక ఉత్తరం, ఏడ్రియన్ అనే అబ్బాయికి చెందిన ఒక డైరీ, టోనీకి చెందాలని వ్రాసిందనీ' ఆ ఉత్తరం సారాంశం. ఈ శారా ఎవరా, ఆవిడ విల్లు తన పేరు మీద వ్రాయటమేమిటా అని టోనీ ఆశ్చర్యపోయాడు. ఆలోచించగా ఎప్పటికో శారా ఫోర్డ్ అంటే తన ఒకప్పటి గర్ల్ ఫ్రెండ్ వెరోనికా తల్లి అని టోనీకి గుర్తొచ్చింది. దానితో అతనికి తను చదువుకునే రోజుల నాటివి, దాదాపు నలభయ్యేళ్ల క్రిందటి సంగతులు కొద్ది కొద్దిగా గుర్తుకురాసాగాయి.

అది 1960 దశాబ్దపు కాలం. కథాస్థలం ఇంగ్లాండ్. టోనీ, కాలిన్, అలెక్స్ అనే ముగ్గురు స్నేహితులు హైస్కూల్లో చదువుతుంటారు. కొత్తగా ఏడ్రియన్ (Adrian Finn) అనే అబ్బాయి వచ్చి అదే క్లాసులో చేరాడు. తొందరలోనే ఈ ముగ్గురితో స్నేహం చేసుకుని వాళ్ళందరికీ ఇష్టుడై పోయాడు. ఏడ్రియన్ తల్లిదండ్రులు విడిపోతే అతను తండ్రితో ఉంటాడు. వారు ఎందుకు విడిపోయారో కూడా కారణాలు అతనికి తెలియవు. అయినా అవేవీ పట్టించుకున్నట్టు గానీ, ఏదైనా లోటుగా ఫీలవుతున్నట్టుగానీ ఉండేవాడు కాదు. అన్నీ తేలిగ్గా తీసుకునేవాడు. అతనికి ఆ వయసు పిల్లలకి మించిన తెలివితేటలు ఉన్నాయి. క్లాసులో కూడా చాలా చురుకుగా ఉండేవాడు. అడిగిన ప్రశ్నలకి ఏ విషయమయినా సరే అతను తార్కికంగా ఆలోచించి విశ్లేషించే తీరుకి టీచర్స్ కూడా మెచ్చుకునేవారు.

హైస్కూలు చదువు ముగిసిన తరువాత పైచదువులకు వేరే వేరే ఊళ్ళలో కాలేజీకి వెళ్ళిపోయారు. అందరూ ఊహించినట్టే స్కాలర్షిప్ సంపాదించుకుని ఏడ్రియన్ కేంబ్రిడ్జ్ కాలేజీకి వెళ్ళాడు. నలుగురూ ఉత్తరాలు రాసుకుంటూ, సెలవులకి ఇళ్లకు వచ్చినపుడు కలుసుకునేవారు. టోనీకి కాలేజీలో వెరోనికా (Veronica Ford) అనే అమ్మాయితో పరిచయమయింది. ఇద్దరూ డేటింగ్ చెయ్యడం మొదలుపెట్టారు. ఒకసారి వీకెండ్ సెలవులకి వెరోనికా టోనీని తన ఊరు తీసుకెళ్ళింది. అక్కడ వెరోనికా తండ్రీ, అన్నా తనని కొంచెం చిన్నచూపు చూసారేమో అని అతనికి అనిపించింది. అయితే ఆమె తల్లి శారా మాత్రం అతనితో బాగానే మాట్లాడి చనువుగా ఉన్నట్టు అనిపించింది. 'వెరోనికా ఆటలన్నీ సాగేలా నువ్వు మెత్తగా ఉండొద్దు సుమా' అని టోనీకి సలహా కూడా ఇచ్చింది. టోనీకి అది ఆశ్చర్యం అనిపించింది కానీ దాన్ని అక్కడితో మర్చిపోయాడు.

ఒకసారి తన స్నేహితులని కలిసినపుడు టోనీ వాళ్ళకు వెరోనికాని పరిచయం చేసాడు. వెరోనికా అన్న కూడా కేంబ్రిడ్జ్ లోనే చదువుతున్నాడనీ ఆమె ఏడ్రియన్ తో చెప్పింది. దాదాపు ఒక ఏడాది పాటు వెరోనికా టోనీల డేటింగ్ సాగింది. అయితే టోనీకి బాధ్యతలూ, కమిట్మెంట్స్ అంటే ఇష్టం ఉండేది కాదు. బంధాల్లో ఇరుక్కోవాలంటే అతనికి తెలియని భయం. దానితో వాళ్ళ స్నేహాన్ని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాలేమీ చెయ్యలేదు అతను. వెరోనికా అంటే అతనికి ఇష్టం ఉన్నా ఆమెతో ఎపుడూ చెప్పలేదు. దానికి తోడు వెరోనికా కి ఇతరుల ఫీలింగ్స్, ఎమోషన్స్ అర్థంచేసుకునే స్వభావం లేదు అనుకునేవాడు. మన బంధానికి భవిష్యత్తు ఏంటో ఏమైనా ఆలోచించావా అని ఆమె అడిగినపుడు తనకి తెలీదు అని తప్పించుకునేవాడు. వెరోనికా అతనిని పిరికివాడు అని అనేది. కొంతకాలానికి ఇద్దరూ విడిపోయారు.

కొన్ని నెలలకు ఏడ్రియన్ నుండి టోనీకి ఒక ఉత్తరం వచ్చింది. అందులో 'తనూ వెరోనికా ఇపుడు కలిసి డేటింగ్ చేస్తున్నామనీ, టోనీకి తరువాత ఎవరిద్వారానో తెలిసి మనసు కష్టపెట్టుకుంటాడేమో అని తనే తెలియచేస్తున్నాననీ, ఈవిషయం అతనికి బాధ కలిగించదనే తను అనుకుంటున్నాననీ' వ్రాసాడు. టోనీకి ఆ విషయం కొంచెం అసూయ కలిగించినా, అది కప్పిపుచ్చుకుంటూ 'మీ ఇద్దరికీ బెస్ట్ ఆఫ్ లక్' అంటూ బడాయిగా ఉత్తరం వ్రాసాడు.

కాలేజీ చదువు పూర్తయిన తరువాత టోనీ కొన్ని నెలలు అమెరికా వెళ్ళి ఏవేవో చిన్న ఉద్యోగాలు చేసి తిరిగి స్వదేశానికి (ఇంగ్లాండ్) తిరిగి వచ్చాడు. ఇంటికి తిరిగి వచ్చేసరికి ఏడ్రియన్ ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని అలెక్స్ వ్రాసిన ఉత్తరం అతని కోసం ఎదురుచూస్తోంది. అలెక్స్ ని కలిసిన టోనీకి, తనకీ వివరాలేమీ తెలీదనీ, 'జీవితం అనేది మనం అడగకుండానే మనకి ఇచ్చిన బహుమతి. కాబట్టి మనకి అక్కరలేని బహుమతిని తిరిగి ఇచ్చేసినట్టే, అక్కరలేని జీవితాన్ని ముగించుకోవడం అనేది తప్పు కాదనీ, తన ఆత్మహత్య సరి

అయిన పని' అంటూ తాత్వికమైన వివరణతో ఒక ఉత్తరం వ్రాసిపెట్టి పోయాడని చెప్పాడు. ముగ్గురూ తమ స్నేహితుడి అకాలమరణానికి బాధపడ్డారు. టోనీకి ఏడ్రియన్ మరణానికి బహుశా వెరోనికా ప్రవర్తనే కారణం అయ్యుంటుంది అని అభిప్రాయం కలిగింది. ఆమెని కలిసి ఏడ్రియన్ మరణానికి సానుభూతి తెలుపుదాం అనుకున్నవాడు కూడా ఆ ఆలోచనతో ఆగిపోయాడు. ఓ ఏడాది తరువాత ఏడ్రియన్ చనిపోయిన రోజున మళ్ళీ ముగ్గురు స్నేహితులూ కలిసి అతన్ని తలుచుకున్నారు. అలా కొన్నేళ్ళు ముగ్గురూ కలవడం, ఉత్తరాలు వ్రాసుకోవడం చేసారు కానీ, కొంతకాలం తరువాత నెమ్మదిగా ఎవరి జీవితంలో వాళ్ళు బిజీ అవడంతో అన్నీ ఆగిపోయాయి. టోనీ మార్గరెట్ ని పెళ్లి చేసుకోవడం, కూతురు పుట్టడం, వారి విడాకులు అన్నీ వరసగా జరిగాయి. మార్గరెట్తో విడిపోయిన తరువాత టోనీకి కొంతమంది గర్ల్ ఫ్రెండ్స్ కలిసినా కూడా, ఏ బంధమూ ఎక్కువ కాలం సాగలేదు. అయినా అతని జీవితం చీకూ చింతా లేకుండా, అతను కోరుకున్నట్టుగానే సాఫీగా సాగిపోయింది. అతనూ మార్గరేట్ స్నేహితుల్లా కలిసి ఉన్నారు. తన గర్ల్ ఫ్రెండ్స్ విషయాలతో సహా, అన్ని విషయాలూ ఆమెతో చర్చించేవాడు. వెరోనికా విషయం కూడా ఆమెకు తెలుసు. అప్పుడప్పుడూ వారి మాటల్లో ఆమె గురించి వచ్చినపుడు నవ్వుకునేవారు. అతను రిటైర్ అయ్యాక వాలంటీరింగ్ తోనూ, కూతురి ఫేమిలీ తోనూ సంతృప్తిగా గడుపుతుండగా, శారా ఫోర్డ్ వ్రాసిన ఉత్తరం వచ్చి, అతనికి పాత జ్ఞాపకాలని గుర్తు చేసింది.

లాయర్ పంపిన కవర్లో శారా టోనీకి వ్రాసిన ఉత్తరం మాత్రమే ఉంది. అందులో ఆమె 'నేను నీకు ఈ డబ్బు ఎందుకిస్తున్నానో ఆశ్చర్యంగా ఉండొచ్చు. అది నాకు కూడా సరిగా తెలీదు. బహుశా అపుడెపుడో నీతో నా భర్తా, కొడుకూ సరిగా ప్రవర్తించనందుకు, నా కూతురు నీ మనసు కష్టపెట్టినందుకూ నావంతు పరిహారం అనుకోవచ్చేమో. ఏడ్రియన్ నీగురించి చాలాసార్లు ఆప్యాయంగా తలుచుకునేవాడు. అందుకే అతని డైరీ నీకు చెందటం న్యాయం అని నాకనిపించింది. అతని స్నేహితుడి నుండి విన్నదాన్నిబట్టి, ఏడ్రియన్ చనిపోయే ముందటి మూడు నెలలూ అతను చాలా సంతోషంగా ఉన్నాడని తెలిసింది.' అని వ్రాసింది. ఆ ఉత్తరం అప్పటికే ఎవరో విప్పి చదివి తిరిగి అతికించినట్టు తెలుస్తోంది. ఉత్తరంతో పాటూ ఆ కవర్లో ఉండాల్సిన డైరీ లేదు. ప్రస్తుతానికి ఆ డైరీ శారా కూతురు వెరోనికా ఆధీనంలో ఉందనీ, ఆమె దాన్ని ఇవ్వడానికి ఒప్పుకోవడంలేదు కాబట్టి , నెమ్మదిగా అడిగి పంపుతాననీ లాయర్ చెప్పింది. ఏడ్రియన్ డైరీ శారా దగ్గరికి ఎలా వచ్చిందో ఎంత ఆలోచించినా టోనీకి అర్థం కాలేదు.

వెరోనికా నుంచి ఆ డైరీ సంపాదించడానికి ఆ లాయర్ ద్వారానూ, స్వయంగానూ చాలా ప్రయత్నాలు చేసాడు టోనీ. ముందు అతను పంపిన ఈమెయిల్స్ కూడా జవాబివ్వడానికి ఇష్టపడని వెరోనికా, చివరికి ఒకసారి అతనిని కలవడానికి ఒప్పుకుంది. అయితే అతనిని కలిసిన వెరోనికా అతనితో ముక్తసరిగానూ, కోపంగానూ ప్రవర్తించింది. వాళ్ళు విడిపోయిన తరువాత తన జీవితం గురించి టోనీ క్లుప్తంగా చెప్పినా, వెరోనికా మాత్రం తన పర్సనల్ విషయాలేమీ చెప్పలేదు. డైరీ ఇస్తుందేమో అని ఆశపడిన టోనీకి, ఒక ఉత్తరం ఇచ్చి వెళిపోతుంది. డైరీ కాల్చేసానని చెప్పింది. వెళుతూ వెళుతూ 'నువ్వెప్పుడూ ఏదీ అర్థం చేసుకోవు. ఇప్పుడు కూడా అంతే. నీకెప్పటికీ ఏదీ అర్థం కాదు' అని కోపంగా అంటుంది. ఆ ఉత్తరాన్ని చూసిన టోనీ అది తను నలభయ్యేళ్ల క్రిందట ఏడ్రియన్ కి వ్రాసిన ఉత్తరంగా గుర్తుపట్టాడు. అయితే తనకి గుర్తున్నట్టుగా కేవలం ముభావంగా వ్రాయలేదనీ, అసూయతో వ్యంగ్యంగా కఠినంగానూ వ్రాసానని అతనికి గుర్తుకు వచ్చింది.

టోనీ వ్రాసిన ఉత్తరం సారాంశం. "ప్రియమైన ఏడ్రియన్ & వెరోనికా, మీ ఇద్దరికీ నా శుభాకాంక్షలు. మీ ఇద్దరూ ఒకరికొకరు తగిన జోడీ. ఒకరికేమో అతి తెలివితేటలు, ఒకరికేమో అన్నిటిలోనూ తనే గొప్ప అనే అతిశయం. మీ ఇద్దరూ ఎన్నిరోజులో కలిసి

ఉండరని నాకు బాగా తెలుసు, అయితే ఎవరి డొల్లతనాన్ని ఎవరు ముందు కనిపెడతారన్నదే ప్రశ్న. వెరోనికా తక్కువదేమీ కాదు. నిన్ను అందరి నుండీ దూరం చేసి, చివరికి తనూ వదిలేసి పోతుంది. ఆమెకి తన ఫీలింగ్స్ తప్ప, వేరేవారి గురించి పట్టదు. కావాలంటే ఆమె తల్లిని కనుక్కో, ఆమె నన్ను ఒకసారి హెచ్చరించింది కూడాను." ఇలా అవాకులూ చవాకులూ వ్రాసింది తనేనా అని ఆశ్చర్యపోయాడు టోనీ. అదంతా తనకెందుకు గుర్తులేదా అని అనుకున్నాడు. దాన్ని వెరోనికా చూసి బాధపడాలనే ఉద్దేశ్యంతోనే తను ఇద్దరినీ సంబోధిస్తూ వ్రాసానని గుర్తొచ్చి తన మూర్ఖత్వానికి, అల్పత్వానికీ సిగ్గుపడ్డాడు.

అప్పటి తన ప్రవర్తన వాళ్ళిద్దరినీ ఎంత బాధపెట్టి ఉంటుందో అంచనా వేసిన టోనీకి వెరోనికా పట్ల అయిష్టం కొంచెం తగ్గింది. తను పెళ్ళి చేసుకుందో లేదో, ఒంటరిగానే ఉందో అని సానుభూతిగా అనుకున్నాడు. మళ్ళీ డైరీ కోసం అడగాలని వెరోనికాని కలవాలని పదే పదే ఈమెయిల్స్ పంపగా ఆమె మళ్ళీ కలవడానికి ఒప్పుకుంది. ఈసారి టోనీని తన కారులో ఒకచోటకి తీసుకెళ్ళి రోడ్డు పక్కన ఆపి, అటుగా వస్తున్న మానసిక స్థిమితం లేని కొందరిని చూపించింది. వారందరూ దగ్గరలో ఉన్న ఒక మానసిక వికలాంగుల సంక్షేమ కేంద్రంలో ఉంటున్నవారని బేడ్జ్ చూసి తెలుసుకున్నాడు. అందులో ఒక నలభయ్యేళ్ల వయసున్న వ్యక్తి దగ్గరికి వెళ్ళి వెరోనికా ఆప్యాయంగా మాట్లాడటం చూసిన టోనీ, అతను ఎవరు అని అడిగినదానికి ఆమె జవాబు చెప్పకుండా, 'నీకెప్పటికీ అర్థం కాదు, అర్థం చేసుకోడానికి కూడా ప్రయత్నించకు' అని కోపంగా వెళ్ళిపోయింది.

ఆ వ్యక్తులు వారి సహాయకులతో కలిసి అక్కడికి దగ్గరలో ఉన్న రెస్టారెంట్ కి అప్పుడప్పుడూ వస్తుంటారని వాళ్ళ మాటల ద్వారా తెలుసుకుని, వెరోనికా మాట్లాడిన వ్యక్తి రహస్యం తెలుసుకోవాలని, టోనీ రోజూ అక్కడికి వెళ్లడం మొదలుపెట్టాడు. అలా రోజూ వెళ్తుండగా ఒకరోజు వాళ్ళు మళ్ళీ అక్కడికి వచ్చారు. వాళ్ళు ఆ వ్యక్తిని ఏడ్రియన్ అని పిలవడం విన్నాడు. పరీక్షగా చూస్తే ఆ అబ్బాయిలో తన స్నేహితుడయిన ఏడ్రియన్ పోలికలు చాలా స్పష్టంగా కనిపించాయి. ఆ అబ్బాయి వెరోనికాకి ఏడ్రియన్ కి పుట్టినవాడని అంచనాకి వచ్చాడు టోనీ. బహుశా ఏడ్రియన్ మరణం కలిగించిన విషాదం వెరోనికా కడుపులోని బిడ్డ మీద ప్రభావం చూపించి ఉంటుందని అనుకున్నాడు. ఏదో వంక పెట్టుకుని వాళ్ళతో మాటలు కలపబోయిన టోనీని చూసి, ఆ అబ్బాయి ముడుచుకుపోయి, భయపడి దాక్కున్నట్టుగా చేసాడు. రెండు సార్లు అలా జరిగేటప్పటికి అది గమనించిన వాళ్ళ సహాయకుడు టోనీ దగ్గరికి వచ్చి 'మిమ్మల్ని చూసి ఎందుకో ఏడ్రియన్ కొంచెం అసహనంగా ఉంటున్నాడు. ఆరునెలల క్రితమే అతని తల్లి చనిపోవడంతో అతను మానసికంగా చెదిరిపోయి ఉన్నాడు. ఇది అతని పరిస్థితిని ఇంకా దిగజారుస్తుంది. కాబట్టి దయచేసి ఇకముందు మీరు వాళ్లతో మాట్లాడటానికి ప్రయత్నించవద్దు' అని చెప్పాడు. టోనీకి అతను చెప్పేది అర్థంకాక 'అదేమిటి, అతని తల్లి వెరోనికా కదా, ఆమె నాకు తెలుసు.' అన్నాడు. దానికి ఆయన 'మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలీదు. ఏడ్రియన్ వెరోనికా తమ్ముడు' అని చెప్పాడు. దానితో టోనీకి షాక్ తగిలినట్టయింది. ఇక ఎప్పుడూ కనిపించి వాళ్లకి ఇబ్బంది కలిగించను అని అతనికి మాటిచ్చి వచ్చేసాడు.

ఇన్నాళ్ళూ దొరికిన విషయాలన్నీ కూర్చుకుని చూస్తే ఏం జరిగి ఉంటుందో టోనీకి లీలగా అర్థమయ్యింది. ఏడ్రియన్ కూడా వెరోనికా తల్లిని కలిసి ఉంటాడు. బహుశా ఆమెతో శారీరక సంబంధం ఏర్పడి ఉంటుంది. ఆమె గర్భవతి అని తెలియటంతోనే ఏడ్రియన్ ఆత్మహత్య చేసుకుని ఉండాలి. ఆమెకు నడివయసు దాటాక పుట్టిన బిడ్డ కావటంతో అతనికి మానసిక వైకల్యం కలిగి ఉంటుంది. బాయ్ ఫ్రెండ్ చనిపోవడమే కాకుండా, అతనికీ తల్లికీ ఉన్న సంబంధం తెలిసిన వెరోనికా మనసు విరిగిపోయి ఉంటుంది. అయితే ఆ కోపాన్ని అమాయకుడు,

చిన్నవాడయిన తమ్ముడి మీద చూపించలేక, తల్లి పోయిన తరువాత అతని బాధ్యత తీసుకుని అతనిని చూస్తుందని అనుకున్నాడు. అయితే ఏడ్రియన్ వెరోనికా తల్లిని కలవడానికి, తను అక్కసుతో వ్రాసిన ఉత్తరంలో ఆమెని కలవమని చెప్పడం కూడా ఒక కారణం అయ్యుండొచ్చు అన్న ఊహ టోనీకి విచారం, పశ్చాత్తాపం కలుగచేసాయి. తల్లి చనిపోయిన తరువాత వెరోనికాకి ఏడ్రియన్ డైరీ , అందులో టోనీ వ్రాసిన ఉత్తరం దొరికి ఉంటాయి. అది చదివిన తరువాత అన్నిటికీ మూలం టోనీ ఉత్తరం అని అర్ధం చేసుకుని, అతని మీద ద్వేషాన్ని పెంచుకుని ఉండాలి. ఏడ్రియన్ శారాల గురించి తన ఊహకి బలం కూరుస్తూ, టోనీకి తను వెరోనికా ఇంటికి వెళ్ళినపుడు శారా వింత ప్రవర్తన, తను వెళ్ళేటప్పుడు రహస్యంగా ఆమె చెయ్యి వూపి వీడ్కోలు చెప్పడంలాంటి సంగతులు కూడా గుర్తుకు వచ్చాయి.

ఇవన్నీ ఆలోచించిన టోనీకి తన పట్ల వెరోనికా కోపమూ, ప్రవర్తనా సమంజసమే అనిపించింది. తన తొందరపాటు ప్రవర్తన వల్ల ఎన్ని జీవితాలు దెబ్బతిన్నాయో అర్ధమయిన అతను తాను సరిదిద్దుకోలేని తప్పుచేశానని బాధపడ్డాడు. జరిగిపోయిన విషయాలను గానీ, చెదిరిన జీవితాలను గానీ తాను ఏంచేసినా సరిచెయ్యలేననీ, ఆ అశాంతి, అపరాధభావం తనని జీవితాంతం వెంటాడుతాయనీ అంటాడు టోనీ. 'అప్పుడప్పుడూ జీవితంలో ఒక్కసారి ఆగి, మనం ఏం తప్పు చేస్తున్నామా అని తరచి చూసుకుంటే ఫలితాలు వేరేగా ఉంటాయి కదా' అనుకున్నాడు. 'మనం చేసే ప్రతీ పనీ, ప్రతీ మాటా కలిగించే ప్రతిచర్య ఒకటి ఉంటుందనీ, దానికి మనమే బాధ్యులమన్న నిజమూ, దానితో పాటు అది కలుగజేసే అశాంతీ తప్పించుకోలేనివి' అని టోనీ అనుకోవడంతో కథ ముగుస్తుంది. “There is accumulation. There is responsibility. And beyond these, there is unrest. There is great unrest.”

మనకు కథ మొత్తం టోనీ చెప్పడంవలనే తెలుస్తుంది. అయితే టోనీ మనకి పూర్తిగా నిజమే చెప్పాడు అనడానికి మనకి రుజువులు లేవు. అసలు టోనీకి కూడా పూర్తిగా ఏం జరిగిందో తెలియదు. తెలిసిన వాళ్ళల్లో చెప్పడానికి ఏడ్రియన్ , శారా లేరు. ఉన్న వెరోనికా చెప్పదు. ఏమన్నా తెలియచేసే అవకాశం ఉన్న ఏడ్రియన్ డైరీ కూడా లేదు. తనకు తెలిసిన విషయాలనుబట్టి, తన జ్ఞాపకాలు ఆధారం చేసుకుని టోనీ కూర్చుకున్న కథ ఇది. కేవలం ఏం జరిగి ఉండచ్చో అన్న అవగాహన మాత్రమే కానీ, జరిగిన అసలు విషయం కాదు. అందుకే ఇది కేవలం sense of an ending తప్ప ending కాదు. రచయిత ఏడ్రియన్ చేత చెప్పించినట్టు “history is that certainty produced at the point, where the imperfections of memory meet the inadequacies of documentation“. (ఋజువులూ సాక్ష్యాలూ మాయమయిన దిగంతంలో, దగాకోరు జ్ఞాపకాల ఆసరాతో చరిత్ర సృష్టించబడింది.) హిస్టరీ అంటే ఏమిటీ అని క్లాసులో టీచర్ అడిగినదానికి టోనీ బడాయిగా 'హిస్టరీ అంటే విజేతల ప్రగల్భాలు' అని జవాబిచ్చాడు ఒకప్పుడు. ఇప్పుడు ''హిస్టరీ అంటే విజేతలూ పరాజితులూ కాని శేషజీవుల జ్ఞాపకాల అల్లిక' అని నాకు తెలిసింది అంటాడు.

టోనీ కూడా మనకి తన గురించిన అన్ని విషయాలు నిజాయితీగా చెప్పాడు అనడానికి లేదు. శారా టోనీని కూడా తన మాయలోకి లాగిందా అనేది రచయిత చెప్పరు. టోనీ కూడా చెప్పడు. 'వాళ్ళ మధ్య ఏమీ లేకపోతే శారా రహస్యంగా చేతులూపి వీడ్కోలు చెప్పాల్సిన అవసరమేమిటి? ఏమన్నా ఉంటే అన్నీ చెప్పిన టోనీ ఆవిషయం మాత్రం ఎందుకు చెప్పలేదు. అంటే తనకి సంబంధించిన విషయాలు ఆమోదయోగ్యంకానివి దాచి కేవలం మంచి విషయాలు మాత్రమే చెప్పాడా?' అనే ప్రశ్నలు మనకు వస్తాయి.

ఇది చాలా చిన్న పుస్తకం. దాదాపు 160 పేజీలు. కథ ఒక్కటే చూస్తే గొప్ప కథేమీ కాదు. అయితే కథ ద్వారా చెప్పాలనుకున్న విషయాలు మనల్ని ఆలోచించేలా చేస్తాయి. కథ సాగుతుండగా బయటపడే ఒక్కో మలుపూ టోనీతో పాటూ మనల్నీ

ఆశ్చర్యపరుస్తుంది. మన జ్ఞాపకాలు ఎంత ఆధారపడదగినవీ అన్న అనుమానం కలుగుతుంది. ఒక విషయాన్ని మనవైపు నుండి చెప్పుకున్నప్పుడు మనకు తగ్గట్టు మార్చుకున్నట్టే, వేరేవాళ్ళు చెపితే మొత్తం వేరేగా ఉండొచ్చు. అలాగే మనం అనాలోచితంగా చేసే చిన్న తొందరపాటు పనికి చెల్లించాల్సిన మూల్యం అంచనా కట్టలేనిదని కూడా తెలుస్తుంది. Memory is not what you witnessed అనీ, Memory is imperfect అనీ తెలియచేసే పుస్తకం. రచయిత ముగింపుని మరీ స్పష్టంగా కాక చదువరుల ఊహకు పదును పెట్టేలా ఎన్నో ప్రశ్నలకు, ఆలోచనలకూ ఆస్కారంతో వదిలేసారు. దీనికి 2011 లో Man Booker Prize లభించింది. సరళమయిన భాష, సాధారణంగా ఉంటూనే ఆలోచనలు రేకెత్తించే వాక్యాలతో ఆపకుండా చదివిస్తుంది.

ఈ పుస్తకం ఒకసారి చదివితే పూర్తిగా అర్ధం అవుతుందా అనేది కొంచెం అనుమానమే. మొదటి భాగంలో చెప్పించిన హిస్టరీ గురించిన వాక్యాలను జాగ్రత్తగా గుర్తు పెట్టుకోవాలి, ఎందుకంటే తరువాత భాగంలో అవన్నీ ఋజువు చేస్తూ కథలోని సంఘటనలు మలుపులు తిరుగుతాయి. అపుడు ఆ వాక్యాల సాపేక్షత అక్కడ తెలుస్తుంది. మళ్ళీ ఇంకొకసారి చదివినపుడు ఆ వాక్యాల ప్రాధాన్యత, ఉద్దేశ్యం మనకి బాగా అర్ధం అవుతుంది. కథా వస్తువు (imperfections of memory) ప్రతీవాళ్ళూ అన్వయించుకోగలిగనది అవడంతోనూ, ముగింపు స్పష్టంగా లేక అనేక వూహలకి తావిచ్చేది కావడంతోనూ బాగా రీడింగ్ గ్రూప్స్ లో చాలా చర్చలకు తావిచ్చింది. అయితే కథలో కొన్ని వివాదాస్పద సంఘటనలు, అబ్బాయిలూ అమ్మాయిల మధ్య శారీరక ఆకర్షణకీ, డేటింగ్ కి సబంధించిన విషయాలు ఉన్నప్పటికీ, అవి సూచనప్రాయంగానూ, కేవలం అవసరమయినంత వరకూ మాత్రమే ఉండటంతో వెగటు కలిగించవు. దానితో పాటు వాటి పర్యవసానాలు (ఉదాహరణకి ఏడ్రియన్ ఆత్మహత్య, తల్లి వలన వెరోనికా మనసు విరిగిపోవడం) కూడా సూచనగా ఉండటం, వీటిని కథలో భాగంగా సహజంగా ఇమిడిపోయేటట్టు చేసాయి.

ఈ పుస్తకంలో కొన్ని తాత్విక ఆలోచనలు కలిగించే మంచి వాక్యాలు ఉన్నాయి. వాటిని కథ నుండి విడదీసి చదువుకున్నా కూడా అర్ధవంతంగానూ, ఆలోచింపచేసేవి గాను ఉంటాయి. మచ్చుకి కొన్ని...

*"What you end up remembering isn't always the same as what you have witnessed."*

*"It strikes me that this may be one of the differences between youth and age: when we are young, we invent different futures for ourselves; when we are old, we invent different pasts for others."*

*"History is that certainty produced at the point where the imperfections of memory meet the inadequacies of documentation."*

*"History isn't the lies of the victors, as I once glibly assured Old Joe Hunt; I know that now. It's more the memories of the survivors, most of whom are neither victorious nor defeated"*

*"How often do we tell our own life story? How often do we adjust, embellish, and make sly cuts? And the longer life goes on, the fewer are those around to challenge our account, to remind us that our life is not our life, merely the story we have told about our life. Told to others, but—mainly—to ourselves."*

*"We live in time – it holds us and molds us.... it takes only the smallest pleasure or pain to teach us time's malleability. Some emotions speed it up, others slow it down; occasionally, it seems to go missing – until the eventual point when it really does go missing, never to return."*

*"When you're young—when I was young—you want your emotions to be like the ones you read about in books. You want them to overturn your life, create and define a new reality. Later, I think, you want them to do something milder, something more practical: you want them to support your life as it is and has become. You want them to tell you that things are OK. And is there anything wrong with that?"*

*"Does character develop over time? In novels, of course it does: otherwise there wouldn't be much of a story. But in life? I sometimes wonder. Our attitudes and opinions change, we develop new habits and eccentricities; but that's something different, more like decoration. Perhaps character resembles intelligence, except that character peaks a little later: between twenty and thirty, say. And after that, we're just stuck with what we've got. We're on our own. If so, that would explain a lot of lives, wouldn't it? And also—if this isn't too grand a word—our tragedy."*

*"I certainly believe we all suffer damage, one way or another. How could we not except in a world of perfect parents, siblings, neighbors, companions? And then there is the question, on which so much depends, of how we react to the damage: whether we admit it or repress it, and how this affects our dealings with others. Some admit the damage, and try to mitigate it; some spend their lives trying to*

*help others who are damaged; and there are those whose main concern is to avoid further damage to themselves, at whatever cost. And those are the ones who are ruthless, and the ones to be careful of."*



రచయిత పరిచయం: Julian Barnes ఇంగ్లాండ్ దేశానికి చెందిన రచయిత. లండన్ నివాసి. ఆయన దాదాపు పది నవలలు, చాలా వ్యాసాలు, కథలు, Nothing to be Frightend, Levels of Life అనే మెమోయిర్స్ వ్రాసారు. ఆయన వ్రాసిన నవలల్లో Falubers Parrott, "England, England" అనేవి బాగా పేరు పొందినవి. ఈయన రచనలు మొత్తం నాలుగు సార్లు మేన్ బుకర్ ప్రైజ్ కి నమోదు కాబడితే, నాలుగో సారి The Sense of an Ending ఆ ప్రైజ్ ని సంపాదించుకుంది. ఈయన మారుపేరుతో కొన్ని క్రైం ఫిక్షన్ కూడా వ్రాశారట. ఆయన సంపాదించుకున్న మరికొన్ని అవార్డులు ... Somerset Maugham Award, Geoffrey Faber Memorial Prize, "E. M. Forster Award" from the American Academy of Arts and Letters, "Austrian State Prize" for European Literature , "Commandeur de l'Ordre des Arts et des Letters" by the French Ministry of Culture మొదలైనవి.



# పుస్తకం ఓ నేస్తం
## – పద్మవల్లి



## The Buddha in the Attic




> Barn's burnt down -- now
> I can see the moon
> (Mizuta Masahide - Japanese poet from 17th century)

కలలు కనడం మనసుకి పుట్టుకతోనే అబ్బిన లక్షణం. సాధారణంగా వయసొచ్చిన ప్రతీ ఆడపిల్లా అనుకూలమయిన భర్త, ముచ్చటయిన సంసారం, ముద్దొచ్చే పిల్లలూ ... ఇలా తన స్వంత ప్రపంచం గురించి రంగుల కలలు కంటుంది. తమ చదువూ, ఆశయాల నేపధ్యంగా కొందరి ప్రాధాన్యతలు మారినా, చాలా వరకూ అమ్మాయిల కోరికల్లో ఇవి ప్రముఖ స్థానంలో ఉంటాయి. అయితే అన్నిసార్లూ అందరి కలలూ నిజం కావు. వాస్తవంలో కాస్త అటూఇటూ అయినప్పటికీ, దొరికిన వాటితో సర్దుకుపోడానికే ఎక్కువమంది ప్రయత్నిస్తారు. అయితే ఆ జీవితం అలా సాఫీగా సాగిపోతే చిక్కేలేదు. కలలు కల్లలు కావటమే కాకుండా, మొత్తానికి జీవితమే దగాపడి, కలలు కనే మనసు జీవం కోల్పోయి, అస్తిత్వాలు ప్రశ్నించబడి, మూలాలు మూలనబడి, విశ్వాసాలు శంకించబడి, సర్వం పోగొట్టుకున్న స్థితి వస్తే, అసలు బ్రతుకంటూ మిగలకపోతే ఏం చెయ్యాలి? ఎవరిని నిందించాలి?

సాధారణంగా బ్రతుకుతెరువుకి వలసపోయినా మన మూలాలు, సంస్కృతీ మనతోనే అంటిపెట్టుకుని ఉంటాయి. మన జ్ఞాపకాల్ని, అనుభూతులని నాస్టాల్జియా చిలక్కొయ్యలకి వేలాడదీసి, మనసయినపుడల్లా ఆప్యాయంగా తడుముకుంటూ ఉంటాము. క్రొత్త సంస్కృతులని అక్కున చేర్చుకున్నా, 'ఫిర్ భీ దిల్ హై హిందుస్తానీ' అని మన మనసు అప్పుడప్పుడూ ఋజువు చేస్తూనే ఉంటుంది. మన జన్మభూమీ అంటే ప్రాణం అయినా, మెరుగైన జీవితాన్ని అందిస్తున్న వారిపట్ల కూడా అంతే విశ్వాసాన్ని, విధేయతనీ కలిగిఉంటాం. ద్రోహం చెయ్యాలన్న వూహ కూడా రాదు. జనగణమణ పాడుతూ ఉద్వేగంతో కన్నీళ్ళు కార్చినట్టే, స్టార్ స్పెంగేల్డ్ బేనర్ పాడినపుడూ గౌరవంతో పులకిస్తాం. అవసరమైనపుడు మనకు చేతనైన విధంగా సమాజానికి సహాయం చెయ్యడానికి వెనుకాడము. ఇవన్నీ బయటకి ప్రదర్శించుకునేవి

కాదు, కేవలం మన మనసులకే తెలుస్తుంది. మనది చేసుకున్న, మనది కాని చోట మన అస్తిత్వాన్ని మాయం చేసి, మన లాయల్టీని అనుమానిస్తే ఏం చెయ్యగలుగుతాం? ఎలా ఋజువు చేసుకోగలుగుతాం?

ప్రతీ చరిత్రలోనూ కొన్ని చీకటి అధ్యాయాలు ఉంటాయి. కొన్నిటికి విపరీతమయిన ప్రాముఖ్యం లభిస్తే, కొన్ని బయటకి ఎక్కువగా తెలీకుండానే కప్పబడిపోతాయి. అయితే వాటికి బలైపోయిన వాళ్ళతో ఆ గాయాలు వదిలిన మచ్చలు అలానే ఉంటాయి. తాము కోల్పోయిన వాటిని ఏం చేసినా కూడా పూడ్చలేని నష్టం. జర్మనీ చరిత్రలో హాలోకాస్ట్ అమానుషత్వానికి పరాకాష్ట అయినట్టే, పెరల్ హార్బర్ సంఘటన తరువాత, అమెరికాలోని మొత్తం జపనీస్ జాతీయులకి గూఢచర్యం అంటగట్టి, దాదాపు బహిష్కరణ చేసి జపనీస్ ఇంటర్మెంట్ కేంప్స్ లో (ఆవాస కేంద్రాలు) సంవత్సరాలు మగ్గబెట్టి , వాళ్ళ జీవితాలని కల్లోలం చేసినది అమెరికా చరిత్రలో ఒక మాయని మచ్చ. అయితే అది హాలోకాస్ట్ అంత ప్రాచుర్యాన్ని పొందకపోవడంతో, చాలామందికి దాని వివరాలు, తీవ్రత, దుష్ఫలితాలు తెలీకుండానే ఉండిపోయాయి. దానికి బలయినవాళ్ళు, వారసులు, మిగిలిన వాళ్ళు నెమ్మదిగా తమ అనుభవాలు పంచుకోడం, వాటిని పుస్తకాలుగా తీసుకు రావడంతో ఆ చీకటి కోణం గురించి కొంచెం ఎక్కువగా తెలియడం మొదలు పెట్టాయి.

ఎన్నో కోరికలతో, తాము కలుసుకోబోతున్న తమకి కాబోయే భర్తల గురించి కలలు కంటూ, పుట్టిన నేలని వదిలి అమెరికాలో మెరుగైన జీవితం మీద ఆశతో, జపాన్ నుండి వేలమంది అమ్మాయిలు ఓడలో శాన్ ఫ్రాన్సిస్కో చేరుకున్నారు. ఓడ దిగిన వాళ్ళకి ఎదురైన అనుభవాలు, తగిలిన ఆశాఘాతాలు, జీవితంతో వాళ్ళు చేసుకున్న సర్దుబాట్లు, పరాయి దేశంలో వాళ్ళు ఎదుర్కొన్న సమస్యలు, క్రొత్త భాషనీ సంస్కృతినీ నేర్చుకునే దారిలో వాళ్ళ కష్టాలు, కడుపున పుట్టిన పిల్లలు తమ సంస్క్రుటతినీ ఐడెంటిటీనీ తిరస్కరిస్తే పడిన వేదనా, పెరల్ హార్బర్ నేపథ్యంలో వాళ్ళ బ్రతుకులు తిరిగిన మలుపులు ... వీటన్నిటినీ Julie Otsuka తమ నవల The Buddha in the Attic లో చాలా హృద్యంగా, అచ్చంగా కళ్ళకు కట్టినట్టూ వ్రాసారు. ఆమె మొదటి నవల When the Emperor was Divine (ఈ పుస్తకానికి పరిచయం కౌముది July 2014 సంచికలో చదవొచ్చు) రెండో ప్రపంచయుద్ధ సమయంలో ఒక జపనీస్ కుటుంబంలోని తండ్రి గూఢచారిగా అనుమానింపబడి అరెస్ట్ కాబడి, మిగిలిన కుటుంబం ఇంటర్మెంట్ కేంప్ కి పంపబడితే, అక్కడ వాళ్ళ అనుభవాలు, తరువాత అది వాళ్ళ జీవితాల మీద చూపించిన ప్రభావం విపులంగా వ్రాసారు. ఈ పుస్తకంలో యుద్ధానికి ఓ ఇరవయ్యేళ్ళ ముందు జపాన్ దేశస్థులు వలస రావడం, కుటుంబాలు ఏర్పరచుకోవడం, బ్రతుకుతెరువు కోసం కష్టపడటం, పిల్లలు పుట్టిపెరగడం, అమెరికన్ జీవితానికి అలవాటు పడటం, ఉన్నట్టుండి హటాత్తుగా అన్నీ పోగొట్టుకుని బికారులుగా మిగిలడం వరకూ అన్ని దశలూ వివరిస్తారు.

పుస్తకంలోని కథ లోకి వెళ్ళేముందు కథనం గురించి రెండు మాటలు. సాధారణంగా కథలు చెప్పడానికి వాడే టెక్నిక్స్ ముఖ్యపాత్రల ద్వారా చెప్పించడం, వేరే వాళ్ళ కోణం నుండి చెప్పించడం, లేదా రచయితే థర్డ్ పర్సన్ నేరేషన్లో చెప్పడం జరుగుతుంది. అప్పుడప్పుడూ ఒకటి కన్నా ఎక్కువ పాత్రల ద్వారా వాళ్ళ కోణం నుండి కొంచెం కొంచెంగా కథ చెప్పించడమూ చూసాము. అయితే ఇందులో రచయిత్రి ఒకరూ, ఇద్దరూ, పది మందీ కాదు ... వేల గొంతుకలతో ( collective first person narration) కథ చెపుతారు. ఇది ఏ ఒక్కరి కథో కాదు, ఒక జాతి మొత్తం కథ. దాన్ని చెప్పడానికి ఆవిడ ఎంచుకున్న ఈ టెక్నిక్ చాలా ఎఫెక్టివ్ గానూ, పవర్ఫుల్ గానూ ఉంది.

"It was better to marry a stranger in America than grow old with a farmer from the village. Because in America the women did not have to work in the fields and there was plenty of rice and firewood

for all. And wherever you went the men held open the doors and tipped their hats and called out, "Ladies first" and "After you."


Congressional committee members examine passports of Japanese picture brides at the immigration station of Angel Island, Calif., July 25, 1920 (Courtesy www.NYtimes.com)

అది 1920 వ దశాబ్దం. జపాన్ నుంచి శాన్ ఫ్రాన్సిస్కో కు వస్తున్న ఒక ఓడలో వేలమంది అమ్మాయిలు ఉన్నారు. వాళ్ళలో చాలావరకూ దాదాపు పద్నాలుగేళ్ల వయసులో ఉన్నవారు. అతి కొంతమంది పాతిక దాటినవాళ్ళూ ఉన్నారు. చాలామంది జపాన్ లోని పల్లెటూర్లలోని పేద రైతులు జాలర్ల కుటుంబాలకు చెందినవారు. ఎపుడో అమెరికాకు వలసపోయిన జపనీస్ పురుషులు, మధ్యవర్తుల ద్వారా వాళ్ళ ఫోటోలు పంపి, వాళ్ళు 'అమెరికాలో మంచి ఉద్యోగాలు చేస్తున్నామనో, వ్యాపారాలు ఉన్నాయనో, లేదా పొలాలు రెస్టారెంట్స్ ఉన్నాయనో' తమ స్టేటస్ వివరాలు చెపుతారు. తల్లిదండ్రులు ఆ వివరాలు చూసి, తమ కూతుర్లకి వాళ్లతో పెళ్ళి కుదుర్చుకుని, ఆ ఫోటోలతోనే పెళ్ళి జరిపిస్తారు. పేదరికంతో తిండి కూడా కష్టమయిన పరిస్థితుల్లో, కనీసం ఆ అమ్మాయిలయినా అమెరికాలో సుఖంగా ఉంటారని ఆశపడతారు. పెళ్ళైన కొన్ని నెలలకు ఆ వధువులందరూ కలిసి భర్తల దగ్గరికి అమెరికా వస్తున్నారు.

ఓడలో ముందుగా వాళ్ళు చేసిన పని, వాళ్ళ భర్తల ఫోటోలు పోల్చి చూసుకుని ఎవరు ఎక్కువ అందంగా ఉన్నారో చూసుకోవడం. తల్లులు తమ కూతుర్లకి మంచి భార్యలుగా కావటానికి అవసరమైనవన్నీ నేర్పి పంపారు. తాము పుట్టిన ఊరు తప్ప ఇంకేమీ తెలియని అమాయకురాళ్ళు. వాళ్ళకి తమ భర్తలతో గడపబోయే జీవితం మీద ఎన్నో ఆశలు, నమ్మకాలు, సందేహాలు. తాము వదిలి వచ్చిన తనవాళ్ళ మీద బెంగ. వాళ్ళలో కొంతమందికి వెనక విడిచి వచ్చిన ప్రేమకథలున్నాయి. కొందరికి ఇది రెండో పెళ్ళి. కొంతమందికి తమ తల్లి దగ్గర వదిలివచ్చిన తమ పసిబిడ్డలు ఉన్నారు. వాళ్ళని తలుచుకుంటూ, వాళ్ళకి తాము గుర్తుంటామా అని అనుకుంటారు. జీవితాన్ని ముందుకు సాగనివ్వడానికి వచ్చిన అవకాశం అందిపుచ్చుకుని దూరం రాక తప్పలేదు.

ప్రయాణం సాగుతున్నన్నాళ్ళూ వాళ్లకి ఒకటే సందేహాలు. 'తమ భర్తలు తమని చూడలేదు కదా, మరి వాళ్ళకి తాము నచ్చుతామా? తమకి వాళ్ళంటే ప్రేమ కలుగుతుందా? వాళ్ళని ఫోటోలో మాత్రమే చూసాము కదా, కలిసినపుడు తాము గుర్తుపట్టగలమా లేదా?' లాంటి అనుమానాలు. అమెరికన్ల గురించీ వాళ్ళ లైఫ్ స్టైల్ గురించీ ఎంతో కుతూహలం. కొందరు ఓడలో ఉన్న కొంతమందితో తత్కాలికంగా ఆకర్షణలో పడితే, కొందరు నిజంగానే ప్రేమలో పడ్డారు. చాలావరకూ వాళ్ళందరూ ఓడ దిగగానే అన్నీ మర్చిపోయి రాజీ పడిపోయారు. కొందరు వాళ్ళను మర్చిపోలేక, భర్తలతో వెళ్ళలేక ప్రాణం తీసుకున్నారు.

"One of us jumped overboard after spending the night with a sailor and left behind a short note on her pillow: After him, there can be no other."

ఓడ దిగి బయట తమ కోసం ఎదురుచూస్తున్న భర్తల కోసం వెదుక్కుంటున్నప్పుడు వాళ్ళకు మొదటి షాక్ తగిలింది. ఏ ఒక్కరూ వాళ్ళు పంపిన ఫోటోలో ఉన్నట్టు లేరు. చాలామంది కనీసం వయసులో 20 ఏళ్ళు పెద్దగా ఉన్నారు. ఫోటోలో ఉన్నట్టు నీట్ గా డ్రెస్ చేసుకుని కూడా లేరు. వెలిసిపోయి చిరిగిన కోట్స్ వేసుకుని ఉన్నారు. ఆ అమ్మాయిలకి షాక్ తగిలినా, చేసేదేం లేక సర్దుకుపోయి భర్తల వెంట నడిచారు.

"This is America; we would say to ourselves, there is no need to worry. And we would be wrong."

భర్తలు ఉత్తరాల్లో వ్రాసినట్టు వాళ్ళకు పొలాలు, షాపులు, ఉద్యోగాలు లేవు. అందరూ అమెరికన్ల పొలాల్లో వ్యవసాయ కూలీలుగానో, లాండ్రీల్లోనో పనిచేసి, ఇళ్ళల్లో పనులు చేసి పొట్టపోసుకుంటున్నవాళ్ళే. వాళ్ళు పంపిన ఫోటోల్లో వాళ్లతో పాటూ ఉన్న కార్లు, ఇల్లూ వాళ్ళ యజమానులవి. ఉత్తరాలు కూడా ఎవరిచేతో వ్రాయించినవే తప్ప, వాళ్ళకి చదువుకూడా రాదు. భర్తలతో పాటు కాలిఫోర్నియాలో ఎక్కడ పంటల సీజన్ ఉండి, పని దొరికితే అక్కడకి వలస వెళ్లారు. భర్తలతో కలిసి యజమానుల పొలాల్లో పనులు, పళ్ళు, కూరగాయలు కోసి బుట్టలకెత్తడం లాంటి పనులు చేసారు. ఎండలకు తట్టుకోలేని కొందరు సుకుమారిలు పాపం వడదెబ్బ తగిలి చనిపోయారు. తమ ఊళ్ళలో కాయకష్టం అలవాటువాళ్ళు మాత్రం వంచిన నడుము ఎత్తకుండా రోజంతా పని చేసేవారు. కొందరు భర్తలను తిట్టుకుంటూ, కొందరు ఏడుస్తూ, కొందరు తత్వాలు పాడుకుంటూ, చేతులు బొబ్బలెక్కి కాయలు కాసిన నొప్పితో బాధపడుతూనే పనులు చేసారు. ఉండటానికి సరైన ఇల్లు కూడా లేదు. నివాసం చివర లేబర్ కేంప్స్ లోనో, పని చేస్తున్న పొలాల్లోనో, పశువుల షెడ్లో మూలనో, చెట్టు కింద గుడారాల్లోనో, తోటల్లో గడ్డివాముల్లోనో. ఒక చోట సీజన్ అయిపోయానే, వేరేచోటకి దేశదిమ్మరిలా తరలిపోవటమే.

ఈ అమ్మాయిలకి అమెరికాలో భర్త తప్ప వేరే నా వాళ్ళు లేరు. అటు పుట్టినింటికీ, అమెరికాకీ మధ్య వారి జీవితానికి వారధి అతనే. భర్తలు వీళ్ళకి అతి ముఖ్యమైన ఇంగ్లీష్ పదాలు, అమెరికన్లతో ఎలా మెలగాల్సిన పద్ధతుల గురించీ నేర్పారు. అమ్మాయిలకి ఎన్నో సందేహాలు. 'అమెరికన్లెందుకు అంత గట్టిగా మాట్లాడతారు? అందరూ ఒకేలా ఉన్నారు, ఎవరెవరో వాళ్లకి తేడా ఎలా తెలుస్తుంది? ఇళ్ళల్లో కూడా చెప్పులేసుకుని తిరుగుతారా? గోడలకి ఫోటోలు కాకుండా, గిన్నెలూ పళ్ళాలు తగిలించుకుంటారా? నిజంగానే చంద్రుడిలో మనిషిని చూసారా, కుందేలుని కాదా?' లాంటివి. 'అమెరికన్లతో జాగ్రత్తగా ఉండమనీ, వీలయినంత తక్కువ మాట్లాడి, ఎస్, నో అని మాత్రమే జవాబిస్తూ, వాళ్ళకి కోపం రాకుండా ఉండేలా ప్రవర్తించమని' భార్యలకి జాగ్రత్తలు చెప్పారు.

"Be humble. Be polite. Appear eager to please. Say "Yes, sir," or "No, sir," and do as you're told. Better yet, say nothing at all. You now belong to the invisible world."

కొన్నిసార్లు యజమానులు, ప్రక్క పొలాల్లో పనిచేసే యువకులు, భర్త దగ్గర లేకుండా చూసి కోరిక బయటపెట్టేవారు. కొందరు తిరస్కరిస్తే, కొందరు నెమ్మదిగా వాళ్ళు ఆశ చూపించిన వాటికి లొంగిపోయారు. కొందరు భర్తలు యజమానుల దగ్గర పొలాన్ని

కౌలుకి తీసుకుని వేలీల్లో వ్యవసాయం చెయ్యడం మొదలు పెట్టారు. ఆ కౌలు కట్టడానికి భార్యాభర్తలిద్దరూ కష్టపడి యంత్రాల్లా రాత్రీ పగలూ పనిచేస్తూ కూలీలుగా మారిపోయారు. పంటలు బాగున్నప్పుడు లాభాలొచ్చాయి, లేనినాడు నష్టపోయారు. క్రమేణా అమ్మాయిలు యాంత్రికంగా మారిపోయారు. పొలాల్లో కలుపు తియ్యడం, పంటలు కొయ్యడం, మిగిలిన పనుల్లో భర్తకి సహాయం చెయ్యడం. పని, పని, పని... అహోరాత్రాలూ పని తప్ప వేరేది లేకుండా పోయింది. ఇంట్లో చేసే పనులు కూడా యాంత్రికంగా మారిపోయాయి. దేని మీదా ఆశ లేదు. దేని మీదా ఆసక్తి లేదు. కళ్ళు కలలు కనడం కూడా మర్చిపోయాయి. కేవలం మరమనుషుల్లా మిగిలిపోయారు. వాళ్ళలోని మార్పుని భర్తలు కూడా గుర్తించలేదు.

"But it was not we who were cooking and cleaning and chopping, it was somebody else. And often our husbands did not even notice we'd disappeared."

కొంతమంది అమెరికన్స్ ఇళ్ళల్లో పనులకు కుదిరారు. భర్తలు యజమానుల లాన్ కటింగ్, గార్డెన్ పనులు చేస్తే, అమ్మాయిలు ఇంట్లో మెయిడ్ గా పనిచేశారు. ఇల్లు శుభ్రం చెయ్యడం, వెండి సామానులు క్లీన్ చెయ్యడం, బాత్ రూమ్లు, కిచెన్ ఫ్లోర్స్ క్లీన్ చెయ్యడం, వాళ్ళ పిల్లల్ని చూసుకోవడం లాంటి పనులు చేసారు. యజమానురాళ్ళు వీళ్ళు కష్టపడి శుభ్రంగా పనిచెయ్యడాన్ని మెచ్చుకుని, 'ఇంత మంచి హెల్పర్లు ఇంకెక్కడా దొరకరని' తమ ఫ్రెండ్స్ దగ్గర గొప్పగా చెప్పుకునేవారు. దుఃఖంగా ఉన్నప్పుడు మనసు విప్పి వీళ్ళతో తమ కష్టాలూ రహస్యాలూ చెప్పుకునేవారు. భర్తలకి తెలియకుండా యజమానురాళ్ళు సాగించిన రహస్య ప్రేమాయణాలను వీళ్ళు మనసులో దాచుకున్నారు. యజమనురాళ్ళు కొందరు వీళ్ళకి ఇంగ్లీష్, అమెరికన్ పద్ధతులు నేర్పిస్తే, కొందరు చిన్న చిన్న గిఫ్ట్స్ కొనివ్వడం లాంటివి చేసేవారు. కొందరు వీరితో ముక్తసరిగా ఉంటే కొందరు, ఆప్యాయంగా చూసుకునేవారు. కొందరు పని చేస్తుంటే వెంటే వెంటే తిరిగి కబుర్లు చెబుతూ ఉండేవారు. అయితే కొందరు కారణాలు చెప్పకుండా మానిపించేస్తే, కొందరు వీళ్ళు అమాయకంగా చేసే పిచ్చి పనులకు విసిగి మానిపించేసారు.

Some of us had trouble understanding their English, which bore no resemblance to what we had learned in our books.

We said "Yes" when they asked us if we would mind folding their laundry and "No" when they asked us to mop, and when they asked us if we'd seen their missing gold earrings we smiled and said, "Oh, is that so?"

యజమానురాళ్ళు ఇంట్లో లేని సమయంలో, కొంతమంది యజమానులు వీళ్ళతో సంబంధం ఏర్పరుచుకున్నారు. అప్పటివరకూ స్పందన లేక మరమనుషుల్లా బ్రతుకుతున్నవాళ్ళు, యజమానులు చూపించిన కొంచెం ఆప్యాయతకీ, కన్సర్న్ కీ, వాళ్ళు చేసిన బాసలు నిజం కావని తెలిసినా లోబడిపోయారు. వాళ్లతో ఉన్న కాసేపూ వీళ్ళకి తమలో జీవం నిండినట్టు ఉండేది. కొందరు నిజంగానే యజమానులతో ప్రేమలో పడ్డారు. కొందరు తమ భర్తలకి నిజం చెపితే, కొందరు చెప్పలేక తమలో తామే కుమిలి మతిచలించిపోయారు.

"ONE OF US made the mistake of falling in love with him and still thinks of him night and day. One of us said nothing to anyone and slowly lost her mind. One of us filled the sleeves of her white silk wedding kimono with stones and wandered out into the sea, and we still say a prayer for her every day."

కొందరు జపనీస్ వూరి చివర 'జపాన్ టౌన్' అనబడే చిన్న ప్రాంతంలో నివాసం ఏర్పరచుకుని లాండ్రీ షాపులు, రెస్టారెంట్స్, నూడుల్ షాప్స్, పళ్ళూ కూరగాయల దుకాణాలు, గ్రోసరీ షాప్స్ లాంటి వ్యాపారాలు పెట్టుకున్నారు. అమ్మాయిలు కూడా భర్తలతో కలిసి వాటిల్లో పనిచేసారు. బయట ప్రపంచంతో అమెరికన్స్ తో సంబంధం ఉండేది కాదు. ఆ నాలుగు వీధుల ప్రపంచంలో వాళ్లకి జపాన్లో ఉన్నట్టే ఉండేది. వైద్యం అవసరమయితే ఉన్న ఒకే ఒక్క జపానీస్ డాక్టర్ దగ్గరికి వెళ్ళేవారు. అయితే జపాన్ టౌన్ దాటి బయట ప్రపంచంలో తిరిగినపుడు మాత్రం వివక్షని ఎదుర్కొనేవారు. కొందరు అమెరికన్స్ వీళ్ళ ఇంగ్లీష్ ఉచ్చారణని అనుసరిస్తూ వెక్కిరించడం, పిల్లలు వీళ్ళ మీదకి రాళ్ళు విసరటం చేసేవారు. అమెరికన్ రెస్టారంట్స్ కి వెళితే, ఎపుడూ ఆఖరున వడ్డించడం, బార్బర్స్ హెయిర్ కట్ చెయ్యడానికి 'జుట్టు చాలా గరుకు, తన కత్తెరకి లొంగదు' అని వంకపెట్టడం నిరాకరించడం లాంటివి ఎదుర్కొనేవారు. అయితే అన్ని చోట్లా ఎదురుచెప్పకుండా చిరునవ్వు నవ్వి పక్కకి తొలగిపోయేవారు. కొన్నాళ్ళు కష్టపడి డబ్బు సంపాదించి, జపనీస్ గౌరవంగా బ్రతకగలిగే వేరే దేశానికి వెళ్ళిపోయి, తమ స్వంత వ్యాపారం చేసుకుంటూ తల ఎత్తుకు బ్రతకాలని అనుకునేవారు.

"Because the only way to resist, our husbands had taught us, was by not resisting."

కొందరు భర్తలు ప్రేమగా చూసుకున్నారు. కొందరు మూర్ఖంగా ఉంటే కొందరు క్రూరంగా ఉండేవారు. కొందరు తమ పని తప్ప భార్య గురించి పట్టించుకొనే వారు కాదు. కొంతమంది అమ్మాయిలు తమ ప్రియుల్ని మర్చిపోలేక, భర్తలకు నిజం చెప్పలేక మతి చలించిపోయారు. కొంతమంది తమని వెదుక్కుంటూ వచ్చిన ప్రియులతో వెళ్ళిపోతే, కొంతమంది భర్తలని వదిలిరాలేమని తిరస్కరించారు. కొంతమంది క్రూరమైన భర్తలని భరించలేక పారిపోతే, కొంతమంది కిడ్నాప్ చెయ్యబడి వ్యభిచారులుగా మార్చబడ్డారు.

ఏ డాక్టర్ల సహాయం లేకుండానే పిల్లలని కన్నారు. కొందరికి లేక లేక పుడితే, కొందరికి సంవత్సరానికొకరు చొప్పున పుట్టారు. కొందరు ప్రసవం ముందు రోజు వరకూ పొలాల్లో పనిచేస్తూ, ప్రసవించిన మరునాటి నుండీ బిడ్డను వీపుకు కట్టుకుని పనుల్లోకి వెళ్లారు. కొంతమంది బిడ్డని ప్రసవించి చనిపోతే, కొందరి బిడ్డలు ప్రసవంలోనే చనిపోయారు.

"We gave birth but the baby had already died in the womb and we buried her, naked, in the fields, beside a stream, but have moved so many times since we can no longer remember where she is."

పొలాల్లో పని చేసుకునేటప్పుడు పసిపిల్లల్ని గట్టు మీద వెదురు బుట్టల్లో పడుకోపెట్టీ, ఎదిగిన పిల్లలని వీపుకి కట్టుకునీ పొలాల్లో రోజంతా పని చేసుకున్నారు. పిల్లలు కొంచెం పనులు చేసే వయసు రాగానే తల్లిదండ్రులతో పాటు పొలాల్లో పనికి వెళ్లారు. పళ్ళు కోయటం, క్రేట్స్ సర్ది పేక్ చెయ్యడం, పొలానికి నీరు పెట్టడం లాంటి పనుల్లో సహాయం చేసేవారు. కొందరు పిల్లలు ఉత్సాహంగా చేస్తే, కొందరు కష్టంగా ఏడుస్తూ సణుగుతూ చేసేవారు. వాళ్ళకి బొమ్మలు కొనడానికి డబ్బులు లేకపోయినా, ఆ పొలాల్లోనే గడ్డివాముల్లో,

దుమ్ములో, నీటి చెలమలలో రకరకాల ఆటలు ఆడుకునేవారు. వాళ్ళ స్వంత సృజనతో కొత్త ఆటలు, ఇష్టమయిన పెంపుడు జంతువులూ, వాళ్ళ అమాయకమయిన నమ్మకాలూ, ప్రేమలూ ... వీటితో మళ్ళీ తల్లుల లోకంలో పోయిన వెలుగులు తీసుకొచ్చారు. అయితే ఇక్కడా దురదృష్టం వెంటాడింది. మీసిల్స్, డిఫ్తీరియా లాంటి జబ్బులతో కొందరు పిల్లలు చనిపోతే, పొలాల్లో పురుగులు కుట్టి కొంతమంది, ప్రమాదాల్లో కొంత మంది చనిపోయారు.

"And every year, in August, on the Feast of the Dead, we lit white paper lanterns on their gravestones and welcomed their spirits back to earth for a day. And at the end of that day, when it was time for them to leave, we set the paper lanterns afloat on the river to guide them safely home. For they were Buddhas now, who resided in the Land of Bliss."

ఎదిగిన పిల్లలు రకరకాల పనులు నేర్చుకుని తల్లిదండ్రులకి వాళ్ళ ఫార్మ్స్, లాండ్రీల్లో ,మోటేల్స్ లోనూ సాయం చేసేవారు. స్కూల్ కి వెళ్ళిన మొదట్లో ఇంగ్లీష్ రాకపోవడంతో, భయం భయంగానూ సిగ్గు పడుతూనూ ఉండి, ఎపుడూ వెనుక బెంచీల్లో కూర్చుని ఎవరి దృష్టిలో పడకుండా ఉండేవారు. తొందరలోనే భాష నేర్చుకుని మాట్లాడటం, చదవటం వచ్చింది. వాళ్లకేం కావాలో స్పష్టంగా ధైర్యంగా అడిగే విశ్వాసం వచ్చింది. అయితే నెమ్మది నెమ్మదిగా తల్లులు నేర్పినవన్నీ దూరమయిపోయాయి. తమ మాతృభాషని మర్చిపోయారు. పూల పేర్లు, రంగుల పేర్లు, దేవుళ్ళ పేర్లు, నేర్చుకున్న ప్రార్ధనలు అన్నిటినీ మర్చిపోయారు. తమ ఆచారాలు పాటించడానికి కూడా ఇష్టపడేవారు కాదు. తల్లులు మాట్లాడేదేదీ తమకి అర్థం కానట్టే నటించారు. తల్లిదండ్రుల పద్ధతులూ, వేషభాషలూ వారికి నామోషీగా ఉండేవితమకి తామే అమెరికన్ పేర్లు పెట్టుకున్నారు. తిండి, మాట, నడత అన్నీ అమెరికన్ పద్ధతులు నేర్చుకుని, వాటికి అలవాటు పడిపోయారు. స్కూల్లో బెస్ట్ స్టూడెంట్స్ గా పేరు తెచ్చుకున్నారు. రకరకాల ప్రైజులు పొందారు. అయితే బయట ప్రపంచంలో ఒకరిగా కలిసిపోడానికి ఎంత ప్రయత్నించినా వివక్షత వాళ్ళని వదలనేలేదు. అది అర్థం చేసుకుని, బయట ప్రపంచంలో ఎలా మెలగాలో నేర్చుకున్నారు. తమని ఎవరు ఏక్సెప్ట్ చేస్తారో, ఎవరు తిరస్కరిస్తారో నేర్చుకున్నారు. తల్లిదండ్రుల్లా లేబర్ పనుల్లో మగ్గిపోకుండా ఎదగాలనీ, ఏదేదో కావాలనీ, ఏదో సాధించాలనీ కలలు కనసాగారు. వీళ్ళు తాము కన్న పిల్లలేనా అని తల్లులు ఆశ్చర్యపోయారు. ఆ కలలు కల్లలై ఎక్కడ వారిని బాధిస్తాయో అని భయపడ్డారు. తాము చెయ్యగలిగిందేమీ లేక మౌనంగా ఉండిపోయారు.

"And even though we saw the darkness coming we said nothing and let them dream on."

రెండో ప్రపంచ యుద్ధం మొదలయ్యింది. 1941 సంవత్సరం. నెమ్మదిగా వదంతులు రాసాగాయి. ఎక్కడో దేశద్రోహులని అనుమానం ఉన్న జపనీస్ –అమెరికన్ పేర్లతో లిస్ట్ తయారవుతోందనీ, రోజు రోజుకీ ఆ లిస్ట్ పెరుగుతోందనీ వార్తలు రాసాగాయి. అక్కడక్కడా జపనీస్ పురుషులు బయటకి వెళ్ళిన వాళ్ళు తిరిగి ఇంటికి రాలేదు. కొంతమందిని పొలాల్లో పని చేసుకుంటుంటే వచ్చి బెదిరించారనీ – కొందరిని అరెస్ట్ చేసి ట్రైన్స్ లో ఎక్కడికో దూరంగా తీసుకు వెళ్ళి విచారిస్తున్నారనీ, వాళ్ళని అటునుంచి అటే దేశం నుంచి పంపేస్తారనీ – జపనీస్ వాళ్ళకు చెందిన వ్యాపారాలను స్వాధీనం చేసుకుంటున్నారనీ – ఇలా రకరకాల వార్తలు వినబడసాగాయి. పెరల్ హార్బర్ దాడి జరిగిన రాత్రి జపాన్ విమానాలకు సిగ్నల్స్ అందించారనీ – శత్రువులకు రహస్యంగా వార్తలు చేరుస్తున్నారనీ – రైతులు వారి పొలాల్లోని షెడ్స్ లో వేలకొద్దీ ఆయుధాలు దాచారనీ – ఈ రైతులు అందరూ మారు వేషంలో ఉన్న జపాన్ ఆర్మీ అనీ రకరకాలుగా పుకార్లు, పేపర్లలో వార్తలూ రావడం మొదలెట్టాయి. జపనీస్ వారి ఇళ్లకు టెలిఫోన్ లైన్స్ కట్ చేసారు. బేంక్ అకౌంట్స్ సీజ్ చేసారు. ఇన్స్యూరెన్స్ కంపెనీలు ఇన్స్యూరెన్స్ కేన్సిల్ చేసాయి. చుట్టుపక్కల అందరూ వీళ్ళని అనుమానంగానూ భయంగానూ చూడసాగారు. ఎదురుపడితే భయంగా తప్పుకుపోవడం మొదలుపెట్టారు. ఊరు వదిలి వెళ్ళిపోమని బెదిరిస్తూ జపనీస్ ఇళ్లకు అజ్ఞాత ఉత్తరాలు రాసాగాయి. బయట

అక్కడక్కడా ఒంటరిగా దొరికిన జపనీస్ మీద దాడులు జరగసాగాయి. ఎపుడు ఎవరి ఇంటి తలుపు తట్టి ఎవరిని తీసుకుపోతారో తెలీని భయంతో బ్రతకసాగారు. తమ ఇళ్ళల్లో జపాన్ కి చెందిన వస్తువులన్నీ, ఫోటోలతో సహా తగులబెట్టేసారు.

1942 జనవరిలో జపనీస్ జాతీయులంతా ప్రభుత్వంతో పేర్లు రిజిస్టర్ చేసుకుని, వాళ్ళ దగ్గరున్న ఆయుధాలు, శత్రువులకు సిగ్నల్స్ ఇవ్వడానికి అవకాశం ఉండేవన్నీ, టార్చ్ లైట్స్ తో సహా అప్పగించాలని ఉత్తర్వులు వచ్చాయి. తరువాత 'జపనీస్ వాళ్ళెవరూ ఇంటినుండి ఐదు మైళ్ళు దాటి వెళ్ళడానికి లేదు. రాత్రి ఎనిమిది తరువాత బయటకు రావడానికి లేదు. పెద్ద గుంపులుగా కనిపించకూడదు.' లాంటి రూల్స్ వచ్చాయి. పిల్లలు బయట 'I am Chinese' అన్న బేడ్జ్ లు తగిలించుకుని తిరగసాగారు. 'శత్రుదేశానికి సంబంధించిన అందరినీ యుద్ధం ముగిసేవరకూ దూరంగా మారుమూల ప్రాంతానికి తరలిస్తారని' రేడియోలో వార్తలు రాసాగాయి. రోజురోజుకీ ఆఫీసర్లు తీసుకుపోతున్న వాళ్ళ సంఖ్య పెరుగుతోంది. ఎవరికివారే ఆ జాబితాలో తమ భర్తల పేరు ఉండి ఉండదులే, వారు అనుమానం కలిగించే పనులేమీ చెయ్యలేదు కదా అని భరోసా తెచ్చుకునేవారు. ఎవరన్నా తమ మీద కంప్లయింట్ చేస్తున్నారేమో అని అనుమానం. ఎవరై ఉంటారు, తమ లాండ్రీకి రోజూ వచ్చే రెగ్యులర్ కస్టమర్స్లో ఒకరా, లేక తమ మీద ఎప్పుడన్నా ఎందుకన్నా కోపం తెచ్చుకున్న పొరుగువారా? తమలోనే ఎవరన్నా ఇన్ఫార్మర్స్ ఉన్నారేమో, తమకి ఇష్టం లేని వాళ్ళ గురించి ఆఫీసర్లకి తప్పుడు సమాచారం ఇస్తున్నారేమో అన్న అనుమానం కూడా రాసాగింది. ఎవరిని నమ్మాలి , ఎవరిని నమ్మకూడదు? తమ వాళ్లెవరితోనైనా మాట్లాడటానికి కూడా తాము రహస్యాలు మార్చుకుంటున్నారని అనుమానిస్తారేమో అని భయం.




కొన్నాళ్ళకి 'జపనీస్ అందరూ ఊరు వదిలి వెళ్ళడానికి రెడీగా ఉండాలనీ, వాళ్ళని యుద్ధం ముగిసేవరకూ క్షేమమైన చోటికి తరలిస్తామనీ ' శాన్ఫ్రాన్సిస్కో వీధుల్లో నోటీసులు వెలిసాయి. అందరూ వెళ్ళడానికి అన్ని ఏర్పట్లు చేసుకున్నారు. తమ వ్యాపారాలు లీజుకి ఇచ్చుకున్నారు. షాపులో సరకులన్నీ చవకగా అమ్మేసుకున్నారు. విలువైన వస్తువులూ, తిరిగి వచ్చాక వాడుకోవటానికి కొంత గ్రోసరీలు బేస్ మెంట్స్ లో, ఏటిక్స్ లోనూ దాచిపెట్టుకున్నారు. పిల్లలకీ తమకీ కావాల్సిన సామానులు సర్దుకుని గూళ్ళు వదిలి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. వెళ్ళే రోజు వచ్చింది. వెళ్తున్న వారిలో రకరకాల ఉద్వేగాలు. కొందరు ఏడుస్తూ వెళితే, కొందరు పిచ్చిగా కారణం లేకుండా నవ్వుతూ వెళ్లారు. కొందరు తత్వాలు పాడుకుంటే, కొందరు అవమానంతో తలదించుకు వెళ్లారు. కొందరు నిరాశతో వెళితే, కొందరు అసహ్యంతో వెళ్లారు. కొందరు మళ్ళీ తొందరగా తిరిగి రావాలని కోరుకుంటూ వెళితే, కొందరు మళ్ళీ అక్కడికి రాకూడదని అనుకుంటూ వెళ్లారు. చిన్నపిల్లలు కొందరూ ఏమీ తెలీకుండా నవ్వుతూ వెళితే, కొందరు వెనక్కిపోదామని ఏడుస్తూ వెళ్లారు. వెళ్తున్న వీళ్ళను అమెరికన్లు తమ కిటికీల పరదాల చాటునుంచి చూసారు. వాళ్ళందరి ముందూ అవమానంతో, బాధతో, సిగ్గుతో కుచించుకుపోయి, తమ సర్వం కోల్పోయిన ఓ జాతి పౌరులు, ఎవరితో ఏమీ మాట్లాడకుండా, ఎవరి నుండీ వీడ్కోళ్ళు లేకుండా మౌనంగా నిష్క్రమించారు.

"Masayo left after saying good-bye to her youngest son, Masamichi, at the hospital in San Bruno, where he would be dead of the mumps by the end of the week. Haruko left a tiny laughing brass Buddha up high, in a corner of the attic, where he is still laughing to this day."

జపనీస్ వారి వ్యాపారాలు మూతపడ్డాయి. అమ్మేసినవీ , లీజుకి తీసుకున్నవీ పేర్లు మార్చబడ్డాయి. వాళ్ళు ఎక్కడున్నారో ఎలా ఉన్నారో అని అమెరికన్ ప్రజల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. వాళ్ళు ఊరు వదలివెళ్ళాలని నోటీస్ బోర్డులు చూసినపుడు, వాళ్ళంతా ఒక్క మాటకూడా మాట్లాడకుండా, కేవలం ఆలోచనతో తల వూపుతూ వెళ్ళడం గుర్తుకు చేసుకున్నారు. తమకి నమ్మకంగా సేవలు చేసిన వాళ్ళని, వాళ్ళ షాపులకు వెళితే ఆప్యాయంగా పలకరిస్తుండేవారిని పేరుపేరునా గుర్తుచేసుకున్నారు. అమెరికన్ల పిల్లలు వాళ్ళ క్లాస్మేట్స్ హఠాత్తుగా కనిపించకపోవడం, వాళ్ళేమయ్యారో రకరకాల కథలు వినడంతో, వాళ్ళ గురించి దిగులు పడసాగారు. అమెరికన్స్ లో కూడా కొంతమంది జపనీస్ అమాయకులని నమ్మితే, కొంతమంది మాత్రం వాళ్ళు వెళ్లిపోవడంతో రిలీఫ్ ఫీలయ్యారు. కొందరైతే జపనీస్ వలన ఎపుడూ తమకి కష్టం కలగకపోయినా, 'ఏ పుట్టలో యే పాముందో ఎవరికీ తెలుసు? ఎవరిని నమ్మగలం?' అని అనుకున్నారు. కొందరు తమ పొరుగున ఉండే జపనీస్, వాళ్ళు ఉన్నట్టు కూడా ఎప్పుడూ తెలీనంత నిశ్శబ్దంగా ఉండేవారనీ, వాళ్ళవల్ల తమకేమీ ఇబ్బంది కలగలేదనీ చెప్పుకున్నారు.

"for a moment the town feels oddly naked, and it is almost as if the Japanese were never here at all ."

రోజులు గడుస్తున్నకొద్దీ జపనీస్ కోసం పెట్టిన నోటీస్ బోర్డులు నెమ్మదిగా వర్షాలకి వెలసి పోవడం మొదలుపెట్టాయి. కొన్నాళ్ళకి మొత్తానికి అసలు ఆనవాళ్ళు కనిపించకుండా పోయాయి. అప్పుడప్పుడూ జపనీస్ పిల్లల నుండి, వాళ్ళ ఫ్రెండ్స్ కి ఉత్తరాలు వచ్చేవి. అందులో తాము ఓ ఎడారిలో కేంప్ లో ఉన్నామనీ, ఇంకా కొన్నాళ్ళు ఇక్కడే ఉండాలట అని వ్రాసారు. అయితే పోస్ట్ మాన్ , జపనీస్ కి ఉత్తరాలు రాస్తే అరెస్ట్ చేస్తారని భయపెట్టడంతో పిల్లలు తిరిగి జవాబు వ్రాయలేదు. కొన్నాళ్ళకి ఆ ఉత్తరాలు ఆగిపోయాయి.

రాత్రుళ్ళు జపనీస్ వారి ఇళ్ళ తలుపులు పగలగొట్టి ఫర్నిచర్లూ, అటకల్లో దాచుకున్న సామానులూ దోచుకుపోయారు. కార్లు పగలగొట్టి దోచుకున్నారు. వారి ఇళ్లను వేరేవాళ్ళు ఆక్రమించుకున్నారు. నెమ్మదిగా అమెరికన్ పొలాల్లోనూ, ఇళ్లలోనూ జపనీస్ వాళ్ళు చేసిన పనులన్నీ ఆఫ్రికన్-అమెరికన్స్, మెక్సికన్లు, చైనీస్ లాంటి ఇతరులు చెయ్యడం మొదలుపెట్టారు. ఓ సంవత్సరం గడిచేసరికి ఎక్కడా ఒకప్పుడు జపనీస్ ఉండి వెళ్ళిన గుర్తులు కూడా లేకుండా పోయాయి. వాళ్ళ పేర్లు కూడా అందరూ మర్చిపోయారు. అప్పుడప్పుడూ 'నెవాడా, యూటా ఎడారుల్లోకి మొత్తం జపనీస్ అందరినీ తరలించారానీ, వారిని ఆ దగ్గర ప్రాంతాల్లోని పొలాల్లో పనులకు పెట్టారనీ, అప్పుడప్పుడూ రాత్రుళ్ళు ఆకలితో అలమటిస్తూన్న కొందరు జపనీస్ పిల్లలు ప్రక్కనున్న ఊర్లలో కనిపిస్తున్నారనీ వార్తలు వినిపించేవి, కానీ అవి ఎంతవరకూ నిజమో ఎవరికీ తెలీదు. ప్రభుత్వం మాత్రం 'దేశంలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రభుత్వం చేసిన సూచనతో, వాళ్ళు ఇష్టపూర్వకంగానే తరలి వెళ్లారనీ, క్షేమంగానూ సంతోషంగానూ ఉన్నారనీ, సమయం వచ్చినపుడు వివరాలు వెల్లడి చేస్తామనీ' చెప్పి చేతులు దులుపుకుంది. ఇక వాళ్ళని మళ్ళీ చూడలేమేమో అని అమెరికన్ ప్రజలు అనుకుంటున్నట్టుగా పుస్తకం (కథ కాదు) ముగుస్తుంది.

"All we know is that the Japanese are out there somewhere, in one place or another, and we shall probably not meet them again in this world."

ఆఖరి వాక్యం చదవటం పూర్తి కాగానే కొంతసేపు మనల్ని నిస్పృహ, బాధ, అసహనం, దిగులు చుట్టుముడతాయి. ఒక వర్గం మీద ద్వేషం తోనో, కోపంతోనో వివక్షత పెంచుకోడం, వెలివెయ్యడం లేదా హింసించడం లోకంలో కొత్తకాదు. నాటి అయోధ్య గొడవల నుండీ, 9/11 వరకూ, అవుట్ సోర్సింగ్ పేరుతో తమ ఉద్యోగాలను తన్నుకుపోతున్నారని ఏషియన్ల ప్రత్యక్షంగానే ద్వేషాన్ని చూపినవాళ్ళూ ఉన్నారు. ఉన్మాదుల్లా విచక్షణ లేకుండా అమాయకుల మీద కక్ష తీర్చుకున్నవాళ్ళూ ఉన్నారు. చరిత్ర పునరావృతమైతే ఇప్పటి పరిస్థితులెలా ఉంటాయా అని ఆలోచిస్తే జవాబు దొరకదు. పరాయినేల మనం ఎంత కౌగలించుకున్నా పరాయిగానే ఉండిపోతుందా? ఎప్పటికీ మన స్వంతగడ్డ మీద

వర్గ వివక్షతలూ, కక్షలూ, ద్వేషాలు లేకుండా మనలేని మనం, పరాయిదేశం తన రక్షణకోసం చేసిన పనులని వేలెత్తి చూపే హక్కూ, అన్యాయమని అరిచే అర్హతా మనకుంటుందా? ఏమో?

రచయిత్రి తన మొదటి పుస్తకం వ్రాస్తున్నప్పుడు, వివరాల కోసం జపనీస్-అమెరికన్స్ తో మాట్లాడినపుడు, కొందరు మహిళలు చెప్పిన తమ కథలు ఈ పుస్తకానికి ప్రేరణ కలిగించాయట. ఈ పుస్తకం 2011 లో National Book Award for Fiction కు నామినేట్ చెయ్యబడింది. 2012 సంవత్సరానికి గానూ Langum Prize for American Historical Fiction (2011), the PEN/Faulkner Award for Fiction, Prix Femina Étranger అవార్డులు గెలుచుకుంది.

కొన్ని పుస్తకాలు మనల్ని వెంటాడుతాయి. ఎన్నాళ్ళ తరువాతయినా, అప్పుడప్పుడూ కనీసం కొన్ని వాక్యాలు హఠాత్తుగా గుర్తొచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అలాంటి పదునైన వాక్యాలు ఇందులో చాలా ఉన్నాయి. అవి మనల్ని వెంటాడుతాయి. మనసుని మెలిపెడతాయి. మొత్తం కథ Come Japanese, First Night, Whites, Babies, Children, Traitors, Last Day, The Disappearence అనే ఎనిమిది భాగాల్లో చెప్పబడింది. మొదటి ఏడు భాగాలలోనూ జపనీస్ వనితల తరపున వినిపించిన కథ, ఆఖరి భాగంలో అమెరికన్స్ తరపున వినిపిస్తుంది. కథ ఒక్కో భాగంలో వాళ్ళ జీవితంలో ఒక్కో దశనీ, ఒక్కొక్కరి కథనీ ఒక చిన్నవాక్యంతో వివరిస్తూ కథ సాగుతుంది. ఏ పాత్రకీ పేర్లుండవు. అయితే హటాత్తుగా ఒక పాత్ర ముందుకొచ్చి తన కథని కాస్త వ్యక్తిగత స్థాయిలో చెపుతుంది, అదీ ఒకటి రెండు వాక్యాల్లోనే. అంతే, ఇక ఆమెని వదలి అక్కడినుండి ముందుకెళ్ళాలి అంటే మనవల్ల కాదు. ఒకటి రెండు వాక్యాల్లో ఒక గుండెని చిక్కబట్టే సంఘటనని చెప్పగలిగిన నైపుణ్యం చూడటం నావరకూ ఇదే మొదలు. కథనంలో అందాన్ని, శక్తినీ తెలుసుకోవాలంటే పుస్తకం నుండి కొన్ని వాక్యాలు చూడాలి.

**Come, Japanese!**

On the boat we were mostly virgins. We had long black hair and flat wide feet and we were not very tall. Some of us had eaten nothing but rice gruel as young girls and had slightly bowed legs, and some of us were only fourteen years old and were still young girls ourselves.

At night we dreamed of our husbands. We dreamed of new wooden sandals and endless bolts of indigo silk and of living, one day, in a house with a chimney. We dreamed we were lovely and tall. We dreamed we were back in the rice paddies, which we had so desperately wanted to escape.

**First Night**

That night our new husbands took us quickly. They took us calmly. They took us gently, but firmly, and without saying a word. They took us as we stared up blankly at the ceiling and waited for it to be over, not realizing that it would not be over for years.

They took us with more skill than we had ever been taken before and we knew we would always want them. They took us swiftly, repeatedly, and all throughout the night, and in the morning when we woke we were theirs.

**Whites**

We put away our mirrors. We stopped combing our hair. We forgot about makeup. Whenever I powder my nose it just looks like frost on a mountain. We forgot about Buddha. We forgot about God. We developed a coldness inside us that still has not thawed. I fear my soul has died.

We loved them. We hated them. We wanted to be them.

IT WAS THEIR WOMEN who taught us the things we most needed to know. How to light a stove. How to make a bed. How to answer a door. How to shake a hand. How to operate a faucet, which many of us had never seen in our lives. How to dial a telephone. How to sound cheerful on a telephone even when you were angry or sad. How to fry an egg. . How to wash a lipstick stain out of your husband's favorite white shirt even when that lipstick stain was not yours. How to talk to a husband. How to argue with a husband.

Without us, what would they do? Who would pick the strawberries from their fields? Who would get the fruit down from their trees? Who would wash their carrots? Who would scrub their toilets? Who would mend their garments? Who would iron their shirts? Who would fluff their pillows? Who would change their sheets? Who would cook their breakfasts? Who would clear their tables? Who would soothe their children? Who would bathe their elderly? Who would listen to their stories? Who would keep their secrets? Who would tell their lies? Who would flatter them? Who would sing for them? Who would dance for them? Who would weep for them ?

**Babies**

We gave birth under oak trees, in summer, in 113-degree heat. We gave birth beside woodstoves in one-room shacks on the coldest nights of the year. We gave birth on windy islands in the Delta six months after we arrived, and the babies were tiny, and translucent, and after three days they died. We gave birth nine months after we arrived to perfect babies with full heads of black hair.

We gave birth to babies that were American citizens and in whose names we could finally lease land.

We gave birth to babies with six fingers and looked the other way as the midwife began to sharpen her knife. You must have eaten a crab during your pregnancy. We contracted gonorrhea on our first night with our husband and gave birth to babies that were blind. We gave birth to twins, which were considered bad luck, and asked the midwife to make one a "day visitor."

**The Children**

THEY HAD THINGS to keep them safe. A red bottle cap. A glass marble. They had secret words that they whispered to themselves whenever they felt afraid. They had favorite sisters in whose arms they could instantly fall asleep. They had hated older brothers with whom they refused to be left alone in a room. He'll kill me. They had dogs from whom they were inseparable and to whom they could tell all the things they could not tell anyone else. I broke Papa's pipe and buried it under a tree. They had their own rules. Never sleep with your pillow facing toward the north. (Hoshiko had gone to sleep with her pillow facing toward the north and in the middle of the night she stopped breathing and died). They had their own rituals. You must always throw salt where a hobo has been. They had their own beliefs. If you see a spider in the morning you will have good luck.

Some of us preferred our daughters, who were gentle and good, and some of us, like our mothers before us, preferred our sons. They're the better gain on the farm. We fed them more than we did their sisters. We sided with them in arguments. We dressed them in nicer clothes. We scraped up our last pennies to take them to the doctor whenever they came down with fever, while our daughters we cared for at home.

If their pictures appeared at the end of the yearbook they pretended not to mind. "That's just the way it is," they said to themselves. And, "So what?" And, "Who cares?" cares?" Because they knew that no matter what they did they would never really fit in. We're just a bunch of Buddhaheads.

Still, they dreamed. One swore she would marry a preacher so she wouldn't have to pick berries on Sundays. One wanted to save up enough money to buy his own farm. One wanted to become a tomato grower like his father. ...And even though we saw the darkness coming we said nothing and let them dream on.

**Traitors**

What did we know, exactly, about the list? The list had been drawn up hastily, on the morning of the attack. The list had been drawn up more than one year ago. The list had been in existence for almost ten years….It was nearly impossible to get your name on the list. It was extremely easy to get your name on the list. The list was endless.

EVERY EVENING, at dusk, we began burning our things: old bank statements and diaries, Buddhist family altars, wooden chopsticks, paper lanterns, photographs of our unsmiling relatives back home in the village in their strange country clothes. I watched my brother's face turn to ash and float up into the sky.

WE FELT CLOSER to our husbands now, than we ever had before.

Now whenever I speak to someone, I have to ask myself, "Is this someone who will betray me?"

**Last Day**

Some of us left weeping. And some of us left singing. One of us left with her hand held over her mouth and hysterically laughing. A few of us left drunk. Others of us left quietly, with our heads bowed, embarrassed and ashamed.

Haruko left a tiny laughing brass Buddha up high, in a corner of the attic, where he is still laughing to this day. Takako left a bag of rice beneath the floorboards of her kitchen so her family would have something to eat when they returned.

One man left East First Street in Los Angeles with a white wooden box filled with his wife's ashes hanging from a silk sash around his neck. He talks to her all day long.

**A Disappearance**

IN AUTUMN there is no Buddhist harvest festival on Main Street. No Chrysanthemum Feast. No parade of bobbing paper lanterns at dusk. No children in long-sleeved cotton kimonos singing and dancing to the wild beating of the drums until late in the night. Because the Japanese are gone, that's all.

OUR MAYOR has assured us there is no need for alarm. "The Japanese are in a safe place," he is quoted as saying in this morning's Star Tribune. He is not at liberty, however, to reveal where that place is. "They wouldn't be safe now, would they, if I told you where they were." But what place could be safer, some of us ask, than right here, in our own town?

These are, the mayor reminds us, extraordinary times. We are part of the battle front now, and whatever must be done to defend the country must be done. "There will be some things that people will see," he tells us. "And there will be some things that people won't see. These things happen. And life goes on."

**Some Interesting Links:**

పిక్చర్ బ్రైడ్స్ గా వచ్చిన వారిలో జీవించి ఉన్న వారితో 1995 లో జరిపిన ఒక ఇంటర్వ్యూ ఇక్కడ చూడొచ్చు.



ఈ పుస్తకం గురించి రచయిత్రి తో ఇంటర్వ్యూ ఇక్కడ.

రచయిత్రి పరిచయం: Julie Otsuka కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన, అమెరికన్–జపనీస్ సంతతికి చెందినవారు. ఆమె ఫైన్ ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. 2002 లో 'When The Emperor Was Devine', 2011 లో 'Buddha in The Attic' అనే రెండు నవలలు వ్రాసారు. ఆమె రెండవ నవల వివిధ సాహిత్య సంఘాల నుండి గుర్తింపును అవార్డులను పొందింది. ఆమె కొన్ని పత్రికలకు కథలు, వ్యాసాలు కూడా వ్రాసారు. ఆమె రచనల గురించి మరిన్ని వివరాలు ఆమె వెబ్సైట్ లో చూడవచ్చు.

(Pictures Source: Internet; Nytimes.com)






# The Time Keeper

*"There is a reason why God limits our days. To make each one precious."*




కాలం మనిషికి దేవుడిచ్చిన వరం. అది ఎవరికోసమూ ఆగదు. నిరంతరం ముందుకు సాగుతూనే ఉంటుంది. దాన్ని వెనక్కితిప్పే శక్తి గానీ, ఆపే శక్తి గానీ ఎవ్వరికీ లేదు. అది అందరికీ తెలిసినా సరే, ప్రతీ వాళ్ళకీ కాలాన్ని వెనక్కి తిప్పెయ్యాలనో, లేదా ముందుకు పరిగెట్టించెయ్యాలనో ఎపుడూ ఆరాటమే. ఆ ఆరాటంలో మనిషికి జీవించడం మర్చిపోయి, కాలం వెంట పరుగులు తియ్యడంతోనే సరిపోతుంది. రోజుకి ఇరవైనాలుగు గంటలు కాదు, నలభై ఎనిమిది గంటలున్నా సరే సరిపోతాయని భరోసా లేదు. ఆ పరుగుల్లోనే మన జీవితం అంతా గడిచిపోయిందనీ, వెనక్కి చూసుకుంటే తలుచుకుని మురిసిపోడానికీ, అపురూపంగా తడుముకోడానికీ మనవైన క్షణాలని మూటగట్టుకోలేదనీ తెలిసేసరికి చాలా ఆలస్యం అయిపోతుంది.

గతం గతః అనో, గతము తలచీ వగచే కన్నా సౌఖ్యమే లేదనో ఎవరి అనుభవాన్ని బట్టి వాళ్ళు నిర్వచించారు. అయితే గతమెన్నడూ గడిచిపోయినది కాదు. అది మనిషికి తన జీవితంలో గడిచిన అనుభూతులతో, భవిష్యత్తు మీద ఆశనీ, వర్తమానాన్ని గడిపే బలాన్నివ్వాలి. లేదా గతంలోని అనుభవాలు పాఠాన్ని నేర్పి, జీవితాన్ని సరిగా నడిపించుకునే వివేకాన్ని కలిగించాలి. ఒక రేడియో ప్రోగ్రామ్లో వాఖ్యాత, ఎన్నో కష్టాలు, చేదు అనుభవాల తరువాత ఇపుడిపుడే సక్సెస్ పొందిన ఒక పాప్ గాయనిని ఇలా అడిగాడు. 'మీరు నడిచి వచ్చిన దురదృష్టకరమైన రోజులూ, దారులూ మీరు ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి సహాయపడ్డాయి అనుకుంటారా, లేక అవి తలుచుకోడానికి కూడా ఇష్టపడరా?' అని అడిగితే ఆమె 'ఆరోజులు నాకెంతో స్ఫూర్తినిస్తాయి. అవి నాకు భవిషత్తు మీద ఆశని కలిగించాయి. ఈరోజు ఈస్థితికి నేను చేరుకోడానికి ఆ వైఫల్యాలే కారణం. వాటికి నేనెంతో ఋణపడి ఉంటాను' అని చెప్పిన జవాబు నాకు చాలా ఆశ్చర్యాన్ని, ఒకరకమైన ఇష్టాన్ని కలుగచేసింది.

కాలాన్ని లెక్కలు వేసుకుంటూ మన చేతిలో ఉన్న క్షణాలని మరచిపోతున్నవాళ్ళకోసం, మార్చలేని గతం తలుచుకుని వగస్తూనో, తెలియని భవిష్యత్తు కోసం ఎదురుచూస్తూనో, మనం మలుచుకోగలిగిన వర్తమానం విలువ గుర్తించడంలేదనీ, మనం ఇష్టపడేవాళ్ళనూ మనల్ని ప్రేమించేవాళ్ళను నిర్లక్ష్యం చెయ్యకుండా ప్రతీ క్షణాన్నీ జీవితాన్ని సంతృప్తిగా మలచుకోవాలనీ గుర్తుచేస్తూ Mitch Albom వ్రాసిన పుస్తకం The Time Keeeper. 'ప్రతీ పనికీ ఓ సరైన సమయం ఉంటుంది. ఏదీ ముందూ కాదు, ఆలస్యమూ కాదు.

ప్రతీదానికీ ఓ కారణం ఉంటుంది. అది అర్ధం చేసుకుంటే అసంతృప్తులుండవు, చేజారిన క్షణాలుండవు' అంటూ మనిషికి కాలాన్ని లెక్కించడం అనేది శాపంగా ఎలా మారిందో, Father Time అనే అతని కథ ద్వారా చెపుతారు.

*"As mankind grew obsessed with its hours, the sorrow of lost time became a permanent hole in the human heart."*

అనగా అనగా ఇప్పటికి ఓ ఆరువేల ఏళ్ళకు ముందు డార్ అనే వ్యక్తి ఉండేవాడు. అతనే మొట్టమొదటగా టైం కనుక్కున్నవాడన్నమాట (Father Time). డార్, ఏలీ, నిమ్ ఈ ముగ్గురూ చిన్నప్పటి నుంచీ స్నేహితులు. చిన్నప్పటి నుంచీ డార్ కి, తను తీసుకునే వూపిరితో సహా ప్రతీదీ లెక్కపెట్టడం అలవాటు. డోర్ కి ఏంతో ఇష్టమయిన ఏలీతో పెళ్లయి, ముగ్గురు పిల్లలు పుట్టారు. వయసు పెరుగుతున్న కొద్దీ డోర్ కి అన్నిటినీ కొలిచే అలవాటు కూడా ఎక్కువయ్యింది. తనకి సంబంధించిన ప్రతీ విషయాన్ని, ఏదో ఒక లెక్కింపు తోనే గుర్తు పెట్టుకునేవాడు. ఎండా, నీడ, చీకటీ , వెలుతురూ, నీళ్ళూ ...ఒక్కటనేమిటి, కనిపించిన ప్రతీదాన్ని కొలవడం ఒక వ్యసనం అయిపోయింది. అందరూ అతన్ని పిచ్చోడు అనుకునేవారు. అతను నీడతో కాలాన్ని కొలవడం (సన్ డయల్), రాళ్ళను చెక్కి చంద్రుడిలో మార్పులు కొలవడం, గిన్నెకు చిల్లుపెట్టి నీళ్ళు కారుతుంటే సమయం లెక్కించడం లాంటి కొలత పనిముట్లు కనిపెట్టాడు.

నిమ్ తను కోరుకున్నట్టుగానే బలవంతుడయిన రాజయ్యాడు. అందర్నీ తన బానిసలుగా చేసుకున్నాడు. ప్రస్తుతం అతనికి స్వర్గానికి చేరగలిగేంత ఎత్తైన భవనం కట్టి, స్వర్గాన్ని కూడా ఆక్రమించుకోవాలన్న కోరిక. దానికోసం పగలూ రాత్రీ లేక్కలేనంతమంది బానిసలతో ఆ భవనం కట్టిస్తున్నాడు. నిమ్ కి డార్ దగ్గరున్న పనిముట్ల గురించి తెలిసింది. వాటితో తన భవనానికి ఇంకా శక్తి వస్తుందని, అవి తనకిమ్మని అడిగితే డార్ నిరాకరించాడు. అతనిని ఊరు విడిచి పొమ్మని ఆదేశించాడు నిమ్. డార్, ఏలీ ఇద్దరూ పిల్లల్ని డార్ తల్లిదండ్రుల దగ్గర వదిలేసి, ఊరవతల ఎక్కడో కొండల మీదకి వెళ్ళి ఉండసాగారు. అప్పుడు కూడా డార్ తన లెక్కలు మర్చిపోలేదు. రోజులు, నెలలు లెక్కిస్తూ కేలండర్ కూడా కనిపెట్టాడు.

కొన్నాళ్ళకు ఏలీ జబ్బు పడి, దానితో చాలా బాధపడి, క్షీణించి చివరి క్షణాల్లోకి చేరుకుంది. ఆమె బాధ చూస్తూ ఏమీ చెయ్యలేక డార్ బాధపడ్డాడు. అతనికి ఆమెని రక్షించుకోవాలంటే కాలాన్ని ఆపడమొక్కటే మార్గం అనిపించింది. నిమ్ కట్టిన భవనం మీదకి వెళ్ళి దేవుడితో మాట్లాడి కాలాన్ని ఆపమని అడగాలనుకుని, పరుగు పరుగున వెళ్ళి ఆ భవనం ఎక్కడం మొదలెట్టాడు. డార్ పరుగున వెళ్లడం చూసి, అక్కడున్న వేలమంది పనివాళ్ళూ స్వర్గం, భూమి కలిసే సమయం వచ్చేసిందేమో అని ఆత్రంతో మూకుమ్మడిగా తోసుకుంటూ ఎక్కడం మొదలెట్టారు. దానితో ఆ భవనం కంపించి, మొదలూ చివరా కాలిపోయి మధ్యభాగం ఒకటే గాలిలో వేలాడుతూ ఉండిపోయింది. అందరూ దానిమీద నుండి అన్నివైపులకీ విసిరెయ్యబడితే, డార్ విసురుగా ఒక పెద్ద చీకటి గుహలోకి విసిరేయబడ్డాడు.

ఏలీని రక్షించలేకపోయినందుకు బాధపడుతూ వెక్కి వెక్కి ఏడ్చాడు డార్. కొంచెం తేరుకుని చూసేటప్పటికి ఎదురుగా ఒక వృద్ధుడు కనిపించాడు. నువ్వు దేవుడివా అని డార్ అడిగితే, నేను దేవదూతను అని చెప్పాడు. 'నీకు తెలీకుండానే నువ్వు భూమి మీద ఉన్నప్పుడు ఒక పెద్ద తప్పుపని మొదలెట్టావు. అది నీ తరువాతి తరతరాల గతీ మార్చేస్తుంది. నీకు తెలీకుండా కాలాన్ని లెక్కించాలనీ, నీ అదుపులో ఉంచుకోవాలనీ అనుకున్నావు. ఒకసారి మనిషిలో రగిలిన కోరిక అక్కడితో ఆగకుండా, కార్చిచ్చులా చుట్టుముడుతుంది. అందులో చిక్కుకున్న మనిషి జీవించడం మర్చిపోతాడు. దీన్ని మొదలెట్టినందుకు ప్రతిగా నువ్వీ గుహలోనే ఉండు. నీకు చావు రాదు, ఆకలి దప్పులుండవు, వయసు పెరగదు.' అన్నాడు. 'నాకెందుకీ కోరని వరం' అన్నాడు డార్ దుఃఖంతో. 'పిచ్చివాడా ఇది వరం కాదు, శాపం. ముందుముందు నీకే తెలుస్తుందిలే' అన్నాడా దేవదూత. డార్ కన్నీళ్ళతో ఆ దేవదూత ఒక కొలను సృషించాడు. 'స్వర్గమూ భూమీ కలిసినప్పుడు నీకు విముక్తి

కలుగుతుంది. అప్పటివరకూ నువ్వు మొదలెట్టిన కాలాన్ని లెక్కించడం కలిగించే దౌర్భాగ్యాన్ని నీ చెవులారా విని తెలుసుకో' అని బదులిచ్చి మాయమయిపోయాడు దేవదూత.

ఆ గుహలోనుంచి బయట పడాలని డార్ విశ్వప్రయత్నాలు చేసాడు కానీ సాధ్యం కాలేదు. ఆ కన్నీళ్ళ కొలనులోనుంచి ఇంకా ఇంకా టైం కావాలని, ఉన్న టైం చాలడం లేదనీ, కాలాన్ని తొందరగా గడవమనీ, నెమ్మదిగా సాగమనీ ...ఇలా రకరకాలుగా వేడుకుంటూ, వాపోతూ వేలవేల గొంతులు వినిపించసాగాయి. డార్ చెవులు మూసుకున్నాకూడా వాటిని వినడం తప్పించుకోలేకపోయాడు. భార్యనీ పిల్లల్నీ తలుచుకుని కుమిలి ఏడ్చాడు. అతను ఆ గుహలో తన శాపవిమోచనం కోసం ఎదురు చూస్తూ, తన జీవితంలో తనవారితో గడిపిన ప్రతీ క్షణాలని గుర్తు చేసుకుంటూ, వాటిని ఆ గుహలో గోడల మీద బొమ్మల్లా గీసుకుంటూ, ఏడుస్తూ పిచ్చివాడిలా గడపసాగాడు. ఆ గుహలో పైనున్న ఒక రంధ్రంలోంచి చుక్కలుగా కారుతున్న నీరు, క్రిందపడిన నీరు ఘనీభవించి స్ఫటికలింగాలు (stalactites and stalagmites) ఏర్పడి, అవి నెమ్మదిగా కాలంతో పాటూ రెండు దిశల్లోనూ ఒకదాని వైపు ఒకటి పెరుగుతూ ఉన్నాయి.

*"Man invents nothing God did not create first."*




డార్ ఆ గుహలో కెళ్ళి ఓ ఆరువేల సంవత్సరాలు గడిచాయి. తన కథలో ఆఖరుగా, ఏలీ చివరి క్షణాలకు గుర్తుగా ఓ కన్నీటి బొట్టుని గోడ మీద గీసాడు. దాని తరువాత అతనికి ఇక జీవితం అంటూ ఏమీ లేదు. అపుడు ఆ దేవదూత మళ్ళీ వచ్చాడు. గోడ మీద డార్ గీసిన కన్నీటిబొట్టుని ముట్టుకుంటే, అది నిజమైన నీటిబొట్టుగా మారింది. అప్పటికి గుహలో పెరుగుతున్న స్ఫటికలింగాల మధ్య కేవలం సూది దూరేంత ఖాళీ మాత్రమే ఉంది. ఆ ఖాళీని ఆ కన్నీటిచుక్కతో మూసేసాడు. అపుడు అది బంగారురంగు ఇసుకతో ఉన్న ఒక చిన్న అవర్ గ్లాస్ గా మారిపోయింది. దాన్ని డార్ చేతిలో పెట్టి 'ఇందులో విశ్వంలోని క్షణాలన్నీ ఉన్నాయి. నువ్వు కాలాన్ని కంట్రోల్ చెయ్యాలని అనుకున్నావు కదా, నీకా శక్తి వస్తుంది. ప్రపంచంలోకి తిరిగి వెళ్ళు' అన్నాడు. దానికి డార్ 'ఇప్పటికే చాలా ఆలస్యమయింది. ఇంకెందుకూ' అని అడిగితే ' ఏదీ ఆలస్యమూ కాదు, ముందూ కాదు. ఎప్పుడు జరగాల్సింది అపుడే జరుగుతుంది. జీవితాన్ని అనుభవించకుండా కాలాన్ని లెక్కించడం నువ్వే మొదలు పెట్టావు. దాన్ని నువ్వు జీవితాన్ని సంతృప్తిగా గడపటానికి ఉపయోగించుకోలేదు. నీలాగే ఇంకా భూమి మీద చాలా మంది ఉన్నారు. వాళ్ళలో ఇంకా సమయం కావాలీ అనుకుంటున్నవాళ్ళని ఒకరిని, ఇక చాలు అనుకుంటున్నవాళ్ళని ఒకరినీ వెదుక్కో. వారికి ఇన్నేళ్ళలో నువ్వేం నేర్చుకున్నావో అది వాళ్ళకి నేర్పు. అపుడు నీకు విముక్తి కలుగుతుంది' అన్నాడు. వాళ్ళెవరో నాకెలా తెలుస్తుందీ అనడిగితే, వాళ్ళ దయనీయమైన గొంతులు విను, నీకే తెలుస్తుంది అన్నాడు. ఇది కూడా గుర్తుంచుకో. 'దేవుడు మనిషి జీవితకాలాన్ని నిర్ణీతం చెయ్యడానికి కూడా ఒక కారణం ఉంది. అది నీకింకా తెలియాల్సి ఉంది' అని చెప్పి మాయమయిపోయాడు.

ఇంతలో కొలను లోనుండి డార్ కి రెండు గొంతులు వినబడ్డాయి, ఒకటి ఒక వృద్ధుడిది 'ఇంకో జీవితకాలం' అనీ , 'దాన్ని ఆపెయ్యి' అంటూ ఓ అమ్మాయి గొంతూ వినబడ్డాయి. అతనికి ఏమీ అర్థం కాలేదు. ఇంతలో ఆ గుహా కొలనూ అన్నీ మాయమయి, ఒక సుడిగాలి అతన్ని చుట్టి విసిరేసింది. కళ్ళు తెరిచేసరికి అతను భూమి మీద ప్రస్తుతకాలంలో ఉన్నాడు. చేతిలో అవర్ గ్లాస్ అలానే ఉంది. అయితే

దాన్ని అడ్డంగా తిప్పి పట్టుకున్నప్పుడు అందులోని ఇసుక జారటం ఆగిపోడమే కాకుండా, చుట్టూ ఉన్న ప్రపంచమంతా ఎక్కడిదక్కడ దాదాపు స్థంబించిపోవడం గమనించాడు. మళ్ళీ దాని నిలువుగా చేస్తే యధావిధిగా అన్నీ కదలటం మొదలెట్టాయి. దాంతో తను ఆ అవర్ గ్లాస్ తో కాలాన్ని ఆపగలుగుతున్నాను అని అతనికి అర్ధం అయింది. తనకు కొత్తగా వచ్చిన కాలాన్ని ఆపగలిగే శక్తిని డార్ తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నాడు. కాలం కదలటం ఆపేసి, చుట్టూ ఉన్న పరిసరాల్నీ, మనుషుల్నీ పరిశీలించాడు. చదవటం, వ్రాయటం నేర్చుకున్నాడు. లైబ్రరీల్లో కూర్చొని చదివి మనిషి సాధించినవన్నీ తెలుసుకున్నాడు. తనకాలం నుండి ఇప్పటికి ప్రపంచం ఎంతో మారిందని అర్ధం చేసుకున్నాడు. ప్రపంచాన్ని గమనిస్తూ ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. ఎక్కడికెళ్ళినా అతన్ని గడియారాలని పరిశీలించే ఆసక్తి మాత్రం వదల్లేదు. కాలాన్ని కొలవడం తనే కనిపెట్టి ఉండొచ్చు కానీ తన తరువాత ఏందరో దాన్ని ఎన్నో రకాలుగా మార్చి, లెక్కలేనన్ని గడియారాలు కనిపెట్టారని అర్ధం అయింది. తను చేసిన దానికి వేల ఏళ్ళు గుహలో బందీ అయినట్టుగా, కాలాన్ని కొలిచే ప్రతీవాళ్ళకీ ఏదన్నా శిక్ష ఉండే ఉంటుందా అని అతనికి ఒక సందేహం వచ్చింది. అలా తిరుగుతూ అట్లాంటిక్ సముద్రపు ఒడ్డుకు చేరుకున్నాడు. అక్కడ గాలిలో అలలపై తేలుతూ దూరంనుండీ అతనికి గుహలో వినిపించిన వృద్ధుడి గొంతూ, అమ్మాయి గొంతూ వినిపించాయి. తను వెదుకుతున్నవాళ్ళు వాళ్ళిద్దరే అని అతనికి అనిపించింది. వెంటనే సముద్రంలోకి దూకి ఆ గొంతులు వినవచ్చిన దిశగా ఈదటం మొదలుపెట్టాడు. మరునిమిషంలో న్యూయార్క్ లో మన్ హాటన్ ఒడ్డున తేలాడు. ఈ కాలానికి తగినట్టు వేషం మార్చుకున్నాడు. తను సంపాదించిన జ్ఞానంతో ఒక పెద్ద గడియారాల షాపులో ఉద్యోగం సంపాదించుకున్నాడు. తను కలవాల్సిన ఇద్దరి కోసం ఎదురుచూడడం మొదలుపెట్టాడు.

*"Mankind is connected in ways it does not understand—— even in dreams."*

శారా (Sara Lemon) పదిహేడేళ్ళ అమ్మాయి. హైస్కూల్లో సీనియర్ ఇయర్ (12th) స్టూడెంట్. చదువులో చురుకైన, తెలివైన అమ్మాయి. ఆమె తల్లిదండ్రులు ఆమె చిన్నప్పుడే విడిపోయారు. తండ్రి వేరే పెళ్లి చేసుకుని దూరంగా వెళ్ళిపోతే, శారా తల్లి లోరేన్ తో ఉంటుంది. మొదట్లో శారా తల్లితో బాగానే ఉన్నా, పెద్దదవుతున్న కొద్దీ అందరు తల్లీకూతుళ్ళలాగే వీరిద్దరి మధ్యా దూరం పెరిగింది. లోరేన్ ఎంత ప్రేమగా ఉండాలని ప్రయత్నించినా శారా తల్లి పట్ల నిర్లక్ష్యంగానే ఉంటుంది. తల్లి మీద కన్నా సంవత్సరానికోసారి పలకరించని తండ్రి మీదే శారాకి ఆశ ఎక్కువ. తల్లి ఆమె స్నేహితులతో తండ్రి బాధ్యతారాహిత్యం మీద చేసే ఫిర్యాదులు అంటే శారాకి విసుగు. తండ్రి తమని వదిలెయ్యడానికి తల్లే కారణమేమో అనిపించేది శారాకి. శారా మిగిలిన అమ్మాయిలతో పోలిస్తే అందంగా ఉండదు. దానికి తోడు ఆమెది కొంచెం భారీకాయం. సాధారణంగా ఎక్కువ తెలివైన పిల్లల్ని గ్రూప్ లో దూరం పెట్టినట్టుగానే, శారాని కూడా క్లాస్లో అందరూ దూరం పెట్టారు. పైగా ఆమె ఆకారం మీద ఎదురుగానే జోక్స్ వేసి నవ్వుకునేవారు. దానితో స్కూల్లో కూడా ఎవరూ ఫ్రెండ్స్ లేకుండా శారా ఒంటరిగానే గడిపేది.

ఒక హోమ్ లెస్ షెల్టర్లో శారా వీకెండ్స్ లో వాలంటీర్ చేసేది. అక్కడకి వాలంటీర్గా వచ్చే, శారా స్కూల్లోనే చదివే ఈథన్ అనే అందమయిన అబ్బాయి పరిచయమయ్యాడు. మామూలుగా అయితే అంతటి అందగాడు, చలాకీ అయినవాడు అసలు శారాని కళ్ళెత్తి చూసుండేవాడు కాదు. అలాంటిది అతను పలకరించడం శారాకి అపురూపంగా అనిపించింది. అప్పటి నుండి ప్రతీవారం అతనితో మాట్లాడటం కోసం టైం ఎంత తొందరగా గడుస్తుందా అని ఎదురుచూడసాగింది. ఈథన్ సరదా మాటల బట్టి అతనికీ తనంటే ఇష్టమే అనుకుంది. ఒకసారి ఎక్కడైనా సరదాగా బయట కలుద్దామని అనుకున్నారు, కానీ కలవాల్సిన సమయానికి వేరే పని వల్ల రాలేనని ఈథన్ టెక్స్ట్ పంపాడు. అతన్ని కలవడానికి రోజులు, క్షణాలు లెక్కిస్తూ ఉన్న శారా నిరాశపడినా పడినా సర్దిపుచ్చుకుంది. ఎపుడూ లేనిది కూతురు శ్రద్ధగా తయారవడం, హడావిడి పడటం చూసిన తల్లికి అది బాయ్ ఫ్రెండ్ వ్యవహారం అని అర్ధమయ్యింది. శారా తల్లితో బాయ్ ఫ్రెండ్ విషయమే కాదు, అసలే విషయమూ చర్చించదు. తల్లికేమో కూతురు కూడా తనలా అయోగ్యుడిని ఎన్నుకోకూడదని కోరిక. ఆ తరువాత మళ్ళీ

కొన్ని రోజులకి, తన అంకుల్ షాప్ దగ్గరకు వచ్చి కలవమని శారాకి అడిగాడు ఈథన్. అక్కడ ఖాళీగా ఉన్న షాపులో ఇద్దరూ కాసేపు వోడ్కా తాగుతూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. ఈథన్ కొంచెం చనువు తీసుకుని ముద్దుపెట్టుకుంటే శారాకి బానే ఉన్నా, అతను ఇంకాస్త చొరవ తీసుకోబోతే వారించింది. ఒకసారి ఎపుడో ఈథన్ మాటల్లో ఒక సినిమాలో హీరో పెట్టుకున్న స్పెషల్ వాచ్ గురించి వర్ణించి చెప్పి, ఎప్పటికయినా అలాంటిది తానొకటి కొనుక్కోవాలని అనుకుంటున్నట్టు చెప్పాడు. అది గుర్తొచ్చి తొందరలో రాబోయే క్రిస్మస్ కి అతనికి ఇష్టమయిన వాచ్ బహుమతిగా ఇచ్చి ఆశ్చర్యపరచాలని అనుకుంది. క్రిస్మస్ కోసం ఆత్రుతగా ఎదురుచూడసాగింది.

*"Holding on to things will only break your heart."*

విక్టర్ ( Victor Delamonte) ఎనభయ్యారేళ్ళ వయసున్న బిజినెస్ మేన్. ప్రపంచంలోని అత్యంత ధనికుల జాబితాలో పద్నాలుగో స్థానంలో ఉన్నవాడు. అతను ఫ్రాన్స్లో ఒక పేదకుటుంబంలో పుట్టాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరూ చనిపోతే, అమెరికాలోని అతని అంకుల్ దగ్గరికి చేరాడు. దారిలో తినడానికి తెచ్చుకున్న రొట్టెలమూట కూడా ఓడలోని ఆకతాయిలు సముద్రంలోకి విసిరేస్తే కేవలం కట్టుబట్టలతోనూ, కాలే కడుపుతోనూ మిగిలిపోయినపుడు 'దేనితోనైనా ఎటాచ్మెంట్ పెంచుకుంటే దుఃఖం తప్పదు' అన్న పాఠం ఒంటబట్టింది. చదువుకుంటూనే స్కూలు రోజుల్నుంచే చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ, వాటి లాభాలతో రకరకాల క్రొత్త వ్యాపారాలు, పెట్టుబడులు మొదలు పెడుతూ, అంచెలంచెలుగా ఎదిగిపోయాడు. విస్తృతంగా పెరుగుతున్న వ్యాపారం, దేశదేశాల్లో ఇళ్ళూ, స్వంత జెట్ ప్లేన్స్ ... అతనికి దేనికీ లోటులేదు.

*"Time moved man further from the simple light of existence and deeper into the darkness of his own obsessions."*

విక్టర్ భార్య గ్రేస్, ఒకప్పుడు ఆమె అతని ఒక ఆఫీసులో చిన్న ఉద్యోగం చేసేది. ఆమెని ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడు. మొదట్లో ఇద్దరూ ఎంతో ప్రేమగా అన్యోన్యంగా ఉంటూ, అన్ని పనులూ కలిసి చేస్తూ, కలిసి సమయం గడుపుతూ ఉండేవారు. రానురానూ విక్టర్ వ్యాపారాలు పెరుగుతున్న కొద్దీ, అతను ప్రయాణాల్లోనూ ఆఫీసులోనూ ఎక్కువ సమయం గడపటం, వ్యక్తిగత జీవితం కన్నా వ్యాపారానికి ప్రాముఖ్యతనివ్వడంతో ఇద్దరూ కలిసి గడిపే సమయం తగ్గిపోయింది. పిల్లలు లేకపోవటం వారిద్దరి మధ్యా దూరాన్ని ఇంకా పెంచింది. విక్టర్ కు ఎనభై ఆరేళ్ళు నిండుతుండగా లివర్ కేన్సర్ అని తెలిసింది. డాక్టర్లు అతనికి ఓ రెండు నెలలు మాత్రమే టైం ఉందని చెప్పారు. గ్రేస్ దిగులు పడినా, విక్టర్ ఎదురుగా ధైర్యం తెచ్చుకుని అతనికి తోడుగా ఉంది. అయితే, విక్టర్ దేనికీ అంత తేలిగ్గా లొంగిపోయేరకం కాదు. తన బిజినెస్లో చేసినట్టుగానే, సరైన ఎత్తులతో ఆట నడపాలనుకున్నాడు. రోగానికి రేడియేషన్లూ, కీమోలూ చేయించుకున్నాడు, అయితే అవి కేన్సర్ ట్యూమర్ పెరగటాన్ని ఆపగాలిగాయి కానీ కిడ్నీలు పాడయ్యాయి. దానితో డయలేషన్ చేసుకోవాల్సి వచ్చింది. దానితో గంటలు గంటలు వృధాఅవ్వడం తట్టుకోలేకపోయాడు. ఇలా మామూలుగా అందరిలాగే ట్రీట్మెంట్ తీసుకుంటూ, ఏదో మహత్తు జరుగుతుందని వేచిచూస్తూ కూర్చుంటే తను ఎప్పటికీ మృత్యువుని గెలవలేను అని అతనికి అర్ధమయ్యింది. తను సంపాదించిన పేరు ప్రతిష్టలూ, అనుభవించాల్సిన బిలియన్ల ఆస్తులూ ఉండగా, అన్నేళ్ళు సుఖవంతమయిన జీవితం గడిపినా అతనికి అపుడే చనిపోవాలనిలేదు. ఇలా సాధారణ పద్ధతుల్లో కాకుండా ఇంకేం చెయ్యగలనా అని ఆలోచించసాగాడు.

అలా ఆలోచిస్తున్న విక్టర్ కు అమరత్వం పొందాలన్న ఒక మహత్తరమయిన ఐడియా వచ్చింది. దాని గురించి అతను సేకరించిన వివరాల్లో న్యూయార్క్ శివార్లలో ఉన్న ఒక క్రయోనిక్ సంస్థ (మానవ కళేబరాల్ని ఫ్రీజ్ చేసి భద్రపరచడం) అతన్ని ఆకర్షించింది. మరునాడే అక్కడికి వెళ్ళి ఆ సంస్థ డైరెక్టర్ జెడ్ ని కలిసాడు. అది ఒక వేర్ హౌస్ లాంటి బిల్డింగ్. లోపల ఒక ప్రక్క లాబ్లో శవాలని ఫ్రీజ్ చేస్తారు. వెనుక విశాలమయిన హాలులో వరుసగా పేర్చిన పెద్ద ఫైబర్ గ్లాస్ సిలెండర్స్ ఉన్నాయి. ఒక్కో సిలెండర్ లోనూ ఆరు శవాల చొప్పున

ఫ్రీజ్ చేసి భద్రపరిచారు. జెడ్ విక్టర్ కి తమ సంస్థ గురించి వివరాలు చెప్పాడు. ‘అక్కడ నివారణ లేని రోగాలతో చనిపోయిన శరీరాలని ఫ్రీజ్ చేసి, భద్రం చేస్తారు. ఎపుడో సైన్స్ అభివృద్ధి చెంది ఆ రోగాలకు మందులు కనుక్కున్నాక ఆ శరీరాన్ని మళ్ళీ అన్ ఫ్రీజ్ చేసి, జీవం పోసి ఆ రోగాన్ని ట్రీట్ చేస్తారు. అప్పుడపుడూ బంధువులొచ్చి విజిట్ చేసి వెళ్ళొచ్చు. అలా ఫ్రీజ్ చేసి ఉంచడానికి ఆ సంస్థ పెద్ద మొత్తంలో ఫీజు తీసుకుంటుంది.’ విక్టర్ కి ఆ ఐడియా నచ్చింది. తనొక్కొక్కడికే ఒక సిలెండర్ ప్రత్యేకంగా కొనుక్కునే ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఏర్పాటు గురించి గ్రేస్ కి కూడా చెప్పదలచుకోలేదు. ఆమెకు మతవిశ్వాసాలు ఎక్కువ. విధిని అధిగమించాలనుకోవడం అనే ఊహ కూడా ఆమె అంగీకరించలేదని అతనికి తెలుసు. తన ఫ్యూచర్ గురించిన ఏర్పాట్లు ఎవరికీ చెప్పకుండా తనే చేసుకోవాలనుకున్నాడు.

విక్టర్ కి ఏ విషయం లోనూ ఓడిపోవటం అనేది నచ్చదని గ్రేస్ కి తెలుసు. అయితే ఇపుడు మృత్యువుతో చేస్తున్న పోరాటంలో ఓటమి తప్పదనీ, అది అతన్ని అసహనానికి గురిచేస్తున్నదనీ ఆమెకు తెలుసు. రోజుకీ రోజుకీ పెరుగుతున్న అతని చిరాకు, ఇంట్లో ఉన్నా ఒంటరిగా తన ఆఫీసు రూమ్ తలుపులు మూసుకుని గడపటం చూస్తున్నా, తను మాత్రం సహనంగా ఉండి తమ ఇద్దరికీ మిగిలున్న కొద్ది రోజులయినా అతన్ని సంతోషంగా ఉంచాలి అని నిర్ణయించుకుంది. అయితే ఒంటరిగా అతను తన ఇంకొక జీవితం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నాడని ఆమె అస్సలు ఊహించలేదు. తన క్రొత్త జన్మ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న విక్టర్ కి ఇంకో ఐడియా వచ్చింది. తను చచ్చిపోయాక ఎలాగూ ఫ్రీజ్ చేస్తారు. అప్పటికి తన అవయవాలు ఫెయిల్ అయిపోతాయి. అంతవరకూ ఆగకుండా కొంచెం ఆరోగ్యంగా ఉండగానే ఫ్రీజ్ చేస్తే, తను మళ్ళీ లేచేసమయానికి బాగుపడే అవకాశాలు ఇంకా మెరుగ్గా ఉంటాయి కదా అనుకున్నాడు. వాళ్ళ లేబ్ కి మిలియన్ల డాలర్లు డొనేషన్ ఇస్తానని ఆశ చూపించి జెడ్ ను దానికి ఒప్పించాడు.

విక్టర్ కు రోజర్ అనే ఒక నమ్మినబంటు ఉన్నాడు. అతను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వామిభక్తి వీడడు. విక్టర్ ప్లాన్స్ తెలిసిన వ్యక్తి ప్రస్తుతానికి అతనొక్కడే. విక్టర్ తన ఆఫీసులో తనకి నమ్మకమయిన లాయర్లను కలిసి తన ప్లాన్ వివరించి, తను డిసెంబర్ 31న ఫ్రీజ్ చెయ్యబడటానికి నిర్ణయించుకున్నానని చెప్పాడు. గ్రేస్ జీవించి ఉన్నంతకాలం ఆమెకి ఏ లోటూ రాకుండా సరిపోయినంత ఆస్తి ఆమెకు వ్రాసి, తను తిరిగి వచ్చేసరికి మళ్ళీ తన ఆస్తుల మీద అధికారం తనకి చెందేలా ఏర్పాట్లు చేయించుకున్నాడు. అలానే తను బ్రతికుండగానే చనిపోయినట్టుగా చెప్పి, ఫ్రీజింగ్ కి తీసుకువెళ్ళడానికి ఒక నమ్మకమయిన డాక్టర్ని కూడా కుదుర్చుకున్నాడు. వీళ్ళందరికీ ఆ ఏర్పాట్లు చెయ్యడానికీ, ఎక్కడా నోరెత్తకుండా ఉండటానికి పెద్దమొత్తంలో ముట్టచెప్పాడు. గ్రేస్ కు తెలియకుండా ఇవన్నీ చేస్తున్నందుకు కొంచెం గిల్టీగా ఫీలయ్యాడు విక్టర్. ఒకసారి అంతా ఆమెకు చెప్పెయ్యాలనుకున్నాడు, కానీ మళ్ళీ మనసు మార్చేసుకున్నాడు.

ఒకరోజు విక్టర్ మన్ హాటన్ లోని ఒక గడియారాల షాపుకి వచ్చి, తనకి అత్యంత పురాతనమైన చేతిగడియారం ఒకటి, ఎంత ఖరీదైనదయినా సరే కావాలని అడిగాడు. తను ఫ్రీజ్ అయ్యేముందు దాన్ని ఆపేసి చేతికి పెట్టుకుని, మళ్ళీ లేచినపుడు దాన్ని తిరిగి పనిచెయ్యించాలని అతని కోరిక. షాపు యజమాని తమ సేల్స్ మేన్ ఒకరు వాటిల్లో నిపుణుడని చెప్పి, అతనిని లోపలనుంచి పిలిచి విక్టర్ కి ఏంకావాలో చూపించమన్నాడు. ఆ సేల్స్ మేన్ విక్టర్ అడిగిన దాని గురించి కళ్ళు మూసుకు ఆలోచిస్తుంటే, విక్టర్ అసహనం చూసి షాపు యజమాని ‘అతనికి ఏంటీక్ గడియారాల గురించి చాలా నాలెడ్జ్ ఉంది’ అన్నాడు. ‘అయినా సరే ఓ జీవితకాలం తీసుకోకండి దానికి. లేదా ఇంకో జీవితకాలం’ అని జోక్ చేసాడు విక్టర్. ఇంకో జీవితకాలం అన్నమాట వినగానే సేల్స్ మేన్ కళ్ళు టక్కున తెరుచుకున్నాయి. పదిహేడో శతాబ్దంలో తయారయిన ఒక అందమైన వాచీని చూపించాడు సేల్స్ మేన్. అది ఫ్రాన్స్ లో తయారు చెయ్యబడింది. విక్టర్ ‘నేను కూడా ఫ్రాన్స్ లోనే పుట్టాను’ అనగానే, ’నాకు తెలుసు’ అన్నాడు సేల్స్ మేన్. ’నీకెలా తెలుసు’ అంటే, ’నీ గొంతును బట్టి చెప్పాను’ అన్నాడు. తన ఉచ్చారణలో ఫ్రెంచ్ ఎక్సెంట్ లేదే అనుకున్నాడు విక్టర్, కానీ గడియారం గొడవలోపడి ఆ విషయం ఇక పట్టించుకోలేదు.

*“Sometimes, when you are not getting the love you want, giving makes you think you will.”*

శారా మన్ హాటన్ లోని అదే గడియారాల షాపుకి, ఈథన్ కోసం వాచ్ కొనడానికి వచ్చింది. షాపు యజమాని ఆమెకు సహాయం చెయ్యడానికి సేల్స్ మేన్ ని లోపలినుంచి పిలిచాడు. శారా తను ఎలాంటి వాచ్ కోసం చూస్తుందో చెప్పి, దాన్ని ఎవరికోసం కొనాలనుకుంటుందో, అతనికి అదెంత ఇష్టమో ఆగకుండా చెప్పసాగింది. హటాత్తుగా ఒక వాచ్ లోని పక్షులు గంట గడిచిన గుర్తుగా పాడటం మొదలెట్టాయి. ఆ శబ్దం చిరాకనిపించి శారా 'దాన్ని ఆపు' అని విసుగ్గా అరిచింది. ఆ మాట వినగానే సేల్స్ మేన్ కు తను వెదుకుతున్న రెండో వ్యక్తి ఆమే అని అర్థం అయింది. లోపలికి వెళ్ళి ఆమె అడిగినలాంటి వాచ్ తెచ్చి చూపించాడు. దాని ఖరీదెక్కువయినా అది చూసి ఈథన్ ఎంత సంతోషపడతాడో వూహించుకుని, దాన్ని కొని సంతోషంగా వెళ్ళిపోయింది. డార్ కి తను కలుసుకోవాల్సిన ఇద్దరు వ్యక్తులెవరో అర్థం అయిన తరువాత, ఇద్దరి జీవితాలనీ రోజూ దగ్గరగా గమనించడం మొదలుపెట్టాడు.

*"A heart weighs more when it splits in two; it crashes in the chest like a broken plane."*

శారా ఎదురు చూస్తున్న క్రిస్మస్ వచ్చింది. క్రిస్మస్ ముందురాత్రి ఈథన్ ను కలిసి తను కొన్న గిఫ్ట్ ఇవ్వాలనుకుంది. వాళ్ళు షాపులో కలిసిన దగ్గర్నుంచి అతను ఆమెని తప్పుకుని తిరుగుతున్నాడు. ఒక షాపు పార్కింగ్ లాట్లో శారాని కలవడానికి ఒప్పుకుని, తనకి వేరే పార్టీ ఉన్నందున తొందరగా వెళ్లిపోవాలని చెప్పాడు. శారా అతనికి తను తెచ్చిన బహుమతి ఇచ్చి, అతనంటే తనకి ఎంతిష్టమో, అతని మీద తనకున్న ఫీలింగ్స్ చెప్పబోయింది. ఆమె చెప్పడం పూర్తి కాకుండానే నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తుందా అన్నట్టు హేళనగా చూసాడు. అతని చూపు, ప్రవర్తనతో ఆమెకి విపరీతమయిన అవమానం, దుఃఖం కలిగాయి. ఉన్నట్టుండి హఠాత్తుగా మాయమైపోవాలనీ, భూమిలోకి కూరుకుపోవాలని అనిపించింది ఆమెకు. ఈథన్ ఆమె ఇచ్చిన బహుమతి విప్పి చూడకుండానే తిరిగి ఇచ్చేసి, ఆమెకు ఇంకేమీ మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే వెళ్ళిపోయాడు. మళ్ళీ అతను తనని కలవడనీ మాట్లాడడనీ ఆమెకు అర్థమయ్యింది. మళ్ళీ ఆమెకు తను ఒంటరిని, తండ్రితో సహా ఎవరికీ తను అక్కర్లేదు అన్న భావం క్రుంగదీసింది. అక్కడే ఆ చీకట్లో, చలిలో పార్కింగ్ లాట్ నేల మీద కూలబడి వెక్కివెక్కి గుండెలవిసేలా ఏడ్చింది. ఎప్పటికో నెమ్మదిగా లేచి ఈడ్చుకుంటూ ఇంటికి వెళ్ళి ఏడ్చి ఏడ్చి ఎప్పటికో నిద్రపోయింది. ఇంటికి వచ్చేటప్పటికి తల్లి ఇంట్లో లేకపోవడం శారాకి కొంత వూరటనిచ్చింది.

మరుసటిరోజు మళ్ళీ రాత్రి జరిగినది గుర్తుకు వచ్చి దుఃఖం వచ్చింది. ఈథన్ కి ఉత్తరం వ్రాసి తనకి ఇంట్లో ప్రాబ్లెంస్ వలన తను సరిగా లేననీ, తనతో ఏం మాట్లాడిందో గుర్తు లేదనో ఏదో చెప్పి సారీ చెప్పాలని అనుకుంది. దానితో అతను మళ్ళీ స్నేహంగా మాట్లాడతాడని అనుకుంది. అతని ఫేస్ బుక్ నుంచి ప్రైవేట్ మెసేజ్ పంపుదామని, అతని ఫేస్ బుక్ పేజ్ లోకి వెళ్ళింది. అక్కడ అతని లేటెస్ట్ పోస్ట్ చూసిన ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగి, వొళ్ళంతా ఏదో సిక్ ఫీలింగ్ ఆవరించింది. ఆ పోస్ట్ లో 'శారా ఈరోజు నాతో నాటకం ఆడబోయింది. పోన్లే కదా అని ఎవరితోనన్నా మనం మంచిగా ఉంటే ఇలానే జరుగుతుంది.' అని హేళనగా వ్రాసాడు ఈథన్. దానికి జవాబుగా చాలామంది వ్యంగ్యంగా, చులకనగా ఆమె గురించి కామెంట్స్ వ్రాసారు. తనే మొదట చనువు తీసుకుని ఆమెను ముద్దుపెట్టుకున్న ఈథన్, తన గురించి అంత నీచంగా వ్రాయటం శారా వూహించలేకపోయింది. అంతే కాకుండా స్కూల్ మొత్తం అందరికీ కూడా విషయం తెలిసింది. అందరూ తనని ఇంకా చులకనగా చూస్తారు. శారాకి ఇక తను మళ్ళీ ఆ స్కూల్ కి వెళ్ళలేననీ, వాళ్ళెవరి ఎదుటా పడలేననీ అర్థమయ్యింది. దానితో తన జీవితం ముగిసిపోయింది అనుకుంది. పిచ్చిపిచ్చిగా ఏడ్చింది. తనేం చెయ్యాలో ఎప్పుడు చెయ్యాలో ఆమె నిర్ణయించుకుంది

న్యూ ఇయర్ ఈవ్ వచ్చింది. బయటకి తనది సహజమరణంలా కనిపించాలని విక్టర్ కొన్నాళ్ళనుండీ డయాలసిస్ ఆపేసాడు. దానితో రోగం లక్షణాలన్నీ తిరగబెట్టాయి. నీరసపడి మంచం మీదే ఉన్నాడు. ప్రతీ సంవత్సరం విక్టర్ గ్రేస్ కలిసి ఒక ఛారిటీ సంస్థ చేసే వేడుకలకి వెళ్ళి పెద్ద మొత్తంలో వారికి విరాళం ఇస్తుంటారు. ఈ సంవత్సరం ఎవరిచేతైనా విరాళం పంపిద్దాం అన్న గ్రేస్ తో, 'లేదు నువ్వే వెళ్ళి స్వయంగా ఇస్తే నాకు తృప్తి. తరువాత కూడా ఈ సాంప్రదాయాన్ని నువ్వే సాగించాలి' అని చెప్పి బలవంతంగా ఆమెని వెళ్ళడానికి

ఒప్పించాడు. అయిష్టంగానే బయలుదేరిన ఆమెతో 'నువ్వొచ్చే వరకు నేనిక్కడే ఉంటాను. నాకేమీ పర్లేదు, నువ్వెళ్ళి రా' అని పంపించాడు. అయితే విక్టర్ అసలు ప్లాన్ వేరు. ఆమె బయటకి వెళ్ళగానే రోజర్ అతన్ని క్రయోనిక్ లాబ్ దగ్గరికి తీసుకు వెళతాడు. అప్పటికే డాక్టర్, లాయర్, జెడ్ అందరూ అతన్ని బ్రతికుండగానే ఫ్రీజ్ చెయ్యడానికి ఏర్పాట్లతో ఎదురుచూస్తూ ఉంటారు. గ్రేస్ తో అబద్ధం చెప్పినందుకు కొంచెం బాధగా, గిల్టీగా అనిపించింది. కానీ తను ఎదురు చూస్తున్న  సమయం వచ్చింది. ఇక ప్లాన్ అమలులో పెట్టడమే మిగిలింది. రోజర్ని పిలిచి నెమ్మదిగా చెవిలో ఏదో చెప్పి 'అర్ధమయ్యింది కదా! అదేగనక జరిగితే నువ్విక  ఏమీ సందేహించొద్దు' అని చెప్పాడు.  రోజర్ అతన్ని బెడ్ తో సహా వేన్ లో పడుకోపెట్టి, క్రయోనిక్స్ వేర్ హౌస్ దగ్గరకు తీసుకువెళ్ళాడు. అతన్ని గమనిస్తున్న డార్ కూడా వాళ్ళని అనుసరించాడు. అక్కడ అందరూ కలిసి విక్టర్ ని ఫ్రీజింగ్ కోసం ఐస్ టబ్ లో పెట్టడానికి మంచం మీదనుంచి ఎత్తబోతుండగా డార్ అవర్ గ్లాస్ ని ప్రక్కకు వంచాడు. దానితో కాలం స్థంబించి ఎక్కడివారక్కడే శిలల్లా ఉండిపోయారు.

*"Hurting ourselves to inflict pain on others is just another cry to be loved."*

న్యూ ఇయర్ ఈవ్... లోరేన్ తన స్నేహితురాళ్ళతో కలిసి న్యూ ఇయర్ పార్టీ కి వెళ్ళడానికి తయారవుతోంది. ఆమెకు  వెళ్లడం ఇష్టం లేదు, కానీ స్నేహితురాళ్ల బలవంతం మీద వెళ్లడం తప్పటం లేదు. శారా తను ఒంటరిగానే ఉండాలని అనుకుంటున్నట్టు చెప్పింది.  సరే తొందరగా వచ్చేస్తాను, రేపు మనిద్దరం కలిసి గడుపుదాం అని చెప్పి లోరేన్ వెళ్ళింది. తల్లి వెళ్ళిన తరువాత శారా గరాజ్ లోకి వెళ్ళి, కారు తలుపులూ కిటికీలు మూసేసి ఇంజన్ ఆన్ చేసింది. ఇంజన్ వదిలే కార్బన్ మోనాక్సైడ్ వల్ల చనిపోవాలని ఆమె ప్రయత్నం. బాధగా కళ్ళు మూసుకుని నిట్టూర్చింది. ఆమెకు ఈథన్ గుర్తొచ్చాడు. తను చనిపోయాక అతను తప్పక బాధ పడతాడు, తనవల్లే అని గిల్టీ ఫీలవుతాడు అని అనుకుంది. నెమ్మదిగా ఆమెకు దగ్గు మొదలయ్యి అది ఎక్కువయింది. కొంచెం కొంచెం మత్తుగా కళ్ళు మూతపడటం మొదలవుతుండగా గరాజ్ నుండి ఎవరో వ్యక్తి అరుస్తూ ఆమె దగ్గరికి రావడం ఆమెకి లీలగా తెలిసింది.

డార్ కార్ తలుపులు తీసి, ఆమెని ఎత్తుకుని గబగబా నడవడం మొదలుపెట్టాడు. అతనికి చాలా కోపం గానూ. నిస్పృహ గానూ ఉంది. తనని మళ్ళీ భూమి మీద పంపింది ఈ ఇద్దరూ అలా చచ్చిపోతుంటే చూడ్డానికి మాత్రం కాదు అనుకున్నాడు. కానీ తాను ఏం చెయ్యగలడో తెలీటం లేదు. శారాని చూస్తే అతనికి జాలేసింది. అతనికి 'అన్నిటికీ సరైన సమయం ఒకటుంటుంది' అన్న దేవదూత మాటలు గుర్తొచ్చాయి. బహుశా అది ఇదేనేమో అనుకున్నాడు. శారాని విక్టర్ ఉన్న వేర్ హౌస్ లోకి తీసుకెళ్ళి ఒక గోడకు ఆన్చి కూర్చోబెట్టాడు. లాబ్ లోకి వెళ్ళి విక్టర్ ని బయటకు మోసుకొచ్చి, శారా దగ్గరగా పడుకోపెట్టాడు. అవర్ గ్లాస్ కు రెండు ప్రక్కలా సపోర్ట్ గా ఉన్న రాడ్స్, ఒక్కోకటీ ఇద్దరి చేతుల్లోపెట్టి వారి గుప్పిట మూసాడు.  అవర్ గ్లాస్ లో ఉన్న బంగారు రంగు మెత్తటి ఇసుక ఈ విశ్వంలోని అన్ని క్షణాలకు ప్రతీక అయితే, క్రింద భాగంలో పడిన ఇసుక గడిచిపోయిన క్షణాలు. పై భాగంలో ఉన్నవి ముందు ముందు రాబోయే కాలం. మధ్యనున్న అతి సన్నని జాయింట్ నుండి ఒక్కోటిగా క్రిందకి జారుతున్నవి ప్రస్తుత క్షణాలు. ఇద్దరినీ రక్షించాలి అంటే గడుస్తున్న క్షణాలని ఆపడమే మార్గం అని డార్ కి తోచింది. వెంటనే అవర్ గ్లాస్ పై భాగాన్ని ఓపెన్ చేసి, చెయ్యి లోపలికి పెట్టగానే అతి సన్నని పుల్లల్లా మారిన చేతివేళ్ల సాయంతో క్రిందకు జారిపడబోతున్న ఇసుకరేణువుని పట్టుకున్నాడు. విశ్వంలోని ప్రతీ అణువూ ఆ క్షణం దగ్గర పూర్తిగా స్థంభించిపోయింది.

*"When we are most alone is when we embrace another's loneliness."*

శారాకి మెలకువ వచ్చేసరికి తనెక్కడుందో ఆమెకి  అర్ధం కాలేదు. చేతిలో ఏదో తగిలితే కార్ స్టీరింగ్ అనుకుంది, కానీ అదొక అవర్ గ్లాస్ హేండిల్. ప్రక్కన ఒక వృద్ధుడు నేల మీద పడుకుని కనిపించాడు. ఆ పెద్ద హాల్లో వరుసగా పెద్ద పెద్ద గ్లాస్ సిలెండర్లు.

ఆమెకు భయం వేసింది. నెమ్మదిగా లేచి నిలబడింది, కానీ కాళ్ళకు నేల తగలటం లేదు. ప్రక్కనే ఉన్న గదిలోకి వెళ్ళింది. అక్కడ నలుగురు మనుషులు పోస్టర్లో ఉన్నట్టు ఫ్రీజ్ అయి ఉన్నారు. బయటకు వెళ్ళి చూస్తే రోడ్డు మీద కార్లూ, మనుషులూ, పడుతున్న స్నో అన్నీ ఎలా ఉన్నవి అదే పొజిషన్లో ఆగిపోయి ఉన్నాయి. ఆమెకు తను చనిపోయిందో బ్రతికుందో అర్థం కాలేదు. భయపడి వెనక్కి హాల్లోకి వస్తే, ఆ వృద్ధుడు లేచి తిరుగుతూ కనిపించాడు.

విక్టర్ మెలకువలోకి వచ్చేసరికి తనెక్కడున్నాడో అర్థం కాలేదు. తన మంచం రైలింగ్ ని పట్టుకోవాలని ప్రయత్నించాడు, కానీ అతని చేతిలో ఉన్నది వింతగా ఉన్న అవర్ గ్లాస్ రాడ్. తలెత్తి చూస్తే శవాలున్న సిలెండర్స్ కనిపించాయి. తనుండాల్సింది అందులో కదా అనుకున్నాడు. అతనికి తన శరీరం ఎంతో తేలిగ్గా అనిపించింది. దేన్ని ముట్టుకున్నా స్పర్శ తెలీటం లేదు. అపుడే తను ఫ్రీజ్ అయిపోయి తన ఆత్మ ఏమన్నా బయట తిరుగుతోందా అనుకున్నాడు. ఇంతలో ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని, నువ్వెవరు అంటే నువ్వెవరు అని ప్రశ్నించుకున్నారు. 'నేనేక్కడున్నాను, ఇక్కడికెలా వచ్చాను' అని అడిగిన శారాకి 'ఇది మనుషుల్ని ఫ్రీజ్ చేసే దాచే లేబరేటరీ' అని దానిగురించి చెప్పాడు. 'నువ్వు కూడా అందుకే వచ్చావా ఇక్కడికి? అసలు నువ్వు ఎందుకు ఫ్రీజ్ అవ్వాలనుకున్నావు?' అని అడిగిన శారాకి విక్టర్ తన కథ చెప్పాడు. శారాకి వింతగానూ భయంగానూ అనిపించింది. నువ్వు ఈ సంగతి నీభార్యతో చెప్పలేదూ కదూ అని అడిగిన శారాని చూసి విక్టర్ ఆమె చాలా తెలివైనదని గ్రహించాడు. విక్టర్ తో మాట్లాడుతుంటే ఆమెకు తన తండ్రితో మాట్లాడినట్టు అనిపించింది. ఆమె కూడా తన కథ చెప్పింది, అయితే తను చనిపోడానికి ప్రయత్నించినట్టు మాత్రం చెప్పలేదు. మరి ఇక్కడికెలా వచ్చావు అని విక్టర్ అడిగితే, తనని ఒక వ్యక్తి మోసుకుని వెళ్లటం గుర్తుందనీ, అతన్ని ఒక వాచ్ షాప్ లో చూసిన గుర్తనీ చెప్పింది.

ఈలోగా ఏదో శబ్దం వినిపించి చూస్తే సిలెండర్ల వెనుక పడిఉన్న డార్ కనిపించాడు. అతనికి విపరీతమయిన నీరసంగా ఉండి బాగా దగ్గు రాసాగింది. వేల ఏళ్ళల్లో అతను ఇదే మొదటిసారి దగ్గటం. అతని వేళ్ళు మామూలుగా అయిపోయాయి. మూసిఉన్న గుప్పిటలో ఇసుక రేణువు భద్రంగా ఉంది. 'నువ్వెవరు? మేమిక్కడికెలా వచ్చాము? మాకేమయ్యింది? మేము బ్రతికున్నామా, చనిపోయామా' అని వారిద్దరూ అడిగిన ప్రశ్నలకు డార్ తన చేతిలో ఉన్న ఇసుకరేణువు చూపించి 'మీరిద్దరూ చచ్చిపోలేదు. ఇదుగో, ఈ క్షణంలో మీరిద్దరి జీవితాలు ప్రస్తుతానికి స్థంబించిపోయి ఉన్నాయి. మీ ఇద్దరినీ నేనే ఇక్కడికి తెచ్చాను. ఇప్పటి వరకూ జరిగినదాన్ని ఎవరమూ మార్చలేము. తరువాత ఏం జరుగుతుందీ అనేది ఇంకా వ్రాయబడలేదు.' అని చెప్పాడు. అతనికి సడెన్గా అతని కొడుకు చిన్నప్పుడు అమాయకంగా 'ఫ్యూచర్లో జరగబోయేది తనకి నచ్చనట్టయితే, దాన్ని విసిరేస్తాను' అన్న మాట గుర్తొచ్చింది. వెంటనే అతనికి తనేం చెయ్యాలో తెలిసింది. అవర్ గ్లాస్ పై మూత తీసి, అందులో ఉన్న ఇసుకంతా నేల మీద పోసాడు. సృష్టిలో ముందుముందు గడవాల్సిన క్షణాలన్నీ పెద్ద ఇసుక కుప్పలా బయటపడ్డాయి. అవర్ గ్లాస్ ని నేల మీద పడుకోబెడితే అది పెద్ద టన్నెల్ గా మారిపోయింది. ఆ ఇసుక మీదుగా నడిచి ఆ టన్నెల్ లోకి వెళ్ళి ఫ్యూచర్ లోకి చూడమని శారాకి చెప్పాడు.

*"We all yearn for what we have lost. But sometimes, we forget what we have."*

శారా తనతో విక్టర్ ని కూడా తనతో రమ్మని అడిగింది. విక్టర్ డార్ చెప్పేది ఏదీ నమ్మలేదు. అదంతా ఎవరో తన ప్లాన్ పాడుచెయ్యడానికి చేస్తున్న పని అనుకున్నాడు. కానీ శారా మరీ మరీ అడగటంతో కాదనలేక పోయాడు. శారా విక్టర్ చేయి గట్టిగా పట్టుకోగా, బంగారురంగులో మెరుస్తున్న ఇసుక మీదుగా నడుస్తూ ఆ టన్నెల్ లో శూన్యం లోకి నడుస్తూ వెళ్లారు. అలా లోపలికి వెళ్ళిన తరువాత ఒక షాప్ కనిపించింది. అది ఈథన్ అంకుల్ షాప్ అని శారా గుర్తు పట్టింది. అక్కడ ఈథన్, ఒక అమ్మాయీ ఉన్నారు. ఆ అమ్మాయి 'అందరూ శారా విషయంలో నీదే తప్పు అని అనుకోడం చాలా అన్యాయం' అని అంటే, ఈథన్ 'నాకు తెలుసు. అంతా ఆమెదే తప్పు. అదంతా నా

ప్రమేయం లేకుండానే జరిగింది.' అన్నాడు. తరువాత ఇద్దరూ సరదాగా ఉండటం చూసిన శారాకు గుండెల్లో గుచ్చినట్టూ బాధ కలిగింది. అతని మీద తన ప్రేమని చెప్పినప్పుడు అతనెలా చులకనగా తీసిపారేసాడో, అలాగే తన చావు కూడా అతనిని ఏమీ తాకలేదని, తను అనుకున్నట్టుగా తన చావుకి అతనేమీ బాధపడటం లేదనీ తెలిసి విపరీతమయిన బాధ కలిగింది. ఈలోగా అక్కడి సీన్ మారి శారా వాలంటీర్ చేసే హోమ్ లెస్ షెల్టర్ కనిపించింది. అక్కడికి ఎపుడూ ఆహారం కోసం వచ్చే ఓ వృద్ధుడు, అక్కడ సర్వ్ చేస్తున్న ఆమెను 'శారా ఎక్కడ? ఆమెను ఈమధ్య కనిపించలేదు' అని అడిగితే ఆమె 'శారా గురించి మాకెవరికీ ఏ కబురూ తెలీలేదు' అని చెప్పింది. ఆయన 'శారా మంచి పిల్ల. ఆమె క్షేమంగా ఉండాలని ప్రార్ధిస్తాను' అని అక్కడ హాల్లో కూర్చున్న మిగిలిన హోమ్ లెస్ జనాల దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు. ఉండటానికి ఇల్లు, తిండీ లేకపోయినా కూడా ఏదోలా బ్రతుకు సాగిస్తున్న వాళ్ళను చూసి శారాకి సిగ్గనిపించింది. వారానికి ఒకసారి వెళ్ళి వాళ్లకి ఫుడ్ సర్వ్ చేసే తనగురించి పట్టించుకుంటారనీ, ఈథన్ కన్నా ఎక్కువగా వాళ్ళు ఆమె గురించి తలుచుకుంటారనీ కానీ ఆమె వూహించలేదు. ఆమెకు తన తల్లి గుర్తొచ్చింది.

మళ్ళీ అక్కడ సీన్ మారి, ఇపుడు ఒక కార్ డీలర్షిప్ కనిపించింది. పార్కింగ్ లాట్లో ఉన్న శారా అంకుల్ కార్లో లోరేన్, శారా అంకుల్ మార్క్ కూర్చుని ఉన్నారు. వాళ్ళు శారా ఆత్మహత్యకు ప్రయత్నించిన కారుని అమ్మడానికి వచ్చారు. లోరేన్ ఆ కారుని మళ్ళీ చూడటానికి ఇష్టపడలేదు, కానీ ఆమె సంతకం లేనిదే కుదరకపోవడం వలన ఆమె రావలసి వచ్చింది. ఆమె ఉబుకుతున్న కన్నీళ్ళను బిగబట్టి, పేపర్స్ మీద సంతకం చేసి, సేల్స్ మేన్ ఆ కారుని తీసుకుని వెళుతుంటే అది కనిపించినంతవరకూ కన్నీళ్ళతో చూస్తూ కూర్చుంది. శారాకి తను అలా ఏడ్చినపుడల్లా తల్లి తనని దగ్గరకి తీసుకుని ఓదార్చి ధైర్యం చెప్పటం గుర్తొచ్చింది. తల్లి ఎన్ని చికాకుల్లో బాధల్లో ఉన్నా, తనకోసం మాత్రం ఎపుడూ టైం కేటాయించడం కూడా గుర్తొచ్చింది. లోరేన్ 'నేను ఎక్కడికీ వెళ్ళకుండా ఉండాల్సింది. శారా ఎందుకిలా చేసింది? నాకేమాత్రమూ అనుమానం రాలేదేందుకు? నేను తన తల్లిని, కానీ తన బాధ తెలుసుకోలేకపోయాను. ఇది నా తప్పే' అని వెక్కి వెక్కి ఏడుస్తుంటే, మార్క్ ఆమెని ఓదారుస్తున్నాడు. శారాకి దుఃఖం తన్నుకొచ్చింది. తను తన దుఃఖాన్నుండి తప్పించుకోవాలని అనుకుందే కానీ, అది తనని ప్రేమించినవాళ్ళకి ఎంత దుఃఖాన్నిస్తుందో ఆలోచించలేకపోయినందుకు బాధపడింది.

*"Ends are for yesterdays, not tomorrows."*

డార్ శారాని 'ఎందుకు నువ్వు చనిపోవాలనుకున్నావు? ఎందుకు నీ వాళ్ళని బాధపెట్టలనుకున్నావు?' అని అడిగాడు. శారా తన ఒంటరితనం, ఈథన్ వల్ల కలిగిన అవమానం చెప్పింది. అపుడు డార్ ఆమె కళ్ళ మీద చెయ్యి పెట్టి మూసి, తాను గుహలో ఉన్న దృశ్యం చూపించాడు. 'అది తనే అనీ, ప్రేమించిన భార్య లేకుండా ఒంటరిగా అక్కడ అనాది నుండీ ఉన్నాననీ, ఈ సృష్టిలో తనను మించిన ఒంటరి ప్రాణి లేదనీ, అయినా ప్రాణం తీసుకోడానికి ప్రయత్నించలేదనీ, ఎందుకంటే అది మనది కాదు' అని చెప్పాడు. 'ఈ బాధ ఎన్నాళ్లకు తగ్గుతుందీ' అని అడిగిన ప్రశ్నకు 'కొన్ని బాధలు ఎప్పటికీ తగ్గవు. అయినా నీకు ఇంకా చాలా బ్రతుకు ముందుంది. నువ్వు అది అక్కరలేదనుకున్నావు. కానీ నిన్ను కావాలనుకున్నవాళ్ళు ఉన్నారు. అది తెలుసుకోవాలి. నీకక్కర్లేదని వెనక్కి ఇవ్వాల్సింది నీ బ్రతుకు కాదు. ఏమో ఏ నిమిషంలో నువ్వు కోరుకుంటుంది జరుగుతుందో నీకేం తెలుసు. భవిష్యత్తు కలిగించే ఆశని తిరస్కరించకూడదు.' అని చెప్పాడు. శారాకి తను చేసిన పనికి సిగ్గనిపించింది. 'నాకు అప్పటితో అన్నీ ముగిసిపోయాయి అనిపించింది' అంది శారా. 'ముగిసిపోయినవి కేవలం నిన్నలు మాత్రమే. రేపటిరోజులు కాదు. నువ్వు సాధించాల్సినవి చాలా ఉన్నాయి. అవేమిటో చూడాలని ఉందా?' అన్నాడు డార్. 'ఊహూ, ఇప్పుడే వద్దు' అంది శారా. శారా నెమ్మదిగా బాధ లోంచి బయటపడే దారిలో ఉందని గుర్తించి డార్ తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

అంతసేపూ విక్టర్ ఇద్దరినీ గమనిస్తూ ఉన్నాడు. అతనికి శారా మీద అభిమానమూ జాలీ కలిగాయి. 'పిచ్చిపిల్ల ఒక పనికిరానివాడి ప్రేమకోసం ప్రాణాలు తీసుకోవాలనుకుంది, మంచిదయింది ఇప్పటికయినా తెలిసింది ఆమెకి. నేనయితే ఎపుడో చెప్పుండేవాడిని 'ఏ ప్రేమకీ మన ప్రాణాలు తీసుకునేంత విలువలేదు అని' అనుకున్నాడు. గ్రేస్ అయితే తను చేసినవన్నీ తెలిసికూడా ప్రాణాలు తీసుకుని ఉండేదా అనుకున్నాడు. అయితే జరుతున్నవీ, తను చూస్తున్నవీ ఏదో భ్రమ అన్న ఉద్దేశ్యంలోనే ఉన్నాడు ఇంకా. డార్ క్రమక్రమంగా నీరసించడం, వూపిరి తీసుకోవడం కూడా కష్టం కావడం గమనించాడు. డార్ విక్టర్తో నీకు కూడా నేనొకటి చూపించాలి అన్నాడు. విక్టర్ మొదట అడ్డుచెప్పినా, శారాతో కలిసి ఇసుకలోంచి టన్నెల్ లోపలి ఫ్యూచర్ లోకి నడిచాడు.

మొదట వాళ్ళకి క్రయోనిక్స్ వేర్ హౌస్ కనిపించింది. జెడ్ గ్రేస్ ని తీసుకుని లోపలి వచ్చి ఒక సిలిండర్ చూపించాడు. గ్రేస్ నమ్మలేనట్టుగా మొహాన్ని చేతులతో మూసుకుంది. అది భయమో, అసహ్యమో విక్టర్ కి తెలియలేదు. జెడ్ 'విక్టర్ తనకి ప్రత్యేకంగా ఒకటి కావాలని అడిగాడు. సారీ, తను మీకు చెప్పలేదని నాకు తెలియదు' అని చెప్పి మీరు కొంతసేపు ఒంటరిగా ఉండొచ్చు అని వెళ్ళిపోయాడు. గ్రేస్ ఆ సిలిండర్ను కొంతసేపు చేతులతో తడిమింది. జరిగిన దాన్ని తట్టుకోలేక బాధతో తూలి పడింది. ఉన్నట్టుండి ఆ సిలిండర్ని చేతులతో ఇష్టం వచ్చినట్టు పిచ్చిగా బాదింది. వెనక్కితిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. అది చూసి విక్టర్ సిగ్గుతో చితికిపోయాడు. 'నేను మృత్యువుని అధిగమించాలి అనే ఆశలో, భార్య కన్నా ఎక్కువగా డాక్టర్లను నమ్మాను. భార్యకి ఆఖరి చూపునీ, అంత్యక్రియలకు శరీరాన్ని కూడా దక్కనివ్వలేదు. నన్ను క్షమిస్తుందా' అనుకున్నాడు. ఇంతకీ నా ప్లాన్ పని చేసిందా లేదా చూపించు అని అడిగాడు. అపుడు వాళ్ళు ఫ్యూచర్లో కొన్ని వందల ఏళ్ళు ముందుకు ప్రయాణించారు.

*"A man who can take anything will find most things unsatisfying. And a man without memories is just a shell."*

ఇపుడు వాళ్ళు ఒక పెద్ద నగరం మధ్యలో ఉన్నారు. ఎక్కడా కొంచెం ఖాళీ లేకుండా కట్టిన హై రైజ్ బిల్డింగ్స్, కృత్రిమంగా ఉన్న వాతావరణం, పరిసరాలూ, మనుషులూ. ఎక్కడా ముసలివారనేదే కనిపించలేదు. ఇంతకీ నేను బ్రతికానా అని అడిగితే, డార్ అవునన్నట్టు తలూపాడు. ఆహా, తను చావుని మోసం చేసి తిరిగి బ్రతికాను అని విక్టర్ గర్వంగా నవ్వుకున్నాడు. అతనికి తెలిసినదంతా బిజినెస్ భాష మాత్రమే, అయితే సక్సెస్, లేదా ఫెయిల్యూర్. అయితే వీళ్ళందరిలో నేను ఎక్కడ ఉన్నాను అని అడిగిన విక్టర్ కి డార్ ఒక వైపు చూపించాడు. అది ఒక పెద్ద భవనంలోని విశాలమయిన హాలు. అందులో గోడల నుండి పెద్ద పెద్ద స్క్రీన్లు వేలాడుతున్నాయి. ప్రతీ స్క్రీన్ మీదా విక్టర్ జీవితంలోని చిన్నప్పటి నుండీ ముఖ్యమయిన ఘట్టాలు స్లైడ్ షో లా ప్రదర్శిస్తుంటే, వేల కొద్దీ జనాలు ఆసక్తిగా వాటిని చూస్తున్నారు. అందులో ఒకదానిలో డార్ ఒక ఎత్తైన బిల్డింగ్ మీద కూర్చుని విక్టర్ ఆఫీసు కిటికీ వేపు చూస్తున్న స్లైడ్ కూడా ఉంది. 'అది నువ్వే కదా, ఎందుకు నన్నలా పరిశీలిస్తున్నావ్?' అని అడిగాడు విక్టర్. 'నువ్వెందుకు జీవితకాలాన్ని మించి బ్రతకాలని ఆశపడుతున్నావో తెలీక ఆశ్చర్యపడుతున్నాను' అన్నాడు డార్. ఏం? ఎందుకు ఆశపడకూడదూ అని విక్టర్ అడిగితే, 'అదేమీ వరం కాదు. నేను అనుభవించాను కాబట్టి అది నాకు తెలుసు' అన్నాడు డార్.

'వాళ్ళెందుకు నా జీవితాన్ని అలా చూస్తున్నారు? నేనెక్కడ ఉన్నాను ఇపుడు?' అని అడిగిన విక్టర్ కి ఒక మూలగా చూపించాడు డార్. దగ్గరికి వెళ్ళి చూసిన విక్టర్ భయంతో వణికిపోయాడు. అక్కడ ఒక పెద్ద గ్లాస్ ట్యూబ్లో విక్టర్ శరీరం ఉంది. అది పింక్ రంగులోకి మారి, ముడతలు పడి క్రుంగి, చర్మం కమిలిపోయి, తలకి అక్కడక్కడా వైర్లు తగిలించి ఉంది. ఆ వైర్లు బయట రకరకాల మెషీన్లకు కనెక్ట్ చెయ్యబడ్డాయి. కళ్ళూ పెదవులూ బాధతో ఉన్నట్టు తెరుచుకుని ఉన్నాయి. జనాలు మ్యూజియంలో చూసినట్టు అతని శరీరాన్ని చూస్తున్నారు. విక్టర్ అది జీర్ణించుకోలేకపోయాడు. 'ఇలా జరగడానికి వీల్లేదు. నేను ఆరోగ్యంగా తిరిగి లేవాలి అని కండిషన్. దానికి నేను

బోలెడు డబ్బు చెల్లించాను. ఆ డాక్యుమెంట్స్ ఎక్కడ? నా లాయర్లు ఎక్కడ?' అన్నాడు కోపంతో. డార్ 'ఇప్పుడవన్నీ పోయాయి. నీ లాయర్లూ లేరు. నీ ఆస్తులూ లేవు. పాత చట్టాలు పోయి కొత్త చట్టాలు వచ్చాయి.' అన్నాడు. వీళ్ళందరూ ఏం చేస్తున్నారు అని అడిగిన విక్టర్ తో 'ఇపుడు వాళ్లకి నువ్వో కళాఖండానివి. నీ జ్ఞాపకాలు వాళ్ళకి అపురూపం. వాళ్ళదంతా స్పీడ్ యుగం. వాళ్ళకి ఎమోషన్స్, సంతృప్తికరమైన జీవితం అంటే ఏమిటో తెలీదు. వాటికి వాళ్ళకు మిగిలిన ఏకైక ఆధారం నువ్వు. నీ తలకి పెట్టిన మెషీన్ల ద్వారా నీ జ్ఞాపకాలని స్టడీ చేస్తున్నారు, ఎమోషన్స్ ని ఎలా అనుభూతి చెందాలో నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని చెప్పాడు డార్.

*"With endless time, nothing is special. With no loss or sacrifice, we can't appreciate what we have."*

'నాది సంతృప్తికరమైన జీవితమా! నేనే తృప్తి అనేది లేక బ్రతుకు వెంట పరుగులు పెట్టానే. అంటే ఇపుడు ఇంకెంత అధ్వానమయ్యిందో కదా ఆ ఆరాటం, తాపత్రయం' అనుకున్నాడు విక్టర్. చివరగా విక్టర్ ఇక్కడే ఉంటానని చేసిన అబద్ధపు వాగ్దానం నమ్మి, తొందరగా వచ్చేస్తానని చెప్పి గ్రేస్ పార్టీకి వెళుతున్న స్లైడ్ తో విక్టర్ జ్ఞాపకాలు ముగిసాయి. గ్లాస్ ట్యూబ్ లోని విక్టర్ కంటి నుండి, బయట విక్టర్ కంటి నుండీ ఒక కన్నీటి చుక్క కారింది. గ్రేస్ పట్ల తనింత క్రూరంగా ఎలా ప్రవర్తించాడా అని సిగ్గుపడ్డాడు విక్టర్. డార్ విక్టర్ కన్నీటి చుక్కని వేలితో తీసి చూపించి 'ఇపుడు అర్ధమయిందా. అంతులేని జీవితకాలంతో ప్రత్యేకతేమీ లేదు. మనం కొన్ని కోల్పోకుండా ఉంటే ఉన్నదాని విలువ ఎప్పటికీ తెలుసుకోలేము.' అన్నాడు. దేవదూత చెప్పినది 'దేవుడు మన రోజుల్ని నిర్ణీతంగా ఇచ్చేది, వాటి విలువ పెంచడానికే' అని ఇపుడు అర్ధమయింది డార్ కి. అపుడు డార్ వాళ్ళిద్దరికీ తన కథ చెప్పి, విక్టర్ తో ఇలా అన్నాడు. ' నేనూ లెక్కలేనన్ని జీవితకాలాలు బ్రతికాను. కానీ జీవించలేదు. నా భార్యా పిల్లలూ, బంధువులూ ఎవరూ తోడు లేరు. అలా ఎన్నాళ్ళు బ్రతికితే మాత్రం ఏమిటి ప్రయోజనం?'

డార్ పరిస్థితి విషమించింది. చెమటలు పట్టి స్పృహ కోల్పోయాడు. శారా విక్టర్ ఏం చెయ్యాలో తెలీక, అతని చెరో చేతిని ఇద్దరూ తమ కళ్ళ మీద పెట్టుకుని చూస్తే, డార్ ఏలీ తో నీ బాధని ఆపుతాను అని చెప్పటం, అతను నిమ్ టవర్ వైపు పరిగెట్టడం కనిపించాయి. అలానే అతను గుహలోకి విసిరెయ్యబడటం, అక్కడ దేవదూత అతన్ని నువ్వు కాలాన్ని నియంత్రించే శక్తి కోరుతున్నావా అని అడగటం కనిపించింది. ఆ దేవదూతని చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. అతనెవరో కాదు, వాళ్ళిద్దరూ వెళ్ళిన గడియారాల షాపు యజమాని. డార్ కు కూడా ఏలీ వచ్చిన జబ్బే వచ్చిందని వారికి అర్ధమయింది. ఇద్దరూ అవర్ గ్లాస్ సాయంతో డార్ ని, ఏలీ జబ్బుతో బాధపడుతున్న కాలం దగ్గరికి వెనక్కి తీసుకెళ్ళారు. ఏలీ డార్ ఇద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని, ఒకరి శ్వాస ఒకరిలో కలుస్తుండగా చివరి ఊపిరి పీల్చారు. ఇద్దరి ఆత్మలూ ఏకమయి ఆకాశంలోకి ఎగిసి మెరిసే నక్షత్రాలయ్యాయి.

*"Only God can write the end of your story."*

అవర్ గ్లాస్ మళ్ళీ చిన్నగా మారిపోయి, గడిచిన క్షణాలు క్రిందభాగం లోకి, గడవాల్సిన క్షణాలు పైభాగంలోకి చేరుకున్నాయి. కాలం తిరిగి కదలటం ప్రారంభించింది. కారులో విషవాయువు పీలుస్తూ స్పృహ కోల్పోతున్న శారా తన ఫోన్ మోగడంతో తిరిగి స్పృహలోకి వచ్చింది. తల్లి హేపీ న్యూ ఇయర్ అని చెప్పడానికి చేసిన ఫోన్ కాల్ అది. మగతలో ఉన్న శారాకి జరుగుతున్నది అర్ధమయి, కష్టం మీద కార్ డోర్ తెరచుకుని, నేల మీద పాక్కుంటూ గరాజ్ లోంచి బయటకి వచ్చి ఇంటిముందు పడిపోయింది. ప్రక్కింటి వారు ఆమెని చూసి ఎమర్జెన్సీకి తీసుకెళ్ళడంతో ప్రాణాపాయం తప్పింది. హాస్పిటల్లో ఆమె ప్రక్క బెడ్ మీద విక్టర్ అనే వృద్ధుడు అడ్మిట్ అయ్యాడు. అతన్ని రోజర్ అనే వ్యక్తి కడుపు నొప్పి అని తీసుకొచ్చాడు. ఆరోజు సాయంత్రం ఇంట్లోంచి బయలుదేరే ముందు విక్టర్ రోజర్ తో 'నేను ఏ కారణం వల్లయినా నా నిర్ణయం మార్చుకుంటే ఒక కోడ్ వర్డ్ చెపుతాను. నువ్వు వెంటనే సందేహించకుండా ఈ ప్లాన్ ఆపేయించు' అని చెప్పాడు.

అక్కడ ఐస్ బకెట్లోకి పెట్టడానికి విక్టర్ ను ఎత్తుతున్న క్షణంలో, విక్టర్ కళ్ళు తెరిచి రోజర్ ని చూసి కోడ్ వర్డ్ చెప్పాడు. వెంటనే రోజర్ వాళ్ళను ఆపేసి విక్టర్ ను ఎమెర్జెన్సీ కి తీసుకువెళ్ళాడు. విక్టర్ రోజర్ తో చెప్పిన కోడ్ వర్డ్ 'గ్రేస్'.

ఆ తరువాత ఓ మూడునెలలకి విక్టర్ చనిపోయాడు. ఆ మూడునెలలు తమ జీవితంలో మరిచిపోలేనంత సంతోషమయిన కాలం అని గ్రేస్ అంటుంది. విక్టర్ చనిపోయే ముందు తన విల్లులో, ఓ ప్రఖ్యాత కాలేజీలో శారా ఎంతవరకూ చదువుకుంటే అంతవరకూ అయ్యే మొత్తం ఖర్చు విరాళంగా వ్రాసాడు. ఏళ్ళు గడిచాయి. శారా సైంటిస్ట్ అయ్యి కేన్సర్ కు మందు కనిపెట్టింది. ఆమె తన అభినందన సభలో మాట్లాడుతూ తన టీచర్స్ కు, టీమ్ మేట్స్ కు కృతజ్ఞతలు చెప్పి, తల్లిని గర్వంగా అందరికీ పరిచయం చేసింది. విక్టర్ అనే మంచి మనిషి సహాయం లేకపోతే ఇదంతా సాధ్యమయి ఉండేది కాదని ప్రత్యేకంగా కృతజ్ఞతలు అతన్ని తలుచుకుని తెలియచేసుకుంది.

సాధారణమైన కథాంశమే అయినా, నేర్పుగా ఆసక్తిగా కథ చెప్పడం మిచ్ సొంతం. తన అన్ని పుస్తకాల్లోల్లాగే ఇందులో కూడా జీవనసౌందర్యాన్ని, అనుబంధాల ప్రాముఖ్యతనీ సున్నితమయిన సంఘటనలతో చెప్తారు. ఈయన కథలలోని పాత్రలు పాఠకుల మనసుకి చేరువయిపోతాయి. అర్హతలేనివాడివల్ల మనసు గాయపడి ప్రాణాలు తీసుకోవాలనుకున్న అమాయకపు శారా, ప్రేమించిన భార్య తనతో ఉండదని తెలిసీ ఒంటరిగా ఇంకో లైఫ్ కోసం ప్రాకులాడుతున్న స్వార్ధపరుడు విక్టర్, తెలియక చేసిన తప్పుకి తను లెక్కపెట్టలేనంత మూల్యం చెల్లించిన డార్...ప్రతీ పాత్ర మనతో కథ ముగిసిన తరువాత కూడా చాలా కాలం ఉంటారు. చిన్న చిన్న వాక్యాలతోనే ఎక్కువ ప్రభావం కలిగించేలా వ్రాయడం, హృదయాన్ని తాకే కొసమెరుపు వాక్యాలూ మిచ్ శైలి. కొన్ని వాక్యాలు మళ్ళీ మళ్ళీ చదివిస్తాయి. ఇందులో డార్ ఏలీ పాత్రలు ఏడమ్, ఈవ్ పాత్రలకు రూపం అనుకోవచ్చు. అలాగే డార్ (Father Time) డార్విన్ కు రూపమేమో అనిపించింది నాకు. నిమ్ కట్టిన టవర్ Tower of Babel కు సింబల్ అనీ అనుకోవచ్చు. ఇదే రచయిత వ్రాసిన ఇతర పుస్తకాలకు పరిచయాలు స్వర్గంలో పాఠాలు మరియు జీవించడం నేర్పిన గురువు కౌముదిలో చదవొచ్చు.



రచయిత గురించి: Mitch Albom వృత్తిపరంగా ఫ్రీలాన్స్ స్పోర్ట్స్ జర్నలిస్ట్. ప్రవృత్తి రచన, స్క్రీన్ ప్లే రచన, రేడియో & టీవీ ప్రోగ్రామ్స్ ప్రసారాలు, పాటలు వ్రాయడం, సంగీతం కూర్చడం, అన్నిటినీ మించి సంఘసేవ. ఆయన మొదటి రచన 'Tuesdays with Morrie' అనే మెమోయిర్ (స్మృతి సంస్మరణ) చాలా పేరు పొందిన రచన. ఆయన వ్రాసిన ఫిక్షన్ నవలలు కూడా దాదాపు నలభై భాషల్లోకి అనువదించబడి మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి. Five People you meet in Heaven, For One more day, The Time Keeper, Have a little Faith, First Phone Call from Heaven అనే ఫిక్షన్ నవలలు వ్రాసారు. కొన్ని సేవాసంస్థలు ద్వారా ఛారిటీ పనులు కూడా విరివిగా చేస్తున్నారు. ఆ వివరాలు ఆయన వెబ్ సైట్లో చూడవచ్చు.



# పుస్తకం ఓ నేస్తం

## – పద్మవల్లి



## The Assembler of Parts

*"In heaven, there is no judgment, but rather an opportunity to examine our lives–who we touched, the choices we made, and the consequences of those choices."*

*"Life has a purpose. No matter what you do in life, you are here for a reason. You may not even realize what your actions have meant to others."*

పై వాక్యాలు మిచ్ ఆల్బోం వ్రాసిన Five People You meet in Heaven అనే పుస్తకం లోనివి. ఒక్కోసారి మనకి అసలు మన జీవితానికి ప్రయోజనం ఏంటీ అని అనిపిస్తుంది? మనవలన ఎవరికి ఏం ఉపయోగం. పుడతాం. గిడతాం. కొన్నాళ్ళు జ్ఞాపకాలుగా మిగులుతాం. అంతేనా? నిజంగా జీవితానికి పరమార్ధం అంటూ ఉందా? ఉంటే అదేంటో మనకెలా తెలుస్తుంది? మనవల్ల స్పృశించబడిన జీవితాలకు తప్ప ఇంకెవరికి తెలుస్తుంది. పైన చెప్పిన వాక్యాల్లోలాగా, మన జీవితాలను రెట్రోస్పెక్ట్ చేసి మనకు చూపించగలితే, ఒకప్పుడు అర్ధంలేనివనిపించినవన్నీ, ఇపుడు అర్ధవంతం అవుతాయేమో మరి.




జెస్ అని ముద్దుగా పిలవబడే జెస్సికా (Jessica Mary Jackson) ఏడేళ్ళ వయసులో మరణించింది. స్వర్గానికి వస్తే అక్కడ దేవుడు కనిపించాడు ఆ పాపకి. మనుషుల్ని తయారు చేస్తాడు కాబట్టి జెస్ అతన్ని The Assembler అని పిలుస్తూ ఉంటుంది. దేవుడు జెస్ కి కొన్ని వీడియో టేపులు ఇచ్చి, 'ఇందులో భూమి మీద గడిచిన నీ కథ ఉంది. ఇవి చూడు' అన్నాడు. వదిలివచ్చిన జీవితాన్ని చూసి తను ఇపుడు తెల్సుకోవాల్సిందేమిటి? తన జీవితంలో తనకి తెలీనివి క్రొత్తగా ఏముంటాయి? తెల్సిన విషయాలు ఆ పాప మీద ఏం ప్రభావం చూపించాయి? మనుషుల్ని మిగిలిన జీవాలనుంచి ప్రత్యేకంగా చేసేదేమిటి? నిజంగా మనుషులు ఆ ప్రత్యేకతను నిలబెట్టుకుంటున్నారా? వీటన్నిటికీ జవాబు Dr. Raoul Wientzen వ్రాసిన The Assembler of Parts అనే పుస్తకం.

*"There were so many worlds in my mother's face, a dozen at least in her round brown eyes, a hundred in her smiles."*

ఆ వీడియోల్లో ఆమె కథ హాస్పిటల్లో తను పుట్టిన దగ్గర్నుంచీ మొదలవుతుంది. ఫోర్డ్ (Mr. Ford Jackson) మేరీలాండ్ లో ఓ చిన్న పోస్ట్ ఆఫీసులో ఉద్యోగి. సాధుస్వభావి. అతనికి చేతనయినంతలో ఇతరులకి సాయపడే గుణమున్నవాడు. అతని భార్య కేట్. వారికి మొదటి సంతానంగా జెస్సికా పుట్టింది. పుట్టగానే డాక్టర్లు పరీక్షలు చేసి జెస్ హిల్గర్ సిండ్రోం అనే వ్యాధితో పుట్టిందని చెప్పారు. దానివలన చేతి బొటనవేళ్ళు , చెవుల్లో ఉండాల్సిన మిడిల్ ఇయర్, ఒక కిడ్నీ, కొండనాలుక, పన్నెండు బోన్స్ లేకుండా, గుండెకు రెండు కన్నాలతో పుట్టిందని తేల్చారు. పిడియాట్రీషియన్ డాక్టర్ బర్క్, కార్డియాలజిస్ట్ , ENT స్పెషలిస్ట్, జెనెటిసిస్ట్ లతో బృందాన్ని ఏర్పాటుచేసి, పాపకి కావాల్సిన మెడికల్ కేర్ ప్లాన్ చేసాడు. జెస్ కి రెండు నెలల వయసులో కృత్రిమ చెవులు అమర్చడానికీ రెండేళ్ళ వయసపుడు ఆపరేషన్ చేసి మిస్ అయిన కిడ్నీ స్థానంలోని తిత్తిని తొలగించడానికి, ఏడేళ్ళ వయసులో గుండెకు ఆపరేషన్ ప్లాన్ చేసారు. అయితే గొంతులో నుండి అస్పష్టమయిన శబ్దాలు తప్ప సరిగా మాటలు మాత్రం రావనీ, మొత్తం కుటుంబసభ్యులందరినీ సైన్ లాంగ్వేజ్ నేర్చుకోమనీ చెప్పారు. అయితే పాప మెదడు ఎదుగుదల మాత్రం చాలా ఎక్కువగా ఉందనీ , మంచి తెలివితేటలు ఉంటాయనీ చెప్పారు. జెస్ పరిస్థితికి తల్లిదండ్రులు దిగులుపడినా పాపకి వైద్యానికి మంచి డాక్టర్ల బృందం దొరికినందుకు మాత్రం కొంచెం సంత్రుప్తిపడ్డారు.

జెస్ పేరెంట్స్ దుఃఖం నుంచి తేరుకుని పాపని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. పాప లోని లోపాలను దాచే ప్రయత్నం చెయ్యకుండా, చుట్టుపక్కలవారి వింత చూపులనూ సానుభూతినీ పట్టించుకోకుండా పాపను మామూలుగానే పెంచసాగారు. తండ్రీ కూతుర్ల మధ్య అనుభందం ఏర్పడింది. జెస్ అమ్మమ్మ, తాత కూడా ఫ్లోరిడా నుంచి అప్పుడప్పుడూ వస్తూ కొన్నిరోజులు గడిపి వెళుతూ ఉండేవారు. జెస్ ని చూసి మొదట అమ్మమ్మ నిరాశపడినా, నెమ్మదిగా పాపకు దగ్గరయ్యింది. కుటుంబంలో ఎవరూ కూడా జెస్ ను లోపాలతో పుట్టిన పిల్లగా చూసేవారు కాదు.

*"You risk the loss of their loved memory. Hate and retribution will eat the love out of you. Only with love and forgiveness you will get through."*

జో కేసిడీ (Joe Cassidy) ఫోర్డ్ తో బాటూ అదే పోస్ట్ ఆఫీసులో పని చేస్తాడు. కేసిడీ ఫోర్డ్ కన్నా వయసులో చాలా పెద్దయివాడయినా, ఇద్దరికీ మంచి స్నేహం. అంతేకాకుండా కేట్ తల్లిదండ్రులు మేరీలాండ్ లో ఉన్న కాలంలో కేసిడీ తల్లికి మంచి స్నేహితులు. దానివల్ల అతనికి వీళ్ళందరి దగ్గరా బాగా చనువెక్కువ. ఇంట్లో మనిషిలా ఉంటాడు. దాదాపు ఇరవయ్యేళ్ళ క్రితం కేసిడీ భార్యా, రెండునెలల కొడుకూ డాక్టర్ విజిట్ కు వెళుతూ కారు ప్రమాదంలో చనిపోయారు. ఆ కారు నడుపుతున్న అతని తల్లి మాత్రం గాయాలతో బయటపడింది. 'కారు బ్రేకులు సరిగా పనిచెయ్యటం లేదు, ఇప్పటికి టాక్సీలో వెళ్ళండి' అని డబ్బులిచ్చి వెళ్ళినా తల్లి వినకుండా కారు డ్రైవ్ చేసినందుకు, అతను ఆ ప్రమాదానికి తల్లే కారణం అని ఆమె మీద ద్వేషం పెంచుకున్నాడు. తనవల్లే ఆ ప్రమాదం జరిగిందని అపరాధభావంతోనూ, కొడుక్కి కలిగిన కష్టానికీ ఆమె విపరీతంగా కుమిలిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా కేసిడీ ఆమె చనిపోయేవరకూ మళ్ళీ ఆమె మొహం చూడలేదు. ఆ కష్టసమయంలో కేట్ తల్లిదండ్రులు ఇద్దరికీ అండగా ఉన్నారు. అప్పటినుండీ కేసిడీ బాధను మర్చిపోవడానికి ఇరవైనాలుగు గంటలూ ఆల్కహాల్ తోనే ఉంటాడు. అయితే అతని కథ తెలిసినవారవడంతోనూ, ఎవరికీ ఏ ఇబ్బందీ కలిగించని అతని ప్రవర్తన వల్లనూ, అతని మీద సానుభూతితో ఆఫీసులో ఎవరూ అతని విషయంలో అభ్యంతరం చెప్పలేదు. వీలయినంతవరకూ అతనికి సాయం చేసేవారు. అతనికి కేట్, ఫోర్డ్ తప్ప వేరే స్నేహితులెవరూ లేరు. వాళ్ళ బలవంతం మీద అప్పుడప్పుడూ

వచ్చి వాళ్ళతో గడిపి వెళుతుంటాడు. అతనికి గిటార్ వాయించడమంటే ఇష్టం. ఎప్పుడయినా మనసు కుదిరినపుడు గిటార్ మీద ఓ పాట వాయిస్తాడు.

*"The more I watch the Assembler's tapes of my life, the more I see my purpose. Cassidy set free of the bonds of his sorrow by his love for me. My imperfection is the key to his heart, my missing bones somehow whittled by the Assembler to fit precisely into the hole of his loss."*

జెస్ పుట్టిన వెంటనే ఆమె గురించి విని కేసిడీ షాక్ అయినా, వెంటనే తేరుకుని 'తను ఎన్ని లోపాలతో పుట్టినా కూడా మనకి అపురూపమే' అని ఫోర్డ్ కి ధైర్యం చెప్పి, ఏ అవసరమయినా నేనున్నాను నీకు అని చెప్పాడు. జెస్ ని చూసిన మొదటి క్షణం లోనే ఆమె మీద తెలీని అభిమానం ఏర్పడింది. తన నాలుగు వేళ్ళతో అతని చెయ్యి పట్టుకుని ఊసులు చెపుతున్న ఆ పాపలో అతనికి తన కొడుకు కనిపించాడు. అప్పటినుంచి ఆమె మీద విపరీతమయిన ప్రేమ పెంచుకున్నాడు. ఇద్దరి మధ్యా విడదీయలేని అనుబంధం ఏర్పడింది. రోజూ ఆఫీసు తరువాత వాళ్ళ ఇంటికి వచ్చి, జెస్ తో ఎక్కువ సమయం గడపటం, తనని ఎత్తుకుని పాలు పట్టడం, నిద్రపుచ్చడం, కథలు చదివి వినిపించడం చేసేవాడు. అతను గిటార్ ప్లే చేస్తుంటే కళ్ళు ఆర్పిప్పల్లా చేసుకుని చూస్తూ ఉండేది జెస్. జెస్ తో ఉన్నంతసేపూ బానే ఉన్నా, ఇంటికి వెళ్ళిన మరుక్షణం అతనిని ఒంటరితనం, విచారం వెంటాడేవి. అది మర్చిపోడానికి మళ్ళీ ఆల్కహాల్ మత్తులోకి వెళ్ళేవాడు.

*"These are good hands. Good as any, Jess. The Assembler made 'em, and He don't make junk. He makes everything just to please Himself. The bones and the skin, the meat and the sap, just the way it suits Him."*

జెస్ కు డాక్టర్ల విజిట్లు, ట్రీట్మెంట్స్ తో కాలం గడుస్తుంది. రెండునెలల వయసపుడు కృత్రిమ చెవులు అమర్చడంతో, శబ్దాలు వినబడసాగాయి. పెదాల కదలిక చూసి అర్ధం చేసుకోవడం, సైన్ లాంగ్వేజ్ నేర్చుకుని, చిన్నగా సంభాషించడం నేర్చుకుంది. చిన్నచిన్న మాటలు మాట్లాడినా అవి ఇంట్లోవాళ్ళకి తప్ప ఇంకెవరికీ అర్ధమయ్యేవికాదు. ఇంట్లో వాళ్ళ తరువాత కేసిడీ తనకి బెస్ట్ ఫ్రెండ్. కే..సీ..డీ అని వచ్చీ రాని మాటలతో పిలిస్తే, అతను పొంగిపోయేవాడు. జెస్ పెరుగుతున్న కొద్దీ, ఆమెతో పెద్దవాళ్లతో చెప్పినట్టుగా కబుర్లు చెప్పేవాడు. 'దేవుడు తన తృప్తికోసం తనకి నచ్చినట్టు మనుషుల్ని రకరకాలుగా తయారు చేస్తుంటాడు. నీవెంతో అందమయిన చేతులు.' అని చెప్పేవాడు. జెస్ కూడా ఎంతో పరిణితి చెందిన పిల్లలా ప్రవర్తించేది. మూడేళ్ళ వయసపుడు స్పెషల్ చిల్డ్రన్ ప్రీస్కూల్లో జాయిన్ చేస్తే, అక్కడ మిగిలిన పిల్లలు ఆమెని చూసి గేలిచేసినా నవ్వి దూరంగా వెళ్ళికూర్చునేది. ఎవరూ కూడా ఆమెతో స్నేహం చేసేవారు కాదు. అయినా కూడా ఏడవకుండా ధైర్యంగా ఉండేది. తండ్రి ఆమెను సాకర్ బృందం లో చేర్చాడు. అక్కడ కూడా పిల్లలు మొహం మీదే వెక్కిరించినా కూడా లెక్కచెయ్యలేదు. లెక్కల్లో మంచి తెలివితేటలు చూపించేది. మిగిలిన విషయాల్లో కూడా వయసుకి మించిన తెలివితేటలతో అందరినీ ఆశ్చర్యపరిచేది.

*"Nobody goes to Hell," I said with certainty. "Cassidy told me that. It doesn't make sense that God would send anyone He made there. Even the Minotaur or Medusa. Especially the Minotaur. It wouldn't be fair because that's how the Assembler— uh, I mean God— made them. Imperfect in just the way He's imperfect. So He's got to forgive."*

జెస్ కి ఆరేళ్ళ వయసపుడు చెల్లి జనీన్ పుట్టింది. జెస్ కు ఏడేళ్ళు నిండాయి. స్కూల్లో సెకండ్ గ్రేడ్ లోకి వచ్చింది. కేట్ మళ్ళీ ప్రెగ్నెంట్ అయింది. ఒకరోజు బయట వాతావరణం కూడా చల్లగా ఉండి, జెస్ కి కొంచెం జలుబు చేసినట్టుగా ఉంది. ఆ రాత్రి నిద్రపోయే ముందు తన గదిలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న జెస్ ఉన్నట్టుండి వూపిరాడక ఇబ్బంది పడుతూ ఉంది. జలుబుకి ముక్కు మూసుకుపోయిందేమో అని వేడినీళ్ళలో ముంచిన టవల్తో మొహం తుడవాలని, కేట్ టవల్ తేవడానికి వెళ్ళివచ్చేసరికి జెస్ మంచం మీద ఊపిరాడక ఎగశ్వాస తీస్తూ కొట్టుకోసాగింది. కేట్ కేకలు విని పరుగున వచ్చిన ఫోర్డ్, జెస్ కి నోటితో వూపిరి అందించడానికి ప్రయత్నిస్తుండగా, కేట్ ఎమర్జన్సీ కి కాల్ చేసింది. అయితే వాళ్ళు వచ్చేసరికే జెస్ ప్రాణం పోయింది. కేట్, ఫోర్డ్ ఇంకా నిశ్చేష్టులయి చూస్తుండగానే, వాళ్ళు ఆమెను ఎమర్జెన్సీకి తీసుకు వెళ్ళారు. అక్కడ డాక్టర్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కబురు తెలిసి డ్యూటీలో ఉన్న డాక్టర్ బర్క్ వచ్చి చూసి విచారంగా కేట్ తో 'తనకి బాగోనప్పుడు నన్ను పిలవాల్సింది' అన్నాడు. కేట్ 'తను ఉదయం వరకూ బానే ఉంది. మామూలు జలుబే కదా అనుకున్నాను. అది కూడా సాయంత్రం వరకూ ఎక్కువ లేదు. ఇలా అవుతుందని నేను కలలో కూడా అనుకోలేదు' అని ఏడుస్తూ అంది.

కేట్, ఫోర్డ్ ఎమర్జెన్సీ రూంలో జెస్ బాడీ దగ్గర ఏడుస్తూ ఇంకా షాక్ లో ఉండగానే, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ నుండి ఒక డిటెక్టివ్ వచ్చి మాట్లాడాలని తీసుకెళ్ళాడు. ఉదయం నుంచీ అసలేం జరిగిందో, వాళ్ళేం చేసారో ఇద్దరినీ ఒకరి తరువాత ఒకరిని చెప్పమన్నాడు. ఇద్దరూ జెస్ ని ఎబ్యూజ్ చేసారేమో అని అనుమానంతో ఆ కోణంలో చాలా బాధ కలిగించే ప్రశ్నలు వేసాడు. జెస్ వూపిరాడక బాధపడుతుంటే నువ్వు డాక్టర్ ని పిలవకుండా టవల్ తేవడానికి ఎందుకు వెళ్ళావు అని కేట్ నీ, నువ్వేం చేసావు అని ఫోర్డ్ నీ అడిగాడు. ఫోర్డ్ బాధతో 'జెస్ అంటే మాకు ప్రాణం. ఇలా అవుతుందని మేము అనుకున్నామా? అన్నీ నిముషాల్లో జరిగిపోయాయి. మా బిడ్డ పోయిందన్న విషయమే మాకింకా షాక్ వదలలేదు. మమ్మల్నిలా అనుమానించి, బాధించడం బాలేదు. మేము ఆమె తల్లిదండ్రులం, శత్రువులం కాదు' అన్నాడు. 'ఆ సంగతి మా డిపార్టుమెంటు తేలుస్తుంది. ముందు మీ ఇంటిని పరిశీలించాలి పదండి' అని ఇంటికి వెళ్ళి అక్కడ ఇల్లు, జెస్ రూం అన్నీ పరీక్షగా చూసి, గమనించిన విషయాలన్నీ నోట్ చేసుకుని, జెస్ రూం నుండి కొన్ని వస్తువులు పరీక్షకు తీసుకొని, మళ్ళీ వస్తానని వెళ్ళిపోయాడు.

*"Cherish her memory. Guilt and blame will only tarnish it and serve to separate you from it and from those who share it. That's like another death when you cut yourself off from that."*

డాక్టర్ బర్క్ అన్నట్టుగా, తను డాక్టర్ దగ్గరికి తీసుకు వెళితే జెస్ బ్రతికి ఉండేదేమో, తన పొరపాటు వలనే అలా జరిగిందని కేట్ కుమిలిపోసాగింది. 'ఆ పరిస్థితిలో ఏ తల్లిదండ్రులైనా ఏం చేస్తారో అదే మనమూ చేసాము. అది నీ తప్పు కాదు' అని ఫోర్డ్ ఆమెను అనునయించాడు. అయినా ఇద్దరినీ జెస్ మరణం విపరీతంగా కృంగదీసింది. జెస్ మరణవార్త తెలిసిన వెంటనే ఆఫీసులో ఉన్న కేసిడీ జెస్ ఇంటికి వచ్చాడు. అక్కడ అప్పటికే చర్చ్ ప్రీస్ట్ ఉన్నారు. కేసిడీకి ఆయనంటే పడదు. తన కొడుకునీ, భార్యనీ ఒకే కేస్కెట్లో పెట్టడానికి ఒప్పుకోలేదనీ, జరిగినదానికి అతని తల్లి మీద కోపం పెట్టుకోకుండా ఆమెను క్షమించమనీ అడిగినందుకు ఆయన మీద కోపం. ఇరవయ్యేళ్లుగా కేసిడీ చర్చ్ కు వెళ్ళలేదు, ప్రీస్ట్ తో మాట్లాడలేదు. కేసిడీ వెళ్ళిపోతున్నప్పుడు ప్రీస్ట్ అతనితో పాటు బయటకు వచ్చి 'నీకు జెస్ అంటే ప్రాణమని నాకు తెలుసు. వాళ్ళిద్దరూ కూడా ఎంతో కుమిలిపోతున్నారు. పాప మరణానికి నువ్వు కూడా వాళ్ళని బాధ్యులను చేసి తప్పుపట్టకు. జరిగేది జరగక మానదు. మన చేతుల్లో ఏదీ లేదు. ఎవరినైనా బాధ్యులని చేసి తప్పు పట్టడం, ద్వేషించడం, మనల్ని వాళ్ళ నుండి దూరం చేస్తుంది తప్ప మనకి ఒరిగేదేమీ ఉండదు. కలిసి దుఖాన్ని పంచుకో' అని చెప్పాడు. కేసిడీ అర్థం అయ్యింది అన్నట్టు తలవూపి, జెస్ ఫ్యునరల్ లో తనకి ఒక పాట పాడటానికి అవకాశమిమ్మని అడిగితే ఆయన సరే అన్నాడు. యాదృచ్ఛికంగా ఆరోజుకి కేసేడీ భార్యా కొడుకూ చనిపోయి

ఇరవయ్యేళ్ళు. అదే రోజు ఉదయం తను దుఃఖంతో ఉండటం చూసి, 'యు విల్ బి ఆల్రైట్' అని అమాయకంగా చెప్పిన జెస్ సాయంత్రానికి మరణించడం తట్టుకోలేకపోయాడు. కేసిడీ తన ఇంటికి వెళ్లి పిచ్చిగా ఏడుస్తూ విపరీతంగా త్రాగి, ఇంట్లో ఒంటరిగా ఉండిపోయాడు.

జెస్ చనిపోయిన మరునాడు అటాప్సీ చేస్తున్న డాక్టర్ బెంటన్ కు జెస్ మరణానికి కారణం తెలిసింది. వెంటనే డాక్టర్ బర్క్ ని పిలిచి, కార్డియాలజిస్ట్ డాక్టర్ మార్షల్ ను తీసుకుని అటాప్సీ రూం లోకి రమ్మని చెప్పాడు. వాళ్ళకు జెస్ చెస్ట్ లో ఊపిరితిత్తుల దగ్గర అపసవ్యదిశలో పెరిగి, శ్వాసనాళాన్ని వెనుకనుండి వత్తేస్తున్నట్టు ఉన్న ఒక పెద్ద ఆర్టరీ (ధమని) ని చూపించి, 'ఇదే జెస్ మరణానికి కారణం. దీనివల్ల అసలే వత్తిడితో ఉన్న శ్వాసనాళం కొంచెం జలుబుకే మూసుకుపోయి, ఊపిరి తీసుకోడం కష్టమయ్యి చనిపోయింది. దీన్ని పాప బ్రతికుండగా ఎవరూ కనిపెట్టలేకపోయారు' అన్నాడు. అది కార్డియాలజిస్ట్ బాధ్యత. అందుకని డాక్టర్ మార్షల్ తన తప్పును కప్పిపుచ్చుకోడానికి 'ఏమో ఎప్పుడూ ఏ ఎఖోలోనూ కనిపించనేలేదు. అయినా ఇది హిల్గర్ సిండ్రోం లక్షణం కానే కాదు. ఇలా అవుతుందని ఎవరు అనుమానిస్తారు? మళ్ళీ నేను తన కార్డియోగ్రామ్ ఎఖోస్ అన్నీ ఇంకోసారి స్టడీ చెయ్యాలి' అంది. డాక్టర్ బర్క్ షాక్ తిన్నట్టు ఉండిపోయాడు. తమ డాక్టర్ల టీమ్ అశ్రద్ధ వల్ల ఒక పాప ప్రాణం పోయిందని తెలిసి అతనికి బాధ, కోపం, అసహాయత, భయం అన్నీ కలిగాయి. డాక్టర్ మార్షల్ వెంటనే హాస్పిటల్ లో ఆ ఎఖోలు దాచే లైబ్రరీకి నుండి మొత్తం జెస్ కు సంబంధించిన ఫిలిం రీల్స్ అన్నీ తన ఆఫీసుకు తీసుకువెళ్ళి ప్రొజెక్ట్ చేసి చూడటం మొదలుపెట్టింది. జెస్ పుట్టగానే తీసిన మొదటి రెండు రీల్స్ లో తప్ప, ఒకటో ఏడు నుండీ మొదలు పెట్టి ప్రతీ సంవత్సరం చెకప్స్ అపుడు తీసిన రీల్స్ అన్నిటిలోనూ ఆ ఆర్టరీ స్పష్టంగా పెరుగుతూ కనిపించడం చూసి ఆమె ఆశ్చర్యపోయింది. అంత స్పష్టంగా కనిపిస్తున్నదాన్ని తను ఎలా మిస్ అయిందో ఆమెకు అర్థం కాలేదు. అది తన నిర్లక్ష్యమే అని ఆమెకు తెలుస్తూనే ఉంది. ఒక్క క్షణం గిల్టీగా అనిపించినా వెంటనే నిర్లక్ష్యంగా 'ఎవరు ఊహిస్తారు బిలియన్లో ఒక్కరికి వచ్చేది తనకి వస్తుందని? అసలే బోలెడు పార్ట్స్ లేవు. గుండెకేమో చిల్లులు. ఇంకేమేమి లేవో ఎవడికి తెలుసు. ఆ పుట్టుకే ఓ పెద్ద అపసవ్యం. ఆమె చావుకు నేను కారణం కాదు' అనుకుంది. వెంటనే అన్నిటినీ చెత్తబుట్టలో పడేసింది. మొత్తం అన్నీ పోయాయని అంటే అనుమానం వస్తుందని పుట్టగానే తీసిన వాటిలో ఒక్కటి మాత్రం ఉంచి, దాన్ని తిరిగి లైబ్రరీలో తీసిన చోటే పెట్టేసింది. 'ఎఖో రీల్స్ పోవడం సాధారణమే. లైబ్రరీ ఉద్యోగులు వాటి గురించి శ్రద్ధ తీసుకోకపోవడమే కారణం' అని వాళ్ళ మీద తోసేయ్యొచ్చు అనుకుని, చేతులు దులిపేసుకుంది.

జెస్ చనిపోయిన రెండురోజుల తర్వాత చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ నుండి మిస్ స్మిత్ వారి ఇంటికి వచ్చింది. జెస్ మరణం పట్ల పోలీసులకు ఉన్న అనుమానం వలన, ఆమె తల్లిదండ్రులు పిల్లల సంరక్షణ చూడటానికి యోగ్యులా కాదా, ఆ ఇంట్లో మిగిలిన పిల్లలు క్షేమంగా ఉండటానికి తగిన పరిస్థితులున్నాయా లేదా చూడటానికి తను వచ్చాననీ, తమకి సంతృప్తిగా లేకపోతే జనీన్ ని తాము తీసుకువెళ్ళి వేరే సంరక్షణలో ఉంచుతామనీ చెప్పింది. కేట్ ను వాళ్లకి ఆల్కహాల్ డ్రగ్స్ లాంటి అలవాట్లున్నాయా, పిల్లలని పోషించడానికి తగిన సంపాదన ఉందా? ఇన్స్యూరెన్స్ ఉందా? ఫేమిలీ డాక్టర్ ఉన్నారా లేదా? పిల్లల చుట్టూ ఉండే బంధువులు స్నేహితులూ ఎలాంటివారు? లాంటి నానా ప్రశ్నలు అడిగింది. ఈలోగా బయటకి వెళ్ళిన జెస్ అమ్మమ్మ, తాత నెడ్, జనీన్ ను ఎత్తుకుని కేసిడీ వచ్చారు. తాగుడు వలన ఉబ్బి ఎర్రబారిన కళ్ళు, తడబడుతున్నట్టున్న మాటలతో ఉన్న కేసిడీని అనుమానంగా చూసింది మిస్ స్మిత్. అతను మీకేమవుతాడు అని అడిగితే, ఫేమిలీ ఫ్రెండ్ అని చెప్పారు. ఆమె పెద్దగా సంతృప్తి చెందినట్టు అనిపించలేదు. మళ్ళీ ఇంకోసారి ఇన్స్పెక్షన్ కు వస్తాననీ, తన రిపోర్ట్ ముందు వచ్చిన డిటెక్టివ్ కు పంపుతానని చెప్పి వెళ్ళింది. ఆమె వెళ్ళగానే కేట్ భయంతో కేసిడీ నుంచి జనీన్ ను లాక్కుని, 'నీవలన జనీన్ ను కూడా మానుంచి తీసుకుపోతారేమో' అని ఏడుస్తూ గదిలోకి పోయి తలుపువేసుకుంది. కేసిడీ హతాశుడై నెమ్మదిగా శక్తిలేనట్టుగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

కేసిడీ మరునాడు డాక్టర్ దగ్గరికి వెళ్ళి తర్వాతిరోజు జెస్ ఫ్యునరల్ లో తను పాడాలనీ, అందుకని తాగకుండా ఉండటానికి సహకరించేలా మందులు అడిగాడు. వాటి సహాయంతో మరునాటి వరకూ తాగకుండా గడిపాడు. జెస్ ఫ్యునరల్ కి తన డాక్టర్లు అందరూ

కలిసివచ్చి, కుటుంబానికి వాళ్ళ సంతాపాన్ని తెలిపివెళ్లారు. డాక్టర్ మార్షల్ జెస్ మరణానికి తాను చింతిస్తున్నానని మొసలి కన్నీళ్ళు కార్చింది. తిరిగి వెళుతున్నప్పుడు జెనెటిసిస్ట్ డాక్టర్ గెరావే బర్క్ ను, జెస్ మరణానికి కారణం తెల్సిందా అని అడిగాడు. డాక్టర్ బర్క్ చెప్పిన కారణం విని నమ్మలేనట్టు షాక్ తో 'మనం అదెలా మిస్ అయ్యాం' అని అడిగాడు. వెంటనే డాక్టర్ మార్షల్ 'ఎవరూ ఏదీ మిస్ అవలేదు. అది ఉంటుందని ఎవరూహించారు? అయినా జన్యుపరమైన లోపాలు ఆమెలో ఇంకెన్ని ఉన్నాయో ఎవరికి తెలుసు. ఆ పిల్లొక నడిచే టైం బాంబ్ లాంటిది' అని తప్పు ఆయన మీదకే తోసేటట్టు మాట్లాడింది.

జెస్ ఫ్యునరల్ టైంలో కూడా మిస్ స్మిత్ వచ్చి అందరినీ, అన్నిటినీ పరీక్షగా చూసింది. జనీన్ కేసిడీతో క్లోజ్ గా ఉండటం చూసి వాళ్ళిద్దరినీ వదలకుండా పరిశీలిస్తూ తిరిగింది. అది చూసిన కేసిడీ ఇకపై తను అస్సలు తాగకూడదు అని నిశ్చయించుకుని, ఆఫీసుకు సెలవు పెట్టి ఇంట్లోనే ఉండి మందులు వేసుకుంటూ, ఆ విత్ డ్రాయల్ లక్షణాలు భరిస్తూ తాగకుండా ఉండటానికి సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాడు.

కేట్, ఫోర్డ్ జెస్ విషయం వల్ల వాళ్ళ మీదున్న నిఘాకు, అనుమానాలకు బాధపడ్డారు. అంతకన్నా ఎక్కువగా జనీన్ ని తమనుంచి దూరం చేస్తారేమో అని భయం పట్టుకుంది. జెస్ పోయిన బాధలోంచి తేరుకోకముందే వారికి ఈ భయం ఎక్కువయ్యింది. జనీన్ పట్ల ఎంతో జాగ్రత్తగా ఉంటూ, తుమ్మినా సరే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళి , అనుక్షణం కళ్ళలో పెట్టుకుని చూసుకుంటున్నారు. వారికి జెస్ పట్ల తల్లిదండ్రులుగా తాము బాధ్యతగా ప్రవర్తించలేదేమో అన్న గిల్ట్ కూడా బాధించసాగింది. కేట్ కు నెలలు నిండటంతో కేట్ పేరెంట్స్ వారికి తోడుగా ఇక్కడే ఉండిపోయారు. వాళ్ళు 'మీరు జెస్ ను చాలా ప్రేమగా చూసుకుని చెయ్యగలిగినంతా చేసారు. మన చేతుల్లో ఏదీ లేదు. జెస్ జ్ఞాపకాలతో, జనీన్ లోనూ, పుట్టబోయే బిడ్డ లోనూ జెస్ ను చూసుకుంటూ గడపాలని' ఇద్దరికీ నచ్చచెప్పసాగారు. వారు కూడా జనీన్ ను తమనుండి తీసుకుపోకుండా ఉంటే చాలని ప్రార్థిస్తూ ఉన్నారు.

ఓ రెండు వారాలకు మిస్ స్మిత్ మళ్ళీ వచ్చింది. తను జెస్ డాక్టర్లతో మాట్లాడాననీ, వాళ్ళు చెప్పినదాన్ని బట్టి వారు జెస్ పట్ల బాధ్యతగానే ఉన్నట్టు తెల్సిందనీ, జనీన్ ను కొంచెం బాగోకపోయినా డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లడం, కేసిడీ బాధ్యతగా తాగుడు మానే ప్రయత్నం చెయ్యడం తమకి సంతృప్తి కలిగించిందనీ చెప్పింది. అయినా కూడా వాళ్ళు అత్యవసర పరిసస్థితుల్లో తగినట్టుగా స్పందించకపోవడం వల్ల తమకి కొన్ని కన్సర్న్స్ ఉన్నాయనీ, వాళ్ళిద్దరూ కొన్ని పేరెంటింగ్ క్లాసెస్ తీసుకోవాలని తాము సలహా ఇస్తున్నామని చెప్పింది. పిల్లలను పెంచడం క్లాసులకెళ్ళి నేర్చుకోవాలా అని వాళ్ళకు బాధ కలిగించినా జనీన్ కోసం దానికి ఒప్పుకున్నారు. వీళ్ళతో పాటు క్లాసుకి వచ్చిన జంటల్లో మిగిలిన అందరూ బాధ్యత లేకుండా, డ్రగ్ ఎడిక్ట్ అయినవాళ్లు, నేరం చేసి జైలుకి వెళ్ళి వచ్చినవాళ్లు, పిల్లలని ఎబ్యూజ్ చేసినవాళ్ళూనూ. అటువంటి వారితో తమని లేక్కేసినందుకు ఇద్దరికీ బాధ కలిగింది. అందులో కొందరు వీరితో పిల్లను ఏ విధంగా చంపారని అసహ్యంగా హేళనగా మాట్లాడారు. ఓ ఇద్దరయితే ఒంటరిగా వేచి ఉన్న కేట్ తో అసభ్యంగా ప్రవర్తించారు. అది తెలిసి కోపంతో మండిపడి వాడి మీదకి గొడవకు పోబోయిన ఫోర్డ్ ని కేట్ ఆపేసింది. ఇద్దరూ కూడా రెండు వారాలు కష్టపడి ఆ క్లాసులు పూర్తి చేసి సర్టిఫికేట్ తీసుకుంటే, ఇకపై మిస్ స్మిత్ గొడవా, పోలీసుల గొడవ లేకుండా, జెస్ జ్ఞాపకాలతో, మిగిలిన ఇద్దరు పిల్లలతో తమ జీవితం తాము గడపొచ్చని ఒకరికొకరు సర్దిచెప్పుకున్నారు.

*"I am dead. I am gone. I was loved. What more can there be? Let their love be the end of me."*

జెస్ అటాప్సీ రిపోర్ట్ వచ్చిందేమో అని ఫోర్డ్ డాక్టర్ బర్క్ ఆఫీసుకి ఫోన్ చేసి, ఎన్నిసార్లయినా అతను దొరక్కపోతే డాక్టర్ బెంటన్ కు ఫోన్ చేసాడు. డాక్టర్ బెంటన్ జెస్ మరణానికి కారణం వివరించి, 'డాక్టర్ బర్క్ కు, డిటెక్టివ్ కు వారం క్రితమే రిపోర్ట్ పంపి, మరణ కారణం వివరిస్తూ, అందులో మీ పాత్ర లేదని సర్టిఫై చేసాను. వాళ్ళిద్దరూ మీకేమీ చెప్పలేదా?' అని ఆశ్చర్యపోయాడు. ఆ రిపోర్ట్ ను ఫోర్డ్ కోరిక మీద అతనికి ఫేక్స్ చేసాడు. ఫోర్డ్ కి ఇది విన్న తరువాత విపరీతమయిన కోపం వచ్చింది. తమ తప్పేమీ లేదని తెలిసిన తరువాత కూడా తమని క్లాసులనీ అదనీ ఇదనీ అంత క్షోభకి, యాతనకీ గురిచెయ్యడం, దానివల్ల కేట్ పడిన ఇబ్బందులు గుర్తొచ్చి కోపం వచ్చింది. నిజానికి డాక్టర్ బర్క్ కు ఆ రిపోర్ట్ వెంటనే అందింది. కానీ అతనికి 'మీ కూతురి మరణానికి కారణమయిన మహమ్మారి ఎదురుగా కనిపిస్తున్నా మేము చూడలేకపోయాము. ఆలస్యంగానయినా మేము చూసి ఉంటే మీ కూతురు బ్రతికేది' అని వారికి ఎలా చెప్పాలో తెలీలేదు. అతనికి డాక్టర్ మార్షల్ నిర్లక్ష్యం పట్ల కోపం, తన అసహాయత పట్ల దుఃఖం వచ్చింది. తనకే స్పష్టంగా తెలీని కారణాలతో ఆ రిపోర్ట్ను జెస్ మెడికల్ చార్ట్ లో కాకుండా వేరే ఫైల్ లో పెట్టమని చెప్పాడు. అలా అయితే ఎపుడయినా ఎవరన్నా అడిగినా తను అది చూడలేదు అని చెప్పొచ్చు అని సరిపెట్టుకున్నాడు.

మరునాడు ఫోర్డ్, జెస్ తాత నెడ్ కు అంతా వివరించి, ఆ డాక్టర్ల నిర్లక్ష్యమే జెస్ ను చంపిందనీ, తాను వాళ్ళ మీద లీగల్ చర్య తీసుకోవాలనుకుంటున్నాను అని చెప్పాడు. ఇద్దరూ కలిసి డాక్టర్ బర్క్ ఆఫీసుకు వెళ్ళి రిపోర్ట్ గురించి తమకు ఎందుకు చెప్పలేదు అని గట్టిగా అడిగారు. డాక్టర్ బర్క్ జెస్ చార్ట్ చూపించి అందులో రిపోర్ట్ లేదని ఋజువు చూపించాడు. జెస్ డాక్టర్ల టీమ్ అందరితో కలిపి మీటింగ్ పెట్టి అటాప్సీ రిపోర్ట్ లోని విషయాలన్నీ వివరిస్తామని చెప్పాడు. మీటింగ్ రోజున కుటుంబసభ్యులందరూ వెళ్లారు. డాక్టర్ బర్క్ అటాప్సీ రిపోర్ట్ వివరించిన తరువాత, డాక్టర్ మార్షల్ తమ దగ్గరున్న ఒకే ఒక్కఎఖో చూపించి, అందులో సూచనగా కూడా ఏమీ లేదని చూపించింది. ఋజువుగా అదే వ్యాధి ఉన్న వేరే పాప ఎఖో ఒకటి చూపించి, అది ఉంటే ఎలా కనిపిస్తుందో కూడా చూపించింది. ఆమె చెప్పిందంతా నిజమే అని నమ్మారు అందరూ. 'రిపోర్ట్స్ లో కనిపించకపోతే ఆమె మాత్రం ఏం చేస్తుంది పాపం అనుకున్నారు?' అంతే కానీ ఆమె నాటకాన్ని ఎవరూ పసిగట్టలేకపోయారు. ఆమె తన వాదనని బలిష్టం చేసుకోడానికి ముందు జాగ్రత్తగా, మిగిలిన ఎఖోస్ మాయమయినందుకు లైబ్రేరియన్ అజాగ్రత్త మీద కంప్లయింట్ కూడా ఫైల్ చేసింది.

*"My heart breaks. I love you, Vincent Garraway. But why did you puncture their peace with the truth? I have seen the truth, and you know the truth. But they would be happy and whole and healed if left in the lie."*

ఇది జరిగిన రెండు రోజులకి కేట్ కు డెలివరీ అయి బాబు పుట్టాడు. మళ్ళీ డాక్టర్లందరూ వచ్చి పరీక్షలు చేసి, బాబు మామూలుగానే ఆరోగ్యంగా ఉన్నాడని తేల్చారు. జెనిటెసిస్ట్ డాక్టర్ గెరావే వచ్చి పరీక్ష చేసి వెళుతూ 'హిల్గర్ సిండ్రోం ఉన్న వాళ్ళలో జెస్ ఒక అరుదైన కేస్. తన మేధాశక్తి అద్భుతం. అందుకని తన మీద నేను వ్రాస్తున్న ఒక కేస్ రిపోర్ట్ కోసం జెస్ రెండేళ్ళ వయసప్పటి ఒక ఎఖో ను లైబ్రరీ నుంచి కొన్ని నెలల క్రితం తీసుకున్నాను. అది నా దగ్గరున్నట్టు ఎవరికీ తెలీదు. మిగిలినవన్నీ ఎలా మాయమయ్యాయో నాకూ తెలీదు. జెస్ జీవితం మనకి ఇంకా ఏమేం నేర్పాల్సి ఉందో నాకు తెలీదు, కానీ ఆ ఫిలిం కాపీ మీకివ్వడం జెస్ పట్ల నా కనీస బాధ్యతగా భావిస్తున్నాను. ఒరిజినల్ లైబ్రరీకి తిరిగి ఇస్తాను, కానీ అది కూడా మాయమవుతుందనే నా అనుమానం' అన్నాడు. తను దుఃఖంతోనూ, అయోమయంతోనూ ఉండి, మిగిలిన ఎఖోస్ ఏమయ్యాయి అని అడగాలన్న ఆలోచన తనకి రానందుకు ఫోర్డ్ సిగ్గుపడ్డాడు. అలా తను అడిగి ఉంటే, అవి పోయాయి అని వాళ్ళు చెప్పినపుడు తనకి అనుమానం వచ్చిఉండేది అనుకున్నాడు. తమని వాళ్ళు అలా మోసగించినందుకు డాక్టర్ బర్క్ కూ, డాక్టర్ మార్షల్ కూ బుద్ధి చెప్పాలని అనుకున్నాడు.

జెస్ పేరెంట్స్ సిటీలో పేరొందిన బ్రాండన్ & బ్రాండన్ అనే మాల్ ప్రాక్టీస్ లా ఫర్మ్ కు వెళ్లారు. అది తండ్రీ కొడుకు కలిసి చేస్తున్న లా ప్రాక్టీస్. బ్రాండన్ జూనియర్ ను కలిసి తమ కేస్ వివరాలు చెప్పారు. బ్రాండన్ కు ఆ కేస్ తమ ఫర్మ్ కి ఓ బంగారు బాతు కాబోతుందని అనిపించింది. వివరాలన్నీ తీసుకుని తన తండ్రి సీనియర్ బ్రాండన్ తో సంప్రదించి చెపుతానని చెప్పాడు. సీనియర్ బ్రాండన్ అది మంచి మెడికల్ ఫ్రాడ్ కేస్ అని చెప్పాడు. 'వెంటనే ఆ ఎఖో, కేస్ డీటైల్స్ మన ఫర్మ్ డాక్టర్స్ కు పంపించి స్టడీ చేయించు. హాస్పిటల్ మీద మెడికల్ ఫ్రాడ్, అది కలిగించిన మానసిక వ్యధ, ప్రాణనష్టం, జెస్ నలభయ్యేళ్లు ఉద్యోగం చేస్తే వచ్చే ఆదాయం, అన్నీ లెక్కలోకి తీసుకుని నాలుగు మిలియన్లు నష్టపరిహారం అడుగు. జెస్ ని ట్రీట్ చేసిన డాక్టర్లందరినీ, హాస్పిటల్ నీ ఇరికించు. హాస్పిటల్ పరువు నష్టం భయంతో పరిహారం చెల్లించి కేస్ విత్ డ్రా చేసుకుంటారు. వీలయినంత వేగంగా కేస్ ఫైల్ చేయించు. ఆశతో మరీ ఎక్కువ అడగకు సుమా. జెస్ డిసబెలిటీ ని అడ్డు పెట్టుకుని నిరాకరిస్తారు. అపుడు కేస్ ఏళ్ళ పాటు సాగుతుంది. మొత్తానికే మోసం వస్తుంది' అని చెప్పాడు.

బ్రాండన్ జూనియర్, జెస్ పేరెంట్స్ ను పిలిచి తమ ప్లాన్ చెప్పాడు. కేస్ గెలిస్తే వచ్చిన నష్టపరిహారంలో నలభై శాతం ప్లస్ కేస్ ఖర్చులూ తమ ఫర్మ్ కి, మిగిలినది వాళ్ళకూ అనీ, కేస్ ఓడిపోతే వాళ్ళు తమకి పైసా ఇవ్వక్కర్లేదనీ చెప్పాడు. జెస్ పేరెంట్స్ కు తమ కూతురికి డాక్టర్లు చేసిన అన్యాయానికీ, తమకు చేసిన మోసానికీ, కలిగించిన క్షోభకూ ప్రతీకారం తీర్చుకోవాలనే కోరిక తప్ప డబ్బు మీద ఆశ లేకపోవడంతో, అతను చెప్పిన ప్రతీదానికి మాట్లాడకుండా ఒప్పుకున్నారు. అయితే బ్రాండన్ జూనియర్ లో ఆ కేస్ లో జెస్ డిజబిలిటీ అడ్డుపెట్టుకుని ఇంకా ఎక్కువ లాగొచ్చనీ, తమకి ఇంకా డబ్బూ పేరూ రెండూ వస్తాయని దురాశ పుట్టింది. దానితో అతను నష్టపరిహారం ఇరవై మిలియన్లు అడుగుతూ, తండ్రి వద్దని వారించినా వినకుండా అతి విశ్వాసంతో కేస్ ఫైల్ చేసాడు. కోర్ట్ లో జ్యూరీకి జెస్ ను ఎందుకూ పనికిరాని ఎదుగుదల లేని మొద్దుపిల్లగా ప్రెజెంట్ చేసి వారి సింపతీ సంపాదిస్తే, అది వారిలో ఆ చిన్నపిల్లకు జరిగిన దాని మీద అపరాధభావం కలిగి కేస్ లో తమకి అనుకూలంగా తీర్పు ఇస్తారనీ, జెస్ సంపాదన ఎక్కువగా క్లైమ్ చేసినపుడు డిఫెన్స్ వాళ్ళు ఆమెను పనికిరాని మాంసపుముద్దగా వర్ణిస్తూ వాదిస్తారనీ, అదికూడా తమకి అనుకూలంగా మారుతుందనీ చెప్పాడు.

జెస్ పేరెంట్స్ తో బ్రాండన్ జూనియర్ 'జెస్ తెలివితేటలు, లెక్కల్లో ఆమె ఎంత చురుకో లాంటి విషయాలు కోర్టుకు ఆఖర్లో చెపుదాం. ముందు ఆమెలోని లోపాలు, డిజబిలిటీ లాంటి విషయాలు హైలైట్ చేస్తూ చెపుదాం. అవి వాళ్ళలో ఆమె పట్ల జాలి కలిగిస్తాయి. లేకపోతే మనకి అనుకూలంగా ఉండదు' అని నచ్చచెప్పాడు. జెస్ గీసిన వంకర టింకర డ్రాయింగ్స్, సాకర్ ఆడుతున్నప్పుడు బాల్ తన్నలేక ప్రయాసపడిన వీడియోలు, ఆమె వెళ్ళిన స్కూల్ టీచర్ల నుండి, ఇలా చాలా సాక్ష్యాలు సంపాదించాడు. తమ కూతురేమీ అంత మొద్దు కాదనీ, డిజబుల్ అయినా స్పెషల్ టాలెంట్ ఉన్నదనీ, అన్ని పనులూ కూడా స్వయంగా చేసుకునేదనీ, ఆయన చెప్పమంటున్నవేవీ నిజాలు కావనీ వారు పదే పదే అడ్డుచెప్పినా, అదంతా జెస్ కు న్యాయం చెయ్యడానికే అని నచ్చచెప్పడంతో అయిష్టంగానే ఒప్పుకున్నారు. ఆఖరుకు జెస్ ఆఖరుక్షణాలు వివరిస్తూ వాళ్ళు స్వచ్ఛంగా కారిన కన్నీళ్ళను కూడా కేస్ కు అనుకూలంగా వాడుకోవాలనుకున్నాడు.

కేస్ కోసం వ్రాసిన పేపర్లో జెస్ గురించి సగం అబద్ధాలతో సరికొత్త జెస్ ను పుట్టించాడు. హాస్పిటల్ వాళ్ళు కోర్ట్ నుండి పేపర్స్ అందుకోగానే, తమ పరువు పోకుండా ఒక మిలియన్ డాలర్లు ఇచ్చి కేస్ లేకుండా చేసుకుందాం అనుకున్నారు. అయితే బ్రాండన్ నాలుగు మిలియన్లకు తగ్గేది లేదన్నాడు. వాళ్ళు క్రిందా మీదా పడి ఆలోచించి దానికి ఒప్పుకున్నారు. అయితే బ్రాండన్ దానికి కూడా ఒప్పుకోకుండా, 'ఫేమిలీ తమకు న్యాయం జరగాలంటున్నారు. ఇరవై మిలియన్లకు తగ్గేది లేదు' అని చెప్పాడు. దానితో వాళ్ళు కోర్ట్ లోనే తేల్చుకుందాం పొమ్మన్నారు.

*"Memory should heal the pain of loss, not inflame it."*

కోర్టులో కేస్ ఓ మూడునెలల తర్వాత విచారణకి డేట్ ఇచ్చారు. బ్రాండన్ ఈలోగా జెస్ తల్లిదండ్రులచేత కోర్టులో అడిగే ప్రశ్నలకి జెస్ ఒక స్టుపిడ్ అనిపించేలా ఎలా జవాబులు చెప్పాలో స్క్రిప్ట్ ఇచ్చి, ప్రాక్టీస్ చెయ్యించసాగాడు. ప్రతీవారం అతని ఆఫీసుకి వెళ్ళి అవి ప్రాక్టీస్ చెయ్యసాగారు. అయితే కేస్ వేస్తున్న సంగతి తప్ప మిగిలిన వివరాలేవీ కేట్ తల్లిదండ్రులకి కానీ, కేసిడీ కి కానీ తెలీదు. ఒకరోజు వాళ్ళు ప్రాక్టీసుకు వెళుతూ స్క్రిప్ట్ పేపర్స్ టేబుల్ మీద మర్చిపోయి వెళ్ళిపోయారు. పిల్లలని చూసుకోడానికి వారి ఇంట్లో ఉన్న కేసిడీ అవి చూసి, యధాలాపంగా చదవసాగాడు. అదేదీ తమకి తెలిసిన జెస్ గురించి అన్నట్టుగా లేదు. ఎంతో అపురూపమయిన జెస్ జ్ఞాపకాలని, వాళ్ళు ప్రతీకారం మత్తులో పడి, వికృతంగా మారుస్తూ అసలు జెస్ ని మర్చిపోయేలా చేసుకుంటున్నారని అతనికి విపరీతమయిన కోపం, బాధ కలిగాయి. అపుడే బయటనుంచి వచ్చిన కేట్ తల్లిదండ్రులతో విషయం చెప్పి, 'ఇదంతా ఆ లాయర్ నూరిపోస్తున్న విషం. దీన్ని ఆపాలి' అని విసురుగా బయలుదేరాడు. కోపంతో ఆలోచనల్లో మునిగి డ్రైవ్ చేస్తున్న కేసిడీ ఏక్సిడెంట్ కు గురయ్యి, కోమాలోకి వెళ్ళిపోయాడు. ఇంటికి వచ్చిన కేట్ ఫోర్డ్ లను ఆమె తల్లిదండ్రులు ఇదంతా ఇలా ఎందుకు చేస్తున్నారు అని నిలదీసారు. ఫోర్డ్ 'లాయర్ చెప్పటంవల్ల జెస్ కు న్యాయం జరగటంకోసమే చేస్తున్నాము. జ్యూరీ కి డాక్టర్ల పట్ల కోపం ఏర్పడ్డాక, ఆఖరులో జెస్ గురించి నిజాలు చెపుతామని చెప్పాడు.' అన్నాడు. వాళ్ళు 'అదంతా లాయర్ తమ స్వార్థం కోసం వీళ్ళని పావుగా వాడుకుంటున్నాడనీ, ఒకసారి మనిషి మీద వేరే అభిప్రాయాలు ఏర్పడ్డాక నిజాలు చెప్పినా ఫలితం ఉండదనీ, వీళ్ళు కూడా ప్రతీకారం ఆలోచనలో కూతురి మధుర జ్ఞాపకాలని దూరం చేసుకుంటున్నారని' చెప్పారు. కేట్ ఫోర్డ్ ఇద్దరికీ అందులో నిజం అర్థమయి తమ తప్పు తెలుసుకుని సిగ్గుపడ్డారు.

*"In the end, it's people who own vengeance, who will not pardon the injustice. He forgives, forgets. Forgives."*

ఈలోగా కేసిడీ ప్రమాదవార్త తెలిసి, కేట్ తల్లి ఇదంతా మీరిద్దరూ చేసిందానివల్లే జరిగింది అని అరిచింది. హాస్పటల్ కు వెళ్ళి అందరూ కేసిడీ ఉన్న గదిలోకి వెళ్లారు. కేట్ ఫోర్డ్ ఇద్దరూ బాధతో, సిగ్గుతో తలదించుకుని ఉంటే, కేట్ తల్లిదండ్రులు 'జరిగిందేదో జరిగిపోయింది. ఇకపై ఏంజరిగినా మనందరం ఒకరికొకరు తోడుగా ఉన్నన్నాళ్ళు అన్నీ సరిగానే ఉంటాయి. బాధపడకండి' అని ధైర్యం చెప్పారు. ఇంతలో కేసిడీ స్పృహలోకి వచ్చి కదలడం చూసి అందరూ ఆనందించారు. ఫోర్డ్ ఇంటికి వచ్చిన తరువాత లాయర్ కు ఫోన్ చేసి, తాము కేస్ కోర్టులో విచారణకి తీసుకెళ్ళమనీ, అతనికి ఇష్టమయితే కేస్ సెటిల్ చెయ్యమని, లేకపోతే వదిలెయ్యమనీ చెప్పాడు. లాయర్ ఏదో సర్ది చెప్పబోయాడు కానీ ఫోర్డ్ వినిపించుకోకుండా ఫోన్ పెట్టేసాడు. ఇదంతా పైనుంచి చూస్తున్న జెస్ కు వాళ్ళ మధ్య ఉన్న ప్రేమ, క్షమ అర్థమయ్యింది. క్షమాగుణం లేని మనిషి, థంబ్స్ లేని చేతిలా అసంపూర్ణం అని అర్థం అయింది. అప్పటివరకూ ఆమెకు తన డాక్టర్ల మీద ఉన్న కోపం పోయింది.

*"If the point is that life goes on, that people linked together in love can heal their hearts."*

కేసేడీ కొన్ని వారాల తరువాత హాస్పిటల్ నుంచి తిరిగివచ్చాడు. అతనికి ఒక వైపు పక్షవాతం వచ్చింది. అయినా సరే అతని ఉద్యోగాన్ని పోస్ట్ ఆఫీసు వాళ్ళు అతని మీద ప్రేమతో అలానే ఉంచారు. కేస్ సెటిల్ చేసుకుంటే హాస్పిటల్ వాళ్ళు కేవలం ఎనభై వేలు ఇస్తే, దాంట్లో బ్రాండన్ అతని షేర్ తీసుకుని మిగిలినది వీళ్ళకు ఇచ్చాడు. దానితో వాళ్ళు కేసేడీ కోసం తమ ఇంట్లో స్పెషల్ రూం కట్టించి, అతన్ని తమతోనే ఉంచుకున్నారు. కేసిడీ పిల్లలతో సంతోషంగా కాలక్షేపం చేస్తూ, జెస్ ని ప్రేమగా తలుచుకుంటూ తన శేషజీవితం ఆనందంగా గడిపాడు.

*"I see forgiveness in that inner silence. I see the love they have for each other, and I see it come together, healed and whole. I see love made perfect by forgiveness, as a hand by a thumb. And I see*

*there can be no forgiveness without loss, grief, chaos. Without His chaos, my chaos, there is a hole like a cave in love. Only through chaos can forgiveness exist, can forgiveness touch everything with healing, the past★, present★, future★, all people, all creation, the Assembler Himself. Only through imperfection can forgiveness make love perfect."*

మొత్తం కథ జెస్ చనిపోయిన తరువాత, కేసిడీ ఏక్సిడెంట్ వరకూ దేవుడు కొన్ని వీడియోలు చూపిస్తున్నట్టుగా నడుస్తుంది. ఒక్కో టేప్ చూసిన తరువాత జెస్ ఫీలింగ్స్ చెప్పిన తీరు కదిలించేలా ఉంటుంది. మొదటి వీడియోలో తను లోపాలతో పుట్టిందని తెల్సినా, తల్లి మొహంలో ఆనందం చూసి తనకు ఎంతో సంతోషం కలుగుతుంది. తను చనిపోయినపుడు తనవాళ్ళు పడిన బాధ, తనని వాళ్ళు ఎంత ప్రేమించారో అర్థం చేసుకుని సంతృప్తి పడుతుంది. అయితే తర్వాత తన తల్లిదండ్రులు పడిన కష్టాలు, వాళ్ళ దుఃఖం చూసి తట్టుకోలేకపోతుంది. తన చావు పట్ల డాక్టర్లు ప్రవర్తించిన తీరు చూసి ఆమెలో కోపం కలుగుతుంది. 'నా జీవితం ముగిసిపోయింది. నేనంటే నా వాళ్ళందరికీ ప్రేమని తెల్సింది. నన్నలా వదిలెయ్యకుండా ఇపుడు ఇవన్నీ చూపించి నాకెందుకు దుఃఖాన్ని కలుగచేస్తున్నావ్?' అని అడుగుతుంది. అలాగే డాక్టర్ గెరావే తల్లిదండ్రులకు తన ఎఖో ఇచ్చినపుడు, 'అయ్యో ఇన్నాళ్ళు వాళ్ళు నాది సహజమరణం అనుకుంటున్నారు. ఇపుడు డాక్టర్ల నిర్లక్ష్యం తెలిస్తే వాళ్ళు తట్టుకోలేరు. వాళ్ళల్లో కోపాన్ని, పగనీ నేను చూడలేను. అలా వదిలేస్తే ఆ గాయం నెమ్మదిగా మానేది కదా. ఇప్పుడు వాళ్ళకు ఆ నిజం తెలుసుకునే అవకాశం ఇచ్చి గాయాన్ని పెద్దది చెయ్యడం నీకు అవసరమా?' అని వాపోతుంది. కేస్ గెలవడం కోసం తన అసలు లక్షణాలన్నీ దాచి లాయర్ అబద్ధపు జెస్ ని సృష్టించినపుడు, అయ్యో అది నేను కాదు అని అల్లాడిపోతుంది. తన పేరెంట్స్ లాయర్ చెప్పినవన్నీ చేస్తూ ప్రతీకారం తప్ప, తనని ప్రేమగా తలుచుకోడం మర్చిపోయినపుడు ఎందుకోసం ఇదంతా అని ఆక్రోశిస్తుంది. జెస్ తో పాటు ఆమె ప్రతి స్పందనలన్నీ మనలోనూ ఎకో అవుతాయి.

*"Forgiveness is all we know of God, and in the end, it's all He cares to know of us."*

పిల్లలు ప్రమాదకరమయిన వ్యాధుల బారిన పడ్డప్పుడు అది తల్లిదండ్రుల మీద చూపించే ప్రభావం, పిల్లలని కోల్పోయినపుడు వాళ్ళ శోకం, దాన్నుంచి వాళ్ళు బయటపడటానికి ప్రయత్నించడం, డాక్టర్లు తమ పేషెంట్స్ తో (ముఖ్యంగా పిల్లలతో) పెంచుకునే అనుబంధం, కొందరి డాక్టర్ల నిర్లక్ష్య వైఖరి, పేరెంట్స్ మానసిక పరిస్థితులను తమకు అనుకూలంగా దోపిడీ చేసే మెడికల్, లీగల్ సంస్థలు వీటన్నిటినీ ఎంతో చక్కగా వివరించారు. ముఖ్యపాత్రలను చిత్రించిన తీరు అద్భుతం. శోకంలో కూడా సంతోషం దాగి ఉందని కేసేడీ పాత్ర ద్వారా చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. పాఠకుల మనసు దోచుకోడానికి జెస్, కేసేడీ పాత్రలు పోటీపడతాయి. అక్కడక్కడా జెస్ మాటలు వయసుకు మించినట్టు అనిపించినా కూడా, మరీ అసహజంగా అనిపించదు. కొన్ని చోట్ల 'నన్ను దేవుడు మధ్యాహ్నం నిద్రలో జోగుతూ తయారుచేశాడేమో' లాంటి జెస్ మాటలకు నవ్వొస్తుంది. కొన్నిచోట్ల బాధతో, కోపంతో మనసు మెలిపడుతుంది. మనలో ఎన్ని లోపాలున్నప్పటికీ , మన మనసులకి స్వస్థత కూర్చేవి కేవలం ప్రేమ, క్షమ మాత్రమే అన్నది అర్థమవుతుంది.

'కథలు ఎక్కడి నుంచో పుట్టవు. మన చుట్టూ ఉన్న జీవితాల్లోంచి, మనుషుల నుంచే పుడతాయి' అన్నది ఎంతో నిజం. రచయిత వృత్తిపరంగా చిల్డ్రన్స్ స్పెషలిస్ట్. తన ముప్పయ్యేళ్ళ వృత్తిజీవితంలో ఎందరో చిన్నపిల్లలని ప్రాణాంతకమయిన వ్యాధులతో ఉన్నవాళ్ళని ట్రీట్ చేసినపుడు, అది పిల్లల మీదా, వాళ్ళ కుటుంబాల మీదా చూపించిన ప్రభావం అతన్ని కదిలించి, ఈ పుస్తకం వ్రాయాలని అనిపించిందట. ఇందులో తనకు ఎదురైన అనుభవాలే వ్రాసానని అంటారు. తనలాంటి వ్యాధిగ్రస్తులయిన పిల్లలకు సేవలందించాలనే

ఉద్దేశ్యంతో డాక్టర్ కావాలనుకుంటున్న, హిల్గర్ సిండ్రోం ఉన్న ఓ యువకుడిని కలిసినప్పుడు జెస్ పాత్రకి ప్రేరణ కలిగిందట. పిల్లల వ్యాధి వల్ల దుఃఖంలో ఉన్న పేరెంట్స్ ని చూసినపుడు, 'ఆ బాధ వాళ్ళ మధ్య ప్రేమని ఇంకా బలపరిస్తే, ప్రతీ మరణం వెనుకా ఓ ప్రయోజనం ఉందని తెలిస్తే ఆ బాధ కొంచెం తేలికవుతుందేమో ' అన్న ఆలోచన వచ్చిందని అంటారు. 'మంచి వాళ్ళకే కష్టాలు ఎందుకు వస్తాయి? అసలు మనుషుల్లో కానీ, మనస్సులో కానీ ఇంత అస్తవ్యస్తత, అన్యాయం ఎందుకు?' అని తనకొచ్చే ప్రశ్నలకు జవాబు వెదుక్కునే ప్రయత్నంలోనే ఈ పుస్తకం వ్రాసాను అంటారు. ఇది రచయిత మొదటి పుస్తకం అంటే నమ్మడం కష్టం. మంచి అనుభవమున్న రచయిత వ్రాసినట్టు అనిపించింది. వదలకుండా చదివించి, చదివిన తరువాత ఆలోచింపచేసే లక్షణం ఉన్న పుస్తకాల్లో ఒకటి. రచయిత పిల్లల భావేశాలు, వాళ్ళ ఆలోచనలు, స్పందనలు వర్ణించిన తీరు అద్భుతం.



రచయిత పరిచయం: Dr. Raoul Wientzen, వాషింగ్టన్ డి.సి లోని జార్జ్ టౌన్ యూనివర్సిటీ హాస్పిటల్లో పిల్లల వ్యాధి నిపుణుడుగా, మెడికల్ అధ్యాపకుడిగా ముప్పయి సంవత్సరాలకు పైగా పనిచేశారు. ప్రస్తుతం గత ఐదేళ్ళుగా Rostropovich Foundation అనే ఇంటర్నేషనల్ హెల్త్ కేర్ ఫౌండేషన్ కు మెడికల్ డైరెక్టర్ గా ఉన్నారు. తన మీద ప్రభావం చూపిన పిల్లలు, వారి కుటుంబ సభ్యుల ఎమోషన్స్, తను చూసిన వ్యవస్థలో లోపాలు ఆధారంగా 2013లో ఈ పుస్తకం వ్రాసారు. రచయిత మొదటి పుస్తకమే అయినప్పటికీ మంచి ప్రశంసలు పొందింది.

రచయితతో ఒక ఇంటర్వ్యూ:

Interview: Dr. Raoul Wientzen Takes a Turn for the Fantastic in 'The Assembler of Parts'

(Pictures Source: Internet)



# పుస్తకం ఓ నేస్తం
# – పద్మవల్లి



## సాహసం చేయరా డింభకా

### *The Boy Who Said No: An Escape to Freedom*




కథమ్మా, కథమ్మా నువ్వు కంచిలో పుట్టావామ్మా అంటే, లేదూ నేను మీ జీవితాల్లోంచే పుట్టానూ అందట. జీవితం కథ కాదూ అంటారు. ఒక్కోసారి కథలను మించి డ్రామా ఉన్న జీవితాలూ ఉంటాయి. అవి కంచె దాటి రావు కాబట్టి మనకి తెలీదు. అతి సాధారణంగా సాగుతున్న జీవితాలు కూడా ఒక్కోసారి అనుకోని మలుపులు తిరిగి, కలలో కూడా ఊహించని సాహసాలు చేయాల్సివస్తుంది. మన రక్షణకవచం పరిమితులు దాటి ఆ సాహసానికి పూనుకోవాలంటే, దానివల్ల దొరికే ఫలితం కూడా మనకి అంతే అపురూపమై ఉండాలి కదా! లేకపోతే పాతాళభైరవిలో నేపాళ మాంత్రికుడు 'సాహసం చేయరా డింభకా, రాకుమారి వరిస్తుంది' అనగానే తను ఎవరిని ఢీ కొంటున్నాడో ఏమాత్రం ఆలోచించకుండానే ప్రమాదంలోకి దూకడానికి తోటరాముడికేమన్నా పిచ్చా!! తను ప్రేమించిన సుకుమారి కోసం ప్రాణాలకు తెగించి, ఫిడేల్ కాస్ట్రో మిలిటరీని ఒక ఆట ఆడించి, దొంగతనంగా క్యూబా నుండి అమెరికాకు చేరుకున్న అభినవ తోటరాముడు ఫ్రాంక్ నిజజీవిత కథ, Patti Sheehy వ్రాసిన The Boy Who Said No: An Escape to Freedom.

కథాకాలం 1960 వ దశాబ్దం. ఫ్రాంక్ (Frank Mederos) క్యూబాలోని ఒక అతి సాధారణ కుటుంబంలో పుట్టాడు. తండ్రి ఒక ఫెర్టిలైజర్ ఫాక్టరీలో చిన్న ఉద్యోగం చేసేవాడు. తల్లి సాధారణ గృహిణి. వాళ్ళ నలుగురు పిల్లల్లో ఫ్రాంక్ పెద్దవాడు. విలువలకూ, ఆప్యాయతలకూ ప్రాధాన్యమిచే కుటుంబం వారిది. ఫ్రాంక్ తాతయ్య అంటే ఊరిలో అందరికీ ఎంతో గౌరవం. ఆయన ఇల్లు రకరకాల

పుస్తకాలతో నిండి ఉండేది. ఆయనకు ఎన్నో విషయాల మీద మంచి పరిజ్ఞానం ఉండేది. ఫ్రాంక్ కు నాలుగేళ్ల వయసున్నప్పటి నుంచే ఆయన తనతో చేపలవేటకు సముద్రంలోకి తీసుకెళ్ళేవారు. ఆ సమయంలో ఆయన ఫ్రాంక్ తో ఎన్నోవిషయాలు మాట్లాడుతూ, వాతావరణం, నీటి ప్రవాహం, ఆకాశంలో నక్షత్రాల స్థానం లాంటి ఎన్నో విషయాల గురించి కూడా నేర్పిస్తూ 'ప్రకృతి ఎంతో శక్తివంతమైనది. దాన్ని సరిగా అర్థం చేసుకుంటే మనకు అనుకూలంగా ఉపయోగించుకోవచ్చు' అని చెప్పేవారు. ఫ్రాంక్ తాతతో కలిసి ఫిషింగ్ కు వెళ్లడం, ఆయనతో టైం స్పెండ్ చెయ్యడం లాంటివి తనెంతో ప్రత్యేకం అన్నట్టు ఫీల్ అయ్యేవాడు. మొదటినుంచీ ఫ్రాంక్ కు తల్లిదండ్రులు, తాతయ్య కూడా, ఏదైనా న్యాయం కాదు అని అనిపించినపుడు దాన్ని ప్రశ్నించాలనీ, సత్ప్రవర్తన, నీతీ నిజాయితీలతో మెలగాలనీ, విద్యకు మించిన ఆస్థి లేదనీ, కష్టాలకు భయపడి స్వేచ్ఛను కోల్పోకూడదనీ వివిధ సందర్భాల్లో చెప్పేవారు. ఫ్రాంక్ కాలేజీకి వెళ్ళి బాగా చదువుకుని, మంచి జీవితం గడపాలని అందరూ కోరుకునేవారు. అదే ఊర్లో ఉండే బోలెడు మంది కజిన్స్, స్నేహితులతో కలిసి స్కూలుకు వెళ్ళి రావటం, ఆటలు, అల్లరి... వీటితో ఫ్రాంక్ బాల్యం సాధారణంగా సాగిపోతుంది.

ఫ్రాంక్ కు దాదాపు పదమూడేళ్ళ వయసు ఉన్నప్పుడు, 1959 లో క్యూబన్ రివల్యూషన్ వచ్చి, నియంత బాటిస్టాను కూలదోసి ఫిడేల్ కాస్ట్రో అధికారంలోకి వచ్చాడు. బాటిస్టా పాలనలో అందరికీ జీవితం సాఫీగా జరిగిపోయినట్టుగానే ఉండేది. అమెరికా బాటిస్టాతో రాజకీయ సత్సంబంధాలు పెట్టుకుని, క్యూబా లోని పంటలు, వ్యాపారాలు, పరిశ్రమల మీద తమ అనుకూలంగా పెట్టుబడులు పెట్టుకుంది. అప్పట్లో క్యూబాలో అమెరికన్లు విలావంతమయిన జీవితం గడుపుతుంటే, బడుగు రైతులు మాత్రం డొక్కలు మాడ్చుకుని చాకిరీ చేసేవారు. ఇవన్నీ కాస్ట్రోకూ అతని పార్టీ సభ్యులకూ నచ్చేవికాదు. కాస్ట్రో అధికారంలోకి రాగానే అందరి ప్రైవేట్ ఆస్తులనూ స్వాధీనం చేసుకున్నాడు. అన్నీ ప్రభుత్వానికే తప్ప వ్యక్తులకు చెందవు అని స్పష్టం చేసాడు. క్యూబా అమెరికాల మధ్య దౌత్య సంబంధాలు, వ్యాపార సంబంధాలూ దెబ్బతిన్నాయి. మిస్సైల్స్ కోసం రష్యాతో స్నేహసంబంధాలు పెంచుకున్నాడు. క్యూబా లోని పరిశ్రమలూ, సహజవనరులన్నిటినీ కూడా జాతీయం చేశాడు. కమ్యూనిస్ట్ పార్టీని శక్తివంతం చేసి, సోషలిజం కావాలని ఆశించాడు. చాలామంది ధనవంతులు బిజినెస్ లు కోల్పోయారు. ఇవేవీ నచ్చక చాలామంది దేశం వదిలి వెళ్ళిపోయారు. తమ కంపెనీలన్నిటినీ స్వాధీనం చేసుకోడంతో అమెరికాకి కోపం వచ్చి, క్యూబాతో ఒప్పందాలన్నీ రద్దు చేసుకుని, కాస్ట్రోను అధికారం లోంచి దించడానికి అవకాశం కోసం ఎదురుచూడటం మొదలుపెట్టింది.

ప్రజల్లో చైతన్యం రావాలంటే ముందు వాళ్ళల్లో అక్షరాస్యత పెరగాలని అనుకున్నాడు కాస్ట్రో. దానితో పదమూడేళ్ళు నిండిన మగపిల్లలందరూ తప్పనిసరిగా దూరంగా ఉన్న కొండల్లోని, పల్లె ప్రాంతాలకు వెళ్ళి అక్కడ కొన్ని నెలలు చదువు చెప్పాలని ఆర్డర్ చేసాడు. పిల్లలు చదువులు ఆపడం, దూరంగా ఒంటరిగా వెళ్లటం తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా, వాళ్ళను పంపించడం తప్పలేదు. సైనికులు పిల్లలను తీసుకువెళ్ళి ఆ రైతు కుటుంబాల దగ్గర వదిలి వచ్చారు. అయితే అక్కడ పరిస్థితి వేరుగా ఉంది. ఆ రైతులకి పిల్లలతో సహా కుటుంబం మొత్తం పొలాల్లో పనిచెయ్యకపోతే గడవని పరిస్థితి. దానితో వాళ్ళు చదువు మీద ఏమీ శ్రద్ధ చూపించలేదు. అయితే కాస్ట్రో ఆజ్ఞ ప్రకారం వాళ్లకి చదవడం నేర్పాలి కాబట్టి, కొందరు పిల్లలు వాళ్ళు చదువు నేర్చుకుంటే తాము వాళ్లకు పొలంపనుల్లో సాయం చేస్తామని మాటిచ్చి కాస్త చదవడం నేర్పించారు. దాదాపు ఒక సంవత్సరం గడిచాక సైనికులు ఆ అక్షరాస్యత ప్రోగ్రాం అయిపోయిందని చెప్పి పిల్లల్ని ఇళ్లకు తీసుకువచ్చి వదిలేసారు.

తరువాత కొన్ని రోజులకు కొందరు సైనికులు ఫ్రాంక్ ఇంటికి వచ్చి, అక్ష్యరాస్యత ప్రోగ్రాములో ఫ్రాంక్ చూపించిన నడవడి వల్ల గవర్నమెంట్ అతన్ని గౌరవించి, కానుకగా ప్రత్యేకమైన గవర్నమెంట్ మిలిటరీ స్కూల్లో స్కాలర్షిప్ ఇచ్చి చదివించాలని నిర్ణయించిందని చెప్పారు. అంత ఖరీదయిన స్కూల్లో ఉచితంగా చదువుకొనే అవకాశం రావడంతో ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయినా, వెంటనే కొడుకుని దూరంగా పంపడానికి తల్లి ఒప్పుకోలేదు. అయితే ఆ అవకాశాన్ని కాదనడం దేశద్రోహం క్రింద అవుతుందని సైనికులు హెచ్చరించడం, పైగా

చదువుకునే అవకాశాన్ని వదులుకుంటే తాతయ్యను బాధపెడతానేమో అనీ అలోచించి ఫ్రాంక్ వెళ్ళడానికి ఒప్పుకున్నాడు. అదృష్టవశాత్తు ఆ స్కూల్ ఇంటికి కొన్ని మైళ్ళ దూరంలోనే ఉంది. అయితే నెలకొకసారి మాత్రమే ఇంటికి పంపుతారు. అది ఉన్నతమయిన సౌకర్యాలతో, విద్యాబోధనలతో ఉన్న స్కూల్. అక్కడ అమెరికా క్యూబన్ రిసోర్స్ ని ఎలా దోచుకుంది, కేపిటలిస్ట్ దేశాల అవినీతి, సోషలిజం ప్రజల జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుంది, కాస్ట్రో ప్రభుత్వ విధానాల గొప్పదనం, కమ్యూనిస్ట్ పార్టీ ఆశయాలు లాంటి విషయాలు బోధించేవారు. క్యూబాలో ఆరోగ్య సదుపాయాలూ, విద్యావకాశాలు మెరుగుపడ్డాయని చెప్పేవారు. అయితే సెలవులకు వచ్చినపుడల్లా ఫ్రాంక్ చూస్తున్నవీ, తాత నుండీ ఫ్రెండ్స్ నుండీ వింటున్నవీ స్కూల్లో చెప్పే వాటికి దగ్గరగా లేవు. అమెరికా నుంచి ఫుడ్ సప్లై ఆగిపోవడం వల్ల ఆహార కొరత, ఫేక్టరీలు మూతబడటంతో నిరుద్యోగం పెరిగిపోయింది. ఆహార సరఫరాల కోసం రష్యా మీద ఆధారపడి, వచ్చిన కొద్ది వాటినీ ప్రభుత్వ దుకాణాల్లో రేషన్ పద్ధతిలో అమ్మడంతో నిత్యావసర పదార్ధాలు కూడా సరిపోయినన్ని దొరకడం లేదు. చదువు కూడా ఒక ప్రివిలేజ్ గా మారిపోయింది. ప్రైవేట్ ఆస్థులు స్వాధీనం చేసుకోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయింది. కాస్ట్రో విధానాల పట్ల, కమ్యూనిస్ట్ పార్టీ పట్ల కొందరు యువకులు ఆకర్షింపబడి, పార్టీలో చేరి శిక్షణ కోసం వెళ్ళిపోయారు. నచ్చనివారు అసంతృప్తితో ఉండి, అమెరికా ఎప్పటికయినా క్యూబాని కాస్ట్రో నుండి విడుదల చేస్తుందేమో అని రహస్యంగా ఎదురుచూస్తున్నారు. ఇవన్నీ చూసి, వింటున్న ఫ్రాంక్ కి గవర్నమెంట్, స్కూల్ నచ్చడం మానేసాయి. ఏది కరెక్టో తెలీని సందిగ్ధంలో పడ్డాడు. అప్పుడప్పుడూ అదే విషయాన్ని టీచర్స్ ని ప్రశ్నించేవాడు. కొన్ని నెలల తరువాత స్నేహితుల సాయంతో స్కూల్ నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చాడు. సైనికులు వచ్చి తిరిగి రమ్మని బెదిరించినా వెళ్ళలేదు.

ఫ్రాంక్ మళ్ళీ ఊర్లోని పబ్లిక్ హైస్కూల్లో చేరాడు. ఫ్రాంక్ మిలిటరీ స్కూల్ కి ఎంపిక అవ్వడం, అక్కడ నచ్చక తిరిగి వచ్చెయ్యడం లాంటి వాటితో, మిగిలిన వాళ్ళు ఒక హీరోలా చూడటం మొదలుపెట్టారు. స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు. స్కూలుకి వెళ్ళిన మొదటిరోజునే అతని కజిన్, తన ఫ్రెండ్ మాగ్డా అనే అమ్మాయిని పరిచయం చేసింది. మాగ్డా సంపన్నులూ, విద్యావంతులూ అయిన తల్లిదండ్రులకు గారాల కూతురు. ఆమె ఆంట్ సోఫియా ఉన్నతచదువులు చదివి ఒక ప్రైవేట్ స్కూల్ నడుపుతుండేది. మాగ్డా అదే స్కూల్లో చదవడం వలన, ఆమె ప్రవర్తన, ఆలోచనా, ఇంగ్లీష్ మాట్లాడే పద్ధతీ మిగిలిన అందరికన్నా ప్రత్యేకంగా ఉండేది. కాస్ట్రో ప్రైవేట్ స్కూల్స్ అన్నీ మూసేయ్యించడం వలన మాగ్డా పబ్లిక్ స్కూల్లో జాయిన్ కావాల్సి వచ్చింది. నాజూకుగా, ఆకర్షణీయంగా, ఎంతో అందంగా ఉన్న మాగ్డాని చూసిన మొదటి క్షణంలోనే ఫ్రాంక్ గుండె లయ తప్పింది. ఆమెతో స్నేహం కోసం తపించిపోయాడు. నెమ్మదిగా ఇద్దరి మధ్యా పరిచయం పెరుగుతూ, ఒకరంటే ఒకరికి ఇష్టం ఏర్పడింది.

ఫ్రాంక్ కి ఎప్పుడూ మాగ్డాతోనే ఉండాలని ఉండేది. ఇద్దరూ కొన్నాళ్ళు స్కూల్లోనే వీలుదొరికినపుడు కలిసి మాట్లాడుకుంటూ ఉన్నా ఇద్దరికీ తృప్తిగా ఉండేది కాదు. ఆ రోజుల్లో క్యూబాలో కుటుంబాల్లో ప్రేమా పెళ్ళీ లాంటి విషయాల పట్ల ఖచ్చితమయిన కట్టుబాట్లు ఉండి, సంప్రదాయాలు విలువలు పాటించేవారు. అప్పటి పద్ధతుల ప్రకారం ఫ్రాంక్ తన ఇంటికి రావడానికి, మాగ్డా తన తండ్రిని కలిసి పర్మిషన్ అడగమని చెప్పింది. మాగ్డా తండ్రిని కలిసి మాట్లాడాలనుకుంటున్న విషయం ఫ్రాంక్ తల్లికి చెప్పాడు. ఆమె కొడుకు చెప్పినదానికి కలత పడింది. అతను తనకి మాగ్డా అంటే చెప్పలేనంత ప్రేమ అని చెప్పాడు. తల్లి అతనితో 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ అమ్మాయితో హద్దు మీరి ప్రవర్తించను, ఆమెను గౌరవంగా ట్రీట్ చేస్తాను' అని ప్రామిస్ చేయించుకుంది. తల్లిదండ్రులు ఇద్దరూ కూడా అతనిని ప్రేమ గొడవలో పడి చదువు నిర్లక్ష్యం చెయ్యొద్దనీ, తాము కలలు కంటున్నట్టుగా కాలేజీ చదువులు పూర్తిచేసి, మంచి ఉద్యోగం, భవిష్యత్తు సంపాదించుకోవాలనీ కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువుకు ఆటంకం రానివ్వనని ఫ్రాంక్ వారికి మాటిచ్చాడు.

మాగ్దా పేరెంట్స్ ముందు సందేహించినా, ఫ్రాంక్ ని కలిసి మాట్లాడిన తరువాత, అతను ఇంటికి వచ్చి మాగ్దాతో గడపడానికి ఒప్పుకున్నారు. మొదట్లో వాళ్లతో పాటు మాగ్దా తల్లి కూడా అదే గదిలో మూలగా కూర్చుని, ఏదో అల్లికల పని చేసుకుంటూ, వీళ్ళ మీద ఓ కన్ను వేసి ఉండేది. అయితే నెమ్మదిగా ఫ్రాంక్ మీద ఇద్దరికీ సదభిప్రాయం కలిగి వారిద్దరినీ ఒంటరిగా వదిలేవారు. అయినా ఫ్రాంక్ ఎప్పుడూ హద్దు మీరి ప్రవర్తించలేదు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అవధుల్లేని ప్రేమ. అతని ప్రవర్తనతో తొందరలోనే వాళ్ళ అభిమానాన్ని పొందాడు. కూతురికి అతని మీదున్న ఇష్టం అర్థం అవడంతో, నెమ్మదిగా వాళ్ళు కూడా అతనిని తమ కుటుంబంలో ఒకడిగా భావించడం మొదలుపెట్టారు. వారిద్దరి కుటుంబాల మధ్య ఉన్న సామాజిక అంతస్తుల బేధం ఎవరికీ అభ్యంతరం కాలేదు. ఫ్రాంక్ చదువు కూడా మంచి మార్కులతో నడుస్తోంది.

కాస్ట్రో 1963 లో దేశంలో పదిహేను నుండి ఇరవై ఆరేళ్ళ మధ్య వయసున్న యువకులందరూ, మూడేళ్ళ తప్పనిసరి మిలిటరీ సర్వీస్ కు రిజిస్టర్ చేసుకోవాలనీ, వంతులవారీగా వారిని ట్రైనింగ్ కు పిలుస్తారనీ చెప్పాడు. రిజిస్టర్ చేసుకున్న వాళ్ళెవ్వరూ దేశం వదిలి వెళ్ళడానికి వీలులేదని శాసించాడు. తొందరలోనే అమెరికా దేశం మీద దాడి చెయ్యబోతుందని, దాన్ని నుంచి రక్షించుకోడానికి యువ సైన్యం అవసరం ఉందనీ ప్రసంగాలు చేసేవాడు. త్వరలోనే ఫ్రాంక్ కు కూడా మిలిటరీ సర్వీసెస్ కు రిపోర్ట్ చెయ్యమని కబురు వచ్చింది. మూడేళ్ళ పాటు ఇద్దరూ దూరంగా ఉండాలన్న విషయం ఇద్దరినీ విచారంలో ముంచింది. ఫ్రాంక్ వెళ్ళే సమయం వచ్చినపుడు అందరూ బాధగా పంపించారు.

మొదట కొన్నివారాలు మిలటరీ బూట్ కేంప్ లో కఠిన శిక్షణ తరువాత, ఫ్రాంక్ నీ మరి కొంత మందినీ ప్రత్యేకంగా సెలెక్ట్ చేసి స్పెషల్ మిలటరీ ట్రైనింగ్ కు పంపారు. అక్కడ ఫ్రాంక్ కి మేనీ, లాజో అనే ఇద్దరు యువకులతో దగ్గర స్నేహం కుదిరింది. ఈ ముగ్గురితో పాటూ ఇంకో ఐదుగురికి, రష్యా నుంచి తెచ్చుకున్న ప్రత్యేకమైన మిస్సైల్స్ వాటి మీద శిక్షణ ఇచ్చి, వాటి రక్షణ బాధ్యత వీళ్ళకి అప్పచెప్పారు. ఫ్రాంక్ వాటిని గురి తప్పకుండా ప్రయోగించడంలో అందరినీ మించిన నేర్పు సంపాదించాడు. మిలిటరీ పై అధికారుల ముందు జరిగిన దళ ప్రదర్శనలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి వాళ్ళ దగ్గర కూడా గుర్తింపు పొందాడు. అతని అధికారి కమాండర్ బ్రౌన్ కి అతనంటే ప్రత్యేకమయిన అభిమానం ఏర్పడింది. అతనికి ఎంతో రహస్యమయిన మిలిటరీ, ఆయుధ స్థావరాల వివరాలు, బాధ్యతలు అప్పచెప్పారు. తొందరలోనే టాప్ సెక్యూరిటీ టీమ్లో కీలకమైన స్థానానికి చేరుకున్నాడు. ఆ మిలటరీ బేస్ నుంచి తన ఊరికి ఒక గంట ప్రయాణం. నెలకోసారి సెలవు దొరికినపుడు తనవాళ్ళనీ, మాగ్దానీ కలిసి వస్తూ ఉండేవాడు. కమాండర్ బ్రౌన్, ఫ్రాంక్ ప్రేమ విషయం తెలుసుకుని, అప్పుడప్పుడూ ఫ్రాంక్ బయటకు వెళ్ళి మాగ్దాకు ఫోన్ చేసుకునే వీలు కల్పించాడు.

అయితే ఫ్రాంక్ చదువు మాని మిలటరీలోకి వెళ్లడం, అందులోనూ కమ్యూనిస్ట్ ఆర్మీ లోకి వెళ్ళాల్సి రావటం మీద అతని తాతయ్యకు మాత్రం అసంతృప్తిగానే ఉండేది. ఫ్రాంక్ తో 'స్వేఛ్ఛ కోసం ఆడుతున్న చదరంగంలో నువ్వొక పావులా మారావు. అయితే నువ్వు వేసే ప్రతీ అడుగూ ఆలోచించి వెయ్యి. కాస్ట్రో రష్యా మద్దతు చూసుకుని అమెరికాని కవ్విస్తున్నాడు. అమెరికా ఓ కమ్యూనిస్ట్ ని పక్కలో పెట్టుకుని ఎన్నాళ్ళో మౌనంగా ఉండదు. కమ్యూనిస్ట్ ల నుంచి మనకి స్వాతంత్రం కలిగించడాని త్వరలోనే దేశం మీదకి దండెత్తి వస్తుంది. అపుడు నీకు ఉన్న మార్గాలు మూడే. ఒకటి అమెరికా మీద యుద్ధం చెయ్యడం, నీకు స్వేఛ్ఛ ఇవ్వడానికి వచ్చిన అమెరికా తరపున యుద్ధం చెయ్యడం, లేదా ఏదో ఒకలా అందరినీ వదిలేసి క్యూబా నుండి వెళ్ళిపోవడం. వీటిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన రోజు త్వరలోనే వస్తుంది. సిద్ధంగా ఉండు.' అని చెప్పాడు.

మిలటరీలో తమ పార్టీ ఎజెండా, ఆశయాల గురించీ ఎంత గొప్పగా బోధించినా, ఫ్రాంక్ కి మాత్రం కమ్యూనిస్ట్ పార్టీ అంటే ఇష్టం కలగలేదు. అయితే ఎవరైనా ఏంటీ కమ్యూనిస్ట్ అని ఏమాత్రం అనుమానం వచ్చినా శిక్ష చాలా కఠినంగా ఉండేది. అందుకని ఎవరితోనూ బయటకి ఏమీ అనకుండా, తన పనులేవో తను చేసుకుంటూ ఉన్నాడు. మిలటరీలో పొలిటికల్ వింగ్ అధికారి లెఫ్టినెంట్ పీనో, కమ్యూనిస్ట్

పార్టీ భావాలు నరనరాలా నమ్మి జీర్ణించుకున్నవాడు. అతనికి విపరీతమయిన ఈగో, సుపీరియారిటీ. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ విధానాల గురించి కొందరు అనుమానం వెల్లడి చెయ్యడంతో, ఫ్రాంక్ ప్రోత్సాహంతోనే అందరూ ప్రశ్నిస్తున్నారన్న అభిప్రాయం కలిగింది. దానికి తోడు, స్కూల్లో కూడా యూత్ కమ్యూనిస్ట్ పార్టీ విధానాలను ఫ్రాంక్ ఎదిరించేవాడని అతనికి తెలియడంతో, అతను కమ్యూనిస్ట్ వ్యతిరేకి అన్న భావం బలపడింది. దానితో అతనికి ఫ్రాంక్ మీద తెలియని వ్యతిరేకత, అనుమానం కలిగాయి. అయితే ఫ్రాంక్ స్కిల్స్ చూసి మౌనంగా ఉండి, తన అనుమానం తీరే సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఇలా ఉండగా దేశంలో పరిస్థితులు ఇంకా దిగజారిపోయాయి. ఎకానమీ క్షీణించింది. వస్తువుల సరఫరా పూర్తిగా తగ్గిపోయి, బ్లాక్ మార్కెట్ పెరిగిపోయింది. ప్రభుత్వ విధానాల వల్ల విసుగెత్తిన కొంతమంది ధనవంతులు దేశం విడిచి వెళ్ళిపోడానికి ప్రయత్నాలు చేసుకోసాగారు. దేశం విడిచి వెళ్ళడానికి అనుమతి కోసం అప్లై చెయ్యగానే, వాళ్ళని దేశద్రోహులుగా, కమ్యూనిస్ట్ పార్టీ వ్యతిరేకులుగా లెక్కకట్టడం జరుగుతుంది. వీసా ఇవ్వడానికి దాదాపు ఏడాది పైనే పడుతుంది. వీసా ఇచ్చినా ఇవ్వకపోయినా సరే, ఆ నిమిషం నుండే వాళ్ళ ఆస్థులు, పర్సనల్ వస్తువులతో సహా ప్రభుత్వం జప్తు చేసుకునేది. క్యూబా కరెన్సీ బయట దేశాల్లో చెల్లు కాకుండా, క్రొత్త కరెన్సీని తీసుకొచ్చారు. ధనవంతులు కూడా దేశం వదిలి వెళ్ళే సమయానికి బికారులు గానే వెళ్ళాల్సి ఉండేది. అయినా కూడా చాలామంది అమెరికా మెక్సికో లాంటి దేశాలకు వెళ్ళి స్వేచ్ఛగా బ్రతకడానికే ఇష్టపడేవారు.

మాగ్డా తమ్ముడూ, ఆమె ఆంట్ సోఫియా కొడుకూ ఇద్దరికీ పద్నాలుగేళ్ళు నిండాయి. అబ్బాయిలకు పదిహేనేళ్ళు నిండగానే తప్పనిసరిగా మిలటరీలో చేరి, మూడేళ్ళు పనిచెయ్యాలి. కాదని అనే చాయిస్ లేదు. మాగ్డా పేరెంట్స్ కు కానీ, సోఫియా కుటుంబానికి కానీ వారి పిల్లలు కమ్యూనిస్ట్ మిలటరీలో చేరడం ఇష్టంలేదు. అసలే వారు ప్రభుత్వం వల్ల బిజినెస్ లు మూతపడి, అసంతృప్తితో ఉన్నారు. పిల్లలిద్దరూ మిలటరీలోకి వెళ్ళకుండా ఉండాలంటే వాళ్ళకి పదిహేనేళ్ళు నిండేలోగా దేశం విడిచి వెళ్ళిపోవటం ఒకటే మార్గంగా కనిపించింది. ఒకసారి మిలటరీలోకి వెళితే మూడేళ్ళ వరకూ వీసా అడగటానికి ఉండదు. ఎన్నో ఆలోచనలు చేసిన మీదట అమెరికాకు వలస పోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వాళ్లకి ఇపుడు సమస్య మాగ్డాతో వచ్చింది.

ఫ్రాంక్ మూడేళ్ళ మిలిటరీ సర్వీస్ అవడానికి ఇంకో సంవత్సరం ఉంది. ఆ తర్వాత అతను 28 ఏళ్లు నిండేవరకూ మిలటరీ రిజర్వ్ లో పనిచెయ్యాలి. అంటే దాదాపు ఇంకో పదేళ్లు దేశం వదిలి రాలేడు. మాగ్డా ఫ్రాంక్ రాకుండా తను దేశం వదిలి రానని పట్టుపట్టింది. ఫ్రాంక్ మిలటరీ నుంచి వచ్చేవరకూ తనొక్కతే ఇక్కడ ఉంటానంది. అయితే వీసా రాగానే వాళ్ళ ఆస్తులు పోతాయి. తనకి ఒంటరిగా ఉండి, ఉద్యోగం సంపాదించుకునే వయసు కూడా కాదు. అందుకని ఆమెకు 'ఇది నీకెంత దుఃఖం కలిగిస్తుందో మాకు తెలుసు. తనని వదిలివెళ్లడం మాకూ కష్టంగానే ఉంది. కానీ కుటుంబం మంచి కోసం తప్పదు. పైగా ఫ్రాంక్ కు కీలకమయిన మిలటరీ రహస్యాలు చాలా తెలియడం వలన అతనికి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశం వదిలివెళ్ళడానికి అనుమతివ్వరు. అతను తప్పించుకు వెళ్ళడానికి ప్రయత్నించినా కాల్చేస్తారు. కాబట్టి వేరే దారి లేదు' అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. అయినా మాగ్డా వినకుండా 'ఫ్రాంక్ కూడా మనతో రావడానికి ఏదో దారి ఉండే ఉంటుంది చూడమని' ఏడవసాగింది.

మళ్ళీ సెలవు దొరికి ఫ్రాంక్ ఇంటికి వచ్చినపుడు ఎప్పటిలాగే మాగ్డా ఇంటికి వెళ్ళి అందరినీ కలిసాడు. ఇంట్లో అందరూ విచారంగా కనిపించారు ఫ్రాంక్ కి. ఫ్రాంక్ తో మొత్తం వివరాలన్నీ చెప్పారు. 'తమ రెండు కుటుంబాలూ వీసా దొరకగానే మయామీ వెళ్ళి, అక్కడ నుండి న్యూజెర్సీ వెళ్ళి స్థిరపడాలని అనుకుంటున్నట్టు, మాగ్డా ఫ్రాంక్ లేకుండా రానని గొడవపెడుతోంది, కానీ తమ మగపిల్లల్ని రక్షించుకోడానికి తమకు తప్పటంలేదు' అని చెప్పారు. ఫ్రాంక్ కు షాక్ తో కొంచెంసేపు ఏం మాట్లాడాలో తెలియలేదు. ఈలోగా మాగ్డా తల్లి 'నువ్వు మాగ్డా కోసం రిస్క్ తీసుకుని పడవలో దేశం దాటి రావడానికి ప్రయత్నించగలవా' అని అడిగింది. అట్లాంటిక్ సముద్రం మీద క్యూబా నుండి కొన్ని

మైళ్ళు ప్రయాణం చేస్తే ఇంటర్నేషనల్ పరిధులు వస్తాయి. అది దాటగానే కీ వెస్ట్ ఫ్లోరిడా హార్బర్ ఉంటుంది. ఇటు వైపు క్యూబన్ కోస్టల్ గార్డ్స్, అటువైపు అమెరికన్ కోస్టల్ గార్డ్స్ పహారా కాస్తుంటారు. ఎంతోమంది రాత్రుళ్ళు పడవలో పారిపోవాలని ప్రయత్నించారు. అయితే క్యూబా సరిహద్దులు దాటకుండానే సైనికులు వాళ్ళను షూట్ చేసి, ఆనవాళ్ళు కూడా లేకుండా మాయం చేసారు. ఫ్రాంక్ టాప్ సెక్యూరిటీ విభాగంలో ఉండటం వల్ల, ఎట్టి పరిస్థితుల్లోనయినా తప్పించుకోగలిగే శిక్షణ ఉంది. అయినా కూడా ఆ ప్రయత్నం ప్రాణాలతో చెలగాటమే అని అందరికీ తెలుసు. 'అందరమూ ఏం చెయ్యాలా అని ఎన్నో రకాలుగా ఆలోచించాము. అయినా మన సమస్యకి ఇంతకన్నా వేరే పరిష్కారం తోచడంలేదు' అని చెప్పారు. నిన్నొదిలి నేనుండలేనని ఏడుస్తున్న మాగ్దాని చూసి ఫ్రాంక్ కరిగిపోయాడు. పైగా మాగ్దాని వదిలి ఉండటమనే ఊహను కూడా అతను భరించలేకపోయాడు. ప్రేయసి కోసం సాహసం చెయ్యాలనే నిశ్చయానికి వచ్చాడు. అయితే వెంటనే నిర్ణయాన్ని చెప్పకుండా, తన తాతయ్యతో మాట్లాడి అతని సలహా ప్రకారం చేస్తానని చెప్పాడు. మాగ్దా తండ్రి తమకి మిగిలిన ఏర్పాట్లు చేసుకోడానికి ఎక్కువ టైం లేనందున, వచ్చే నెల సెలవు వరకూ ఆగకుండా కొంచెం తొందరగా మాట్లాడమని అడిగాడు.

తమకు కేటాయించిన సెలవు రోజున కాకుండా మిగిలిన రోజుల్లో మిలటరీ బేస్ నుంచి బయటకు వెళ్ళడమనేది అసాధ్యం. ఫ్రాంక్ కి అప్పటికే తనూ మాగ్దా కలిసినపుడల్లా తమని ఎవరో గమనిస్తున్నారన్న అనుమానం కలిగింది. కాబట్టి తను ఇక మీదట ఎవరిని కలిసినా, మాట్లాడినా జాగ్రత్తగా ఉండాలని తెల్సింది. నమ్మకస్తులయిన తన ఇద్దరి స్నేహితులతో విషయం చెప్పి వాళ్ళ సహాయం అడిగితే, వాళ్ళు ఒప్పుకున్నారు. రాత్రుళ్ళు ఫ్రాంక్ కు పహారా డ్యూటీ ఉన్నప్పుడు ఇద్దరూ కవర్ చేసేవారు. ఆ సమయంలో ఫ్రాంక్ బయటకు వెళ్ళి, తెల్లారేటప్పటికి ఎవరూ చూడకముందే వచ్చేసేవాడు. తాతయ్యను కలిసి విషయం చెప్పి ఆయన సహాయం అడిగాడు ఫ్రాంక్. ఆయన 'నువ్వు మతుండే మాట్లాడుతున్నావానువ్వు? కనిపించకపోతే నీ తల్లిదండ్రులని మిలిటరీ వాళ్ళు చిత్రహింసలు పెడతారు. నీ ప్రాణాలు కూడా పోవచ్చు ఆ అమ్మాయి కోసం అంత రిస్క్ చేస్తావా?' అని అడిగితే, 'విజయం సాధించే అవకాశం సూది మొనంత ఉన్నా కూడా రిస్క్ తీసుకుంటాను' అని చెప్పాడు. ఆయనకు ఫ్రాంక్ నిర్ణయం నచ్చకపోయినా, చేసేదేమీ లేక అతనకి సహాయం చేయగలిగే వ్యక్తి వివరాలు చెప్పి, అతనిని కలవమన్నారు.

తాతయ్య చెప్పిన వ్యక్తి, క్యూనీ అనే ఇంకో వ్యక్తి వివరాలు చెప్పి అతను ఫ్రాంక్ కి హెల్ప్ చెయ్యగలడు అని చెప్పాడు. క్యూనీకి కూడా కమ్యూనిస్ట్ పార్టీ పద్ధతులూ, కాస్ట్రో ప్రభుత్వమూ అంటే విపరీతమయిన కోపం. అందువలన ఉచితంగానే ఇలా దేశం దాటిపోవాలనుకున్న వాళ్ళని, కొందరు జాలర్ల సహాయంతో వాళ్ళ పడవల్లో దేశం దాటిస్తాడు. ఫ్రాంక్, మాగ్దా తండ్రి, క్యూనీని కలిసి మాట్లాడాక సహాయం చెయ్యడానికి ఒప్పుకున్నాడు. అయితే తన షరతులు చెప్పాడు. 'ఎక్కడా, ఎవరి దగ్గరా, ఎట్టి పరిస్థితుల్లోనూ, చివరికి దొరికిపోయినా సరే క్యూనీ పేరు చెప్పకూడదు. పడవలో తీసుకెళ్ళే జాలర్లు మనిషికింత అని వసూలు చేస్తారు. ఆ పైకం కట్టాలి. ఎప్పుడు, ఎలా అని ప్రశ్నలు అడక్కూడదు. ఆ వివరాలన్నీ క్యూనీ చూసుకుంటాడు. అప్పటివరకు సహనంతో వేచి ఉండాలి. జాలర్లు పడవలో తీసుకెళ్ళినపుడు, అమెరికా వరకూ తీసుకెళ్లకపోవచ్చు. అటువైపుగా ఏదన్నా కార్గో షిప్ వస్తే అదెక్కిస్తారు. ఆ షిప్ ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్లాల్సిందే. అది అమెరికాకి చెందినదయితే నీ అదృష్టం. అలా కాకుండా రష్యా షిప్ అయితే, అది నిన్ను తీసుకొచ్చి కాస్ట్రో చేతుల్లో పెడుతుంది. మధ్యలో దొరికిపోయి వేలమంది చనిపోయారు. కాబట్టి దేనికయినా సిద్ధమయితేనే ముందుకి రా' అని చెప్పాడు. అన్నిటికీ ఫ్రాంక్ ఒప్పుకున్నాడు. అయితే తొందరలో ఒక బేచ్ వెళ్ళబోతుంది, ఆ పడవలో ఖాళీ ఉంటే నిన్నూ పంపుతాను అన్నాడు. డబ్బు తను కడతానని మాగ్దా తండ్రి చెప్పాడు. అయితే క్యునో చెప్పింది విన్న తరువాత, అది తాము అనుకున్నదాన్ని మించిన ప్రమాదం అని ఆయనకి అర్ధమయింది. ఫ్రాంక్ తో 'నువ్వు ఎంత ప్రమాదం లోకి వెళుతున్నావో తలుచుకుంటే భయంగా ఉంది. నువ్వు ఇపుడు నీ నిర్ణయం మార్చుకున్నా, మేము అర్ధం చేసుకుంటాము.' అని చెపితే, ఫ్రాంక్ నవ్వి 'నా నిర్ణయం మారదు. మాగ్దాతో మిగిలిన జీవితం గడపటానికి ఎంత రిస్క్ అయినా తీసుకుంటాను' అని చెప్పాడు.

తరువాత కొన్ని నెలలపాటు ఫ్రాంక్ ని దేశం దాటించడానికి చేసిన ప్రయత్నాలు వివిధ కారణాల వల్ల విఫలమయ్యాయి. ఒకసారి సైనికులకి కబురు తెలిసి, కొందరిని అరెస్ట్ చేసి తీసుకెళ్తుండగా, క్యూనీ ఫ్రాంక్ ని దగ్గరకి రావద్దని సైగ చెయ్యడంతో వెనక్కి వెళ్ళిపోయాడు. రెండోసారి చిన్న పడవలో సగం దూరం వెళ్ళి, వేరే పెద్ద షిప్ లోకి మారడానికి వెయిట్ చేసే సమయంలో, పెద్ద తుఫాన్ వచ్చి వెనక్కి తిరిగి రావాల్సి వచ్చింది. ఎవరి కంటా పడకుండా ఆ రాత్రి ఆ జాలరి మాఘో ఇంట్లోనే ఉండి ఉదయం లేచి తన ఇంటికి వెళ్ళాడు. సమయం కాని సమయంలో వచ్చిన కొడుకుని చూసి తండ్రి ఆశ్చర్యపోయాడు. విషయం తెలుసుకుని 'నేనే నీతో ఇక్కడ మీకు భవిష్యత్తు లేదు, బయటకు వెళ్ళి బాగుపడండి అని చెప్పాలని అనుకుంటున్నాను. ఈలోగా నువ్వే నిర్ణయించుకున్నావు. కానీ మాకు కూడా చెప్పకుండా వెళ్ళిపోవాలనుకున్నావా?' అని బాధ పడ్డాడు.

బేస్ కి తిరిగి వెళ్ళిన ఫ్రాంక్ ని లెఫ్టినెంట్ పీనో చూసాడు. ముందురోజు రాత్రి రావాల్సినవాడు, మరునాడు సాయంత్రానికి వచ్చాడు. పైగా తన దగ్గర నుంచి బోట్స్ లో వాడే గేసోలిన్ వాసన కూడా వస్తుంది. ఫ్రాంక్ ని తన కస్టడీలోకి తీసుకుని ఎక్కడున్నాడు, ఏం చేసాడు అని ఇంటరాగేట్ చెయ్యడం మొదలుపెట్టాడు. స్నేహితులతో తాగి తెలివిలేకుండా పడిపోయానని ఫ్రాంక్ చెప్పిన కథలు నమ్మలేదు. అలా కొన్ని గంటలు గడిచాక, ఎలాగో విషయం లాజోకి తెల్సి, కమాండర్ బ్రౌన్ తో, ఫ్రాంక్ ని పీనో నిర్బంధించాడన్న విషయం చెప్పాడు. బ్రౌన్ వచ్చి తన ఉద్యోగిని ఆధీనంలోకి తీసుకుని, ఆ విషయం తనకు తెలియపరచనందుకు పోట్లాడాడు. ఫ్రాంక్ ని చర్యల మీద అనుమానంతో ప్రశ్నిస్తున్నాను అన్న పీనోతో, ఆ విషయం స్పష్టంగా తేలేంత వరకూ అతను అనుమానితుడు కాదు అని వెళ్ళిపోయి, ఆ విషయం పై అధికార్లకు ఫిర్యాదు చేసాడు. వాళ్ళు పీనో తన అధికారం దుర్వినియోగం చేస్తున్నాడని అతనిని మందలించారు. దానితో పీనో బ్రౌన్ మీదా ఫ్రాంక్ మీదా కక్ష పెట్టుకుని, అవకాశం కోసం చూడసాగాడు. అసలే పీనో ఏదీ తొందరగా మర్చిపోయే రకం కాదు.

ఇంకొన్ని నెలలు గడిచాయి. మాగ్దా ఫేమిలీకి వీసాలు వచ్చి వాళ్ళు దేశం వదిలి వెళిపోయారు. సోఫియా కుటుంబం ఇంకా వీసా కోసం ఎదురుచూస్తున్నారు. కొన్నాళ్ళకి కమాండర్ బ్రౌన్ త్వరలో ప్రక్క ఊరిలో ఒక పెద్ద మిలటరీ ఎక్జిబిషన్ ఉంటుందని, దానికి కాస్ట్రో మిత్రదేశాల టాప్ మిలిటరీ అధికారులతో కలిసి స్వయంగా వస్తున్నాడని చెప్పాడు. దానికోసం నెలరోజుల ముందే ట్రూప్స్ ప్రాక్టీస్ చెయ్యాలని నిర్ణయించారు. అందులో టాప్ లెవెల్ మిస్సైల్స్ ని ప్రయోగించి చూపించే బాధ్యత మళ్ళీ ఫ్రాంక్ కే ఇచ్చాడు. అయితే ఆ ప్రాక్టీస్ కి వెళ్ళాల్సిన వారం రోజుల ముందు సోఫియా 'క్యూనో ఫ్రాంక్ ని ఇంకొంత మంది ఆర్మీ వాళ్ళను కలిపి బయటకు పంపించే ఏర్పాటు చేస్తున్నాడనీ, దానికోసం ఓ రెండురోజుల్లో ఫ్రాంక్ బేస్ వదిలి వచ్చి ఎక్కడన్నా రహస్యంగా ఉండాలనీ' ఒక కబురు తీసుకొచ్చింది. ఫ్రాంక్ ఎక్జిబిషన్ సంగతి చెప్పి, అదయ్యే వరకూ తనకు రావటం కుదరదేమో అని అంటే, రోజురోజుకీ పెరుగుతున్న నిఘా వల్ల ఇక ముందు ముందు దేశం దాటడం అసాధ్యం అవుతుందనీ, వీలయినంత తొందరలోనే ఆ పని చెయ్యాలని క్యూనో చెప్పాడనీ చెప్పింది సోఫియా.

ఫ్రాంక్ మళ్ళీ లాజో, మేనీ లతో తన ప్లాన్ చెప్పాడు. వాళ్ళు అది అస్సలు సరైన సమయం కాదని వారించారు, కానీ చేసేది లేక మళ్ళీ అతనికి సహాయం చెయ్యడానికి సిద్ధపడ్డారు. ప్రాక్టీస్ కోసం వెళ్ళే ముందురాత్రి ఫ్రాంక్ బేస్ నుండి తప్పించుకుపోయాడు. మరునాడు పీనో ఫ్రాంక్ మిస్ అవడం గుర్తించి, బ్రౌన్, మేనీ, లాజో లను పిలిచి అడిగితే తమకేమీ తెలీదన్నారు. ఫ్రాంక్ గన్ కూడా రూం లోనే ఉంది, బహుశా నెల వరకూ రాము కదా అని గర్ల్ ఫ్రెండ్ ను కలవడానికి వెళ్ళాడేమో అన్నారు. పీనో బ్రౌన్ ఇద్దరూ మాగ్దా ఇంటికి వెళ్ళి విచారిస్తే, వాళ్ళు చాన్నాళ్ల నుంచీ లేరని చెప్పారు. ఫ్రాంక్ ఇంటికి వెళితే అక్కడకీ రాలేదన్నారు. పీనో బ్రౌన్ ని, నీ క్రింది ఉద్యోగులు ఏం చేస్తున్నారో నీకు తెలీటం లేదా అని చివాట్లు పెట్టాడు. అధికారులతో ఎక్జిబిషన్ టైంలో ఫ్రాంక్ ఆరోగ్యం బాగోలేనందున అతని డ్యూటీ చెయ్యలేకపోతున్నాడని చెప్పాడు పీనో. తరువాత బేస్ లోని మిగిలిన కమాండర్లను మీటింగ్ కు పిలిచి, ఫ్రాంక్ కనిపించడంలేదన్న విషయం చెప్పాడు. వాళ్ళు లోకల్ పోలీసులకు రిపోర్ట్ ఇమ్మని, టీవీల్లో రేడియోలో ప్రకటన ఇమ్మని చెప్పారు. ఫ్రాంక్ కు తెలిసిన మిలటరీ రహస్యాల వల్ల అతన్ని వెంటనే

పట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే పీనో కు పర్సనల్ వైరం, ఈగో అడ్డొచ్చి, ఫ్రాంక్ ని తనే పట్టుకోవాలని నిర్ణయించుకున్నాడు. 'పిల్లకుంక! నాముందు వాడెంత' అని అనుకున్నాడు.

ఫ్రాంక్ ని క్యూనో, ఫ్రాంక్ ఇంటికి దగ్గర లోనే ఉన్న అతని అంకుల్ లూయిస్ ఇంట్లో దాగి ఉండమని చెప్పాడు. ఫ్రాంక్ అంత దగ్గరలో ఉంటాడని ఎవరూ ఊహించరు కాబట్టి అదే సేఫ్ అని చెప్పాడు. అంకుల్ లూయిస్, అతని భార్య, అతని ఇద్దరు చిన్నపిల్లలు ఫ్రాంక్ ని ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎవరితోనూ అతని గురించి మాట్లాడలేదు. ఎపుడూ ఎవరో ఒకరు వచ్చి పోతుండే ఆ ఇంట్లో మంచం క్రింద పడుకుని ఫ్రాంక్ వారాలు గడిపాడు. లూయిస్ తనని కూడా ఫ్రాంక్ తో పాటు అమెరికా తీసుకువెళ్ళమని అడిగాడు. తరువాత అతను తన కుటుంబాన్ని తెచ్చుకుంటానని చెప్పాడు. దానికి క్యూనో ఒప్పుకున్నాడు. సైనికులు సోఫియాని, ఫ్రాంక్ తల్లిదండ్రులని ప్రశ్నించి, బెదిరించి వెళ్లారు. ఒకసారి సైనికులు వచ్చి లూయిస్ ఇల్లంతా సోదా చేస్తే, అవుట్ హౌస్ క్రింద ఉన్న పెద్ద గోతిలో దాక్కుని తప్పించుకున్నాడు. ఫ్రాంక్ తల్లికి విషయం తెలిసి కొడుకుని చూడటానికి వచ్చింది. మళ్ళీ తన కొడుకుని చూడలేనేమో అని దుఃఖం ఆమెని కమ్ముకుంది. కొడుకుని క్షేమంగా చూడమని దేవుడ్ని ప్రార్థిస్తూ, దీవించి వెళ్ళిపోయింది.

ఫ్రాంక్ నీ ఇతరులనీ పడవలో తీసుకు వెళ్ళాలనుకున్న జాలరి పేరు మాఛో. అయితే అతని అన్నకు అతని పనుల మీద అనుమానం రావటంతో దాన్ని కొన్నాళ్ళు వాయిదా వేసాడు. తరువాత పడవ మోటర్ పనిచెయ్యక కొన్నాళ్ళు ఆగారు. ఈలోగా సోఫియా కుటుంబం కూడా వీసాలు వచ్చి అమెరికాకి వెళ్ళిపోయారు. పీనో ఎక్కడ వెదికినా ఫ్రాంక్ కనిపించకపోవడంతో పిచ్చెక్కిపోయాడు. 'అతను అలా దొరకడు. అతన్ని నేనే ట్రెయిన్ చేసాను. అతనికి ఎలా తప్పించుకోవాలో బాగా తెలుసు. అలా అతన్ని వదిలేసెయ్యి, తనే వస్తాడు' అన్నాడు బ్రౌన్. పీనోని అది ఇంకా పిచ్చెక్కించింది. 'అయితే నువ్వే వెదుకు తనని. మొత్తం స్పెషల్ ఫోర్స్ అందరినీ ఆ పనిలో పెట్టు' అన్నాడు. ఒక్కడు కనిపించకపోతే స్పెషల్ ఫోర్స్ అందరినీనా అంటే, 'ఇది పొలిటికల్ ఇష్యూ. దేశరక్షణకి సంబంధించింది. వాడు అమెరికా వెళ్ళి మన రహస్యాలు CIA కి ఇస్తాడు. నేను చెప్పినట్టు చెయ్యి' అన్నాడు. సైనికుల బృందాన్ని ఫ్రాంక్ వెళ్ళే అవకాశం ఉన్న ప్రతీ చోటికీ పంపి వెదికించారు.

ఓ మధ్యాన్నంవేళ పీనో సైనికులతో కలిసి లూయిస్ ఇంటిని చుట్టుముట్టాడు. అది పసిగట్టిన ఫ్రాంక్, సినిమాల్లో జరిగే వాటికి దీటుగా, ఇంటి వెనక నుండి తప్పించుకుని, సైనికుల తూటాలు తప్పించుకుంటూ దట్టంగా ఉన్న చెట్లలోనుంచీ దూసుకుపోయాడు. ఆ దారుల్లోంచి మిలటరీ వాహనాలు వెళ్ళలేక చుట్టూ తిరిగి వెళ్లేసరికి ఫ్రాంక్ మాయమయ్యాడు. తన కళ్ళముందే అతను జారిపోతే పీనోకు విపరీతమైన అవమానం, కోపం కలిగాయి. పైగా తమకు లోకల్ గా రహస్య స్థావరాలు తెలీదు. అప్పటికే చీకటి అవడం వలన పీనో ఇక వెదకలేకపోయాడు. ఫ్రాంక్ ఒళ్ళంతా ముళ్ళూ కొమ్మలూ గీసుకుని రక్తం కారుతున్నా లెక్కచెయ్యకుండా, చీకటిలో పారిపోయి ఊరి చివర అడవుల్లో ఉన్న కొండ గుహల్లో దాక్కున్నాడు. అవన్నీ చిన్నప్పటి నుంచీ తను ఆడుకున్న ప్రదేశాలు కాబట్టి బయటివారికి తెలియవని అతని ధైర్యం.

మరునాడు ఉదయమే పీనో తన బృందంతో ఆ ప్రాంతమంతా, ఊర్లోనూ ప్రతీ మూలా వెదికించినా, ఎక్కడా ఫ్రాంక్ కనిపించలేదు. ఇక తమ ఒక్కరి వల్ల అవ్వదని, లోకల్ ఎమర్జెన్సీ మిలటరీ గ్రూప్ ని కాంటాక్ట్ చేసాడు. వాళ్ళతో 'ఒక ప్రమాదకరమైన నేరస్థుడు తప్పించుకున్నాడు, అతన్ని ప్రాణాలతో అయినా లేదా చంపి అయినా సరే పట్టుకోవాలని' చెప్పాడు. ఆ గ్రూపుకి ఆఫీసర్ జేబో అని ఫ్రాంక్ చిన్ననాటి స్నేహితుడు. విషయం తెలిసి ఫ్రాంక్ తండ్రి, ఫ్రాంక్ తమ్ముడి చేత జేబోకి నిజం చెప్పిస్తే, నేరస్థుడు అని అబద్ధం చెప్పి తమని ఉపయోగించుకోవాలని చూసినందుకు జేబోకు పీనో మీద కోపం వచ్చింది. మేము హెల్ప్ చెయ్యము, మీ పాట్లు మీరు పడండి అని

చెప్పేసాడు. అప్పటివరకూ అపజయం తెలియని పీనో ఇదంతా భరించలేక, ఎలా అయినా వీటన్నిటికీ కారణమయిన ఫ్రాంక్ అంతు చూడాలని అనుకున్నాడు.

ఆ రోజున పూర్తిగా తెల్లవారకముందే చీకట్లోనే ఫ్రాంక్ ప్రక్కనే ఉన్న నదిలో ఈదుకుంటూ, తనని తీసుకెళ్ళాల్సిన జాలరి మాఛో ఇంటికి వెళ్ళాడు. మాఛో అన్న జేరార్డో కోస్టల్ గార్డ్ గా పనిచేస్తాడు. అతనికి మాఛో పనుల మీద కొంచెం అనుమానం ఉంది. ఫ్రాంక్ అక్కడ ఉండటం ప్రమాదమని చెప్పి, క్యానీ వచ్చి మళ్ళీ ఫ్రాంక్ ని ఓ రెండు రోజులు లూయిస్ ఇంటిలోనే ఉండమని, తీసుకువెళ్ళి అక్కడ వదిలాడు. ఆ ఎటాక్ తరువాత ఫ్రాంక్ మళ్ళీ అక్కడికే వస్తాడని ఎవరూ వూహించరు కాబట్టి పర్లేదు అన్నాడు. మాఛో ని త్వరగా పడవ మోటార్ బాగుచేసి ప్రయాణానికి సిద్ధం కమ్మని హెచ్చరించాడు క్యానో. రెండురోజుల తరువాత ప్రయాణం ఆ రాత్రికే అని కబురు చేసాడు క్యానో. ఆ రాత్రి నిర్ణీత సమయానికి ఫ్రాంక్, లూయిస్ నది ఒడ్డుకు వెళ్లారు. అప్పటికే అక్కడ క్యానో ముందే చెప్పినట్టు వాళ్లతో వెళ్ళాల్సిన తొమ్మిదిమంది సైనికులు, మాఛో కుటుంబం ఉన్నారు. వీళ్ళలాగే ఇంకో పడవ కోసం ప్రక్కనే ఇంకో పదిహేనుమంది కూడా ఎదురుచూస్తున్నారు. ఆ గుంపులో పిల్లలూ, పెద్దలూ, ముసలివాళ్ళు, గర్భిణీలు కూడా ఉన్నారు. ఇక మాఛో పడవతో రావటమే మిగిలింది.

అయితే ఈసారి కూడా ఫ్రాంక్ ని దురదృష్టం వెంటాడుతూనే ఉంది. మాఛో పడవ స్టార్ట్ అవ్వలేదని నిస్పృహతో వచ్చాడు. ఫ్రాంక్ కి విపరీతమయిన కోపం, దుఃఖం వచ్చాయి. ఇక తను తిరిగి వెనక్కి వెళితే ప్రాణాలతో ఉండటం అనేది జరగదు అని అతనికి తెలుసు. ఇప్పుడు వెళ్ళకపోతే ఇక తను జన్మలో మార్గాని చూడలేడు అని కూడా తెలుసు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్ళేది లేదనీ, ఈరోజు అందరం ఫ్లోరిడాకి వెళుతున్నాం అంతే అని తెగేసి చెప్పాడు. ఈలోగా ప్రక్క గుంపు కోసం పడవ వచ్చింది. అది కూడా చిన్నదే. ఆ పడవ కేప్టెన్ గొడవ పెడుతున్నా వినకుండా అతనిని బెదిరించి, ఫ్రాంక్ తన గ్రూపులో అందరినీ బలవంతంగా అందులోకి ఎక్కించాడు. చిన్న పడవ అందరి బరువుకి దాదాపు మునిగిపోతున్నట్టే ఉంది, అయినా అలానే పడవని నది మధ్యలోకి తీసుకెళ్ళమని కమాండ్ చేసాడు. పెద్ద పెద్ద కెరటాలకి పడవ అటూ ఇటూ ఒరిగిపోతుంది. ఒకప్రక్క చలి. పిల్లలూ పెద్దలూ కూడా భయంతో ఏడుపులూ మొదలుపెట్టారు. కోస్టల్ పెట్రోలింగ్ వాళ్ళ దృష్టిలో పడితే ప్రమాదం. తనతో ఉన్న సైనికుల సహాయంతో పడవలో ఉన్నవాళ్ళని మౌనంగా ఉండేలా అదుపులోకి పెట్టాడు. ఆ పడవలో అందరితో ప్రయాణం కష్టం అని తెలుసు. నది మధ్యలోకి వెళ్ళాక అక్కడ మోటర్ ఆపేసి, చీకట్లో వేచి ఉండి, అటువైపుగా వచ్చిన ఇంకొక పెద్ద పడవలో ఉన్న ముగ్గురినీ మిగిలిన సైనికుల సాయంతో అదుపులోకి తీసుకొని, అందరినీ రెండు పడవల్లోకి సర్దారు. తరువాత దాదాపు రెండు గంటలు ప్రయాణం చేసి రెండు పడవలూ ఇంటర్నేషనల్ బోర్డర్ చేరుకున్నాయి. అక్కడ అన్ని పెట్రోల్ బోట్స్ వెళ్ళిపోయే వరకూ చీకటిలో ఇంజన్స్ ఆపేసి కూర్చున్నారు. తరువాత నెమ్మదిగా ఇంటర్నేషనల్ వాటర్ జోన్ లోకి అడుగుపెట్టి ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ ఇక క్యూబన్ అథారిటీస్ ఏమీ చెయ్యలేవు. అమెరికన్ కోస్టల్ డిపార్ట్మెంట్ కూడా పహరా కాస్తుంది. ఎవరైనా రెఫ్యూజీలు కనిపిస్తే వాళ్ళని క్షేమంగా తీసుకెళ్ళి ఆశ్రయం కల్పిస్తాయి. ఒకవేళ క్యూబన్ మిత్ర దేశాల వారికి దొరికితేనే ప్రమాదం.

ఇక్కడ క్యూబాలో పీనో తన బలగంతో అడుగడుగూ గాలిస్తూనే ఉన్నాడు. కంట్రోల్ రూంలో ఆఫీసర్లతో కూర్చుని, అన్ని వైపులా నుంచీ ఫ్రాంక్ ఎక్కడా లేడని వస్తున్న వార్తలతో జుట్టు పీక్కుంటున్నాడు. అతనికి ఇంకా లాజో, మేనీల మీద ఫ్రాంక్ సంగతి వాళ్ళకు తెలుసును అని అనుమానం. వాళ్ళు మాట్లాడుకుంటున్న దానిమీద ఓ చెవేసి ఉంచాడు. ఆ రోజు కోస్టల్ పెట్రోలింగ్ ఇన్ చార్జ్ జేరార్డో. అతను తన సిబ్బందితో హాండ్ రేడియోలో సమాచారం తెలుసుకుంటున్నాడు. ఉన్నట్టుండి ఒక సంభాషణ అతని రేడియోలో క్రాస్ అయింది. అది విని 'ఒక షిప్ రెండు చిన్న పడవలని చూసినట్టుగా సమాచారం వచ్చింది. బహుశా అందులో క్యూబన్ రెఫ్యూజీలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు' అన్న విషయం చెప్పాడు. వెంటనే పీనో ఎగిరి గెంతేసి 'వాడే వాడే పట్టుకోండి' అని అరిచాడు. అతని ఆత్రుత చూసి జేరార్డో కి ఎందుకో చిరాకు, అసహనం కలిగాయి. 'వాళ్ళు మనల్ని కాంటాక్ట్ చెయ్యలేదూ, అమెరికన్ ఫోర్సెస్ కి చెప్పారు అంటే అది రష్యా షిప్ కాదు. అపుడు అది

ఇంటర్నేషనల్ సమస్య అవుతుంది. మనం ప్రమాదంలో పడతాం. కాస్ట్రో మన పీకలు తీస్తాడు.' అన్నాడు. పీనో 'నేను ముందు కోస్టల్ గార్డ్ కి వాళ్ళని బంధించమని చెప్పు. నువ్వు చెప్పకపోతే నేను చెపుతాను' అని అసహనంతో రేడియో లాక్కోబోయాడు. జేరార్డో కూడా తగ్గకుండా 'కోస్టల్ ఎఫైర్స్ కి బాస్ నేను కానీ నువ్వు కాదు. నేను నాకిచ్చిన రూల్స్ ప్రకారమే పని చేస్తాను' అని తెగేసి చెప్పాడు.

అసలింతకీ ముందు నువ్వెవరి గురించి ఇంత గాలిస్తున్నావో చెప్పు అని అడిగితే, పీనో ఫ్రాంక్ ఫోటో చూపించాడు. అది చూడగానే ఒకసారి ఎపుడో తన తమ్ముడు మాఛోతో అతన్ని చూసిందీ, మాఛో అతన్ని తప్పించడానికి హెల్ప్ చేస్తున్నాడేమో అతనికి అనుమానం వచ్చినదీ గుర్తొచ్చింది. అతనే కనుక అయితే, అతనితో బాటే మాఛో కుటుంబం కూడా ఉండే ఉంటుందని అనిపించింది. వెంటనే అర్జెంట్ పని ఉందని చెప్పి గబగబా బయటకి వెళ్ళిపోయాడు. జేరార్డో పరుగు పరుగున మాఛో ఇంటికి వెళ్ళి చూస్తే ఇల్లు తాళం పెట్టి ఉంది. లోపల చూస్తే చీకటి. ఎవరూ ఉన్నట్టు ఆనవాలే లేదు. మాఛో కుటుంబం కూడా ఫ్రాంక్ తో పాటు వెళ్లిపోయారని అర్థం అయ్యింది. ఇపుడు ఫ్రాంక్ ని పట్టిస్తే వాళ్ళందరూ కూడా దొరికిపోతారు. వాళ్ళందరినీ నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. ఎపుడూ తనని ఆప్యాయంగా కౌగలించుకుని పలకరించే తమ్ముడి పిల్లలూ, వాళ్ళ అమాయకపు నవ్వులూ గుర్తొచ్చి అతని గుండె కరిగింది. వాళ్ళని పట్టివ్వడానికి అతని మనసు ఒప్పలేదు. నెమ్మదిగా ఈడ్చుకుంటూ ఆఫీసుకి తిరిగి వచ్చాడు.

ఫ్రాంక్ బృందంలో చాలామంది చలిగాలికి జ్వరాలు వచ్చి, సీ సిక్నెస్ తో నీరసంగా ఉన్నారు. అయితే అమెరికా దగ్గర్లోకి వచ్చేసాము అన్న ఉత్సాహం వాళ్ళలో శక్తిని నింపింది. వాళ్ళు చూసిన పెద్ద షిప్ గ్వాటామోలా నుండి కార్గోతో కెనడాకి వెళ్తోంది. వాళ్ళు అమెరికన్ కోస్ట్ గార్డ్ కి తాము చూసిన రెండు పడవల్లోని వాళ్ళ గురించి వైర్లెస్ లో కబురు పంపారు. ఆ గార్డ్ తాను అమెరికన్ గార్డ్స్ ను వాళ్ళని రక్షించడానికి పంపుతానని చెప్పి, ఈలోగా వాళ్ళని షిప్ లోకి తీసుకుని మెడికల్ సర్వీస్ ఇచ్చేందుకు అనుమతి ఇచ్చాడు. ఆఫీసుకు తిరిగివచ్చిన జేరార్డో, తన సిబ్బంది నుండి అమెరికన్ రెస్క్యూ బయలుదేరిందన్న వార్త తెలుసుకున్నాడు. అదే విషయం పీనోకి చెప్పాడు. పీనో విచక్షణ, ఆలోచనాశక్తి కోల్పోయాడు. 'ఇంకా వాళ్ళు క్యూబాకి దగ్గరలోనే ఉండుంటారు. కోస్టల్ సైనికులని పంపి వాళ్ళని బంధించమని చెప్పు' అని అరిచాడు. చూస్తున్న అందరూ పీనోకి పిచ్చిపట్టిందేమో అనుకున్నారు. ఒక హై రేంక్ మిలిటరీ అధికారి అలా ప్రవర్తించడం అందరికీ వింతగా ఉంది. అయినప్పటికీ జేరార్డో ప్రశాంతంగా 'ఇపుడు వాళ్ళు దాదాపు అమెరికన్ రక్షణ లోకి వెళ్ళిపోయారు. ఇపుడు వాళ్ళ విషయంలో మనం దూరడం అంటే, కోరి ఇల్లు తగలెట్టుకోడమే. నువ్వు చరిత్ర మర్చిపోయినట్టున్నావు. హిరోషిమా గుర్తు లేదూ? ఇప్పుడు నీ పిచ్చి చేష్టలతో క్యూబాని ఇంకో హిరోషిమా చేసేలా ఉన్నావు. నేను నా చేతులతో ఆ పని చెయ్యను' అన్నాడు. పీనో రెచ్చిపోయి జేరార్డోని పక్కకు తోసి, రేడియో లాక్కుని, క్యూబన్ కోస్టల్ గార్డ్స్ కి ఫ్రాంక్ ని డెడ్ ఆర్ ఎలైవ్ తీసుకురమ్మని ఆర్డరేశాడు.

కార్గో షిప్ నుండి కొందరు మనుషులు ఫ్రాంక్ బృందం వైపు స్నేహంగా చేతులు వూపుతూ, తమ వైపు రమ్మని సైగలు చేస్తూ, వాళ్ళ షిప్ వీళ్ళ వైపు తీసుకు రాసాగారు. అది చూసి వీళ్ళకి ఏం చెయ్యాలో తోచలేదు. షిప్ ఏ దేశానిదో చూడాలంటే పేర్లు చదవడానికి వీలుకానంత దూరంలో ఉంది. చూడడానికి మనుషుల చర్యలు స్నేహంగానే అనిపిస్తున్నా, తీరా దగ్గరికి వెళ్ళాక వాళ్ళు క్యూబాకి అప్పచెబితే, ఇంతా ప్రాణాలకి తెగించినదంతా వృథా. కానీ తామున్న పరిస్థితుల్లో వెంటనే అందరికీ తిండీ, మందులూ కావాలి. ఏం చెయ్యాలి అని అందరూ ఆలోచించారు. కొందరు రిస్క్ తీసుకుందాం అంటే, కొందరు భయపడ్డారు. చివరికి ఫ్రాంక్ ఒక ముసలాయనతో 'తాతా నువ్వు దాదాపు తొంభయ్యేళ్ళ జీవితం గడిపావు. ఇంకా లోకం సరిగా చూడని వీళ్ళందరి కోసం ఓ చిన్న త్యాగం చెయ్యగలవా?' అన్నాడు. ఆయన 'సంతోషంగా చేస్తాను, ఏం చెయ్యాలి' అని అడిగాడు. 'ముందు నువ్వు ఆ షిప్ లోకి వెళ్ళి చూడు. వాళ్ళ వల్ల ప్రమాదం లేదు అనిపిస్తేనే నువ్వు బయటకి డెక్ మీదకి వచ్చి మాకు చెయ్యి ఊపు. అది చూసి నేను అందరినీ తీసుకొస్తాను. లేదూ అంటే ఇలానే ఫ్లోరిడా వరకూ వెళతాము. ఒకవేళ వాళ్ళ వల్ల ప్రమాదం ఉంటే, నిన్ను ఎన్ని చిత్రహింసలు పెట్టినా సరే బయటకి రాకు సుమా. నీ కూతురితో సహా ఈ చిన్న పిల్లలందరూ

ప్రమాదంలో పడతారు. ఈ సాయం చేస్తావు కదూ.' అన్నాడు. ఆయన సంతోషంగా ఒప్పుకుని ముందు ఆ షిప్ లోకి వాళ్ళు వేసిన నిచ్చెన ద్వారా వెళ్ళాడు. కొంతసేపటికి బయటకి వచ్చి వీళ్ళని రమ్మని చెయ్యి వూపాడు. అందరూ సంతోషంతో ఒకరినొకరు కౌగలించుకుని కేరింతలు కొట్టారు.

అ పెద్ద షిప్ లోకి అందరినీ నిచ్చెనల సాయంతో తీసుకువెళ్ళారు. ఆ షిప్ కేప్టెన్ వాళ్ళని సాదరంగా ఆహ్వానించి తిండీ, మందులూ ఇప్పించాడు. మిమ్మల్ని క్షేమంగా అమెరికన్ గార్డ్స్ కి  తప్ప వేరేవాళ్లకి అప్పచెప్పను, భయపడకండి అని చెప్పాడు.  కొంతసేపటికి  అమెరికన్ బోట్స్, హెలీకాప్టర్స్ వచ్చాయి. కార్గో షిప్ కి దగ్గరగా వచ్చిన క్యూబన్ కోస్టల్ గార్డ్స్, అప్పటికే వచ్చిన అమెరికన్ షిప్ ని చూసి ఏం చెయ్యాలో తెలీక జేరార్డోని అడిగారు. వాళ్ళని వెనక్కి వచ్చెయ్యమని జేరార్డో చెప్పాడు. అమెరికన్ గార్డ్స్, వీళ్ళందరినీ తాము తీసుకువెళతామని చెప్పారు. 'In the name of the President of the United States of America, I invite you to freedom' అని గార్డ్ స్వాగతపత్రం లోని వాక్యాలు  చదివినపుడు ఫ్రాంక్ కి  వొళ్ళంతా గగుర్పొడిచింది. ఈ క్షణం కోసం ఎంత మంది ఎన్ని కష్టాలు పడిందీ, ఎంత మంది ప్రాణాలు పోగొట్టుకున్నదీ గుర్తుకువచ్చింది. ఒకవైపు క్యూబా ... తన కుటుంబం, స్నేహితులూ అందరినీ దాచుకుని దిగులుగా, ఇంకో వైపు చూస్తే అమెరికా ... తన మాగ్దాతో పాటు ఎదురుచూస్తూ, తన కోసం బంగారు భవిష్యత్తుని దోసిలిలో దాచుకుని కనిపించాయి. ఫ్రాంక్ కి వరుసగా తన సాహసయాత్రలో ప్రాణాలకు తెగించి తనకు సాయం చేసిన వాళ్ళు, దయా ప్రేమా చూపించిన వాళ్ళూ వరసగా గుర్తొచ్చారు. కృతజ్ఞతతో అతని మనసు తడిసి వరదయ్యింది. అన్నాళ్ళు ధైర్యంగా సాగిన అతను అప్పుడు కూలబడి, చేతుల్లో మొహం దాచుకుని, మొదటసారిగా  వెక్కి వెక్కి ఏడ్చాడు.

ధృడసంకల్పం, గుండె ధైర్యం, నమ్మకం, ప్రేయసి కోసం తెగింపు, ఫ్రాంక్ ని పోరాటంలో చివరివరకూ నడిపించాయి. అయితే తమ ప్రేమతో అడ్డుపడకుండా ఉన్న కుటుంబసభ్యులు, ప్రాణాలకు తెగించి సాయం చేసిన సోఫియా, అంకుల్ లూయిస్ కుటుంబం, స్నేహం కోసం తమ ప్రాణాలను అడ్డుపెట్టిన మేనీ లాజో,  సంబంధం లేకపోయినా అభిమానంతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సాయం చేసిన కమాండర్ బ్రౌన్, క్యూనో, జేబో, జేరార్డో లాంటి వాళ్ళు లేకపోతే ఆ గెలుపు లభించి ఉండేది కాదు. మనిషికి తన చుట్టూ ఉన్నవాళ్లు ఎంత అవసరమో, ఒకరి మనుగడ వేరొకరి మీద ఎలా ఆధారపడి ఉంటుందో  చెప్పే కథ ఇది.

ఇది ఫ్రాంక్ తన కథ స్వయంగా చెప్పగా, రచయిత్రి కొంచెం ఊహ జోడించి వ్రాసిన నిజజీవిత కథ. ఫ్రాంక్ కుమార్తె రచయిత్రికి సహోద్యోగిని. ఆమె కోరిక మీద ఫ్రాంక్ కథని, వాళ్ళ ఫేమిలీ సావనీర్ గా వ్రాయడానికి మొదలుపెట్టారట. దానికోసం ఫ్రాంక్ ని దాదాపు సంవత్సరం పాటు రోజూ కలిసి, అతనూ రోజూ కొంచెం కొంచెం కథ చెపుతుంటే ఆమె నోట్స్ వ్రాసుకునేవారట. ఫ్రాంక్ కి మెమొరీ ఇప్పటికీ అద్భుతంగా ఉందనీ, ప్రతీ సంఘటనా ఈరోజే జరిగినట్టూ గుర్తున్నాయనీ అన్నారు. ఇప్పటికీ ఆయన మిలటరీ ట్రైనింగ్ కు గుర్తుగా ఫిజికల్ ఫిట్నెస్ ఇంకా అలానే ఉందనీ, తను తప్పించుకున్న సీన్లు చెప్పేటప్పుడు యాక్షన్తో సహా వర్ణించి చెప్పారనీ చెపుతారు రచయిత్రి. ఈ పుస్తకంలో కథ ఇంతవరకే చెప్పి ఆపేసారు. 'తరువాత ఏమయ్యింది? మాగ్దాని కలిసారా? పీనో, లాజో, మేనీ ఏమయ్యారు?' అన్న ప్రశ్నలకు ఫ్రాంక్ నవ్వి, అదంతా ఇంకో పుస్తకానికి సరిపోయే కథ అవుతుంది అన్నారట. ఫ్రాంక్ కథ విన్నాక రచయిత్రికి ఇది కేవలం ఫేమిలీ సావనీర్ గా లిమిట్ చేయకుండా, ఎక్కువమందికి  చేరేలా పుస్తకంగా తెస్తే బావుంటుందని అనిపించి, వాళ్ళ అనుమతితో నవలగా వ్రాసారు. కథలో ఫ్రాంక్ ఉన్న సంఘటనలన్నీనిజంగా అలానే జరిగినవనీ, వాటిని ఫ్రాంక్ చెప్పినది చెప్పినట్టు తను వ్రాసాను అన్నారు. ఫ్రాంక్ ప్రత్యక్షంగాలేని సంఘటనలు తరువాత ఎప్పుడో ఫ్రాంక్ తనవాళ్ళ ద్వారా తెలుసుకున్నవాటి ఆధారంగా, కొంచెం నాటకీయత చేర్చి వ్రాసానని చెప్పారు.

పుస్తకం మొదటినుంచీ ఆసక్తిగా చదివిస్తుంది. భాష కూడా సరళంగా బావుంది. ఫ్రాంక్ ని తప్పించడానికి వేసిన ప్లాన్స్, అవి అమల్లో పెట్టిన వివరాలు అన్నీ అబ్బురంగా ఉంటాయి. నిజంగా ఇలానే జరిగిందా అచ్చం కథల్లో జరిగినట్టూ అనిపిస్తుంది. ఈ పుస్తకం అమెజాన్.కాం లో హిస్టారికల్ ఫిక్షన్ విభాగంలో మూడోస్థానంలో ఉంది. మాగ్డా కోసం అంత సాహసం చేసిన ఫ్రాంక్, మాగ్డాని కలుసుకున్నాడో లేదో చెప్పకుండా కథని ఆపెయ్యడం చాలామందికి నచ్చలేదు. అమెరికా చేరిన తరువాత, మాగ్డాని కలుసుకోవడం, పెళ్ళీ, అమెరికన్ జీవితం, తరువాత జరిగిన పరిణామాలన్నీ రెండో భాగంగా Stalked: The Boy Who Said No వ్రాసారు. అయితే అది బానే చదివించినా, మొదటిభాగం అంత ఉత్కంఠత కలిగించలేదు.



**రచయిత్రి పరిచయం:** Patti Sheehy కార్పోరేట్ పబ్లిక్ రిలేషన్స్ సంస్థలో, కమ్యూనికేషన్స్ విభాగంలో ఉద్యోగిని. అందులో భాగంగా న్యూస్ ఆర్టికల్స్, ఫీచర్స్ వ్రాస్తూ ఉంటారు. రచయిత్రిగా ఇదే ఆమె మొదటి పుస్తకం. దీన్ని జూన్ 2013 లో ప్రచురించారు. రెండవభాగం సెప్టెంబర్ 2014లో విడుదల అయ్యింది. ఫ్రాంక్ తో కలిసి ఫిలడెల్ఫియా చుట్టుపక్కల బుక్ క్లబ్ లోనూ, బుక్ సైనింగ్ ఈవెంట్స్ లోనూ పాల్గొని, పాఠకుల ప్రశ్నలకు జవాబిస్తుంటారు. ఆ ఈవెంట్స్ కేలండర్ ఆమె వెబ్ సైట్లో చూడొచ్చు. రచయిత్రితో ఒక ఇంటర్వ్యూ ఇక్కడ.

**అవార్డులు** (Courtesy: Writer's website)

Winner: The Benjamin Franklin Award for Best New Voice in Fiction (2013)

Finalist in :

USA Best Book Award (2013)

ForeWord Best Book of the Year Award (2013)

(Picture source: Internet)



# పుస్తకం ఓ నేస్తం
## - పద్మవల్లి



## *Calling me home*

జిందగీ తేరే ఘమ్ నే, హమే లిస్తే నయే సంఝాయే
మిలే తో హమే, ధూప్ మే మిలే, ఛావ్ కే ఠండే సాయే
(జీవితం లోని దుఃఖం కూడా కొత్త అనుబంధాలను నేర్పిస్తోంది
మండుటెండల్లోనూ చల్లని ప్రేమ స్పృశిస్తోంది)




ఏ సమస్యలు లేకుండా ఎవరి జీవితమూ ఉండదు. కొందరు చిన్న సమస్యలకే గడ్డిపోచల్లా ఊగిపోతే, అతి కొద్దిమంది ప్రళయాన్ని లోపల దాచుకుని కూడా, ధ్వజస్థంభంలా నిబ్బరంగా నిలబడగలుతారు. ఒక్కోసారి మన సమస్యలకి పరిష్కారాలు, ఎదుటివాళ్ళ అనుభవాల నుంచీ దొరుకుతాయి. ముఖ్యంగా జీవితపు అనుభవాలతో పండిపోయిన వాళ్ళనుండి మనం గ్రహించాల్సింది, మనల్ని దిద్దుకోవాల్సిందీ ఎంతో ఉంటుంది. పెద్దల మాట చద్ది మూట అని వూరికే అనలేదు మరి.

"మొహబ్బత్ అవుర్ మౌత్, బిన్ బులాయే మెహమాన్ హై" (జీవితంలో ప్రేమా, మృత్యువూ ఆహ్వానం లేకుండానే వచ్చే అతిథులు) అని ఓ సినిమాలో డైలాగ్ ఉంది. అలా ప్రేమ ఎప్పుడు, ఎక్కడ, ఎవరిమీద ఎందుకు పుట్టుకొస్తుందో ఎవరికీ తెలీదు. People fall in love in misterious ways, may be just with a touch of the hand అని ఒకరన్నారు. అలా మిస్టీరియస్ గా పుట్టే నిజమైన ప్రేమ, మృత్యువు రాకతో తప్ప ఆగదు. అది మనిషి జీవితాన్ని అఖండంగా వెలిగించనూవచ్చు, లేదా మనిషిని జీవచ్ఛవంగానూ మిగల్చొచ్చు. తమ ప్రేమ ఫలించకపోయినా జీవితాంతం ఆ సౌరభాలను మనసులోనే మోసేవారెందరో. ప్రేమ లాగే ఇద్దరి మధ్య స్నేహం కూడా ఒక్కోసారి మిస్టీరియస్ గానే పుడుతుంది. సమవయస్కుల మధ్యే స్నేహం సాధ్యం అంటారు. అయితే వయసూ, రంగూ, జాతీ కలవని ఇజబెల్, డోరీల స్నేహం వారిని ఎక్కడికి తీసుకెళ్ళింది? వారి జీవితాల్లో ఏం మార్పులు తెచ్చింది? ఆమోదం కాని ప్రేమను

ఆలింగనం చేసుకున్న ఇజబెల్ జీవితాన్ని ఆ ప్రేమ ఎన్ని మలుపులు తిప్పి ఏ తీరాల్లో వదిలింది? ఇజబెల్ జీవితం నుంచి డోరీ ఏం నేర్చుకుంది? నిజజీవితంలో సంఘటనలు ఆధారంగా Julie Kibler వ్రాసిన Calling Me Home ఈ ప్రశ్నలకు జవాబులు చెపుతుంది.

డోరీ (Dorrie Curtis) ముప్పయ్ ఏళ్ళు దాటిన, ఆఫ్రికన్ అమెరికన్ యువతి. టెక్సాస్ రాష్ట్రం లోని, ఆర్లింగ్టన్ అనే ఊర్లో ఆమె నివాసం. వృత్తి రీత్యా హెయిర్ డ్రెస్సర్. సోమరీ, అసమర్ధుడూ అయిన భర్త నుంచి విడిపోయి, పదేహేడేళ్ళ కొడుకు స్టీవీ, పదేళ్ళ కూతురుతో ఉంటుంది. విడాకుల తర్వాత కొందరితో డేటింగ్ చేసినా, ఏ రిలేషనూ ఎక్కువకాలం సాగలేదు. ఆమెకు కలిగిన చేదు అనుభవాల వల్ల, మొత్తానికి ఆమెకు మగవాళ్ళ మీదా, రిలేషన్స్ మీదా నమ్మకం పోయి, కొత్త బంధాల్లోకి వెళ్ళాలంటే తెలియని భయమూ, అయిష్టమూ ఏర్పడ్డాయి. ఆమె కొడుకు స్టీవీ కూడా తండ్రి గుణాలను పుచ్చుకొని, టీనేజ్ వయసులో బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ, సమస్యలను తీసుకొస్తున్నాడు. కొడుకు కూడా తండ్రిలా బాధ్యత లేని మనిషిలా తయారవకుండా ఎలా చూసుకోవాలో అనేది ప్రస్తుతానికి ఆమెకున్న పెద్ద సమస్య.

ఆమె కొత్త బోయ్ ఫ్రెండ్ టీగ్ (Teague) తో కొన్ని నెలలుగా డేటింగ్ చేస్తుంది. అతని భార్య ముగ్గురు చిన్నపిల్లలనీ అతనికే వదిలేసి వెళ్ళిపోతే, ఓ ప్రక్క బాధ్యతగా ఉద్యోగం చేసుకుంటూ, వాళ్ళను ప్రేమతోనూ క్రమశిక్షణతోనూ పెంచుకుంటున్నాడు. తమ పరిచయాన్ని సీరియస్ బంధంగా మలుచుకోవాలన్న ఆలోచనని టీగ్ సూచనగా చెప్పినప్పుడల్లా, డోరీ ఆ సంభాషణ ముందుకు సాగనివ్వకుండా ఎప్పటికప్పుడు దాటేస్తూ ఉంది. అతను అందర్లాంటి వాడు కాదూ అన్న ఆశ ఎక్కడో ఉన్నా, ఒకసారి బంధంలోకి కమిట్ అయి పాతబడితే అతను కూడా మిగిలిన వారిలాగే మగబుద్ధి బయట పెట్టుకుని తన మీద అథారిటీ చెలాయిస్తాడేమో అని ఆమెకు జంకు. అయినా కూడా టీగ్ ఆమె పట్ల అదే అభిమానంతో ప్రవర్తిస్తూ, ఆమె నిర్ణయం కోసం ఓపికగా ఎదురుచూస్తున్నాడు.

ఎనభై తొమ్మిదేళ్ళ ఇజబెల్ (Isabelle McAllister) అదే ఊర్లో నివసిస్తున్న ఒక అమెరికన్ వృద్ధురాలు. ఆమె భర్తా, ఒక్కగానొక్క కొడుకూ చాలా ఏళ్ళ క్రితమే చనిపోయారు. అతని భార్యా, పిల్లలూ ఎక్కడో దూరంగా ఉంటారు. అయితే వాళ్ళతో సంబంధాలు కొడుకు చనిపోవడంతోనే పోయాయి. ఎపుడో ఏడాదికో గ్రీటింగ్, ఓ ఫోన్ కాల్ ... అంతవరకే మిగిలింది. ఆమె వయసులో ఉన్నప్పుడు ఎంతో అందంగా ఉండేది అనేదానికి, ఇప్పటికీ సన్నగా తీరుగా ఉండే శరీరాకృతి, బంగారు రంగులో మెరిసే అందమయిన మృదువైన జుట్టూ సాక్ష్యాలు. ఆమె స్వభావం చాలా ముభావంగా, ఎపుడూ సీరియస్ గా ఉంటుంది. డోరీ ఆమె హెయిర్ డ్రెస్సర్. దాదాపు పదేళ్ళ నుండీ ఇజబెల్ డోరీ చేతే హెయిర్ స్టయిల్ చేయించుకుంటుంది. వాళ్ళ పరిచయం నెమ్మదిగా కస్టమర్, హెయిర్ డ్రెస్సర్ స్టేజ్ దాటి మంచి స్నేహంగా మారింది. డోరీ ఒక సలోన్ నుంచి వేరే సలోన్ కి ఉద్యోగం మారినపుడూ, స్వంతంగా తన షాపు పెట్టుకున్నప్పుడూ, ఇజబెల్ కూడా ఆమెతో పాటూ మారేది. ఓ ఐదేళ్ళ క్రితం ఇజబెల్ జారిపడటంతో వెన్నుముక గాయపడి, ఇకపై డ్రైవింగ్ చెయ్యొద్దని డాక్టర్ చెప్పడంతో ఇల్లు కదిలి బయటకి వెళ్ళడం మానేసింది. డోరీ వారానికోసారి ఇంటికే వచ్చి హెయిర్ స్టైల్ చేసి వెళుతూ ఉంది. అంతే కాకుండా అప్పుడపుడూ తను షాపు నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు ఆగి, ఇజబెల్ కు ఏమైనా కావాలేమో కనుక్కుని వెళ్లడం చేస్తుంది. ఇజబెల్ కూడా డోరీకి ప్రేమగా మంచి టిప్స్ ఇవ్వడం, తను వచ్చే సమయానికి తినడానికి ఏమన్నా ఉంచడం చేస్తుండేది. డోరీ తన మాజీ భర్త గురించీ, కొడుకు గురించీ చెప్పుకునేవన్నీ ఇజబెల్ ఓపికగా వినడం, పిల్లల ప్రోగ్రాములు చూడ్డానికి డోరీతో పాటూ స్కూలుకి కూడా వెళ్లటం చేసేది. డోరీని తనకి దేవుడిచ్చిన కూతురు అనుకునేది. వాళ్ళిద్దరి స్నేహం డోరీ తల్లికి కూడా వింతగా అనిపించేది. బయటకి కొంచెం దురుసుగా కనిపించే ఇజబెల్ వెనుక ఏవో

సంఘర్షణలు ఉన్నాయని డోరీకి అనిపించేది. అయితే డోరీ అతిచనువు తీసుకోకుండా తగిన హద్దుల్లోనే ఉంటూ, ఎపుడూ పర్సనల్ విషయాలు ఏమీ అడిగేది కాదు.

అలవాటు ప్రకారం ఒకరోజు హెయిర్ స్టయిల్ చెయ్యడానికి డోరీ ఇజబెల్ ఇంటికి వచ్చేసరికి, ఆమె ఎందుకో కొంచెం అన్యమనస్కంగా ఉన్నట్టు అనిపించింది. 'డోరీ, నువ్వు నాకో సాయం చెయ్యాలి. మనం రేపు ఉదయాన్నే బయలుదేరి, ఒకరి అంత్యక్రియలకు సిన్సినాటి వెళ్ళాలి' అని చెప్పింది ఇజబెల్. ఎపుడూ ఏదీ అడగని ఆమె తనని అడుగుతోందంటే, అక్కడికి వెళ్లడం ఆమెకు చాలా ముఖ్యమనీ, పోయినవాళ్ళెవరో ఆమెకి బాగా కావాల్సినవాళ్ళు అయ్యుంటారనీ ఊహించింది డోరీ. ఇంకెవరినీ కాకుండా తననే అడుగుతోందంటే, ఆ సమయంలో తన తోడు ఆమె కోరుకుంటుందని కూడా డోరీకి అర్ధమయ్యింది. వెంటనే ఇంకేం ఆలోచించకుండా వస్తానని చెప్పింది. ఆర్లింగ్టన్ నుంచి సిన్సినాటీకి కారులో రెండు రోజుల ప్రయాణం. అప్పటికి నాలుగోరోజునే ఫ్యునరల్, కాబట్టి మరుసటి రోజు ఉదయాన్నే బయలుదేరాలనీ, వెంటనే వెళ్ళి ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోమని తొందరపెట్టింది ఇజబెల్. డోరీ వచ్చే వారం రోజుల్లో ఉన్న, తన మిగిలిన కష్టమర్స్ ఎపాయింట్మెంట్స్ అన్నీ ఎడ్జస్ట్ చేసుకుంది. షాపులో అప్పటి వరకూ ఉన్న కేష్, బేంక్ లో జమ చెయ్యడానికి టైం లేక, అక్కడే ఉన్న చిన్న లాకర్లో పెట్టి, షాపు తాళంవేసింది. పిల్లలకి తోడుగా అదే ఊర్లో ఉండే తన తల్లిని వచ్చి తన ఇంట్లో ఉండమని చెప్పింది. టీగ్ ఫోన్ చేస్తే, తాను ఇజబెల్ తో వెళ్తున్న విషయం చెప్పింది. అతను 'నీకూ కొంచెం రొటీన్ నుంచి మార్పుగా ఉంటుంది, వెళ్ళిరా. పిల్లల విషయంలో కంగారుపడకు. నేనున్నాను కదా. ఏమన్నా అవసరమొస్తే మీ అమ్మను నాకు ఫోన్ చెయ్యమను' అని చెప్పాడు. తన షాపు ఉన్న ప్రాంతంలో దొంగతనాలు ఎక్కువవటం వల్ల, వీలున్నప్పుడు అటువైపు వెళ్ళి ఒకసారి చూస్తూ ఉండమని అతన్ని అడిగింది.

మరుసటి రోజు ఉదయమే ఇద్దరూ కారులో సిన్సినాటీ బయలుదేరారు. దారిలోకి చిరుతిళ్ళు, కాలక్షేపానికి క్రాస్ వర్డ్ పజిల్ పుస్తకాలూ, ఇంకా కావాల్సినవన్నీ కొనుక్కున్నారు. డోరీ డ్రైవ్ చేస్తుంటే ఇద్దరూ కలిసి పజిల్స్ నింపుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం సాగుతోంది. నీకు హైస్కూల్ రోజుల్లో బోయ్ ఫ్రెండ్ ఉండేవాడా అని డోరీ అడిగితే, ఉన్నాడని చెప్పింది ఇజబెల్. ఆయనేనా నీ భర్త అని అడిగితే, అదో పెద్ద కథ అని నిట్టూర్చి, దాదాపు డెబ్భయ్యేళ్ళ క్రితం తన జీవితంలో జరిగినవి చెప్పడం మొదలుపెట్టింది.

కథాకాలం 1939 వ సంవత్సరం. కెంటకీ రాష్ట్రంలోని Shalerville అనే ఓ పల్లెటూరు. జాతివివక్ష నిర్లజ్జగా రాజ్యం చేస్తున్న రోజులు. ఆ కాలంలో sundown town అనబడే ఊర్లలో అదొకటి. అంటే కేవలం తెల్లవారు మాత్రమే నివసించే ఊర్లు. ఊరి మొదట్లో 'Niggar, Don't let the sun set on you in this city' అనే హెచ్చరిక బోర్డులు ఉండేవి. చీకటి పడ్డాక ఆ ఊర్లలో నల్లజాతి వారు గనక కనిపిస్తే, ఇక ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందే. సాధారణంగా నల్లజాతివారు ఊరి సరిహద్దుల్లో ఉండే స్లమ్స్ లో నివసిస్తూ, పగలు ఊర్లోకి వచ్చి లేబర్ పనులూ, ఇళ్లలో పనిమనుషులుగానూ పనిచేస్తుండేవారు. వారంతా చీకటయ్యేసరికి పనులు ముగించుకుని వెళ్లిపోవాలి. అపుడు ఇజబెల్ వయసు పదహారేళ్ళు. ఇజబెల్ తండ్రి జాన్, డాక్టర్. మంచి మనసున్న మనిషి. ఆయన ఇంటికి దగ్గరలోనే ఓ చిన్న క్లినిక్ పెట్టుకుని వైద్యం చేస్తూ ఉండేవారు. పేదలకు కూడా ఇంటికి వెళ్ళి మరీ వైద్యం చేసేవారు. ఊరిలో అందరిచేతా గౌరవించబడేవారు. ఇజబెల్ తల్లి మార్గరెట్ సాధారణ గృహిణి. ఇంట్లో నిర్ణయాలన్నీ తల్లివే, తండ్రి ఆమెకు ఎదురుచెప్పేవాడు కాదు. ఇజబెల్ కి ఇద్దరు అన్నలు. తల్లికి ఆడపిల్లలు ఇష్టం వచ్చినట్టు తిరగకూడదనీ, గృహాలంకరణకు అవసరమైన కుట్లూ అల్లికలూ నేర్చుకోవాలని, కుటుంబగౌరవం నిలబెట్టేలా సంప్రదాయంగా ప్రవర్తించాలనీ భావిస్తుండేది. అయితే ఇజబెల్ కు పుస్తకాలు చదవడం, నది ఒడ్డున ఆడటం లాంటివి ఇష్టంగా ఉండేది.

తండ్రికి ఆమె గారాల కూతురు. అతను ఆమెను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తూ ఉండేవాడు. ఆమె ఖాళీ సమయాల్లో తండ్రి క్లినిక్ లోనూ, ఆయన పొరుగూర్లకు వైద్యం చెయ్యడానికి వెళ్ళేటప్పుడు వెంట వెళ్ళీ సాయం చేస్తుండేది. ఆ సమయంలో ఇద్దరూ రకరకాల విషయాలు చర్చించుకుంటూ ఉండేవారు. అన్నలిద్దరూ కాలేజీలో చదువుతూ, హీరోల్లా ప్రవర్తిస్తూ ఉండేవారు. వాళ్ళ మీద తండ్రి సత్ప్రవర్తన కన్నా, బయటవాళ్ళ ప్రభావం ఎక్కువ. ఆయన వాళ్ళకు చెప్పీ చెప్పీ ఇక ఆశలు వదిలేసుకున్నారు. తల్లి కూడా వాళ్ళ విషయంలో పెద్దగా పట్టించుకునేదికాదు.

కోరా (Cora Prewitt) ఇజబెల్ ఇంట్లో మెయిడ్ గా పనిచేస్తుండేది. ఆమె కూతురు నెల్ ఇజబెల్ వయసుది. చిన్నప్పుడు నెల్, ఇజబెల్ కలిసి ఆడుకునేవారు. కొంచెం పెద్దయ్యాక నెల్ స్కూలు మానేసి, తల్లితో పాటూ మెయిడ్ గా పనిచేస్తుంది. కోరా కొడుకు రాబర్ట్ పద్దెనిమిదేళ్ళవాడు, హైస్కూల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను మంచి తెలివైనవాడు. నల్లవారి పిల్లల్లో ఆ మాత్రం చదువుకున్నవాడు అతనొక్కడే. మెడికల్ కాలేజీకి వెళ్లి చదువుకోవాలని అతని ఆశ. అతని మాటా, ప్రవర్తనా కూడా సంస్కారవంతంగా, మిగిలిన ఆ ఈడు నల్లవారి పిల్లల కన్నా భిన్నంగా ఉండేవి. సెలవు రోజుల్లో రాబర్ట్, ఇజబెల్ తండ్రికి ఇంట్లో చిన్న చిన్న రిపేర్ పనుల్లోనూ, తోట పనుల్లోనూ సాయం చేస్తూ ఉండేవాడు. ఇజబెల్ తండ్రికి రాబర్ట్ తెలివైనవాడనీ బుద్ధిమంతుడనీ అభిమానం. రాబర్ట్ నూ, ఇజబెల్ నూ తన క్లినిక్ లో కూర్చోబెట్టుకుని హోమ్ వర్క్ లో సహాయం చేస్తూ ఉండేవారు. అతని చదువుకోసం ఆర్ధిక సాయం కూడా చేసేవారు. రాబర్ట్ కూడా తన పని తను చేసుకుని వెళ్లడం తప్ప, తలెత్తి మిగిలిన విషయాలేవీ పట్టించుకునేవాడు కాదు.

ఇజబెల్ క్లాస్ లో ప్రక్క ఊరి నుంచి వచ్చి కొత్తగా చేరిన అమ్మాయి, ఆ ఊర్లో నైట్ క్లబ్స్ గురించి చాలా వర్ణించి చెప్పడంతో, ఎలా అయినా ఒకసారి చూడాలని ఇజబెల్ కు కోరిక పుట్టింది. ఒకరోజు రాత్రి ఇజబెల్, తల్లి బలవంతంగా పంపించిన పార్టీ నుంచి ఏదో సాకు చెప్పి తొందరగా బయటపడి, నైట్ క్లబ్ చూడటానికి వెళ్ళింది. అక్కడ ఒకతను ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా రాబర్ట్ చూసి, అతనితో తలపడి ఆమెని రక్షించి ఇంటికి జాగ్రత్తగా తీసుకొచ్చాడు. అతను పని ముగించుకుని వెళుతుండగా, ఇజబెల్ ఒక్కర్తే ఆ సమయంలో బస్ ఎక్కి వెళ్లడం చూసి, ఏదైనా ప్రమాదాన్ని అనుమానించి ఆమెను అనుసరించానని చెప్పాడు. అప్పటికే చీకటి పడిపోయినా, అతను రిస్క్ తీసుకుని ఆమెను దాదాపు ఇంటి వరకూ తీసుకురావడం, అతని ప్రవర్తనా ఇజబెల్ కు రాబర్ట్ గురించి మొదటిసారి కొత్తగా ఆలోచించే అవకాశం కల్పించాయి. ఆరోజు నుంచీ తెలీకుండానే ఆమె రాబర్ట్ వచ్చే సమయం కోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టింది. రాబర్ట్ అతని తల్లి కోసం వచ్చినపుడో, లేదా ఏదైనా పని చెయ్యడానికి వచ్చినపుడో అతనున్నంత సేపూ ఆ చుట్టుపక్కలే తిరగడం, అతనితో మాటలు కలిపి చనువుగా మాట్లాడించడం చేసేది. ఒకసారి తల్లి గమనించి, వాళ్లతో నువ్వు ఎక్కువ చనువుగా ఉంటున్నావు సుమా, మంచిది కాదు అని హెచ్చరించింది. ఈలోగా స్కూల్ కి సమ్మర్ సెలవులు వచ్చాయి. రోజూ తల్లి మధ్యాన్నం పూట తలనొప్పితో పడుకునే సమయంలో, లైబ్రరీకి అని చెప్పి రాబర్ట్ తోట పని చేస్తున్న చర్చ్ దగ్గరకి వెళ్ళి అతనితో కబుర్లు చెప్పేది. ఆమెకు తనంటే ఇష్టమని రాబర్ట్ గ్రహించాడు. అతనికి కూడా ఆమె అంటే ఇష్టమే, కానీ వారిద్దరికీ కుదిరేది కాదు అన్న వాస్తవం అతనికి బాగా తెలుసు. ఆమె తన ఇష్టాన్ని చెప్పినప్పుడు కూడా అదే విషయం చెప్పాడు. ఎవరికన్నా అతను ఆమెతో మాట్లాడుతున్నాడన్న విషయం తెలిసినా కూడా, ముందు అతని ప్రాణాలు తీస్తారు అని అతనికి తెలుసు. ఆమెను కూడా ఇంట్లో కట్టడి చేస్తారనీ తెలుసు. 'నువ్వు చిన్నపిల్లవి. నువ్వు కావాలనుకుంటున్నది ఎంత ప్రమాదమో నీకు తెలీటం లేదు. మనకి కుదిరేది కాదు. ఆ సంగతి మర్చిపో' అని నచ్చచెప్పాడు. ఆమెతో ముభావంగా ఉండటానికి ప్రయత్నించాడు. అయినా ఆమె వినకుండా

మొండిపట్టు పట్టింది. చివరికి ఆమె పట్టుదల ముందు అతను ఓడిపోయాడు. అతను అన్నాళ్ళు దాచుకున్న ఇజబెల్ మీద తన ఇష్టాన్ని అంగీకరించాడు.

సెలవులు అయిపోయి స్కూళ్ళు తెరిచారు. రాబర్ట్ వేరే ఊర్లో కాలేజీలో చేరాడు. ఇజబెల్ హైస్కూల్లో చివరి సంవత్సరం చదువుతోంది. నెల్ సహాయంతో ఇద్దరూ ఉత్తరాలు రాసుకునేవారు. రాబర్ట్ సెలవులకు వచ్చినపుడు ఇద్దరూ దొంగతనంగా కలుసుకునేవారు. అయితే అలా దొంగతనంగా భయపడుతూ కలుసుకోవడం ఇజబెల్ కు నచ్చలేదు. పైగా తల్లి కూతురికి పెళ్లి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టి, తన స్నేహితుల కొడుకులతో డేటింగ్ ఏర్పాట్లు మొదలుపెట్టింది. వెంటనే తాము పెళ్లి చేసుకోవాలని ఇజబెల్ పట్టుపట్టింది. రాబర్ట్ ఇంకా కాలేజీ చదువు మొదటి సంవత్సరంలోనే ఉన్నాడు. అతను అనుకున్నట్టు డాక్టర్ కావాలంటే చాలా ఏళ్ళు పడుతుంది. ఇజబెల్ కూడా ఇంకా మేజర్ కాదు. పైగా అపుడు నీగ్రోలకు అమెరికన్స్ మధ్య వివాహాలు కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే చట్టబద్ధం. ఒకవేళ పెళ్ళికి అనుమతి దొరికినా, సమాజం అటువంటి జంటలని, వాళ్ళకి పుట్టే పిల్లలనీ వివక్షతతోనే చూస్తుంది. అయినా కూడా ఇజబెల్ వీలయినంత తొందరలో పెళ్లి చేసుకుందామని పట్టుపట్టింది. రాబర్ట్ ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకుని, ఇద్దరూ ఉండటానికి చిన్న అపార్ట్మెంట్ అద్దెకు తీసుకున్నాడు. వారి ఊరి ప్రక్కనే ఉన్న ఒహాయోలోని సిన్సినాటీ వెళ్ళి, కోర్టులో ఇజబెల్ వయసు అబద్ధం చెప్పి పెళ్ళికి లైసెన్స్ తెచ్చుకున్నారు. విషయం తెల్సి నెల్, వాళ్ళిద్దరినీ ఇజబెల్ ఇంట్లో వాళ్ళు ఎన్ని కష్టాలు పెడతారో అని భయపడింది. ఇజబెల్ తాము తమ పెళ్ళిని గుర్తించే చోటుకు దూరంగా వెళ్ళి బ్రతుకుతామనీ, నెల్ కోరా ఇద్దరినీ కూడా తాము జాగ్రత్తగా చూసుకుంటామనీ ధైర్యం చెప్పింది..

ఓ వారం రోజుల తర్వాత ఓ మధ్యానం వేళ, ఎవరూ చూడకుండా ఇల్లు వదిలి సిన్సినాటి వెళ్ళిపోయింది ఇజబెల్. అక్కడ రాబర్ట్ ఎదురుచూస్తూ ఉన్నాడు. వచ్చేముందు ఇద్దరూ తమ వాళ్ళకి, తాము పెళ్ళి చేసుకోబోతున్నామని ఉత్తరం వ్రాసి పెట్టి వచ్చారు. ఇద్దరూ కలిసి ఒక చర్చ్ కి వెళ్ళి, తమకి పెళ్లి చెయ్యమని అడిగితే, ఆ ప్రీస్ట్ వాళ్ళని తిరస్కారంగా చూసి, 'నేను మీలాంటి వాళ్లకి పెళ్లి చెయ్యను. దానికి వేరే చర్చ్ ఉంది. అక్కడికి పొండి' అని మొహం మీదే తలుపులు మూసేసాడు. ఇద్దరూ అతను చెప్పిన చర్చ్ వెతుక్కుంటూ వెళ్లారు. ఆ చర్చ్ ప్రీస్ట్, అతని భార్య శారా వీళ్ళ పరిస్థితి అర్థం చేసుకుని, వాళ్ళు ఎదుర్కోబోయే సమస్యలు వివరించి మరోసారి ఆలోచించుకోమని చెప్పారు. వాళ్ళు వాటన్నిటికీ తాము సిద్ధమే అని చెపితే, పెళ్లి చేసి ఇద్దరినీ జాగ్రత్తగా వారి అపార్ట్మెంట్ దగ్గర క్షేమంగా దింపి వచ్చారు.

ఆ రోజు చీకటి పడినా ఇజబెల్ ఇంటికి తిరిగి రాకపోవడంతో, జాన్ పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలని అనుకున్నాడు. అప్పటికే ఏం జరిగి ఉంటుందో మార్గరెట్ ఊహించింది. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భయపడి, అతన్ని ఆపింది. మరునాడు ఉదయం మార్గరెట్ ఎంత బెదిరించి అడిగినా, నెల్ తనకేమీ తెలీదని చెప్పింది. తరువాత నెల్ అన్న వ్రాసిన ఉత్తరాన్ని కోరాకు చూపించి విషయం చెప్పింది. కోరా కొడుకు చేసిన పనికీ, యజమానులకు కలిగిన కష్టానికీ భయపడింది. మార్గరేట్ తో వివరాలు చెప్పి, తనకివన్నీ తెలీదనీ క్షమించమని అడిగింది. వెంటనే మార్గరెట్ భర్తనీ, కొడుకుల్నీ సిన్సినాటీ పంపింది. వాళ్ళు వెదుక్కుంటూ వెళ్ళి, పెళ్ళి చేసిన ప్రీస్ట్ ను కనుక్కున్నారు. అతన్ని గాయపరచి, వాళ్ళిద్దరూ ఎక్కడున్నారో చెప్పకపోతే శారాని చంపుతామని బెదిరించి, రాబర్ట్ అడ్రస్ తెలుసుకున్నారు. ఈలోగా శారా పెరటి దారిలో బయటపడి, పరుగున వెళ్ళి ఇజబెల్ కు విషయం చెప్పి, ఏ క్షణం లోనయినా ఆమె అన్నలు అక్కడికి రావచ్చనీ, ఈలోగానే పారిపోమనీ చెప్పింది. ఆ సమయంలో రాబర్ట్ బయటకు వెళ్లాడు. ఇంతవరకూ వచ్చి ప్రీస్ట్ ని బెదిరించారంటే, తమ పెళ్ళిని అంగీకరించే ఆలోచనే వాళ్లకు లేదని అర్థం. అలా అని తను చచ్చిందని అనుకుని, తమ దారిన తమని వదిలేసే ఉద్దేశ్యమూ లేనట్టే. అపుడు ఎక్కడున్నా

తమని వెంటాడి పట్టుకుంటారు. తండ్రి క్రూరంగా ప్రవరించకపోయినా, అన్నలని ఎవరూ ఆపలేరనీ, వాళ్ళు రాబర్ట్ ను చూస్తే చంపకుండా వదలరనీ ఇజబెల్ కు అర్ధమయింది. తండ్రి అడ్డుపడినా కూడా వాళ్ళు లెక్కచెయ్యరనీ తెలుసు. ఏం చెయ్యాలో ఆలోచిస్తుండగానే, అన్నలూ తండ్రీ వచ్చారు. అన్నలు 'ఏడీ వాడెక్కడ? వాడిని చంపకుండా వదలం' అని పిచ్చెక్కినట్టు కేకలేశారు. తండ్రి 'అతని సంగతి మనకెందుకు. మన పిల్ల క్షేమంగా దొరకింది కదా, తనని తీసుకుని వెళ్ళిపోదాం' అన్నాడు. అయినా వాళ్ళు వినకుండా 'ఒక నల్లవాడు మన పిల్ల వేపు చూస్తాడా. వాడి అంతు చూడాలి' అని చిందులేస్తుంటే 'మీరేం చేసినా చెల్లిపోడానికి 'ఇది మన వూరు కాదు. ఇక్కడేమన్నా పిచ్చి పనులు చేస్తే జైల్లో కూర్చుంటారు. మిమ్మల్ని ఎవరూ రక్షించలేరు' అని మందలించి, ఇజబెల్ ను తనతో ఇంటికి రమ్మన్నాడు. ఇజబెల్ తాను రాననీ, తను రాబర్ట్ ని ప్రేమిస్తున్నాననీ, తమ పెళ్ళయిపోయింది అని చెప్పింది. ఆయన 'నువ్వు మైనర్ వి. నీ పెళ్ళి చెల్లదు. గొడవ చెయ్యకుండా ఇంటికి రా. అదే మీ ఇద్దరికీ మంచిది' అని మెత్తగానే అయినా, ఖచ్చితంగా చెప్పాడు. ఇక రాబర్ట్ ను రక్షించుకోవాలంటే, అతను తిరిగి రాకముందే తను వాళ్ళతో వెళ్లడమొక్కటే మార్గం అని ఆమెకు అర్ధమయింది. ముందు రాబర్ట్ క్షేమంగా ఉంటే తరువాత నెమ్మదిగా ఇద్దరూ కలిసే దారి ఇంకోటి వెదకొచ్చు అని ఆలోచించి వాళ్ళతో వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళగానే తల్లి ఏమీ మాట్లాడకుండా, ఇజబెల్ ను మేడ మీది తన గదిలో పడేసి తాళం వేసింది. అన్నయ్యలు గది కిటికీ తలుపులకి మేకులు కొట్టి బంధించేసారు. క్రిందనుంచి తండ్రి, తల్లికి చిన్న గొంతుతో ఏదో నచ్చచెప్పబోవడం, తల్లి అతన్ని ఏమీ మాట్లాడొద్దని హెచ్చరించడం వినిపించాయి. తండ్రి కూడా వాళ్ళతోనే అని, తనకి తోడు రాదనీ అర్ధమయ్యింది ఇజబెల్ కి. మొదట్లో కొన్ని రోజులు భోజనం కూడా గదిలోకే తెచ్చివ్వటం, అప్పుడప్పుడూ తలుపు తీసి బయట కాపలా ఉండి బాత్రూంకి వెళ్ళనివ్వడం చేసేది తల్లి. తరువాత నెమ్మదిగా అందరితో పాటు భోజనానికి డైనింగ్ రూమ్ లోకి రానిచ్చేవారు, కానీ తల్లో అన్నలో ఎవరో ఒకరు ఆమెకు కాపలా ఉండేవారు. అన్నలూ, తల్లీ ఆమెతో ఏమీ మాట్లాడేవారు కాదు. అన్నలు ఆమెను దోషిని చూసినట్టు చూసేవారు. తండ్రి కూడా మౌనంగానే ఉండేవాడు. అలా కిందకి భోజనానికి వచ్చిన సమయంలో, చాలా అరుదుగా కోరా కనిపించేది, కానీ నెల్ ఎక్కడా కనిపించలేదు. రాబర్ట్ క్షేమంగా ఉన్నాడో లేదో, తను చెప్పకుండా వచ్చేసినందుకు ఏమనుకుంటున్నాడో తెలియక ఇజబెల్ విచారంగా ఉండేది. మార్గరెట్ ఇజబెల్ వయసు అబద్ధం చెప్పారు అని చెప్పి వాళ్ళ పెళ్ళి రద్దుచెయ్యించింది.

ఒకరోజు భోజనాల సమయంలో ఇజబెల్ కు కొన్ని నిముషాలు తండ్రితో ఏకాంతం దొరికింది. అప్పటివరకూ ఆమె మనసులో దాచుకున్న దుఃఖం అంతా బయటకి వచ్చింది. 'డాడీ, నువ్వు మొదటినుంచీ అందరికన్నా ఎక్కువగా నన్ను ప్రేమించావు కదా. నేను ఎపుడూ సంతోషంగా ఉండాలని అనేవాడివి. నీకు రాబర్ట్ అన్నా కూడా ఇష్టమే కదా. అతని చదువుకు కూడా నువ్వు సాయం చేసేవాడివి. కొన్ని రోజులు ఆగితే రాబర్ట్ డాక్టర్ అయ్యేవాడు. మేమిద్దరం సుఖంగా ఎక్కడో ఉండేవాళ్ళం కదా. నేను రాబర్ట్ ని ప్రేమించాననీ, అతనితోనే నేను సంతోషంగా ఉంటాననీ చెప్పినా, నువ్వు కూడా నాకు సాయం రాలేదెందుకని? నువ్వు వీళ్ళకి ఎందుకు అడ్డుచెప్పలేదు?' అని అడిగింది. ఆయన అతికష్టం మీద పెగలని గొంతుతో ఏదో చెప్పబోయారు, కానీ ఏమీ మాట్లాడలేక నిస్సహాయంగా చూసారు. 'ఇక నుంచీ నేను నీ కూతుర్ని కాదు' అని చెప్పి వెళ్ళిపోయింది ఇజబెల్. ఆ రోజు తరువాత ఆమె అతన్నెపుడూ డాడీ అని పిలవలేదు.

కొన్నిరోజుల తర్వాత ఇజబెల్ కు కోరాతో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరికింది. ఆమె 'నన్ను క్షమించు. ఇలా అవుతుందనుకోలేదు. రాబర్ట్ ని నేను నిజంగానే ప్రేమిస్తున్నాను. రాబర్ట్ క్షేమంగానే ఉన్నాడా? అతన్ని మావాళ్ళు ఏం చెయ్యలేదు కదా?' అని

అడిగింది. కోరా భయంగా చూస్తూ 'నువ్వు నాతో మాట్లాడకపోవడం మంచిది. రాబర్ట్ బానే ఉన్నాడు. మీ అన్నలు ఆరోజే ఇంటికి వచ్చి బెదిరించారు. రాబర్ట్ మాత్రమే కాదు, మాలో ఎవరైనా నీతో మాట్లాడటం చూసినా, అందరినీ సజీవంగా తగలబెడతామని బెదిరించారు. మీ అన్నలు క్రూరులు. అన్నంత పనీ చేస్తారు. దయచేసి నాతో మాట్లాడటానికి ప్రయత్నించకు' అని చెప్పింది. రాబర్ట్ క్షేమంగా ఉన్నాడన్న విషయం తెలియడంతో ఇజబెల్ సంతోషించింది.

ఓ నాలుగు నెలలు గడిచేసరికి ఇజబెల్ గర్భవతి అన్న విషయం బయటపడింది. అలాంటిదేదో జరుగుతుందని తల్లి భయపడుతూనే ఉంది. అయితే ఇజబెల్ కు ఆ విషయం మొదటే తెలిసినా, తల్లి మీద కోపంతోనూ, తను గర్భవతి అని తెలిస్తే ఇంకేం చెయ్యలేక తనని ఇంటినుంచి గెంటేస్తే రాబర్ట్ దగ్గరికి వెళ్ళిపోవచ్చన్న ఆశ తోనూ నిజాన్ని దాచింది. ఎప్పుడయితే శరీరంలో మార్పులు బయటకు తెలియడం మొదలయ్యాయో, అపుడు తల్లి కి షాక్ తగిలింది. భర్తను గుట్టు చప్పుడుగా అబార్షన్ చేసేవాళ్ళు అతనికి తెలిసే ఉంటారనీ, వాళ్లతో మాట్లాడమని అడిగింది. ఆయన 'నేనా పని చెయ్యను. నన్ను నువ్వు ఈ విషయంలో ఎంత సతాయించినా లాభం లేదు' అని వెళ్ళిపోయాడు. ఆ కాలంలో ఇలాంటి పరిస్థితుల్లో, డెలివరీ అయ్యేవరకూ అమ్మాయిని బయటకి కనిపించకుండా ఉంచి, పుట్టిన బిడ్డని ఎక్కడికో పెంపకానికి ఇచ్చేసేవారు. అమ్మాయిల గురించిన అడిగిన వాళ్లకి ఎక్కడో బంధువుల ఇంటికి సాయానికి వెళ్ళిందని చెప్పేవారు. తమకీ అదే మార్గం తప్పదు అనుకుంది మార్గరెట్. ఇజబెల్ గర్భం సంగతి కోరా గమనించకముందే ఆమెను పనిలోనుంచి తీసేసి, కొత్త మెయిడ్ ను పెట్టింది. తను ఆశించినట్టు జరక్కపోవడంతోనూ, తల్లి ఆలోచనలు పసిగట్టడంతోనూ ఇజబెల్ కు తనిక రాబర్ట్ ను కలుసుకోలేదేమో అని భయం పట్టుకుంది. దానితో తల్లి మీద కోపం, అసహనం ఇంకా ఎక్కువయ్యాయి.

ఇంకొంత కాలం గడిచింది. ఇజబెల్ కు ఏం చెయ్యాలో తోచటమే లేదు. రాబర్ట్ కి తన విషయం ఎలా తెలియచెయ్యాలో కూడా తెలీదు. కోరా ఏమయ్యిందని అడిగిన ప్రశ్నకే కాదు, అసలే ప్రశ్నకూ జవాబు చెప్పదు కొత్త మెయిడ్. రోజు రోజుకీ ఇజబెల్ లో దుఃఖం పెరిగిపోతుంది. ఒకరోజు తల్లితో ఏదో వాదన పెరిగి, ఇజబెల్ తల్లిని గాయపరిచేలా మాటలు అనడంతో, ఆమె ఇజబెల్ ను పట్టుకుని 'అసలు నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా' అని గట్టిగా కుదిపింది. ఆ సమయంలో మేడ మీద మెట్ల అంచున నిలుచున్న ఇజబెల్ పట్టు తప్పి, చెక్క మెట్ల మీదుగా దొర్లుతూ క్రిందపడింది. బాధతో అరుస్తున్న ఇజబెల్ ను గదిలోకి చేర్చి, పురుడు పొయ్యడానికి మంత్రసానిని తీసుకొచ్చారు. డెలివరీ అయ్యి, స్పృహలోకి వచ్చిన ఇజబెల్ కు పుట్టిన బిడ్డ కనిపించలేదు. బిడ్డ ఏదని పదే పదే అడగ్గా, మార్గరెట్ 'నెలలు నిండకుండా పుట్టిన బిడ్డ. జరిగింది ఏదయినా సరే మంచికే' అని ముభావంగా జవాబు చెప్పింది. బిడ్డ పోయిందని తెలిసి ఇజబెల్ కు దుఃఖం ముంచుకు వచ్చింది. రాబర్ట్ కు గుర్తుగా తనకి ఇంకేమీ మిగల్లేదు. బిడ్డని ఒకసారి చూడాలని ఎంత ఏడ్చినా తల్లి కరగలేదు. నర్స్ జాలితో 'పోనీ ఒకసారి చూడనివ్వండి. కొన్నిసార్లు దుఃఖం తగ్గుతుంది' అంటే, 'నీకు అనవసరమయన విషయాల్లో కలుగచేసుకోకు' అని కఠినం చెప్పి గది లోంచి వెళ్ళిపోయింది. 'బిడ్డ ఆడా? మగా? బిడ్డని వాళ్ళు ఏం చెయ్యాలనుకుంటున్నారు?' అని అడిగిన ఇజబెల్ తో 'పుట్టింది ఆడపిల్ల. నువ్వు బాధపడకు. నాకు చేతనయిన సహాయం చేస్తాను' అని చెప్పింది. బిడ్డ శరీరాన్ని ఎక్కడ సమాధి చేస్తారో తల్లి తనకి ఎప్పటికీ చెప్పదన్న సంగతి ఇజబెల్ కు తెలుసు. ఆమె పట్టలేని దుఖంతో కేకలు పెట్టి ఏడ్చింది.

బిడ్డ పోయిన తరువాత ఇజబెల్ పూర్తిగా నిరాసక్తంగా మారిపోయింది. దేని మీదా కోరికా, ఆశా లేవు. తల్లి ఆమెకు ఇల్లు దాటి బయటకి వెళ్ళడానికి అనుమతిచ్చింది, కానీ తను అన్నాళ్ళూ ఆ వూర్లోనే ఉన్నట్టు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు అని షరతు

పెట్టింది. కొన్నాళ్ళు ఇజబెల్ కు ఎక్కడికీ వెళ్ళాలనీ, ఏమీ చెయ్యాలనీ అనిపించలేదు, కానీ హఠాత్తుగా ఓ రోజు ఇక ఆ ఇంట్లో ఉండటం తనకి దుర్భరం అన్న ఆలోచన వచ్చింది. తను రాబర్ట్ ను ప్రేమించిన పాపానికి తన ఇంట్లోనే బందీ కాబడి, అవమానింపబడింది. బిడ్డను కూడా కోల్పోయింది. ఇక తనా ఇంట్లో ఎంత మాత్రమూ ఉండకూడదని నిశ్చయించుకుంది. రోజూ సిన్సినాటీ వెళ్ళి, పేపర్లలో ఉద్యోగ ప్రకటనలు చూసి, తన చదువుకి తగిన ఉద్యోగం కోసం వెదుక్కోసాగింది. అదే సమయంలో వీధుల్లోనూ, రాబర్ట్ తనూ కలిసి ఉన్న అపార్ట్మెంట్ దగ్గరా అతని కోసం వెదికింది, కానీ ఎక్కడా తను కనిపించలేదు. తాము న్న అపార్ట్మెంట్ ఓనర్నీ, ప్రీస్ట్ ఇంటికి వెళ్ళి అతని గురించి అడిగింది, కానీ వాళ్ళు అతన్ని ఆరోజు నుంచీ చూడలేదు అన్నారు. తను అతనికి మాట మాత్రమయినా చెప్పనందుకూ, అతని తల్లికీ చెల్లికీ ఉద్యోగం పోవడానికీ, వాళ్ళ కష్టాలకీ కారణమయినందుకు తనని అసహ్యించుకుంటున్నాడేమో అని అనుమానం కలిగింది. తనకి రాబర్ట్ ఎలానూ దక్కలేదు. జీవితంలో ఇంకో పురుషుడు తనకి అక్కర్లేదు. తన జీవితం తను స్వతంత్రంగా జీవించాలని నిశ్చయించుకుంది.

ఇజబెల్ సిన్సినాటీలో ఓ చిన్న ఉద్యోగం సంపాదించుకుంది. ఒకరి ఇంట్లో పేయింగ్ గెస్ట్ గా ఉండటానికీ మాట్లాడుకుంది. మొదటి జీతం వచ్చేవరకూ, ఇంటికి అడ్వాన్స్ ఇవ్వడానికి అవసరమయిన పది డాలర్లను, తనకి ఇష్టం లేకపోయినా తండ్రినే అడగాలనుకుంది. తనకు ఇప్పటివరకు ఏ సాయమూ చెయ్యలేదు, కనీసం ఇదైనా చెయ్యకపోడా అనుకుంది. క్లినిక్కి వెళ్ళి అడగ్గానే తండ్రి డబ్బులు ఇచ్చాడు. 'ఉద్యోగం చూసుకున్నాను, ఇంట్లోంచి వెళ్ళిపోవాలనుకుంటున్నాను. మీ ఎవరికీ తలవంపులు తెచ్చే పని ఇక మీదట చెయ్యను, కాబట్టి ఎవరికీ అభ్యంతరం ఉండదని ఆశిస్తున్నాను' అన్న ఇజబెల్ తో తండ్రి 'నేను అమ్మతో, అన్నలతో చెపుతాను. నువ్వు ఏ గొడవా జరక్కుండా ప్రశాంతంగా వెళ్ళొచ్చు' అని మాటిచ్చాడు. అంతే కాకుండా 'నీ విషయంలో జరిగిన వాటికి అన్నిటికీ నేను చాలా బాధపడుతున్నానమ్మా. కానీ నువ్వనుకుంటున్నట్టూ సమాజం మారలేదు. వివక్ష మాపడానికి చట్టాలయితే వచ్చాయి కానీ మనుషుల్లో మూర్ఖత్వం ఇంకా అలానే ఉంది. మనందరం అందులోని భాగమే' అంటూ ఆమె రాబర్ట్ తో కలిసి బ్రతకాలనుకోవడం రాబర్ట్ కుటుంబానికి ఎంత ప్రమాదాన్ని తెస్తుందో ఆమెకు అర్థమయ్యేలా కొన్ని సంఘటనలు చెప్పాడు. ఇజబెల్ అతికష్టం మీద దుఃఖాన్ని ఆపుకుని వెళ్ళిపోయింది. రెండురోజుల్లో తనకి కావలసినవి సర్దుకుని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. తండ్రి కన్నీటితో వీడ్కోలు చెపితే, తల్లి మౌనంగా తల వూపి వూరుకుంది.

ఉద్యోగంలో పగలంతా ఏ విషయాలూ గుర్తుకు రానంతగా పని చెయ్యడం మొదలు పెట్టింది ఇజబెల్. కానీ ఇంటికి రాగానే ఓనర్ పిల్లలని చూసి, తన బిడ్డ గుర్తొచ్చి బాధ కలిగేది. మెలకువగా ఉన్న ప్రతీ నిమిషం రాబర్ట్ గుర్తొచ్చి బాధ పడేది. నెమ్మదిగా రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు మార్కెట్లో ఇజబెల్ కి నెల్ కనిపించింది. ముందు చూడగానే తప్పుకుపోబోయినా, ఇజబెల్ ఆపి పలకరించడంతో మాట్లాడింది. కోరాకి అక్కడ సిన్సినాటీలో మెయిడ్ గా ఉద్యోగం దొరికిందనీ, అందరూ జీవితంలో తిరిగి దారిలో పడ్డారనీ చెప్పింది. రాబర్ట్ కూడా తిరిగి కాలేజీలో జాయిన్ అయాడనీ, తొందరలోనే చదువు పూర్తి చేసుకుని సైన్యంలోకి వెళ్ళడానికి రిజిస్టర్ చేసుకున్నాడనీ, మిలటరీ సర్వీస్లో ఉండగానే మెడికల్ ట్రైనింగ్ కూడా పూర్తిచేసుకోవాలని అనుకుంటున్నాడనీ చెప్పింది. రాబర్ట్ తిరిగి చదువు సాగించడం ఇజబెల్ కు సంతోషాన్ని కలిగించింది. అయితే తన గురించి అతను తలుచుకున్నట్టు మాటవరసకు కూడా కూడా నెల్ చెప్పకపోవడంతో, తనని మర్చిపోయి జీవితంలో ముందుకు సాగిపోతున్నాడని అనుకుంది. తండ్రి చెప్పిన మాటలు గుర్తొచ్చి, తనవల్ల వాళ్ళు ఎన్ని కష్టాలు పడ్డారో తలుచుకుంటే ఆమెకు దుఃఖం కూడా వచ్చింది. నెల్ తో 'మీ అందరూ సంతోషంగా ఉన్నందుకు నాకూ చాలా సంతోషంగా ఉంది. ఇంతవరకూ జరిగినవాటికి నేను బాధపడుతున్నాను' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఇజబెల్ కు రోజులు భారంగా గడుస్తున్నాయి. కొత్తగా పరిచయమయిన ఒక అమ్మాయి బలవంతం మీద పబ్లిక్ డాన్స్ పార్టీకి వెళ్ళింది. అక్కడికి సైనికులు ఎక్కువగా వస్తుంటారని ఆమె చెప్పడంతో, ఎప్పుడన్నా రాబర్ట్ కనిపిస్తాడేమో అన్న ఆశతో అక్కడికి వెళ్లడం మొదలు పెట్టింది. అక్కడ మేక్స్ అనే యువకుడి పరిచయమై, అది నెమ్మదిగా స్నేహంగా మారింది. అతను తనంటే ఇష్టపడుతున్నాడని గ్రహించి, తను డేటింగ్ కీ, ప్రేమకీ సుముఖంగా లేనని చెప్పేసింది. అయినా సరే అతను ఆమెకు ఇష్టం కలిగే వరకూ వేచిఉంటానని చెప్పి, ఎప్పటిలాగే స్నేహంగా ఉండసాగాడు. కొన్నినెలలు గడిచాక 'నీ మనసెవరో బాగా గాయపరిచారని తెలుస్తోంది. కానీ ఇలా ఎన్నాళ్లుంటావు? నేనంటే నీకు ప్రేమ లేదని తెలుసు, కానీ ఇష్టమయితే ఉంది కదా. అది చాలు నాకు. నిన్ను కష్టపెట్టకుండా చూసుకుంటాను' అని అడిగాడు. ఇజబెల్ కూడా ఆ విషయం గురించి ఆలోచించింది. 'రాబర్ట్ తనని పూర్తిగా మర్చిపోయాడు. ఇపుడు తను స్వతంత్రంగా ఉందని నెల్ తో చెప్పింది కదా. తన మీద ఇంకా ప్రేముంటే తనకోసం వచ్చేవాడే కదా. తనే అతని కోసం ఇంకా ఆశతో ఎదురు చూస్తుంది' అనుకుంది. తనకోసం అంత ఓపికగా ఎదురు చూస్తున్న మేక్స్ ను పెళ్లిచేసుకోవాలని అనుకుంది. పెళ్ళికి ముందే మేక్స్ కు, వివరాలు చెప్పకుండా తనకి మరొకరితో పరిచయం ఉందన్న విషయం మాత్రం చెప్పింది.

ఇజబెల్ మేక్స్ ల పెళ్లి చాలా సింపుల్ గా జరిగింది. ఇజబెల్ పెళ్లి విషయం తల్లిదండ్రులకి తెలియచెప్పలేదు. ఒక మంచి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మేక్స్ ఒక కంపెనీలో ఎకౌంటెంట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇజబెల్ యాంత్రికంగా వైవాహిక జీవితం గడుపుతోంది. ఆమె మేక్స్ తో ఉన్నప్పుడల్లా, రాబర్ట్ ని మోసం చేస్తున్నానన్న బాధ కలిగేది. మనసు లేని పెళ్లి చేసుకుని, రాబర్ట్ గురించే ఆలోచిస్తూ మేక్స్ కు అన్యాయం చేస్తున్నాననీ కుమిలిపోయేది. మేక్స్ మాత్రం ఆమెతో సంతోషంగా ఉన్నాడు. అలా రెండు సంవత్సరాలు గడిచాయి. పెరల్ హార్బర్ బాంబింగ్ తరువాత, రెండో ప్రపంచ యుద్ధం మొదలవుతోంది. యుద్ధవార్తలు విన్నప్పుడల్లా రాబర్ట్ క్షేమం గురించిన ఆలోచన ఆమెను విపరీతంగా భయపెట్టేది. ఎపుడూ అతని గురించి ఆలోచిస్తూ దిగులుగా గడిపేది. ఒకరోజు ఇజబెల్ ను వెదుక్కుంటూ రాబర్ట్ వచ్చాడు. అతన్ని చూసి ఇజబెల్ నిశ్చేష్టురాలయ్యింది. అతన్ని చూసి దాదాపు నాలుగేళ్లయింది. అతన్ని మళ్ళీ చూస్తానని ఆమె అనుకోలేదు. అప్పటివరకూ తను మిలిటరీలో పని చేశాననీ, కొంతమంది నీగ్రోలను యూరోప్ కు పంపడానికి మెడికల్ ట్రైనింగ్ ఇస్తుంటే తను కూడా అప్ప్లై చేసాననీ, ఈలోగా సెలవు మీద వచ్చాననీ చెప్పాడు. సిటీలో ఇజబెల్ నాన్న కనిపించారనీ, ఆమె పెళ్లి విషయం, భర్త పేరూ ఆయన ద్వారా తెల్సిందనీ, దానితో తను వెదుక్కుంటూ వచ్చానని చెప్పాడు. తను చెప్పకపోయినా తండ్రి తన విషయాలు తెలుసుకుంటూనే ఉన్నాడన్నమాట అనుకుంది.

ఇజబెల్ కు నెల్, రాబర్ట్ రాజీపడి అన్నీ మర్చిపోయాడు అని చెప్పడం, ఇపుడు కూడా రాబర్ట్ మళ్ళీ యుద్ధానికి వెళ్లిపోతానని చెప్పడం ఉక్రోషం, బాధ కలిగాయి. 'ఇన్నాళ్ళూ ఏమైపోయావు? నాకోసం ఎందుకు రాలేదు? ముందే వస్తే నాకీ ఇష్టం లేని పెళ్లి నుండి నరకం తప్పేది కదా. ఇపుడు కూడా మళ్ళీ వెళ్ళిపోయేవాడివి నాకెందుకు కనిపించావు? నువ్వు లేకుండా ఉండటం నాకు ఎలాగూ అలవాటయింది కదా. ఇపుడు మళ్ళీ నా గుండె బద్దలవుతుంది' అని ఏడ్చింది. దానికి రాబర్ట్ ఇలా చెప్పాడు. 'మన పెళ్లి తరువాత జరిగిన పరిస్థితుల బట్టి ఇక మీ నాన్న నా చదువుకి సాయం చెయ్యరు అని తెలిసిపోయింది. నేను ఎలా అయినా మెడికల్ స్కూల్ చదువు పూర్తి చెయ్యడానికి కష్టపడి జాగ్రత్తగా ఉద్యోగం చేసుకుంటున్నాను. నిన్ను తిరిగి నాదగ్గరికి తెచ్చుకుని నిన్ను క్షేమంగా ఉంచే దారి కోసం ఆలోచిస్తూనే ఉన్నాను. కొన్నినెలల తరువాత నేను ఒంటరిగా వెళుతుండగా మీ అన్నలు వాళ్ళ స్నేహితులతో కలిసి నామీద దాడి చేసి హింసించి, బాగా కాల్చిన ఇనుప కడ్డీతో వీపు మీద వాతలు వేసి, 'ఒక తెల్లపిల్ల మీద చేతులు వేసినందుకు శిక్ష' అని వదిలేసి పోయారు. స్పృహ తప్పి పడి ఉన్న నన్ను ఒకతను చూసి, మా ఇంటికి తీసుకెళ్ళి వదిలాడు. నేను కోలుకోడానికి కొన్ని వారాలు పట్టింది. నేను నీ జోలికి రానని మీ అన్నలికిచ్చిన మాట తప్పలేదు. అప్పటికే మా

అమ్మా , చెల్లీ ఇంట్లో పని మానేసారు కూడాను. అయినా అన్ని నెలల తరువాత ఎందుకు నన్ను హింసించారో అర్థం కాలేదు. మిలటరీలో చేరాక మళ్ళీ నాకు ధైర్యం కలిగి, ఎలా అయినా నిన్ను నాతో తెచ్చుకోవాలని వచ్చేసరికి, నువ్వు అప్పటికే ఇల్లొదిలి వెళ్ళిపోయావనీ, నా మీద ఆశ వదిలేసుకున్నావనీ తెలిసింది. ఇపుడు యుద్ధానికి వెళ్ళబోయే ముందు నిన్నొకసారి చూడాలనిపించి, చూడకుండా ఉండలేక వచ్చాను. నేనెప్పుడూ ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తూనే ఉన్నాను' అని చెప్పాడు. 'మన పెళ్ళే నిజమయిన పెళ్ళి. నాతో వచ్చెయ్యి. నేను యుద్ధం నుండి తిరిగి వచ్చేవరకూ నువ్వు ప్రశాంతంగా, క్షేమంగా, ఏ వేధింపులు లేకుండా ఉండగలిగే చోటు చూసి మళ్ళీ వస్తాను. మనం సంతోషంగా ఉందాం' అని బ్రతిమాలాడు. రాబర్ట్ ఇంకా తనని ప్రేమిస్తున్నాడని తెలియటంతో, ఇజబెల్ కు మళ్ళీ ఆశలు కలిగాయి. రాబర్ట్ తో వెళ్ళిపోడానికి ఒప్పుకుంది. ఇద్దరూ మైమరిచి ఏకం అయ్యారు. ఇజబెల్ ను తీసుకెళ్ళడానికి తొందరలో వస్తానని చెప్పి రాబర్ట్ వెళ్ళిపోయాడు.

రాబర్ట్ వచ్చివెళ్ళిన దగ్గర నుండీ ఇజబెల్ లో పూర్వపు ఉత్సాహం తిరిగి వచ్చింది. ఆరోజు నుంచీ పూర్తిగా మేక్స్ ని తప్పించుకు గడపసాగింది. తనేరోజూ మేక్స్ ని ప్రేమించలేదని ఆమెకు తెలుసు. అతనితో మనసు లేని కాపురం చేసే కన్నా రాబర్ట్ తో వెళ్ళిపోవడమే ఇద్దరికీ మంచిదని అనుకుంది. అయితే ఎపుడూ మనమొకటి తలిస్తే జరిగేది వేరొకటి ఉంటుంది. రాబర్ట్ వెళ్ళిన కొన్ని వారాల తరువాత, తను అనుకున్నట్టుగా మంచి చోటు దొరికిందని, త్వరలో వస్తాననీ లెటర్ వ్రాసాడు. ఈలోగా ఇజబెల్ కు తను గర్భవతి అని తెలిసింది. ఆమెకు ఇపుడు పెద్ద సమస్య, పుట్టబోయే బిడ్డ ఎవరి బిడ్డ అని. అది పుట్టేవరకూ తేలని విషయం. ఈలోగా ఆమె ఏం చెయ్యాలి? మేక్స్ తో తను వెళ్ళిపోతున్నానని ఎలా చెప్పాలా అనే ఆలోచించింది ఇన్నాళ్ళూ. మేక్స్ మంచి మనసున్నవాడు, తనంటే ప్రేమున్నవాడు. తన ముభావ ప్రవర్తనని సహనంగా ఇష్టంగా భరించినవాడు. ఆమెని తను ప్రేమించినంతగా ఆమెకి తన మీద ప్రేమ లేదు అని తెలుసు గానీ, తనని వదిలేసి వెళ్ళిపోతుందని మాత్రం ఎపుడూ ఊహించి ఉండడు. అతని స్వభావాన్ని బట్టి, ఇపుడు తను వెళ్ళిపోతున్నాను అని చెపితే తనని నిందించడు, కానీ మౌనంగా తనలో తనే కుమిలిపోతాడు. అయితే తను వెళ్ళిపోయాక, పుట్టిన బిడ్డ అతనిది అని తెలిస్తే మాత్రం ఊరుకోడు. తన నుంచి అతని బిడ్డని తప్పక తీసుకువెళ్ళిపోతాడు. తను చేసిన తప్పుకి బిడ్డ తల్లి లేకుండా పెరగాలి. అలా కాకుండా ఇక్కడే ఉంటే, ఒకవేళ అది రాబర్ట్ బిడ్డ అయితే వెంటనే తననీ బిడ్డనీ ఇంట్లోంచి తగిలేస్తాడు. అపుడు రాబర్ట్ గనక కనిపించకపోతే, మిశ్రమజాతుల బిడ్డకి సింగిల్ మదర్ గా, తనూ బిడ్డా ఇద్దరూ చాలా కష్టాలు పడాల్సి వస్తుంది. బిడ్డని పెంచడానికి తను చివరికి శరీరం అమ్ముకోవాల్సిన పరిస్థితుల్లోకి కూడా వెళ్ళాల్సివస్తుంది. ఒకవేళ తను రాబర్ట్ తో వెళిపోతే, బిడ్డ గనక మేక్స్ బిడ్డ అయితే, అటు నీగ్రోల్లోనూ, ఇటు తెల్లవాళ్ళ దగ్గరా, తల్లి చేసిన తప్పుకి బిడ్డ ప్రతీక్షణం అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇపుడు తనేం చెయ్యాలి అని ఎంతో ఆలోచించిన మీదట, బిడ్డ భవిష్యత్తు కోసం తన ప్రేమని మర్చిపోయి, మేక్స్ తో ఉండటమే మంచిదని నిర్ణయించుకుంది. పైగా తను మేక్స్ ని పెళ్ళి చేసుకుని మోసం చేసినది చాలు, అతని బిడ్డని కూడా అతన్నుంచి దూరం చెయ్యలేను అనుకుంది.

రాబర్ట్ వచ్చినపుడు తన నిర్ణయాన్ని, దానికి కారణాల్ని వివరంగా చెప్పి, అతన్ని వెళ్ళిపోమంది. ఎంతో ఆశతో వచ్చిన రాబర్ట్ కృంగిపోయాడు. ఎవరి బిడ్డ అయినా తను ప్రేమగానే చూసుకుంటాను వచ్చెయ్యమని ఎంతో బ్రతిమాలాడు. కానీ తనతో ఎక్కువ మాట్లాడితే తను కరిగిపోయి మంచీ చెడూ విచక్షణ కోల్పోయి అతనితో వెళ్ళిపోతుందని తెలుసు. అందుకని అతన్ని మాట్లాడనివ్వకుండా వెళ్ళిపోమంది. చేసేదేం లేక రాబర్ట్ వెళుతూ కన్నీళ్ళతో 'నువ్వు మన బిడ్డతో ఇక్కడ ఒంటరిగా కష్టాలు పడటం లేదు అని నిర్ధారించుకోడానికి మళ్ళీ నేను కొన్నాళ్ళ తరువాత వచ్చి చూస్తాను' అని చెప్పాడు. ఇద్దరూ కలిసే సమయానికి, స్వయంగా అతన్ని దూరం చేసుకున్న తన దురదృష్టానికి ఏడుస్తూ ఉండిపోయింది ఇజబెల్. తనిక జన్మలో రాబర్ట్ ను చూడలేదన్న నిజం ఇజబెల్ ను కృంగదీసింది. ఆమె విచారాన్ని మేక్స్ అపుడే

పిల్లలు కనటం తనకి ఇష్టం లేదేమో అనుకున్నాడు. అన్నివిధాలా ఆమెకు ఆసరాగా ఉన్నాడు. నెలలు నిండి ఇజబెల్ కు మేక్స్ పోలికలతో కొడుకు పుట్టాడు. మేక్స్ కు రాబర్ట్ విషయం తెలిసి అతను క్రుంగిపోవాల్సిన అవసరం రానందుకూ, కొడుకు వేధింపులకు లోనవ్వక్కర్లేనందుకూ ఇజబెల్ ఊపిరి పీల్చుకుంది. అయితే మొదటి బిడ్డను పోగొట్టుకున్న దుఃఖం మాత్రం ఆమెను ఎపుడూ వీడలేదు. కొన్నాళ్ళకు వాళ్ళు టెక్సాస్ కు నివాసం మారిపోయారు.

ఈ కథంతా తమ రెండురోజుల ప్రయాణంలో, సిన్సినాటీ హోటల్ కు చేరేలోగా అంచెలంచెలుగా డోరీకి చెప్పింది ఇజబెల్. ఆమె కథ విని డోరీ మనసు బాధతో, ఇజబెల్ మీద జాలితో నిండిపోయింది. అంత కఠినం కనిపించే ఆమె వెనుక ఇన్ని వేదనలున్నాయా అనుకుంది. ఈలోగా డోరీ ప్రస్తుత జీవితంలో చాలా ముఖ్య సంఘటనలు జరిగాయి. దారిలో ఉండగా టీగ్ ఫోన్ చేసి, ముందు రాత్రి ఎవరో షాపు అద్దాలు పగల గొట్టి చోరీ చేసారు అని చెప్పాడు. ఆమె చెప్పిన మీదట చెక్ చేసి, సేఫ్ లో తను పెట్టిన కేష్ కూడా పోయిందని చెప్పాడు. వెనక్కి వెళ్ళగానే కట్టాల్సిన బిల్లులు కళ్ళ ముందు కనిపించి ఆమెకు ఏడుపు వచ్చింది. అతన్ని పోలీసులకు కంప్లయింట్ ఇవ్వమని అడిగింది. కొంతసేపటికి కొడుకు ఫోన్ చేసి అర్జెంట్ గా మాట్లాడాలని మెసేజ్ పెట్టాడు. మళ్ళీ ఏం ఘనకార్యం చేసాడా అనుకుంటూనే మధ్యలో బ్రేక్ కోసం ఆగినపుడు ఫోన్ చేసింది. వాడు చావు కబురు చల్లగా చెప్పాడు. అతని గర్ల్ ఫ్రెండ్ జెన్నీ ప్రెగ్నెంట్ అనీ, ఇపుడే పిల్లలు కనడం ఆమెకు ఇష్టం లేదు కాబట్టి ఆమె అబార్షన్ చేయించుకోవాలని అనుకుంటుందనీ చెప్పాడు. డోరీకి మతి పోయింది. ఈ టీనేజ్ దాటని పిల్లలేంటీ, వాళ్ళకి పిల్లలూ అబార్షన్లూ, వాళ్ళు వేస్తున్న వేషాలేమిటని విపరీతంగా కోపం వచ్చింది. తను వచ్చాక ఆ విషయం మాట్లాడదాం నోరుమూసుకుని కూర్చోమని చెప్పింది. అయితే స్టీవీ మరుసటి రోజుకే డాక్టర్ తో వీళ్ళు ఎపాయింట్మెంట్ తీసుకున్నారనీ, దానికి డబ్బు కోసం ఏం చెయ్యాలో తెలీక తల్లి షాపులో తానే దొంగతనం చేసాననీ చెప్పాడు. డోరీ పిచ్చెక్కిపోయింది. ఎదురుగా కనిపిస్తే వాడి పీక నొక్కెయ్యాలన్నంత కోపం వచ్చింది. నువ్వేం చేసుకుంటావో తెలీదు, నా డబ్బు మాత్రం వాడావంటే చంపి పోగులు పెడతాను అని అరిచింది. విషయం జెన్నీ తల్లిదండ్రులకు తెలీదనీ, వాళ్ళ నాన్నకు తెలిస్తే తనని చంపేస్తాడనీ స్టీవీ ఏడుపు మొదలెట్టాడు. నీ ఏడుపు నువ్వేడువు, నా డబ్బు మాత్రం ముట్టుకోకు అని వార్నింగ్ ఇచ్చింది.

టీగ్ అప్పటికే పోలీసులకి చెప్పాడేమో అని డోరీకి కంగారు పట్టుకుంది. ముందు గొయ్యి, వెనుక నుయ్యిలా ఉంది ఆమె పరిస్థితి అపుడు. పోలీసులు వచ్చి ఇన్వెస్టిగేట్ చేస్తే కొడుకు జైలుకి వెళతాడు. తన చేతులతో తనే కొడుకు భవిష్యత్తు నాశనం చేసినట్టు అవుతుంది. కంప్లయింట్ వెనక్కి తీసుకోమని చెప్పాలంటే, టీగ్ కి అసలు విషయం చెప్పాలి. అపుడు అతను తన గురించీ, తన కుటుంబం గురించీ ఏమనుకుంటాడో, నాకెందుకు ఇలాంటి వాళ్లతో కష్టాలు అని మొహం చాటేస్తాడేమో అని భయం. మొత్తానికి ఆలోచించి అతనికి విషయం చెప్పకుండా, తను మనసు మార్చుకున్నాననీ, కంప్లయింట్ వాపసు తీసుకోమని ఫోన్ మెసేజ్ పెట్టింది. అతను ఎందుకూ అని అడిగితే జవాబు చెప్పలేనని, తరువాత అతను ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆన్సర్ చెయ్యకుండా తప్పించుకుంటోంది. అతను ఆమె క్షేమంగానే ఉందా, లేదా ఏదైనా ఇబ్బందుల్లో చిక్కుకుందా అని ఆందోళనతో, గంటకోసారి ఫోన్ చేసి మెసేజెస్ వదులుతూనే ఉన్నాడు.

ఆరోజు సాయంత్రం విజిటేషన్, మరుసటి రోజు ఫ్యునరల్. అప్పటికే మానసికంగా కూడా ఇజబెల్ చాలా అలసిపోయినట్టు కనిపిస్తోంది. విజిటింగ్ కి ఇంకా సమయం ఉండటంతో కాసేపు విశ్రాంతి తీసుకొని, టైమ్ కు చాలా ముందుగానే బయలుదేరారు. ఇజబెల్ దారి చెపుతుంటే డోరీ డ్రైవ్ చెయ్యసాగింది. కొన్ని వీధులు తిప్పి, తనూ రాబర్ట్ పెళ్లి చేసుకున్న చర్చ్, తరువాత వాళ్ళు ఉన్న అపార్ట్మెంట్, తను

ఉద్యోగం చేసేనపుడు ఉన్న ఇల్లు చూపించింది. తరువాత ఒక స్మశానం లోకి తీసుకు వెళ్ళి, ఒక సమాధి దగ్గరకు తీసుకు వెళ్ళింది. ఆ సమాధి మీద రాబర్ట్ ప్రీవిట్ (1921- 1944) అని ఉంది. అప్పటివరకూ డోరీ, ఇజబెల్ కథంతా వింటూ, తాము అపుడు వెళుతున్నది రాబర్ట్ ఫ్యునరల్ కి అనుకుంటుంది. అది చూడగానే ఆమెకు అయోమయం కలిగింది. ఇజబెల్ తన హేండ్ బేగ్ లోంచి శిధిలావస్థలో ఉన్న ఒక ఉత్తరాన్ని డోరీకి చూపించింది. అది రాబర్ట్ యుద్ధానికి వెళుతూ వ్రాసి, నెల్ కు ఇచ్చి, ఒకవేళ తను యుద్ధం నుండి తిరిగి రాకపోతే ఇజబెల్ కు పంపమని ఇచ్చాడు. అందులో 'నువ్వు ఈ ఉత్తరం గనక చదువుతున్నావూ అంటే, నేను మళ్ళీ నీకోసం, మన బిడ్డకోసం వస్తానని నీకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయానన్నమాట. ఒకవేళ నేను రాలేకపోతే ఆ బిడ్డ మేక్స్ బిడ్డ అవాలని నేను దేవుడ్ని ప్రార్థిస్తాను. ఎందుకంటే మొదటే నల్లతోలుతో పుట్టినవాడికి ఎన్ని కష్టాలో నాకు తెలుసు. అదీ తండ్రి అండ లేకుంటే ఇంకెంత దారుణంగా ఉంటుందో అన్న ఊహ కూడా నేను భరించలేకపోతున్నాను. ఒకవేళ దురదృష్టవశాత్తు నీకేం కష్టం కలిగినా నెల్, మా అమ్మ కోరా నీకు ఆసరాగా ఉంటామని నాకు మాటిచ్చారు. మా అందరికీ నువ్వంటే చెప్పలేనంత ప్రేమ. ఎపుడు ఏ కష్టం వచ్చినా నీకు వాళ్ళున్నారని మాత్రం మర్చిపోకు' అని వ్రాసాడు. అది చదివిన డోరీకి మనసు మెలిపెట్టినట్టయింది. 'యుద్ధంలో రాబర్ట్ ఎక్స్ప్లోజివ్ మీద కాలెయ్యబోయిన వేరే సైనికుడిని రక్షించడం కోసం తాను మధ్యలో దూకి ప్రాణాలు కోల్పోయాడు. ఆ వార్త నాకు నా కొడుకు పుట్టడానికి వారం రోజుల ముందు తెలిసింది. ఆ వార్త తెలియడంతోనే నా జీవితం అయిపోయింది అనుకున్నాను, కానీ నెమ్మదిగా నా కొడుకు వల్ల మళ్ళీ కోలుకున్నాను' అని చెప్పింది ఇజబెల్. డోరీకి ఒక్కసారిగా తన జీవితం గుర్తొచ్చింది. తన కష్టాలే పెద్దవనుకుంది. కొడుకు చేస్తున్న మతిలేని పనులకు చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. టీగ్ ప్రేమని ఒప్పుకోడమంటే తనకి భయం, అందరిలాగే అతని వల్లా మనసు గాయపడుతుందేమో అని. అయితే తనెంత అదృష్టవంతురాలు అన్నది అపుడే తెలిసింది ఆమెకి. తనని ప్రేమించినవాళ్ళు, తనకి ప్రియమైనవాళ్ళూ కూడా ఇంటి దగ్గర తనకోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఇజబెల్ రాబర్ట్ అనుభవించిన కష్టాలతో పోలిస్తే తనవీ ఓ కష్టాలేనా అనిపించింది ఆమెకి. అయితే 'ఇంతకీ ఫ్యునరల్ హోమ్ లో ఆమె ఆఖరిచూపు కోసం వేచిఉన్నవారెవరూ' అన్న ప్రశ్న వేధిస్తుంది ఆమెను.

ఇద్దరూ బయలుదేరి ఫ్యునరల్ హోమ్ కి వచ్చారు. ఇజబెల్ కారులోంచి దిగటానికి కూడా శక్తి లేనట్టుగా కనిపించింది. డోరీ నెమ్మదిగా ఆమె చెయ్యిపట్టుకుని నడిపిస్తుండగా, ఇద్దరూ లోపలికి వెళ్లారు. ఒక్కో రూమ్ ముందు బోర్డ్ మీద వ్రాసి ఉన్న పేర్లు చదువుతూ వెదుక్కుంటూ వెళ్ళి, పర్ల్ ప్రీవిట్ అని ఉన్న గది ముందు ఆగింది ఇజబెల్. ఈ పర్ల్ ఎవరబ్బా, ఇప్పటివరకూ తను చెప్పిన కథలో ఈపేరు ఎక్కడా రాలేదే అనుకుంది డోరీ. నెమ్మదిగా లోపలికి వెళ్ళి కేస్కెట్ ముందు నిలబడింది ఇజబెల్. అందులో తెలుపూ నలుపూ కలిసిన ఛాయలో, అచ్చం ఇజబెల్ పోలికలతో ఉన్న 72 ఏళ్ళ పర్ల్ పడుకోబెట్టి ఉంది. హాల్లో ఆమెవి చిన్నప్పటి నుండీ వివిధ వయసుల్లో తీసిన ఫోటోలు అమర్చిఉన్నాయి. ఆ ఫోటోల్లో ఆమె ఎంతో గ్రేస్ఫుల్ గా, కాన్ఫిడెంట్ గా కనిపిస్తోంది. ఆమెలో రాబర్ట్ పొడుగూ, కొన్ని పోలికలూ కనిపించాయి స్పష్టంగా కనిపించాయి ఇజబెల్ కి. ఆ ఫోటోలను ఎంతో ఆబగా చూస్తోంది. పర్ల్ మొహం చూడగానే డోరీకి అర్థమయింది ఆమె ఇజబెల్ కూతురే అని. ఆమె షాక్ తో నిలబడి, ఆ విషయాన్ని ఇజబెల్ ఎలా తీసుకుంటుందా, ఆమె ఏమయిపోతుందా అని భయపడుతూ చూస్తోంది. తనని అక్కడికి ఎందుకు తోడుగా తెచ్చిందో కూడా డోరీకి అర్థమయింది. ఇజబెల్ కు అత్యంత బలహీనమయిన క్షణాలవి. ఆమెకు మానసికంగా బలాన్నిచ్చే తోడు అవసరం. ఈలోగా నెల్ కనిపించగానే, ఇజబెల్ పరుగున వెళ్ళి ఆమెను కౌగలించుకుంది. ఇద్దరూ మౌనంగా రోదించారు, తరువాత ఇజబెల్ దూరంగా పర్ల్ మొహం బాగా తనకి కనిపించేలా కూర్చుని చెమ్మగిల్లితున్న కళ్ళతో తదేకంగా చూస్తూ కూర్చుంది. డోరీ ఆమె పక్కనే కూర్చొని తన చేతుల్లో ఆమె చేతులు పట్టుకుని సాంత్వనగా నిమురుతూ కూర్చుంది. ఇజబెల్ మనసులో ఎన్ని విషాదతరంగాలు ఎగుస్తున్నాయో ఆమె వూహించగలదు. ఆ కూతురి కోసం జీవితమంతా తపించింది ఆమె, కానీ తన కళ్ళతో చూసుకోగలిగే

సమయానికి అందనంత దూరం వెళ్ళిపోయింది. మౌనంగా ఆమె తన శోకాన్ని కరిగించుకోడానికి వీలుగా అందరూ ఆమెని ఒంటరిగా వదిలేసారు. చివరిలో నెల్, పర్ల్ కొడుకునీ, కోడలినీ, మనవరాలినీ తీసుకొచ్చి ఇజబెల్ కు చూపించింది. అయితే అందరికీ అనుకోకుండా కలిసిన ఆ కొత్త సంబంధాలు కొంచెం ఇబ్బందిగానే అనిపించాయి. విజిటేషన్ ముగిసిన తర్వాత ఇజబెల్, డోరీ మళ్ళీ హోటెల్ రూమ్ కు వచ్చేసారు. నడవడానికి కూడా శక్తి లేకుండా ఉన్న ఇజబెల్ ఏమయిపోతుందో అని డోరీ కి భయం వేసింది. ఆమెను కాసేపు నిద్రపోమని చెప్పి పడుకోబెట్టింది.

మరునాడు ఉదయం లేచి తయారయి మళ్ళీ ఫ్యునరల్ హోమ్ కు వెళ్లారు. సర్వీస్ సమయంలో పర్ల్ గురించి చెపుతూ, కోరా పేరు పెంపుడు తల్లి గానూ, ఇజబెల్ పేరు కన్నతల్లిగానూ చెప్పినపుడు ఇజబెల్ కంట కన్నీరు ధారగా కారింది. పర్ల్ ను, రాబర్ట్ సమాధి ప్రక్కనే సమాధి చేసారు. అప్పటివరకూ కేవలం మౌనంగా కన్నీరు కార్చిన ఇజబెల్ వెక్కి వెక్కి ఏడుస్తుంటే, డోరీ తల్లిలా ఆమెను దగ్గరకు తీసుకుంది. తరువాత ఫ్యునరల్ కి వచ్చిన అందరూ నెల్ ఇంటికి వెళ్లారు. వచ్చిన అతిథులందరూ వెళ్ళిన తరువాత నెల్, ఇజబెల్, డోరీ, పర్ల్ కోడలు ఫెలీషియా కూర్చున్నారు. అపుడు నెల్ జరిగిన విషయాలు చెప్పుకొచ్చింది. అప్పటికి ఓ రెండు వారాల క్రితం పర్ల్ నిద్రలో ప్రశాంతంగా చనిపోయింది. విషయం తెలియచెయ్యాల్సిన వాళ్ళ వివరాల కోసం ఫెలీషియా పర్ల్ డైరీ వెదుకుతుంటే, అందులో ఇజబెల్ నంబర్ కనిపించింది. ఇజబెల్ ఎవరో ఆమెకి తెలియక నెల్ ని అడిగింది, 'ఎవరామె? ఈ కబురు తెలియచెయ్యాలా?' అని. అపుడు నెల్ రాబర్ట్, ఇజబెల్ కథ చెప్పి, ఎపుడో జరిగిపోయిన గతాన్ని అందరూ వదిలేసుకున్నారు, అలా వదిలేయ్యడమే మంచిదేమో అంది. ఫెలీషియా దానికి ఒప్పుకోకుండా ఇజబెల్ కు తెలియచెయ్యాలని పట్టుబట్టి, తనే ఫోన్ చేసి విషయం చెప్పింది. ఇజబెల్ కు ఆ నిజం కలుగచేసిన షాక్ నుండీ, దుఃఖం నుండీ తేరుకుని, అంత దూరం నుండి ప్రయాణం చేసి వచ్చి, కూతురికి వీడ్కోలు చెప్పే అవకాశం కోసం ఫ్యునరల్ని రెండువారాలు వాయిదా వేసారు. ఆ విషయం వినగానే డోరీకి ఆ నిజాన్ని తెలుసుకున్న ఇజబెల్, తను ఒక్కతే ఆ విషాదాన్ని ఇన్నాళ్ళు ఎలా భరించిందో అని ఆశ్చర్యం వేసింది. ఆమె స్ట్రాంగ్ లేడీ అని తెలుసు కానీ, మరీ ఇంత స్ట్రాంగ్ అని డోరీ అనుకోలేదు.

పర్ల్ అసలు మీదగ్గరికి ఎలా వచ్చింది అని అడిగిన ఇజబెల్ తో నెల్ జరిగినదంతా చెప్పింది. ఇజబెల్ బిడ్డను ప్రసవించిన రోజు, ఇజబెల్ తల్లి మంత్రసానితో ఆ బిడ్డను తీసుకెళ్ళి ఎక్కడయినా నల్లజాతి వాళ్ళ అనాధాశ్రమంలో వదిలేయి అని చెప్పింది. ఆ రాత్రివేళ చీకట్లో పాపను తీసుకుని మంత్రసాని వెళుతుంటే, ఇజబెల్ నాన్న ఆమెను అనుసరించి వచ్చి, దగ్గరుండి రాబర్ట్ ఇంటికితీసుకొచ్చి కోరాకి అప్పగించారు. ఆయన రోజూ వచ్చి, నెలలు నిండకుండా బలహీనంగా పుట్టిన ఆ బిడ్డకు కావాల్సిన మందులూ, స్వయంగా బేబీ ఫార్ములా చేసి తీసుకొచ్చి, జాగ్రత్తలు చెప్పి వెళ్ళేవారు. నెల్, రాబర్ట్ అమ్మా నాన్నా వంతులు వేసుకుని రాత్రీ పగలూ పాపని సాకారు. అది విన్న ఇజబెల్ మొహం పాలిపోయింది. 'నాన్న చేసారా ఇదంతా నేను నమ్మలేను' అంది. నెల్ 'మీ నాన్నకి నువ్వంటే ప్రాణం. ఆయన మనవరాలు ఎక్కడో అనాధగా పెరగటం ఆయన భరించలేకపోయారు. అయితే ఆయన బలహీనత అంతా మీ అమ్మకు ఎదురుచెప్పలేకపోవడం. దానితో పాపను నీకు దగ్గరగా ఉంచే దారయితే ఆయనకు తెలీలేదు, కానీ పాప ఎక్కడ క్షేమంగా ఉంటుందో అక్కడికి చేర్చారు.' అని చెప్పింది. మరి ఆయన అమ్మకు ఎదురు చెప్పలేకపోతే సరే, కానీ పాప బ్రతికేఉందన్న నిజాన్ని నాకయినా ఎందుకు చెప్పలేదు అని అడిగింది.

నెల్ 'ఆ సంగతి నీకు చెపితే నువ్వు పాపని వదిలి ఉండేదానివా? అయినా పాప మా దగ్గర ఉందన్న విషయం తెలిస్తే మీ అమ్మ మా అందరి జీవితాలూ ఇంకెంత నరకం చేసి ఉండేదో. మీ అన్నలు రాబర్ట్ ని వదిలి ఉండేవారా? బహుశా అందుకనే మీ నాన్న ముఖ్యంగా రాబర్ట్

క్షేమం కోరే నీకు చెప్పలేదేమో. అయినా నీకు పాప చనిపోయిందని ఎవరు చెప్పారు?' అని అడిగింది. అపుడు ఇజబెల్ కు తల్లి మాటలు 'నెలలు నిండకుండా పుట్టింది. అంతా మన మంచికే' అన్న మాటలు గుర్తొచ్చాయి. నువ్వైనా నాకు ఎందుకు చెప్పలేదు ఆ విషయం అని నెల్ ని అడిగితే, మీ అమ్మ మంత్రసానితో 'నాకీ బిడ్డ అక్కర్లేదు. నన్ను కలవడానికి ఎపుడూ ప్రయత్నించకండి' అని వ్రాసిన చీటీ పంపింది. పాపను చుట్టిన బట్టల్లో ఉన్న ఆ చీటీ మేము ఎప్పటికో చూసాము. అది చూసి మేము నిజంగానే నీకు ఆ పాప అక్కర్లేదేమో అనుకున్నాము. ఆ చీటీ సంగతి మీ నాన్నగారికి తెలియదు' అని చెప్పింది. 'ఆయన బ్రతికున్నన్నాళ్ళూ పర్ల్ అవసరాల కోసం పేరు వ్రాయని కవర్లో డబ్బులు పెట్టి, తలుపు క్రింద నుండి లోపలికి పెట్టి వెళ్ళేవారు. అది ఎవరు చేసారో ఎవరి కోసమో మాకు తెలుసు. ఆయన చనిపోయేముందు కూడా పెద్ద మొత్తాన్ని పర్ల్ కాలేజీ చదువుకోసం అని ఇచ్చారు. దానివలన ఏనాడూ పర్ల్ కు ఏ లోటూ లేకుండా సాగింది' అని చెప్పింది. ఇజబెల్ కు తండ్రి ప్రేమ, పెద్దమనసు తెలుసుకున్నాక బాధ, సంతోషం, కృతజ్ఞత కలిగాయి.

పర్ల్ కు నేను తల్లిని అని తెలుసా అని అడిగింది ఇజబెల్. 'తనకి పెద్దయ్యేవరకూ తెలీదు. తను పుట్టినపుడే తల్లి చనిపోతే, తెలిసినవాళ్ళు పెంచడానికి కోరాకు ఇచ్చారని చెప్పాము. కొంచెం పెద్దయ్యాక నేను మీ కథ చెప్పాను. అపుడు తనకి చెప్పిన కథ పూర్తిగా నిజం కాదు అన్న అనుమానం తనకి ఎపుడో వచ్చిందని చెప్పింది. తన ఒంటి రంగు చూసి తన తల్లిదండ్రులలో ఒకరు తెల్లవారు అయ్యుండాలని అనిపించిందట. అయితే రాబర్ట్ పోలికలు తనలో ఉండటంతో రాబర్ట్ తన తండ్రేమో అన్న అనుమానం కూడా వచ్చిందనీ, కానీ అడిగి నిజాలు తెల్సుకోడానికి భయమేసి వూరుకున్నాననీ చెప్పింది. ఎపుడూ అతని ఫొటోలని శ్రద్ధగా చూస్తుండేది. అయితే ఆమె మనసు గాయపడుతుందని నువ్వు తనని వద్దనుకున్నావన్న విషయం చెప్పలేదు. ఆమె ఏం చెయ్యాలనుకుందో తనకే వదిలేసాము. కొన్నాళ్ళకి తను ఎలానో నువ్వు టెక్సాస్ లో ఉన్నావన్న విషయం తెలుసుకుంది. చాలాసార్లు నీతో మాట్లాడాలని, ఫోన్ చేసి కూడా, నువ్వు ఆన్సర్ చేసాక మాట్లాడకుండా పెట్టేసేది. నీ భర్తా, పిల్లలూ తన విషయం తెలిస్తే ఎలా తీసుకుంటారో, నీకెంత ఇబ్బంది కలుగుతుందో అనిపించి, నిన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక ఆ ప్రయత్నాలు మానేసింది. అయితే ఆమె జీవితమంతా సంతోషంగా, సంతృప్తికరంగా, గౌరవప్రదంగా గడిచింది' అని చెప్పింది. ఇజబెల్ కు దాదాపు ఒక సంవత్సరం పాటు తనకి వచ్చిన బ్లాంక్ కాల్స్ గుర్తొచ్చాయి. 'అయ్యో తన కోసం నేనెంత తపించిపోయానో. తనే అని నాకు తెలిస్తే తనకోసం ఏమైనా వదులుకునేదాన్ని. జీవితమంతా ఎంత దుఃఖాన్ని అనుభవించానో ఎవరికైనా ఎలా తెలుస్తుంది' అని ఏడ్చింది.

పర్ల్ తన కూతురు అన్న విషయం రాబర్ట్ కు తెలుసా అని అడిగింది ఇజబెల్. అపుడు నెల్ 'తెలియకపోవచ్చు. మీరిద్దరూ కలిసి వెళ్ళిపోయాక, రాబర్ట్ ఇంట్లో ఎక్కువగా లేడు. ఓ రెండుసార్లు సెలవుల్లో వచ్చి వెంటనే వెళ్ళిపోయాడు. తరువాత ఆర్మీ లోకి వెళ్ళిపోయాడు. పర్ల్ కి రెండు మూడేళ్ళ వయసున్నపుడు, అతను యుద్ధానికి వెళ్లేముందు సెలవులో వచ్చినపుడు నువ్వు కనిపించావనీ, నిన్ను యుద్ధం ముగిసి తనొచ్చేవరకూ ఇక్కడ ఉంచుతానని చెప్పాడు. అపుడు అమ్మ పర్ల్ విషయం చెపుదామనే అనుకుంది, కానీ పాపని నువ్వు ఒద్దనుకున్నావన్న విషయం చెపితే అతని గుండె బద్దలవుతుందని, నువ్వొచ్చాక చెప్పొచ్చని ఆగిపోయింది. అయితే అతను చెప్పినట్టుగా నువ్వు రాలేదు. తనెన్ని చెప్పినా నువ్వు రావని మాకు అర్ధమయింది' అని చెప్పింది. తను రాబర్ట్ తో వచ్చుంటే తన కూతురి దగ్గరికే వచ్చేది కదా అనుకుంది ఇజబెల్. తను జీవితకాలం దేనికోసమైతే తపించిందో, అవి తనకి అతి దగ్గరలో ఉండి కూడా అందకుండా పోయిన వాస్తవాన్ని తట్టుకోలేక భరించలేని దుఖంతో వణికిపోయింది.

కొంతసేపు కూర్చుని ఇక వెళ్ళడానికి బయలుదేరారు డోరీ, ఇజబెల్. నెల్ తన జీవితమంతా రాబర్ట్ ని, ఇజబెల్, పర్ల్ ని ప్రొటెక్ట్ చేయడానికి ఎంతో కష్టపడింది. పర్ల్ ను తల్లిలా పెంచింది. నెల్ ను ఇజబెల్ గాఢంగా కౌగలించుకుని వీడ్కోలు చెప్పింది. ఫెలీషియాను ప్రేమగా దగ్గరికి తీసుకుని, కృతజ్ఞతలు చెప్పి, వాళ్ళందరినీ తనకు ఉత్తరాలు రాస్తుండమనీ, తన దగ్గరికి రమ్మనీ మరీ మరీ చెప్పింది. అప్పటివరకూ రాబర్ట్ గుర్తుగా కూడా తన దగ్గర ఏమీ మిగలలేదని ఎపుడూ బాధపడేది. ఇపుడు మనవడు, మునిమనవరాలు, ముందు ముందు పుట్టబోయే వాళ్ళల్లో తమ ప్రేమ మెరుస్తూనే ఉంటుందని అనుకోవడంతో ఇజబెల్ కు కొంచెం తృప్తి కలిగింది. అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని హోటల్ కు వెళ్ళిపోయారు. మరుసటి రోజు ఉదయం తిరుగు ప్రయాణానికి బయలుదేరారు. వెళ్లేముందు ఇజబెల్ తన తండ్రి సమాధి దగ్గర ఆగి, తండ్రికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకుంది.

ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఇజబెల్ ను ఇంటి దగ్గర దింపి వెళుతూ, డోరీ 'చనిపోయింది నీకూతురు అని ముందే నాకెందుకు చెప్పలేదు' అని అడిగితే, 'నాకు ఎక్కడి నుండి మొదలు పెట్టాలో తెలీక నా ప్రేమ కథతో మొదలెట్టాను. అది కూడా చెప్పాలనుకున్నాను, కానీ ఈలోగా నీ సమస్యలు మొదలయ్యాయి. ఏ క్షణంలో అయినా నువ్వు వెనక్కి తిరిగి వెళ్ళాల్సిన అవసరం పడితే, నాకోసం మానుకుంటావేమో అని చెప్పలేదు' అని చెప్పింది.  ఇంకా 'డోరీ, నీకు నేనెప్పుడూ చెప్పలేదు కానీ నాకు నువ్వు కేవలం స్నేహితురాలివే కాదు. నా కూతురివి. నీ ఆసరా లేకపోతే నేను ఒంటరిగా ఈ పని చెయ్యలేకపోదును. రాబర్ట్, పాప ఇద్దరూ దూరమవడం నా మనసులో రెండు మానని గాయాలు చేసింది. కానీ దేవుడు నీ ద్వారా ఆ లోటుని కొంచెం పూడ్చాడు. నిజానికి నేను చాలా అదృష్టవంతురాలిని, ఎందుకంటే ఇద్దరు మంచి వ్యక్తులు నన్ను నిజాయితీగా ప్రేమించారు. మంచి మగవాళ్ళు కొందరే ఉంటారు. నువ్వు ప్రేమించే మంచి మగవాడు దొరికినపుడు మాత్రం ఎన్ని కష్టాలొచ్చినా అతన్ని వదిలిపెట్టకు' అని చెప్పింది.

ఆ నాలుగు రోజుల్లో ఇజబెల్ జీవితం ద్వారా తను తెలుసుకున్న విషయాలతో, డోరీకి చాలా సమస్యలకు పరిష్కారం దొరికింది. ఇంటికి వెళ్ళగానే కొడుకుతో మామూలుగా మాట్లాడి సంగతులేంటి అని అడిగితే, 'జెన్నీకి సహజంగానే అబార్షన్ అయిందనీ, కాబట్టి హాస్పటల్ కి వెళ్ళక్కర్లేదు' అని చెప్పాడు. కానీ నాకు చాలా బాధగా ఉందమ్మా అని ఏడ్చాడు. డోరీకి ఇపుడు ఆ బాధను అర్థం చేసుకోగలిగే శక్తి వచ్చింది. కొడుకుని దగ్గరకు తీసుకుని 'నీమీద నేను అప్సెట్ అయిన మాట నిజం. అయితే సమస్యలొచ్చినపుడు వాటికి భయపడి దొంగతనాల్లాంటి పనులు చేసేకన్నా, ఇంకేదన్నా మార్గం ఉందేమో వెదుక్కోవాలి. నువ్వింకా చిన్నపిల్లాడివి కాబట్టి ఇలాంటి సమస్యలు ఇంకా వస్తూనే ఉంటాయి. అయితే అపుడు వాటిలోంచి బయట పడటానికి నువ్వొక్కడివే కష్టపడక్కర్లేదు. నువ్వు తీసుకున్న నిర్ణయాలను నేను అంగీకరించకపోవచ్చు, కానీ నువ్వు సరైన నిర్ణయం తీసుకోడంలో సాయపడటానికి నీకు తోడుగా నేనున్నాను. నువ్వు ఒంటరివి కాదు అన్నది గుర్తు పెట్టుకో' అని చెప్పింది.

డోరీ టీగ్ ని కలిసి తమిద్దరి ఫ్యూచర్ గురించీ తను ఆలోచించాననీ, అయితే తన టీనేజ్ పిల్లలూ, వాళ్ళ తలనొప్పులూ, తన తల్లి, ఇజబెల్ వీళ్ళందరి మీదా తనకున్న బాధ్యతలన్నీ ఏకరువు పెట్టింది. అతను తనకీ బాధ్యతలున్నాయనీ, తన పిల్లలు కూడా కొన్నేళ్లలో అదే వయసుకి వస్తారు కాబట్టి తనవైపు నుంచి కూడా ఆ తలనొప్పులన్నీ ఉంటాయి మరి అన్నాడు. ఇద్దరూ కలిసి ఆ బాధ్యతలని తీర్చుకోగలమన్న నమ్మకం తనకుంది కాబట్టి, తన మీద నమ్మకం ఉంచమని అడిగాడు. డోరీకి ఇజబెల్ మాటలు గుర్తొచ్చాయి. అతనిని వదులుకోకూడదని నిర్ణయించుకుంది.

ఈ కథకి రచయిత్రి నాన్నమ్మ కథ ప్రేరణ అట. ఆవిడ టీనేజ్ వయసులో ఒక నీగ్రో అబ్బాయిని ప్రేమించారట. సహజంగానే పెద్దవాళ్ళు ఆ ప్రేమని సాగనివ్వలేదు. ఆవిడ ఎప్పుడూ మూడీగా, సీరియస్గా ఉండేవారట. కొన్నేళ్ళ క్రిందట జూలీ వాళ్ళ నాన్నను అడిగితే, అపుడు ఆయన ఆ కథ చెప్పారు. అపుడు జూలీకి అనిపించిందట, బహుశా ఆ ప్రేమతో పాటే ఆవిడ జీవితం మీద ఆపేక్షనూ, సున్నితత్వాన్ని పోగొట్టుకున్నారేమో అని. ఆ కథ ఆమెను ఈ నవల రాసేవరకూ వెంటాడిందట. డోరీ పాత్రకు తన చిరకాల స్నేహితురాలయిన తన హెయిర్ డ్రెస్సర్ ప్రేరణ అని చెపుతారు.

కథంతా ఒక చాప్టర్ ఇజబెల్ గతంతో, ఇంకొక చాప్టర్ డోరీ కథ వర్తమానంతో సాగుతుంది. అయితే కథ ఎక్కడా పట్టు తప్పకుండా, కన్ఫ్యూజన్ రాకుండా, రెండు కథలనూ అల్లుతూ ఎంతో చక్కగా, సీమ్ లెస్ అంటారే అంత చక్కగా వ్రాసారు. కథలో రెండు పార్శ్వాలు. ఒకటి రాబర్ట్ ఇజబెల్ ప్రేమకథ. రెండోది డోరీ ఇజబెల్ మధ్య స్నేహం. రెండూ మనల్ని ఎంతో ఆసక్తిగా చదివిస్తాయి. లిరికల్ పొయెట్రీ అంటారు, అలాంటి అందమయిన వచనం, ఒక్క వాక్యం కూడా పొల్లు లేకుండా. మొత్తం కథ చెప్పిన తీరు ఒక్కటీ ఒకెత్తు, ముగింపు ఒక్కటీ ఒకెత్తు. ఒక్కో నిజమూ బయటపెడుతుంటే, మనకి ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తెలియకుండానే కళ్ళు చెమ్మగిల్లుతాయి.

ఇజబెల్ కథలో వాళ్ళ ప్రేమా, పర్యవశానాలూ, జాతివివక్షతో అన్యాయమూ అమానుషమూ అయిన చర్యలూ మరీ ఇంత రాక్షసమా అనిపిస్తుంది. అయితే ఇది ఎపుడో డెబ్బయ్యేళ్ళ క్రిందటి కథ, ఇపుడు అందరమూ మనుషులుగా చాలా పరిణితి చెందిపోయి మానవత్వాన్ని మనసంతా నింపేసుకున్నాము అనుకుంటే పొరపాటే. అప్పటి అంత కాకపోయినా ఇంకా వివక్ష ఉంది. సమానత్వం అనేది లా పుస్తకాల్లోనే తప్ప మనుషుల మనస్సులో లేదు. దాన్ని ఎత్తి చూపుతూ కొన్ని సీన్స్ వ్రాసారు. ఒక హోటల్ మేనేజర్ డోరీ, ఇజబెల్ కలిసి రావడం అనుమానించి, ఇజబెల్ కారు లోంచి దిగి లోపలికి వచ్చి మాట్లాడేవరకూ డోరీకి రూమ్ ఇవ్వడానికి నిరాకరిస్తాడు. అలానే ఒక రెస్టారంట్లో భోజనానికి ఆగినపుడు, అక్కడ కొంతమంది వీళ్ళిద్దరికీ స్నేహమేంటీ, ఆ నల్లామె తెల్లామెకు సర్వెంట్ అయుంటుంది అని వినేలానే కామెంట్ చెయ్యడం, ఇద్దరినీ అనుమానంగా చూడటం చేస్తారు. రెండు చోట్లా ఇజబెల్ వాళ్ళకు బుద్ధొచ్చేలా గట్టిగా జవాబిస్తుంది. ఓ రెండు మూడేళ్ళ క్రితమే ఎక్కడో చదివినట్టో, టీవీ ప్రోగ్రాం లోనో చూసిన గుర్తు. అందులో కొంతమంది ఆఫ్రికన్ అమెరికన్స్, వాళ్ళని చాలా చోట్ల షాపుల్లో అనుమానంగా చూస్తారనీ, ఏదో పనున్నట్టు సిబ్బంది వాళ్ళ వెంటే గమనిస్తూ తిరుగుతారనీ, తాము నిజాయితీగా కొంటున్నాకూడా చూపుల్లో అనుమానం పోదనీ బాధగా చెప్పారు. ఏదో ఒక్కరు చేసిన ఛండాలపు పనికి జాతిని మొత్తం బాధ్యులని చెయ్యడం, అనుమానించి అవమానించడం ఏ జాతి చరిత్రలోనూ కొత్త కాదు.

డోరీ, ఇజబెల్ ... వయసులు వేరు, రంగులు వేరు, జాతులు వేరు, మనస్తత్వాలు వేరు. అయినా కూడా అపురూపమయిన స్నేహబంధం ఇద్దరి మధ్యా ఏర్పడింది. ఏ ఒక్కరూ అవసరానికో, కాలక్షేపానికో కోరి సృష్టించుకున్నది కాదు. మన జీవితంలోకి ఎవరు, ఎపుడు, ఏ రూపంలో ఏ బంధంతో అడుగుపెడతారో తెలీదు. ఆ అదృష్టం మన వాకిలిలో నిలబడి తలుపు తట్టినపుడు నిండు మనసుతో స్వాగతం చెప్పాలి. హృదయానికి అపురూపంగా హత్తుకోవాలి. ఎందుకంటే అలాంటివి చాలా అరుదుగా దొరికే అదృష్టాలు. అందరికీ ఆ అదృష్టాలు రాసి పెట్టి ఉండకపోవచ్చు.

**పుస్తకం నుండి కొన్ని నచ్చిన వాక్యాలు :**

*"It's funny how you find a friend – in likely places – and almost immediately, you can talk about anything. But more often than not, after the initial blush, you find you really have nothing in common. With others, you believe you'll never be more than acquaintances. You're so different, after all. But then this thing surprises you, sticking longer than you ever predicted, and you begin to rely on it, and that relationship whittles down your walls, little by little, until you realize you know that one person better than almost anyone. You're really and truly friends."*

*"The heart is a demanding tenant; it frequently makes a strong argument against common sense."*

*"When you fall in love, every kind of reason flies out the newly opened window of your brain."*

*"The only person I needed to trust was myself. The other road had too many curves, and I wanted to see straight ahead."*

*"Things I'd been sure of before, I questioned now."*

*"Remember this, Dorrie: Some men are just plain bad news. Then there are good men. They'll do. Then there are good men you love. If you find one of the last kind, you'd better hang on to him with everything you have."*



రచయిత్రి పరిచయం: Julie Kibler టెక్సాస్ లోని ఆర్లింగ్టన్ నివాసి. వృత్తి ఫ్రీలాన్స్ ఎడిటర్. పుస్తకాలు చదవడం, సినిమాలు, ఫోటోగ్రఫీ హాబీలు. What Women Write అనే బ్లాగులో, ఇంకొంతమంది రచయిత్రులతో కలిసి పోస్ట్స్ వ్రాస్తూ ఉంటారు. Calling Me Home ఆమె మొదటి నవల. దీన్ని 2013 లో వ్రాసారు. ఈ పుస్తకం ప్రస్తుతానికి దాదాపు పది విదేశీ భాషల్లో విడుదల అయింది. దీన్ని సినిమాగా తీయడానికి వార్నర్ బ్రదర్స్ సంస్థ రైట్స్ తీసుకుంది అని ఒక వార్త. కొన్నేళ్ళ క్రితం తన నాన్నమ్మతో తన అనుబంధం గురించి, Final Sale on Tires అనే ఒక మెమోయిర్ వ్రాశారట. ప్రస్తుతం ఆమె రెండవ నవల వ్రాసే ప్రయత్నాల్లో ఉన్నారు.

**Some Interesting Links:**

రచయిత్రితో పరిచయం, కథ వెనుక కథా, పాత్రలకు ప్రేరణా, విశేషాలూ బుక్ మాగ్నెట్ బ్లాగర్ చేసిన ఇంటర్వ్యూలో ...

ఈ పుస్తకానికి వివిధ భాషల ఎడిషన్స్ కు వేసిన ముఖచిత్రాలు

ఈ పుస్తకానికి ఒక అభిమాని, కథలో ప్రాంతాలు, సంఘటనలకు సరిపోయేలా అప్పటి సిన్నినాటీ చిత్రాలతో కూర్చిన స్క్రాప్ బుక్

(Pictures source: Internet)



# పుస్తకం ఓ నేస్తం
## – పద్మవల్లి



## The Children Act

*“When a court determines any question with respect to the upbringing of a child ... the child’s welfare shall be the court’s paramount consideration.” – Section I(A), The Children Act, 1989*




మతం ఒక మత్తు అన్నాడు కార్ల్ మార్క్స్ రెండు శతాబ్దాల క్రితం. అయితే అది మత్తు స్థాయి దాటి ఉన్మాదపు స్థాయికి ఎపుడో చేరిపోయిందన్నది కాదనలేని సత్యం. ఆ ఉన్మాదపు ఫలాలు కొన్ని విస్తృత స్థాయిలో కనిపిస్తే, కొన్ని బయటకు తెలీకుండానే పర్సనల్ లెవెల్లో ఉండిపోతాయి. అంతమాత్రానా అది ఉపేక్షించాల్సిన విషయం ఏమాత్రమూ కాదు. మనిషి తన మనుగడ కోసం, మానసిక నైతిక ఆలంబన కోసం ఏర్పాటు చేసుకున్న మతమూ దేవుడూ అన్న భావనలు, సాటి మనిషిని కబళించే విషంగా మారిపోయినపుడు ఎవరు దిక్కు? అటువంటి పరిస్థితుల్లో మానవత్వం నిండిన మనుషులో, మతం లేని న్యాయస్థానాలో జోక్యం చేసుకోవలసిన అవసరం తప్పదు.

మతం అంటే నమ్మకం లేని, న్యాయమే తన దేవుడని నమ్మే ఒక మహిళా న్యాయమూర్తి. మతం కోసం, మతవిశ్వాసాల కోసం కొడుకు ప్రాణాలనే పణంగా పెట్టిన తల్లిదండ్రులు. లుకేమియాతో బాధపడుతున్న కొడుకుకి అత్యవసరమైన చికిత్సను మతం అనుమతించదని నిరాకరించినపుడు ... పేషెంటే తమ దైవం అనీ, వైద్యమే తమ ప్రార్థనలనీ నమ్మే డాక్టర్లు, తమకు చేతనయి కూడా మూఢవిశ్వాసాలకు ఓ ప్రాణాన్ని బలివ్వడానికి తమలోని మానవత్వం అంగీకరించని వాళ్ళు ... చట్టాన్ని ఆశ్రయిస్తే, మతాలకు అతీతమైన చట్టాలు ఏం తీర్పు చెప్పాలి? వ్యక్తి ప్రాథమిక హక్కులని గౌరవించాలా, లేకపోతే మతం కన్నా మనిషి ముఖ్యమని చెపుతాయా? మనిషి తయారు చేసుకున్న చట్టాలే మనిషికి న్యాయం చెయ్యడంలో అవరోధంగా నిలబడిన పరిస్థితుల్లో ఎవరేం నిర్ణయాలు తీసుకున్నారు? ఆ నిర్ణయాలు ఎక్కడికి దారితీసాయి అనేది Ian McEwan వ్రాసిన The Children Act పుస్తకం కథ.

ఏభైతొమ్మిదేళ్ళ ఫియోనా (Fiona Maye) బ్రిటీష్ హైకోర్ట్ లో ఫేమిలీ విభాగపు జడ్జ్. ఆమెకు మతమూ, దేవుడూ అంటే పెద్దగా నమ్మకం లేదు. ఏ కేసులో అయినా మంచీచెడూ ఆలోచించి, తన మనస్సాక్షికి అనుగుణంగా తీర్పు చెపుతుంది. ఆమె అనుభవం, జ్ఞానం,

న్యాయనిర్ణయంలో పరిపూర్ణత్వం తెలిసిన అందరూ ఆమెను ఎంతో గౌరవిస్తారు. ఆమె ఎంతో సంక్లిష్టమయిన కేసుల్లో కూడా ఆమె ఇచ్చే తీర్పులు దేశవ్యాప్తంగా చెప్పుకుంటారు. ఆమె దగ్గరకు ఏ కేసు వచ్చినా న్యాయం జరగాల్సినవాళ్ళకు న్యాయం జరిగితీరుతుందని అందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తారు. తొందరలోనే ఆమెను హైకోర్ట్ కౌన్సిల్ కి నామినేట్ చెయ్యబోతున్నారనే వార్తలూ వినిపిస్తున్నాయి. ఆమె భర్త జాక్, ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్. ఇద్దరూ చాలా అన్యోన్యమయిన జంట. వాళ్ళకు పెళ్ళయి 35 ఏళ్ళయినా పిల్లలు లేరు. వయసులో ఉన్నప్పుడు కెరీర్లో ఎదిగే ప్రయత్నాల్లో ఆమెకు ఆ లోటు తెలియకపోయినా, అది తెలిసేవచ్చేసరికి సమయం మించిపోయింది. అంత బిజీ జీవితంలోనూ ఆమెను ఆ లోటు అప్పుడప్పుడూ బాధిస్తుంటుంది.

ఆమె వృత్తిలో భాగంగా ఎన్నో కుటుంబ సమస్యలతో కేసులు వస్తుంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రుల గొడవల మధ్య నలిగిపోయే పిల్లల విషయంలో ఆమెకు ప్రత్యేకమయిన శ్రద్ధ. సాధారణంగా ఆమె కేసుల్లో తీర్పు ఇచ్చేటప్పుడు తల్లిదండ్రుల ఎమోషన్స్ కన్నా, పిల్లలకు యేది మంచి అనుకుంటుందో ఆ నిర్ణయం వైపు మొగ్గుతుంది. ఆమె సున్నితమనస్కురాలు కావటంతో, కొన్ని కేసుల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు చాలారోజులు ఆమెను వెంటాడేవి. అయినా ఆమెకు తను ఎన్నో నిరాశాపూరితమైన  కేసులకు కూడా న్యాయం చెయ్యగలిగినందుకు, ఆమెకు వృత్తి జీవితం సంతృప్తిగానే ఉండేది. పగలంతా కోర్ట్ పనులు, సాయంత్రం అయ్యేటప్పటికి బిజినెస్ డిన్నర్లు, పార్టీలు, కేసులకి సంబంధించిన పేపర్లు తయారుచేసుకోవడం, అలసిపోయి పడుకోవడం...జీవితం దాదాపు యాంత్రికంగా ఉంది.

అది 2012 వ సంవత్సరం, జూన్ నెల, ఒక ఆదివారం రోజు. అప్పటికి కొన్ని వారాల ముందు ఆమె ఒక క్లిష్టమయిన కేసులో తీర్పు చెప్పాల్సి వచ్చింది. ఒక కేథలిక్ దంపతులకు ఒకటే మొండెం రెండు తలలతో సయామీ కవలలు పుట్టారు. ఒక బిడ్డకు స్వతంత్రంగా బ్రతకడానికి అవసరమైన కొన్ని ముఖ్యమయిన అవయవాలు లేవు. రెండవ బిడ్డ మీద ఆధారపడి మొదటి బిడ్డ జీవంతో ఉన్నాడు. అయితే మొదటిబిడ్డ పరిస్థితి కూడా రోజురోజుకీ క్షీణిస్తుంది. అయితే అలా ఎన్నాళ్ళో జరగదనీ, వెంటనే ఆపరేషన్ చేసి ఇద్దరినీ విడదియ్యాలని డాక్టర్లు చెప్పారు. అలా విడదీస్తే మొదటిబిడ్డ వెంటనే చనిపోతాడు. అలా వదిలేస్తే తొందరలోనే ఇద్దరూ చనిపోతారు. కాబట్టి ఒక్కరినైనా బ్రతికించడం తమ ధర్మం అని డాక్టర్లు అలోచించి, తల్లిదండ్రులకి నచ్చచెప్పాలని చూసారు. అయితే తల్లిదండ్రులు అలా దేవుడి నిర్ణయించినదానికి వ్యతిరేకంగా చెయ్యడానికి తమ మతధర్మం ఒప్పుకోదనీ, ఆయన ఎలా నిర్ణయిస్తే అలాగే జరుగుతుందనీ ఆపరేషన్ చెయ్యడానికి అనుమతివ్వలేదు. డాక్టర్లు చూస్తూ చూస్తూ ఇద్దరినీ  అలా చావనివ్వలేక, ఆపరేషన్ చెయ్యడానికి అనుమతివ్వమని కోర్ట్ లో ఎపీల్ చేసారు. ఆ కేస్ లో తీర్పు ఇవ్వాల్సింది ఫియోనానే. తల్లిదండ్రుల మతపరమైన నమ్మకాలకన్నా పిల్లల క్షేమం ముఖ్యమని తలిచిన ఫియోనా, ఆపరేషన్ చెయ్యడానికి అనుమతి ఇచ్చింది. అయితే దానివలన ఒక బిడ్డ ప్రాణం నిలిచినా, రెండవ బిడ్డ జీవితాన్ని తనే అంతం చేసిందన్న బాధ ఆమెను కలిచివేసింది. తనకు బిడ్డలు లేకపోవడం వల్లనే తను ఆ కఠిన నిర్ణయాన్ని తీసుకోగలిగిందా అని ఆలోచించింది. ఆరోజు నుంచీ ఆమెకు మనశ్శాంతి  లేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ప్రతీ నిముషం అదే ఆలోచన ఆమెను భాదిస్తోంది.

పై సంఘటన జరిగి కొన్ని వారాలు గడిచినా ఆమె మనసు ఇంకా ఆ సంఘర్షణ నుండి కోలుకోలేదు. మరునాడు తీర్పు చెప్పాల్సిన ఓ కేసు గురించిన పేపర్లు తయారు చేసుకుంటోంది. ఈలోగా జాక్ వచ్చి నీతో మాట్లాడాలి అన్నాడు. 'నాకు అరవయ్యేళ్ళు వచ్చాయి. నాకింకా ఎంత జీవితం మిగిలుందో తెలీదు. పునర్జన్మలూ వాటి గురించీ నాకు తెలీదు. జీవితం ముగిసిపోయేలోగా ఒక మహత్తరమైన ప్రేమానుభావం పొందాలని నాకు చాలా కోరికగా ఉంది. నీమీద నాకు ఎప్పటిలానే ప్రేమ ఉంది. మన భార్యాభర్తల సంబంధంలో ఏమీ మార్పు ఉండదు. కానీ ఒక్కసారి ఆ అనుభవం పొందాలని ఉంది, అది కూడా నీ అనుమతితోనే. నీకు తెలీకుండా చెయ్యాలన్నది నా ఉద్దేశ్యం కాదు' అన్నాడు. తన కొలీగ్ ముప్పయ్యేళ్ళ మెలనీ మీద తనకి ఆకర్షణగా ఉందనీ, ఆమెకు కూడా తనంటే ఇష్టం ఉన్నట్టు కూడా  చెప్పాడు.  ఫియోనాకి మతిపోయింది. అతనా ఉద్దేశ్యం మార్చుకోకపోతే ఇల్లు వదిలి వెళ్ళిపోవచ్చనీ, అతని పిచ్చి ఆలోచనలను సహించే ఉద్దేశ్యం తనకి లేదనీ తెగేసి

చెప్పింది ఫియోనా. కొంత వాదన తరువాత అతను తన సూట్కేస్ సర్దుకుని ఇంట్లో నుంచి వెళ్ళిపోతుంటే, ఆమె నిశ్చేష్టురాలయి నిలబడిపోయింది. సహజంగా అతను మంచి మనసున్నవాడు. ఏనాడూ ఆమెను కష్ట పెట్టే పని చెయ్యలేదు. ఇద్దరూ ఎంతో ప్రేమగా ఉండేవారు. ఇపుడు సడన్ గా అతనికేం అయ్యిందో , ఆలోచనలు ఎందుకు పెడదారి పట్టాయో ఆమెకు అర్ధం కాలేదు. అన్నేళ్ల కాపురం తరువాత వేరే స్త్రీతొ ప్రేమానుభవం కోసం ఆమెను కాదనుకుని వెళ్లిపోవడంతో ఆమెకు అవమానం, దుఃఖం కలిగాయి.

ఫియోనా ఇంకా ఆ షాక్లో ఆలోచిస్తూ ఉండగానే, ఆమె క్లర్క్ పాలింగ్ ఫోన్ చేసాడు. ఒక ఆసుపత్రి నుంచి ఎమర్జెన్సీ హియరింగ్ కోసం ఒక కేస్ వచ్చిందనీ, మరునాడే కోర్టులో ఆమె ఆ కేసు తీర్పు చెప్పాల్సి ఉంటుందని చెప్పి, ఆ కేస్ వివరాలు చెప్పాడు. పదిహేడేళ్ళ ఏడమ్ (Adam Henry) హైస్కూల్లో చదువుకుంటున్న పిల్లాడు. అతని కుటుంబం Jehovah's Witness అనే మతాన్ని అనుసరిస్తారు. ఏడమ్ లుకేమియాతో బాధపడుతూ, ప్రస్తుతం చాలా ప్రమాదకరమయిన పరిస్థితిలో ఆసుపత్రిలో ఉన్నాడు. వెంటనే రక్తమార్పిడి చెయ్యకపోతే పరిస్థితి విషమిస్తుందని డాక్టర్లు చెప్పినా తల్లిదండ్రులు దానికి ఒప్పుకోలేదు. బైబిల్ లో 'శరీరంలో రక్తాన్ని వేరే మనిషి రక్తంతో గానీ, జంతు రక్తంతో గానీ కలపడం మహాపాపం' అని చెప్పబడిందట. వారికి ఏడమ్ ఒక్కడే సంతానం. అయినా కొడుకు ప్రాణాల కన్నా, మతానికి విరుద్ధంగా నడుచుకుంటే చర్చ్ నుంచీ, సమాజం నుంచీ తమని వెలేస్తారేమో అన్న భయమూ, మతం మీద మూఢభక్తీ వాళ్ళని డామినేట్ చేస్తున్నాయి. అన్నిటికన్నా విచారకరమైనది ఏంటంటే ఏడమ్ కూడా చికిత్సను వ్యతిరేకిస్తున్నాడు. అతని మీద కూడా తల్లిదండ్రుల మతనమ్మకాలూ, మతపెద్దల బోధలూ విపరీత ప్రభావం చూపిస్తున్నాయి. మతం కోసం, నమ్మకాల కోసం తన ప్రాణం వదులుకోడం వీరధర్మం అనీ, ఆ అవకాశం తనకి రావడం దేవుని నిర్ణయం అన్న భావన అతనిలో బలంగా ఏర్పడింది. ఆసుపత్రిలో ఎందరు ఎన్ని విధాల నచ్చచెప్ప బోయినా ముగ్గురూ వినలేదు.

ఏడమ్ మేజర్ కావడానికి ఇంకా మూడు నెలల టైం ఉంది. అది దాటితే ఎవరూ అతని అనుమతి లేకుండా ఏమీ చెయ్యలేరు. ఇప్పుడయితే మైనర్ కాబట్టి ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆ పిల్లాడి ప్రాణాల్ని రక్షించాలని అతని డాక్టర్లు నిర్ణయించుకుని, ఆసుపత్రి తరపున కోర్టులో ఎమర్జన్సీ తీర్పు కోసం పిటీషన్ పెట్టారు. రెండు రోజులు దాటితే పేషంట్ ని రక్షించగలిగే అవకాశం చాలా చాలా తక్కువని డాక్టర్లు ఆ పిటీషన్లో చెప్పారనీ, అందువల్ల వెంటనే తీర్పు చెప్పాల్సి ఉంటుందని చెప్పాడు పాలింగ్. అతనితో మంగళవారం మధ్యానం రెండు గంటలకు కేస్ హియరింగ్ కు పెట్టమనీ, మరునాడు సాయంత్రానికల్లా డాక్టర్లను వాళ్ళ తరపున పేపర్లు కోర్టుకు పంపించమనీ, ఏడమ్ తరపున గార్డియన్ లాయర్ ను ఏర్పాటు చెయ్యమనీ చెప్పింది. హాస్పిటల్ వాళ్ళతో, కేస్ విషయం పేరెంట్స్ కు తెలియచేసి, కావాలంటే వాళ్ళ తరపున అపీల్ చేసుకోవచ్చని చెప్పమని చెప్పింది. కేస్ హియరింగ్ సమయంలో ఏడమ్ ను ట్రీట్ చేస్తున్న స్పెషలిస్ట్ స్టేట్మెంట్స్ ముఖ్యమని వాళ్ళకు చెప్పమని కూడా చెప్పింది.

మరుసటి రోజు ఆమె కోర్టులో తీర్పు చెప్పాల్సిన కేసులు చూసుకుంటుంది, కానీ ఒక్క నిముషం ఖాళీ దొరికినా భర్త ప్రవర్తన, తిరస్కారం గుర్తొచ్చి బాధపెడుతూనే ఉన్నాయి. ఆ కోపంలో తమ అపార్ట్మెంట్ మెయింటెనన్స్ చూసే ఏజెన్సీకి ఫోన్ చేసి, వెంటనే ఇంటికి కొత్త తాళాలు మార్చమని చెప్పింది. మధ్య మధ్యలో భర్త నుంచి 'తను తొందర పడ్డాను, నీకోసం తిరిగి వచ్చేస్తున్నాను' అని ఏమన్నా ఈమెయిలో, టెక్స్ట్ మేసేజో వస్తుందని ఆశగా చూసుకుంటూనే ఉంది. అయితే ఒకవేళ అతనలా తిరిగి వస్తే తనేం చెయ్యాలి అన్నదీ ఆమెకు స్పష్టంగా తెలీటంలేదు. ఎలాగో రోజు గడిచి, ఇంటికి వచ్చింది. ఇంట్లో ఒంటరితనం బాధపెడుతుంటే, భర్త గురించి ఆలోచిస్తూ, మరునాటి ముఖ్యమైన కేసులు గుర్తొచ్చి బలవంతంగా నిద్రపోయింది.

మంగళవారం ఉదయం కోర్టుకు రాగానే పాలింగ్, ఆరోజు తీర్పు చెప్పబోయే ఏడమ్ కేస్ ప్రజల్లో చాలా ఆసక్తి కలిగించిందనీ, రాత్రికి రాత్రి ఏడమ్ నూ అతని పేరెంట్స్ నీ పత్రికలన్నీ, ఇంటర్వ్యూలు చేసి ఫొటోలతో సహా ప్రచురించాయనీ, కేసు తీర్పు కవర్ చెయ్యడానికి అన్ని

మీడియాల నుండీ రిపోర్టర్స్ వస్తున్నారనీ చెప్పాడు. ఫియోనా ఉదయం చూడాల్సిన కేసులు పూర్తి చేసుకుంది. మధ్యానం సెషన్ మొత్తం ఏడమ్ కేస్ కోసం కేటాయించారు. లంచ్ టైములో కేసు వివరాలు అన్నీ మరోసారి చూసుకుంది. ఆమె నిర్ణయం మీద ఒక మనిషి చావుబ్రతుకులు ఆధారపడి ఉన్నాయి. ఆ కేస్ విషయంలో ఎలా ప్రొసీడ్ అవాలో అప్పటికే ఆమె ఒక అవగాహనకి వచ్చింది. కోర్టు హాల్లో కేస్ హియరింగ్ మొదలయింది. హాల్లో ఒకవైపు హాస్పిటల్ తరపున డాక్టర్లు వాళ్ళ ప్రధాన లాయర్ బెర్నర్, అతని వకీళ్ళు; ఒకవైపు ఏడమ్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన CAFCASS (Children and Family Court Advisory and Support Service) మెంబర్ అయిన లాయర్ జాన్, అతని వకీలు, ఇంకో CAFCASS మెంబర్ సోషల్ వర్కర్ మరీనా; ఇంకోవైపు ఏడమ్ తల్లిదండ్రులు, వాళ్ళ లాయర్ లెస్లీ, వారి వకీళ్ళు; మీడియా రిపోర్టర్స్ తో రూమ్ నిండిపోయింది. ఎక్కువ టైం లేనందున అన్ని పార్టీలనీ ముఖ్యమయిన వివరాలతో వాళ్ళ వాదనలు వినిపించమని అడిగింది ఫియోనా.

మొదట లాయర్ బెర్నర్ హాస్పిటల్ తరపున కేస్ వివరాలు చెప్పాడు. 'ఏడమ్ నెలరోజుల క్రితం అకస్మాత్తుగా కడుపునొప్పితో హాస్పిటల్లో జాయినయినపుడు, అతనికి కేన్సర్ ఉందని కనుక్కున్నారు. సాధారణంగా కేన్సర్ కు వాడే కొన్ని మందులతో ట్రీట్మెంట్ ఇస్తున్నారు. అయితే అతని శరీరం ఇమ్యూనిటీని కోల్పోడం వల్ల, మందులు పనిచెయ్యకపోడమే కాకుండా అతని పరిస్థితి దిగజారిపోయింది. అతని రక్తం స్వయంగా రోగనిరోధకకణాలను తయారుచేసుకునే పరిస్థితి దాటిపోయింది. దానికి పరిష్కారం రక్తమార్పిడి, అయితే అది వారి మతనమ్మకాలకు విరుద్ధమవడం వలన నిరాకరిస్తున్నారు. అది తప్ప మిగతా చికిత్సలన్నీ సరిగానే చెయ్యినిస్తున్నారు' అని చెప్పాడు. డాక్టర్లు ఇంకేం చికిత్సలు చేస్తున్నారో వివరాలు అడిగి నోట్ చేసుకుంది ఫియోనా. తరువాత హాస్పిటల్ తరపున హెమటాలజిస్ట్ డా. కార్టర్ మాట్లాడుతూ 'ఏడమ్ రక్తకణాల సంఖ్య రోజురోజుకీ ఎలా దిగజారిపోతుందో వివరించి, అప్పటికే ప్రమాదకరమయిన పరిస్థితికి చేరుకుందనీ, ఇంకో రోజు గడిస్తే ఏం చేసినా ప్రయోజనం ఉండదనీ' వివరించాడు. తనకే గనక అధికారం ఉండుంటే మొదటే రక్తమార్పిడి చేసి ఉంటే కోలుకోడానికి తొంభై శాతం అవకాశం ఉండేదనీ, ఈ పరిస్థితుల్లో చేసినా అవకాశాలు చాలా తక్కువయిపోయాయని బాధపడ్డాడు. ఈ చికిత్స చెయ్యకపోవడం వలన ఏం జరుగుతుందో ఏడమ్ కు తెలుసా అని అడిగిన ఫియోనాతో, 'తనకు చనిపోతాడని తెలుసు, అయితే అది ఎంత దుర్భరమయినదో అతని ఊహకు కూడా అందదు. అతనిని భయపెట్టలేక మేమెవ్వరమూ వివరంగా చెప్పే ధైర్యం చెయ్యలేదు' అని చెప్పాడు. కోర్ట్ కోసం దాన్ని వివరించమని అడిగింది ఫియోనా అడిగింది. 'అతనికి తొందరలోనే ఊపిరి తీసుకోడం కూడా కష్టమవుతుంది. స్పర్శ పోతుంది, మూత్రపిండాలు పనిచెయ్యటం ఆగిపోతుంది. బ్రెయిన్ డేమేజ్ జరగొచ్చు. ఇంటర్నల్ బ్లీడింగ్ రావొచ్చు. దృష్టి పోవచ్చు. ఇంకా చాలా కాంప్లికేషన్స్ రావొచ్చు. అతనికి చావు అనివార్యమే కావొచ్చు, కానీ ఈరకమైన చావు అతనికే కాదు, చూసే మాకు కూడా నరకం. రోజూ ఎందరో పేషెంట్స్ కి గేలన్ల కొద్దీ రక్తం ఎక్కిస్తాం. ఒక పేషంట్ ని చూస్తూ చూస్తూ చావనివ్వడం అనేది మా అందరికీ ఎంతో బాధగా ఉంది' అని వివరించాడు. అతని ఫ్రస్ట్రేషణ్ చూస్తే అసలు ఈ వాదనలూ తీర్పులూ పక్కకి తోసి, ఏడమ్ కాలర్ పట్టుకుని ఈడ్చుకెళ్ళి చికిత్స చెయ్యాలన్నట్టు కనిపిస్తున్నాడు. అతను ఆ వివరణ అంతా కూడా జడ్జ్ వైపు కాకుండా, ఏడమ్ పేరెంట్స్ ని చూస్తూ చెప్పాడు. అప్పటికయినా వాళ్ళలో కదలిక వస్తుందేమో అని ఆశ పడ్డాడు కానీ, వాళ్ళు మొహంలో ఏం ఫీలింగ్స్ చూపించకుండా కూర్చున్నారు.

పేరెంట్స్ తరపు లాయర్ లెస్లీ, డా. కార్టర్ ను క్రాస్ –ఎక్జామిన్ చెయ్యడానికి వచ్చాడు. 'మెడికల్ ట్రీట్మెంట్ నిరాకరించడం మనిషికి ప్రాథమిక హక్కు అనీ, దాన్ని కాదని చికిత్స చెయ్యడం ఆ హక్కుని ఉల్లంఘించడం అనీ, దౌర్జన్యం కూడా అనీ మీకు తెలుసనుకుంటాను. ఏడమ్ మేజర్ అవడానికి అతి దగ్గరలో ఉన్నాడు. అతను తన హక్కుని వివేకంతోనూ, స్పష్టతతోనూ తెలియచేసాడని మీకనిపించడంలేదా?' అని అడిగాడు. దానికి సమాధానంగా కార్టర్ 'అతను మేజర్ అవడానికి ఒక్క రోజు మాత్రమే టైమున్నా సరే, ఈరోజుకి ఇంకా మైనరే. తను వెలిబుచ్చిన అభిప్రాయాలు నమ్మకాలూ అతనివి కావు. అవి అతని తల్లిదండ్రులవీ, వాళ్ళ మతబోధలనుంచి గ్రహించినవీ. వాటికోసం అతను

ప్రాణం బలి చేస్తున్నాడు' అన్నాడు. తరువాత జాన్ రక్తమార్పిడి వల్ల కూడా వేరే జబ్బులు వచ్చే అవకాశం, డాక్టర్ల అనుభవం, ఆ ప్రాసెస్ లో వాళ్ళు తీసుకునే జాగ్రత్తలూ, చేసే పరీక్షల గురించీ చాలా ప్రశ్నలు వేసి, 'దాని వల్ల కూడా రిస్క్ ఉన్నప్పుడు, ఇపుడు రక్షిస్తామని మీరు రక్తమార్పిడి చేయటం అవివేకం అని' తేల్చేసాడు. డా. కార్టర్ వాటన్నిటికీ సంయమనంతో జవాబు చెప్పి, 'ఈ కేసులో మాత్రం అది అవివేకం కాదు' అని చెప్పాడు.

తరువాత ఏడమ్ తరపు లాయర్ జాన్, డా.కార్టర్ ని 'నువ్వు ఏడమ్ కు పరిస్థితి వివరంగా చెప్పి, బ్లడ్ మార్చాలని చెప్పావా? అతను నిరాకరించినపుడు అతని అభిప్రాయం స్పష్టంగా ఉందా, లేక అతని పరిస్థితి వల్ల అస్పష్టంగా, అనిశ్చితంగా ఉందా?,'అతని వయసు కరెక్ట్గా నీకు తెలుసా? అతనికి రక్తమార్పిడి చికిత్సలో ఎంత అనుభవం ఉంది?' లాంటి ప్రశ్నలు వేశాడు. డా. కార్టర్ అన్నిటికీ జవాబు చెప్పి, తనకి ఆ చికిత్స చెయ్యడంలో పాతికేళ్ళ అనుభవం ఉందనీ, ఇందులో రిస్క్ ఈకేసులో చికిత్స చెయ్యకపోతే కలిగే దానితో పోలిస్తే అతిస్వల్పం' అని చెప్పాడు.

తరువాత ఏడమ్ తండ్రి కెవిన్ వంతు. లాయర్ బెర్నర్ ప్రశ్నలడుగుతుంటే కెవిన్ జవాబులు చెప్పసాగాడు. ఏడమ్ పుట్టిన కొత్తలో వాళ్ళు పడ్డ కష్టాలు, పేదరికం, తాగుడికి బానిసవడం, ఉద్యోగం పోవడం...తర్వాత ఒక చర్చ్ నుండి వచ్చిన బోధకుల వల్ల యెహోవా విట్నెస్ తెగ వైపు ఆకర్షితులవ్వడం, నెమ్మదిగా కష్టాలు తీరి సంతోషంగా ఉండటం, సొంత వ్యాపారం పెట్టుకోడం... ఇలా వాళ్ళు ఆ మతాన్ని ఆశ్రయించిన తరువాత జీవితంలో ఎంత శాంతి కలిగిందో, ఎలా స్థిరపడ్డారో చెప్పాడు కెవిన్. కొడుకు గురించి చెప్పేటప్పుడు ఎంతో గర్వంగా మాట్లాడాడు. కొడుకుకి చిన్న వయసులోనే మతధర్మాలు అన్నీ తెలుసుననీ, వాటికి విరుద్ధంగా అతను ప్రవర్తించడనీ, 'ఒకవేళ ఏడమ్ తనకి ఈ చికిత్స కావాలనుకుంటే మాత్రం, మాకు ఇష్టం లేకపోయినా సరే అడ్డుచెప్పేవాళ్ళం కాదు' అన్నాడు. కొడుకు చనిపోతాడని తెలిసీ మీకు దుఃఖం లేదా అని అడిగితే, కాసేపు మౌనంగా ఉండి నెమ్మదిగా 'అతని విశ్వాసానికి ఫలితంగా, ఖచ్చితంగా స్వర్గంలో చోటుంటుందని అతనికి తెలుసు' అని చెప్పాడు. అపుడపుడూ మీ చర్చ్ నుండి కొందరు మతపెద్దలు ఏడమ్ దగ్గరికి వచ్చి, 'మతనిబంధనలకి విరుద్ధంగా ప్రవర్తిస్తే యెహోవా ఆగ్రహిస్తాడనీ, అతని కుటుంబం వెలివెయ్యబడుతుందనీ, అతని నిర్ణయం వల్ల అందరికీ మతం పట్ల విశ్వాసం పెరుగుతుందనీ' అతను మనసు మార్చుకోకుండా బోధలు చేసి వెళుతున్నది నిజమేనా, అని అడిగాడు బెర్నర్. వాళ్ళ వల్ల ఏడమ్ కు సాంత్వన కలుగుతుంది తప్ప, ఏ ఇబ్బందీ లేదని చెప్పాడు కెవిన్. బెర్నర్ అడిగిన కొన్ని ప్రశ్నలకు జవాబుగా ' ఈ దేహాన్ని మనకి ఇచ్చిందీ, తిరిగి తీసుకునేదీ యెహోవా. కాబట్టి ఆయన నిర్ణయాన్ని కాదనడానికి హక్కులేదు. ఆయనిచ్చిన జీవితంలాగే, శరీరంలో రక్తం కూడా పవిత్రమైనది, విలువైనది. దాన్ని కలుషితం చెయ్యకూడదు' అనిచెప్పాడు. బెర్నర్ మతమూ మూఢనమ్మకాల గురించి ఇంకొన్ని ప్రశ్నలు అడిగి తన క్రాస్ –ఎక్జామినేషన్ ముగించాడు. ఫియోనాకు కెవిన్ లో ఓ రకమైన అమాయకత్వం, బోళాతనం కనిపించాయి.

తరువాత ఏడమ్ తరపున సోషల్ వర్కర్ మరీనా మాటాడుతూ 'ఏడమ్ చాలా తెలివైన పిల్లాడు. అతనికి ఈ వయసులోనే బైబిల్ మొత్తం తెలుసు. బోధనలన్నీ తెలుసు. మతవిశ్వాసం కోసం సంతోషంగా ప్రాణాలు వదులుకోడానికి అతను సిద్ధంగా ఉన్నాడు.' అని చెప్పి, కోర్ట్ కోసం అతను పంపిన సందేశం 'నేను స్వంత్రతుడిని. నా తల్లిదండ్రుల నిర్ణయానికి అతీతంగా, నా స్వంతనిర్ణయాలు తీసుకోగలిగే శక్తి నాకుంది' అని చదివి వినిపించింది. 'కోర్ట్ ఏ నిర్ణయం తీసుకోవాలని నువ్వు ఆశిస్తున్నావు అని ఫియోనా అడిగినదానికి, ఆమె 'మతం కోసం ఓ చిన్నపిల్లాడు ప్రాణాలు పోగొట్టుకోకూడదని నేను ఆశిస్తున్నాను' అని ముగించింది. దానితో అందరి క్రాస్–ఎక్జామినేషన్స్ ముగిసాయి. అందరూ వాళ్ళ చివరి ప్రతిపాదనలు వినిపించడమే మిగిలింది.

*"A child, that is, a person under sixteen, may consent to his or her own medical treatment, if and when the child achieves sufficient understanding and intelligence to understand fully what is proposed."*

బెర్నర్ లేచి తన ప్రతిపాదనను ఇలా వివరించాడు. "మొదటగా ఇంతకు ముందు ఇటువంటి కేసులో ఇచ్చిన తీర్పులో ఫేమిలీ మెడికల్ లా లో చేర్చబడ్డ Gillick Competence అనేది ఇలా చెపుతుంది. 'పదహారేళ్లకు లోపున్న పిల్లలు, తగినంత అవగాహనా జ్ఞానం కలిగి ఉండి – తమ ఆరోగ్య పరిస్థితి, ప్రతిపాదించిన ట్రీట్మెంట్, దాని పర్యవసానాలను పూర్తిగా అర్ధం చేసుకోగలిగే వివేకంతో ఉన్నప్పుడు – తమ పేరెంట్స్ అనుమతి లేకపోయినా తమకు చికిత్స అనుమతించే హక్కు పొందుతారు.' ఈ చట్టం ప్రకారం ఏడమ్ తన నిర్ణయానికి అర్హుడని చెప్పొచ్చు. అయితే అది అతనికి తన పరిస్థితి పట్ల పూర్తి అవగాహన ఉన్నపుడే చెల్లుతుంది. డాక్టర్లు చెప్పిన ప్రకారం అతనికి తను చనిపోతాడనే తప్ప, ఆ చావు ఎటువంటి నరకాన్ని చూపిస్తుందీ అనేది కానీ, ఇపుడే చావకపోయినా కలిగే సైడ్ ఎఫెక్ట్స్ గురించీ గానీ పూర్తిగా అవగాహన లేదు. అతనికి ఉన్నది నమ్మిన మతం కోసం తాను వీరమరణం పొందుతాను అన్న ఒక రొమాంటిక్ ఊహ మాత్రమే. అతనికి పూర్తి నిజాలు చెపితే అతని నిర్ణయం మీద ఉంటాడనీ చెప్పలేము. కాబట్టి అతను ఆ చట్టం ప్రకారం అతని కోరికని మన్నించడానికి కుదరదు. రెండవది, ఒకవేళ అతనికి ఆ అర్హత ఉంది అనుకున్నా, ఆ చట్టం కేవలం చికిత్సకు అనుమతినించే హక్కుని మాత్రమే ఇచ్చింది గానీ, ప్రాణాంతకమైన పరిస్థితుల్లో చికిత్సను నిరాకరించడానికి కాదు. మూడవది , రక్తమార్పిడి వలన సైడ్ ఎఫెక్ట్స్ కలిగే ఛాన్స్ చాలా చాలా తక్కువ. దానితో పోలిస్తే చికిత్స చెయ్యకపోవడం వల్ల కలిగే నష్టమే అధికం. చివరగా, ఏడమ్ కు తన స్వంత మతమూ విశ్వాసాలు అంటూ ఏమీ లేవు. అవన్నీ అతను ప్రస్తుతానికి తన తల్లిదండ్రుల సహవాసంలో గ్రహించినవే. ఈ మూఢ విశ్వాసాలన్నీ అతనికి ఈ పెద్దలందరి ద్వారా నూరిపోయబడ్డవే తప్ప అతని స్వంతం కాదు. మనందరమూ కూడా ఒకప్పుడు టీనేజ్లో చాలా సిల్లీ విశ్వాసాలను కలిగి ఉన్నవాళ్ళమే. వాటిని ఇప్పుడు తలుచుకుంటే మనకే సిగ్గు కలుగుతుందన్న సంగతి అందరికీ తెలుసు. కాబట్టి వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని హాస్పిటల్ కు చికిత్స చెయ్యడానికి అనుమతివ్వాలని కోరుకుంటున్నాను."

*"Courts should be slow to intervene in the interests of the child against the religious principles of the parents."*

పేరెంట్స్ తరపున లాయర్ లెస్లీ "ఏడమ్ వయసుకి మించిన తెలివితేటలూ అవగాహనా ఉన్నాయని అతనితో మాట్లాడినవారెవరైనా ఒప్పుకుని తీరుతారు. కాబట్టి ఒక వ్యక్తి పూర్తి అవగాహనతో తీసుకున్న నిర్ణయంలో, మేజర్ అవడానికి కేవలం మూడునెలలు తక్కువ అనే కారణం వలన కోర్ట్ జోక్యం చేసుకోకూడదు. పలుమార్లు అతను స్పష్టతతో చెప్పిన అతని నిర్ణయం పెద్దవాళ్ళు చెప్పినదానికి తీసిపోదు. ఈ సందర్భంగాలో వచ్చిన 1969 ఫేమిలీ లా సంస్కరణ శాసనంను గుర్తు చేస్తున్నాను. ' పదహారేళ్ళు నిండిన మైనర్ కు, అతని అనుమతిపత్రం లేని పక్షంలో బలవంతంగా చికిత్స చెయ్యడం, అతని ప్రాథమిక హక్కుని ఉల్లఘించడమే అవుతుంది. అది పెద్దల ప్రాథమిక హక్కులను తిరస్కరించిన నేరంతో సమానం.' కొన్ని నెలలు ముందు పుట్టినట్టయితే అతని హక్కులు భద్రంగా ఉండేవి. అతను రాసే కవిత్వం పరిణితి చూస్తే అతను వయసుకి మించి మానసికంగా ఎదిగాడని తెలుస్తుంది. అతని పేరెంట్స్ పూర్తి సహకారంతో, తన సంపూర్ణమయిన వివేకంతో తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించాలని అతను కోరుతున్నాడు." అని చెప్పి తన నివేదిక ముగించాడు. ఇవన్నీ వింటున్న డాక్టర్ కార్టర్ ఒక పిల్లాడి ప్రాణాలతో ఆడుకుంటున్న వారి మూర్ఖత్వాన్ని భరించలేక అసహనంతో లేచి బయటకి వెళ్ళిపోయాడు.

ఏడమ్ గార్డియన్ లాయర్ జాన్ "హాస్పిటల్ తరపు లాయర్లూ, పేరెంట్స్ తరపు లాయర్లు వాళ్ళ వాదనను సంయమనంతో వినిపించారు. వాళ్ళ వాదనకు సపోర్ట్ గా చట్టం నుండి అవసరమయిన పాయింట్లనూ శక్తివంతంగా పరిగణనలోకి తీసుకున్నారు. ఏడమ్ తెలివితేటలూ, మానసికపరిణితినీ సందేహించాల్సిన అవసరం లేదు. అతనికి తన మతగ్రంధాల పట్ల ఉన్న జ్ఞానమూ తక్కువది కాదు. అయితే అతను మేజర్ కావడానికి అతిచేరువలో ఉన్నా, అతను ఇంకా మైనర్ అన్నది వాస్తవం. కాబట్టి అన్ని విషయాలనూ పరిశీలించి అతని కోరికను ఒప్పుకోవాలో వద్దో అన్నది పూర్తిగా న్యాయమూర్తి నిర్ణయం" అని వివరించాడు.

అందరి వాదనలూ విన్న ఫియోనాకి తన నిర్ణయం ఎటో కొంచెం అర్థమయినట్టుగా అనిపించింది. 'ఈ కేసులోని క్లిష్టత, ప్రత్యేకమైన అంశాల వల్ల కోర్ట్ నిర్ణయాన్ని చెప్పే ముందు, ఒకసారి ఏడమ్ ను కలవాలని అనుకుంటున్నాను. అతనికి మతపరమైన విశ్వాసాల మీద ఉన్న అవగాహనపై నాకు ఆసక్తి లేదు. అతని పరిస్థితి మీదా, చికిత్స తిరస్కరించడం వల్ల కలిగే పరిణామాల మీద అతనికున్న అవగాహన మాత్రమే నాకు ముఖ్యం. అవే నా నిర్ణయాన్ని నిర్దేశిస్తాయి. అతనికి విషయాల పట్ల పూర్తి అవగాహన ఉన్న పక్షంలో అతని కోరికని తిరస్కరించే నిరంకుశత్వం ఇక్కడ లేదని అతనికి నేనే స్వయంగా తెలియచేస్తాను. అతని జీవితం మీద నిర్ణయాన్ని తీసుకోబోయేది నేనని అతనికి తెలియాలి. ఇపుడు నేను మిస్ మరీనాతో కలిసి హాస్పిటల్ కు వెళ్ళి, ఆవిడ సమక్షంలోనే ఏడమ్ తో మాట్లాడి వస్తాను. తిరిగిరాగానే నా నిర్ణయాన్ని తెలియచేస్తాను. అంతవరకూ కోర్ట్ వాయిదా వేస్తున్నాను' అని చెప్పింది.

*If God, Poetry and Science all said the same thing, it had to be true. But not always, there can be group of delusions.*

మరీనాతో కలిసి ఏడమ్ ను చూసేందుకు హాస్పిటల్ కు వెళ్ళింది ఫియోనా. కేన్సర్ వార్డ్ లోకి వెళ్ళి అక్కడి నర్సులతో తనెందుకొచ్చిందో చెప్పింది. మరీనా ముందు తను రూమ్ కి వెళ్ళి అతనితో విషయం చెప్పి వస్తానని వెళ్ళింది. ఈలోగా నర్స్ లతో మాట్లాడుతుంటే 'అతను తెలివైన, చక్కని పిల్లాడు. నువ్వయినా అతని మనసు మార్చు' అని బాధతో చెప్పారు. ఈలోగా మరీనా వచ్చి ఫియోనాని ఏడమ్ రూమ్ లోకి తీసుకువెళ్ళింది. ఆమె లోపలి అడుగుపెడుతుండగానే ఏడమ్ 'నన్ను చూడటానికి నువ్వొస్తావని నాకు ఎందుకో అనిపిస్తూనే ఉంది. నాకు జరగబోయే వాటి గురించి ముందే తెలుసుకునే శక్తి ఉన్నట్టుంది' అంటూ ఉద్వేగంగా మాట్లాడేస్తూ ఏదేదో చెప్పసాగాడు. ఆమె తనని పరిచయం చేసుకుని బెడ్ ప్రక్కన కుర్చీలో కూర్చుని అతని పరీక్షగా చూసింది. చిక్కి శల్యమయిన శరీరం, కళ్ళ క్రింద ఊదారంగులో కమిలిపోయిన పచ్చని ఒంటి రంగు; అయినా ఆకర్షణీయమయిన పల్చటి మొహం, చురుకైన కళ్ళూ, మొహంలో ఉట్టిపడే తెలివితేటలు... చూడగానే ఆమెను ఆకర్షించి ఒక రకమయిన అభిమానం కలిగింది. మంచం నిండా పుస్తకాలూ, కాగితాలూ, వయొలిన్ పేర్చి ఉన్నాయి. ఇద్దరూ కాసేపు రెలిజియన్ గురించీ, నమ్మకాల గురించీ పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. అతను చెప్పినవి ఖండించకుండా, ఒప్పుకుంటూనే మృదువుగా తన అభిప్రాయమూ చెప్పసాగింది. అతనిలో తెలివితేటలూ, విజ్ఞానం, చురుకుదనం, కాస్త చిలిపిదనం ఉన్నాయనీ, జబ్బు అతనిలోని చైతన్యాన్ని ఏమాత్రం తగ్గించలేదనీ గుర్తించింది.

ఏడమ్ ఉన్నట్టుండి 'ఇంతకీ నువ్వు నా మనసు మార్చి, నన్ను సరైన దారిలో పెట్టాలని వచ్చావా?' అని అడిగాడు. దానికి ఆమె 'నువ్వు చాలా తెలివైనవాడివనీ , వయసుకు మించి ఆలోచనాశక్తి ఉన్నవాడివనీ కొందరన్నారు. నువ్వు చిన్న పిల్లాడివి, నీ పేరెంట్స్ నమ్మకాలతో ప్రభావితం అయి మాట్లాడుతున్నావని కొందరన్నారు. నీకు ఈ మొత్తం పరిస్థితిపై పూర్తి అవగాహన ఉందా లేదా అన్నది తెలుసుకోడానికే నేను వచ్చాను' అని చెప్పింది. అయితే నాగురించి నీకేమనిపిస్తుంది అని అడిగాడు. ముందు రక్తమార్పిడి ఎందుకు తప్పు అనేది నీ అభిప్రాయం చెప్పు అని అడిగితే, చాలా పరవశంతో బైబిల్ గురించీ అందులో నిషేధించిన వాటిగురించీ చెప్పాడు. అతనలా మాట్లాడుతుంటే ఆమెకు కోర్టులో, అతని తండ్రి చెప్పిన విషయాలే గుర్తొచ్చాయి. 'నీకు రక్తం మార్చకపోతే ఏం జరుగుతుందో తెలుసా? వెంటనే చనిపోకపోవచ్చు, కానీ పాక్షికంగా రికవర్ అయి రకరకాల డిజబిలిటీస్ తో మిగిలిపోవచ్చు. నువ్వు ఆ కోణం నుండి కూడా తెలుసుకుని ఆలోచించి నీ నిర్ణయం తీసుకోవాలి. బ్రతికున్నన్నాళ్ళూ జీవం లేకుండా మంచం మీద పడి ఉండటం నీకిష్టమేనా? దాన్ని యెహోవా హర్షిస్తాడా?' అని అడిగింది ఫియోనా. ఏడమ్ ఒక్క క్షణం వణికి పోయాడు. అతను ఆ కోణం నుండి ఎపుడూ ఆలోచించలేదు. అయితే బింకంగా 'ఆ పరిస్థితి నేను భరించలేను. కానీ అదే రాసిపెట్టి ఉంటే మాత్రం దాన్నిఅంగీకరించక తప్పదు' అని ఉబికి వస్తున్న కన్నీటిని ఆమె చూడకుండా

తలతిప్పుకున్నాడు. ఆమె అది చూడనే చూసింది. మనసు ఆర్ద్రం అయింది. అతను బయటకి బింకంగా ఉన్నా భయపడుతున్నాడని ఆమెకు అర్ధమయింది.

*To take up the volin or any instrument was an act of hope, it implied a future.*

ఆమె మాట మార్చి, నువ్వు కవిత్వం రాస్తావట కదా, నాకు ఒకటి వినిపించు అని అడిగింది. అతను ఉత్సాహంగా చదివి వినిపించాడు. నేను ఓ నెల నుంచీ సొంతంగా వయోలిన్ నేర్చుకుంటున్నాను, వింటావా అని అడిగి, ఒక ఐరిష్ పాట ప్లే చేసి వినిపించి ఎలా ఉంది అనడిగాడు. ఆమె కూడా మంచి గాయని, పియానిస్ట్. ఆమెకు ఆ పాట తెలుసు. అందులోని చిన్నచిన్న తప్పులు చెప్పి, నువ్వు మళ్ళీ ప్లే చెయ్యి, నేను పాడతాను అని చెప్పి, అతనితో కలిసి ఆ పాట పాడింది. అతను ఎంతో సంతోషించాడు. అతని కవిత లోనూ, ఎంచుకున్న పాట లోనూ లీలగా ఉన్న విషాదం ఆమెను కలవరపెట్టింది. అతని మనసు ఆమెకు అర్ధమయ్యింది. ఇక తను వెళ్ళాలి అని చెప్పి, ఆమెను మళ్ళీ వస్తావా అని అడిగిన అతని ప్రశ్నకు బదులివ్వకుండా, వెనక్కు తిరిగి చూడకుండా వచ్చేసింది.

*"As child approach the age of majority they are increasingly able to take their own decisions concerning their medical treatment. It will normally be in the best interest of a child of sufficient age and understanding to make an informed decision that the court should respect."*

ఫియోనా తిరిగి కోర్టుకు వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది, అయినా అందరూ ఆమె తీర్పు కోసం వేచి చూస్తున్నారు. వెంటనే ఆమె అందరినీ సమావేశపరిచి తన నిర్ణయాన్ని వివరంగా ప్రకటించింది. 'ఈ కేసులో ఉన్న సున్నితమైన అంశాలవల్ల, ఒక నిర్ణయానికి రావటానికి అనేక విషయాలను పరిశీలించాల్సి వచ్చింది. నేను ఏడమ్ ను కలిసి ఒక గంట తనతో గడిపి వచ్చాను. అతని తెలివితేటల మీద గానీ, ఆలోచనా పరిణితి మీద గానీ, మతం పట్ల అతనికున్న అవగాహన మీద గానీ, మానసిక ఆరోగ్యంమీద గానీ నాకెటువంటి సంశయమూ కలగలేదు. మతవిశ్వాసాల కోసం అతను ప్రాణాలు వదులుకోవడానికీ, అతని పేరెంట్స్ కొడుకుని పోగొట్టుకోవడానికీ సిద్ధపడ్డారంటే వాటి బలమెంతో నాకు అర్ధమయ్యింది. అయితే అతనికి రక్తమార్పిడి జరగకపోతే తరువాత ఎదురయ్యే దుష్ప్రభావాల గురించి కానీ, ఆరోగ్యం క్షీణిస్తుంటే అతన్ని ముంచెత్తే బాధ గురించి కానీ అతనికి ఏమాత్రమూ అవగాహన లేదు అన్నది నాకు అర్ధమయ్యింది. అతనికున్నది కేవలం మతం కోసం చనిపోవడమనే రొమాంటిక్ భావనే తప్ప ఇంకేమీ కాదు. అలానే అతని మతవిశ్వాసాలు కూడా అతని పేరెంట్స్ ద్వారా, మతపెద్దల ద్వారా అతని మీద రుద్దబడినవి తప్ప అతని స్వంతం కాదు. ఏ నిర్ణయంలో అయినా, పిల్లల శ్రేయస్సు మొదటి ప్రయారిటీ కావాలి అన్న Children Act 1989 ప్రకారం, నేను ఏడమ్ శ్రేయస్సు కోసం ఒక నిర్ణయానికి వచ్చాను. మతమూ, ప్రాధమిక హక్కులూ కన్నా అతని శ్రేయస్సు ఇక్కడ నాకు ముఖ్యమైనవి. ఇక్కడ శ్రేయస్సు అనేది కుదుటపడబోయే ఆరోగ్యం, కవిత్వం మీద అతని ప్రేమా, కొత్త హాబీ వయొలిన్ నేర్చుకోవడం, అసాధారణమయిన తెలివితేటలను ఉపయోగించుకోవడం, ఆత్మీయభరితమయిన అతని ప్రవర్తన ద్వారా ఆనందాన్ని విస్తరించడం, ముందు ముందు అతని కోసం వేచి ఉన్న ప్రేమనురాగాలతో నిండిన జీవితం ... వీటన్నీటి మిశ్రమంగా నేను పరిగణిస్తున్నాను. అతని తల్లిదండ్రులూ, మతపెద్దలూ కలిసి అతని శ్రేయస్సుకి నష్టం కలిగే నిర్ణయాన్ని తీసుకుని దాన్ని అతనిపై రుద్దుతున్నారని నాకు నమ్మకం కలిగింది. కాబట్టి ఆ నిర్ణయం నుండీ, ఆ మతం బారి నుండీ అతన్ని రక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని నేను నమ్ముతున్నాను. అతని కోరికా, వయసూ, మతవిశ్వాసాలకు పూర్తి గౌరవం ఇస్తూనే కోర్ట్ ఈ నిర్ణయానికి వచ్చింది. అతనిదీ, అతని తల్లిదండ్రుల పిటిషన్స్ నిరాకరిస్తూ, వెంటనే అతనికి కావాల్సిన చికిత్స చెయ్యడానికి హాస్పిటల్ కి అనుమతి ఇస్తున్నాను. ఈ కేసులో నిర్ణయం తీసుకోడానికి అన్నిరకాలుగా సహాయపడిన వారందరికీ నా కృతజ్ఞతలు."

ఆ కేస్ తీర్పు చెప్పి ఫియోనా కోర్ట్ నుండి బయటపడేసరికి రాత్రి పదకొండు అయింది. అప్పటివరకూ ఆమె తన వ్యక్తిగత సమస్యలు తాత్కాలికంగా మర్చిపోయింది. జాక్ నుంచి మెయిల్ ఉందేమో అని అస్తమానూ చెక్ చేసుకోడాన్నికంట్రోల్ చేసుకోడానికి ఉదయం నుంచీ ఫోన్ కూడా ఆఫ్ లో పెట్టేసింది. ఇపుడు ఆరోజుకి అన్ని బాధ్యతలూ తీర్చుకున్నాక మళ్ళీ ఆ బాధ పైకొచ్చింది. ఒక నిమిషం భర్త చేసిన అవమానం గుర్తొస్తే బాధ కోపం. మరోప్రక్క అతని ప్రేమ గుర్తొచ్చి మనసు పడే తపన... రెంటి మధ్యా ఆమె సతమతమవుతోంది. ఆలోచిస్తూ ఇంటికి చేరుకునే సరికి తన అపార్ట్మెంట్ బయట జాక్ గోడకు అనుకుని నిలబడి ఏవో పేపర్లు చూసుకుంటున్నాడు. ప్రక్కనే అతని సూట్కేస్ ఉంది. అతను చాలాసేపటి నుండీ అలా ఉన్నట్టు తెలుస్తోంది. ఆమె మాట్లాడకుండా తలుపు తీసుకొని లోపలి వెళితే, జేక్ కూడా వెనకాలే లోపలికి వచ్చాడు. ఆమెకు ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో తెలీక, హాల్లో సోఫాలో కూర్చుని యేవో పేపర్లు చూసుకుంటున్నట్టు ఉండిపోయింది. కొంతసేపటికి జాక్ వచ్చి దగ్గరలో కూర్చుని, కొంచెం పశ్చాత్తాపం, కొంచెం సమర్ధింపు కలగలిపి వివరణ ఇవ్వసాగాడు. 'నేను చేసినది తప్పనీ, మెలనీ అంటే నాకు ఆకర్షణ తప్ప ప్రేమ లేదనీ రియలైజ్ అయ్యాను ...' అంటూ ఇంకా చెప్పబోయాడు. ఆమె తనకేమీ చెప్పొద్దని సైగ చేసి, అతని వస్తువులు గెస్ట్ రూం లోకి మార్చుకుని అక్కడే ఉండమని చెప్పింది. అతను మౌనంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు. అతన్ని ఇంటి నుండి బయటకి పొమ్మని ఎందుకు చెప్పలేకపోయానా అని ఆలోచిస్తూ ఉండిపోయింది. ఆ తరువాత ఇద్దరి మధ్యా పెద్దగా మాటలు లేకుండానే రోజులు గడుస్తున్నాయి. ఇంట్లో ఉన్నంతసేపూ ఎవరి గదుల్లో వాళ్ళు ఉంటూ, వీలయినంతవరకూ ఒకరినొకరు తప్పించుకుని తిరుగుతున్నారు.

కొన్ని వారాలు గడిచాయి. ఒకరోజు ఉదయం ఆఫీసుకి వచ్చి, క్లర్క్ తెచ్చిన ఉత్తరాలు చూస్తూ ఉంటే, ఆమె పేరుతో వచ్చిన ఒక నీలపు రంగు కవర్ కనిపించింది. అది ఏడమ్ వ్రాసిన ఉత్తరం. అందులో అతను ఇలా వ్రాసాడు. "ఎన్నోరోజుల నుంచీ నేను నీకు ఉత్తరం వ్రాయాలని అనుకున్నాను. దీనికి ముందు ఆరు ఉత్తరాలు వ్రాసి పోస్ట్ చెయ్యకుండా ఉంచేశాను. ఇది ముఖ్యంగా నీకు ఒక విషయం చెప్పాలని వ్రాస్తున్నాను. నీ తీర్పు గురించి నాకు నర్స్ చెప్పినపుడు నిన్ను నోటికొచ్చినవన్నీ తిట్టాను. గుర్తుందా! ఆరోజు నువ్వు వెళుతూ చివరగా, నాకు నా ఆలోచనల పట్ల స్పష్టత ఉందని నువ్వంటే, నీకు థాంక్స్ కూడా చెప్పాను. డా. కార్టర్ బృందం నాకు రక్తమార్పిడి చెయ్యడానికి వచ్చినపుడు కూడా కోపంతో అరుస్తూనే ఉన్నాను, అయితే నువ్వు నేనేం చెయ్యాలని అనుకున్నావో కూడా నాకు అర్ధమయ్యింది. వాళ్ళను వ్యతిరేకించకుండా ఉండిపోయాను, అయితే వేరేవారి రక్తం నా శరీరంలోకి వెళుతుందన్న భావనే నాకు చాలా అసహ్యం కలిగించింది. నాకు నెమ్మదిగా స్పృహ తప్పింది. నేను తిరిగి స్పృహ లోకి వచ్చేసరికి నా ప్రక్కన నా పేరెంట్స్ ఏడుస్తూ కనిపించారు. అది చూసి నా వలన వాళ్ళు దేవుడి ఆజ్ఞ మీరాల్సి వచ్చిందని నాకు ఇంకా విచారం కలిగింది. అయితే వాళ్ళు ఏడుస్తున్నది సంతోషంతో అని నాకు నెమ్మదిగా అర్ధమయ్యింది. నన్ను కౌగలించుకుని ఇద్దరూ ఎంతో ఆనందంతో ఏడ్చారు. దేవుడి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఎందుకంటే, వాళ్ళు మతం నిర్దేశించిన ప్రతీదీ పాటించారు. మతపెద్దల బోధలు గౌరవించారు. మతం కోసం కొడుకు మరణశాసనాన్ని కూడా రాసుకున్నారు. కాబట్టి ఎవరూ వాళ్ళని మతం నుంచి వెలివెయ్యరు. వాళ్ళని పాపులు అనరు. మా అందరికోసం స్వర్గద్వారాలు తెరిచే ఉంటాయి. పైగా కొడుకు కూడా దక్కాడు. నా రక్తం మలినం అయింది, అయితే దానికి కారణం మేమెవరమూ కాదు. నిందితులెవరైనా ఉంటే అది నువ్వూ, కోర్టూ, ఈ ప్రపంచమూనూ. చూసావా! నీవలన వాళ్ళకి ఎంత ఉపశమనం కలిగిందో! అయితే దీన్నుంచి నేనేం నేర్చుకోవాలో నాకు అర్ధం కాలేదు. ఈ మతమూ అన్నీ దగా ఏమో అన్న అనుమానం వస్తుంది నాకు. ఆసుపత్రి నుంచి ఇంటికి రాగానే నేను చేసిన మొదటి పని, నా రూంలోని బైబిల్ తీసి మూల పడేసాను. మళ్ళీ మా చర్చ్ దరిదాపులకు రానని పేరెంట్స్ తో చెప్పాను. ఆవిషయంలో వాళ్ళతో నాకు చాలా వాదనలు జరిగాయి. కావాలంటే మీరందరూ నన్ను వేలివేసుకోండి అని చెప్పేసాను. చర్చ్ నుంచి ప్రీస్ట్ కూడా వచ్చి నాకు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు, కానీ లాభం లేదని నాకు తెలుసు. నువ్వు నాకు ఈ మతాలకు అతీతమయినదీ, ఆనందకరమయినదీ, గాఢమయినదీ ఏదో ప్రపంచాన్ని గురించి తెలియచెప్పావని

నాకు అనిపిస్తోంది. అదేమిటో నాకూ తెలీదు, కానీ నీ స్పష్టమయిన ఆలోచనాశక్తితో, నీ మంద్రమయిన గొంతునుండి దీనిగురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది. నిన్ను అస్తమానూ తలుచుకుంటున్నాను. నువ్వే లేకపోతే ఈపాటికి నేను ప్రాణాలతో ఉండేవాడిని కాదు. నువ్వు నన్ను కలిసి మాట్లాడటమూ, నాతో కలిసి పాట పాడటమూ నాకెంతో సంతోషాన్ని కలిగించాయి. నాకో వింత కోరిక కలుగుతోంది. నీతో కలిసి ఓడలో ప్రపంచంలోని అన్ని ప్రదేశాలకూ వెళ్ళాలనీ, రోజంతా నీతో ఎన్నో విషయాలు మాట్లాడుకుంటూ ఓడంతా తిరగాలనీ కోరికగా ఉంది. ఈ ఉత్తరం నువ్వు చదివావనీ, ఇలా రాస్తున్నందుకు నామీద కోపం లేదనీ నాకు తెలిసేందుకు నాకు జవాబు వ్రాస్తావు కదూ. ఇట్లు –నీ ఏడమ్.

అప్పటికే ఆమె అతనికి చికిత్స జరిగిన కొన్ని రోజులకి సోషల్ వర్కర్ మరీనా ద్వారా, అతను ఇంటికి వెళ్ళిపోయి కోలుకుంటున్నాడనీ, స్కూల్లో వెనుకబడినవన్నీ ఇంట్లోనుండి పూర్తి చేస్తున్నాడనీ, తొందరలోనే తిరిగి స్కూలుకి వెళతాడనీ తెలుసుకుంది. ఆ ఉత్తరానికి జవాబుగా ఆమె కూడా ఓ ఉత్తరం వ్రాసింది. "నువ్వు చక్కగా కోలుకుంటున్నావని తెలిసినందుకూ, నా రాక నీకు మంచి జ్ఞాపకాలను మిగిల్చినందుకూ నాకు చాలా సంతోషంగా ఉంది. నీ పేరెంట్స్ తో ప్రేమగా ప్రవర్తించు. మనం పెరిగిన వాతావరణాన్ని, విశ్వాసాలనీ ప్రశ్నించడం టీనేజ్ వయసులో సర్వసాధారణం, కానీ అది మర్యాదపూర్వకమయిన పద్ధతిలో ఉండాలి' అని వ్రాసింది. అయితే మళ్ళీ అతని ఉత్తరం మరోసారి చదివాక, అందులోని అమాయకత్వమూ, ఆత్మీయతతో పోలిస్తే, తన జవాబు చాలా చప్పగానూ, తన సలహాలు పనికిరానివిగానూ అనిపించి, దానితో అతన్ని నిరాశపరిచేకన్నా మౌనంగా ఉండటం మంచిదని ఉత్తరం పోస్ట్ చెయ్యకుండా ఆగిపోయింది.

ఇంకొన్ని రోజులు గడిచాయి. సెప్టెంబర్ మొదటివారంలో ఆమెకు ఏడమ్ నుండి ఇంకో ఉత్తరం వచ్చింది. అయితే ఈసారి అది ఆమె ఇంటి ముందు పేపర్లతోపాటు పడి ఉంది, అంటే అతను ఎపుడో ఆమెను అనుసరించి వచ్చి ఇల్లు ఎక్కడో చూసి వెళ్ళాడన్నమాట. ఆ సంగతి ఆమెను కలవరపరిచింది. ఆ ఉత్తరంలో "నేను నీకు ఇంతకు ముందు ఉత్తరంలో ఏం రాసానో కూడా నాకు గుర్తులేదు. ఇంట్లో చాలా పెద్దగొడవలు అవుతున్నాయి. స్కూలుకు తిరిగివెళ్ళడం చాలా బావుంది. అయితే నాకు అపుడే సంతోషం, అంతలోనే విచారం, మళ్ళీ వెంటనే సంతోషం. ఒక్కోసారి ఎవరి రక్తమో నా ఒంట్లో ఉంది అన్న ఆలోచన ఎంత వద్దన్నా వదలడంలేదు. అంతా అయోమయంగా ఉంది. నిన్ను ఎన్నో అడగాలని ఉంది, కానీ నీకసలు నేను గుర్తున్నానో లేదో కూడా తెలీదు. నాలాంటివాళ్ళు ఎంతో మంది నీకని తలుచుకుంటే చాలా జెలసీగా ఉంటుంది. నీతో ఎలా అయినా మాట్లాడాలి. చాలాసార్లు రోడ్డు మీద వచ్చి నిన్ను పలకరించాలని అనిపించింది కానీ, నువ్వు గుర్తుపడతావో లేదో అని భయంతో ఆగిపోయాను. నాకు నిన్ను వేధించాలనే ఉద్దేశ్యం ఎంతమాత్రమూ లేదు. నాకు అయోమయంగా, ఆలోచనలతో నా బుర్ర పేలిపోతున్నట్టు అనిపిస్తోంది అంతే." ఫియోనా వెంటనే మరీనాకు ఫోన్ చేసి, ఏడమ్ క్షేమసమాచారాలు కనుక్కుని, కేసు ఫాలో అప్ రిపోర్ట్ పంపమని చెప్పింది. మరీనా 'స్కూల్ దగ్గర ఏడమ్ ను కలిసాననీ, అతను పూర్తి ఆరోగ్యంతో, ఉత్సాహంగా ఉన్నాడనీ, అతని టీచర్స్ కూడా అతను చదువులో మంచి ప్రోగ్రెస్ చూపిస్తున్నాడనీ, అతని ప్రవర్తనతో కూడా ఏ సమస్యలూ లేవని చెప్పారనీ' నివేదిక పంపించింది. ఫియోనా అది చూసి అన్నీ సవ్యంగానే సాగుతున్నందుకు సంతోషించి, ఇక అతనికి జవాబు రాయాల్సిన అవసరం లేదని అనుకుంది.

ఆమె ప్రతీసంవత్సరం సెప్టెంబర్ లో ఇంగ్లాండ్ లోని కొన్నివూర్లలోని కోర్టులకు వెళ్ళి, కొన్ని రోజులపాటు అక్కడుండి స్పెషల్ కేసులు చూసి వస్తుంది. ఈసారి కూడా అలాగే ప్రయాణమయింది. ఆసరికి భార్యాభర్తలిద్దరి మధ్యా మాటలు లేకపోయినా, విముఖత కాస్త తగ్గింది. ఆ వూరికి ట్రెయిన్లో వెళ్ళేసరికి, అక్కడి కోర్ట్ నుంచి కారు వచ్చి కోర్టుకు తీసికెళ్ళింది. అప్పటికే ఆమె క్లర్క్ పాలింగ్ ఆమె ఫైళ్ళతో సహా అక్కడికి చేరుకున్నాడు. కోర్టులో కాసేపు అక్కడి లాయర్లతో మాట్లాడటం అయిన తరువాత, మైలు దూరంలో ఉన్న గెస్ట్ హౌస్ కు వెళ్ళింది. అప్పటికి తుఫాన్ మొదలయ్యి, జోరున వర్షం కురుస్తోంది. ఆనవాయితీ ప్రకారం ఆమె, ఆమె లాగే వచ్చిన ఇంకొక జడ్జ్ కలిసి, ఓ నలుగురు

గవర్నమెంట్ ఉన్నత అధికారులని ఆ రోజు గెస్ట్ హౌస్ లో డిన్నర్ కు ఆహ్వానించారు. భోజనం తరువాత హాల్లో కూర్చుని అతిధులతో మాట్లాడుతుండగా, పాలింగ్ వచ్చి ఆమెకోసం ఎవరో వచ్చారని పిలిచాడు. బయటకు వచ్చిన ఆమెను ప్రక్కనున్న లైబ్రరీ రూం లోకి తీసుకువెళ్ళి 'ఆ యెహోవా విట్నెస్ కేసు అబ్బాయి, మిమ్మల్ని ఫాలో అయి ఇక్కడిదాకా వచ్చాడు. పనివాళ్ళు చూసి బయటకు పంపబోతుంటే, నేను గుర్తుపట్టి మీతో చెప్పాలని ఆపాను. అతన్ని అవతలి గదిలో ఉంచాను' అని చెప్పాడు. ఆమెకు విన్నదానితో మతిపోయింది. అతని ఉత్తరానికి జవాబిచ్చి ఉంటే ఇపుడీ పరిస్థితి రాకపోయి ఉండేదని అనుకుంది. అతన్ని ఆగదిలోకి తీసుకురమ్మని చెప్పింది.

పాలింగ్ ఏడమ్ ను లైబ్రరీ రూం లోకి తీసుకువచ్చాడు. ఆ పిల్లాడు వర్షానికి పూర్తిగా తడిసి వణుకుతూ ఉన్నాడు. అది చూడగానే ఆమెకు కోపంతో పాటూ, ఓ తల్లిలా ప్రేమ కూడా కలిగింది. అతన్ని మందలించి, తుడుచుకోడానికి టవల్స్ ఇప్పించి హీటర్ పెట్టించింది. పాలింగ్ తను బయటే వెయిట్ చేస్తాననీ, అవసరమైతే పిలవమని తలుపు దగ్గరికి వేసి వెళ్ళిపోయాడు. అతన్ని 'అసలు నువ్విక్కడికెలా వచ్చావు? ఎందుకు వచ్చావు?' అని అడిగింది ఫియోనా. తనని ఫాలో అవుతూ ట్రైన్లో వచ్చి, అక్కడి నుండి కోర్ట్ కు వెళ్ళి, అక్కడ గెస్ట్ హౌస్ అడ్రస్ తెలుసుకుని వచ్చానని చెప్పాడు. ఇంతకీ ఎందుకిలా నా వెంటపడుతున్నావు? నీకేం కావాలి అని అడిగితే, 'నిన్ను ఇబ్బంది పెట్టాలని నా ఉద్దేశ్యం కాదు. మా నాన్న నీ తీర్పు కాపీ నాకు చూపించకుండా దాచాలనుకున్నాడు, కానీ దాన్ని నేను చదివాను. అందులో నువ్వు ఈ మతం బారినుంచి నన్ను రక్షించాలి అన్నావు. అలానే రక్షించావు. నిన్న మా నాన్నతో చాలా పెద్ద గొడవ జరిగింది. ఇద్దరమూ పెద్దగా అరుచుకున్నాము. నేను మతం మీద నాకున్న అయిష్టత అంతా చెప్పి, ఇంట్లోంచి బయటకి వచ్చేసాను' అని చెప్పాడు. 'నువ్వెక్కడున్నావో మీ పేరెంట్స్ కు తెలుసా' అని అడిగితే 'తెలీదు. నేనిప్పుడు మేజర్ ని. నేనెవరికీ ఏమీ చెప్పనక్కర్లేదు' అన్నాడు. దానికి ఫియోనా తనకవన్నీ అనవసరమనీ, వెంటనే తల్లికి టెక్స్ట్ చేసి తను క్షేమంగా ఉన్నాడని చెప్పిన తర్వాతనే మనం మాట్లాడదాం అని చెప్పి, అతని తల్లికి టెక్స్ట్ చేయించింది. ఆ తరువాత, ఇక్కడికి ఎందుకు వచ్చావో చెప్పు అని మళ్ళీ అడిగింది.

*It was like a grown-up had come into a room full of kids who are making each other miserable and said, Come on, stop all non-sense, it's teatime. You were the grown-up. You knew all along but you didn't say. You just asked questions and listened. All of life and love that lie ahead of him -- that's what you wrote.*

ఏడమ్ చెప్పడం మొదలుపెట్టాడు. 'నువ్వు నన్ను చూడటానికి రావటం నాకు జీవితంలో జరిగిన పెద్ద మేలు. నా పేరెంట్స్ మతం ఒక విషమైతే, నువ్వు దానికి విరుగుడు. నేను అంతకాలమూ మతం కోసం చనిపోవడం హీరోయిజం అనుకున్నాను. నేను చనిపోయిన తరువాత అందరూ నాగురించి చెప్పుకోవడం తలుచుకుని గర్వంగా ఫీల్ అయ్యేవాడిని. మానసికంగా నేనెంత ఎదిగానో మిగిలినవాళ్ళకు అర్థం కాలేదని నవ్వుకునే వాడిని. నేనెంత మూర్ఖుడినో నాకు తరువాతే అర్ధమయింది. నేను అపాయం నుంచి బయట పడ్డాక నా పేరెంట్స్ సంతోషంతో ఏడవటం చూసినపుడు నాకు అనిపించింది, వాళ్ళకు నేనంటే ఎంతో ప్రేముంది. నేను చనిపోవాలని వాళ్ళు ఏ మాత్రమూ అనుకోలేదు. అయితే ఉందో లేదో తెలీని స్వర్గం కోసం ఆరాటపడ్డారే కానీ, నా ప్రాణం ముఖ్యం అన్న సంగతి వారు చెప్పలేకపోయారు. అది గ్రహించిన క్షణంలో నా మాయాప్రపంచం కూలిపోయింది. నువ్వొచ్చి మామూలు మనిషిగా, మానవత్వంతో ఆలోచించావు. మతాన్నీ మనుషులనీ నిందించలేదు. ప్రశ్నలడిగావు. నేను చెప్పింది విని అర్థంచేసుకోడానికి ప్రయత్నించావు. నువ్వు రాసావే నీ రిపోర్ట్లో, 'ముందు ముందు అతని కోసం వేచి ఉన్న ప్రేమానురాగాలతో నిండిన జీవితం కోసం' అని, అదీ నీ ఆలోచనా పద్ధతి! అపుడూ అందరమూ ఎంత మూర్ఖత్వంతో ఉన్నామూ అన్నది నాకర్ధమయ్యింది.' అని చెప్పాడు.

ఫియోనా నిట్టూర్చి, 'అయితే నీకు నీ పేరెంట్స్ ఏడవటం చూసి వాళ్ళకు నీ మీద ప్రేమకన్నా, దేవుడి మీద విశ్వాసమే ఎక్కువన్న ఆలోచన నిన్ను కలవరపెట్టిందన్నమాట. దాన్నుంచి పారిపోవాలని చూస్తున్నావు. తప్పులేదు, నీ వయసులో ఉన్నవాళ్ళకి ఎవరికైనా అలానే అనిపిస్తుంది. అయితే నీకేం కావాలో ఇంకా నాకర్థం కావటం లేదు. ముఖ్యంగా ఇపుడు నువ్వేం చేద్దామనుకుంటున్నావు?' అంది. దానికి అతను 'బర్మింగ్ హేమ్ లో మా ఆంట్ ఉంది, అక్కడ కొంతకాలం ఉండొచ్చు. అయితే నేనొకటి అడుగుతాను. సిల్లీ ఆలోచన అని తోసిపారేయ్యకుండా ఆలోచించు. నాకు వచ్చి నీతో పాటూ ఉండాలని ఉంది. నీకూ నీ భర్తకూ ఎలాంటి ఇబ్బందీ కలిగించను. ఇంట్లో అన్ని పనులూ చేసిపెడతాను. త్వరలో ఉద్యోగం చూసుకుని అద్దె కూడా ఇస్తాను. నువ్వు నాకొక గురువులా, ఎన్నో విషయాలు నీనుంచి నేర్చుకోవాలని ఉంది' అన్నాడు. అది ఊహించని ఫియోనా నిర్ఘాంతపోయింది. నెమ్మదిగా తేరుకుని 'అది జరిగే పనికాదు అని నీకూ బాగా తెలుసు' అని చెప్పింది. ఈలోగా పాలింగ్ వచ్చి ఆమెతో అన్నీ సిద్ధం అని చెప్పాడు. ఆమె అంతకు ముందే మధ్యలో ఒకసారి బయటకు వెళ్ళి అతనితో మాట్లాడివచ్చింది. ఏడమ్ తో 'ఇపుడు మిస్టర్ పాలింగ్ నీతో వచ్చి ముందు స్టేషన్ కు తీసుకెళ్ళి, రేపు ఉదయం ట్రెయిన్ కి బర్మింగ్ హాంకు టికెట్ కొనిచ్చి, తరువాత దగ్గరలో ఉన్న హోటల్ కు తీసుకువెళతాడు. రేపు బయలుదేరే ముందు మీ అమ్మకు నువ్వెక్కడికి వెళుతున్నావో, ఏం చేస్తున్నావో టెక్స్ట్ చేసి చెప్పడం మాత్రం మర్చిపోకు' అని చెప్పింది. అతను చిన్నపిల్లాడిలా మొహం చిన్న బుచ్చుకుని, ' అయితే నీ జవాబు ఇదేనా?' అని ఇంకేదో చెప్పబోతే, వద్దని వారించి, నువ్విక బయలుదేరు అని చెప్పింది. నేల మీద నుంచి అతని బేగ్ తీసి ఇచ్చి, అతన్ని బయటకు తీసుకువెళ్ళడానికి లేపింది. వెళ్లేముందు అతని బుగ్గ మీద ముద్దుపెట్టాలని దగ్గరికి జరిగితే, అతను అదే సమయంలో పక్కకు తిరగటంతో ఇద్దరి పెదవులూ కలిసాయి. అయితే ఆమె ఎందుకో వెనక్కు జరిగిపోలేకపోయింది. ఒక తల్లి ఏనాడో దూరమయిన తన కొడుకుని ముద్దుపెట్టుకున్నంత ప్రేమగా, నిష్కల్మషంగా రెండు క్షణాలు ముద్దుపెట్టుకుని వదిలేసి, బయటకు తీసుకెళ్ళి, పాలింగ్ కు కొంత డబ్బు ఇచ్చి జాగ్రత్తలు చెప్పింది. ఫియోనా అనుకోకుండా తను చేసిన పని అతన్ని ఏం డిస్టర్బ్ చేస్తుందో అని గిల్టీగా ఫీల్ అయ్యింది. టాక్సీ వెనక సీట్లో ముభావంగా కూర్చున్న ఏడమ్, కారు దగ్గరకు వచ్చిన ఫియోనాని చూడనట్టుగా, కారు కదిలిపోయేవరకూ తలతిప్పుకుని ఎటో చూస్తూ ఉండిపోయాడు.

ఆమెకు తను అనాలోచితంగా చేసిన పని, అక్కడ ఉన్న గెస్ట్స్ ఎవరన్నా చూసినా, లేదా పాలింగ్ వెనక్కి వచ్చినా చూసినా, తన మీద ఎన్ని పుకార్లు రేగి ఉండేవో, దేశమంతా తనగురించి ఎలా చెప్పుకునేవారో, తన ప్రవర్తన మీద విచారణ కూడా వేసి ఉండేవారని గుర్తొచ్చినపుడల్లా ఒళ్ళు జలదరించసాగింది. పదే పదే అదే విషయం తలుచుకోసాగింది. ఓ వారం రోజుల తర్వాత ఫియోనా అక్కడి నుండి బయలుదేరింది. దారిలో నుండి భర్తకు ఫోన్ చేసి మాట్లాడింది. నెమ్మదిగా వాళ్ళిద్దరి మధ్యా వచ్చిన పగుళ్ళు పూడ్చుకుని, రిలేషన్ తిరిగి చక్కదిద్దుకోవాలని అనుకుంది. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఇద్దరూ కూర్చుని సరళంగా మాట్లాడుకున్నాక, ఇద్దరికీ నెమ్మదిగా తమ అనుబంధం తిరిగి చిగురిస్తుందని నమ్మకం కలిగింది. అక్టోబర్ నెలాఖరు రోజుల్లో ఏడమ్ నుండి ఒక ఉత్తరం వచ్చింది. అందులో అతను రాసిన ఒక కవిత 'ఏడమ్ హెన్రీ గాథ' అని టైటిల్ తో అతను వ్రాసిన ఒక కవిత ఉంది. అందులో 'నిబంధనలు తప్పినందున తనో శిలువను మోస్తూ తిరుగుతున్నట్టూ, తనని రక్షిస్తానని చెప్పి సైతాన్ మారు రూపంలో వచ్చి తనకో స్వీట్ కిస్ ఇచ్చి మోసం చేసి పోయనట్టూ' అర్థం వచ్చేలా వ్రాసాడు. అది చూసిన ఫియోనాకు అతనికి తనమీద కోపంగా ఉందని అర్థం అయింది. తన చర్య వెనక కారణాన్ని వివరించి చెపుతూ ఉత్తరం రాద్దామని అనుకుని, మళ్ళీ ఆ ఆలోచన విరమించుకుంది. అతన్ని అలా వదిలేస్తే తొందరలోనే తనని మర్చిపోతాడులే అని సరిపెట్టుకుంది. ప్రతీ సంవత్సరం డిసెంబర్లో జరిగే కోర్ట్ తరఫున క్రిస్మస్ పార్టీలో, ఫియోనా, లాయర్ బెర్నర్తో కలిసి పియానో కాన్సర్ట్ చేస్తుంది. ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా వారిద్దరూ ప్రాక్టీస్ మొదలుపెట్టారు. కోర్టు పనులూ, మ్యూజిక్ ప్రాక్టీస్ తో రోజులు చకచకా గడుస్తున్నాయి.

డిసెంబర్, క్రిస్మస్ పార్టీ రోజు వచ్చింది. కాన్సర్ట్ అదే అపార్ట్మెంట్స్ ఆవరణలో ఉన్న హాల్లో జరుగుతుంది. సాయంత్రం పార్టీలో కాన్సర్ట్ మొదలయ్యే ముందు, స్టేజ్ మీదకు వెళుతుండగా ఒక జడ్జ్ ఫియోనాతో, 'నీకొక విషయం చెప్పాలి. ఆ విషయం పేపర్లలో రానివ్వలేదు' అని ఒకవిషయం చెప్పాడు. కాన్సర్ట్ టెన్షన్లో ఆమెకు విషయం పూర్తిగా వినపడక అర్ధమవ్వలేదు. అయితే విన్నంతవరకూ మాత్రం ఆమెను వణికించింది. ఆమె మొహం పాలిపోయింది. ఎలాగో యాంత్రికంగా కాన్సర్ట్ ముగించింది. ఎప్పటికన్నా అద్భుతంగా ఉందని అందరూ చప్పట్లు కొడుతుండగానే, ఆమె కలలోలా స్టేజ్ దిగి, బయట కురుస్తున్న వర్షంలో తడుస్తూనే ఇంటికి వెళ్ళిపోయింది. మరీనాకు ఫోన్ చేసి తను విన్న విషయం గురించి వివరాలు కనుక్కొని చెప్పమంది. మరీనా కొంతసేపట్లోనే ఫోన్ చేసి తను తెలుసుకున్న విషయం చెప్పింది. 'ఏడమ్ కు ఓ ఆరువారాల క్రితం మళ్ళీ లుకేమియా తిరగబెట్టింది. అతను ఈసారి రక్తమార్పిడికి ఒప్పుకోలేదు. తను అప్పటికి మేజర్ అవడంతో ఆవిషయంలో ఎవరూ ఏమీ చెయ్యలేకపోయారు. ఓ రెండు వారాలకు అతను చనిపోయాడు.' నిజం తెలుసుకున్న ఫియోనా హతాసురాలయ్యింది. అతను తనకెందుకు చెప్పలేదు, తన సహాయం ఎందుకు తీసుకోలేదు అని దుఃఖంతో ఆలోచిస్తుంటే, ఆఖరుగా ఏడమ్ రాసిన ఉత్తరం గుర్తొచ్చింది. తీసి పరీక్షగా చూస్తే అందులో అతను కొట్టి వేసిన పదాలు, మార్క్ చేసిన పదాలు కలిపి చదివితే 'ఎవరైతే నా శిలువను కావాలని వదిలేస్తారో వారు హతులవుతారు' అనే అర్థం వచ్చేలా వాక్యాలున్నాయి. ఆమెకు దుఃఖం ముంచుకొచ్చి, అలానే మతిపోయినట్టు కూర్చుంది. ఈలోగా జాక్ వచ్చి ఆమె ఎందుకు విచారంగా ఉందని అడిగితే మొత్తం జరిగిన కథంతా చెప్పింది. 'అతన్ని కోర్టులో నాకున్న అధికారాలతో మతం బారి నుంచి రక్షించగలిగాను. కానీ ఆ మతం మీద విశ్వాసాన్ని కోల్పోయిన తరువాత, అతనికి ప్రపంచం విశాలంగానూ అందంగానూ కనిపించింది. జీవితం మీద ఎంత ఆశా, ఆపేక్షా పెంచుకున్నాడో. అయితే మతం రక్షణలో అప్పటివరకూ భద్రంగా అనిపించిన జీవితం, అందులోంచి బయటకొచ్చేసరికి అతనిలో సంఘర్షణనీ అభద్రతనూ నింపింది. అతనికో ఆసరా కావాలనిపించింది. అది నాలో చూసుకున్నాడు. నేను తనకి గురువునవ్వాలని ఆశించాడు. కానీ నేను తీర్పు చెప్పడంతోనే నా బాధ్యత అయిపోయిందనుకున్నాను. అందరూ అలానే అనుకున్నారు. కల్లోలపడిన అతని మనసుకి చికిత్స చెయ్యాలని ఎవరూ ఆలోచించలేదు. నా పరువు ప్రతిష్టలూ పట్టించుకుని నేనూ అతన్ని బలి చేసాను. అతను విరక్తితో చికిత్స నిరాకరించి తనని తాను చంపుకున్నాడు' అని వెక్కివెక్కి ఏడవసాగింది. ఎట్టి పరిస్థితిలోనయినా నిబ్బరంగా ఉండే ఆమె అలా హృదయవిదారకంగా ఏడుస్తుంటే, జాక్ ఆమె వేదనని అర్ధం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఉండిపోయాడు.

ఇది ఈ రచయిత వ్రాసిన పుస్తకాల్లో, నేను చదివిన మొదటి పుస్తకం. ఈ పుస్తకం చూసి, చదవాలని అనిపించినపుడు, ఇతని గురించీ పుస్తకం గురించీ వివరాలు తెలుసుకోవాలని వెదికినపుడు, సినాప్సిస్ లో ఇది మతానికి మానవత్వానికీ సంఘర్షణ అనీ, ఏడమ్ మనస్థితిలో వచ్చిన మార్పులూ, ఫియోనా మీద అతనికి కలిగిన మోహం (infatuation) ఇద్దరి జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులు అనీ రెండుమూడు చోట్ల చదివాను. పుస్తకం మొదటిసారి చదువుతున్నప్పుడు (ముందే సారాంశం చదవటం నాకున్న చెడ్డ అలవాటు), నా ప్రిజుడిస్ తో ఏడమ్ కోలుకున్న తరువాత కథ ఆపేస్తే బావుండేదేమో అనుకుంటూనే చదివాను. పూర్తి అయిన తరువాత నాకు ఆకోణంలో అంగీకరిచడానికి మనసొప్పలేదు. అయితే రచయిత మిగిలిన రచనల గురించీ, ఆలోచనాసరళి గురించీ గొప్పగా చదివినదానితో, అంత సెన్సిబుల్ రచయిత, ఇంత సెన్సిటివ్ విషయాన్ని చెపుతూ అంత పేలవంగా ఎందుకు ముగింపు ఇస్తాడని అనుమానం పీకుతూనే ఉంది. రెండో సగభాగం రెండోసారీ, మూడోసారీ కూడా చదివాను. అదిగో అప్పుడు నాకు సంతృప్తి కలిగించిన కోణం నాకు అర్థమయ్యింది. ఇక్కడ మొత్తం సమస్య two-fold. మొదటి సమస్య ఎంత తీవ్రమో, రెండోది అంతకన్నా ప్రమాదమయినది. సున్నితమయిన ఆ రెండో కోణం గురించి చెప్పడానికే రచయిత ఫియోనాని ఉపయోగించుకున్నారేమో అని నాకు అర్థమయ్యింది.

ఏడమ్ కు మొదటినుంచీ తనకి తెలిసిన మతం పట్ల వ్యతిరేకత లేదు, పైగా ప్రాణాలిచ్చేంత ఫాసినేషణ్ కూడా ఉంది. అయితే తన అనారోగ్యం తరువాత కలిగిన రియలైజేషన్ తో అతని ప్రపంచపు పునాదులు కదిలిపోయాయి. అతను మరణం చివరి అంచుని తాకి వచ్చిన తరువాత కూడా అతని పేరెంట్స్ లో, ముఖ్యంగా తండ్రిలో మార్పు రాలేదు. తండ్రి కూడా మతాన్ని అసహ్యించుకోనక్కరలేదు, కానీ కొడుకు ప్రాణాలను హరించబోయిన దాని గురించి కొడుకుతో వాదనలు పెట్టుకోకుండా, అతన్ని బలవంతం చెయ్యకుండా అతని మనసు కుదురుకునేవరకూ వేచి ఉండాల్సింది. తను ఎంత ఆపద నుంచి బయటపడ్డాడో గ్రహించిన అతనికి, అప్పటికీ తల్లిదండ్రులకి తన క్షేమం, తన మనసుకి తగిలిన గాయం మానటం ముఖ్యమన్న ఆలోచన రానందుకూ, ఆ ప్రేమరాహిత్యానికీ మళ్ళీ గాయపడ్డాడు. అతనికి కావలసింది మానసిక ఆలంబన. బయట వ్యక్తి ఫియోనా ఆలోచించినంత కూడా తన వాళ్ళు ఆలోచించకపోవడం అతనిలో విరక్తినీ, సంఘర్షణనీ కలిగించింది. తనని అర్థం చేసుకుని ఆసరా ఇచ్చేదీ, తన సంశయాలు తీర్చగలిగేది ఆమె ఒక్కతే కనిపించింది. అది మోహం ఎంతమాత్రమూ కాదని నాకు అనిపించింది. తనని కేవలం మనిషిగా, ఏ మత ముద్రలూ లేకుండా రక్తమాంసాలున్న మనిషిగా, జీవితం మీద ఆశలూ కోరికలూ కలిగిన మామూలు మనిషిగా చూడగలిగే ఇంకో సౌల్ కోసం వెదుక్కున్నాడు. ఆ ప్రేమా, అవగాహనా తన పేరెంట్స్ దగ్గర దొరికితే, ఫియోనా దగ్గరికి మళ్ళీ వెళ్ళాల్సిన అవసరం అతనికి వచ్చేదే కాదు. మనలో చాలామందిమి ఎప్పుడో ఒకప్పుడు అటువంటి అవగాహనా రాహిత్యానికి గురయి, పరాయిచోట ఆప్యాయతని వెదుక్కున్నవాళ్ళమే. ఆ టీనేజ్ వయసులో, అందులోనూ తనున్న పరిస్థితిలో అతని ప్రవర్తన చాలా సాధారణమయినది. ఇందులో తప్పెవరిది? మనిషి భయపడుతున్నది దేవుడికీ, పాపభీతికా, లేక మతం పేరుతో మనిషిని భయపెడుతున్న ఉన్మాదులకా????

ఇందులో ఫియోనా, జాక్ మధ్య ఫ్రిక్షన్ వివరాలు చాలానే ఉన్నా, నాకు అవి అవసరం అనిపించక కేవలం ఓ పదిశాతం మాత్రమే చెప్పాను. ఎపుడూ పర్సనల్ జీవితపు ఒడిదుడుకులు, తన వృత్తిలో ప్రభావం చూపించకుండా ఫియోనా తనని మలుచుకుందని ముందే చెపుతారు. పైగా వృత్తిలోని సున్నితమయిన అంశాలు, అప్పుడప్పుడూ పర్సనల్ జీవితంలో చొచ్చుకొచ్చాయి తప్ప, అటుదిటు కాలేదు. పర్సనల్ జీవితంలో తగిలిన అతిపెద్ద షాక్ భర్త ప్రవర్తన. దాన్ని కూడా ఆమె న్యాయనిర్ణయంలో తన విచక్షణకి అడ్డుపడనివ్వలేదు. అది చెప్పడానికే తప్ప, వాళ్ళిద్దరి మధ్యా సంఘటనలు నాకంత ముఖ్యమయినవి అనిపించలేదు. అయితే చివర్లో ఏడమ్ ను ముద్దు పెట్టుకున్నానని చెప్పినపుడు, జాక్ కోపంతో వూగిపోయి, తాను వేసిన వేషాలు మర్చిపోయి, అతన్ని ప్రేమిస్తున్నావా అని అడుగుతాడు. కొంత సేపటికి ఆమె వేదన విన్న తరువాత అర్థం చేసుకోవడం వేరే సంగతి. అయితే అది టిపికల్ మగబుద్ధి అని ముద్రవేసి వదిలెయ్యొచ్చు, కానీ దాని ప్రస్తావన కూడా నాకు అనవసరం అనే అనిపించింది.

Ian McEwan కు మతమంటే సదభిప్రాయం లేదట. ముఖ్యంగా సెప్టెంబర్ 11 సంఘటన తరువాత, 'మతమూ దేవుడూ అనేవాటి మీద ఎప్పటికన్నా ఎక్కువగా విరక్తి కలిగాయని అంటారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన "*After* ***Sept. 11, I felt, more than ever that there was no God, and that religion was distinctly unhelpful in making compassionate, reasonable judgments about people's lives. On the whole, the secular mind seems far superior in making reasonable judgments."*** అని చెప్పారట. ఇది ఈ రచయిత వ్రాసిన పుస్తకాలన్నిట్లో అతి తక్కువ ఇంపాక్ట్ కలిగించేది అని చదివాను. అయితే మిగతావి ఇంకెంత బావుంటాయో అని ఆసక్తిగా ఉంది. Atonement సినిమా ఎపుడో చూసినా అది ఇతని పుస్తకం కథే అని తెలియదు. ఇపుడు వెదుక్కుని చదవాల్సిన ఇంకో రచయిత దొరికారు నాకు. ఇతను ఏ సబ్జెక్ట్ గురించి వ్రాసినా, దాని గురించి మంచి నాలెడ్జ్ తో వ్రాస్తారని విన్నాను.



రచయిత పరిచయం: Ian McEwan బ్రిటీష రచయిత; లండన్ నివాసి. కథలూ, నవలలూ కలిపి దాదాపు పదిహేను పుస్తకాలు వ్రాసారు. Amsterdam అనే నవల మాన్ బుకర్ ప్రైజ్ పొందింది. మొత్తం ఆరు స్సార్లు మాన్ బుకర్ ప్రైజ్ కు నామినేట్ చెయ్యబడ్డారత. మిగిలిన నవలలు కూడా దాదాపు ఏదో ఒక అవార్డు పొందినవే. ఆ వివరాలు అతని వెబ్ సైట్ లో చూడవచ్చు. అతనికి సోమర్సెట్ మామ్ అవార్డ్, జెరూసలేమ్ అవార్డు వచ్చాయి. 2008 లో "The 50 greatest British writers since 1945" లిస్ట్ లో స్థానం సంపాదించారు.

(Picture Source: Internet)



# పుస్తకం ఓ నేస్తం

## – పద్మవల్లి



### FOR ONE MORE DAY
(a day to listen, to love, to apologize, to forgive)




మనుషులం...పెర్ఫెక్ట్ గా ఉండకపోవటమే ప్రధమలక్షణమైన వాళ్ళం. తెలిసో తెలియకో మనకి బాగా కావాల్సినవారి హృదయాలని ఎపుడో గాయపరుస్తాం. అలా అని అవతలి వాళ్ళ మీద కోపమేం ఉండదు. అనుకోకుండా అలా జారిపోతాయి కొన్నిక్షణాలు. ఆ తరువాత మనం నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సిందే తప్ప చెయ్యగలిగింది ఏమీ ఉండదు. ఆ సందర్భంలో అలా కాకుండా వేరేలా ప్రవర్తించి ఉంటే బావుండేదనో, ఆ క్షణాలు తిరిగివస్తే మరోసారి ఆ పొరపాటు చెయ్యననో అనుకునే పరిస్థితి కలగని మనిషి సాధారణంగా ఉండకపోవచ్చు. అయితే ఆ పొరపాట్లు దిద్దుకునే అవకాశమూ అన్నిసార్లూ దొరకకపోవచ్చు.

మనకి దూరమయినవాళ్ళతో ఇంకొక్కరోజు గడిపే అవకాశం, మన ప్రవర్తన చేసిన గాయాలకు సాంత్వన కలిగించే అవకాశం వస్తే ఏం చేస్తాం? ఒకవేళ జరిగిపోయిన కాలాన్ని మళ్ళీ తిరిగి తెచ్చుకోగలిగితే, ఆ పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోగలిగే వివేకం మనలో ఎందరికుంటుంది? పొరపాటు ఒప్పుకుని, నొప్పించిన మనసుని సేదదీర్చి, పశ్చాత్తాపంతో బరువైన మనసుని తేలిక చేసుకునే అవకాశం దొరికేతే, దాన్ని అందిపుచ్చుకుంటామా లేక చేజార్చుకుంటామా? తల్లి బ్రతికున్నప్పుడు తను ప్రదర్శించిన నిర్లక్ష్యానికి, ఆమె ప్రేమను అర్థం చేసుకోకుండా ఆమె నుంచి దూరంగా జరిగిపోయి, తరువాత పశ్చాత్తాపంతో కృంగిపోయిన ఒక కొడుకు చార్లీ. చనిపోయిన తన తల్లితో అనుకోకుండా మళ్ళీ ఒకరోజు గడిపే అవకాశం కలిగితే అపుడతడు ఏం చేశాడు? అపుడు కొత్తగా ఏం తెలుసుకున్నాడు? అతని వేదన పోగొట్టి, గిల్టీ ఫీలింగ్ నుంచి విముక్తుడిని చెయ్యడానికి ఆ తల్లి ఏం చేసిందీ, ఆ తరువాత అతను చేజార్చుకున్న అనుబంధాలను ఎలా సరిచేసుకున్నాడూ అన్నది మిచ్ అల్బోం వ్రాసిన For One More Day కథ.

చార్లీ (Charley Benetto) దాదాపు ఏభై ఏళ్ళ వయసున్న వ్యక్తి, ఒకప్పుడు అతను బేస్ బాల్ వరల్డ్ లీగ్ ఆటగాడు. అతని భార్య కేథరిన్, కూతురు మరియా. చార్లీ స్పోర్ట్స్ కెరియర్ అతను ఆశించినట్టుగా ఎదగలేదు. తరువాత ఏవో చిన్న వ్యాపారాలు చేసి, స్టాక్స్ లో పెట్టుబడులు పెట్టి ఉన్నదంతా నష్టపోయాడు. తప్పక చిన్న చిన్న సేల్స్ జాబ్స్ చేసినా అవేవీ నచ్చలేదు. తన డెస్టినీ బేస్ బాల్ మాత్రమే అనీ, మిగిలినవేవీ తనకి తగినవి కావనీ అనుకునేవాడు. తండ్రిని ఇంప్రెస్ చెయ్యడానికి ఆటకోసం అబద్ధం చెప్పి వెళ్ళిపోయి, తల్లి చనిపోయినపుడు కూడా దగ్గర లేకుండా పోయాడు. అతను గొప్ప బేస్ బాల్ ఆటగాడిగా పేరు తెచ్చుకోవాలని ఆశించిన తండ్రి, అతని స్పోర్ట్స్ కెరియర్ పడిపోగానే మొహం చాటేసాడు. చార్లీ డబ్బు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసినా, తండ్రి అతనికి ఉద్యోగం ఇప్పించగలిగే స్థితిలో ఉండి కూడా పట్టించుకోలేదు. వీటన్నిటి వల్ల డిప్రెషన్, గిల్టీ ఫీలింగ్ పెరిగి తాగుడికి బానిసయ్యాడు చార్లీ. భార్య అతన్ని వదిలి వెళ్ళిపోయింది. ఒక్కగానొక్క కూతురూ అతన్నుంచి దూరంగా వెళ్ళిపోయింది. ఉద్యోగం పోయింది. కూతురు పెళ్ళి చేసుకున్న రెండువారాలకి పెళ్ళి జరిగిన విషయం తెలుపుతూ ఒక ఫోటో పంపింది. అది చూసి చార్లీ గుండె బద్దలయింది. ఆఖరికి తను అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు కూడా, తన వల్ల ఆమె పరువు పోతుందని పెళ్ళికి కూడా పిలవకపోవడం తట్టుకోలేకపోయాడు. ఎవరికీ అక్కర్లేని తన జీవితాన్ని అంతం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

చార్లీ తను పుట్టి పెరిగిన ఊరు, పెప్పర్ విల్ బీచ్ లో చనిపోవాలని నిర్ణయించుకుని, చీకటి పడ్డాక కారులో బయలుదేరాడు. దట్టమయిన తుఫాన్ రాత్రి. కళ్ళు కనిపించకుండా ఉరుములూ, మెరుపులతో జోరున వర్షం కురుస్తోంది. మద్యం తాగుతూ, ఆలోచిస్తూ హై వే మీద డ్రైవ్ చేస్తున్న చార్లీ, తన ఊరి శివార్లలోకి వచ్చేసరికి, ముందు వెళ్తున్న ఓ పెద్ద ట్రక్ ని ఢీ కొట్టడంతో, కారు ఎగిరి రోడ్డు ప్రక్కన పడి, చార్లీ అందులోంచి ఎగిరి బయటపడ్డాడు. నెమ్మదిగా లేచి చూస్తే, ట్రక్ కూడా రోడ్డు ప్రక్కన తిరగబడి, కనిపించింది. ఆ చీకట్లో, వర్షంలో అందులో వాళ్ళు ఎలా ఉన్నారో తెలీలేదు. అతనికి చిన్న చిన్న గాయాలు మాత్రమే తగిలాయి. ఇపుడు తనకు ఆ ఏక్సిడెంట్ చేసి ఎవరినో చంపిన పాపం కూడా తగులుతుందేమో అనుకుంటూ, నెమ్మదిగా కుంటుకుంటూ దూరంగా కనిపిస్తున్న ఊరి వైపు నడవసాగాడు. ఊరి పొలిమేరల్లో తను చిన్నప్పుడు ఆడుకున్న బేస్ బాల్ ఫీల్డ్ కనిపించింది. చనిపోవాలని అక్కడ ఉన్న పాత వాటర్ టేంక్ పైకెక్కి అక్కడ నుంచి దూకాడు, అయినా అతనికి చావు రాలేదు. చెట్ల కొమ్మలు చీరుకుని, గాయాలతో స్పృహ తప్పిపోయాడు. అప్పుడప్పుడే తెల్లవారుతోంది. చార్లీ స్పృహలోకి వచ్చి చూస్తే ఆ వెలుతురులో, ఎనిమిదేళ్ళ క్రితం చనిపోయిన అతని తల్లి నిలుచుని కనిపించింది. మళ్ళీ కళ్ళు నులుముకుని చూసేసరికి ఎవరూ లేరు.

చార్లీ నెమ్మదిగా లేచి ఊర్లోని తమ ఇంటికి వెళ్ళాడు. అక్కడ మళ్ళీ తల్లి కనిపించి, ఏమీ జరగనట్టే మాట్లాడి, అతని గాయాలకి కట్టు కట్టింది. అతని కుటుంబం క్షేమసమాచారాలు అడిగింది. చక్కగా కడుపు నిండా తిండి పెట్టింది. అతను తనని చూడటానికి వచ్చినందుకు ఎంతో సంతోషించి, ఆరోజంతా తనతో గడపమని అడిగింది. చార్లీకి అంతా అయోమయంగానూ, భయంగానూ ఉంది. తను నిజంగా బ్రతికున్నాడా, చనిపోయాడా అర్థం కాలేదు. ఎపుడో చనిపోయిన తల్లి అక్కడ ఇంట్లోకి ఎలా వచ్చిందో, ఏమీ జరగనట్టుగా తను మామూలు చుట్టపు చూపుకి వచ్చినట్టుగా ఎలా ప్రవర్తిస్తుందో ఏమీ అర్థం కాలేదు. అతని తల్లి చనిపోడానికి కొన్నేళ్ళ ముందు, బ్యూటీ పార్లర్ లో పని మానేసి వయసు మీద పడిన క్లయింట్స్ ఇళ్లకు వెళ్ళి, వాళ్ళకు మేకప్, హెయిర్ స్టైల్ చేస్తూ ఉండేది. ఆరోజు తను వెళ్ళాల్సిన ముగ్గురు క్లయింట్స్ ఇళ్లకు చార్లీని కూడా తనతో రమ్మని తీసుకువెళ్ళింది. వాళ్ళందరూ అతి తొందరలో చనిపోబోతున్నారనీ, తనని ప్రేమగా తలుచుకోడం వల్ల వాళ్ళకు ఆఖరుసారి మేకప్ చెయ్యడానికి వెళుతున్నాననీ, వాళ్ళొక్కరికి మాత్రమే తను కనిపిస్తుందనీ చెపుతుంది. అక్కడ

వాళ్ళతో జరిగిన సంభాషణ వల్ల, చార్లీకి తల్లి గురించి అతనికి ముందు తెలియని ఎన్నో విషయాలు తెలిసాయి. అదే సమయంలో అతనికి తన చిన్నతనం నుంచీ జరిగిన విషయాలు గుర్తుకు రాసాగాయి.

పెప్పర్ విల్ అనేది ఓ చిన్న పల్లెటూరు. చార్లీ తండ్రి లెన్ (Leonard Benetto), తల్లి పోశీ (Pauline Benetto). తండ్రి ఇటాలియన్ కేథలిక్, తల్లి ఫ్రెంచ్ ప్రొటెస్టంట్. ఇద్దరూ కలిసిన కొంతకాలానికి లెన్ రెండో ప్రపంచ యుద్ధం సమయంలో సైన్యంలో చేరి, ఇటలీలో కొంతకాలం ఉన్నాడు. యుద్ధం ముగిసి తిరిగి వచ్చిన తరువాత ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. వాళ్లకి చార్లీ, తరువాత ఐదేళ్లకు రాబెర్టా అనే కూతురూ పుట్టారు. తండ్రి లిక్కర్ స్టోర్ నడిపేవాడు. తల్లి నర్స్ గా పనిచేసేది. పోశీ అందంగా ఆకర్షణీయంగా, ఎపుడూ చలాకీగా, నవ్వుతూ నవ్విస్తూ ఉండేది. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ, వాళ్ళకు హోమ్ వర్క్ లో సాయం చెయ్యడం, తెలియని విషయాలు అర్థమయ్యేలా ఓపికగా వివరించడం చేస్తూ ఉండేది. అలాగే హాస్పిటల్లో రోగుల పట్ల కూడా దయతో ఉంటూ, వాళ్ళను ఎంతో శ్రద్ధగా చూసుకునేది. తండ్రి మాత్రం ఇంటి విషయాలేమీ పట్టించుకోకుండా ఉండేవాడు. వాళ్ళిద్దరి మధ్యా వాదనలూ చాలా ఎక్కువగానే జరిగేవి. ఎక్కువసార్లు వాటికి కారణం కూడా లెన్ అసహనం, మూర్ఖపు పట్టుదలా కారణంగా ఉండేవి.

పోశీ చాలా పేద కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో, కుటుంబాన్ని పోషించడానికి ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఆమెకు చదువుకోవాలన్న ఆశ తీరలేదు. అందుకని తన పిల్లలు బాగా చదువుకుని, తను పొందలేకపోయిన అవకాశాలు పొందాలని అనుకునేది. చదువు చాలా ముఖ్యమని పిల్లలకు ఎపుడూ చెపుతూ ఉండేది. లెన్ ఆర్ధికంగా మంచి స్థానంలో ఉన్న కుటుంబం రావడంతో అతనికి ఏ లోటూ తెలీదు. అతనికి బేస్ బాల్ ఆటంటే చాలా ఇష్టం. కొడుకు పెద్ద బేస్ బాల్ ఆటగాడు అయి అతనితో పాటూ తనకీ పేరు తేవాలని కలగంటూ ఉండేవాడు. చార్లీకి చిన్నప్పటి నుంచే ఆట నేర్పించి, దగ్గరుండి గేమ్స్ కి తీసుకెళ్లడం, ప్రత్యేకంగా గేమ్ కోచ్ చెయ్యడం చేస్తూ ఉండేవాడు. పోశీకి అతను చదువు కన్నా ఆటకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం నచ్చకపోయినా, ఎదురు చెప్పేది కాదు. అందరు తల్లుల్లాగే ఆమె కూడా పిల్లల వెంటే ఉంటూ, వాళ్ళ చదువు సంధ్యలు, ప్రవర్తనా పట్టించుకుంటూ, తప్పులు దిద్దుతూ, వాళ్ళకి అన్నిటిలోనూ సాయం చేస్తూ ఉండేది. సహజంగానే అందరు పిల్లలకు లానే చార్లీకి కూడా తల్లి శత్రువులా కనిపిస్తూ ఉండేది. తన ఆట గురించి తప్ప ఇంకే విషయంలోనూ పట్టించుకోని తండ్రిని ఇంప్రెస్ చెయ్యడానికి చార్లీ ఎన్నో పాట్లు పడేవాడు. దానికోసం ఒక్కోసారి తండ్రి పక్షం ఉండి, తెలీకుండానే దురుసుగా మాట్లాడి తల్లిని మానసికంగా గాయపరిచేవాడు. అయితే తల్లి అవేమీ పట్టించుకోకుండా, వీలయినంతవరకూ తమ గొడవలు పిల్లల దృష్టిలో పడకుండా, వాటి వల్ల పిల్లలు కలత పడకుండా చూసుకునేది. అయినా అప్పుడప్పుడూ అవి వారి దృష్టిని దాటి పోలేదు.

చార్లీకి పదకొండేళ్ళ వయసులో తండ్రి ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. ఎక్కడికి వెళ్ళాడో, ఎందుకు వెళ్ళాడో కూడా పిల్లలకి తెలీలేదు. తల్లిని అడిగితే ఇక రాడు అని మాత్రమే చెప్పింది, కానీ తండ్రి గురించి ఒక్క మాట కూడా చెడుగా చెప్పలేదు. ఆమె కొన్ని రోజులు క్రుంగిపోయినా, తేరుకుని, తన ఉద్యోగమూ పిల్లల బాగోగులూ చూసుకోడం మొదలుపెట్టింది. అది 1970 కాలం. అప్పటికి కుటుంబాలు విడిపోవడం అనేది ఎక్కువగా లేకపోవడం, అది పల్లెటూరు కావడంతో పోశీ చాలా విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. భర్త వదిలేసిపోడానికి ఆమే కారణం అని మొహం మీదే అన్నవారున్నారు. పైగా మంచి అందగత్తె కావడం, చిన్న వయసులో ఉండటంతో మిగిలిన ఆడవాళ్లకు జెలసీ, తమ భర్తలని ఎక్కడ ఆకర్షిస్తుందో అని భయం పట్టుకున్నాయి. మగవాళ్ళకి ఒంటరి ఆడది అనేసరికి చిన్నచూపుతో, ఉద్యోగంలోనూ

బయటా కూడా చనువు మీరబోతే, ఆమె అన్నిటినీ ధైర్యంతో ఎదుర్కొని, తన ఉద్యోగం కూడా పోగొట్టుకుంది. ఒక బ్యూటీ పార్లర్ లో చేరి మేకప్ ఉమన్ గా, హెయిర్ డ్రెస్సర్ గా పనిచెయ్యడం మొదలు పెట్టి, పిల్లలకి ఏ విషయంలోనూ లోటూ తెలీకుండా చూసుకోసాగింది.

చిన్నదయిన రాబెర్టా పరిస్థితులకి అలవాటు పడిపోయినా, టీనేజ్ లో ఉన్న చార్లీ తండ్రి కోసం తపిస్తూ, రోజు రోజుకీ తల్లి మీద అసహనం పెంచుకోసాగాడు. ఆమెంత అతనికి దగ్గరవుదామని చూస్తే, అతనంత దూరం జరగడం మొదలుపెట్టాడు. ప్రతీ విషయంలోనూ ఆమెను వ్యతిరేకిస్తూ ఉండేవాడు. ఊర్లో జనాలు ఆమె గురించి అసభ్యంగా మాట్లాడినపుడు కూడా ఖండించకుండా మౌనంగా ఉండటం, ఆమె చక్కగా తయారయవడాన్ని తనకు తలవంపులుగా ఉందని విమర్శించడం, ప్రతీ విషయానికీ  ఆమె గాయపడేలా మాట్లాడటం చేస్తుండేవాడు. తల్లి ఒంటరితనం చూసి రాబెర్టా, ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకుంటే బావుంటుందని అంటే, చార్లీ చెల్లెలి ఆలోచనని తీవ్రంగా వ్యతిరేకించాడు. తండ్రి ఎక్కడున్నాడో తెలుసుకోడానికి ప్రయత్నం చేసాడు కానీ, అతను తన లిక్కర్ షాప్ అమ్మేసి ప్రక్క ఊరిలో ఎక్కడో క్రొత్త షాప్ పెట్టుకున్నాడని మాత్రమే తెల్సింది. కొన్ని నెలల తరువాత ఓ అర్ధరాత్రప్పుడు తండ్రి వస్తే, అతన్ని ఇంట్లోకి రానివ్వకుండా బయటనుండే పంపేసిందని, చార్లీ తల్లి మీద కోపం పెంచుకుని, తను స్వతంత్రుడై ఆ ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోయే రోజు కోసం ఎదురుచూడసాగాడు. తను బేస్ బాల్ ఆటగాడు అవాలన్న తండ్రి కోరిక ప్రకారం, ఆట మాత్రం వదలకుండా ప్రాక్టీస్ చేస్తుంటాడు. ఆడుతున్నంతసేపూ అతనికి తండ్రి తనతో ఉన్నట్టు ఉండేది. ఏ రోజుకైనా తండ్రి తన ఆటను చూడటానికి వస్తాడని అతనికి నమ్మకం.

చార్లీ హైస్కూల్ చదువు పూర్తిచేసుకుని కాలేజీకి వెళ్ళే రోజున, పోశీ సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. తనకి దక్కని అదృష్టం కొడుక్కి దక్కుతున్నందుకు ఎంతో మురిసిపోయింది. కొడుక్కి స్పోర్ట్స్ స్కాలర్షిప్ తో కాలేజీ సీట్ వచ్చిన విషయం అందరికీ ఎంతో గొప్పగా చెప్పుకుంది.  కొడుకుని వేరే ఊర్లోని కాలేజీలో దింపడానికి తీసుకెళ్ళి, అక్కడ లైబ్రరీలు సదుపాయాలూ అన్నీ చూసి మురిసిపోతూ, ఉద్వేగంతో ప్రవర్తిస్తున్న తల్లిని చూసి అసహనంగానూ, చిన్నతనంగానూ ఫీల్ అయ్యాడు చార్లీ. అతని హాస్టల్ రూమ్ వరకూ వచ్చి చూసి వెళతానన్న తల్లిని కాదని చిన్నబుచ్చి, కాలేజీ బయటనుండే పంపేస్తాడు. మనసు సర్ది చెప్పుకుని, అతన్ని జాగ్రత్తగా చదువుకోమని చెప్పి తిరిగి వచ్చేస్తుంది పోశీ. చార్లీ తల్లి కోరిక ప్రకారం చదువూ, తండ్రి కోరిక ప్రకారం కాలేజీ బేస్ బాల్ టీం లో ఆడుతూ, ఎప్పటికన్నా గొప్ప ఆటగాడిగా పేరు తెచ్చుకుని తండ్రికి దగ్గరవాలని కష్టపడుతున్నాడు.

కొన్నాళ్ళకి చార్లీ కోరిక తీరే సమయం వచ్చింది. ఒకరోజు కాలేజీలో గేమ్ జరుగుతున్నప్పుడు, చార్లీకి ప్రేక్షకుల్లో కూర్చొని తన ఆట చూస్తున్న తండ్రి కనిపించాడు. ఎనిమిదేళ్ళ తరువాత మొదటిసారి తండ్రిని చూసిన చార్లీ చలించిపోయాడు. వస్తున్న ఏడుపు కంట్రోల్ చేసుకుని, ఆట మీద దృష్టి పెట్టాడు. తండ్రి చార్లీని చూసి చిన్నగా తలవూపాడు తప్ప ఇంకేం మాట్లాడలేదు. అలా కొన్ని వారాల పాటు ఆట చూడటానికి వచ్చిన తండ్రి, ఒకరోజు చార్లీతో మాట్లాడాడు. అప్పటి నుంచి అతను చార్లీని తరచుగా కలుస్తూ, అతన్ని ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మేనేజర్స్ దృష్టిలో పడే అవకాశం కోసం టోర్నమెంట్స్ ఆడమని ప్రోత్సహించి,  అన్ని గేమ్స్ లోనూ వెంట ఉండసాగాడు. చార్లీ ఆట చూసి కొందరు వాళ్ళ లీగ్ లో చేరమని అడిగితే, తండ్రి తెలివిగా అతనికి ఇంకా పెద్ద టీమ్స్ లో అవకాశాలు వస్తున్నాయని అబద్ధాలు చెప్పి వాళ్ళ దృష్టిలో చార్లీ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేసాడు. ఆశ్చర్యపోయిన చార్లీతో, “నీకు దేశంలో బెస్ట్ టీమ్ లో చేర్చే సంగతి నేను చూసుకుంటాను, నువ్వు కేవలం ఆట మీద దృష్టి పెట్టు” అని చెప్పాడు.  తండ్రిని కలిసిన సంగతీ, అతని ప్రయత్నాలూ చార్లీ తల్లికి చాన్నాళ్ళ తర్వాత చెపితే, ఆమె ఏమీ అనకుండా చదువుని నిర్లక్ష్యం చెయ్యొద్దని మాత్రం చెప్పింది.

చార్లీకి మొదటి సంవత్సరం కాలేజీ చదువు గడిచింది. ఫస్ట్ క్లాస్ మార్క్స్ తో పాస్ అయ్యాడని తెలిసి పోశీ ఎంతో సంతోషించింది. నువ్విలా కాలేజీ టీములో ఆడుకుంటూ కూర్చుంటే ప్రొఫెషనల్ లెవెల్కి ఎపుడూ ఎదగలేవు అని తండ్రి నూరిపోసిన మాటలు విని, చార్లీ చదువు రెండవ సంవత్సరం మధ్యలో కాలేజీ మానేసి వెళ్ళిపోయాడు. తల్లి వద్దని నెత్తీ నోరూ మొత్తుకున్నా చార్లీ వినలేదు. అతనికి బిగ్ లీగ్ టీమ్స్ లో ఆడటం,తండ్రిని సంతోషపెట్టడం మాత్రమే ముఖ్యమయినవిగా అనిపించసాగాయి. తరువాత రెండు మూడేళ్ళు కొన్ని మైనర్ లీగ్ గేమ్స్ ఆడాడు. ఈలోగా కాలేజీలో పరిచయమయిన కేథరిన్ ని పెళ్ళిచేసుకున్నాడు. ఒకసారి ఒక మేజర్ బేస్ బాల్ టీమ్లో ఒక ఆటగాడు గాయపడటంతో, చార్లీకి వరల్డ్ సిరీస్ ఆడే అవకాశం వచ్చింది, కానీ అతని టీమ్ గెలవలేదు. ఆ తరువాత ఆట ప్రాక్టీస్ చేస్తూ మోకాలు గాయపడి, కొన్ని నెలలు ఆటకు దూరంగా ఉన్నాడు. కోలుకున్నాక మళ్ళీ ఆడటం మొదలుపెట్టాడు, కానీ ఎంత ప్రయత్నించినా చిన్న చిన్న టీమ్స్ లో తప్ప మళ్ళీ పెద్ద అవకాశాలు రాలేదు. ఆట కోసం ఎక్కడా స్థిరంగా ఉండకుండా, ఫేమిలీతో ఊరూరూ తిరిగాడు. ఆ తిరుగుళ్ళలోనే కూతురు మరియా పుట్టింది. ఆరేళ్ళు అలా ప్రయత్నించాక ఇక తనకి ఆటలో అవకాశాలు రావని నిశ్చయించుకుని, ఒక చిన్న సేల్స్ ఉద్యోగంలో చేరాడు, కానీ అదీ అతనికి సంతృప్తినివ్వలేదు. బేస్ బాల్ ప్లేయర్ చార్లీ అనిపించుకోవాల్సిన తను, సేల్స్ మేన్ చార్లీ అనిపించుకోవాల్సిరావడం చిన్నతనంగా అనిపించేది. నిర్లిప్తంగా ఉద్యోగం చేసుకోసాగాడు. తన వ్యాపారంలో చార్లీకి ఉద్యోగాన్నిచ్చే అవకాశం ఉన్నా తండ్రి పట్టించుకోలేదు. ఎలా హఠాత్తుగా వచ్చాడో, చార్లీ స్పోర్ట్స్ కెరియర్ ముగిసిందని అర్ధమవగానే అంతే హఠాత్తుగా మాయమయిపోయాడు.

మరో ఆరేళ్ళు గడిచాయి. తల్లి 79 వ పుట్టినరోజు వచ్చింది. వచ్చే ఏడాదికి తనుంటుందో లేదో అని పోశీ అందరితో కలిసి ఆరోజు గడపాలనుకుంది. చార్లీ, రాబెర్టా తమ కుటుంబాలతో సహా తల్లి దగ్గరికి వచ్చారు. ఇల్లంతా స్నేహితులతో పార్టీ హడావిడిలో ఉంది. ఈలోగా చార్లీ తండ్రి నుండి ఫోన్ వచ్చింది. ‘ఒకప్పటి లీగ్ ఆటగాళ్ళంతా ఆడుతున్న ఒక గేమ్లో చార్లీకి అవకాశం సంపాదించాననీ, అతని లక్ బాగుంటే అక్కడ పరిచయాలు పెరిగి మళ్ళీ అవకాశాలు రావొచ్చనీ, మర్నాడే గేమ్ కాబట్టి వెంటనే బయలుదేరి రమ్మని’ చెప్పాడు. తల్లి పుట్టినరోజు అని చెప్పబోయాడు కానీ, తండ్రి వినిపించుకోకుండా మళ్ళీ ఇలాంటి అవకాశం రాదు కాబట్టి వెంటనే రమ్మన్నాడు. చార్లీ భార్యకూ, తల్లికీ తన ఉద్యోగంలో ముఖ్యమైన కష్టమర్ దగ్గర పెద్ద సమస్య వచ్చిందనీ, తను వెంటనే వెళ్ళి తీరాలనీ చెప్పి బయలుదేరాడు. ఒక ప్రక్క అబద్ధమాడి వెళ్తున్నందుకు అతనికి గిల్టీగానే ఉంది, కానీ తండ్రికి కాదనీ చెప్పలేకపోయాడు. ఆ గేమ్ అనుకున్నట్టుగా కలిసి రాకపోగా, తనకి వయసులో ఉన్నప్పటిలా ఆడే సామర్ధ్యమూ తగ్గిపోయిందని చార్లీకి అర్ధమయ్యింది. ఆట పూర్తి కాగానే అవకాశాల కోసం అక్కడ ఎవరితోనూ పరిచయం పెంచుకోకుండా బయటకు వచ్చేసిన చార్లీని తండ్రి విసుక్కున్నాడు. ఈలోగా తల్లి హార్ట్ ఎటాక్ వచ్చి మరణించిందని భార్య నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే షాక్ తో తండ్రికి ఆ విషయం చెప్పడం కూడా మర్చిపోయి బయలుదేరిపోయాడు. అంతే, మళ్ళీ తండ్రిని అతను చూడలేదు.

తల్లి పోయిన సమయంలో తను అక్కడ దగ్గర ఉండగలిగి కూడా, ఉండనందుకు చార్లీ అపరాధభావంతో కృంగిపోయాడు. అబద్ధం చెప్పి మరీ వెళ్లినందుకు సిగ్గుపడ్డాడు. ఆ బాధ అతనికి మనశ్శాంతి లేకుండా చేసింది. కొన్ని రోజుల తరువాత భార్యకు నిజం చెపితే, ఆమె అభావంగా, ‘ఇప్పుడేమనుకుని మాత్రం ఏం ప్రయోజనం?’ అని నిట్టూర్చింది. ఆరోజు నుంచీ ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. చార్లీ డిప్రెషన్తో, గిల్టీ ఫీలింగ్ తో తాగుడుకి బానిసయ్యాడు. ఉద్యోగం పోయింది. భార్యా కూతురూ ఇద్దరూ అతనికి దూరమయిపోయారు. ఒంటరితనం,

అశాంతితో తాగుడు పెరిగి, చివరికి ఒక లూజర్ గా మిగిలిపోయాడు. కూతురు తన పెళ్లికి కూడా పిలవకపోవడంతో, పూర్తిగా విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుని, చనిపోవాలని స్వంతవూరికి బయలుదేరాడు. దారిలో ఏక్సిడెంట్ అవడం, మళ్ళీ తల్లిని కలవడం జరిగింది. ఇదంతా చార్లీకి గుర్తుకు వస్తున్న సమయంలో, మధ్యలో రెండుమూడు సార్లు 'చార్లీ, నువ్విక్కడే ఉన్నావా' అంటూ ఎవరివో మాటలు వినిపించసాగాయి.

చార్లీకి తల్లి పట్ల తన ప్రవర్తన గుర్తొచ్చి సిగ్గుపడ్డాడు. తనూ, చెల్లీ ఎన్ని అన్నా, అన్నిరకాలుగా అవమానించినా వాటిని దిగమింగి, తమమీద ప్రేమని మాత్రమే చూపడం గుర్తుకువచ్చి బాధకలిగింది. తల్లితో కలిసి మొదటిగా రోజ్ అనే వృద్ధురాలి ఇంటికి వెళ్ళినపుడు, రోజ్ మాటల్లో చార్లీకి, తల్లి మంచితనం, సహనం, తమంటే ఆమెకు ఎంత ప్రాణమో తెలుస్తాయి. అలానే తల్లి, చిన్నతనం అనుకోకుండా వేరొకరికి పర్సనల్ సేవలు ఎలా చేస్తుందా అని ఆశ్చర్యపోతాడు. వారి సంభాషణ వల్ల, పిల్లలు పేరెంట్స్ ప్రవర్తన తమకు చిన్నతనంగా భావించినా, పేరెంట్స్ ఎప్పుడూ పిల్లల్ని నిస్వార్ధంగా ప్రేమిస్తారని కూడా అర్థం చేసుకుంటాడు. తరువాత ఇద్దరూ థెల్మా అనే ఆమె ఇంటికి వెళతారు. ఆమె చార్లీ చిన్నప్పుడు వాళ్ళ ఇంట్లో మెయిడ్ గా పనిచేసేది. పోశీ ఆమెతో గౌరవంగా ప్రవర్తిస్తూ, పిల్లలు కూడా ఆమెతో మర్యాదగా ప్రవర్తించేలా చూసేది. ఇపుడు ఆమె చివరి క్షణాల్లో ఉండి, పోశీని తలచుకోవడంతో ఆమె దగ్గరకి వస్తుంది. వారిద్దరి మాటల్లో తల్లి కూడా థెల్మాతో కలిసి ఇళ్ళు క్లీన్ చేసిందని చార్లీకి తెలిసింది. అంత తక్కువ పని ఎందుకు చెయ్యాల్సి వచ్చిందని అడిగిన చార్లీతో, మీ ఇద్దరికీ కాలేజీ చదువు చెప్పించడానికి నాకు డబ్బు ఎలా వచ్చిందనుకుంటున్నావని అడుగుతుంది పోశీ. మరి నువ్వు నాన్నని డబ్బు అడగాల్సింది కదా అంటే, 'నేను ఒక తల్లిని. నా పిల్లలను పోషించుకోవడానికి నాకు చేతనయిన పని గౌరవంగా చేసుకున్నాను. నా కుటుంబాన్ని కాపాడుకున్నాను. అదే నాకు ముఖ్యం. అందులో నాకేమీ చిన్నతనం అనిపించలేదు' అని చెప్పింది. దాంతో చార్లీకి తను 'చార్లీ – బేస్ బాల్ ప్లేయర్' అనిపించుకోవాలనే కోరికా, 'చార్లీ –సేల్స్ మేన్' అనిపించుకోవడంలో అనుభవించిన చిన్నతనం గుర్తొచ్చాయి. తను ఏం చేసినా, కుటుంబాన్ని మాత్రం నిలబెట్టుకోలేకపోయాడు అన్న నిజం అతని చేతకానితనాన్ని గుర్తుచేసింది. తల్లి అన్ని కష్టాలు పడి తనని చదివించాలని చూస్తే, తనేమో ఆట కోసం, అదీ తమని వదిలి దూరంగా పోయిన తండ్రిని సంతోష పెట్టడం కోసం చదువు వదిలేసాడు.

తల్లితో కలిసి మూడో ఇంటికి వెళ్ళినపుడు, అక్కడ డెబ్భయ్యేళ్ళ వయసున్న ఒక ఇటాలియన్ స్త్రీని చూసాడు. ఆమె ఎంతో దిగులుగా కనిపించింది. ఆమెవరు అని అడిగిన చార్లీకి, ఆమె అతని తండ్రికి మొదటి భార్య అని చెపుతుంది పోశీ. ఆశ్చర్యపోయిన చార్లీతో ఆ వివరాలు చెపుతుంది. ' మీ నాన్న మా పెళ్లి కాక ముందు యుద్ధంలో పనిచేస్తూ ఇటలీ వెళ్ళినపుడు అక్కడ ఈమె పరిచయమయి, పెళ్లి జరిగింది. ఇద్దరికీ ఒక కొడుకు కూడా పుట్టాడు. యుద్ధం ముగిసిన తరువాత అమెరికాకి తిరిగివచ్చి ఈ విషయాలు దాచి, నన్ను పెళ్లి చేసుకున్నాడు. మీ ఇద్దరూ పుట్టారు. తరువాత కొన్నేళ్ళకి మళ్ళీ ఈమె కనిపిస్తే, తీసుకొచ్చి ప్రక్క వూరిలో కాపురం పెట్టాడు. అక్కడ ఒక క్రొత్త షాపు పెట్టి ఎక్కువ అక్కడే ఉండటం మొదలుపెట్టాడు. నాకెందుకో అతని ప్రవర్తన అనుమానం వచ్చి ఒకరోజు వెదుక్కుంటూ వెళితే అన్ని విషయాలు తెలిసాయి. వెంటనే ఇంటికి వచ్చి, అతను ఇంటికి వచ్చేవరకూ బయటే కూర్చుని ఉండి, రాగానే విషయం అడిగితే నిజం వొప్పుకున్నాడు. కేవలం నాకొక్కదానికే అన్యాయం చేస్తే క్షమించి ఉండేదాన్ని, కానీ తండ్రిగా మీ ఇద్దరికీ కూడా అన్యాయం చెయ్యడం భరించలేకపోయాను. అక్కడో కాలు ఇక్కడో కాలు వేసి ఇద్దరినీ మోసం చేస్తూ ఉండటం అనేది ఎవరికీ ఏ మంచీ చెయ్యదు. మీకోసం నేను నిర్ణయం తీసుకోక తప్పలేదు. అతన్ని ఇక ఇంటికి రావద్దని చెప్పాను. నిజం తెలిస్తే మీరు తట్టుకోలేరని మీకెప్పుడూ చెప్పలేదు' అని చెప్పింది. నిజం తెలుసుకున్న చార్లీ నిశ్చేష్టుడై పోయాడు. 'నీకు ఆమె మీద కోపంగా లేదా?' అని అడిగిన చార్లీతో, 'లేదు. అందులో ఆమె తప్పేముంది. పాపం ఆమె కూడా నాలాగే ఓ చక్కని కుటుంబాన్ని కోరుకుంది. అయితే ఆమెకూ అది దక్క లేదు. మీ నాన్న వాళ్ళని కూడా వదిలేసి వెళ్ళిపోయాడు.' అని చెప్పింది. తండ్రి

తనని ఎప్పుడూ అతని పక్షమే ఉండాలని ఆశించి, ప్రతీసారీ తన లాయల్టీని డిమాండ్ చేసిన తండ్రికి వేరే సంతానం ఉందన్న నిజం అతనికి షాక్ కలిగించింది. అటువంటి తండ్రిని సంతోషపెట్టడానికి తను తల్లి మనసుని ఎంత నొప్పించాడో అర్ధమయిన చార్లీ ఏడుస్తూ కూలబడిపోయాడు.

చార్లీ, తల్లితో 'నేను నిన్నెప్పుడూ అర్ధం చేసుకోకుండా, ఎంతో బాధ పెట్టాను. ఆఖరికి నువ్వు చనిపోయిన రోజు కూడా అబద్ధం చెప్పి గేమ్ కోసం వెళ్ళిపోయాను. అవన్నీ నాలో మిగిల్చిన కోపం, అపరాధభావం భరించలేక తాగుడు ఆసరా చేసుకున్నాను. జీవితంలో అందరినీ పోగొట్టుకుని, ఒంటరిగా మిగిలిపోయాను. ఆ మానసికక్షోభ భరించలేకే చనిపోవాలని ప్రయత్నించాను' అని ఏడ్చాడు. తల్లి అతన్ని ప్రేమగా దగ్గరికి తీసుకుని ఓదార్చి, 'కొన్నిసార్లు మనల్ని మనం క్షమించుకోవాలి చార్లీ. లేకపోతే బ్రతుకు కష్టమవుతుంది' అని చెప్పింది. 'సరే, ఇక నువ్వెళ్ళవలసిన సమయం అయింది. ఇది గుర్తుంచుకో, ఎప్పుడూ తల్లి ప్రేమని కోల్పోవడమనేది ఉండదు. తల్లి ప్రేమకి హద్దులూ, ఆంక్షలూ ఉండవు' అని చెప్పి మాయమయిపోయింది. ఈలోగా మళ్ళీ కళ్ళు మిరుమిట్లు గొలిపేలా కాంతితో పాటు, 'చార్లీ, మా మాటలు నీకు వినిపిస్తున్నాయా' అంటూ పిలుపులు వినిపించాయి. స్పృహ కోల్పోతున్న చార్లీకి, తన మీదకి వంగి చూస్తున్న ఎమర్జెన్సీ సిబ్బంది లీలగా కనిపించారు.

ఆ ఏక్సిడెంట్ తరువాత చార్లీ కోలుకోవడానికి కొన్ని నెలలు పట్టింది. తల్లే తనని రక్షించిందని అతను నమ్మాడు. తల్లితో మాట్లాడిన తరువాత అతనికి దుఃఖం తగ్గింది. తనవాళ్లతో అనుబంధాలను సరిదిద్దుకుని జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలని నిర్ణయించుకుని, కూతురికి దగ్గరయ్యాడు. తరచుగా సమయం గడపడం కోసం, ఆమె ఉండే చోటికి దగ్గరగా నివాసం మార్చుకుని వీలయినంత ఎక్కువ కాలం ఆమెతో గడిపాడు. మాజీ భార్యతో కూడా స్నేహంగా ఉంటూ, ఇద్దరూ తరచూ కలిసి మాట్లాడుకునేవారు. లోకల్ రిక్రియేషన్ పార్క్లో ఉద్యోగం చేస్తూ, పిల్లలను ఆటల్లో ప్రోత్సహిస్తూ వారి మధ్య మిగిలిన జీవితం గడిపాడు చార్లీ. ఆ ఏక్సిడెంట్ జరిగిన ఐదేళ్లకు చార్లీ హార్ట్ ఎటాక్ తో చనిపోయాడు. చనిపోయే కొన్ని రోజుల ముందు అందరితోనూ చార్లీ 'నా గతాన్ని కాదు. ఇపుడు నేనేమిటో అలా నన్ను గుర్తుపెట్టుకోండి' అని చెప్పేవాడు.

ఈ పుస్తకంలో రచయిత, జీవితకాలపు పరిధులు దాటి విస్తరించే షరతులు లేని తల్లి ప్రేమ, తల్లి బ్రతికుండగా ఆమె ప్రేమని ఎపుడూ అర్ధం చేసుకోని ఓ కొడుకు కథ చెపుతారు. అయితే ఇందులో తల్లీ బిడ్డల అనుబంధాలు, బిడ్డలు తల్లిదండ్రుల పట్ల అన్యాయంగా ప్రవర్తించి నొప్పించడం, తరువాత తను చేసిన పనికి కుమిలిపోవడం, ఒక్క అవకాశం వస్తే ఆ తప్పులు దిద్దుకోడానికి ఆరాటపడటం .. ఇది మన జీవితంలో ఏ అనుబంధానికయినా వర్తించుకోవచ్చు. అందరమూ ఎపుడో ఒకప్పుడు తప్పులు చేసే ఉంటాం. ప్రియమైనవాళ్ళను బాధ పెట్టే ఉంటాం. వాళ్లతో ఇంకో రోజు గడిపే అవకాశం వస్తే, ఆ పొరపాట్లు దిద్దుకోడానికి మనమేం చేస్తాం అని ఆలోచిస్తాం.

మిచ్ వ్రాసిన మొదటి నాన్-ఫిక్షన్ Tuesdays with Morrie లో ఒక వాక్యం ఉంటుంది. "It's not just other people we need to forgive; we also need to forgive ourselves" అని. తప్పు చేశామని మనకు తెలిసినపుడు, మన అంతరాత్మ పెట్టే యాతనే మనకు అన్నిటికన్నా పెద్ద శిక్ష. మనసాక్షిని తట్టుకుని మనగలగడం చాలా కష్టం. ఆ గిల్టీ ఫీలింగ్ మనిషిని చిత్రవధ చేసి డిప్రెషన్ లోకి తోస్తుంది. మనలోకి మనం నత్తగుల్లల్లా ముడుచుకుపోయి కుచించుకుపోతాం. అందుకే ఎదుటివాళ్ళ తప్పులను క్షమించడంతో పాటూ, మనల్ని మనం క్షమించుకోడమూ ఎంతో అవసరం అనేది చాలా నిజం.

ఈ పుస్తకాన్ని రచయిత 2006 లో వ్రాసారు. ఇది న్యూయార్క్ బెస్ట్ సెల్లర్ లిస్ట్ లో చోటు చేసుకుంది. దాదాపు పంతొమ్మిది విదేశీ భాషల్లో ప్రచురించబడి, స్పెయిన్ లో ప్రఖ్యాతమయిన "La Pluma de Plata" అవార్డ్ పొందింది. ఇది దీని ఆధారంగా అదే పేరుతో టెలివిజన్ సినిమాగా కూడా తీసారు. స్టార్ బక్స్ షాపుల్లో, వారి 'బుక్ బ్రేక్' ప్రోగ్రామ్లో భాగంగా అమ్మిన మొదటి పుస్తకం ఇది.

రచయిత మీద అతని తల్లి ప్రభావం చాలా ఎక్కువ. ఆమె నుండి అతను నేర్చుకున్న జీవితపు విలువలూ, పాఠాలూ అతని చాలా పుస్తకాల్లో లీలగా కనిపిస్తూనే ఉంటాయి. అయితే ఈ పుస్తకానికి ప్రేరణ మాత్రం మొత్తంగా అతని తల్లి అని చెపుతారు. ఎప్పటిలాగే ఒకరోజు ఉదయం తల్లితో మాట్లాడి ఫోన్ పెట్టేసిన తరువాత 'అప్పటికి ఎనభయ్ ఏళ్ళున్న తల్లి, ఎప్పుడు కావాలంటే అపుడు మాట్లాడి నవ్వులు పంచుకోడానికీ, తనని మందలించడానికీ ఎల్లకాలమూ ఉండబోదని' వచ్చిన ఆలోచన విషాదాన్ని కలిగించిందట. ఆ ఆలోచన లోంచి పుట్టిందే ఈ కథ. ఇందులో చార్లీకి ఆరేళ్లప్పుడు తల్లి పేపర్ టవల్స్తో చేసిన మమ్మీ– హేలోవీన్ కాస్ట్యూమ్, నిజంగానే మిచ్ తల్లి చేసిందే. అలానే చార్లీ వయసుకి మించినదని ఒక పుస్తకాన్ని ఇవ్వడానికి లైబ్రేరియన్ నిరాకరిస్తే, తల్లి కోపంతో 'ఎపుడూ నా కొడుక్కి దేని గురించీ ఇది కష్టమైనది అని చెప్పకు' అని మందలించి ఆ పుస్తకం ఇప్పిస్తుంది. ఆ సంఘటన కూడా నిజంగా మిచ్ జీవితంలో జరిగినదట.

రచయిత మిచ్ సున్నితమయిన మానవ సంబంధాలను, అనుబంధాలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరాన్ని, సెంటిమెంట్ లో ముంచకుండా అందంగా చెప్పడంలో సిద్ధహస్తులు. మనసు మూలల్లో ఎక్కడో దాగున్న తీగను శ్రుతి చెయ్యడంలో ఆయన ఎప్పుడూ గురితప్పరు. పుస్తకం పూర్తయిన తరువాత మనం ఒక్కసారి మన గతాన్ని తడిమి చూసుకుని, మనకు ప్రియమైన వాళ్ళను నొప్పించిన విషయాలు గుర్తు తెచ్చుకుని, ఇంకొక్కసారి వాళ్ళతో గడపడానికీ, ఆ క్షణాలను తిరిగి జీవించడానికీ, ముందటికి భిన్నమైన దారిని నడవడానికీ ఒక్క అవకాశం కోసం, దానికోసం ఏం వదులుకోడానికైనా సిద్ధమన్నట్టుగా తపించిపోతాం. రచయిత మిగిలిన పుస్తకాలతో పోలిస్తే, చార్లీ తల్లిని చనిపోయిన తరువాత కలిసిన భాగాల్లో కొంచెం నాటకీయత ఎక్కువుందని అనిపించినా, రచయిత వ్రాసిన కొన్ని వాక్యాలు చాలా అర్థవంతంగా ఉంటాయి.

***Some Quotes from the book:***

*“When someone is in your heart, they're never truly gone. They can come back to you, even at unlikely times."*

*“You need to keep people close; you need to give them access to your heart.”*
*"Sometimes, kids want you to hurt the way they hurt."*

*"There's a story behind everything. How a picture got on a wall. How a scar got on your face. Sometimes the stories are simple, and sometimes they are hard and heartbreaking. But behind all your stories is always your mother's story, because hers is where yours begins."*

*"She had a bottomless well of love for me. Her only flaw was that she didn't make me work for it. You see, here's my theory: Kids chase the love that eludes them, and for me, that was my father's love. He kept it tucked away, like papers in a briefcase. And I kept trying to get in there."*

*"Mothers support certain illusions about their children, and one of my illusions was that I liked who I was, because she did. When she passed away, so did that idea."*

*"I adored my mother, in the way that boys adore their mothers, while taking them for granted."*

*"It was true, as a teenager, I had pushed my mother away. I refused to sit next to her at movies. I squirmed from her kisses. I was uncomfortable with her womanly figure and I was angry that she was the only divorced woman around. I wanted her to behave like the other mothers, wearing house dresses, making scrapbooks, baking brownies."*

*"Why do kids assume so much from one parent and hold the other to a lower, looser standard?"*

*"What is it about childhood that never lets you go, even when you're so wrecked it's hard to believe you ever were a child."*

*"I don't know what it is about food your mother makes for you, especially when it's something that anyone can make – but it carries a certain taste of memory."*

*"A child embarrassed by his mother – is just a child who hasn't lived long enough."*

రచయిత పరిచయం: వృత్తిపరంగా ఫ్రీలాన్స్ స్పోర్ట్స్ జర్నలిస్ట్. ప్రవృత్తి రచన, స్క్రీన్ ప్లే, రేడియో & టీవీ ప్రోగ్రామ్స్ ప్రసారాలు, పాటలు వ్రాసి సంగీతం కూర్చడం. ఆయన మొదటి రచన 'Tuesdays with Morrie' అనే మెమోయిర్ (స్మృతి సంస్మరణ) చాలా పేరు పొందిన రచన. ఆయన Five People You Meet in Heaven, For One More Day, Have a Little Faith, The Time



Keeper, First Phone Call from Heaven అనే ఫిక్షన్ నవలలు వ్రాసారు. అతని క్రొత్త నవల The Magic Strings of Frankie Presto నవంబర్ 2015 లో విడుదల కాబోతుంది. ఆయన రచనలు దాదాపు నలభై భాషల్లోకి అనువదించబడి, మిలియన్ల కాపీలు అమ్ముడయ్యాయి. ఆయన నివాసమయిన డెట్రాయిట్లో కొన్ని సేవాసంస్థలు స్థాపించి వాటి ద్వారా ఛారిటీ పనులు కూడా విరివిగా చేస్తున్నారు. ఆ వివరాలు ఆయన ఛారిటీ వెబ్ సైట్లో చూడవచ్చు.

(Pictures Source: Google)

**కొన్ని ఆసక్తికరమైన లింకులు:**

- ఈ పుస్తకానికి ప్రేరణ కలిగించిన సంఘటన రచయిత మాటల్లో... ఒక మదర్స్ డే సందర్భంగా రచయిత తన తల్లి గురించి వ్రాసిన ఒక ఆర్టికల్ ఇక్కడ. ఇందులో పుస్తకంలోని సంఘటనలు అతని జీవితంలో జరిగిన వివరాలు, చిత్రాలు చూడొచ్చు.
- జనవరి 2015 లో రచయిత తల్లి చనిపోయినపుడు, ఆయన వ్రాసిన ఒక నివాళి One Last Column For A One-of-a-kind Mom
- ఈ పుస్తకం గురించి రచయితతో ఒక ఇంటర్వ్యూ క్రాస్ వాక్ వెబ్ సైట్ లో.
- ఈ పుస్తకం యొక్క ఇంటర్నేషనల్ ఎడిషన్స్, వాటి ఆసక్తికరమైన ముఖ చిత్రాలు ఇక్కడ.
- ఈపుస్తకం ఆధారంగా ఓప్రా విన్ ఫ్రే నిర్మించిన చిత్రం వివరాలు, యూ ట్యూబ్ లో For One More Day సినిమా లింక్.



# పుస్తకం ఓ నేస్తం

## - పద్మవల్లి



## The Art of Hearing Heartbeats

How much does a man live, after all?
Does he live a thousand days, or only one?
For a week, or for several centuries?
How long does a man spend dying?
What does it mean to say "for ever"?
—Pablo Neruda




దాదాపు ఇరవయ్యేళ్ళ క్రిందట 'బ్రిడ్జెస్ ఆఫ్ మేడిసన్ కౌంటీ' చదివినపుడు, అసలు ఒక్కసారి కూడా మళ్ళీ కలవకుండా, ఎంతో దూరంలో ఉన్న ఇద్దరి మధ్య ఎన్నేళ్ళయినా ప్రేమ సజీవంగా ఉండటం సాధ్యమేనా అనిపించింది. ఇప్పటికీ ఆ కథలోని రాబర్ట్ నన్ను వెంటాడుతాడు. ఎంతంటే ఆ రోజ్మండ్ బ్రిడ్జెస్ దగ్గరకి వెళితే రాబర్ట్ ఆత్మ అక్కడ తిరుగుతూ ఉంటుందేమో, ఒక్కసారి ఆ గాలిలో అతన్ని తాకాలన్న పిచ్చి కోరిక నాకు. మనం ఎప్పుడయినా ఒక మనిషిని బేషరతుగా, నిస్వార్ధంగా ప్రేమించగలమా? వాళ్ళ వల్ల మనకి ఎంత దుఃఖం కలిగినా సరే, వాళ్ళ నిర్ణయాలని గౌరవించి, పల్లెత్తు మాటనకుండా, ద్వేషించకుండా దూరం తొలగగలిగేంత ప్రేమ నిజంగా ఉంటుందా?

మన తల్లిదండ్రుల గురించి మనకి ఎంత తెలుసు? మనకి సంబంధించినంత వరకూ మనం పుట్టిన తరువాతనే వాళ్ళ జీవితం మొదలయ్యింది. వాళ్ళ అంతకు ముందు జీవితం గురించి మనకు తెలిసేది వాళ్ళు చెప్పిన విషయాలకే పరిమితం. అపుడయినా వాళ్ళు పూర్తిగా చెప్పారో, లేదా సెలెక్టివ్ గా చెప్పాలనుకున్నవి మాత్రమే చెప్పి మిగిలినవి వదిలేసారో ఎలా తెలుస్తుంది మనకి? అసలు ఆ మాటకొస్తే ఎంత దగ్గరి మనిషి గురించయినా, మనకి ఎప్పటికైనా పూర్తిగా తెలుస్తుందా? మనకి తెలిసేదంతా మనలని వాళ్ళ లోపలికి తొంగి చూడనిచ్చినంత మేరా మాత్రమే కదా. మనకు తెలిసిన ఆ కాస్త ఆధారంగానే వాళ్ళ ప్రవర్తనని జడ్జ్ చేసుకుంటాం. ఒకరి ప్రవర్తనని అర్థం చేసుకోగలగాలంటే, వాళ్ళ మనసు లోతుల్లోని అగాధాలను తెలుసుకోగలగాలి. వాళ్ళ ప్రవర్తనని నిర్దేశించిన పరిస్థితులని అవగాహన చేసుకోవాలి. లేకపోతే అపార్థాలు, సంఘర్షణలు, మానసిక క్షోభలు తప్పవు.

జూలియా తండ్రి ఆమెకు ఇరవైరెండేళ్ళ వయసులో, బిజినెస్ పని అని వెళ్లినవాడు మాయమయిపోయాడు. ఎంత ప్రయత్నించినా అతని ఆచూకీ తెలియలేదు. అందరూ అతనెక్కడో హత్య చెయ్యబడ్డాడనే అనుకున్నారు. నాలుగేళ్ల తరువాత, తన తండ్రి ఒకామెకు ఏభయ్యేళ్ళ క్రితం వ్రాసిన ప్రేమలేఖ ఆధారంగా, అతనేమయ్యాడో తెలుస్తుందేమో అని బర్మా వెళ్ళింది. బయలుదేరే ముందు ఆమెలో తండ్రి తమని మోసం చేసి, ప్రియురాలి దగ్గరకు వెళ్ళిపోయాడేమో అనే కోపం, దుఃఖం మాత్రమే ఉన్నాయి. అక్కడ ఆమెకు తండ్రి గురించి ఏం రహస్యాలు తెలిసాయి? తెలిసిన విషయాలు ఆమెలో ఏం మార్పులు తెచ్చాయి అనేది Jan–Philipp Sendker వ్రాసిన The Art of Hearing Heartbeats అనే పుస్తకం కథ.

టిన్ విన్ (Tin Win) న్యూయార్క్ నగరంలో పేరుపొందిన లాయర్. అతను బర్మాలో పుట్టి, ఇరవయ్యేళ్ళ వయసులో 1942లో అమెరికాకు వచ్చాడు. న్యూయార్క్ లో లా చదివి, 1959 లో అమెరికన్ సిటిజెన్ అయ్యాడు. భార్య జూడిత్ అమెరికన్. అతనికి ఒక కొడుకూ, ఒక కూతురూ. ప్రముఖ హాలీవుడ్ స్టార్స్, సెలెబ్రిటీలు అతని క్లయింట్స్. అతనికి సెలెబ్రిటీ లాయర్గా ఎంత పేరొచ్చినా పార్టీలూ, పబ్లిసిటీలు, వివాదాలూ ఇష్టపడేవాడు కాదు. చుట్టూ ఉన్న సమాజంలో ఇమిడిపోవాలి, గుర్తింపు తెచ్చుకోవాలి అని సాధారణంగా అందరికీ ఉండే తాపత్రయం అసలేమాత్రమూ అతనికి లేదు. అసాధారణమయిన తెలివితేటలూ, క్లయింట్స్ పరపతిని ఉపయోగించుకోవాలని చూడకపోవడం, వివాదాలకు దూరంగా ఉండటం లాంటివి అతనికి గొప్ప సక్సెస్ తీసుకొచ్చాయి. కళ్ళుమూసుకుని ఎదుటి వారు చెప్పేది వింటూ, వారి మానసిక తుల్యతనీ, వారు చెప్పేది నిజమో అబద్ధమో చెప్పెయ్యగలిగే నైపుణ్యం అతని సొంతం.

అది 1991వ సంవత్సరం. టిన్ విన్ కూతురు జూలియా లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేట్ అయిన మరుసటి రోజు ఉదయం, బిజినెస్ పని మీద బోస్టన్ వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిన టిన్ విన్ తిరిగి రాలేదు. ఇన్వెస్టిగేషన్ లో పోలీసులకు అతను ఆ రోజు ఉదయం లాస్ ఏంజెలెస్ వెళ్ళి, అప్పటికప్పుడు టికెట్ కొనుక్కుని హాంగ్ కాంగ్ వెళ్లినట్టు, అక్కడ ఒకరోజు ఉండి, మరునాడు ఫ్లైట్ లో బేంకాక్ వరకు వెళ్లినట్టు తప్ప వివరాలేమీ తెలియలేదు. అతని ప్రవర్తన ఎక్కడా అనుమానాస్పదంగా కానీ, ఏదీ దాచడానికి ప్రయత్నిస్తున్నట్టు కానీ లేదు. కిడ్నాప్ అనీ, ఏదో కేసు గొడవలో మర్డర్ అనీ, అతని వెనక ఏదో సీక్రెట్ లైఫ్ ఉందనీ, పేపర్లు కొన్ని రోజులు అతని గురించి రకరకాల కథనాలు ప్రచురించాయి. మరో రెండు వారాల తరువాత బేంకాక్ ఎయిర్ పోర్ట్ బయట అతని పాస్పోర్ట్ దొరికింది. అతను ఎక్కడో హత్యకు గురయి ఉంటాడని పోలీసులూ, జూడిత్ అవగాహనకి వచ్చారు, కానీ జూలియా మాత్రం అలా సమాధానపడలేకపోయింది.

నాలుగేళ్ళ కాలం గడిచింది. జూలియా న్యూయార్క్లో లాయర్ గా ప్రాక్టీస్ చేస్తూ బిజీగా ఉన్నా, తండ్రి ఏమయ్యాడో అన్న ఆలోచన ఆమెను వదలటం లేదు. అతను పిల్లలతో ఎంతో ప్రేమగా ఉంటూ వారితో వీలయినంత సమయం గడుపుతూ ఉండేవాడు. రోజూ ఆమెకు అతను కథలు చెప్పడం, ఇద్దరూ కలిసి క్వీన్స్ బ్రిడ్జ్ మీద తరచుగా వాకింగ్ కు వెళ్లడం అన్నీ గుర్తొచ్చాయి. తండ్రి గురించిన ఆమె జ్ఞాపకాలన్నీ కూడా, అతను అలా హఠాత్తుగా కావాలని మాయమయిపోయే మనిషి కాదని పదేపదే చెపుతున్నాయి. ఇలా ఉండగా ఒకరోజు తల్లి ఆమెకు ఒక పార్సెల్ పంపింది. అందులో తండ్రికి సంబంధించిన కొన్ని పేపర్లూ, పాత ఫోటోలూ ఉన్నాయి. వాటిని చూస్తుండగా ఒక ఎయిర్ మెయిల్ కవర్లో పోస్ట్ చెయ్యని ఉత్తరం ఒకటి కనిపించింది. అది దాదాపు నలభయ్యేళ్ళ క్రితం 1955లో, బర్మాలోని కాలవ్ (Kalaw) అనే ఊర్లోని, మిమి అనే ఆమెకు తండ్రి వ్రాసిన ప్రేమలేఖ. అది చదవగానే జూలియాలో ఎన్నో ఆలోచనలు, అనుమానాలు, సంఘర్షణలు కలిగాయి. ఆ ఉత్తరానికీ తండ్రి మాయమవడానికీ సంబంధం ఉందని ఆమెకు అనిపించింది. బర్మా వెళ్ళి నిజం తెలుసుకోవాలని నిశ్చయించుకుంది.

జూలియా బర్మా వెళ్ళాలనుకుంటున్న తన నిర్ణయాన్ని తల్లికి చెపితే ఆమె వద్దని చెప్పింది. "నీ తండ్రి నానుంచి ఎన్నో ఏళ్లకు ముందే దూరమయిపోయాడు. అమెరికాకు రాక ముందటి అతని జీవితాన్ని గురించి ఎన్నిసార్లు, ఎన్ని రకాలుగా అడిగినా చెప్పలేదు. నా

నుంచి ఏవో రహస్యాలను దాస్తున్నాడని అనిపించి నిలదీసి, వదిలేసి వెళ్లిపోతానని బెదిరించాను. అయినా అతనేమీ చెప్పలేదు. నిన్ను ప్రేమిస్తున్నాను కదా, అది చాలదా అని నవ్వుతూ మాట మార్చేసేవాడు. కానీ అతను నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించలేదని నాకు తెలుస్తూనే ఉంది. మా పెళ్ళికి కూడా చాలాకాలం ఎన్నో అభ్యంతరాలు చెప్పాడు, చివరికి నా పట్టుదల వల్లనే ఒప్పుకున్నాడు. ఒకసారి ఎపుడో అతను వ్రాసిన ప్రేమలేఖ కనిపించి నిలదీసి, ఇంకోసారి అటువంటిది చూస్తే విడిపోతానని చెప్పాను. మళ్ళీ ఇంకెప్పుడూ ఏ ఉత్తరాలూ నేను చూడలేదు. అయితే మా ఇద్దరి మధ్యా దూరం ఎపుడో వచ్చింది. కేవలం మీ కోసమే నేను అతనితో కలిసి ఉన్నాను. అయినా అతను ఇపుడు ప్రాణాలతో ఉన్నట్టయి, మనం కావాలనుకుంటే తిరిగి రాకుండా ఉండేవాడా? కాబట్టి ఇపుడు నువ్వెళ్ళి ఏ నిజాలు తెలుసుకున్నా కలిగే ఉపయోగం ఏమీ ఉండదు. నీకు ఇంకా వెళ్ళాలీ అనిపిస్తే వెళ్ళు, కానీ తిరిగి వచ్చాక నాకు ఏ విషయమూ చెప్పొద్దు. ఆ విషయంలో ఇక నాకెలాంటి ఆసక్తీ లేదు" అని చెప్పింది జూడిత్. తల్లి జీవితంలో అంత వేదన ఉందని తెలియని జూలియాకు విచారం, ఆవేశం కలిగాయి. తననుంచి ఎపుడో దూరమైపోయాడు అన్న తల్లి మాటలతో, తండ్రి తననుంచి ఎపుడు దూరమైపోయాడో అన్న ఆలోచన జూలియాని దుఃఖంలో ముంచింది. బర్మా వెళ్ళాలనే నిశ్చయించుకుంది.

జూలియా రంగూన్ చేరి, అక్కడ నుండి ఇరవై గంటలు ప్రయాణం చేసి దూరంగా ఎక్కడో కొండల్లో దూరంగా ఉన్న చిన్న పల్లెటూరు కాలవ్ చేరుకుంది. తండ్రి వివరాలు అడుగుతూ ఒక టీ హౌస్ లోకి వెళ్ళినపుడు, ఆమె దగ్గరకు దాదాపు అరవై ఏళ్ళ వయసున్న ఒక వ్యక్తి యూబా (U Baa) వచ్చి, ఆమెకు తనను పరిచయం చేసుకున్నాడు. 'నీకోసం నాలుగేళ్ళుగా ఎదురుచూస్తున్నాను జూలియా. నీ తండ్రిని వెదుక్కుంటూ నువ్వొస్తావని నాకు తెలుసు. నీ తండ్రి ఆచూకీ చెప్పగలిగింది నేనొక్కడినే. అయితే నువ్వు ముందు నేను చెప్పే కథ వినాలి' అని చెప్పాడు. అంతే కాకుండా ఆమె పుట్టిన తేదీతో సహా ఆమె వివరాలన్నీ చెప్పాడు. అవన్నీ అతనికెలా తెలుసా అని జూలియా ఆశ్చర్యపోయింది. తనున్న హోటల్ నుంచి వివరాలు కనుక్కున్నాడు అనుకున్నా, అన్ని వివరాలు తెలియటం కష్టం. టూరిస్టులకు కథలు చెప్పి డబ్బు సంపాదించుకునేవాడేమో అని అనుమానం వచ్చింది జూలియాకి, అయితే అతని ప్రవర్తనా మాటలూ ఎక్కడా డబ్బు ఆశిస్తున్నట్టుగా అనిపించలేదు. పైగా అప్పటివరకు తండ్రి గురించి కనీసం తెలిసినవాళ్ళు అతనొక్కడే అవడంతో, అతను చెప్పే కథ వినడానికి అయిష్టంగానే సిద్ధమయింది జూలియా. 'జాగ్రత్తగా విను, ఇది నీ తండ్రి కథే. అతనే నాకు స్వయంగా చెప్పాడు' అని చెప్పాడు యూబా.

అది 1920 ప్రాంతం, కథాస్థలం కాలవ్. ఆ ఊరిలో అందరూ అశుభమైనదని నమ్మే, ఒక డిసెంబర్ నాటి శనివారం రోజున టిన్ విన్ పుట్టాడు. అతని తల్లికి మూఢనమ్మకాలు ఎక్కువ. దానికి తోడు టిన్ విన్ పుట్టిన రోజు, సమయం మంచిది కాదనీ, అతని వల్ల చాలా అశుభాలు జరుగుతాయని జ్యోతిష్కుడు చెప్పడంతో, ఆమె ఎపుడు ఏం జరుగుతుందో అని హడలిపోతూనే పిల్లవాడిని పెంచసాగింది. అతని తండ్రి మొదట జ్యోతిష్కుడి మాట నమ్మకపోయినా, ఆ తరువాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల అది నిజమేమో అనుకోసాగాడు. టిన్ విన్ ఆరవ పుట్టినరోజున అతని తండ్రి ఒక ప్రమాదంలో మరణించాడు. అది దురదృష్టజాతకుడైన కొడుకు వల్లే అని నమ్మి, భర్త అంత్యక్రియలు చేసిన మరునాడు తల్లి టిన్ విన్ ను ఇంట్లో వదిలి ఎక్కడికో వెళ్ళిపోయింది. వెంట పోబోయిన కొడుకుని కఠినంగా వారించి, తను తిరిగివచ్చేవరకూ అక్కడే ఉండమని చెప్పి వెళ్ళిపోయింది. టిన్ విన్ ఇంటి ముందున్న చెట్టు క్రింద కూర్చుని ఓ వారం రోజులు ఏడుస్తూ పగలూ రాత్రీ తల్లి కోసం ఎదురుచూశాడు. నష్టజాతకుడని అతన్ని పట్టించుకోడానికి కూడా అందరూ భయపడ్డారు. మధ్యలో ఎవరో పొరుగువారు ఆహారం తెచ్చి ఇచ్చినా ముట్టుకోలేదు. ప్రక్కింటివారి బంధువు ఒకామె, సూకీ అనే వితంతువు అతన్ని చూసి జాలిపడింది. ఆమెకు పుట్టిన బిడ్డ పురిట్లోనే పోతే, ఓ ఏడాదికి భర్త పోయాడు. అయినా ఆమె జాతకాలనీ, గ్రహాలనీ నిందించకుండా బ్రతుకు సాగిస్తుండేది. అందరిలాగా ఆమె మూఢనమ్మకాలను నమ్మేది కాదు. టిన్ విన్ కోసం బంధువులు ఎవరూ రాకపోవడంతో, సూకీ అతన్ని చూసుకుంటూ అతని ఇంట్లోనే ఉండిపోయింది. అయితే టిన్ విన్ ఎపుడూ మౌనంగా ఒంటరిగా ఉంటూ, సూకీతో కూడా ఎక్కువ మాట్లాడేవాడు కాదు. రాత్రుళ్ళు మాత్రం

ఆమెకు దగ్గరగా పడుకుని ఒకదాని తరువాత ఒకటి నిద్రపోయేవరకు కథలు చెప్పమనేవాడు. ఆమె మాట్లాడుతుంటే పాట విన్నట్టు స్వాంతనగా ఉందనేవాడు.

టిన్ విన్ ఎక్కువగా అడవిలో చెట్లూ, పక్షులూ, సీతాకోకచిలకలతోనూ మాట్లాడుకుంటూ, ఆడుకుంటూ, అవే తన స్నేహితులని చెప్పేవాడు. తోటి పిల్లలతో కలిసి ఆడేవాడు కాదు. చిన్నప్పటినుంచే అతనికి చూపు మసకగా ఉండటం మొదలయ్యి, పదేళ్ళ వయసు వచ్చేసరికి పూర్తిగా చూపు పోయింది. డాక్టర్ పరీక్షించి కారణం తెలీదనీ, తానేమీ చెయ్యలేననీ చెప్పేసాడు. తన గుడ్డితనం టిన్ విన్ ని పెద్దగా బాధ పెట్టలేదు. పోయిన చూపు బదులు అతని మిగిలిన జ్ఞానేంద్రియాలు, ముఖ్యంగా అతని చెవులు ఎక్కువ సునిశితంగా పనిచెయ్యసాగాయి. చూపు కోల్పోవడం వల్ల, స్కూల్లో ఇమడలేక ముడుచుకుపోయిన టిన్ విన్ ని చూసి సూకీ జాలి పడింది. అయితే తన జాలి అతనికి మేలు చెయ్యదని గ్రహించి, అతన్ని స్వయంగా నిలబెట్టడానికి ఏం చెయ్యాలా అని ఆలోచించి, దగ్గరలో ఉన్న ఒక బౌద్ధ సన్యాసుల మఠానికి తీసుకువెళ్ళి గురువుకు అప్పచెప్పింది. రోజూ ఉదయాన్నే అతన్ని మఠంలో దింపి సాయంత్రం తీసుకొచ్చేది. అక్కడ మిగిలిన సన్యాసుల ఆసరాతో, కర్ర సాయం చేసుకుని ఒంటరిగా తిరగడం, చిన్న చిన్న పనులు చెయ్యడం, మెడిటేషన్ నేర్చుకున్నాడు. గురువు అతనికి చెవులతో వినీ, మనసుతో ఆకళింపు చేసుకొని అనుసరించాలని నేర్పాడు. ఎంతో సున్నితమయిన శబ్దాలు... సీతాకోక చిలుక రెక్కల చప్పుడు, గుడ్డులోని ఇంకా పుట్టని పిల్ల గుండె చప్పుడు కూడా అతను వినగలిగే శక్తి అతనికి అబ్బింది.

ఇలా నాలుగేళ్ళు గడిచాయి. త్వరలో టిన్ విన్ కు పదిహేనేళ్ళు నిండబోతున్నాయి. ఈ నాలుగేళ్ళలో అతనిలో ఎంతో పరిణితి వచ్చింది. అతని తెలివితేటలు, గ్రహణశక్తి చూసి గురువులే ఆశ్చర్యపోయేవారు. ఎంతో క్లిష్టమయిన లెక్కలు కూడా, మనసులోనే క్షణాలలో చేసేసేవాడు. మఠంలో వందలకొద్దీ ఉన్న బ్రెయిలీ పుస్తకాలను చదివేశాడు. ఒకరోజు మఠంలో ఉన్నప్పుడు, ప్రక్క గదిలోంచి ఏదో శబ్దం కొత్తగా వింతగా వినిపిస్తుంటే దాన్ని అనుసరిస్తూ వెళ్ళాడు. అది మిమి అనే అమ్మాయి గుండె చప్పుడు అని తెలిసింది. గుండె చేసే అద్భుతమయిన లయకు ఆశ్చర్యపోయాడు. మిమి (Mi Mi) దాదాపు టిన్ విన్ వయసున్న అమ్మాయి. ఒక రైతు కుటుంబంలో ఐదుగురు అన్నల తరువాత పుట్టింది. పుట్టుకతోనే ఆమె పాదాలు వంకర తిరిగి ఉండటంతో నడవలేకపోయేది. అయినా అది ఆమె మానసిక పరిస్థితిని, స్ఫూర్తినీ చెదరగొట్టలేదు. ఇల్లూ, పెరడూ అంతా కాళ్ళూ, చేతుల మీద దేకుతూ అన్నలతో ఆటలాడేది. బయటకు వెళ్ళినపుడు అన్నలు ఎవరో ఒకరు ఆమెను వీపు మీద మోసుకుని తీసుకువెళ్ళేవారు. తల్లి ఆమెను వీపుకు కట్టుకుని పనిచేస్తుంటే, తల్లి పాడే పాటలూ, చేసే పనులూ నేర్చుకుంది. ఎవరికీ ఆమె అవకరం గుర్తుండనంత అంత:సౌందర్యంతో, ఆత్మస్థైర్యంతో వెలిగిపోయేది. ఆమెది అద్భుతమయిన అందం. దానికి తోడు ఆమె గాత్రంలో ఏదో తెలీని శక్తి, ఎందరికో స్వస్థత కలిగించేది. ఆమె పాట వినడానికి జనాలు ఆమె ఇంటి దగ్గర గుంపులుగా చేరేవారు.

టిన్ విన్, మిమి ఇద్దరూ తొందరలోనే మంచి స్నేహితులయిపోయారు. టిన్ విన్, మిమిని వీపు మీద ఎత్తుకుంటే, ఆమె అతని మెడ చుట్టూ చేతులు వేసి కూర్చుని దారి చెప్పి నడిపించేది. ఆమె అతనికి కళ్ళుగా మారితే, అతను ఆమెకు కాళ్ళుగా మారాడు. రోజూ ఇద్దరూ ఒకరిని ఒకరు కలుసుకోవడం కోసం ఎదురుచూస్తుండేవారు. వాళ్ళిద్దరి స్నేహం ఇంట్లో వాళ్ళకు కూడా సంతోషాన్నిచ్చింది. ఇద్దరూ ఒకరి సమక్షంలో ఒకరు ఎప్పుడూ లేనంత చైతన్యంతో ఉండటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఇద్దరూ కలిసి కొండల్లో గుట్టల్లో తిరుగుతూ బ్రతుకు కొత్తగా ఆనందించడం మొదలుపెట్టారు. నెమ్మదిగా ఇద్దరి మధ్యా స్నేహం వాళ్ళకు తెలీకుండానే ప్రేమగా మార్పు చెందింది. అతనికి ఆమె గుండె చప్పుడు వినడం ఎంతో ఇష్టంగా ఉండేది. ఇద్దరూ ఒకటే హృదయం రెండు దేహాలు అన్నట్టుగా ఉండేవారు. అలా దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచాయి.

టిన్ విన్ కు యూసా (U Saw) అనే ఒక దూరపు బంధువు ఉన్నాడు. అతను రంగూన్లో గొప్ప ధనవంతుడు. రాజకీయాల్లో కూడా మంచి పలుకుబడి ఉండేది. అతనికి జ్యోతిష్యుల మీద నమ్మకం ఎక్కువ. ఒక జ్యోతిష్కుడు అతని బంధువుల్లో కష్టాల్లో

ఉన్నవారికెవరికయినా సహాయం చెయ్యకపోతే తొందరలో అతనికొక ఉపద్రవం కలుగుతుందని చెప్పాడు. దానితో భయపడిన అతను, బంధువుల్లో ఎవరు కష్టాల్లో ఉన్నారో అని వాకబు చేస్తే టిన్ విన్ సంగతి తెలిసింది. వెంటనే అతన్ని తీసుకురమ్మని మనుషులను పంపాడు. అన్నేళ్ళ తరువాత హఠాత్తుగా యూసాకు టిన్ విన్ ఎందుకు గుర్తుకొచ్చాడో సూకీకి అర్థం కాకపోయినా, అతని డబ్బూ పరపతితో మంచి డాక్టర్ల చేత చికిత్స చేయించి అతనికి కళ్ళు తెప్పిస్తాడేమో అని ఆశపడింది. టిన్ విన్ ను వదిలి ఉండటం ఆమెకు కష్టమనిపించినా, అతని మేలుకోరి పంపడానికి సిద్ధపడింది. ఆ సాయంత్రం టిన్ విన్ మఠం నుండి రాగానే విషయం చెప్పి, తెల్లవారగానే బయలుదేరాలని చెప్పింది. విషయం విని టిన్ విన్ హతాశుడయ్యాడు. మిమిని విడిచి వెళ్ళాలన్న ఆలోచనే తట్టుకోలేకపోయాడు. ఆ మధ్యాన్నమే ఇద్దరూ తమ పెళ్ళి గురించి తొందరలో పెద్దవాళ్ళతో మాట్లాడాలి అనుకున్నారు. వెంటనే మిమి ఇంటికి వెళ్ళి విషయం చెపితే, ఆమె కూడా విచారంలో మునిగిపోయింది. ఇద్దరూ కలిసి తెల్లవారేవరకూ దిగులుగా కాలం గడిపారు.

మరుసటిరోజు ఉదయాన్నే వచ్చినవారితో కలిసి టిన్ విన్ రంగూన్ బయలుదేరాడు. సూకీ అతనికి దిగులుగా వీడ్కోలు చెప్పింది. టిన్ విన్ ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఏడుస్తూ ఉండిపోయాడు. యూసా ఇంటికి వెళ్ళిన తరువాత కూడా కొన్ని రోజులు ఏడుస్తూ గడిపాడు. చనిపోవాలని ప్రయత్నించాడు, కానీ తన చావు కూడా మిమి సమక్షంలోనే అని నిశ్చయించుకుని, యూసా తనని ఎందుకు పిలిచాడో ఆ పని తొందరగా అయిపోతే, తనంత తొందరగా వెళ్ళిపోవచ్చని అనుకున్నాడు. యూసా భార్య ఓ రెండేళ్ళ క్రితం చనిపోయింది. అతనికి పిల్లలు లేరు. అతని రాజమహల్ లాంటి బంగళాలో, లెక్కలేనన్ని పనివాళ్ళు ఉన్నారు. యూసా ఎపుడూ బిజినెస్ పనుల మీద తిరుగుతూ బయటే ఉండేవాడు. టిన్ విన్ వచ్చిన నాలుగు రోజులకు, యూసా అతన్ని పిలిచి మాట్లాడాడు. తల్లీ తండ్రీ లేని గుడ్డి పిల్లాడు అంటే, మట్టి గొట్టుకుపోయి సంరక్షణ లేక ఉంటాడేమో అని ఊహించుకున్నాడు యూసా. చక్కటి తీరైన శుభ్రమైన శరీరం, మొహంలో జ్ఞానం తెచ్చిన వెలుగూ, బౌద్ధమతంలో నేర్చుకున్న సంస్కారం ఉట్టిపడుతున్న టిన్ విన్ ను చూసి యూసా ఆశ్చర్యపోయాడు.

కొన్నిరోజుల తరువాత టిన్ విన్ కళ్ళకు ఆపరేషన్ జరిగి చూపొచ్చింది. హాస్పిటల్ నుండి బయటకు వచ్చిన తరువాత, అతనికి కళ్ళతో చూసినవేవీ సంతృప్తినివ్వలేదు. చూపురావటంతో తన వినికిడికి ముందున్న శక్తి తగ్గినట్టుగా అతనికి అనిపించింది. తనకి తెలిసిన లోకాన్నేదో కోల్పోయిన బాధ. యూసా తనని పంపేస్తే, తొందరగా తన వూరికి వెళ్ళిపోయి మిమిని చూడాలని ఎదురుచూడసాగాడు. అయితే యూసా ఆలోచనలు వేరేగా ఉన్నాయి. జ్యోతిష్కుడు రాబోయే ఆపద గురించి చెప్పినపుడు, 'ఎవరన్నా అవసరంలో ఉన్న బంధువుకు సహాయం చెయ్యాలనీ, అది కూడా ఒక్కసారి డబ్బిచ్చి వదిలెయ్యటం కాకుండా కొన్నాళ్ళు వాళ్ళ బాగోగులు చూడాలనీ' చెప్పాడు. అంతే కాకుండా టిన్ విన్ ఇంటికి వచ్చిన రోజునుండే యూసాకు వ్యాపారంలో శుభశకునాలు కనిపించసాగాయి. కళ్ళకు ఆపరేషన్ అయిన రెండో రోజున, అసలు సాధ్యం కాదు అనుకున్న అతి పెద్ద బిజినెస్ డీల్ ఒకటి అనుకూలంగా వచ్చింది. దానితో జ్యోతిష్కుడు చెప్పిన మాటల మీద ఇంకా నమ్మకం కుదిరి, టిన్ విన్ తో తన అదృష్టం ముడిపడి ఉందనుకున్నాడు. పైగా బౌద్ధమతంలో టిన్ విన్ యొక్క అసాధారణ తెలివితేటల గురించి విని ఉన్నాడు. దానితో యూసా, టిన్ విన్ ను తన బిజినెస్ సామ్రాజ్యానికి వారసుడిని చెయ్యాలని ఆలోచన చెయ్యసాగాడు.

యూసా, టిన్ విన్ ను రంగూన్ లోని పెద్ద స్కూల్లో చేర్చడానికి ఏర్పాట్లు చేసాడు. అందులో టిన్ విన్ ఇష్టాయిష్టాలకేమీ ప్రమేయం లేనట్టుగానే, అతని నిర్ణయం తెలియచేసాడు. యూసా మీది కృతజ్ఞతతో, పెద్దల మీద తనకున్న గౌరవంతో, ఎదురు చెప్పలేక టిన్ విన్ మౌనంగా ఉండిపోయాడు, కానీ అతనికి ఇంకా తను అక్కడే ఉండాలన్న విషయం ఏమాత్రమూ నచ్చలేదు. అతను చెప్పినట్టు చదువు పూర్తి చేసుకుంటే తన ఊరికి తిరిగి వెళ్ళిపోవచ్చు అనుకున్నాడు. ఆ స్కూల్ స్టాండర్డ్స్ ప్రకారం అతని విద్యార్హత అతని వయసుకు ఉండాల్సిన దానికన్నా తక్కువగా ఉన్నా, కేవలం యూసా పరపతి వల్ల చేర్చుకున్నారు. అయితే టిన్ విన్ తన ప్రతిభతో వరుస ప్రమోషన్లు తెచ్చుకుని, ఒక సంవత్సరంలోనే తన వయసుకి ఉండాల్సిన క్లాసుకి చేరుకుని, ఇంకో సంవత్సరంలో హైస్కూల్ చదువు పూర్తి చేసుకోబోతున్నాడు. అతనికి

కళ్ళు వచ్చిన దగ్గరనుండీ, ప్రతీ రోజూ క్రమం తప్పకుండా మిమికి ఒక ఉత్తరం రాసేవాడు. అందులో ఆమెను చూడకుండా దూరంగా ఉండాల్సి రావటం తనకెంత బాధగా ఉందో, ప్రతీ క్షణం ఆమెను ఎలా తలుచుకుంటున్నాడో, యూసా కోరిక ప్రకారం తొందరగా చదువు పూర్తిచేసుకుని వెనక్కి వచ్చే రోజుకోసం ఎంత ఎదురు చూస్తున్నాడో వ్రాసేవాడు. ఆ ఉత్తరాలను పోస్ట్ చెయ్యమని పనివాడికి ఇస్తే, వాటిని యూసా తీసుకుని దాచేవాడు. అలానే మిమి కూడా రోజూ ఒక ఉత్తరం వ్రాసేది. వాటిని కూడా యూసా టిన్ విన్ కు ఇవ్వకుండా తన దగ్గరే దాచాడు. అసలు వాళ్ళిద్దరూ ఒకరికొకరు ఉత్తరాలు రాస్తున్నట్టుగా కూడా వాళ్ళకు తెలీదు, అయినా ఇద్దరూ మాత్రం వాటిని ఆపలేదు. అవి చూసి యూసాకు ఆశ్చర్యంతో పాటు వాళ్ళిద్దరూ పిచ్చివాళ్ళేమో అని అనుమానం వచ్చింది. ఒకరినుంచి ఒకరికి ఒక్క ఉత్తరానికీ తిరుగు జవాబు లేదు. అయినా ఒక్కదానిలోనూ నేను ఇన్ని ఉత్తరాలు రాస్తే నువ్వొక్కసారి కూడా జవాబివ్వవేమీ అన్న కంప్లయింట్ లేదు. పైగా ఒకరి మీద ఒకరికి అనంతమైన ప్రేమ. అది ఎలా సాధ్యం అని విస్తుపోయేవాడు.

డిసెంబర్ 1941. టిన్ విన్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. యూసా అతన్ని అమెరికాకు పంపి లా చదివించడానికి అన్ని ఏర్పాట్లు చేసాడు. చదువు ముగించుకుని తిరిగి రాగానే తన బిజినెస్ పార్టనర్ కూతురితో పెళ్ళికి, తన వ్యాపారాల్లో కీలకమైన బాధ్యతలు అప్పగించడానికీ ప్లాన్ సిద్ధం చేసాడు. టిన్ విన్ కు తన జీవితం తన చేతుల్లోంచి జారిపోయిందని అర్ధమయ్యింది. యూసాను కాదని వెళిపోతే, తను అడగకపోయినా సరే అతను చేసిన సహాయానికి కృతజ్ఞత లేనివాడవుతాడు. అలా అని విశ్వాసాన్ని చూపించడం కోసం ఇష్టం లేని బ్రతుకు గడపలేడు. అతనికి స్నేహితులనేవారు కూడా ఎవరూ లేరు. మిమి తప్ప అతన్ని కట్టిపడేసే బంధాలేవీ అతనికి బర్మాలో లేవు. అతనికి తన బ్రతుకు గమ్యం తెలియగానే జీవితేచ్ఛ పోయింది. అప్పటికే తనకి జీవితానికి సరిపడా ప్రేమించాడు. ప్రేమను పొందాడు. ఎక్కడ, ఎంత దూరంలో ఉన్నా మిమి మీద తన ప్రేమ గానీ, తన మీద ఆమె ప్రేమ గానీ తగ్గవు అనీ, ప్రతీ క్షణం ఆమె జ్ఞాపకాలు తనతోనే ఉంటాయనీ తెలుసు. అతనికి జీవితంలోని బంధనాలన్నీ విడిపోయినట్టు స్వేచ్ఛగా అనిపించింది. నిర్వికారంగా అమెరికా బయలుదేరి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఇంకెవరికీ అతని గురించి తెలియలేదు. ఇక్కడి వరకూ కథ చెప్పి యూబా ఆగాడు.

ఇక్కడి వరకూ తండ్రి కథ విన్న జూలియాకు తండ్రినీ, మిమినీ తలుచుకుంటే విపరీతమయిన దుఃఖం కలిగింది. తండ్రిని తనకు తెలియని క్రొత్త కోణంలో తెలుసుకుని, అసలు తన తండ్రి గురించి తనకి ఏం తెలుసూ అని అనుకుంది. యూబా కొంతసేపు మౌనంగా కూర్చుని, తరువాత బాగా నలిగి ముడతలు పడినట్టున్న ఒక ఉత్తరాన్ని జూలియాకు చూపించాడు. అది టిన్ విన్ అమెరికాకు బయలుదేరగానే, యూసా మిమికి వ్రాసిన ఉత్తరం. అందులో “టిన్ విన్ లా చదవటం కోసం అమెరికాకి వెళ్ళాడు. అతని చదువూ, ప్రయాణ సన్నాహాల హడావిడి వల్ల అతను స్వయంగా నీకు చెప్పడానికి కుదరకపోవడంవలన, ఈ విషయం నీకు తెలియచెయ్యమని నన్ను అడిగాడు. నువ్వు అతనికి గత రెండేళ్ళుగా వ్రాసిన లెక్కలేనన్ని ఉత్తరాలకు గానూ అతను కృతజ్ఞతలు కూడా తెలపమన్నాడు. అతని చదువూ, ఇతర బాధ్యతలు నీకు జవాబివ్వడానికి అతనికి వీలు కలిగించలేదు. అమెరికా నుండి ఇంకొన్నేళ్ళవరకూ అతను తిరిగి రాడు కాబట్టి, నిన్ను ఇకముందు ఉత్తరాలు వ్రాయొద్దని కోరుతూ, నీ జీవితం శుభకరంగా ఉండాలని అతను ఆశిస్తున్నాడు. ఇట్లు – యూసా” అని ఉంది. అది చదివిన జూలియాకు షాక్ కలిగింది. ఆ ఉత్తరం మిమిని ఎంత అగాధంలోకి తోసి ఉంటుందో, ఆమె హృదయాన్ని ఎలా బద్దలు చేసి ఉంటుందో ఊహించలేక పోయింది. రెండేళ్లపాటు, ఒక్క ముక్క కూడా జవాబు లేకపోయినా, విసుగు లేకుండా ఉత్తరాలు వ్రాస్తూ, ఆ మనిషితో జీవితం గురించి కలలు కంటూ ఎదురుచూస్తున్నదానికి బదులుగా ఈ నిర్దాక్షిణ్యమైన ఉత్తరం. అది చూసి ఆమెకు మోసపోయినట్టుగానూ, త్రుణీకరించబడినట్టుగానూ, ఒంటరిదైపోయినట్టూ ఎంతగా అనిపించి ఉంటుందో కదా అని మిమి మీద జాలి కలిగింది.

యూసా వ్రాసిన ఉత్తరం చూసి మిమి ఏం చేసింది అని అడిగిన జూలియాకు, యూబా ఇంకో ఉత్తరం చూపించాడు. అది మిమి యూసాకు జవాబుగా వ్రాసినది. “గౌరవనీయులైన యూసా గారికి, మీ ఉత్తరం చూసి నాకు ఎంత సంతోషం కలిగిందో మాటల్లో

వివరించలేను. టిన్ విన్ అమెరికా వెళుతున్నాడనీ, పెద్ద చదువులు చదవబోతున్నాడన్న విషయాన్ని మించి సంతోషం కలిగించేది నాకింకొకటి లేదు. అతను అన్ని బాధ్యతల్లో తలమునకలై ఉండి కూడా మిమ్మల్ని నాకు ఉత్తరం వ్రాయమని అడగటం, మీరు అతని కోరికను మన్నించి శ్రమ తీసుకుని వ్రాయటం నాకు అమిత సంతోషాన్ని కలిగిస్తోంది. దీనికి మీకు సర్వదా కృతజ్ఞురాలిని. అలాగే ఇకపై ఉత్తరాలు వ్రాయొద్దన్న టిన్ విన్ కోరికను కూడా గౌరవిస్తాను. నమస్కారాలతో – మిమి" అని దాని సారాంశం. ఆ ఉత్తరం చదివిన జూలియాకు మిమిలో తను అంచనా వేసినదానికన్నా ఉన్నతమయిన సంస్కారమూ, వివేకమూ, మానసికతుల్యతా ఉన్నాయని అర్ధమయింది. అయినా కూడా ఆమె ఒంటరితనాన్ని తలుచుకుంటే జూలియాకు దుఃఖం పెరిగింది. తన తండ్రి వియోగాన్ని ఆమె ఎలా భరించిందో, తరువాత జీవితాన్ని ఎలా గడిపిందో అనిపించి, అదే విషయం యూబాను అడిగింది.

యూబా, మిమి జీవితం గురించి ఇలా చెప్పాడు. "ఇది జరిగిన సంవత్సరంలోనే ఆమె తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఒక అన్న యుద్ధంలోనూ, ఒక అన్న కుటుంబం యుద్ధవిమానాల దాడిలోనూ చనిపోయారు. తనవాళ్ళను కోల్పోయిన దుఃఖం కానీ, టిన్ విన్ మీద తపన కానీ ఆమెను ఎప్పుడూ వదలలేదు. అయితే ఆశ్చర్యమేమంటే ఆమె దుఃఖంతో కృంగిపోలేదు. రోజురోజుకీ వయసు పెరుగుతున్న కొద్దీ ఆమె అందం పెరుగుతూ తేజస్సుతో వెలగసాగింది. ఆమెలో దాగున్న ఎల్లలు లేని ప్రేమ ఆమెకు ఆ వెలుగునిచ్చిందనుకుంటాను. ఆమెకు వారిద్దరి మధ్యా దూరం అసలు పట్టినట్టే ఉండేది కాదు. ఆమెను పెళ్ళి చేసుకోడానికి ఎంతో మంది ఎన్నోకానుకలతో ఆమె ఇంటి ముందు బారులు తీరారు, అయితే ఆమె అందరినీ తిరస్కరించింది. ఇక్కడే తల్లి దండ్రుల ఇంట్లోనే బంధువులతో కలిసి ఉండేది. ఎప్పుడూ ఇల్లు దాటి బయటకు వెళ్ళలేదు. వరండాలో కూర్చుని ధ్యానంలో ఉన్నట్టుగా ఏదో పాడుకుంటూ, చుట్టలు చుట్టేది. ఆమె చుట్టిన చుట్టల్లో యేవో అద్భుతశక్తులు ఉన్నాయని జనాలు చెప్పుకునేవారు. అవి వాడిన ఎందరికో మంచి అనుభవాలు కలిగాయి. అవి ఎలాంటి రోగాన్నయినా తగ్గించగలవన్న నమ్మకం జనాలకు ఏర్పడింది. ఆమె పేరు దేశం మొత్తం వ్యాపించి, ఆమె చేసిన చుట్టల కోసం డిమాండ్ పెరిగింది. ఆమెను అందరూ ఎంతో గౌరవించి, సలహాల కోసం ఆమె వద్దకు వస్తూ ఉండేవారు. ఆమె జీవితం ఎంతో ప్రశాంతంగా, గౌరవప్రదంగా గడిపింది."

జూలియాకు కొన్ని అనుమానాలు కలిగాయి. యూబాకు కథలోని అన్ని విషయాలు ఎలా తెలిసాయి? రంగూన్లో జరిగిన విషయాలు గానీ, టిన్ విన్ మిమిల మధ్య జరిగిన పర్సనల్ విషయాలు అతనికి తెలిసే అవకాశం లేదు. తన కథ టిన్ విన్ చెప్పినా, కొన్ని సంఘటనలు టిన్ విన్ కు కూడా తెలిసే అవకాశం లేదు. యూసా ఉత్తరాలు దాచిన విషయం టిన్ విన్ కు కూడా తెలియదు, అలాంటిది ఇతనికెలా తెలిసింది? యూసా, మిమిల ఉత్తరాలు ఇతని వద్దకెలా వచ్చాయి? ఇంతకీ తన తండ్రి ఇపుడెక్కడ ఉన్నాడు? ఇవన్నీ యూబాని అడిగింది. "కథ చాలా వరకూ మీ నాన్న నాకు చెప్పాడు. మిగిలిన వివరాలు, మొత్తం కథంతా విన్నాక నీకే తెలుస్తాయి. ఆ ఉత్తరాలు నాకు సూకీ ఇచ్చింది. బర్మాతో జపాన్ యుద్ధం తర్వాత యూసా వ్యాపారం దివాలా తీసి, అన్నిరకాలుగా కష్టాల్లో ఇరుక్కున్నాడు. అపుడు ఓ రెండు సార్లు ఇక్కడికి వచ్చినపుడు కొన్ని పేపర్లూ, ఫైల్స్ ఇక్కడున్న అతని బంగ్లాలో వదిలివెళ్ళాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు యూసా చనిపోయాక, అతని సామాన్లలో సూకీకి ఇవి దొరికాయి" అని చెప్పాడు.

టిన్ విన్ చదువు పూర్తయ్యాక ఎందుకు తిరిగిరాలేదు అని అడిగిన జూలియాతో, "వెనక్కి వస్తే ఇక్కడేం మిగిలింది? తన కోసం ఎదురుచూస్తున్నది మిమి కాదు. యూసా నిర్ణయించిన వధువూ, వ్యాపారబాధ్యతలూనూ. యూసా ఓ తండ్రిలా చేసిన వాటికి టిన్ విన్ రుణపడిఉన్నాడు. అతన్ని కాదని తన యిష్టం ప్రకారం చెయ్యలేకపోయాడు. అవన్నీ తప్పించుకోడానికి అమెరికాలో ఉండిపోవటమే అతనికి కనిపించిన మార్గం" అని చెప్పాడు. మరి యూసా చనిపోయాకైనా ఎందుకు తిరిగి రాలేదో అని స్వగతంగా అనుకున్న జూలియాతో, యూసా 1958 మే లో చనిపోయాడు అని చెప్పాడు. అది జూలియా అన్న పుట్టడానికి కొన్ని నెలల ముందు అని అర్ధమయ్యింది. యూసా చనిపోయే వరకూ వేచి ఉండకుండా తన తల్లిని ఎందుకు పెళ్ళి చేసుకున్నాడో అనుకున్న జూలియాకు, తల్లి తమ పెళ్ళికి తండ్రి చాన్నాళ్ళు ఒప్పుకోలేదనీ,

తనే బలవంతంగా ఒప్పించందనీ చెప్పడం గుర్తొచ్చింది. పెళ్ళి చేసుకున్నా తను మొత్తం ప్రేమ ఇవ్వలేనని తండ్రికి ముందే తెలుసు. తను వందశాతం న్యాయం చెయ్యలేని బంధాల్లోకి అతను అడుగుపెట్టాలని గానీ, ఎవరినీ లాగాలని కానీ అతను ఆశించలేదు. కానీ ఒకసారి ఆ బంధాల్లోకి అడుగుపెట్టాక తన బాధ్యతలన్నీ నిబద్ధతతో తీర్చాడనీ అర్ధమయ్యింది. కేవలం తన బాధ, తమకు కలిగిన కష్టం దృష్టిలో పెట్టుకుని తండ్రిని జడ్జ్ చేసే అధికారం తనకేముందని అనుకుంది.

యూబా జూలియాని మిగిలిన కథ ఒక ప్రత్యేకమైన ప్రదేశం లో చెప్పాలి అన్నాడు. ముందు జూలియా తండ్రి నివసించిన ఇంటిని చూడాలని అక్కడికి వెళ్ళి, తండ్రి తిరిగిన ప్రదేశాలన్నీ తిరిగి, అన్నీ తడిమి తడిమి చూసుకుంది. తరువాత యూబా ఆమెను ఎంతో శుభ్రంగా, మొక్కలూ పశువుల కొట్టంతో ఆహ్లాదంగా ఉన్న ఒక చిన్న ఇంటికి తీసుకెళ్ళాడు. కథలో విన్న వర్ణనల వల్ల అది మిమి ఇల్లని జూలియా గుర్తుపట్టింది. ఇంటి బయట మెట్ల మీద ఇద్దరూ కూర్చొన్నారు. యూబా చెప్పిన కథ బట్టి, తన తండ్రి ఆ ఇంటిలో ఎక్కడ ఎన్నెన్ని గంటలు గడిపాడో గుర్తుచేసుకుంటూ, తండ్రి ఆనవాళ్ళని ఆ పరిసరాల్లో అనుభవిస్తూ కూర్చుంది జూలియా. యూబా మిగిలిన కథ ఇలా చెప్పాడు. “కాలవ్ చేరిన టిన్ విన్ మిమి గురించి వెదుక్కుంటూ, తను యాభయ్యేళ్ళ క్రితం మిమి సాయంతో తిరిగిన దారుల్లో తడుముకుంటూ మిమి ఇంటికి చేరుకున్నాడు. మిమి అప్పటికి రెండేళ్ళుగా జబ్బుతో మంచంలో ఉండి, వైద్యం చేయించుకోడానికి కూడా ఒప్పుకోలేదు. కొన్నాళ్ళుగా చక్కగా అలంకరించుకుని, సంతోషంగా తనలో తనే పాటలు పాడుకుంటూ, ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్టుగా ఉండేది. టిన్ విన్ కళ్ళు మూసుకుని శబ్దాలు వింటూ, ఆమె గుండె చప్పుడు అనుసరిస్తూ ఆమె ఉన్న గదిలోకి వెళ్ళి మంచం పక్కన కూర్చున్నాడు. అతన్ని చూడగానే ఆమె దుఃఖం, సంతోషం కలగలిసి అతన్ని చేతులతో ఆప్యాయంగా తడిమింది. యాభయ్యేళ్ళుగా తను తపించిన ఆ స్పర్శతో అతను కరిగిపోయాడు. ఇద్దరూ కన్నీళ్ళతో ఆలింగనం చేసుకుని, అతను ఆమె ఛాతీ మీద తల పెట్టి ఆమె గుండె చప్పుడు వింటూ, ఆమె అతని మెడ చుట్టూ చేతులు పెనవేసి ఇద్దరూ ప్రాణాలు వదిలేసారు. ఊరు మొత్తం తరలి వచ్చి ఇద్దరినీ ఎంతో గౌరవంతో ఊరేగించి, అంత్యక్రియలు జరిపారు. ఇద్దరి చితుల నుండీ పొగ, తెల్లని పూలమాలల్లా ఎగసి. ఒకదానివైపు ఒకటి ప్రయాణించి, ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకాశంలోకి ఎగసిపోయింది. పక్షులూ జంతువులూ సంతోషంతో కూనిరాగాలు తీసాయి.”

అప్పటివరకూ ఇంకా తండ్రి అక్కడే ఎక్కడో ఉన్నాడు, తను తొందరలో చూడొచ్చు అనుకున్న జూలియాకు యూబా చెప్పినది అర్ధం కావడానికి కొంచెం సమయం పట్టింది. ఒక ప్రక్క తండ్రి మరణం బాధ కలిగించినా, మరో ప్రక్క తండ్రి తను కోరుకున్న వాళ్ళతో, కోరుకున్న చోట, తృప్తిగా ఇచ్ఛామరణాన్ని పొందినందుకు సంతోషం కలిగింది. అప్పటి వరకూ ఆమెకు తండ్రి మీద ఉన్న కోపం, అసంతృప్తి అన్నీ పోయాయి. అతన్ని ఇన్నాళ్ళు అమెరికాలో కట్టి పడేసింది తమ కుటుంబం పట్ల ఉన్న బాధ్యత అనీ, తమని కూడా అతను ప్రేమించాడనీ, అయితే అది అతనికి మిమిపై ఉన్న ప్రేమకు భిన్నమయినదనీ అర్ధమయింది. అతని చివరి క్షణాల్లో ప్రక్కన తాము ఉండే అవకాశాన్ని అతను దూరం చేసినా, తండ్రిగా తమకి పదిలపర్చుకోగలిగిన ఎన్నో అనుభూతులను ఇచ్చాడని అనిపించింది. తండ్రి బాల్యంలో అనుభవించిన కష్టాలు, తరువాత మనసు చంపుకుని పడిన వేదన తనకే మాత్రమూ అంచనా లేక, తమని మోసం చేసాడని అనుకున్నందుకు జూలియా సిగ్గుపడింది. ఆమెకు మొదట బర్మాకు బయలుదేరినపుడు మిమి కేవలం తన తండ్రి ఆచూకీకి ఒక ఆధారం, తండ్రిని తమ నుంచి దూరం చేసిన మనిషి మాత్రమే. అయితే ఆమెతో తండ్రికున్న అనుబంధం, ఆమె వ్యక్తిత్వం, తండ్రి మీద ఆమె ప్రేమ, జీవితాన్ని హుందాగా స్వీకరించిన తీరూ జూలియాకు ఆమె మీద ముందు జాలినీ, తరువాత గౌరవాన్ని, ఇష్టాన్ని కలిగించాయి.

మరుసటి రోజు యూబా జూలియాకు ఒక ఐదు ఫోటోలు ఉన్న కవర్ పంపించాడు. వాటి మీద ఉన్న తేదీలను బట్టి అవి 1949 నుంచి మొదలు పెట్టి, ప్రతీ పదేళ్లకు ఒకటి తీసినవని తెలిసింది. చివరిది 1989లో అంటే, తండ్రి మాయమవడానికి రెండేళ్ళ ముందు తీసింది. వాటిలో ఒక స్త్రీ, ప్రక్కన ఒక అబ్బాయి వివిధ వయసుల్లో ఉన్నారు. ఆ స్త్రీని మిమి అనీ, ఆ అబ్బాయి యూబా అని గుర్తు పట్టింది.

అప్పటి వరకూ యూబా మంద్రస్వరం, మృదువైన నవ్వూ, మేనరిజమ్స్ చూసి ఎవరో గుర్తొస్తున్నారని అనుకున్న జూలియాకు, అవి తన తండ్రిని పోలి ఉన్నాయని తట్టింది. దానితో యూబా ఎవరన్న రహస్యం ఆమెకు తెలిసింది.

ఇందులో రెండు కథలున్నాయి. ఒకటి టిన్ విన్, మిమిల మధ్య జీవితకాలమంతా గుండెల్లో దాగిన, షరతుల్లేని ప్రేమ కథ. రెండు తండ్రీ కూతుళ్ళ కథ. తండ్రి గతాన్ని తెలుసుకుని, అర్ధం చేసుకుని, క్షమించి, తనూ మనశ్శాంతిని పొందిన కూతురి కథ. మనకి ఒక వ్యక్తి గురించి ఎంత బాగా తెలుసు అనుకున్నా, నిజంగా మొత్తం ఎవరికీ ఎప్పటికీ తెలీదని చివరికి అర్థమవుతుంది. ఎవరి లోపలి రహస్యాలు వాళ్ళకే స్వంతం. మనకి కష్టంగా అనిపించినా అంగీకరించక తప్పని విషయమిది. టిన్ విన్ కథ చూస్తే, 'Kehne ko saath apne ek duniya chalti hai, par chupke is dil mein tanhaayi palti hai' అన్న వాక్యాలు ఎంత నిజమో అనిపించాయి. ఈ పుస్తకాన్ని రచయిత మొదట 2002 లో జర్మన్ భాషలో వ్రాసారు. 2012 లో ఇంగ్లీష్ లోకి Kevin Wiliarty చేత అనువాదం చెయ్యబడింది. ఇటలీ, జపాన్, నెదర్లాండ్స్, స్పెయిన్, ఇజ్రాయిల్ దేశాల్లో కూడా ప్రచురించబడి బెస్ట్ సెల్లర్ గా నిలిచింది.

*పుస్తకం నుంచి కొన్ని నచ్చిన వాక్యాలు :*

***"Love has so many different faces that our imagination is not prepared to see them all."***

***"There are wounds time does not heal, though it can reduce them to a manageable size."***

***"Life is a gift full of riddles in which suffering and happiness are inextricably intertwined. Any attempt to have one without the other was simply bound to fail."***

***"I have often wondered what the source of her beauty, her radiance was. It's not the size of one's nose, the color of one's skin, the shape of one's lips or eyes that make one beautiful or ugly. So what is it? Can you, as a woman, tell me? I will tell you: It's love. Love makes us beautiful. Do you know a single person who loves and is loved, who is loved unconditionally and who, at the same time, is ugly? There's no need to ponder the question. There is no such person."***

***"When we get over something, we move on, we put it behind us. Do we leave the dead behind or do we take them with us? I think we take them with us. They accompany us. They remain with us in another form. We have to learn to live with them and their deaths."***

***"It would be much worse to expect good from other people, only to be disappointed when they didn't measure up to our high expectations. That would lead to resentment and contempt for humanity."***

***"How flat and empty the most beautiful words can sound? How dull and dreary life must be for those who need words, who need to touch, see, or hear one another in order to be close, Who need to prove their love, or even just to confirm it in order to be sure of it?"***

***"There is no power that can release a person from pain or from the sadness one might feel as a result of that insight — unless it be that person himself."***



*రచయిత పరిచయం: Jan-Philipp Sendker జర్మనీ దేశస్థులు. వృత్తి జర్నలిస్ట్. స్టెర్న్ అనే మేగజైన్ కు అమెరికా, ఏషియా కరెస్పాండెంట్. ఈయన బర్మా నేపధ్యంగా The Art of Hearing Heartbeats, The Well-tempered Heart (sequel to Art of hearing Heartbeats) అనే నవలలు, చైనా మీద The cracks in the wall అనే నాన్-ఫిక్షన్, Wishpering Shadows అనే నవల వ్రాసారు. ఈయన రచనలు దాదాపు 30 భాషల్లోకి ప్రచురించబడ్డాయి.*

ఈ పుస్తకం గురించి రచయితతో ఒక ఇంటర్వ్యూ ఇక్కడ.
ఈ పుస్తకం గురించీ, దానికే ప్రేరణనిచ్చిన విషయాల గురించీ ఒక ప్రమోషనల్ వీడియో.
ఈ పుస్తకం ప్రచురణ నేపధ్యం గురించి రచయిత మనసులోమాట.

(Pictures Source: Internet)

# నెలనెలా మీ కోసం.. ఓ మంచి పుస్తకం

మొదటినుంచీ నచ్చిన పాటో, మాటో పదిమందితో పంచుకోవడం ఓ సంతోషం నాకు. అలానే గూగుల్ ప్లస్ లో రాసుకుంటుంటే, ఇలా ఇక్కడ కాదు అంటూ నన్నో బ్లాగుదాన్ని చేసారు కొందరు నేస్తాలు. బ్లాగులో అడపాదడపా వ్రాసుకున్న నా పిచ్చిరాతలని చదివిన కిరణ్ ప్రభ గారు, ఇలా పదిమందితో కాదు, ఇక్కడ వందమందితో పంచుకోండి అని ఓ కాలమ్ దాన్ని చేసారు.

ఈ కాలమ్ ద్వారా

- ఎపుడో తప్పిపోయిన కొందరు నేస్తాలు గుర్తుపట్టి మళ్ళీ కలిసారు.
- తెలియని కొత్త నేస్తాలూ ఏర్పడ్డారు.
- కౌముది రాగానే ముందు మీ కాలమ్ చదువుతామని చెప్పినవాళ్ళు కొందరున్నారు.
- వచ్చే నెల ఏం పుస్తకం పరిచయం చేస్తారా అని ఎదురుచూస్తున్నామండీ అని నెల మొదట్లోనే కొందరు చెప్పేవారు.
- అడిగే చనువున్నవాళ్ళు, ఆగలేక తాయిలం పెట్టి మరీ అడిగేవారు.
- ఇంకా రాయటం మొదలెట్టావా లేదా అని పరమార్శించి, అవసరమైతే మొట్టికాయలు వేసిన ప్రియనేస్తాలున్నారు.
- మంచీ చెడూ నిక్కచ్చిగా చెప్పినవాళ్ళున్నారు.
- ఏం వ్రాసినా, ఎలా వ్రాసినా మా పద్మ వ్రాసింది అని, ఆన్ లైన్ లోనూ, బయటా కూడా గొప్పగా అందరికీ చెప్పుకున్నవాళ్ళు ఉన్నారు.
- ఇంతకూ ముందు తెలియని పద్మని, ఇక్కడ చూసినవాళ్ళూ, నాకు తెలిసిన నువ్వేనా అని ఆశ్చర్యపోయిన వాళ్ళూ ఉన్నారు.

ప్రతీ నెలా చదివీ, అభిప్రాయాలు తెలియచేసీ ప్రోత్సహించినవాళ్ళకూ, మౌనంగా ఎదురుచూసిన వాళ్ళకూ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అయితే 'మీరు వ్రాసినది చదివి పుస్తకం తెచ్చుకుని చదివాము' అని చెప్పిన అతి కొంతమందికి ఇంకా ఎక్కువ కృతజ్ఞతలు. బాగా వ్రాసారండీ అన్నవాటి కంటే, ఇలా చెప్పినవాళ్ళ వల్ల నాకు ఎక్కువ ఆనందం కలిగిందన్నది కాదనలేని నిజం.

నచ్చిన కథ చదివినపుడు, నిజాయితీగా వచ్చిన కిరణ్ ప్రభ గారి ప్రశంస నాకు రెడ్ బుల్ అంత శక్తి నిచ్చింది. నేనిక రాయలేనేమో అంటూ బెంగపడినపుడల్లా కాంతి గారు ఇచ్చిన ప్రోత్సాహానికి, ధైర్యానికీ ఎన్నో కృతజ్ఞతలు.

ఏ ఒక్క నెలా కూడా ఆఖరి క్షణం వరకూ పంపకపోయినా, నా మీద నమ్మకముంచి, ఇంకా ఫైల్ రాలేదేం అనో, ఈసారీ లేటేనా అనో ఒక్కసారి కూడా అనకుండా, సహనంతో వేచిన కిరణ్ ప్రభ, కాంతి గార్లకు నా అభిమానపూర్వక, వినమ్ర వందనాలు.

ఈ సందర్భంగా నా రాతలను బ్లాగుకెక్కించి, అక్కడి నుండి ఇక్కడి దాకా నా ప్రయాణానికి ప్రత్యక్షం గానూ, పరోక్షం గానూ కారకులయిన నా గూగుల్ బజ్ నేస్తాలందరికీ మరోసారి నా కృతజ్ఞతలు.

గత పద్దెనిమిది నెలలుగా పుస్తకం నేస్తంగా చేసుకుని, మీ అందరితో చేసిన ప్రయాణం నుంచి సెలవు తీసుకుంటున్నాను. 'అభీ అల్విదా మత్ కహో దోస్తోం, న జానే ఫిర్ కహా ములాకాత్ హో' అన్న వాక్యాలు గుర్తు చేసుకుంటూ, మళ్ళీ ఇంకెప్పుడయినా , ఎక్కడయినా...

పడమటికోయిల అనబడే

పద్మవల్లి